

శ్రీ రమణ మహర్షి సూక్తులు

సంకలనము, అనువాదము
కమలాకర వేంకటరావు

శ్రీ రమణాశ్రమము
తిరువణ్ణామలై – 606 603

SRI RAMANA MAHARSHI SUKTULU (Telugu)
by Kamalakara Venkata Rao (Selected topics compiled from
"Talks with Sri Ramana Maharshi"), Published by President,
Sri Ramanasramam, Tiruvannamalai-606 603,
Phone: 04175-237200, 92449 32792, Fax: 04175-237491,
email: ashram@sriramanamaharshi.org,
website: www.sriramanamaharshi.org

© Sri Ramanasramam, Tiruvannamalai

Previous Editions: 1966, 1988, 1994, 1998
Fifth Edition: 2003 – 2000 copies
Sixth Edition: 2005 – 2000 copies
Seventh Edition: 2008 - 2000 copies

CC No.: 3057

ISBN: 81-88225-78-9

Price: Rs. 35/-

Typeset at
Aruna Ramana
Bhimavaram

Printed by
Nagaraj & Company Private Limited
Perungudi, Chennai-600 096.

ప్రకాశకుల మనవి

రమణభగవంతుని ఆధ్యాత్మబోధ రూపవాక్కులు సరళములు, నిర్వివాదములు, ఋజురూపములు, ఆచరణీయములు. శ్రీ మునగాల వేంకట్రామయ్యగారిచే సంకలనం చేయబడిన **'శ్రీరమణ భాషణములు'** అనే గ్రంథము ఇందుకు తార్కాణము. నాలుగు సంవత్సరముల కాలములోని శ్రీ రమణుల వాగామృతమును నిబద్ధించిన ఈ గ్రంథము విస్తృతమైనది. అందుచే, అందలి ముఖ్య విషయములను తదుచితమైన శీర్షికలతో పొందుపరచి సాధకులకుపయోగపడు రీతిలో ఈ చిన్ని పుస్తకము రూపొందించబడినది.



భగవాన్ శ్రీరమణ మహర్షి

దక్షిణ భారతదేశంలో, పురాణ ప్రసిద్ధమైన అరుణాచల క్షేత్రమున, ఇరువదవ శతాబ్ది పూర్వార్థ భాగమందు, ఆధ్యాత్మిక ప్రభలు దశదిశల విరజిమ్ముతూ నొక దివ్యజ్యోతి మానవరూపంలో తిరుగాడింది. దాని పేరే భగవాన్ శ్రీరమణ మహర్షి.

అరుణాచల క్షేత్రమే తిరువణ్ణామలై. ఆద్యంతములు తెలియరాని అనంత తేజోరాశిగా బ్రహ్మ విష్ణువులకు ప్రత్యక్షమైన పరమశివుడే అటుపిమ్మట మానవలోకము ననుగ్రహించే నిమిత్తము అరుణాచల రూపమైన జ్యోతిర్లింగంగా వెలసినాడని పురాణగాథ. అరుణాచలమే మహాశివుడు. అరుణాచల ప్రదక్షిణము మహాశివునికే ప్రదక్షిణం. దీని మహిమాతిశయం గురించిన కథలు ఎన్నో ఉన్నాయి.

పరమశివుని కుమారుడయిన కుమారస్వామియే తండ్రి యాజ్ఞపై రమణ మహర్షిగా జన్మించినాడని చెపుతారు. అవతార ప్రకటన కాలం వచ్చేవరకు ఆ బాలుడు లోకంలో అందరు బాలుర వలనే సామాన్య లక్షణాలతో పెరిగినాడు. అవతార ప్రకటన సమయం ఆసన్నమవుతున్న దనడానికి సూచన మొదటగా ''అరుణాచలం'' పేరు చెవిని బడడంతోనే దానియందా బాలునికి కలిగిన పరమ ప్రీతి రూపంలో వ్యక్తమయింది. అరుణాచలం అతనిని తన చెంతకు చేరబిలుచుకోవడానికై వేసిన తొలికేక అది.

సమయం రాగానే అరుణాచలేశ్వరుడు అతని లోపలనుండి మరియొక పిలుపు పిలిచినాడు. ఆ పిలుపు అప్రతిహతమైనది.

అతనికపుడు పదిహేడవ సంవత్సరం నడుస్తున్నది. ఒకనాటి మధ్యాహ్నం మేడగదిలో ఒంటరిగా కూర్చున్న వేళ ఉన్నట్లుండి ఎందుచేతనో విపరీతమయిన మృత్యుభయం అతనిని ఆవహించినది. వట్టి భయమే కాదు, మృత్యువు వచ్చి పైకొంటున్నట్లుగానే అనుభవం శరీరమునందెట్టి అనారోగ్యము లేని స్థితిలో ఆ విచిత్రానుభవం అతనికి ఏల కలిగిందో అదియే దేవ రహస్యం!

కాని, అంతకంటె పరమాద్భుత విషయమేమంటే, అతడా మృత్యు భయాన్ని వెంటనే జయించ గలిగాడు. మృతి నొందుతున్నది శరీరమని, శరీరమునుండి తాను వేరు కాగలిగినాడు. శరీరం శవసన్నిభమై కట్టెవలె బిగుసుకొని పోయింది. ప్రాణస్పందనం నిలిచిపోయింది. గుండె కూడా కొట్టుకొనడం ఆగిపోయింది. కాని, తాను మాత్రం దీనికంతకూ సాక్షిగా వేరై ఉన్నాడు. చచ్చినది శరీరం గాని తాను కాదు. ఈ అనుభవం అతనికి కలుగునట్లు చేసినది కూడా దేవ రహస్యమే కదా!

ఆత్మజ్ఞానోపలబ్ధి గురూపదేశమూ, గుర్వనుగ్రహమూ లేనిదే కలుగవంటారు. బాలుడైన ఆ వెంకటరామన్‌కు మాత్రం ఆనాడు ఇవి రెండూ అతనిలో నుండియే లభించాయి. అంతరాత్మ నిష్ఠమైన ఆ గుర్వనుగ్రహ విశేషం వల్లనే అతనిలోని 'నేను' అహంవృత్తి–తన మూలమేమిటో తెలుసుకోవాలని లోలోపలకు పోసాగింది. అలా పోతుండగా, అయస్కాంత పర్వతం ఒక ఉక్కు ముక్కను తనవైపునకు లాగుతున్న మాదిరిగా ఏదో మహాశక్తి బలాత్కారంగా మరింత లోపలికి లాగివేస్తున్నట్లు తోచింది. ఆ 'నేను' పాతాళ లోకంలోకి కూరుకొని నశించినట్లయిపోయింది. దాని స్థానే

మరొక 'నేను' ఆవిర్భవించింది. అది 'అసలు నేను' — వెలుపలి మానవునికి ఆధార భూతమై, అధిష్ఠానమై వున్న 'నేను'. ఈ సంఘటనమంతా జరగడానికి ఒక్క అరగంటయినా పట్టలేదు.

ఆత్మ సాక్షాత్కారం ఈ విధంగా పొందినవాని జీవితం ఒక మామూలు ధోరణిలో ఎలా నడుస్తుంది? బాహ్యప్రపంచం పట్ల పరమ వైరాగ్యం ఆయనను ఆవహించింది. ఒక నాడాకస్మికంగా ఎవ్వరికి తెలియకుండా గృహపరిత్యాగం చేసి, అంతకు పూర్వమే హృదయంలో తన నాకర్షించిన అరుణాచలానికి చేరుకున్నారు. కౌపీన మాత్రధారియై తీవ్రమగు తపోనిష్ఠలో ప్రవేశించారు. సూర్యరశ్మి చొరని పాతాళలింగమనే భూగృహంలో ఆయన ధ్యాన నిమగ్నుడై వుండడం తటస్థించినపుడు, అచటి పురుగుల కాహారమై ఆయన అధః కాయమంతా చీము నెత్తురులతో నిండిపోయింది. కాని, ఆయన మాత్రం నిశ్చల సమాధిలోనే ఉండిపోయారు. శరీరమునుండి వేరుపడటం తెలుసుకొన్నవాని విషయంలో ఇందాశ్చర్యపడవలసిన పని యేమున్నది.

అరుణాచలంలో మొదట చాలా కాలం వరకు ఆయన మౌనముద్రాధారి. ఆయనకు చదవనూ వ్రాయనూ వచ్చుననే సంగతే ఎవ్వరికీ తెలియదు. పిమ్మట ఆయన మౌనంగా ఉండియే తమ సమాధానాలను వ్రాసి చూపుతూ ఉండేవారు. అనంతరం జిజ్ఞాసువులైన భక్తులయెడ ఆదరం కొలదీ పెదవి విప్పి పలుకడం కూడ ఆరంభించారు. ఆ పలుకులు ముక్తసరిగా నోటినుండి జాలువారిన ఆణిముత్యాలు. అయినా ఆయన సహజస్థితి మాత్రం మౌనమే. యౌవనారంభ వయస్సులో ఆయన యందా మౌనం

పరమశివుని దక్షిణామూర్తి స్వరూపాన్ని చూపరులకు తలపింపచేస్తూ ఉండేది.

మౌనం ద్వారా జ్ఞానబోధ యెట్టిదో అపరదక్షిణామూర్తిగా లోకానికి నిరూపించటమే ఆయన అవతార ముఖ్య ప్రయోజనం. లోకాన్ని అనుగ్రహించడం కోసమే వచ్చిన మూర్తి గనుక, తన ఆత్మానందంలో తాను మునిగిపోవడమే ఆయన ముఖ్యలక్ష్యం కాలేదు. ఆ ఆత్మానందాన్ని, ఆత్మశాంతిని, ఆత్మజ్ఞానాన్ని ఇతరులకు పంచి ఇచ్చే అనుగ్రహంకూడా ఆయన ప్రసరింపజేసారు. కనుకనే, భక్తకోటులను తన దెసకు ఆకర్షించుకొనే ఒక దివ్యజ్యోతిగా ఆయన జీవితం తేజరిల్లింది. తొలినాళ్ళలో, ఆ దివ్యమూర్తిని గుర్తించి, తాను తరించి, తోటి దేశీయులు సైతం తరించటానికై ఆయన మహనీయతను సుప్రకటితం గావించిన ఘనత క్రీ.శే. శ్రీ కావ్యకంఠ గణపతి మునీంద్రులదని చెప్పవచ్చు.

శ్రీ గణపతి శాస్త్రిగారు గీర్వాణ భాషలో ఉద్దండ పండితులు మహాకవులు. గొప్ప ఉపాసనాపరులు, తపస్వులు కూడ. కాని, తపశ్చర్యలో దాదాపు పండ్రెండేళ్ళు గడిచినా ఆయనకు ఫలితం ఏమంతగా కనిపించలేదు. హృదయం అసంతుష్టితో నిండిపోయింది. కడకు, దైవయోగం చేత ఆయన అరుణాచలం చేరుకున్నారు. అచ్చటనొక మఠంలో ధ్యానం చేసుకుంటూ ఉండగా, 'దేవుడు నిన్ను పిలుస్తున్నా'డన్న అంతర్వాణి ప్రబోధం మేరకు అన్వేషణకై బయలుదేరి విరూపాక్ష గుహయందు ఏకాంతముగా నున్న ఈ అపర దక్షిణామూర్తిని గుర్తించి తత్పాద పద్మములు శరణు వేడుకున్నారు. దొరకవలసిన విశ్రాంతి స్థానం దొరకడం చేత యిక ఆయన సమస్యలన్నీ తీరిపోయాయి.

గురుదేవులకు రమణమహర్షియను నామకరణం చేసినది కావ్యకంఠులే. శిష్యులెల్లరూ 'భగవాన్' అని పిలుచుకోవాలని నిర్దేశించినది కూడా ఆయనయే. శ్రీరమణులవద్దకు పోకముందే కావ్యకంఠులకు శిష్యులనేకులుండేవారు. వారంతా ఇప్పుడు శ్రీరమణుల శిష్యులైనారు. శ్రీరమణుల బోధసారమును కావ్యకంఠులు 'రమణ గీత' యను పేరుతో సంస్కృత శ్లోక రూపమున రచించి ప్రకటించారు. హృదయానికీ మనస్సుకూ గల సంబంధాన్ని తెలియజెప్పుతూ మనోనియమనోపాయం వివరించే 'హృదయ విద్య' అందలి ముఖ్యవిషయాలలో ఒకటి.

రమణ మహిమ సమకాలిక భారతీయులకు వెల్లడించిన వారిలో ముఖ్యులు కావ్యకంఠులు కాగా, పాశ్చాత్యలోకమునకు దాని నెరుకపరచిన వారిలో ప్రధానుడు పాల్ బ్రంటన్ మహాశయుడని చెప్పవచ్చు. బ్రంటన్ గొప్ప ఆధ్యాత్మిక తత్త్వజిజ్ఞాసువు. బ్రహ్మవేత్తలగు భారత యోగి పుంగవుల అన్వేషణలో బయలుదేరినవాడు. ఎన్నో ప్రశ్నలు వేద్దామని అనేక సంశయాలు మనస్సులో పెట్టుకొని శ్రీరమణుల చెంతకు చేరినవాడు. అప్పటికి రమణాశ్రమం బాగుగా వృద్ధి పొంది ఎక్కడెక్కడి వారినందరినీ ఆకర్షిస్తూ ఉన్నది. బ్రంటన్‌కు తొలి దర్శనం శ్రీరమణులు తమ శ్రీదక్షిణామూర్తి స్వరూప ప్రకటన పూర్వకంగా ఇచ్చారు. ఇంచుమించుగా రెండుగంటల కాలం అనంతాకాశంలోకి నిశ్చలంగా చూస్తూ కూర్చున్న మహర్షి సమక్షంలో బ్రంటన్‌కు కలిగిన అంతరంగికానుభవాలు అద్భుతావహం.

అనిర్వచనీయమైన ఒక దివ్యాకర్షణ సూదిని అయస్కాంతం వలె అతనిని వశీకరించుకొన్నది. అతనిలోని సకల సంశయాలూ ఒక్కసారిగా మటుమాయమై పోయాయి. అప్రతిహతమైన శాంతిప్రవాహం అన్ని వైపులనుంచీ అతని లోనికి ముంచుకొని వచ్చింది. మనస్సు శాంతిసాగరంలో తేలియాడగా, తాను మహర్షినడగాలని తయారుచేసుకొని వచ్చిన ప్రశ్నలన్నీ అతనిలో ఒకదాని వెంట ఒకటి అంతర్థానమైపోయాయి. తుదకు వృత్తిరహితమై మనస్సు నిశ్చలాకృతిని నిలిచిపోయింది. 'గురోస్తు మౌనం వ్యాఖ్యానం, శిష్యాస్తు ఛిన్న సంశయాః', -- అని శ్రీదక్షిణా మూర్తి గురుని గురించి చేసిన వర్ణనలోని సత్యత్వ నిరూపణకు ఇంతకంటే నిదర్శనం ఇంకేమి కావాలి? బ్రంటన్ అటుపిమ్మట మహర్షికి శిష్యుడై ఆయనను శరణుపొందడంలో ఆశ్చర్యంలేదు. A Search in Secret India — అనే గ్రంథంలో ఈ అనుభవమంతా అతడు పూసగ్రుచ్చినట్లు వివరించాడు.

శ్రీరమణుల సన్నిధి శాంతిసంధాయకమూ, సంశయవిచ్ఛేదకమూ అనే మాట సర్వసామాన్యంగా అందరూ అనుభవ పూర్వకంగా చెప్పుకుంటూ ఉండేవారు. నిత్యమూ ఆత్మస్థుడై ఉండేవాని పరిసరాలు శాంతి తరంగాలతో నిండియుండటం సహజమే. ఆత్మస్థులై ఉంటూనే శ్రీరమణులు భక్తుల ననుగ్రహింపగోరి సర్వసులభులై అందరితో కలసి మెలసి తిరుగుతూ వారడిగే ప్రశ్నలకు వాగ్రూపమున గూడ చక్కని సమాధానములిచ్చి వారికి జ్ఞానోపదేశం చేస్తూ ఉండేవారు. భారతదేశం నలుమూలలనుండే కాక, విదేశాలనుండి సైతం వచ్చిన

యాత్రికులతో శ్రీరమణులు సల్పిన యిష్టాగోష్ఠులను 1935–39 మధ్య నాలుగు సంవత్సరాల పాటు శ్రీమునగాల వెంకటరామయ్యగారు (పిమ్మట వీరు ఆశ్రమ స్వీకారం చేసి శ్రీరమణానంద సరస్వతి స్వాములవారైనారు) శ్రద్ధతో వ్రాసివుంచగా రూపొందినదే Talks With Sri Ramana Maharshi అనే గ్రంథం. ఈ చిన్ని పొత్తంలోని రమణ సూక్తులన్నీ ఆ గ్రంథరాజం నుండి ఎన్నికచేసి అనువదించబడినవే.

ప్రతి మానవునిలోనూ 'నేను', 'నేను' – అని అంటూ వుండేది ఒకటి ఉండడం అందరికీ అనుభవసిద్ధమే. ఆ 'నేను' కు మూలం తెలుసుకోమన్నదే మహర్షి చేసిన బోధకు ముఖ్య సారాంశం. అహంకారరూపమైన 'మాయ నేను' ను వదిలి దానికి మూలంలో ఉన్న 'అసలు నేను' ను పట్టుకోవాలి. సుషుప్త్యవస్థలో అహంకార మడగి 'అసలు నేను' భాసిస్తున్న మాట నిజమే కానీ, అది తెలియబడటం లేదు. జాగ్రత్తులో నుండియే దానిని తెలుసుకోవాలి. 'నేను' కు మూలాన్ని అన్వేషించటమే దానికి సూటి మార్గం. ఆత్మగురు బోధచే అది శ్రీరమణమహర్షి పదునారేండ్ల వయస్సులోనే తెలుసుకున్నారు. ప్రహ్లాదుడు తండ్రికి చెప్పినట్లు, ఇది 'చదువులలో మర్మం' తెలుసుకోడమే కానీ వేరు కాదు. సకల శాస్త్రముల పరమలక్ష్యమూ, సకల సాధనల పరమగమ్యమూ దీనిని తెలుసుకోడమే.

ఈశ్వర సాక్షాత్కారమూ, బ్రహ్మ సాక్షాత్కారమూ, అనే వాటికి కూడా ముఖ్య కీలకం ఈ ఆత్మ సాక్షాత్కారమే. దేనిని తెలుసుకున్నా ఆత్మ ద్వారముననే తెలుసుకోవలసి ఉంటుంది.

'బ్రహ్మము నే'నన్నే అనుభూతి కూడా ఆత్మయందే పొందవలసి ఉంటుంది. కనుక ఆత్మ నిజస్వరూపమేమిటో తెలుసుకోవడం, అనగా 'అసలు నేను'ను తెలుసుకోవడం తలపుల కన్నింటికీ మూలం. ఎవరికైనా ఆత్మకంటె –అనగా తనకంటే తనకు సన్నిహితమయిన వస్తువేదీ లేదు. అయినా అజ్ఞానం చేత మానవుడు తనకు తానే దూరమైపోతున్నాడు. జ్ఞానం చేతనే ఆ దూరాన్ని దాటవలసి ఉన్నది. 'మాయ నేను' మూలాన్ని ఎరుకతో వెదకటం కంటే అందుకు దగ్గర దారి మరి లేదు. ఈ పరమ రహస్యాన్ని అనుభవ పూర్వకంగా తెలుసుకున్న శ్రీరమణులు దానినే ఎలుగెత్తి లోకానికి చాటారు. ఆ అనుభవంతో ఆత్మస్థుడై చెప్పిన మాట కాబట్టి అది మహాప్రభావ సంపన్న మై విరాజిల్లింది.

శ్రీరామకృష్ణపరమహంస మహోన్నతమైన ఆధ్యాత్మిక సత్యాలను చక్కని కథలలో పొదిగి బోధించేవారు. శ్రీరమణమహర్షి బోధించే సూటి పద్ధతి మరొక రకం. ఇరువురు తమ తమ పద్ధతులయందు తమకు తామే సాటి. జ్ఞానాంజన శలాకల వంటి శ్రీరమణమహర్షి బోధలు ఎవరిని ఉత్తేజితులను గావింపవు? బోధలు పూర్ణ ఫలితములివ్వడానికి దైవానుగ్రహం కావాలి. భగవాన్ శ్రీరమణమహర్షి భౌతిక కాయంతో ఈ భూమిపై తిరుగాడిన కాలంలో అట్టి అనుగ్రహరూపంగా కూడా విరాజిల్లారు. అమృతస్వరూపుల అనుగ్రహం శరీర త్యాగానంతరం కూడా ఉండేదే – ఎక్కడికీ పోదు.

–కమలాకర వేంకటరావు.

శ్రీరమణ మహర్షి సూక్తులు

1. అంతర్ముఖత్వ సాధన

మహావాక్యాలూ, వాటి అర్థనిర్ణయాలూ అంతులేని చర్చలకు దారితీసి సాధకుల మనస్సులను బహిర్ముఖంగా ప్రసరింపజేస్తూ ఉంటాయి. మనస్సును అంతర్ముఖం చెయ్యాలంటే సాధకుడు సూటిగా 'నేను'లో నిలకడ సంపాదించుకోవటం అవసరం. బాహ్యప్రవృత్తులంత రించి అతనికి అప్పుడు పరమశాంతి చేకూరుతుంది.

2. అంతా చిద్విలాసం

శివ శక్తులన్నా, ఈశ్వర జగత్తులన్నా అంతా శివస్వరూపమే. ఒకటి శివుని అచల స్వరూపం, రెండవది శివుని సచల స్వరూపం. చిద్వస్తువే అటు అచలంగా, ఇటు సచలంగా కూడా ఉంటున్నది. చైతన్య స్వరూపులు కానివారెవ్వరు? చైతన్య స్వరూపమైన ఆత్మ ప్రత్యక్షం కాకపోతే శివుడు ప్రత్యక్షం కాలేదన్నమాటే.

3. అంతా మాయేనా?

అంతా మాయ, అసత్యమే కాని, సత్య వస్తువనేది లేదంటారు కొందరు. కాని, అంతా అసత్యమని నిర్ణయిస్తున్నది ఎవరు? అంతా అసత్యమైతే ఈ నిర్ణయం కూడా అసత్యమే కాదా? సృష్టి వికాశ

సిద్ధాంతం యిట్టి దృష్టి గల వానిచే ప్రపంచించబడింది. కాని, అది ఎక్కడ ఉన్నది? మనస్సులో కాదా?

4. అందరూ గురువులే

లోకంలో చెడ్డవారు, మంచివారు- అందరూ మనకు గురువులే. చెడ్డవారు తమ చెడ్డపనుల ద్వారా 'నా చెంతకు రాబోకు' మని బోధిస్తూ ఉంటారు. మంచివారెప్పుడూ మంచివారే కదా. కనుక లోకంలో అందరూ మనకు గురువులవంటివారే.

5. అకర్మ

అకర్మ అనగా కర్మగాని కర్మ. అహంకారం నిర్మూలమైన తరువాత చేయబడే కర్మే అకర్మ.

6. అజ్ఞానం- ప్రజ్ఞానం

సుషుప్త్యవస్థ అజ్ఞానమంటూ వుంటారు. కానీ, జాగ్రదవస్థలోని విపరీత జ్ఞానాన్ని బట్టి దానిని అలా అనడం జరుగుతుంది. జాగ్రదవస్థయే నిజానికి అజ్ఞానం. సుషుప్త్యవస్థ ప్రజ్ఞానం. 'ప్రజ్ఞానం బ్రహ్మ' అని శ్రుతి చెప్పుచున్నది. సుషుప్తిని అనుభవించేవాడు ప్రజ్ఞానం. మూడు అవస్థల్లో కూడా అతడు ప్రజ్ఞానమే అయినా, సుషుప్తిలో ప్రజ్ఞాన ఘనుడు.

7. అజ్ఞాన వినాశం

సూర్యరశ్మికి దూది తగులబడదు. భూతద్దం క్రింద దానిని ఉంచినప్పుడు మాత్రం, భూతద్దం ద్వారా ప్రసరించిన

సూర్యకిరణాల కది నిప్పంటుకొని తగులబడి పోతుంది. అట్లే ఆత్మ యొక్క ఎరుక సర్వకాల సర్వావస్థలలోనూ ప్రకాశిస్తూ వుండేదే అయినా, జీవుని అజ్ఞానాన్ని మాత్రం అది నశింపచేయదు. ధ్యానసాధన ద్వారా చిత్తవృత్తి రాహిత్యపూర్వకమైన విశుద్ధ అహంస్ఫూర్తిని సాధించినప్పుడు అజ్ఞానం పూర్తిగా నశించి పోతుంది.

8. అజ్ఞానానికి ఆధారం

సర్వమూ ఆత్మపై ఆధారపడినదే. ఆత్మపైన ఆధారపడనిది ఏదీ లేదు. ఏమంటే, అజ్ఞానం కూడా ఆత్మశక్తి విశేషమే. ఆత్మను బాధించకుండా అది ఆత్మయందు గోచరిస్తుంది. అయితే, దానిచేత బాధించబడేవాడు అహంకార విశిష్టుడైన జీవుడు. కనుక, అజ్ఞానం జీవునిది.

9. అద్వయ సుఖం

గాఢనిద్ర కూడా అద్వైతస్థితియే. జీవాత్మ పరమాత్మల భేదం అక్కడ లేదు. అన్ని భేదాలనూ మరచే స్థితి అది. అలా మరవడంలోనే సుఖమున్నది. ఆ సుఖం సంపాదించడం కోసమై జనులు మెత్తని పరుపులూ దిండ్లూ మొదలైనవాటిని ఏ విధంగా సిద్ధం చేసుకుంటారో చూడండి. మెలకువ పోయి కమ్మని నిద్ర తెప్పించుకోడానికి ప్రయత్నమిది. కానీ, గాఢనిద్రలో ఈ మెత్తని పరుపులు మొదలైనవాని అక్కర ఏమీ లేదు. దీని అభిప్రాయ మేమంటే, సకల ప్రయత్నాలూ అజ్ఞాన

నిర్మూలనకే. జ్ఞానోపలబ్ధి అయిన తరువాత ఇక ఏ ప్రయత్నాలతోనూ పని లేదు.

10. అధికార భేదం – ధ్యాన పద్ధతి

సాధకుని అధికార భేదాన్ని బట్టి ధ్యానపద్ధతి మారుతూ వుంటుంది. పట్టుకోగలిగితే నీ లోపల ఆలోచించే వానిని సరాసరి పట్టుకో. అప్పుడా ఆలోచించేవాడు తనకు మూలమైన శుద్ధ చైతన్యంలో తనంత తాను లీనమైపోతాడు. ఆ పద్ధతి కుదరకపోతే ఈశ్వర ధ్యానం చెయ్యి. అది నిన్ను పరిశుద్ధుని గావించి, నీలో ఆలోచించే వానిని పట్టుకోగలిగేటట్టు చేస్తుంది. తద్ద్వారా శుద్ధ చైతన్యంలో నీవు లీనం కాగలుగుతావు.

11. అభయ స్థితి

భయమనేది ఒక చిత్తవృత్తి. ఆత్మకంటె రెండవ వస్తువేదైనా ఉంటే భయపడడం యుక్తమే. కాని, ఈ రెండవ వస్తువును చూస్తున్న దెవరు? మొదట అహంకారం తలయెత్తి ఆ పైన విషయాలను తన వెలుపల ఉన్నట్టు చూస్తుంది. అహంకారం తలయెత్తక పోతే ఉన్నది ఆత్మ ఒక్కటే,– రెండవది లేదు. ఆత్మస్థుడైన వానికి అహంకారాన్ని ఆశ్రయించుకొని బయలుదేరే సంశయాలూ భయాలూ మొదలైనవి ఏవీ ఉండవు.

12. అభ్యాసం

ఆలోచనవలన విక్షేపం పొందినప్పుడెల్ల, ఆత్మలోకి ఉపరమించే ప్రయత్నం చెయ్యడం అభ్యాసం. అది మనస్సును ఏకాగ్రం

చెయ్యడమూ కాదు. వినాశం పొందించడమూ కాదు. కేవలం ఆత్మలోనికి ఉపరమించడం.

తీవ్రంగా ఆలోచించగలిగితే మనస్సు చాలా బలంగా వున్నట్టు సామాన్యంగా అనుకుంటూ వుంటారు. కాని, జ్ఞాన సాధనలో ఏ ఆలోచనలూ లేకుండా ఉండగలిగినప్పుడే మనస్సు చాల బలంగా ఉన్నట్టు. సాధకుడు తాను ఆత్మగా ఉండిపోవడం నేర్చుకోవాలి. అది చేతగానప్పుడు 'నేను' అనే దాని నిజతత్త్వం విచారం చేసుకుంటూ ఇతరాలోచనలు వచ్చినప్పుడెల్ల తిరిగి దానినే చిక్కబట్టుకుంటూ రావాలి. ఇదే అభ్యాసం.

13. అరిషడ్వర్గ విజయం

కామాది అరిషడ్వర్గాన్ని ఎలా నిగ్రహించడం? ఈ ఉద్వేగాలు ఎవరివో కనుక్కో. నీవు ఆత్మస్థుడవై ఉండగలిగితే ఆత్మకంటె వేరుగా నీ కేదీ కనిపించదు. అప్పుడు నిగ్రహించడమనే ప్రసక్తికే అవకాశం వుండదు.

14. 'అసలు నేను'

'అసలు నేను' చూడ బడే వస్తువు కాదు. చూడబడేది, చూచేది, చూపు-- మూడూ దాని అభివ్యక్తులు. ఆత్మ సాక్షాత్కారంలో చూడబడేది ఏమీ ఉండదు. ఎరుకయే దాని స్వస్వరూపం. దాని వెలుగులోనే శరీరం, అహంకారం, ప్రపంచం మొదలైనవన్నీ ప్రకాశిస్తాయి.

15. 'అసలు నేను' అనుభవం

'అహం బ్రహ్మాస్మి'-- అనే భావం ఏకాగ్రత కొక సాధన. ఇతర భావాలను అది నివారించి, తా నొక్కటే నిలుస్తుంది. కాని, ఆ భావం ఎవరిదో విచారించు. 'మాయ నేను' నుంచి అది బయలుదేరుతున్నదని తెలుసుకుంటావు. ఆ 'మాయ నేను' స్వరూపమేమిటో పరిశీలించు. అప్పుడది అంతర్ధానమై 'అసలు నేను' స్వయంప్రకాశమానంగా అనుభవానికి వస్తుంది. అటుపిమ్మట ఇక ఏ ప్రయత్నంతోనూ పని లేదు.

16. అసలు సమస్య

అహంకారాన్ని వదిలించుకోడమే సత్య సాక్షాత్కారానికి సూటి మార్గం. అహంకారానికి వస్తుత్వం లేదు కనుక దాని నిజస్థితి విచారించగానే అది అంతర్ధానమై సత్యం దానంతటది సాక్షాత్కరిస్తుంది. అహంకారాన్ని అంటిపెట్టుకుంటూ సత్యసాక్షాత్కారం పొందగోరే యితర మార్గాలు అనేక సందేహాలకు ఆలవాలమై అసలు సమస్య చిట్టచివరకు మిగిలే వుంటుంది. పైన చెప్పిన సూటిమార్గంలో అసలు సమస్య మొదటే పరిష్కారమౌతుంది.

17. 'అహం' – 'అహంకారం'

ఒకే 'అహం' ఎప్పుడూ ఉన్నది. అప్పుడప్పుడు బయలుదేరేది 'అహంకారం'. అభివ్యక్తం కాకముందు కూడా 'అహం' స్వయం ప్రకాశమానంగా ఎప్పుడూ ఉండనే ఉన్నది.

స్థూలదేహం పుట్టుక మన పుట్టుక కాదు. అహంకారం పుట్టుకయే మన పుట్టుక. ముక్తికి క్రొత్తగా సంపాదించుకొనేది ఏమీ లేదు. అది మన స్వతస్సిద్ధమైన స్థితి. ఎప్పటికీ అది మార్పు లేకుండానే ఉన్నది.

18. అహంకారం – ఆత్మ

అహంకారం లేకుండా ఆత్మ ఉండగలదు. ఆత్మ లేకుండా అహంకారం ఉండలేదు. వాటి సంబంధం నీటిబుడగకూ మహాసముద్రానికి గల సంబంధం వంటిది. అహంకారపు మూలం తెలుసుకుంటే ఆత్మ తెలియబడుతుంది.

19. అహం – ఇదం

'అహం- ఇదం', 'నేను–ఇది' అనేవి ఒక దానిపై ఒకటి ఆధారపడి విడివిడిగా ఉన్నట్టు ఇప్పుడు కనిపిస్తున్నవి. కాని, వాస్తవానికి అవి విడివిడిగా లేవు. 'నేను' లోనే 'ఇది' వ్యాపించి ఉన్నది. 'ఇది' అనేది 'నేను'లో లీనమై దానితో ఒకటై పోవాలి. అప్పుడు మిగిలి ఉండే 'నేనే' 'అసలు నేను.'

20. అహంకారపు నిజస్వరూపం

అంహకారపు విశుద్ధ స్వరూపం రెండు అవస్థలకు, లేక రెండు భావాలకు, మధ్యనుండే విరామకాలం లో తెలియబడుతుంది. ఒకదాన్ని పట్టుకున్న తరువాత గాని రెండవ దాన్ని వదలి పెట్టని గొంగళిపురుగు వంటిది అహకారం. విషయాలతోను, భావాలతోను సంబంధం లేకుండా ఉన్నప్పుడే

దాని నిజస్వరూపం వ్యక్తమవుతుంది. కనుక మనం అనుభూత మొనర్చుకోవలసినది ఆ విరామకాలాన్ని.

21. అహంకార నిర్మూలన

అహంకారాన్ని పెకలించడమంటే దాని మూలాన్ని వెదకి పట్టుకోడమే కాని వేరు కాదు. అహంకార రూపములో ఉన్న ఈ 'మాయ నేను' కు మూలములో వున్నదే 'అసలు నేను'. అది జాగ్రత్ – స్వప్న – సుషుప్తులు మూడింటిలోనూ ఉన్నది. ఆ మూల స్థానాన్ని కనుగొని అందు నిలిచిపోవడమే కావాలి. ఇంతవరకే నీ ప్రయత్నం – ఆపైన ఇక ప్రయత్నంతో పని లేదు.

22. అహంకారం నీడవంటిది

నేలమీద కనిపించే మన నీడవంటిది అహంకారం. ఎవరైనా ఆ నీడను ఊడ్చుడానికి ప్రయత్నించడం అవివేకం కాదా? ఆత్మ ఒక్కటే సత్యమైనది. పరిమితి కలదైతే అది అహంకారం. పరిమితి లేనిదైతే అది అనంతం, నిత్యసత్యం.

23. అహంకారపు బిగువు

ప్రతివాడు అహంకారపు పిడికిలిపట్టులో చిక్కుకొని వున్నాడు. ఆ పట్టును వదలించుకోవాలంటే, సాధకుడు క్రొత్త వాసనలు సృష్టించుకోకుండా వుండడం అవసరం.

24. అహంకారోత్పత్తి

గాఢ నిద్రలో నీకు ప్రపంచం లేదు. కాని నీవున్నావు. సుఖంగా కూడా ఉన్నావు. నిద్రనుండి మేల్కాంచిన తరువాతనే నీకు సుఖం

పోయింది, ఎందువలన? మేలుకోవడంతో అహంకారమనేది క్రొత్తగా వచ్చింది. నిద్రలో ఈ అహంకారం లేదు. అహంకారం పుట్టుకే వ్యక్తి పుట్టుక గా చెప్పబడుతున్నది. అహంకారాన్ని నశింపజేస్తే మిగిలేది ఆత్మ, ఆత్మానందమే.

25. అహంకార వినాశం

అహంకారాన్ని ఎలా వినాశమొందించడం అని ఈ వితర్కించేదీ, యోచించేదీ ఎవరో కనుక్కో. అదే అహంకారం దానిని పట్టుకో. ఇతర వితర్కాలు, యోచనలు – అన్నీ నశించిపోతాయి. అహంకార మొక్కటే విశుద్ధంగా మిగులుతుంది. ఈ అహంకారం ఎక్కడనుంచి బయలుదేరుతున్నదో చూడు. అదే శుద్ధ చైతన్యం.

26. అహం బ్రహ్మాస్మి

'అహం బ్రహ్మాస్మి' – 'నేను బ్రహ్మమును' – అని చేసే సాధన ఒక భావన మాత్రమే. ఆ మాట ఎవరు అంటున్నారు? బ్రహ్మము అనదు – అనవలసిన అవసరము దానికి లేదు. 'అసలు నేను' అనదు, – అది బ్రహ్మముగా ఎప్పుడూ ఉండనే ఉంటుంది. ఇక ఆ మాట అనేది 'మాయ నేను' మాత్రమే. భావాలన్నీ 'మాయ నేను' నుండే పుట్టుతాయి. ఏ భావనా లేకుండా ఉండు. భావన ఉన్నంతకాలం భయం తొలగదు.

27. అహంవృత్తి – అహం స్ఫురణ

గాఢనిద్రలో 'నే' ననేది తెలియబడదు. మేల్కొన్నప్పుడే శరీరాదులతో తాదాత్మ్యం చెంది తెలియబడుతుంది. దీనికే

అహంవృత్తి అని పేరు. ఈ తాదాత్మ్యం లేకుండా కేవలాత్మగా తెలియబడినప్పుడు దానిని 'అహం స్ఫురణ' అంటారు. జాగ్రత్, స్వప్న, సుషుప్తులు మూడింటిలోను నిత్యసిద్ధమై ఉన్నప్పటికీ అది తెలియబడడం లేదు. జాగ్రదవస్థలో వుండగానే దానిని మొదట తెలుసుకోవాలి. పిమ్మట అది మూడవస్థల్లోను అవిచ్ఛిన్నంగా ఉన్నట్లు తెలియబడుతుంది.

28. అహంస్ఫూర్తి అనుభవం

సత్యబోధకు వేదాంతశాస్త్ర గ్రంథ పఠనమే చాలదు. సమాధి కుదరాలి. ఆలోచనలు సత్యమును మరుగుపరుస్తాయి. సమాధిలో అహంస్ఫురణ తప్ప ఇతరాలోచనలేవీ ఉండవు. అహంకార వర్జితమైన అహంస్ఫురణ ఆలోచన కాదు. అపరోక్షానుభూతి. అహంస్ఫురణ పరమార్థం బ్రహ్మమే. అహంస్ఫూర్తి అనుభవం నిశ్చలంగా ఉండిపోవడం.

29. ఆత్మ అవ్యవహితం

ఆత్మాన్వేషణం ఒక దూరప్రయాణం వంటిది కాదు. ఆత్మకు నీ వెంత దూరంలో ఉన్నావని? ఆత్మను నీ వెన్నడూ విడచి లేవు, విడిచి ఉండడం అసాధ్యం. ఆత్మకంటె సన్నిహితమైన వస్తువు లేదు. ఆత్మను పొందడానికి నీవు ఎక్కడికీ పోనక్కర లేదు. అది నీకు అవ్యవహితంగా ఉన్నదే.

30. ఆత్మ – అంతర్యామి

వైష్ణవ భక్తుడు నమ్మాళ్వారు 'నా ఆత్మే నీవు' అని అన్నాడు. అంటే ఏమిటి? 'నా ఆత్మను నేను తెలుసుకోక పూర్వం నీ కొరకు

బయట వెతుకుతూ తిరిగాను. కాని, నా ఆత్మను తెలుసుకొన్న తరువాత, నీవు 'నా ఆత్మవే నని తెలిసింది.' దీన్ని విశిష్టాద్వైతంతో ఎలా సరిపుచ్చడం? ఇలా వివరించుకోవాలి: 'నా ఆత్మను వ్యాపించి నీవు అంతర్యామిగా ఉన్నావు అందుచే నేను నీ శరీరంలో ఒక భాగాన్ని. నీవు శరీర యజమానుడగు శరీరివి.'

31. ఆత్మగ్రహణం

మనస్సుకూ, ఈ దృశ్య ప్రపంచానికీ అతీతమైన ఆత్మను నేననే దృఢ విశ్వాసం ముఖ్యంగా ఉండాలి. మనస్సు ఎంతగా ఉరకలు పెట్టుతుంటేనేమి? దాని వ్యాపారాని కంతకూ అధిష్ఠానం ఆత్మయే, కనుక అది ఉరకలు పెట్టుతున్న కాలంలో కూడ ఆత్మను అందుకోడానికి ప్రయత్నించు.

32. ఆత్మజ్ఞానం

ఆత్మను తెలుసుకోడమంటే, ఆత్మగా ఉండిపోవడమే. ఏలనంటే అది తెలియబడే విషయం కాదు, తెలుసుకొనే విషయి – ఆత్మ నాకు తెలియడం లేదంటున్నావంటే నీకు అలవాటైన సాపేక్షిక జ్ఞానంతో – విషయ జ్ఞానంతో అంటున్నావు. 'నేను ఇది, అది' అని గాక, 'నేను నేను' గా ఉండిపోవడమే కావాలి.

33. ఆత్మధ్యానం

'నేను బ్రహ్మమును' – అని ధ్యానం చేయడం కంటే, మనస్సును అంతర్ముఖం చెయ్యడం ప్రధానం. 'నేను బ్రహ్మము' నని ధ్యానం చెయ్యవలసిన అవసర మేమున్నది? 'నేను' ను వినాశ

మొందించడమే ముక్తి. కాని, అది 'నేను,' 'నేను' – అనేదాన్ని ఎప్పుడూ ఏమరకుండా ఉన్నప్పుడే సాధ్యమౌతుంది. అందువల్లనే 'నేను' అనే భావాన్ని పరిశోధించవలసిన అవసరం ఏర్పడుతున్నది. 'నేను' ను వదలకుండా వుంటే సాధకుడు శూన్యస్థితిలో పడకుండా ఉంటాడు. లేనియెడల, ధ్యానం నిద్రలోనికి దారి తీస్తుంది.

34. ఆత్మ ప్రకాశం

చిత్తవృత్తులు లేకపోవడమంటే శూన్యస్థితి కాదు. శూన్యస్థితినైనా తెలుసుకొనే వారొకరుండాలి. తెలియడం తెలియకపోవడం, రెండూ మనస్సువే. ఆత్మ యీ రెంటికీ అతీతం, – సాక్షాత్తూ ప్రకాశ స్వరూపం.

35. ఆత్మ ప్రేమస్వరూపం

ఆత్మ ఆనందస్వరూపం, ప్రేమస్వరూపం. ఆత్మప్రేమను బట్టే సమస్తమూ ప్రియమౌతున్నది. ప్రేమ ఆత్మకంటె వేరు కాదు. విషయప్రేమ తక్కువ తరగతి ప్రేమ. ఇక ఆత్మ అనేది కేవలం ప్రేమయే. మరొక రకంగా చెప్పితే భగవంతుడు ప్రేమ స్వరూపుడు అన్నా అదే.

36. ఆత్మ లక్షణాలు

ఆత్మ యెప్పుడూ సత్ – చిత్ – ఆనంద లక్షణములు కలిగినదే. వీనిలో మొదటి రెండూ జాగ్రత్ – స్వప్న – సుషుప్తులు మూడింటిలో కూడ తెలియబడుతూ ఉండగా చివరిది సుషుప్తిలో మాత్రమే తెలియబడుతుందని చెపుతారు. జాగ్రత్ – స్వప్నములలో

ఆ ఆత్మలక్షణం లుప్తమవుతున్నదా అని ప్రశ్న. వాస్తవానికి అది లుప్తం కావడంలేదు. సుషుప్తిలో మనస్సుండదు. ఆత్మ తానుగా ప్రకాశిస్తుంది. జాగ్రత్ – స్వప్నాలలో ప్రకాశించేది ఆత్మ యొక్క ఆభాస. సుషుప్తిలో మనోవృత్తి అణగిపోయిన పిమ్మట ఆనందం అనుభవానికి వస్తుంది. ఇతర సందర్భాల్లో అది ప్రియం, మోదం, ప్రమోదం అనే రూపాల్లో అభివ్యక్తమవుతుంది. కాని, అవన్నీ చిత్తవృత్తులే.

37. ఆత్మలోనిది జగత్తు

జగత్తు మనః ప్రసారితమని నిత్యమూ జ్ఞాపకముంచుకో. మనస్సు ఆత్మలోనిది. శరీరం యెక్కడెక్కడ సంచరించినా మనస్సును సంయమంలో ఉంచుకోడం అవసరం. శరీరం కదలుతుంది గాని ఆత్మ కదలదు. జగత్తంతా ఆత్మయందే ఉన్నది.

38. ఆత్మవిచారావశ్యకత

ఆత్మవిచారం చెయ్యకపోతే లోకవిచారం నీకు గతి అవుతుంది. దేహమే ఆత్మ అనుకోవడం వల్ల నిజమైన ఆత్మను నీవు కోల్పోయినట్లు కనిపిస్తున్నావు. ఇలా నీవు ఆత్మ అనుకుంటూ వున్నవి లోకంలో అనేకం ఉన్నాయి. కనుక నిజమైన ఆత్మను కనుక్కోవడమే ఆత్మవిచారం, ఆత్మాన్వేషణ.

39. ఆత్మవిచారం : సమర్పణం

పూర్ణజ్ఞానంతో చేసినదే సమర్పణం. ఆత్మవిచారం పూర్ణజ్ఞానానికి సాధన. అది సమర్పణలో పర్యవసిస్తుంది.

జీవజ్ఞానాన్ని అతిక్రమించిన బ్రహ్మజ్ఞానములో సమర్పణకు తావెక్కడ అని అనవచ్చు. వస్తుతః జ్ఞానానికీ సమర్పణకూ భేదం లేదు. సాధకునకు ఇట్టి పరిస్థితిలో సత్సంగము, ఈశ్వర భక్తి ముఖ్యంగా ఉపాధేయాలు.

40. ఆత్మవిద్య

అన్ని విద్యలలోకీ ఆత్మవిద్య అత్యంత సులభమైనది. ఎందుచేత? ఇతర విద్యలకు తెలుసుకునే వాడు, తెలుసుకోబడేది, తెలుసుకోడం అనే మూడింటి అవసరమున్నది. ఆత్మ విద్యకు అట్టిదేమీ అక్కరలేదు. తాను తానై ఉండడమే కావలసినది. తనకంటే ప్రత్యక్ష విషయం తనకు ఏముంటుంది? కనుక, అది అత్యంత సులభం. 'నేను ఎవరిని?' అని విచారణ చేసుకోడం మాత్రమే ఇచ్చట అవసరం.

41. ఆత్మ వృత్తిజ్ఞానం

వృత్తిజ్ఞానం మాత్రమే అజ్ఞానాన్ని నశింపజెయ్యగలుగుతుంది. చిత్తవృత్తులు రెండు రకాలు. ఒకటి: విషయవృత్తి. రెండవది: ఆత్మవృత్తి. విషయవృత్తి పోయి ఆత్మవృత్తి నిలబడాలి. ఇదే సాధకుని అభ్యాస లక్ష్యం. అభ్యాసం ద్వారా మొదట జీవాత్మను, పిమ్మట ఏకాత్మను అతడు తెలుసుకోగలుగుతాడు.

42. ఆత్మ సమర్పణ

ఆత్మసమర్పణమంటే ఆత్మకు నిన్ను నీవు అర్పించుకోడం. అనగా, నీ అహంకారాన్ని ఆత్మాధీనం చెయ్యడం. అహంకారం

మూలాన్ని కనుగొని అందు లీనం కావడమన్నా అదే. అహంకారం వాస్తవానికి ఆత్మదే. దానిపై మనకు ఎట్టి హక్కులూ లేవు. అయినా ఉన్నట్టు భావిస్తున్నాం కనుక వాటిని ఆత్మకు సమర్పించి వెయ్యడం అవసరం. అహంకారాన్ని వదలుకొని ఆత్మాధీనులం కావడం మనం నేర్చుకోవాలి.

43. ఆత్మ సంస్థితి

బంధరహితమైన ఆత్మ ప్రతివానిలోనూ నిత్య సిద్ధంగానే ఉన్నది. దైనందిన జీవితం యీ ఆధ్యాత్మిక జీవితంకంటె భిన్నంగా లేదు. భిన్నంగా ఉన్నదని అనుకోడంలోనే వస్తున్నది చిక్కు. ఆత్మను సరిగా తెలుసుకున్ననాడు, దైనందిన జీవితం దానికంటె భిన్నంగా గోచరించదు. చిత్త వృత్తుల మూలాన్ని వెదకి పట్టుకొన్నప్పుడు ఇది తెలుస్తుంది.

చంచలత్వం మనస్సుకు స్వభావం. నీవు మనస్సువు కావు. మనస్సుకు ఆవిర్భావ తిరోభావాలున్నాయి. అది అస్థిరం. అశాశ్వతం; నీవో స్థిరుడవు. శాశ్వతుడవు. నీ ఆత్మ స్వరూపంలో నీవు నిలిచిపోవడమే కావలసినది. మనస్సును లెక్కచెయ్యకు. దాని మూలాన్ని అన్వేషిస్తే అది అంతర్ధానమై ఆత్మ అఖండంగా ప్రకాశిస్తుంది.

44. ఆత్మస్థానం

నీ వెవరవని ఎవరైనా అడిగినప్పుడు నిన్ను గురించి చెప్పుకోడానికి వక్షఃస్థలం కుడిభాగాన చేయి వుంచుకొని 'నేను' అని సమాధానం చెప్పుతావు. శరీరంలో నీ ఆత్మ స్థానం నీవా రీతిగా

నీకు తెలియకుండానే చూపుకోడం జరుగుతున్నది. అదే హృదయ కేంద్రం.

45. ఆత్మస్థుని మనోవ్యాపారం

ఆత్మసాక్షాత్కారం పొందిన వానిలో మనోవ్యాపారం ఉండవచ్చు. ఉండక పోవచ్చు. కాని అతడు మాత్రం ఆత్మస్థుడుగానే ఉంటాడు. మనస్సు, శరీరం, ప్రపంచం – ఇవి ఆత్మకంటె వేరుకావు; ఆత్మయందు పుట్టి, ఆత్మయందు లయిస్తాయి. ఆత్మను విడచి వాటికి ఉనికి లేదు. కనుక ఆత్మను తెలుసుకో. ఈ నీడలను గూర్చి ఆదుర్దా నీకెందుకు?

46. ఆత్మ స్ఫురణ

'నేను – నేను'(అహం – అహం) అనేదే ఆత్మ, 'నేను ఇది' (అహం ఇదం) అనేది అహంకారం. నేననే స్ఫురణ ఎప్పుడూ ఉంటుంది. అహంకారం అలా ఎప్పుడూ ఉండేది కాదు. 'నేను' కేవలం 'నేను' గా ఉన్నప్పుడది ఆత్మ. అది అలా ఉండక వెలుపలకు ప్రసరించి 'ఇది' అని అన్నప్పుడది అహంకారం.

47. ఆత్మస్ఫురణ – కర్మప్రవృత్తి

ఆత్మవిచారం చేసేవానికి తన వ్యక్తిత్వం గురించిన ఎరుక ఉన్నది. ఆత్మవిచారం ఆ వ్యక్తిత్వ స్ఫురణకు అడ్డు రావడం లేదు. బాహ్యకర్మ సైతం అట్టి వ్యక్తిత్వ స్ఫురణకు అవరోధం కావడం లేదు. బాహ్యమైనదిగా కనిపించే కర్మ ఇలా వ్యక్తిత్వ స్ఫురణకు భంగం కలిగించనప్పుడు, ఆత్మకంటె అనన్యమైనదిగా తెలియబడే కర్మ

అవిచ్ఛిన్నమైన ఆత్మ స్ఫురణకు మాత్రం ఎలా భంగపాటు కలిగిస్తుంది? ఆ ఆత్మ స్ఫురణ రెండవది లేని అద్వైతస్థితి. అది కర్మకంటె వేరైన ఒక వ్యక్తి కాదు.

48. ఆత్మానందం

గాఢనిద్రలో ప్రపంచం లేదు. అహంకారం లేదు. అశాంతి, దుఃఖం లేవు. కాని, ఆత్మ ఉన్నది. మెలకువలో యివన్ని ఉన్నాయి. ఆత్మ కూడా ఉన్నది. ఆత్మయందే ఇవన్నీ కల్పితమై ఆత్మను మరుగు పరుస్తున్నట్టుగా ఉన్నాయి. అసత్యములైన వీటిని తొలగించుకోడమే కావాలి. అప్పుడు నిత్యసత్యమైన ఆత్మ ఆనంద స్వరూపంతో ప్రకాశిస్తుంది.

49. ఆత్మానుభూతి – వ్యక్తిత్వం

అహంకారం వదలుకొని విశుద్ధమైన జీవాత్మ పరమాత్మకు శరీరం వంటిదంటారు విశిష్టాద్వైతులు. జీవాత్మలు శరీరం, పరమాత్మ శరీరి. కాని, ఆత్మకు ఆత్మ ఉంటుందా? ఆత్మ అంటే ఏమిటి? శరీరేంద్రియాదులు తొలగించుకున్న తరువాత మిగిలేదే కదా. దాని కంటె వేరుగా పరమాత్మ ఉన్నాడంటే, ఈ తెలుసుకొన్న ఆత్మ పరమ సత్యం కాదన్నమాట, నిక్కమైన ఆత్మ కాదన్నమాట. వాస్తవానికి, పరమ సత్యమైన ఆత్మలో లీనమైన తర్వాత ఇక వ్యక్తిత్వ మనేది ఉండదు.

50. ఆత్మాన్వేషణ

సాధనలో ఏ దివ్యనాదాలు నీవు విన్నా, ఏ దివ్య దర్శనాలు నీవు చూచినా, వాటిని వినేవాడూ చూచేవాడూ ఒకడుండాలి అతడే నీలో ఉన్న 'నేను'. 'నేనెవరిని?' అని విచారణ ద్వారా ఆ 'నేను'ను

అన్వేషిస్తే, విషయాలూ విషయి ఒకటై పోతాయి. ఆపైన ఇక అన్వేషణ లేదు. అంతవరకూ ఆలోచనలు పుట్టుతూనే ఉంటాయి. విషయాలు గోచరిస్తూ మాయమవుతూనే ఉంటాయి. ఏమి జరిగింది, ఏమీ జరగబోతుంది అనే ప్రశ్నలు నీకు తప్పవు. విషయి తెలియబడితే విషయాలు విషయిలో లీనమైపోతాయి.

51. ఆత్మోపలబ్ధి

ఆత్మవస్తువు కొత్తగా సంపాదించుకోనేది కాదు. ఇది వరకే అది సిద్ధమై ఉన్నది. నాకు తెలియలే దనుకోవడమే పోవాలి. చిత్తవృత్తులు నశిస్తే ఆత్మ దానంతటదే ప్రకాశిస్తుంది. అనాత్మయందు ఆత్మభావం మూలంగానే చిత్తవృత్తులుదయిస్తున్నాయి. అనాత్మ అదృశ్యమైనప్పుడు మిగిలేది ఆత్మయే.

జనులు ప్రపంచాన్ని చూస్తూవుంటారు. చూడడమన్నప్పుడు చూచేవాడు, చూడబడేది ఉండి తీరాలి. చూడబడే విషయాలు చూచేవానికి పరాయివి. చూచేవాడు ఆత్మయే అయినందువల్ల అత్యంత సన్నిహితుడు. కాని, జనులు తమయందలి చూచేవానిని తెలుసుకోడానికి ప్రయత్నించక చూడబడే దానివెంట పరుగులెత్తుతూ వుంటారు. మనస్సు విస్తృతమైన కొద్దీ ఆత్మకు దూరమై ఆత్మోపలబ్ధిని దుస్సాధ్యం చేస్తుంది. చూచే వానిని ప్రత్యక్షం చేసుకోనేవాడు ఆత్మోపలబ్ధిని పొందుతాడు.

52. ఆధ్యాత్మిక సంఘటనలు

ఆధ్యాత్మిక విషయాలు హేతువాదానికి అతీతమైనవి. కౌరవ సభలో ద్రౌపదికి చీరలు అక్షయం కావడం అటువంటి సంఘటనే.

ద్రౌపది సర్వసమర్పణం చేసుకొన్న మీదట అది జరిగింది. దాని కీలకమంతా సర్వసమర్పణలో ఉన్నది.

53. ఆనందప్రాప్తి

ఆనందం నీలో ఉన్నది గాని బయటి వస్తువుల్లో లేదు. గాఢ సుషుప్తిలో శరీరస్మృతి కూడా లేకున్నప్పుడే, నీకు అమిత సుఖం ఉంటున్నది. ఆ సుఖాన్నే నీవు గాఢంగా వాంఛిస్తూ ఉంటావు. అంతులేని ఆనందసాగరంలో నీవు ఓలలాడాలంటే, నీ ఆత్మను నీవు తెలుసుకోవాలి.

54. ఆభాసజ్ఞానం – సత్యజ్ఞానం

మనస్సు కల్పించినవైచిత్ర్యమంతా నీకు తెలియబడుతున్నదంటే ఒక వెలుగు దానినంతనూ ప్రకాశింప జేస్తున్నదని నీవంగీకరించి తీరాలి. ఈ భావసముదాయం గాఢనిద్రలో అంతర్ధానమై మెలకువలో తిరిగి తల యెత్తుతున్నది. కనుక ఈ వెలుగు అనిత్యమని చెప్పాలి. దీనికి ఆద్యంతము లున్నాయి. స్వతంత్ర సత్తా లేదు. అందుచేత ఇది ఆభాసజ్ఞానం. అహంస్ఫురణ ఒక్కటే నిత్యం, అవిచ్ఛిన్నం. ఇది హృదయస్థానంలో స్ఫురిస్తూ ఉంటుంది. నిద్రనుంచి మేలుకొన్నపుడు అది మెదడులో ప్రతిఫలించి అటు పిమ్మట శరీరమంతా వ్యాపిస్తుంది.

55. ఆరతి, విభూతి, కుంకుమ

జ్ఞానజ్యోతిలో మనస్సును దహించి వేయాలన్న దానికి సూచనయే కర్పూరహారతి. విభూతి శివతత్త్వానికి, కుంకుమ

శక్తితత్త్వానికి చిహ్నాలు. విభూతి పరాపర భేదాలచే రెండు రకాలు. మనం నొసట ధరించేది అపరావిభూతి. జ్ఞానజ్వాలచే సకల వాసనలూ దగ్ధమైపోగా మిగిలేది పరావిభూతి... ఆత్మజ్ఞానం.

56. ఆవరణం

ఆవరణ జీవుణ్ణి పూర్తిగా కప్పివేయదు. తాను ఉన్నాననేది అతనికి తెలుసు. తాను ఎవరనేది మాత్రమే తెలియదు. అతడు ప్రపంచాన్ని చూస్తాడు. కాని, అది బ్రహ్మమేనని గ్రహించడు. అతనిది చీకట్లో వెలుతురు. అజ్ఞానంలో జ్ఞానం. సినిమా ప్రదర్శనలో హాలును మొదట చీకటి చేసి పిమ్మట కృతకమైన వెలుతురు ప్రవేశపెట్టి బొమ్మలు చూపిస్తారు. భేదజ్ఞానానికి ప్రతిబింబితమైన వెలుతురు అవసరం. నిద్ర అనే చీకటి, లేక అజ్ఞానంలో నిద్రించేవాడు కలలో దృశ్యాలు చూస్తాడు. అదేరీతిగా అజ్ఞానమనే చీకట్లోనే ప్రపంచ దృశ్యజ్ఞానం కలుగుతూ ఉన్నది.

57. ఆవరణ విశేషాలు

అజ్ఞానంలోంచి మేల్కోనడం నిద్రలో దుస్స్వప్నంలోంచి మేల్కొనడంతో పోల్చారు. చిత్తానికి ఆవరణం, విక్షేపం అనే రెండు దోషాలున్నాయి. వీటిలో ఆవరణమే చెడ్డది. విక్షేపం చెడ్డది కాదు. నిద్రావరణం ఉన్నంతవరకూ దుస్స్వప్నం ఉంటుంది. మేల్కొనగానే ఆ ఆవరణం పోతుంది. ఇక భయం ఉండదు. విక్షేపం సుఖానికి ప్రతిబంధకం కాదు. ప్రపంచం వలన కలిగిన విక్షేపం తొలగించుకోడానికి గురుసన్నిధి, శాస్త్రాభ్యాసం, దైవారాధన మొదలైన ప్రవృత్తులను అవలంబిస్తే అది అజ్ఞానావరణ లోంచి మేల్కొనడానికి దారి తీస్తుంది.

58. అవృత్త చక్షువు

అవృత్తచక్షువనగా అంతర్ముఖమైన దృష్టి. అంటే కనుగ్రుడ్డును లోపలికి త్రిప్పడం కాదు. కన్ను తనంతట తాను ఏ రూపాన్నీ చూడలేదు. దాని ద్వారా చూచేవాడు వేరే ఉన్నాడు. ఇక్కడ చక్షువనేది ఆ చూచే వానికి వర్తించేమాట.

59. ఆశ్చర్యాల్లో ఆశ్చర్యం

ప్రతివారికీ తెలిసినది వారి ఆత్మయే. కాని, ఆశ్చర్యాల్లోకెల్ల ఆశ్చర్య మేమంటే, కానిది అవునని యెల్లరూ అనుకుంటూ ఉంటారు. ఆత్మకంటే భిన్నంగా ప్రపంచాన్ని చూస్తూ ఉంటారు. జ్ఞాత వున్నంతసేపే ప్రత్యక్షజ్ఞానం, అనుమాన జ్ఞానం–మొదలైన అన్నిరకాల జ్ఞానాలూ ఉంటాయి. జ్ఞాత అదృశ్యమైతే అతనితో పాటు అన్నీ అదృశ్యం కాక తప్పదు.

60. ‘ ఇదం’ లేని ‘అహం’

నిద్రలో ఆత్మ శుద్ధ చైతన్యంగా ఉంటుంది. మెలకువ లోకి వచ్చే సంధిదశలో ‘ఇదం’ (ఇది) లేని ‘అహం’ (నేను) గా రూపొంది మెలకువలో ‘ ఇదం’ తో కూడిన ‘అహం’ గా అభివ్యక్తమౌతుంది. ‘అహం’ ద్వారానే మానవుని అనుభవం కనుక, అతడు ఆ సంధి దశలోని ‘అహం’ ను అనుభూత మొనర్చుకోడానికి కృషిచెయ్యాలి. అది అనుభూతమైనప్పుడే అధిష్ఠానం అందుబాటై, లక్ష్యసిద్ధి సుగమమవుతుంది.

61. ఈశ్వరతత్త్వం

జీవుడు, ఈశ్వరుడు, బంధము – ఈ మాదిరి త్రిపుటులు ప్రతి మతంలోనూ ఉన్నాయి. మనస్సు పని చేస్తున్నంత కాలం యివి యథార్థములే. ఇవి కేవలం మనః కల్పితములు. ఈశ్వరుని ప్రతిపాదించేది మనస్సు. వాస్తవానికి ఈశ్వరుడు ఆత్మ కంటె వేఱు కాదు. ఆత్మయే ఈశ్వరుడుగా విషయీభూతమవుతున్నది. గురువు విషయంలో కూడ యింతే.

62. ఈశ్వరుడు

జగత్తుతో సంబంధాన్ని పురస్కరించుకొని బ్రహ్మమును ఈశ్వరుడని పేర్కొన్నారు. మనం ఒండొరులతో మాట్లాడుకున్నట్లే, ఈశ్వరునితో కూడ మాట్లాడవచ్చు. అయితే, అందుకు మనశ్శుద్ధి, మనోబలం, ధ్యాననిష్ఠ అవసరం.

63. ఉత్తమోత్తమ దీక్ష

మౌనంతో యిచ్చే దీక్షే దీక్షలలో కెల్ల ఉత్తమమైనది. ఇది శ్రీదక్షిణామూర్తి అనుగ్రహించినది. స్పర్శ, దృష్టి మొదలైన వాటి ద్వారా యిచ్చేవి దానికంటే తక్కువ రకానికి చెందినవి. మౌనదీక్ష సకల హృదయాలలోనూ మార్పు తెస్తుంది.

64. ఉపవాస ప్రయోజనం

ఉపవాసం మంచిదే. కాని, అదే పరమలక్ష్యం కారాదు. దానితో పాటు ఆధ్యాత్మిక అభివృద్ధియందు కూడా శ్రద్ధవహించాలి. కటిక ఉపవాసం మనస్సును దుర్బలపరుస్తుంది. ఆధ్యాత్మికాన్వేషణకు

కావలసిన శక్తి నీవు పొందలేక పోతావు. కనుక, మితాహారం గైకొంటూ నీ అభ్యాసం కొనసాగించు.

65. ఎదురు ప్రశ్న

భగవంతునియందు భక్తికలిగి వుండుమని చెప్పడం తోటే తృప్తిపడి వెళ్ళిపోయేవాడయితే సరే. అలా కాక, ఒక్కొక్కప్పుడు ఎదురుతిరిగి, 'భగవంతుడు, నేను' అని ఇక్కడ ఇద్దరం ఉంటున్నాము కదా, ఎక్కడో ఉన్న భగవంతుని కంటే అత్యంత సన్నిహితమైన నేనెవరో ముందు తెలుసుకోడం అవసరం కాదా? అని ప్రశ్నిస్తారు. అట్టి వారికే విచారమార్గం బోధించాలి. వస్తుతః భక్తికీ, విచారానికీ భేదం లేదు.

66. ఎరుక అత్యంత ముఖ్యం

చిత్తవృత్తులు నిరోధించేటప్పుడు ఎరుక గలిగి ఉండడం అత్యంత ముఖ్యం. లేనియెడల అది నిద్రలోకి దారితీస్తుంది. ప్రాణాయామం తరువాత ప్రత్యాహారం, ధారణ, ధ్యానం, సమాధి అనే వాటిని పతంజలి నిర్దేశించడంలో యీ యెరుక ముఖ్యమనేదే సూచిత మవుతున్నది. ప్రాణాయామం వల్ల వృత్తులు నిరుద్ధములై మనస్సు నిశ్చలమౌతుంది. 'క్లోరోఫారం' మొదలైన వాటివల్ల కూడా పై స్థితుల వంటివి కలుగవచ్చు. కాని, యెరుక లేకపోవడం వల్ల అవి మోక్షప్రదం కానేరవు.

67. ఏకాంతవాసం

మనస్సును నిశ్చల మొనర్చుకోడమే ఏకాంతవాసం; విజన స్థలానికి పోవడం కాదు. జనం మధ్యలో ఉండి కూడా మనస్సును

నిశ్చల మొనర్చుకోవచ్చు. విజన స్థలంలో ఉన్నంత మాత్రాన మనస్సు నిశ్చలం కాదు. అభ్యాసంవలన మాత్రమే నిశ్చలమవుతుంది. విజన స్థలంలో ఉన్నప్పుడు కూడా ఏకాంతానికి ఎక్కడ భంగం వాటిల్లుతుందోనన్న భయం ఉంటుంది. పైగా, ఎక్కడ ఉన్నప్పటికీ అభ్యాసం తప్పదు.

68. కర్తృత్వ భారం

రైలు బండిలో ప్రయాణం చేసేవాడు తన నెత్తిమీద బరువు దించుకోకపోతే అది అతని తప్పే అవుతుంది. అతడా బరువు దించివేసుకోడం అవసరం. అతనితోపాటు ఆ దించిన సరుకు కూడా తుదకు గమ్యం చేరితీరుతుంది. అట్లే ఈ జగత్తులో మనం కర్తృత్వభారం తలనిడుకోరాదు. జగన్నియంతపై ఆ భారం వదలి కూర్చొనడం మంచిది.

69. కర్మఫల ప్రదాత

కర్మకు ఫలం ఉన్నది. ఒకటి కారణం, రెండవది కార్యం. రెండిటికీ గల సంబంధం ఒకానొక శక్తి ఫలితం. దానినే దైవమని పిలుస్తాము. దైవం కర్మఫల ప్రదాత.

70. కర్మయోగం

తాను కర్తననుకోకుండ కర్మ చేయడమనేదే కర్మయోగం. కర్తృత్వబుద్ధి లేక పోయినా కర్మలు వాటంతటవే జరిగిపోతాయి. ప్రతివాడూ ఏదో ఒక ప్రయోజనం నిమిత్తం జన్మ ఎత్తుతున్నాడు. తాను కర్తనని అనుకున్నా అనుకోక పోయినా ఆ ప్రయోజనం కొనసాగి తీరుతుంది.

71. కామప్రవృత్తి నిర్మూలన

కామప్రవృత్తిని నిర్మూలం చెయ్యాలంటే, దేహమే నేననే భావాన్ని నిర్మూలం చెయ్యాలి. దేహమే నీవని అనుకుంటున్నందు వల్లనే యింకొకరిని కూడా దేహంగా చూస్తున్నావు. లింగభేద భావం అందువల్ల ఉత్పన్న మౌతున్నది. నీవు దేహాతి రిక్తమైన ఆత్మవని తెలుసుకో. ఆత్మకు లింగ భేదం లేదు. అందుచే కామప్రవృత్తి నిన్ను బాధించదు.

72. కామవినాశనం

స్త్రీ, పుం విభేదదృష్టి నశించినప్పుడే కామప్రవృత్తి నశిస్తుంది. స్త్రీ పురుషుల పరస్పర సంబంధం మనోభావానికి సంబంధించినది. ఆత్మ ప్రియమైనందువల్లనే ఏ ఇతరులైనా ప్రియులౌతున్నారని ఉపనిషత్తు చెపుతున్నది. ఆనందం మనసులోనే ఉన్నదిగాని బయటలేదు. ఆత్మప్రేమయే ప్రేమ. అది వెలుపల గాక లోపల ఉన్నది అని తెలుసుకుంటే భేదదృష్టి అంతరిస్తుంది.

73. కార్యసాధక పద్ధతి

యోగశాస్త్రం చిత్తవృత్తి నిరోధం బోధిస్తున్నది. నేను ఆత్మవిచారం చెయ్యమంటున్నాను. ఇది కార్యసాధకం. చిత్త వృత్తి నిరోధం నిద్ర, మూర్ఛ, నిరాహారవ్రతం మొదలైన వాటివల్ల కూడా కలుగుతున్నది. కాని, ఆ కారణము తొలగగానే తిరిగి చిత్తవృత్తులు యెప్పటివలె ప్రత్యక్ష మౌతున్నాయి. అవి శాశ్వతంగా తొలగేటట్లు చేసుకోవాలంటే వాటికి మూలమైన ఆత్మనిష్ఠ సంపాదించడమే కర్తవ్యం.

74. కోరికలను బలపరచరాదు

కోరికలను తీర్చినకొద్దీ సంస్కారం బలపడుతుంది. కోరికలు నిన్ను వశం చేసుకోకుండా వుండాలంటే అవి బలహీనం కావాలి. సంయమం వలన అవి బలహీనమౌతాయి గాని, కోరికలలో మునిగి తేలడం వలన కాదు. కోరికలను జ్ఞానం బలహీన పరుస్తుంది. కోరికలు మనస్సులోనివి. నీవు మనస్సు కాదని నీకు తెలుసు. ఈ జ్ఞానం కోరికలు నిగ్రహించడానికి తోడ్పడుతుంది.

75. క్రైస్తవ ధర్మం – మూర్తిత్రయం

క్రైస్తవ ధర్మంలో చెప్పబడిన మూర్తిత్రయంలో తండ్రిగా చెప్పబడిన భగవంతుడు ఈశ్వరుడు. కుమారుడుగా చెప్పబడిన భగవంతుడు గురువు. పవిత్రాత్మగా చెప్పబడిన భగవంతుడు ఆత్మ. భగవంతుడు భక్తునికి గురురూపములో సాక్షాత్కరించి - భగవంతుడాత్మస్వరూపుడనీ, అది అంతటా నిండియున్నదనీ, ఆత్మను తెలుసుకోడమే భగవంతుని తెలుసుకోడమనీ తెలియజెప్పుతాడు.

76. క్రైస్తవధర్మ రహస్యం

అహంకారం క్రీస్తు. శరీరం శిలువ. అహంకారం శిలువ వేయబడి నశించినప్పుడు, మిగిలేది పరమాత్మ. నేనూ నా తండ్రీ ఒకటేనని క్రీస్తు ప్రవచనం. పరమాత్మ రూపంలో ఇలా శేషించడమే 'రిసరెక్షన్'.

77. గార్హస్థ్య యోగ్యత

బ్రాహ్మణ వివాహ కలాపంలో కాశీయాత్ర అనేది వరుని వైరాగ్య లక్షణాన్ని సూచిస్తుంది. వైరాగ్యం కలవానికే కన్యనివ్వాలి. వైరాగ్యం కలవాడే కన్యాపరిగ్రహణం చేసి గార్హస్థ్య జీవితం గడపడానికి ఉత్తమాధికారి.

78. గురుని అనుగ్రహం

'ఓ గురూ! నీ వెల్లప్పుడూ నాలోనే వుండి, అనేక జన్మ పరంపరల వెంట నన్ను కనిపెట్టుతూ నా విముక్తి పర్యంతం నా మార్గాన్ని నిర్దేశిస్తున్నావు' అని కైవల్యోపనిషత్ లోని ఒక మంత్రం చెపుతున్నది. సమయం వచ్చినప్పుడు ఆత్మయే గురువుగా అభివ్యక్త మవుతుంది. లేనిచో ఎప్పుడూ లోపలే ఉండి యివ్వవలసిన తోడ్పాటు యిస్తూ వుంటుంది.

79. గురువు ఆత్మ

గురువు నీ వెలుపల ఉన్నాడని భ్రమిస్తున్నావు. కాదు, నీ లోపల ఉన్నాడు. వాస్తవానికి నీ ఆత్మయే నీ గురువు. ఈ యథార్థం గుర్తించి గురువును నీ లోపలనే అన్వేషించు. నీ మనస్సు బహిర్ముఖమై ఉన్నది. అందుచేత విషయములను వెలుపల ఉన్నట్టుగా చూస్తున్నది. గురువు కూడా ఆ విషయాలలో ఒకడవుతున్నాడు. కాని, సత్యం దీనికి భిన్నం. ఆత్మయే గురువు. మనస్సు నంతర్ముఖం చేస్తే విషయాలను నీ లోపలివిగానే గుర్తిస్తావు. నీ ఆత్మయే గురువనీ, ఆయనకంటె అన్యమేమీ లేదనీ తెలుసుకోగలుగుతావు.

80. గురు సాంగత్యం

గురు సాంగత్యం బాహిరము, ఆంతరము కూడ. ప్రత్యక్ష గురు సాంగత్యం మనస్సును బయటినుంచి లోపలికి నెట్టుతుంది. గురువే సాధకుని హృదయంలో గూడ ఉన్నాడు. కనుక అంతర్ముఖం కాజొచ్చిన అతని మనస్సును ఆయన లోపలినుండి హృదయంలోకి లాక్కుంటాడు.

81. చిత్తనిరోధం ప్రధానం

ప్రాణాయామమే ముఖ్య లక్ష్యం కాదు. దానిపైన ప్రత్యాహారం, ధారణ, ధ్యానం, సమాధి అనేవి ఉన్నాయి. ఇవి చిత్తనిరోధానికి సంబంధించినవి. ప్రాణాయామాభ్యాసకులకు ఇవి సులభగమ్య మౌతాయి. కనుక ప్రాణాయామ సాధనకు ముఖ్యలక్ష్యం చిత్తనిరోధమే. కొందరు ఉత్తమాధికారులు ప్రాణాయామంతో కాలం వృథాపుచ్చక, సరాసరి చిత్త నిరోధానికే కృషిచేస్తారు. కేవల ప్రాణాయామంవల్ల సాధకునికి కొన్ని సిద్ధులు కలిగితే కలుగవచ్చు.

82. చిత్త నిరోధం–శ్వాసనిరోధం

నాఽహం, కోఽహం, సోఽహం -- అనే విచారపూర్వక ప్రాణాయామం చెయ్యలేని వారికి ధ్యానాభ్యాసం శ్వాసనిరోధాన్ని కలిగించి చిత్తచాంచల్యాన్ని నిరోధించవచ్చు. చిత్త నిరోధం వల్ల శ్వాసనిరోధం దానంతటదే సిద్ధిస్తుంది. అనగా, గాలి వదలడం, పీల్చడం అనే రేచక పూరకాలతో పని లేకుండా గాలి తనంతట తానే

నిలిచిపోయే కేవల కుంభకం అలవడుతుంది. ఇది కూడా చెయ్యలేని వారికి సాధారణ ప్రాణాయామం చిత్తనిరోధం కొరకు విధించబడింది.

83. చిత్తశుద్ధి

కర్మను భగవదర్పితం చెయ్యడంవల్ల చిత్తశుద్ధి కలుగుతుంది. అయితే కర్మ చేసినప్పుడు మాత్రమే భగవంతుని స్మరిస్తే చాలదు. భగవంతుని స్మరణ నిర్విరామంగా, సంతత ప్రవాహంగా కొనసాగాలి. అప్పుడే చిత్తం విశుద్ధమవుతుంది.

84. చిత్ప్రకాశం

చిత్ప్రకాశం సూర్యప్రకాశం వంటిది కాదు. సూర్యప్రకాశం జడం. అది చీకటిని పారద్రోలి వస్తువులను ప్రకాశింపజేస్తుంది. చీకటి సూర్యుని వెలుగు ముందు నిలువజాలదు. కాని చైతన్యపు వెలుగు ముందు నిలువగలుగుతుంది. వెలుగు చీకట్లను రెంటినీ ప్రకాశింపచేయగలది చిత్ప్రకాశము. అట్లే, జ్ఞానాజ్ఞానాలను రెంటినీ ప్రకాశింపజేయగల విశుద్ధ చైతన్యమది.

85. జగత్తు శివమయం

జగత్తులో కనిపించే రూపాలు వట్టి రూపాలు కావు. చైతన్యముతో కూడిన రూపాలు. అజ్ఞాని వాటిని వట్టి రూపాలుగా చూస్తాడే తప్ప, శివుడే ఆయా రూపాలలో కనిపిస్తున్నాడని తెలుసుకోడు. ఈ రూపాలను ధరిస్తూ ఉన్న సత్పదార్థమూ శివుడే, -వాటిని తెలుసుకుంటూ ఉన్న చిత్పదార్థమూ శివుడే. అనగా, దృశ్యానికీ ద్రష్టకూ రెంటికీ కూడ అధిష్ఠానమైనవాడు శివుడు.

86. జగత్తు శివస్వరూపం

ప్రతివాడూ చైతన్య స్వరూపుడే, కనుక శివస్వరూపుడే. అతనిచే తెలియబడినదీ, తెలియబడనిదీ – సమస్తమూ శివస్వరూపమే. అయినా అజ్ఞానము వల్ల అతడు తాను చూచేది నానా రూపాత్మకమైన జగత్తు అనుకుంటున్నాడు. ఆత్మ దర్శనం అతనికి కలిగిన నాడు జగత్తు తనకంటే వేరుగా లేదని తెలుసుకొంటాడు. రూపాలు రూపాలుగా కనిపిస్తూనే వాటి వేరుతనం అంతర్ధానమౌతుంది. జగత్తు శివస్వరూపంగా గోచరిస్తుంది.

87. జగత్తు సత్యాసత్యాలు

ఆత్మకంటే వేరుగా చూడబడినప్పుడు జగత్తు అసత్యం. ఆత్మకు అభిన్నంగా, ఆత్మగా చూడబడినప్పుడు జగత్తు సత్యం.

88. జగత్స్వరూపం

చూపు అంతర్ముఖం చేస్తే జగత్తంతా పరమాత్మమయంగా కనిపిస్తుంది. జగత్తు మాయ అని అంటారు. కానీ, మాయకూడా వాస్తవానికి సత్యమే. జగత్తు సత్యమనే వారికీ, కాదనే వారికీ చూపులో మాత్రమే భేదం. ఈ వాదాలలో నీవు తగులుకొనవద్దు. లక్ష్యము అందరికీ ఒక్కటే కనుక, ఆ లక్ష్యాన్ని అన్వేషించు.

89. జన్మకర్మ లెవరివి?

జన్మకు కారణం ఏమిటంటే కర్మయని శాస్త్రాలు చెబుతున్నాయి. మరి, కర్మకు కారణమేమిటి? వెనుకటి జన్మయని

చెప్పవలసి ఉంటుంది. ఇలా వెనుకకు పోతే దీనికి అంతం అనేది ఉండదు. కనుక ఈ ధోరణిలో విచారణ చేసేకంటే జన్మ ఎవరిది, కర్మ ఎవరిది అని విచారణ చెయ్యడం సూటి పద్ధతి అని నేను చెపుతుంటాను. ఈ పద్ధతిలో 'నేను' అనే దాని మూలాన్ని అన్వేషించటం జరుగుతుంది.

90. జపధ్యానాలు

ఉచ్చరిత శబ్దాలకు మూలం ఆలోచనలు. ఆలోచనలే మనస్సు. కనుక, నోటితో జపం కంటె మనస్సుతో జపం శ్రేష్ఠం. జపం మానసికమైనప్పుడు, శబ్దోచ్చారణతో పనిలేదు. మానసిక జపమే ధ్యానమవుతుంది. ఇతరాలోచనలు కట్టిపెట్టి ఒక ఆలోచనలో లగ్నం కావడమే జపధ్యానాల లక్ష్యం. ఆ ఆలోచన కూడా తుదకు తనకు మూలమైన ఆత్మ చైతన్యంలో లీనమవుతుంది.

91. జపనిష్ఠ

బాహ్య రూపధ్యానం కంటె ఆంతరిక జపనిష్ఠ ముఖ్యం. సహజంగా, దానంతటది జరిగే పర్యంతం దానిని కొనసాగించాలి. మొదట అది ప్రయత్నపూర్వకంగా ప్రారంభమవుతుంది. కడకు దానంతటది కొనసాగే స్థితి యేర్పడుతుంది. ఇతర కార్యాలు చేస్తున్న సమయంలో కూడా జపం కొనసాగించవచ్చు.

92. జప ప్రయోజనం

సాధకుని అధికారాన్ని బట్టి సాధన ఉంటుంది. ధ్యానించడానికి ఒక రూపం కావాలొకనికి. కాని, కంటి చూపు ఒక రూపంపై నిలిపిన

మాత్రాన చాలదు. మనస్సు ఆ రూపంపై లగ్నం కావడానికి జపం సహాయకారి అవుతుంది. కొందరా రూపానికి సంబంధించిన నామంతో తృప్తి చెందుతారు. భగవంతుని గుణవిశేషాలను ఆ నామం స్ఫురింపజేస్తుంది. నిరంతర జపం ఇతరాలోచనలను త్రోసిపుచ్చి మనస్సు నేకాగ్రం చెయ్యడానికి తోడ్పడుతుంది.

93. జయాపజయాలు

జయాపజయాలు ప్రారబ్ధకర్మకు దైవమిచ్చే ఫలితాలుగాని, సంకల్పశక్తి ఫలితాలు కావు. ఒకడు కేవలం సత్కర్మలే చేస్తున్నా అపజయం పొందవచ్చు. వేరొకడు ఇందుకు విరుద్ధంగా ప్రవర్తించినా జయం పొందవచ్చు. ఇంతమాత్రాన ఇతనిలో సంకల్పశక్తి ఉన్నదనీ, అతనిలో లేదని అర్థం కాదు.

94. జాగ్రత్తు కూడా స్వప్నమే

ఈ జాగ్రదవస్థ కూడా ఒక స్వప్నమే. స్వప్నం నిద్రలో గాని రాదు. అనగా ఈ జాగ్రత్స్వప్న సుషుప్త్యవస్థలు మూడూ ఒక నిద్రలో అంతర్భాగాలు. జననమరణాలు కూడా నిద్రలోనివే. మెలకువ ఆ నిద్రలోంచి కలగాలి.

95. జాగ్రత్ - సుషుప్తి

సమాధి అనగా జాగ్రత్తులో సుషుప్తి - మెలకువలో నిద్ర - అందులో అపారమైన ఆనందమున్నది. సుస్పష్టమైన అనుభవమది. మామూలు నిద్రలో ఆనందమున్నా, అది సుస్పష్టమైన అనుభవం కాదు.

96. జీవతత్త్వం

జీవుడనబడేది వాస్తవానికి జ్ఞానస్వరూపమే. కాని, అజ్ఞానావృతుడై స్థూల దేహంతో తాదాత్మ్యం చెంది తాను దేహమే ననుకుంటున్నాడు. ఇనుపగుండు, నిప్పు - రెండూ కలిసి కాలిన ఇనుపగుండు అయినట్లు ప్రపంచము, శుద్ధజ్ఞానము, రెండూ కలిసి జీవుడవుతున్నాడు.

97. జీవస్వరూపం

ఆవరణం అజ్ఞానానికి ఒక లక్షణం. అది ఆత్మది కాదు. ఆత్మను అది ఏ విధంగానూ బాధించదు. జీవుని మాత్రమే మరుగుపరుస్తుంది. అహంకారం జడం. ఆత్మనుండి ప్రసరించిన వెలుగుతో కలిసినప్పుడది జీవుడని పిలువబడుతున్నది. అహంకారం ఆ వెలుగుతో ఎప్పుడూ కలిసే వుంటుంది. అవి విడివిడిగా కనిపించవు. ఆ రెండింటి మిశ్రమమే జీవుడు. అదే భేద జ్ఞానానికి మూలం.

98. జీవాత్మ పరమాత్మలు

పరమాత్మ దివ్యధామం చేరిన తరువాత అచటనే ఆయనను సేవిస్తూ జీవాత్మ ఉంటుందంటారు. సేవ అనే మాట పరమాత్మను మోసగించగలదా? వీరి సేవకొరకే ఆయన వేచి ఉన్నాడా? 'నాకు సేవ చెయ్యాలనుకునే మీరు నా కంటె వేరుగా ఉన్నారా ఏమి' టని శుద్ధ చైతన్య స్వరూపుడైన ఆయన వారిని ప్రశ్నింపడా?

99. యెహోవా

యెహోవా అంటే 'నేను ఉన్నాను' అని అర్థం. భగవంతుని గురించి ఇంత సూటిగా చెప్పే మాట ఇంకొకటి లేదు. 'బ్రహ్మైవాహం', 'అహం బ్రహ్మాస్మి', 'సోऽహం' కంటె సూటిగా బైబులులోని 'నేను యెహోవా?' అనే పదం భగవత్స్వరూపాన్ని నిర్వచిస్తున్నది. ఉన్నది ఏదో అదే తాను. అదే భగవంతుడు. తనను తెలుసుకుంటే భగవంతుని తెలుసుకున్నట్లే. భగవంతుడు తనకంటె వేరుకాదు.

100. జ్ఞానచక్షువు

జ్ఞాన చక్షువంటే పంచేంద్రియాల వంటిదే, ఇది కూడా ఒక యింద్రియమనుకోరాదు. జ్ఞానమే చక్షువు. టెలివిజన్ మొదలైనవి జ్ఞానచక్షు వ్యాపారములు కావు. జ్ఞాత, జ్ఞేయం అనే విభేదం ఉన్నంతవరకూ అది సాపేక్ష జ్ఞానమే. నిరపేక్ష జ్ఞానం కాదు. నిరపేక్ష జ్ఞానం జ్ఞాతృ జ్ఞేయాలకు మూలమైనది. అజ్ఞానంచేత జ్ఞాతయే మూలవస్తువనుకుంటారు. జ్ఞాత త్రిపుటిలో ఒక భాగం. సత్యం జ్ఞాతృ జ్ఞేయముల కతీతమైనది.

101. జ్ఞానదృష్టి

నేను శరీరాన్ని అనే అనుభవం జ్ఞానికీ, అజ్ఞానికీ గూడ ఉంటుంది. అయితే అజ్ఞాని తన శరీరానికే ఆత్మ పరిమితమై ఉన్నదని విశ్వసిస్తాడు. జ్ఞాని తన శరీరం ఆత్మకంటె వేరుగా లేదని భావిస్తాడు. అతని దృష్టిలో ఆత్మ అనంతం. అందు శరీరం కూడా చేరి ఉన్నది – తాత్కాలికంగా.

102. జ్ఞాన ప్రాణాయామం

ఆత్మవిచార సాధనలో నాహం, – నేనీ శరీరేంద్రియ సంఘాతం కాదు, – అనేది ప్రాణాయామంలో రేచకం వంటిది. కోऽహం, – నే నెవరిని, – అనే అన్వేషణ పూరకం వంటిది. సోऽహం, – నేను బ్రహ్మమును, – అనేది కుంభకం వంటిది. కనుక ఇది జ్ఞాన ప్రాణాయామం. దీనిలో, న – అహం, క – అహం, స – అహం, అనే మూడింటిలోనూ గల ఉపసర్గలను వదలివేసి, మూడింటికీ సామాన్యమైన 'అహం' ను పట్టుకో. అదే ఇందలి ముఖ్య సారాంశం.

103. జ్ఞానమంటే

జ్ఞానమంటే సత్యాన్ని అనుభూతం చేసుకోడమే. అది ధ్యానం వలననే సాధ్యమవుతుంది. ఇతర భావాలన్నింటినీ వర్జించి సత్యాన్ని అనుభూతం చేసుకోడానికి తోడ్పడుతుంది ధ్యానం.

104. జ్ఞాని అకర్తృత్వం

దేహాత్మబుద్ధిని అతిక్రమించినవాడే జ్ఞాని. జ్ఞానికి కర్తృత్వం లేదు. కర్మ లేదు. కాని అజ్ఞాని, జ్ఞానిని దేహిగానే చూస్తున్నందువల్ల, జ్ఞాని దేహం పనిచేస్తుంటే జ్ఞానే పని చేస్తున్నాడనుకొంటాడు.

105. జ్ఞానిని తెలిపే లక్షణం

జ్ఞాని తత్త్వం జ్ఞానికే తెలుస్తుంది. జ్ఞానియే మరియొక జ్ఞానిని అర్థం చేసుకోగలుగుతాడు. ఇతరులు జ్ఞానిని గుర్తించి అతని గొప్పతనం అర్థం చేసుకోవాలంటే, అతని పరిసరంలో నిండుకొని

ఉండే శాంతి ఒక్కటే అందుకు ఉపాయం. మాటలను బట్టీ, చేతలను బట్టీ అతని గొప్పదనం తెలియ వీలుపడదు. అవి సామాన్యులు అర్థం చేసుకోలేనివిగా ఉంటాయి.

106. జ్ఞాని నిశ్చలత్వం

అతి వేగంగా తిరిగే బొంగరం నిశ్చలంగా ఉన్నట్లు చూపులకు కనిపిస్తుంది. కన్ను దాని వేగాన్ని అందుకోలేక పోవడమే ఇందుకు కారణం. అట్లే, జ్ఞాని నిశ్చలుడుగా కనిపించినా, ఆ నిశ్చలత్వం మాటున తీవ్రమైన కర్మణ్యత్వమున్నది. సామాన్య జనులు అది జడత్వమని పొరపాటు పడతారు.

107. జ్ఞాని స్థితి – బాలుని స్థితి

జ్ఞానిని బాలునితో పోల్చారంటే, అతని స్థితి బాలుని స్థితిని పోలి వుంటుందని అర్థం. బాలునియందు అహంకారం వుండదు. అట్లే జ్ఞానికూడ అహంకార వర్జితుడు. కాని, అంత మాత్రాన బాలుడు జ్ఞాని కానేరడు. జ్ఞానివలె బాలుడు జ్ఞాన ప్రబోధం కలుగజెయ్యడు. బాలునిలో అహంకారం గుప్తమై వుండి క్రమేణా అభివ్యక్తమౌతుంది. జ్ఞానిలో అది పూర్తిగా నశించిపోతుంది.

108. జ్ఞాని మనస్సు

సూర్యుని వెలుగు ముందర చంద్రుడు చిన్న తెల్లమబ్బు తునకవలె ఉంటాడు. జ్ఞాని మనస్సు కూడా ఇలా సూర్యుని వెలుగు ముందు చంద్రుని వంటిదే. ఉండడానికి ఉన్నా అది తన వెలుగును మాత్రం చూపుకోదు.

109. జ్ఞాని – శారీరక బాధ

ఏదైనా పురుగు కుడితే, అజ్ఞానికి వలెనే జ్ఞాని దేహానికి కూడా బాధ ఉన్నట్లు కనబడవచ్చు. కాని దానిలో తేడా ఉన్నది. అజ్ఞాని దేహమే తాననుకుంటాడు. జ్ఞాని సర్వమూ ఆత్మమయమని లేక సర్వమూ బ్రహ్మమని తెలుసుకొని వుంటాడు. బాధవుంటే ఉపాధికి వుండు గాక. అది గూడ ఆత్మలో భాగమే. ఆత్మ పరిపూర్ణం.

110. జ్ఞాని స్థితి

జ్ఞాని స్థితి నిద్రకాదు, మెలకువా కాదు. రెండింటికీ మధ్యగా వుండే స్థితి. మెలకువలోని ఎరుక, నిద్రలోని ప్రశాంతి దానిలో ఉంటాయి. 'జాగ్రత్ – సుషుప్తి' అన్నారు. మెలకువతో కూడిన నిద్ర, నిద్రతో కూడిన మెలకువ, నిద్ర లేని మెలకువ, మెలకువలేని నిద్ర, – ఇలా దానిని ఏ విధంగానైనా పిలవండి. విడివిడిగా అది నిద్రవంటిది గాని, మెలకువవంటిది గాని కాదు. అతి జాగ్రత్తు, లేక అతి సుషుప్తి అని కూడ దానిని పిలువవచ్చు. విశుద్ధమైన ఎరుక, విశుద్ధమైన ప్రశాంతి, దానిలో మిళితమై వుంటాయి.

111. జ్ఞానుల కుండలిని

యోగులు కుండలినీశక్తి అనేదీ, భక్తులు భగవదాకారవృత్తి అనేదీ, జ్ఞానులు బ్రహ్మాకారవృత్తి అనేదీ ఒకటే. హృదయమే జ్ఞానమార్గంలోని కుండలిని. అది తామరమొగ్గగా, సర్పాకృతిగా, నాడీ కేంద్రంగా – అనేక విధాలుగా వర్ణితమయింది. 'అహంవృత్తి'కి అదే మూలం.

112. 'తత్త్వాల' పరిశీలన

ఆత్మ స్వయంప్రకాశకం. ఆత్మను తెలుసుకోడానికి 'తత్త్వా'లను విచారణ చేయనక్కర లేదు. కొందరు ఈ తత్త్వాలు ఇరువదినాలుగంటారు. మరికొందరు ఇంకొక రీతిగా చెప్తుతారు. అత్మ ఉనికి తెలుసుకోడానికి ఈ తత్త్వాలను తెలుసుకోడం అవసరమా? ఆత్మ వీటికి అంటుకొనే వస్తువు కాదని తెలుపడానికి శాస్త్రాలు వీటిని వివరించాయి. కాని, సాధకుడు ఈ తత్త్వ పరిశీలన చెయ్యకుండానే సరాసరిగా ఆత్మ ఉనికిని గుర్తించి తాను అదిగా ఉండడానికి ప్రయత్నించవచ్చు.

113. తురీయం

అవస్థలు మూడే -- జాగ్రత్, స్వప్న, సుషుప్తులు. తురీయం నాల్గవ అవస్థ కాదు. అది పై మూడవస్థలలోనూ అనుస్యూతంగా ఉండేది. సమస్త ఘటనలకూ అధిష్ఠానం, దానికంటె వేరుగా ఏదీ లేదు. అది నీ నిజస్వరూపం. మూడు అవస్థలూ దానియందే ఒక దాని వెనుక ఒకటి గోచరించి తిరిగి దానియందే లయమవుతాయి. కనుక అవి మిథ్యలు.

114. తురీయానుభూతి

ఆత్మకు మరొక పేరే తురీయం. జాగ్రత్, స్వప్న, సుషుప్తి అవస్థలను తెలుసుకొంటూ మనం మన ఆత్మనే తెలుసుకోలేక పోతున్నాం. కాని యథార్థానికి ఆత్మ నిత్య ప్రత్యక్ష వస్తువు. అదొక్కటే సత్యం - తక్కినదేదీ కాదు. శరీరంతో తాదాత్మ్యం

ఉన్నంతవరకూ ప్రపంచం మనకు వెలుపల వున్నట్టు కనిపిస్తుంది. ఆత్మను తెలుసుకున్ననాడు అలా కనిపించదు.

115. తెంపులేని ఎరుక

తెంపులేని ఎరుకయే ఆత్మ. ఆత్మస్వరూపాన్ని అట్టి ఎరుకగా తెలుసుకోడమే ఆత్మవిచారానికి లక్ష్యం. భేదభావం కలిగి వున్నంతకాలం సాధకుడు ఆత్మవిచారం కొనసాగించవచ్చు. ఆత్మసిద్ధి కలిగిన తర్వాత ఇక విచారంతో పనిలేదు. ఎరుక ఎవరిదనే ప్రశ్నకు ఆ ఎరుకలో తావుండదు. ఎరుక అచ్చమైన ఎరుకగానే ఉండిపోతుంది.

116. దుఃఖ నివృత్తి

దుఃఖ నివృత్తికి రెండే ఉపాయాలు. నీవు అశక్తుడవనుకొని భగవత్సహాయం అపేక్షించే సందర్భంలో భగవంతుని శరణు పొందు. అలా కాని పక్షంలో దుఃఖకారణం విచారణ చేసి మూలమరసి నీ ఆత్మలో లీనం చెందు. దుఃఖం వీటిలో ఏ ఉపాయంచేతనయినా నివృత్తమౌతుంది.

తాను కర్తననుకొన్న వాడే సుఖదుఃఖాలు అనుభవిస్తాడు. అన్నీ భగవంతుడే చేయిస్తున్నాడనీ, తాను నిమిత్త మాత్రుడననీ ఎల్లప్పుడూ భావించగలవాడు సుఖ దుఃఖాలకు అతీతుడు కాగలుగుతాడు. వ్యక్తిత్వం నశించనంతవరకూ దుఃఖనివృత్తి కాదు. సదసత్కర్మలు రెండూ భగవంతునివే అయినప్పుడు, సుఖదుఃఖాలు మాత్రం వేఱుగా నీవి అని ఎందుకనుకోవాలి?

117. దృష్టి - ద్రష్ట

భ్రూమధ్యంలో దృష్టి నిలిపే అభ్యాసం చేసేవారు ద్రష్టను మరువకుండా వుండడం అవసరం. ద్రష్టను ఎల్లప్పుడూ గుర్తులో వుంచుకుంటే ఇక అంతా సవ్యంగానే ఉంటుంది.

118. దేహజ్ఞానం - సమాధి

దేహజ్ఞానమున్నప్పుడు దేహముండాలి. దానికి పరిమితమైన జ్ఞానం వుండాలి. రెండూ కలసి దేహజ్ఞానమవుతుంది. దీనికతీతంగా, స్వతంత్రమైన – నిరపేక్షమైన మరొక జ్ఞానం వున్నది. దానినందుకోడమే సమాధి. దేహజ్ఞానం లేనప్పుడు వున్నప్పుడు కూడా అది వుంటుంది. అది లభించినప్పుడు దేహజ్ఞానం వుంటేనేమి, లేకపోతే నేమి? ఉంటే అది బాహ్య సమాధి, లేకపోతే అది అంతస్సమాధి అవుతాయి.

119. దైవం - గురువు - ఆత్మ

దైవం – గురువు – ఆత్మ, మూడూ ఒకే వస్తువు యొక్క భిన్నరూపాలు. నిన్ను నీవు ఒక వ్యక్తిగా భావించుకుంటున్నంత కాలం నీకు దైవమందు విశ్వాసముంటుంది. దైవారాధన చెయ్యగా చెయ్యగా, దైవం నీకు గురురూపంలో ప్రత్యక్షమౌతుంది. అట్లే, గురుసేవ చెయ్యగా చెయ్యగా గురువు నీకు ఆత్మగా సాక్షాత్కరిస్తాడు.

120. దైవపూజ

ధర్మశాస్త్రాల్లో చెప్పినట్లుగా ప్రతిదినం దైవపూజ చెయ్యడం ఎప్పుడూ మంచిదే. మనస్సును నిర్మలం చెయ్యడానికది దోహదం చేస్తుంది. సాధనలో వున్నతస్థాయికి చేరుకున్నందువల్ల తనకిక పూజతో అవసరం లేదని అనుకున్నప్పటికీ సాధకుడు యితరుల కోసమైనా దానిని చెయ్యడం అవసరం. తన పిల్లలకు, తన కుటుంబంలోని వారికి అది ఆదర్శప్రాయంగా ఉంటుంది.

121. దైవ సాక్షాత్కారం

దైవసాక్షాత్కారమనేది ఇష్టదేవతారూపంలో విషయీభూతమైన ఆత్మసాక్షాత్కారమే కాని, వేరు కాదు. కనుక ఆత్మను తెలుసుకో.

122. ధ్యాన స్థానం

నీ వున్నావనేది కాదనరాని యథార్థం. ధ్యానం నిన్ను గురించి నీచేత నీలోనే జరగాలి. కనుక ధ్యానానికి నీవే కేంద్రం. అదే హృదయం. హృదయమొక భావం కాదు, లక్ష్యం కాదు. కాని అది ధ్యానస్థానం. ఆత్మ తానొక్కటియై వెలుగొందుతూ వుంటుంది. హృదయంలో నీవు శరీరాన్ని చూస్తావు. సకల ప్రపంచం అందులో వుంది. దానికంటె వేరైనది ఏదీ లేదు. కనుక అన్ని సాధనలూ అక్కడే జరగాలి.

123. ధ్యానబల సంసిద్ధి

కొందరు తమ యెదుటనున్న విగ్రహమందు దివ్యత్వ భావన కలిగి దానిని సచేతనంగా దర్శిస్తారు. కొందరు మనస్సు లోపల

దివ్యత్వ భావనచే మానసిక విగ్రహాలను దర్శించగలుగుతారు. రెండూ కూడ బలమైన ధ్యానవికాసాన్నే సూచిస్తాయి. రెండు సందర్భాలలోనూ అనుభూతి ఆంతరికమే.

124. ధ్యాన యుద్ధం

ధ్యానమొక యుద్ధం వంటిది. ధ్యానం ప్రారంభించగానే ఇతర భావాలు వచ్చి ముసురుకొని నీ లక్ష్యాన్ని చెదరగొట్ట జూస్తూ వుంటాయి. సంతతాభ్యాసం వల్ల నీ ముఖ్య భావానికి బలం కలిగినప్పుడు యితర భావాలు దుర్బలములై పలాయనం చిత్తగిస్తాయి.

125. ధ్యానసాధనలో పురోగతి

అక్కరలేని తలపులు రాకుండా వుండడం – కావలసిన ఒకే తలపుపై మనస్సుకు ఏకాగ్రనిష్ఠ కుదరడం, ఇవి ఎంతెంతగా చేకూరితే, అంతంతగా సాధకుడు ధ్యానసాధనలో ముందుకు సాగుతున్నట్లు పరిగణించవలసి ఉంటుంది. ఇతరమైన అనుభవాలేవీ ఇందుకు ప్రమాణములు కావు.

126. ధ్యానం – భక్తి – జపం

ధ్యానం, భక్తి, జపం మొదలైనవి చిత్తవృత్తుల వైవిధ్యం తొలగించడానికి సాధనాలు. వాటివలన ఒకే చిత్తవృత్తి ప్రబలి, తుదకు అది కూడా ఆత్మయందు లీనమౌతుంది.

127. ధ్యానం – మనోనిగ్రహం

విషయత్యాగరూపమైన మనోనిగ్రహం లేనిదే ధ్యానం కుదరదు. ధ్యానం కుదరనిదే మనోనిగ్రహం అలవడదు. ఈ చిక్కు వున్నమాట నిజమే. రెండూ ఒకదానిపై ఒకటి ఆధారపడి వున్నాయి. కనుక, సాధకుడు రెంటినీ సాధన చెయ్యాలి. అభ్యాస వైరాగ్యాలవల్ల క్రమేణా సత్ఫలితాలు చేకూరుతాయి. మనస్సును బహిర్ముఖం కాకుండా చెయ్యడానికి, అంతర్ముఖంగా వుంచడానికి అభ్యాసం తోడ్పడుతుంది.

128. ధ్యానం – విచారం

ధ్యానం వేరు, విచారం వేరు. తక్కిన విషయాలు వదలి ఒక్క విషయంపైన మనస్సు లగ్నం చెయ్యడం ధ్యానం. అన్ని విషయాలు వర్జించి, తాను తానుగా, విషయంలేని విషయిగా వుండిపోవడం విచారం. ఆత్మవిచారం, ఆత్మసాక్షాత్కారం రెండూ ఒక్కటే. ఆత్మ క్రొత్తగా సంపాదించుకునేది కాదు. నిత్యసిద్ధంగా వున్నదే. అడ్డంగా వున్న ఆలోచనలనే తెరను తొలగదీయడమే కావాలి.

129. ధ్యానస్వరూపం

చిత్తవృత్తులను తరిమి వెయ్యడమే ధ్యానం. మనకున్న బాధలన్నీ చిత్తవృత్తుల మూలాన్నే కలుగుతున్నాయి. ఆ బాధలు కూడా చిత్తవృత్తులే. చిత్తవృత్తులను త్యజించడమే ధ్యానం. అదే సుఖం. చిత్తవృత్తుల రూపమైన భావాలు భావించేవానివి. ఆ భావించే వాని ఆత్మస్వరూపంగా నీవు వుండిపో. అప్పుడు భావాలు అంతరించిపోతాయి.

130. ధ్యానాభ్యాసం

ఆత్మధ్యానాభ్యాసానికి ప్రారంభదశలో, మనకు తెలియకుండానే ఇతర విషయాల మీదికి పరుగెత్తిన మనస్సు దీర్ఘకాలానికి గాని తిరిగిరాదు. అభ్యాసం చెయ్యగా చెయ్యగా, క్రమేణా తొందర తొందరగా తిరిగి వస్తూ, తుదకు చలించకుండా నిలచిపోతుంది. మనలో నిద్రాణమై వున్న శక్తి ప్రబుద్ధమయ్యేది అప్పుడే.

131. ధ్యానాలంబనం

ధ్యానమంటే ఇతర భావాలన్నీ త్రోసిపుచ్చి ఒక్క భావాన్ని అవలంబించడం. నీకు అత్యంత ప్రియమైన దానిని నీ ధ్యానానికి ఆలంబనంగా తీసుకో. ధ్యానానికి స్థిరత్వమిచ్చి యితర భావాలను త్రోసిపుచ్చడానికది తోడ్పడుతుంది.

132. నగ్నసత్యం

ఆత్మకంటె - అనగా తాను అనే దానికంటె నిత్య ప్రత్యక్షానుభవసిద్ధమైన సత్యం వేరొకటి లేదు. కాని, జనులీ నగ్న సత్యాన్ని గాక, స్వర్గం, నరకం, పునర్జన్మ మొదలైన గుహ్య విషయాలు తెలుసుకోవాలన్న ఉబలాటం చూపుతూ ఉంటారు. మతాలు అలాగే వారి ఉబలాటం తీరుస్తూ వున్నా, వాటి పరమలక్ష్యం మాత్రం వారి దృష్టిని తమ ఆత్మపై కేంద్రీకరింప చెయ్యడమే. తిరిగి తిరిగి ఎప్పటికైనా నీవు తుదకు నీ ఆత్మ కడకు చేరుకోవలసినదే. అయినప్పుడు, ఇప్పుడే, ఇక్కడనే ఆత్మస్థుడవు కావడానికి నీవెందుకు ప్రయత్నించరాదు?

133. 'నమః' అంటే

నీవు చేసే జపంలో 'నమః' అనే మాటకు అర్థం ఏమిటి? ఆత్మకంటె వేరుగా మనస్సు అభివ్యక్తం కాని స్థితిని ఆ మాట సూచిస్తుంది. ఆ స్థితి చేకూరినప్పుడు, ఇక జపం పూర్తి అయినట్లే. ఆ స్థితిలో కర్త వుండడు. కర్మకూడా ఉండదు. నిత్యసత్యమైన ఆత్మ ఒక్కటే మిగులుతుంది; ఆ స్థితి వచ్చేటంతవరకూ జపం చెయ్యవలసినదే.

134. నమస్కారం

అహంకారం అణగిపోవడమే నమస్కారం. అణగడమంటే, దాని మూలంలోకి లీనమై పోవడమన్న మాట. భగవంతుడు బయటి సాష్టాంగ ప్రణామాలకు మోసపోడు. అహంకారం వున్నదా లేదా అని పరిశీలిస్తాడు.

135. నమస్కారం - ప్రసాదం

నీ కర్తవ్యం నీవు నిర్వహించడమే భగవంతునికి నిక్కమైన నమస్కారం. శ్రద్ధాభక్తులతో కర్తవ్య నిర్వహణకంటే ఉత్తమమైన భగవత్సేవ మరి లేదు. అట్లే, నీవు ఏది భుజించినా అహంకార వర్జితుడవై భుజించు. అపుడు నీవు భుజించేది ప్రతీదీ భగవత్ప్రసాదమే అవుతుంది.

136. నామ సంకీర్తనం

ఆత్మవిచార సాధన చేసేటప్పుడు నిద్ర వచ్చేటట్లుగా వుంటే నామసంకీర్తనం చెయ్యి. నిద్రలో నామసంకీర్తనం కొనసాగదు కదా

అనే సంశయం నీకక్కరలేదు. మెలకువగా వున్నంతసేపూ నామసంకీర్తనం చెయ్యి. తిరిగి నిద్రలోంచి మేల్కొనడంతోనే మొదలుపెట్టి కొనసాగించు. సాధన మేల్కొని వున్నవానికి గాని, నిద్రించేవానికి గాదు.

137. నిద్ర – మెలకువ

ధ్యానం చేసేటప్పుడు నిద్రవంత్తులో పడిపోకుండా జాగ్రత్తపడాలి. కొంతసేపటికి మెలకువ వచ్చే నిద్ర నిజమైన నిద్రకాదు. కొంతసేపటికి నిద్రవచ్చే మెలకువ నిజమైన మెలకువ కాదు. ఇప్పుడు నీది మెలకువయేనా? కాదు. నిజమైన మెలకువ నీకింకా రావలసి ఉంది. నీవు అబద్ధపు నిద్రపోరాదు. అబద్ధపు మెలకువలో వుండగూడదు. 'లయే సంబోధయే చ్చిత్తం, విక్షిప్తం శామయేత్పునః'––అంటే ఏమిటి? పై రెండవస్థల్లో దేనిలోనూ పడకుండా వాటి మధ్య నీ స్వరూపంలో నీవుండిపోవాలి.

138. నిర్వాణం

నిర్వాణ మనగా పూర్ణత్వం. పూర్ణస్థితిలో విషయము విషయి రెండూ లేవు. చూడడమూ లేదు. తెలుసుకోడమూ లేదు. చూడడం, తెలుసుకోడం అనేవి మనఃప్రవృత్తులు. నిర్వాణంలో, లా నున్నాననే విశుద్ధానంద చైతన్యం తప్ప ఇంకేమీ వుండవు.

139. నిషేధ సాధన

నేను శరీరం కాదు, ఇంద్రియాలు కాదు, ప్రాణవర్గం కాదు. మనస్సు కాదు – అని నిషేధపూర్వకంగా సాధన చెయ్యడం వున్నది.

కాని, ఈ నిషేధం చేస్తున్న 'నేను' ఎవరు? అదే అహంకారం. అదే తక్కిన భావాలన్నిటికీ మూలం. ఆ మూలాన్ని పెకలిస్తే తక్కినవన్నీ వాటంతటవే పెళ్ళగిలిపోతాయి. విశుద్ధమైన ఆత్మ ఒక్కటే మిగులుతుంది.

140. నీ నిజస్వరూపం

నీ నిజస్వరూపమేది? చిత్తవృత్తి సహితమైనదా, చిత్తవృత్తి రహితమైనదా? జాగ్రత్, స్వప్న, సుషుప్తులు మూడింటిలోనూ నీవున్నావు. చిత్తవృత్తులు జాగ్రత్, స్వప్నాలలోనే కాని సుషుప్తిలో లేవు. నీ వునికి మూడింటిలోనూ వున్నది. ఉనికి అవిచ్ఛిన్నం. చిత్తవృత్తులు అలా కాదు. వాటికి విచ్ఛిత్తి వున్నది. కనుక ఏది శాశ్వతమైనది? వునికియే. అదే నీ నిజస్వరూపం. చిత్తవృత్తి రహితమైన వునికి అది. దానిని తెలుసుకో.

141. 'నేను' ఉండే తావు

'నేను' అనే దానికి తావు తల కానేరదు. నిద్ర వచ్చినప్పుడు తల ఒరుగుతుంది. తిరిగి మెలకువ వచ్చినప్పుడు లేస్తుంది. 'నేను' అనేది యెప్పుడూ ఉండేది కనుక, ఒకప్పుడు ఒరిగి ఒకప్పుడు లేచే తల దానికి తావు కానేరదు.

142. 'నేను' తెలియడం ఎలా?

'నేను' అనేది ఎవరో, ఎవరికి వారు లోపల అన్వేషించి తెలుసుకోవలసినదే కాని, ఒక వస్తువును చూపినట్లు ఇదిగో అని ఒకరు ఇంకొకరికి చూపించడానికి వీలైనది కాదు. గురువు మార్గం

మాత్రమే నిర్దేశించగలడు. ఆ మార్గాన పోయి 'నేను'ను తెలుసుకోవలసినది సాధకుడే.

143. 'నే'నెవరనే అన్వేషణ

'నే'నెవరనే అన్వేషణ హృదయధ్యానంకంటె భిన్నమైనది. గాఢనిద్రలోనూ, మెలకువలోనూ అంతటా వున్నది ఒకటే. కాని, మెలకువలో సుఖరాహిత్యమూ, దానిని తొలగించుకోవాలన్న ప్రయత్నమూ వుంటున్నాయి. నిద్రలోంచి మేల్కొన్న దెవరని ప్రశ్నిస్తే 'నే' నని నీవు సమాధానం చెబుతున్నావు. ఆ 'నే'నెవరో వెదకి పట్టుకోడమే యిప్పుడు చేయవలసిన పని. అలా చేసినప్పుడు, ఆ నిత్యవస్తువు స్వయంగానే నీకు తెలియబడుతుంది.

144. పట్టుకోవలసిన 'నేను'

నిద్రలోంచిమేల్కొనేసమయంలో, ప్రపంచస్ఫురణ ఇంకా కలుగక ముందు శుద్ధమైన 'నేను' భాసిస్తూ ఉంటుంది. నిద్రలోకిపోకుండానూ, ఇతరాలోచనలు వచ్చి నిన్ను ఆక్రమించనివ్వకుండానూ ఆ 'నేను'ను పట్టుకో. భద్రంగా దానిని నీవు పట్టుకోగలిగిన తరువాత, ఇక ప్రపంచం కనిపించినా ఇబ్బందిలేదు. దృశ్యం దృష్టినెంతమాత్రమూ బాధించబోదు.

145. పతంజలి ప్రథమ సూత్రం

'యోగశ్చిత్తవృత్తి నిరోధః' – అనే పతంజలి మొదటి సూత్రం అన్ని యోగ పద్ధతులకూ వర్తిస్తుంది. చిత్తవ్యాపారాలు లేకుండా చేసుకోడమే కావలసినది. ఆ లక్ష్యసాధనకు చేసే ప్రయత్నాన్నే యోగమని పిలుస్తారు.

146. పరమాత్మ జడమా?

పంచదార తన తీపి తాను తెలుసుకోలేదనీ, దానిని రుచి చూచేవాడు వేరుగా వుండాలనీ, అట్లే పరమాత్మ స్థితిలోని ఆనందం అనుభవించడానికి జీవాత్మ వేరుగా వుండాలనీ కొందరంటారు. పరమాత్మ పంచదారవంటి జడపదార్థమా? పరమానందానుభవానికై తనను తానొకవైపున అర్పించుకుంటూ తన వ్యక్తిత్వాన్ని నిలుపుకోడం ఎలా సాధ్యం?

147. పరమాత్మ శరీరత్వం

ఆనందం అనుభవించడానికి వ్యక్తిత్వం అవసరమనీ, కనుక అహంవృత్తి కోల్పోరాదనీ విశిష్టాద్వైతులంటారు. కాని, తాను శరీరం కాదని శరీరాన్ని త్రోసిపుచ్చిన తర్వాత, తిరిగి తాను వేరొకరికి (పరమాత్మకు) శరీరం కావడం దేనికి? ఒక శరీరం అనాత్మ అయితే ఇతర శరీరాలు కూడా అనాత్మలే. ప్రపత్తితో పరమాత్మకు నిన్ను నీవు అర్పించుకొన్నప్పుడు నీవిక ఆయనవాడవే గాని నీవాడవు కాదు. ఆయనకు శరీరం కావలసివస్తే అది ఆయనకు సంబంధించిన విషయం. ఆయన శరీరం కలిగినా అశరీరి అని నీవు చెప్పనక్కర లేదు.

148. పరలోక రాజ్యం

ఈ ప్రపంచమూ, బైబిలులో చెప్పిన పరలోకరాజ్యమూ వేర్వేరు లోకాలు కావు. 'పరలోక రాజ్యం నీలో వున్నది', అంటున్నది బైబిలు. అది నిజం. జ్ఞాని ఈ ప్రపంచాన్నే పరలోక

రాజ్యంగా చూస్తాడు. అజ్ఞానికి ఇది ప్రపంచంగా మాత్రమే కనిపిస్తుంది. భేదం చూపునుబట్టి ఏర్పడినదే కాని వేరుకాదు.

149. పంటినొప్పి

పంటినొప్పి మానసికమా! అవును, మానసికమే. ఇతరాలోచనలలో నిమగ్నమై వున్నప్పుడు పంటినొప్పి కనిపించదు. నిద్రలో వున్నప్పుడు కూడా పంటినొప్పి లేదు. అయినా, పంటినొప్పి వాస్తవమన్న భావం పోవడం లేదంటే, ప్రపంచం వాస్తవమన్న భావం మనలో అంత గట్టిగా పాదుకొని వుండడంవల్లనే. ఒక పట్టాన ఆ భావం తొలగిపోదు. అయినా అంతమాత్రాన జీవునివలెనే ప్రపంచమున్నూ వాస్తవం కాబోదు.

150. పాప పుణ్యాలు

'నేను శరీరమును' అనే భావంలో మునిగి వుండేవాడు మహాపాపి, అతడు ఆత్మహంతకుడు. 'నేను ఆత్మను' అనే అనుభవం కంటె మించిన పుణ్యం మరొకటి లేదు. అట్టి అనుభవపూర్వకమైన ధ్యానం ఒక్క క్షణం కుదిరినా సంచితకర్మనంతనీ హతం చేసివేస్తుంది. చీకటిని పారద్రోలే సూర్యునివంటిదది. పైన పేర్కొన్న ధ్యానంలో నిరంతరం వుండగలిగేటట్లయితే దానిముందు యెంతటి ఘోరపాతకమైనా నిలువడం అసంభవం కాదా?

151. పూర్ణతత్త్వానికి మొదటి పేరు

అఖండం, అనంతం అయిన పూర్ణతత్త్వం 'నేను' అని తనను తాను తెలుసుకుంటున్నది. అదే దాని మొట్టమొదటి పేరు. తక్కిన పేర్లన్నీ - ఓం, మొదలైనవి - తరువాత వచ్చినవి. తనను తాను తెలియడమే ముక్తి. 'అహం బ్రహ్మాస్మి' అనే మహావాక్యం దానికి ప్రమాణం. 'నేను' ఎప్పుడూ అనుభూతమవుతూనే వున్నా, అది తెలుసుకోడానికి గుర్తుచేయవలసి వస్తున్నది. ఉపనిషత్తులు, జ్ఞానులు చేసేది అదే.

152. ప్రకృతి పురుషులు

ఒకే పరతత్త్వాన్ని రెండుగా విభజించి ప్రకృతి పురుషులుగా చెపుతున్నారు. మనలో ద్వైతభావం పాతుకొని వుండడాన్ని బట్టి చేసిన విభాగమది. ప్రకృతి పురుషులను గురించి చెప్పిన గీతయే ఆ రెంటికీ అతీతంగా పురుషోత్తముడున్నాడని కూడ చెప్పింది.

153. ప్రత్యక్షజ్ఞానం

ఇంద్రియాలచే తెలుసుకోబడిన విషయజ్ఞానం ప్రత్యక్ష జ్ఞానమని చెప్పబడుతోంది. కాని ఆత్మకంటె ప్రత్యక్ష వస్తువు ఏదైన వుంటుందా? ఇంద్రియ సహాయం ఏమీ లేకుండానే ఎప్పుడూ అనుభూతమయ్యే వస్తువది. ఇంద్రియజ్ఞానం నిజానికి పరోక్షజ్ఞానమే గానీ ప్రత్యక్షజ్ఞానం కాదు. ఆత్మజ్ఞానమొక్కటే - అనగా తనను గురించిన ఎరుక ఒక్కటే ప్రత్యక్షజ్ఞానం.

154. ప్రత్యక్ష పరోక్ష వృత్తులు

'అహం బ్రహ్మాస్మి' (నేను బ్రహ్మమును) అనేది ప్రత్యక్షవృత్తిని సూచించగా 'బ్రహ్మైవాహం' (బ్రహ్మమునే నేను) అనేది పరోక్ష జ్ఞానాన్ని సూచిస్తుంది. మొదటిది అహం (నేను) తెలుసుకోడంతో

ప్రారంభంకాగా, రెండవది పరోక్షంగా విన్న బ్రహ్మజ్ఞానంతో ప్రారంభమౌతుంది. బ్రహ్మము ఆత్మకంటె వేరు కానేరదు.

155. ప్రత్యక్షానుభవం

జీవుడు, ఈశ్వరుడు ఒక్కటే అన్నప్పుడు జీవుడు ప్రత్యక్ష వస్తువు. ఈశ్వరుడు పరోక్ష వస్తువు. ప్రత్యక్షానుభవమే నీకు వుపయోగపడేది గనుక ముందు నీవెవరో తెలుసుకో. పరోక్షానుభవం ఉపలబ్ధి కానేరదు. నిన్ను నీవు తెలుసుకున్నప్పుడే అది ఉపలబ్ధి అవుతుంది.

156. ప్రథమ కర్తవ్యం

అద్వైతులుగాని, విశిష్టాద్వైతులుగాని అంతా అహంకారం నశించాలనే విషయంలో ఏకీభవిస్తున్నవారే. కనుక, దానికొరకై ముందు ప్రయత్నించడం మంచిది. ఆత్మ సాక్షాత్కారం వేరు, పరమాత్మ సాక్షాత్కారం వేరు. అది దీనికి సోపానం అని తర్జనభర్జనలు పడనక్కరలేదు. ఆత్మలు రెండు లేవు. ముందు ఆత్మసాక్షాత్కారం పొందితే, తర్వాత ఏమి అయ్యేదీ అప్పుడే తెలుస్తుంది.

157. ప్రపంచదర్శనం: ఆత్మదర్శనం

ప్రపంచదర్శనం చేసేవానికి ఆత్మదర్శనం లేదు. ఆత్మదర్శనం చేసేవానికి ప్రపంచదర్శనం లేదు. కనుక, ఆత్మదర్శనం చేసి ప్రపంచం లేదని తెలుసుకో.

158. ప్రపంచం మానసికం

ప్రపంచమనగా ఏమిటి? ఆకాశంలో పరుచుకొని వున్న విషయజాతమే ప్రపంచం. దానిని ఎవరు తెలుసుకుంటున్నారు? మనసు. ఆకాశాన్ని తెలుసుకునే మనస్సుకూడా ఆకాశమే కదా. అది భూతాకాశమయితే ఇది మనో ఆకాశం. దీని కాధారం చిదాకాశం. జ్ఞానతత్త్వమైన హేతువుచే మనస్సు ఆకాశతత్త్వంగానే తత్త్వశాస్త్రంలో పరిగణించబడింది. శుద్ధ మనస్సు ఆకాశమే. దాని రాజస, తామస స్వరూపాలు స్థూలవిషయాలవుతున్నాయి. కనుక, ప్రపంచమంతా మానసికమే.

159. ప్రపంచ స్వరూపం

సినిమా తెరపై బొమ్మలు కదులుతూ వుంటాయి. అగ్ని భవనాలను కాల్చివేస్తున్నట్లుంటుంది. సముద్ర తరంగాలు ఓడలను ముంచి వేస్తున్నట్లుంటాయి. కాని, తెర మాత్రం తగులబడదు, తడిసిపోదు ఎందుచేత? బొమ్మలు నిజం కాదు. తెరయే నిజం. అట్లే, అద్దంలో కనిపించే ప్రతిబింబాల గుణ క్రియాదులు అద్దానికి అంటవు. అదే విధంగా ఈ ప్రపంచం కూడా సత్యపదార్థమందు గోచరించే మాయాకల్పన.

160. ప్రాణజయం, మనోజయం

ప్రాణం, మనస్సు – రెండింటికీ మూలం ఒక్కటే. ప్రాణ నియమనం, మనోనియమనం – రెండింటిద్వారా కూడా ఆ మూలం చేరుకోవచ్చు. రెండవది కుదరనప్పుడు మొదటిది

సహాయకారిగానే ఉంటుంది. ప్రాణగతులను కనిపెట్టి చూస్తుంటే ప్రాణ నియమనం సిద్ధిస్తుంది. అట్లే మనోగతులను కనిపెట్టి చూస్తుంటేనూ.

161. ప్రాణాయామం

చిత్తవృత్తులను నేరుగా నిరోధించలేనివారి కోసం ప్రాణాయామం ఉద్దేశించబడింది. మోటారుకారుకు బ్రేకువంటిది ప్రాణాయామం. కాని సాధకుడు ప్రాణాయామంతోనే ఆగిపోరాదు. ప్రత్యాహారం, ధారణ, ధ్యానం కూడా సాధించాలి. ధ్యానం కుదిరినప్పుడు, ప్రాణాయామం లేకపోయినా చిత్తం వశమౌతుంది. ధ్యానసిద్ధివలన కలిగేది మనశ్శాంతి.

162. ప్రాణాయామం – మనోనిగ్రహం

నీ ఆత్మలోనికి నీవు మునగాలంటే, ప్రాణాయామం అందుకొక సాధన మాత్రమే. మనోనిగ్రహం వలన కూడా నీవు మునగవచ్చు. మనస్సు నిగ్రహించబడినప్పుడు, ప్రాణం దానంతటదే నిగ్రహించబడుతుంది. ప్రాణాయామంతో పని లేదు – మనోనిగ్రహమే చాలు. మనస్సును సరాసరి నిగ్రహించలేని వారికొఱకే ప్రాణాయామం చెప్పబడింది.

163. ప్రార్థనకు ముక్తాయింపు

'నీవే తల్లివి, నీవే తండ్రివి, నీవే సఖుడవు, నీవే బాంధవుడవు, – నీవే నా సర్వస్వానివి – అని భగవంతుని మనం ప్రార్థిస్తూ వుంటాము. నీవే అది, నీవే ఇది, అని అంటూ 'నేను' ను మాత్రం

వదలిపెట్టుతాము. 'నీవే నేను' అనే ముక్తాయింపుతో ఆ ప్రార్థనను మనం ఎందుకు పూర్తిచేయరాదు?

164. బంధమోక్షాలు

దారపుత్రాదులతో కూడిన కుటుంబంలో నీ వున్నావా, లేక నీలో కుటుంబమున్నదా? నీ మనస్సును దారపుత్రాదులు బంధిస్తున్నారా, లేక నీవే నిన్ను వారితో బంధించుకొంటున్నావా? ఇది నా భార్య అనీ, వీరు నా బిడ్డలనీ నీవు అనుకుంటున్నందువల్లనే వారితో నీవు బంధించబడుతున్నావు. ఇది నీ భావాలు – నీలోంచే పుట్టుతున్నాయి! వాటిని పెంచుకోడంగాని వదలుకోడంగాని నీలో ఉన్నది. పెంచుకుంటే బంధం, వదులుకుంటే మోక్షం.

165. బాలురలో భగవంతుడు

బాలురు భగవద్రూపులు, సంస్కారాలు వారిలో ఇంకనూ అభివ్యక్తంకాని హేతువుచేత, వారు నిష్కళంకులు, పరిశుద్ధులు. సంస్కార నిర్మూలనమైతే వయసువచ్చినవారు కూడా తిరిగి బాలురై భగవత్స్వరూపులు కావచ్చు.

166. బుద్ధికి చరితార్థత

నిరంతరమైన అభ్యాసం వల్ల మానవబుద్ధి తనకు స్వతంత్రా సత్తా లేదనీ, ఏదో పరాశక్తి ఆధారం వల్ల తాను వ్యవహరించగలుగుతున్నాననీ తెలుసుకుంటుంది. ఆ శక్తిని తాను స్వయంగా అందుకోజాలదు. అందుచే అది ఒక దశలో వ్యవహారం మానివేస్తుంది. అప్పుడు దాని కాధారభూతమైన పరాశక్తి ఒకటే

నిలుస్తుంది. అదే సాక్షాత్కారం. మానవ బుద్ధికి చరితార్థత, ఈ రీతిగా ఒక పరాశక్తిపై తాను ఆధారపడి ఉన్నాననీ, స్వయంగా దానిని తానందుకోలేననీ, తెలుసుకొని, ఆ లక్ష్యసిద్ధికై తనను తాను వినాశమొందించుకోడమే.

167. బుద్ధి ప్రయోజనం

నిన్ను నీవు విమర్శచేసుకోడానికి బుద్ధి సహాయపడుతుంది. దాని ఉపయోగం అంతవరకే – ఆపైన లేదు. ఆపైన దానిని అహంకారంలో లీనం చేసి, అహంకారపు మూలాన్ని అన్వేషించడం అవసరం. అలా చేసినప్పుడు అహంకారం అంతర్ధానమైపోతుంది. ఆ మూలస్వరూపుడవుగా నీ వుండిపోతే యిక అహంకారం మరల తల యెత్తదు.

* * *

మానవబుద్ధి ఒక పట్టాన అంతర్ముఖం కాదు. వర్తమానాన్ని వదలి ఎంతసేపూ భూత భవిష్యత్తులను గురించి విచారణ చెయ్యడానికి వుత్సాహపడుతూ ఉంటుంది. వర్తమానపు వునికిని తెలుసుకోడానికి, అనగా ఆత్మాన్వేషణ ప్రయత్నంలో అది అంతర్ముఖమైతే తుదకు తానే లేకుండా పోతుంది. వాస్తవానికి సృష్టివిధానంలో బుద్ధివికాసానికి ప్రయోజనం, ఆత్మాన్వేషణకు దారిచూపడమే. అందుకొరకే దానిని వినియోగించుకోవాలి.

168. భక్తి – ఆత్మజ్ఞానం

'' 'నేను', 'నాది' – అనే ఉచ్చులలో తగుల్కొని, ఆత్మను
[illegible] తెలుసుకొన్న

మీదట, నేనే నీవనీ, నావని అనుకునేవి కూడా నీవేననీ గ్రహించాను'', – అన్నాడు వైష్ణవభక్తుడు నమ్మాళ్వారు. భక్తి కూడా ఆత్మజ్ఞానమేనని దీనినిబట్టి విశదమవుతున్నది. అయినా విశిష్టాద్వైతులు తమ సాంప్రదాయిక ధోరణిలో జీవాత్మలు పరమాత్మలో భాగమనీ, ఆయనకు అవయవాలవంటివారనీ అంటూ వుంటారు. అంటే అననీ. దాని వల్ల సత్యం మారదు.

169. భక్తి జ్ఞానాలు

భక్తి, విచారం (జ్ఞానం) – రెండూ ఒక్కటే. భక్తిలో భగవద్రూప ధ్యానం ఉంటుంది. భగవద్భావన యితర భావనలన్నిటినీ పారద్రోలుతుంది. అది ఏకాగ్రత. భగవద్ధ్యాన లక్ష్యం, విచార సాధన లక్ష్యం – రెండూ యీ రీతిగా ఒక్కటే.

170. భక్తి – విచారం

విభక్తి (విభాగం) ఉన్నంతవరకూ భక్తి తప్పదు. వియోగం ఉన్నంతవరకూ యోగం (కలయిక) తప్పదు. ద్వైతం ఉన్నంతవరకూ భగవంతుడనీ, భక్తుడనీ వ్యవహారం తప్పదు. అట్లే, ఆత్మవిచారంలో కూడా ద్వైతమున్నది. ఆత్మలో లీనమైనప్పుడు మాత్రం ఏకత్వమే. అదే రీతిగా భక్తిలో కూడా భగవత్సాక్షాత్కారం పొందిన తరువాత ఉండేది ఏకత్వమే. భగవద్విచారం, సాక్షాత్కారం ఆత్మయందే జరుగుతున్నవి. కనుక భగవంతుడు ఆత్మకంటె వేరుకాదు.

171. భగవత్సాక్షాత్కార స్వరూపం

భగవంతుని ప్రత్యక్షం చేసుకున్నవాడు తన వ్యక్తిత్వాన్ని నిలుపుకోడం కుదరదు. చూచేవాడూ, చూడబడేవాడూ యిరువురూ ఒకే వస్తువుగా ఏకమైపోతారు. చూచేవాడు, చూడబడేవాడు, చూపు అనే త్రిపుటికక్కడ స్థానం లేదు. అంతా ఒకే పరశివ తత్త్వంలో లీనమైపోవలసినదే.

172. భగవత్స్వరూపం

భగవంతుడు సాకారుడా, నిరాకారుడా అని తర్జనభర్జనలు పడినందువల్ల ఏమి ప్రయోజనం? నీకు ఆకారమున్నదో లేదో నీవు ముందు తెలుసుకో. అప్పుడు భగవంతుడు ఎట్టివాడో తెలుసుకోగలుగుతావు.

173. భగవద్దర్శనం

భగవద్దర్శనం మన లోపల కలిగేది గాని వెలుపల కలిగేది కాదు. మనస్సు అంతర్ముఖం చేయబడినప్పుడు, భగవంతుడు అంతశ్చైతన్యంగా మనకు సాక్షాత్కరిస్తాడు.

★ ★ ★

భగవద్దర్శనం కలిగేది మనస్సులోనే. ఏ రూపంలో భగవంతుడు సాక్షాత్కరిస్తాడనేది చిత్తసంస్కారాన్ని బట్టే ఉంటుంది. ఏమైనా అది చరమదశ కాదు. అందులో ఇంకా ద్వైతభావం ఉన్నది. అది ఒక స్వప్న దర్శనం వంటిది. భగవద్దర్శనానంతరం విచారం ప్రారంభమై ఆత్మదర్శనంలోకి పర్యవసిస్తుంది. కట్టకడపటి మార్గం విచారమే.

174. భగవద్దర్శనాలు

ధ్యానించిన భగవద్రూపం సుదీర్ఘాభ్యాసంవల్ల స్వప్నంలో కనుపిస్తుంది. తరువాత జాగ్రత్‌లో కూడా కనిపించవచ్చు. దర్శించేవాని స్థితినిబట్టి భగవద్దర్శనాలు కలుగుతాయి. మనమెంత యథార్థమో ఈ దర్శనాలు కూడా అంత యథార్థములే. కాని ఇవి ఆత్మసాక్షాత్కారానికి క్రింది భూమికలోనివి.

175. భగవద్ధ్యానం – ఆత్మధ్యానం

అంతటా భగవంతుని దర్శించాలంటే మొదట మనస్సులో భగవంతుని భావించడం నేర్చుకోవాలి. అలా భావన చెయ్యడమే ధ్యానం. ధ్యానం అనుభూతికి దారితీస్తుంది. అనుభూతి ఆత్మలో కలుగవలసినదే. భగవద్ధ్యానమైనా, ఆత్మ ధ్యానమైనా, రెండింటి లక్ష్యం ఒక్కటే.

176. భావ ప్రతిబంధకం

'నేను ధ్యానం చెయ్యలేకపోతున్నాను' – అనే భావం కూడా ప్రతిబంధకమే. నీ స్వభావం శాంతి, ఆనందం, ధ్యానమనేది ఆత్మను పొందడానికి కాదు. దానికి ప్రతిబంధకంగా ఉన్న ఆలోచనలను వదలించుకోడానికి. నాకు శాంతి లభించలేదన్న ఆలోచన ఆత్మకు విజాతీయం. ధ్యానం యిట్టి విజాతీయ భావాలను పోద్రోలడానికే కనుక, మనసులో యే భావం తల యెత్తినా దాని వెంటపడి కొట్టుకొని పోబోకు. భావాలకు అతీతుడవై నీ సహజ శాంత్యానందస్థితిని అనుభవించు.

177. భేదభావ నిర్మూలన

ప్రపంచం భేదమయంగా కనిపించడం కర్తృత్వబుద్ధి మూలాన. కర్తృత్వబుద్ధిని వదలితే భేదాలు అంతర్ధానమై ఏకమైన సత్యం సాక్షాత్కరిస్తుంది. కర్తృత్వబుద్ధిని వదలాలంటే కర్త యెవరో తెలుసుకోడానికి అన్వేషణ చెయ్యాలి. అది నీ లోపల జరుగవలసిన అన్వేషణ. అదే విచారమార్గం.

178. మతాల పరమార్థం

సమస్త జ్ఞానము యొక్క లక్ష్యమూ మానవునకు ఆత్మజ్ఞానం కలిగించడమే. మతాలు, మత గ్రంథాలు అన్నీ అందుకోసమే పుట్టాయి. ఏమిటి వాని పరమార్థం? భూతభవిష్యత్తులను గురించి అవి ఏమి చెపుతున్నాయనేది వదిలెయ్యండి. అదంతా ఊహా కల్పన. వర్తమానం అలా కాదు. వర్తమానపు ఉనికి అందరి అనుభవంలో ఉండేది. అచ్చమైన ఉనికి, విశుద్ధ సత్యం ఏమిటో తెలుసుకో. ఇక వాదోపవాదాలతో పని ఉండదు.

179. మనశ్చలన కారణం

మనస్సు హృదయంలో లీనం కాకపోవడానికి పూర్వసంస్కారాలే కారణం. వాస్తవానికి మనసెప్పుడూ హృదయంలోనే ఉన్నది. కానీ, నీ పూర్వసంస్కారాల మూలంగా అది చలిస్తూ ఉంటుంది. పూర్వసంస్కారాల బలం లేకుండా చేయబడినప్పుడది చలనముడిగి శాంతిని పొందుతుంది. ప్రాణాయామం, సజ్జన సాంగత్యం, ఈ సంస్కారాలను

తొలగించడానికి తోడ్పడతాయి. అయితే, ప్రాణాయామంవల్ల తాత్కాలికంగా మాత్రమే మనస్సు నిశ్చలమౌతుంది. దానికి కారణం సంస్కారాలింకా మిగిలి ఉండడమే. మనస్సు ఆత్మగా మారినప్పుడే చిక్కు ఉండదు. అది ధ్యానంవల్లనే సాధ్యం.

180. మనస్సు, ఆత్మ

గాఢనిద్రలో నీవున్నావు. మేల్కొన్నప్పుడూ ఉన్నావు. రెండు అవస్థలలోనూ ఉన్నది ఒకే ఆత్మ. ప్రపంచమును గురించిన ఎరుక ఉండడము, లేకపోవడము – ఇదే రెండింటికీ గల భేదం. ప్రపంచం మనస్సుతో ఉదయించి తిరిగి మనస్సుతో అస్తమిస్తున్నది. ఇట్టి ఉదయాస్తమయములు గలది ఆత్మ కాదు. మనస్సు యొక్క ఉదయాస్తమయాలకు ఆధారభూతమై అధిష్ఠానంగా ఉండేదే ఆత్మ.

181. మనస్సు – మెదడు

మనస్సు మెదడులో పుట్టిందనుకుంటారు. కాని మెదడు ఎక్కడ వున్నది? శరీరంలో ఉన్నది. శరీరమే మనస్సు చేసిన కల్పన అని నేను అంటున్నాను. శరీరాన్ని, అందులోని మెదడును సృష్టి చేసినది మనస్సే. ఆ మెదడు తన స్థానమైనట్లు నిర్ణయిస్తున్నదీ మనస్సే.

182. మనస్సులోని వైచిత్ర్యం

ఒక ఖగోళ శాస్త్రవేత్త అంతులేని దూరాన ఒక నూతన నక్షత్రాన్ని కనుగొని, దాని వెలుగు భూమికి చేరడానికి వేలకొలది కాంతిసంవత్సరాల కాలం పట్టుతుందని ప్రకటిస్తాడు. వాస్తవానికి

ఆ నక్షత్రం ఎక్కడ ఉన్నది? చూచేవానిలో లేదా? సూర్యునికంటే పెద్దదైన ఆ మహాగోళం ఒక మానవుని మెదడులో ఎలా ఇమిడిందని జనులాశ్చర్యపడతారు. అంతులేని ఆకాశం, లెక్కకు మించిన కొలతలు, పరస్పర విరుద్ధ సన్నివేశాలు – అన్నీ మనస్సులోనివే!

183. మనోనాశానికి ఉపాయం

మనస్సు ఎలా నశిస్తుంది? మనస్సు తనను తానే చంపుకోడం సంభవించదు. కనుక, మనస్సు నిజస్వభావమేమిటో కనుక్కోడం నీ ముఖ్య కర్తవ్యం. అప్పుడు మనస్సనేదే లేదని నీవు తెలుసుకోగలుగుతావు. ఆత్మను నేరుగా వెదకి పట్టుకుంటే యిక మనస్సెక్కడిది? నీవు ఆత్మస్థుడవైనప్పుడు, మనస్సును గురించిన ఆందోళన నీకక్కర లేదు.

184. మనోబల సంసిద్ధి

బాహ్యప్రవృత్తులు మనోబలాన్ని క్షీణింపచేస్తాయి. బాహ్యప్రవృత్తులను నిరోధించినప్పుడే దాని బలం పెరుగుతుంది. మనస్సును ఒకే భావమందు లగ్నం చెయ్యడం ద్వారా దాని శక్తిని పెంపొందించుకో గలుగుతాము. తుదకు ఆ ఒక్క భావం కూడ అంతర్ధానమై శుద్ధ చైతన్యం మిగులుతుంది.

185. మనోమూలం

మనస్సును పరిశీలనచేస్తే మనోవృత్తులు వాటంతటవే అణగుతాయి. మనస్సు మూలాన్ని అన్వేషణ చెయ్యడం మరొక పద్ధతి. మనోమూలమే భగవంతుడు, ఆత్మ, లేక చైతన్యం అని పిలువబడుతుంది.

186. మరణదుఃఖ నివారణ

చచ్చిపోయిన వారికొరకై దుఃఖమెందుకు? అది మనస్సు తనకు తాను కల్పించుకునే బంధన. నీవే చచ్చిపోతే నీకిక దుఃఖముండదు. అనగా, శరీరముండగానే నీ అహంకారం చచ్చిపోవాలి. గాఢనిద్రలో అహంకారం స్ఫురించదు. శరీర స్ఫురణ లేదు. అది లేకపోయినప్పుడే నీవు సుఖిస్తున్నావనేది నీకు అనుభవంలో ఉన్నదే. జ్ఞానులు కూడా ఇదే అనుభవ పూర్వకంగా బోధిస్తూ ఉన్నారు. దేహబుద్ధి విడచి దేహాతిరిక్తమైన ఆత్మబుద్ధి నలవరుచుకో.

187. మహాత్ముల దృష్టి ప్రసారం

మహాత్ముల దృష్టిప్రసారం నిస్సందేహంగా కలుషహారమే – కాని దాని ప్రభావం ఒక్కొక్కప్పుడు వెంటనే కానరాదు. నేలబొగ్గు రగుల్కొనడానికి యెక్కువకాలం తీసుకుంటుంది. మామూలు బొగ్గు కొద్దికాలంలోనే రగులుకొంటుంది. తుపాకిమందు ఉత్తరక్షణంలోనే భగ్గుమంటుంది. మానవులలోని తరగతులను బట్టి మహాత్ముల దృష్టి ప్రభావం పనిచేస్తూ వుంటుంది.

188. మార్గద్వయం

అహంకారం ఉన్నప్పుడే ధ్యానం సాధ్యపడుతుంది. ధ్యానించబడే వస్తువు, – అహంకారము, రెండూ యిక్కడ ఉంటాయి. ఇది పరోక్షమార్గం. కాని, ఆత్మకంటె రెండవ వస్తువు లేదు. అహంకారం ఏమిటని, దాని మూలాన్ని తరచి చూచినప్పుడది అంతర్ధానమై ఆత్మ ఒక్కటే మిగులుతుంది. ఇది ప్రత్యక్షమార్గం.

189. మాయ నటన

తాను మూలకారణం కంటె వేరని చెప్పడం కేవలం మాయ నటన. దీనికి తోడు, అహంకారం విసర్జించి పరిశుద్ధుడైన మీదట తాను పరమాత్మను అనుభవించడానికీ, సేవించడానికీ వ్యక్తిత్వం కలిగి ఉంటాననడం పట్టి కుహనాయుక్తి. మొదట, ఆయన సొత్తును తాను భుక్తం చేసుకోడం, పిమ్మట ఆయనను తాను అనుభవిస్తున్నట్లు, సేవిస్తున్నట్లు నటించడం, ఇది వంచనా వృత్తి కాదా? పరమాత్మకిది తెలియదా?

190. మిథ్యాభూతమైన నేను

ఆత్మ శుద్ధచైతన్యం. కాని, చైతన్య స్వభావుడైన మానవుడు జడమైన శరీరంతో తాదాత్మ్యం కల్పించుకొని తాను శరీర మనుకుంటున్నాడు. శరీరం తనంతట తాను '' నేను శరీరము'' నని చెప్పదు. ఆ మాట మరొకరు అంటున్నారు. శుద్ధచైతన్యమైన అఖండాత్మ ఆ మాట అనదు గదా. ఇక యెవరంటున్నారు? శుద్ధచైతన్యానికీ, జడశరీరానికీ మధ్య మిథ్యాభూతమైన ఒక 'నేను' ఆవిర్భవించి తాను శరీరము నంటున్నది. దానిని వెదకి పట్టుకోబోతే అది మాయమవుతుంది.

191. ముక్తిమార్గం

ఆలోచనలే నిన్ను బంధిస్తున్నాయి. ఆలోచనలు వదలుకుంటేనే మోక్షం. ఆలోచనలు పెట్టుకొని బద్ధుడవు కావడం గాని, ఆలోచనలు మానుకొని ముక్తుడవు కావడంగాని, అంతా

నీలో ఉంది. ఆలోచనలు మానుకోవాలనే ప్రయత్నం నీవు చేయనక్కర లేదు. ఆలోచనల మూలమేమిటో అన్వేషించి తెలుసుకో. అప్పుడు ఆత్మయే ప్రకాశించి, ఆలోచనలు వాటంతటవే అంతర్ధాన మవుతాయి.

192. ముఖ్యవిషయం

నీవు ఎక్కడ ఎటువంటి పరిస్థితులలో ఉన్నా మనస్సు నిత్యమూ తన మూలస్థానంలో నిలిచి ఉండడమనేదే ముఖ్యంగా కావాలి. బాహ్యాంతరాలు విడివిడిగా లేవు. అంతే మనస్సే. మనస్సు చలిస్తూ ఉంటే విజనస్థలం కూడా బజారు మాదిరిగానే తయారవుతుంది. కనులు మూసుకున్నందువల్లనే ప్రయోజనం లేదు. మనస్సనే కన్నును మూయాలి. సత్పురుషులు తమ కర్మకలాపాన్ని ముందుగానే యోచించి తయారు చేసుకోరు. మనలను ఈ ప్రపంచంలోకి పంపిన భగవంతుని యోచన ఒకటి వేరే ఉన్నది. అదే క్రమంగా కార్యరూపం ధరిస్తుంది.

193. మూలాన్వేషణ

నీ ఉనికికి మూలం నీ లోపలే ఉన్నది. వెలుపల ఎక్కడనో లేదు. అది నీకు వెలుపల ఉన్న ఏ భగవంతుడో అని భ్రమించబోకు. ఆ మూలమేదో అన్వేషించి దానికి నిన్ను నీవు సమర్పించుకోడమే - అనగా దానిలో లీనం కావడమే కావలసినది. ఆ మూలానికి నీవు వెలుపల ఉన్నట్లు భావించుకోడంవల్లనే అది ఎక్కడ ఉన్నదని నీవు ప్రశ్నించడం జరుగుతున్నది.

194. మృతమనస్సు

మనస్సుచే భావింపరానిదైనా మనస్సు ద్వారానే ఆత్మను పొందవలసి ఉన్నది. అనగా, మృతమనస్సు చేత – వృత్తి రహితమై అంతర్ముఖమైన మనస్సు చేతనని అర్థం. అట్టి మనస్సు తన మూలాన్ని తాను తెలుసుకొని అదే తానుగా అయిపోతుంది. అప్పుడది ఒక విషయాన్ని తెలుసుకునే విషయివలె ఉండదు.

195. మోక్షప్రాప్తి

మోక్షమనగా నీవు పుట్టనివాడవని తెలుసుకోవడమే. నిశ్చలత్వము పొంది, 'నేనే బ్రహ్మము' నని తెలుసుకో. నిశ్చలత్వము పొందడమంటే మనోభావనలేవీ లేకుండా ఉండడం. కావలసినది 'తెలుసుకోడం' గాని 'భావించడం' కాదు.

196. మౌనతత్వం

మౌనమనగా తెంపు లేని సంభాషణం. సంతత ప్రవాహ రూపమైన భాష అది. మామూలు భాష ఆ భాషకు అంతరాయం కలిగినప్పుడే అది దీపంగా వెలగడం, పంకాగా తిరగడం సంభవిస్తుంది. అట్లే, మౌనమనేది మాటలచే అవరోధించబడే నిరంతర భాషా ప్రవాహం.

197. మౌనప్రాశస్త్యం

గురువు అనుగ్రహానికి ఉత్తమోత్తమ రూపం మౌనమే. అదే ఉత్తమోత్తమ ఉపదేశం కూడ. మౌనంలోనే సాధకుని ప్రార్థన సైతం పరాకాష్ఠ చెందుతుంది. స్పర్శదీక్ష, చక్షుర్దీక్ష మొదలైనవి మౌనదీక్ష

తరువాతివే. అదే అన్ని దీక్షలకూ మూలం. గురువు మౌనంలో ప్రతిష్ఠితుడై ఉన్నప్పుడు, సాధకుని మనస్సు దానంతటదే విశుద్ధిని పొందుతుంది.

198. మౌనసిద్ధి

మౌనమనగా నోరుమూసుకొని ఉండడం కాదు, వాఙ్మనస్సులకు అతీతస్థితిని అందుకోడం. చిత్తాన్ని ఏ భావమందైనా లగ్నం చేసి దాని మూలానికి పోయినప్పుడు మౌనం సిద్ధిస్తుంది. చిత్తవృత్తులు లేని ధ్యాననిష్ఠయే మౌనం.

199. మౌనస్వరూపం

మౌనమంటే నోరుమూసుకోడం కాదు. మనోవాక్కులకు అతీతమైన స్థితి మౌనం. ఏదో ఒక భావాన్ని దృఢంగా ధారణ చేసి దాని మూలాన్ని అన్వేషించు. మౌనం అట్టి ఏకాగ్రతవల్ల సిద్ధిస్తుంది. అభ్యాసం సహజమైపోయినప్పుడు అది మౌనంలోకి పర్యవసిస్తుంది. మనోవ్యాపారం లేని ధ్యానమే మౌనం. మనస్సును స్వాధీనం చేసుకునే ప్రయత్నమే ధ్యానం. ప్రగాఢమైన ధ్యానం నిత్యమైన శబ్ద బ్రహ్మం.

200. రెండు పద్ధతులు

ధ్యానమూ, విచారమూ, – రెండూ వస్తుతః ఒక్కటే. విచార పద్ధతిని అవలంబించలేని వారు ధ్యాన పద్ధతిని అవలంబించాలి. ఈ పద్ధతిలో సాధకుడు తనను మరచి, 'నేను బ్రహ్మను' అనో, లేక 'నేను శివుడ' ననో ధ్యానిస్తాడు. బ్రహ్మముగా గాని, శివుడుగా గాని

మిగిలేది తానే యని తుదకు గ్రహిస్తాడు. విచారపద్ధతిలో సాధకుడు తననే ఆలంబనంగా గైకొని, నే నెవరినని ప్రశ్నించుకుంటూ తద్వారా ఆత్మసాక్షాత్కారం పొందుతాడు.

201. రూపధ్యానం – ఆత్మవిచారం

ప్రారంభదశలో సాధకునకు రూపధ్యానం సులభమై ఇష్టంగా వుంటుంది. క్రమేణా ఆ సాధనే సదసద్వివేక రూపమైన ఆత్మవిచారానికి దారితీస్తుంది. అవరోధాలను తొలగించడం ద్వారా ఆత్మదర్శనం కలిగింపచేస్తుంది ఆత్మ విచారం. దానినే నిదిధ్యాసమని కూడా అంటారు.

202. రూపరాహిత్యం

నిద్రలో ఉన్నప్పుడు నీకు రూపం లేదు. మెలకువగా ఉన్నప్పుడే ఒక రూపంతో తాదాత్మ్యం చెందుతున్నావు. ఇందులో నీ నిజస్థితి ఏది? విచారణతో అది రూపరహితమనే తేలుతుంది. నీ ఆత్మ రూపరహితమని నీ జ్ఞానంవల్ల తేలినప్పుడు, భగవంతుడు కూడా రూపరహితుడని అంగీకరించడం యుక్తమే కదా?

203. లీనం చేసే ఉపాయం

మనస్సును హృదయంలో లీనం చెయ్యడమే కర్మ, భక్తి, యోగ, జ్ఞాన సాధనల సారాంశం తేలుతున్న వస్తువు మునగాలంటే మునిగే ఉపాయాలు చెయ్యాలి. మనో విక్షేపాల నరికట్టడానికి ప్రాణాయామం ఒక ఉపాయం. సజ్జన సాంగత్యం మరొక ఉపాయం. మనస్సుకు ప్రశాంతి చేకూరినప్పుడైనా అప్రమత్తతతో

నిర్విరామంగా ధ్యానం కొనసాగించినప్పుడే మనస్సు హృదయంలో లీనమౌతుంది.

204. వ్యవహారదశ – సమాధి

వ్యవహారదశలో కూడా సమాధి వున్నది. సమాధిని విడిచి వున వ్యవహారానికి ప్రత్యేక సత్తా లేదు. బొమ్మలు ప్రదర్శితమౌతున్నా కాకపోయినా సినిమా తెర ఉండనే ఉన్నది. అదేరీతిగా వ్యవహారంలోనూ శాంతిలో కూడ ఆత్మ నిత్యసిద్ధమే.

205. వాసనాక్షయం

వాసనాక్షయం అత్యంత ప్రధానం. వాసనలను నశింపజేయనంతవరకూ సమాధివలన కూడా ప్రయోజనం లేదు. అట్టి సమాధిలోని ఆనందం తాత్కాలికం. ఉత్థానదశలో పాత వాసనలు తిరిగి ఎప్పటివలె తలలెత్తుతాయి. వాసనలు రెండు రకాలు: బంధహేతువులు, భోగహేతువులు. అజ్ఞానులను బంధించేవి మొదటిరకం. జ్ఞానులకు భోగమిచ్చేవి రెండవ రకం. ఈ రెండవరకం వాసనలు ఆత్మోపలబ్ధికి ప్రతిబంధకములు కావు.

* * *

ఆత్మజ్ఞానసిద్ధి కలిగినప్పుడు వాసనలు వాటంతటవే దహించి వేయబడుతాయి. వాటిని వేర్వేరుగా, అవి తలయెత్తినప్పుడెల్ల దహించడమనేది వుండదు.

206. విచార మార్గం

ఏదైనా ఒక లక్ష్యం చూపి ధ్యానించుమని చెప్పినప్పుడు, సాధకులనేకులు దానితో తృప్తిపడవచ్చు. కాని, ఒక్కొక్కరు 'ఆ లక్ష్యాన్ని ధ్యానించవలసిన నే నెవరిని?' అని ఎదురు తిరిగి ప్రశ్నిస్తారు. అట్టివారికి ఆత్మాన్వేషణ మార్గం చూపాలి. అదే 'విచారం'. 'ఉన్నది నేనే' అనెడి అనుసంధానం ప్రయత్నపూర్వకంగా చేసినప్పుడది విచారమవుతుంది. అప్రయత్నంగా, స్వాభావికంగా అది అలవడినప్పుడు సిద్ధి అనిపించుకుంటుంది.

207. వివేకసాధన

ప్రతివాడూ తాను దేహమే ననుకుంటున్నాడు. కనుక, వానికి మొదట నీవు దేహము కాదని చెప్పవలసియున్నది. జడము నుండి చేతనమును వేరుచేసి, తాను చేతనమని అతడు మొదల తెలుసుకోవాలి - ఇదే వివేకం. పిమ్మట అతనికి జడము చేతనముకంటె వేరుకాదనేది కూడా తెలియబడుతుంది. అంతయూ తానే యని తుదకాతడు తెలుసుకుంటాడు.

208. విశ్వభాష

బాష అనేది ఒకరి భావాలొకరికి తెలియజేసుకునే సాధనం మాత్రమే. భావాలుదయించిన మీదటనే భాష అవసరం కలుగుతుంది. 'అహం' భావం పుట్టిన మీదటగాని యితర భావాలు పుట్టవు. 'అహం' భావమే సంభాషణకంతకూ మూలం. భావరహిత స్థితిని అందుకొన్నప్పుడు మౌనరూపమైన విశ్వభాష ద్వారా ఒకరినొకరు అర్థం చేసుకోగలుగుతారు.

209. విశ్రాంతి

ఆత్మయందు సుస్థితి పొందడమే విశ్రాంతి. అంతేకాని పరిసరాలు మార్చుకోడం విశ్రాంతి కాదు. బాహ్య ప్రపంచం నుండి మానసిక ప్రపంచానికి మార్పు సైతం విశ్రాంతి అనిపించుకోదు. ఆత్మస్థులైన వారికి సుఖదుఃఖాత్మకమైన సకల ప్రపంచం ఆత్మగా కనిపిస్తుంది.

210. విశుద్ధ మనస్సు

మనస్సు చాలా విశుద్ధమైనది. దానికి సత్త్వ రజస్తమో రూపములున్నాయి. రజస్తమస్సులు విక్షేపాలు కలిగిస్తాయి. సత్త్వం విశుద్ధమైనది. అచట ఆలోచనలుండవు. అది ఆత్మస్వరూపమే. మనస్సు ఆకాశం వంటిది. ఆకాశంలో వివిధ వస్తుజాతమున్నట్లు, మనస్సులో ఆలోచనలున్నా .

211. వేయరాని ప్రశ్న

విశుద్ధమూ, పరిపూర్ణమూ అయిన పరబ్రహ్మము మనలను ఎందుకు ఇలా సృష్టించి, తనను తెలుసుకోడానికి ఇన్ని శ్రమలు మనం పడేటట్లు చేస్తున్నదనే ప్రశ్న వేయబడుతున్నది. ఈ ప్రశ్న వేసే వ్యక్తి సృష్టిలోని వాడు - సృష్టికి తాను బద్ధుడై ఉండగా ఈ ప్రశ్న ఎలా వేస్తాడు? సృష్టికి తాను అతీతుడు కానేర్చి అటుపిమ్మట ఈ ప్రశ్న పుట్టుతుందో లేదో చూసుకోవాలి.

212. వేరుతనం పోవాలి

నీవొక జీవుడననీ, నీ చుట్టూ జగత్తు ఉన్నదనీ, దానికి అతీతంగా భగవంతుడు ఉన్నాడనీ అనుకుంటున్నావు, ఇందులో

వేరు భావన ఉన్నది. ఇది పోవాలి. భగవంతుడు నీకంటె, జగత్తు కంటె వేరుగా లేడు. ఆయన అన్ని హృదయాలలో ఉన్నాడు. అన్నిటికీ ఆధారమై ఉన్నాడు. అన్నీ ఆయనలో పుట్టి, ఆయనలో వసించి, తిరిగి ఆయనలో లీనమైపోతున్నవి. కనుక ఆయన వీటన్నిటికంటె వేరుగా ఉన్నవాడు కాదు.

213. వైక్లబ్యం తగదు

అనారోగ్యం నీ ధ్యానానికి అవరోధవౌతున్నట్లు భావిస్తున్నావు. ఈ వైక్లబ్యానికి మూలం దేహాత్మబుద్ధి. అనారోగ్యం ఆత్మకు లేదు. అది శరీరానికి. కాని, శరీరం తాను అనారోగ్యంగా ఉన్నానని చెప్పదు. నీవు చెప్పుతున్నావు. ఎందువల్ల? శరీరమే నీవని శరీరంతో లేనిపోని తాదాత్మ్యం కల్పించుకున్నందువల్ల. శరీరం కూడా ఒక భావనే. నీ వాస్తవ స్వరూపంలో నీవుండు. వైక్లబ్యం పొందవలసిన పనిలేదు.

214. వైరాగ్యం

ఆనందం తనకు వెలుపల ఉన్నదనుకునే అలవాటుకొద్దీ మనస్సు బాహ్య విషయాలవైపు పరుగిడుతూ ఉంటుంది. ఆనందమిచ్చేవి బాహ్య విషయాలు కావనే జ్ఞానం కలిగితే మనస్సు అలా పరుగులు పెట్టదు. అదే వైరాగ్యం. సంపూర్ణ వైరాగ్యం కలిగినప్పుడే మనస్సు నిలకడ చెందుతుంది.

215. వైరాగ్యం – అహంకారం

అహంకారం తొలగని వైరాగ్యం నిష్ప్రయోజనం. అహంకారం అంతరించినప్పుడు ఎన్ని సంపదలున్నా అవి బంధహేతువులు కానేరవు.

216. శక్తివంతమైన భాష

అనేక సంవత్సరాల సంభాషణవల్ల కూడా తెలుసుకోలేని విషయాన్ని మౌనంలోగాని, మౌనసన్నిధిలోగాని త్రుటికాలంలో తెలుసుకోవచ్చు. దక్షిణామూర్తి అవతార నిరూపణం అదే. మౌనం అత్యంత శక్తిమంతమైన భాష.

217. శరీర రుగ్మతలు – సాధన

శరీర రుగ్మతల విషయంలో సాధకుల ప్రవృత్తులు వారి వారి పూర్వ సంస్కారాలను బట్టి వేరు వేరు విధాలుగా ఉంటాయి – ఒకడు, ఆ రుగ్మతల నివారణకు హఠయోగ మభ్యసిస్తాడు. మరొకడు, వాటిని భగవంతుడే నయం చేస్తాడని నమ్ముకుంటాడు. వేరొకడు, తన సంకల్పశక్తి అందుకొరకు వినియోగిస్తాడు. ఇంకొకడు, వాటిని పూర్తిగా ఉపేక్షిస్తాడు. ధ్యానసాధనమాత్రం అందరూ విడువకుండా చేస్తూవుండాలి. ఆత్మవిచారణే ముఖ్యం. తక్కినవి అప్రధానాలు.

218. శాంతి సాధనోపాయం

శాంతి మన సహజస్వభావం. క్రొత్తగా సంపాదించుకోవలసిన పనిలేదు. మనస్సును నిశ్చలమొనరిస్తే శాంతి దానంతటదే

చేకూరుతుంది. గీతాపద్ధతియైన అభ్యాస వైరాగ్యాలొక్కటే దానికి ఉపాయం. వైరాగ్యం భావ విక్షేపాలను తొలగించడానికి తోడ్పడగా, అభ్యాసం ఒకే భావంపై మనస్సు నేకాగ్రంచేసి శాంతిసంధాయకమవుతుంది.

219. శివుని నిజస్వరూపం

దృశ్యరూపమైన భగవత్సాక్షాత్కారాలకు స్వతస్సిద్ధమైన విలువలేదు. అవి స్థిరంగా, శాశ్వతంగా నిలిచేవైనప్పటికీ సాధకునికి సంతృప్తి నీయజాలవు. ఉమాదేవికి శివుడు నిత్య సన్నిహితుడే. ఇరువురూ కలిసి అర్ధనారీశ్వరులయినారు. అయినా ఆమె శివుని నిజస్వరూపం తెలియగోరి తపస్సు చేసింది. ధ్యానంలో ఒక మహా తేజస్సు కనిపించగా 'ఇది నా దృష్టి పరిధిలోనిది కనుక శివుడు కానేరదు,' – అని నిశ్చయించి తపస్సునింకా కొనసాగించింది. చిత్తవృత్తులు అంతర్ధానమై ప్రశాంతస్థితి నెలకొనగా సత్తయే శివుని నిజస్వరూపమని అప్పుడామెకు సాక్షాత్కారమయింది.

220. శుద్ధ మనస్సు

చిత్తవృత్తులే బాహ్యవిషయాలుగా రూపొందగా ఆ వృత్తులపై ప్రతిఫలించిన వెలుగు ఆ విషయాలను ప్రకాశింపజేస్తుంది. చిత్తవృత్తులనుపేక్షించి, వాటిని ప్రకాశింపజేసే వెలుగు నన్వేషించినప్పుడు, మనసు నిశ్చలమై వెలుగు స్వయంప్రకాశమానంగా నిలిచిపోతుంది. రజస్తమో గుణాలతో కూడిన మనస్సునే సామాన్యంగా మనస్సంటారు. రజస్తమోగుణ వివర్జితమైనప్పుడది శుద్ధమై స్వయంప్రకాశమానమవుతుంది. ఇదే

ఆత్మోపలబ్ధి. ఇందుకనే మనస్సును దీనికి సాధన భూతంగా పేర్కొన్నారు.

221. శ్రీచక్రార్చనోద్దేశ్యం

బహిర్ముఖమైన మనస్సు అంతర్ముఖం కావడానికి దోహదంచేసే నిమిత్తమే మూర్తులు, మంత్రాలు, యంత్రాలు మొదలైనవి ఏర్పడ్డాయి. భావప్రతీకలైన నామరూపాలు మనస్సును బాహ్యప్రవృత్తులనుండి మళ్ళించి అంతర్నిష్ఠం చెయ్యడానికి తోడ్పడుతాయి. నలుబదిమూడు కోణాలయందు బీజాక్షరాలతో కూడిన శ్రీచక్రార్చన అలా మానసికైకాగ్రతకు ఉద్దిష్టమైనదే.

222. సంకల్పశక్తి

జయం నిశ్చయంగా చేకూర్చేదే సంకల్పశక్తి అనుకోరాదు. జయాపజయాలను సమానంగా చూడగల మనోబలమే సంకల్పశక్తి. చేసే ప్రయత్నాలన్నీ విజయవంతం అయితీరాలని ఏమున్నది? విజయం అహంకారాన్ని పెంచి ఆధ్యాత్మికాభివృద్ధికి అవరోధం కలిగిస్తుంది. అపజయం కనువిప్పు కలిగించి ఆత్మార్పణకు సాధకుని సిద్ధపరుస్తుంది. ఆత్మార్పణం నిత్యానందానికి నామాంతరం.

223. సంకల్పమూలం

సంకల్పాలకు మూలస్థానం గాఢనిద్రలోని ప్రశాంతతే. గాఢనిద్రలోని ప్రశాంతతకూ, మెలకువలోని సంక్షోభానికీ గల భేదం సంకల్పాలను బట్టే ఏర్పడుతున్నది. సంకల్పాల మూలానికి వెళ్ళితే, గాఢనిద్రలోని ప్రశాంతస్థితికి చేరుకుంటావు. అయితే,

ఆ వెళ్ళడం అతి తీవ్రమైన సాధన నిష్ఠతో - అనగా సంపూర్ణమైన ఎరుకతో వెళ్ళవలసి వుంటుంది.

224. సంఘసంస్కారం

సంఘసంస్కారానికి కీలకం ఆత్మసంస్కారం. నీవు ఆత్మసంస్కారమందు శ్రద్ధకలిగివుంటే, సంఘసంస్కారం దానంతటదే సిద్ధిస్తుంది.

225. సంశయవిచ్ఛేదం

ఒక సంశయం నీకు కలిగి, దానిని తీర్చుకుంటే, మరొక సంశయం తలయెత్తుతుంది. దానిని కూడా తీర్చుకుంటే, ఆపైన ఇంకొక సంశయం తయారవుతుంది. ఇలా దీనికి అంతులేదు. సంశయాలన్నీ పూర్తిగా తీరిపోవడం ఎన్నటికీ జరగదు. సంశయాలు ఎవరికి కలుగుతున్నాయో విచారించు. వాటి మూలంలోకి పోయి అచట నిలదొక్కుకో. అప్పుడిక సంశయాలు బయలుదేరవు. సంశయ విచ్ఛేదానికి ఇదే సరియైన మార్గం.

226. సంసారం - సంన్యాసం

సంసారమనేది నీ మనస్సులో ఉన్నది గాని బయటలేదు. బయటి ప్రపంచం ' ఇదిగో నేనిక్కడ ఉన్నా' నంటూ ఘోషించదు. అది ఎప్పుడూ ఉండేదే అయితే, నీ గాఢ నిద్రలో కూడా ఉండవలసిందే. అలా ఉండదు గనుక అది అనిత్యం. ఆత్మ ఒక్కటే నిత్యం. మనస్సుతో, అనాత్మతో, తాదాత్మ్యం వదలిపెట్టడమే నిక్కమైన సంన్యాసం.

227. సంస్కారాభివ్యక్తి

ఏదైనా ఒక విషయం జ్ఞాపకం చేసుకోవాలంటే, ఎంత ప్రయత్నించినా అది జ్ఞాపకం రాక, ప్రశాంతంగా ఉన్నప్పుడు మనస్సులో తళుక్కున మెరియడం సామాన్యంగా అందరికీ అనుభవంలో వుండేదే. ఎంతటి గాఢ సంస్కారాలైనా మనస్సు ప్రశాంతంగా, నిశ్చలంగా వున్నప్పుడే అభివ్యక్తమవుతాయి.

228. సచ్చిదానందం

ఆత్మ అసత్తుకాదు, అచిత్తుకాదు, అనానందం కాదు. అని సూచించడానికే అది సచ్చిదానందమని చెప్పబడింది. ఆ సత్తు సదసత్తుల కతీతం. ఆ చిత్తు చిదచిత్తుల కతీతం. ఆ ఆనందం ఆనందానికీ అనానందానికీ అతీతం. సదసత్తుల కతీతమైనా దానిని పర్యవసానంలో సత్తుగా చెప్పవలసినదే. అట్లే చిత్తు, ఆనందం విషయంలో కూడా.

229. సత్యదృష్టి

ఆత్మలోనే అన్నీ వున్నాయి. ప్రపంచం ఉన్నదనీ, అందులో నీ శరీరం ఉన్నదనీ, దానిలో నీవు ఉన్నావనీ తలంచడం తప్పు. సత్యం తెలిసినప్పుడు, ఈ ప్రపంచం, దానికి అవతల వుండేదీ, - అన్నీ ఆత్మలోనే ఉన్నట్లు అవగతమౌతుంది.

230. సత్త్వరజస్తమస్సులు

సత్త్వరజస్తమస్సులలో సత్త్వం వెలుతురు. రజస్సు విషయి. తమస్సు విషయం. అయితే సత్త్వపు వెలుతురు ప్రతిబింబితమైన

వెలుతురే కాని అసలు వెలుతురు కాదు. అసలు వెలుతురు నిశ్చలమైనది. మనాకాశం భూతాకాశమై ప్రతిఫలించగా, విషయికంటె వేరుగా విషయములు గోచరిస్తున్నవి.

231. సత్యపదార్థం

బంగారం ఆభరణం కాదు. కాని ఆభరణం బంగారంకంటె వేరుగాదు. ఆభరణం ఏ రూపంలో వున్నా, ఎన్నిరకాల ఆభరణాలున్నా, అసలు వస్తువు ఒక్కటే – అది బంగారం. అట్లే శరీరాలు, ఆత్మవిషయం కూడ. శరీరాలన్నిటిలోనూ అసలు వస్తువు – సత్యపదార్థం ఆత్మయే.

232. సత్యప్రకటనం తీరులు

'యోగః కర్మసు కౌశలం' – కర్మ కౌశలమే యోగం; 'సమత్వం యోగ ఉచ్యతే' – సమత్వమే యోగం; 'మామేకం శరణం వ్రజ' – నన్నే శరణుపొందు; 'ఏకమేవా ద్వితీయం' – ఒక్కటే, రెండవది లేదు; కర్మ, యోగ, భక్తి, జ్ఞానాలను సూచించే ఈ నాలుగింటి అర్థమూ ఒక్కటే. ఒకే సత్యం భిన్న ముఖాలుగా ప్రదర్శించబడింది.

233. సత్యవస్తువు

విషయాలు, విషయానుభూతులు, సంకల్ప వికల్పాలు అన్నీ మనోభావనలే. మనస్సుకు మూలం నేననే అహంకారం. అహంకారానికి మూలం శుద్ధచైతన్యం. సత్యవస్తువు అదొక్కటే. జీవుడు అన్నా, అహంకారం అన్నా, మనస్సు అన్నా ఒకటే. ఇవన్నీ మిథ్యలు.

234. సత్యశ్రవణం

సత్యవస్తువును గురించిన శ్రవణం రెండు రకాలు: మొదటిది గురువు వివరించి చెప్పగా వినడం. రెండవది తనకుతానే ప్రశ్నించుకొని అఖండమైన 'నేను'గా తనయందే అన్వేషించి, సమాధానం కనుగొనడం. నిక్కమైన శ్రవణం రెండవదే.

235. సత్యసాక్షాత్కారం

ఉన్నది ఒక్కటే సత్యవస్తువు. అది మన నిజస్వరూపం. కాని, మన మిప్పుడు అసత్యంతో తాదాత్మ్యం చెంది ఉన్నాం. ఆ తాదాత్మ్యన్ని వదలించుకొని మన సత్యస్వరూపం తెలుసుకోడానికే భక్తి, జపం, విచారం మొదలైనవి. సత్యస్వరూపాన్ని భావించడం వల్లనే అసత్య తాదాత్మ్యం తొలగుతుంది. వాస్తవానికీ భావన సత్యస్వరూపానికి అడ్డుగా ఉన్న అవరోధాలను తొలగించుకోడం మాత్రమే.

236. సత్సంగం

సత్సంగమనగా సద్వస్తువుతో కలసి ఉండడం. సద్వస్తువు నిజానికి ఒక్క ఆత్మయే. కాని, అది తెలుసుకోలేనంత కాలం, తెలిసికొన్న సత్పురుషులతో కలసి ఉండడమే సత్సంగమవుతుంది. ఆ సత్సంగం అంతర్ముఖత్వానికి దారితీసి ఆత్మసాక్షాత్కారాన్ని కలిగిస్తుంది.

237. సత్యానుభూతి

నీవు అహంకారానివి కాదని చెపుతూ ఉంటే సత్యం గ్రహించక ఇంకా అహంకారంతోనే తాదాత్మ్యం చెందుతావెందుకు? 'మందు

తీసుకునేటప్పుడు కోతిని గురించి ఆలోచించవద్దు' - అనడంవంటిదే అది, - ఎన్నటికీ సంభవం కాదు. సత్యమును ప్రస్తావించినప్పుడు, 'సోఽహం' అనీ, 'అహం బ్రహ్మాస్మి' అనీ ఇంకా ధ్యానిస్తావెందుకు? పరమార్థం జాడ తెలిసి అందుకోడమే కావాలి. మాటలు ఊరకే జపిస్తూ ఆలోచిస్తూ కూర్చుంటే చాలదు.

238. సత్యాసత్యాలు

బ్రహ్మముకంటె వేరుగా చూడబడినప్పుడు, సకల వస్తువులూ అసత్యములే. కాని, అవే బ్రహ్మముగా, బ్రహ్మముకంటె అనన్యముగా చూడబడినప్పుడు సత్యములౌతున్నవి. అధిష్ఠానమయిన బ్రహ్మమును బట్టియే వాటికి ఆ సత్యత్వం.

239. సంన్యాసి - గృహి

వ్యక్తిత్వాన్ని, అహంకారాన్ని వదలిపెట్టడమే సంన్యాసం, కాషాయాంబరాలు ధరించడం కాదు. ఒకడు గృహియైనా తాను గృహినని అనుకోకపోతే అతడు సంన్యాసియే. అదే రీతిగా ఒకడు కాషాయాంబరధారియై తిరుగాడుతున్నా, తాను సన్యాసినని అనుకుంటే అతడు సంన్యాసికాడు. సంన్యాసినని అనుకోడం సంన్యాస పరమార్థానికి విరుద్ధం.

240. సంన్యాసి - గృహస్థు

'నేను సమస్తమూ సన్యసించా' ననుకొనే వానికంటె తన ఐహిక కర్మలు నిర్వహిస్తూనే 'నేను ఇది చేస్తున్నాను', 'నేను కర్తను', - అని అనుకోనివాడు గొప్పవాడు. 'నేను సంన్యాసి' ననుకునే సంన్యాసి

నిజమైన సంన్యాసి కానేరడు. 'నేను గృహస్థును' అని అనుకోని గృహస్థు నిజమైన సంన్యాసియే.

241. సమత్వం

అనేకత్వంలో ఏకత్వం దర్శించడమే సమత్వం. సుఖదుఃఖాది ద్వంద్వసహన రూపమైన సమత్వం దానిని అనుసరించే వుంటుంది. ద్రష్ట ఒక్కడే. ద్రష్ట లేనిదే దృశ్యాలు లేవు. దృశ్యాలన్నీ మారినా ద్రష్టమాత్రం మారడు. అదే దర్శించవలసినది.

242. సమాధి - కర్మప్రవృత్తి

సాధకుడు నిమీలిత నేత్రుడై సమాధిస్థితిని అందుకోడం మంచిదే. కాని, దానిని కూడా అతడు అతిక్రమించవలసి ఉన్నది. కర్మకు, కర్మరాహిత్యానికీ పరస్పర వైరుధ్యం లేని స్థితిని సైతం అతడు సాధించాలి. కర్మప్రవృత్తియందు సమాధి భంగం కలుగుతుందని భయపడడం అజ్ఞానలక్షణం. సమాధి ప్రతివానికీ స్వాభావిక జీవితం అయిపోవాలి.

243. సమాధి - రోమాంచం

పరిపూర్ణ శాంతిస్థానమైన సమాధిలో రోమాంచం, గాద్గద్యం, ఆనందభాష్పాలు మొదలైనవానికి తావులేదు. సమాధినుండి లేచినప్పుడు దాని స్మృతివలన ఈ చిన్నెలు కలుగవచ్చు. భక్తిమార్గంలో ఇవి సమాధికి పూర్వమందు కలుగుతాయి. జ్ఞానమార్గంలోనైనా వ్యక్తిత్వం ఇంకా ఏమాత్రం మిగిలివున్నా ఇవి కలుగవచ్చు.

244. సమాధిస్థితి

సమాధి మన సహజస్థితి, ఆత్మస్వరూపం. జాగ్రత్ – స్వప్న – సుషుప్తి అవస్థలు మూడింటిలోనూ అది అంతర్వాహినిగా వున్నది. జాగ్రదవస్థలోంచే మనం సమాధిని పొందగలిగితే సుషుప్తి అవస్థలోకూడ అది నిలిచిపోతుంది. జాగ్రదవస్థలోని ఎరుక, సుషుప్తి అవస్థలోని మరుపు, రెండూ మనోభూమికకు చెందినవే. ఆత్మస్వరూపమైన సమాధిస్థితిలో వీటిని అతిక్రమించగలుగుతాము.

245. సర్వం ఆత్మయే

ఏ విషయాలైనా చూచేటందుకుగాని తెలుసుకునేటందుకుగాని 'తాను' ఉండాలి. చూచేవాడు లేనిదే వాటికి ఉనికి లేదు – కనుక అవి తనకంటె వేఱుగా లేవు. విషయాలను అజ్ఞాని చూచేటప్పుడైనా తననే చూచుకొంటున్నాడు. కాని, భ్రమచేత ఆ విషయాలు తాను కాదని అనుకొంటున్నాడు. విషయం, విషయి – అన్నీ ఆత్మలోనివే, తనలోనివే. చూచేవాడు, చూడబడేవి, అనేవి లేవు. ఆ రెండూ ఆత్మలోవే, ఆత్మస్వరూపాలే. ఆత్మలు అనేకం అని చెప్పడానికి కూడా వీలులేదు. ఉన్నది ఒక్కటే ఆత్మ.

246. సర్వం ఖల్విదం బ్రహ్మ

జ్ఞానదృష్టి అలవరచుకొన్నప్పుడే ప్రపంచం బ్రహ్మమయంగా కనిపిస్తుంది. బ్రహ్మమెవరో తెలియకుండా ఆయన సర్వమయత్వం ఏవిధంగా తెలుసుకోగలుగుతావు?

247. సహజస్థితి

'నేను మానవుడను' అని అనుకోడం సహజస్థితి కానేరదు. 'నేను ఉన్నాను' అని అనుకోడమే వాస్తవానికి సహజస్థితి. 'మానవుడను' అని దానిని విశేషణ విశిష్టం చెయ్యడమెందుకు? 'ఉన్నాను' – అనేదే యథార్థం. అదే సహజస్థితి. నేను ఇది అనీ, అది అనీ ఆ ఉనికిని పరిమితం చెయ్యడం అనుచితం. గాఢనిద్రలో ఆ పరిమితి లేదు. మేల్కొని వుండగా ఆ అనుభూతిని (జాగ్రత్ – సుషుప్తిని) సంపాదించడమే కావాలి.

248. సాధకుడు – సాధన

ఆత్మసాక్షాత్కారం కలుగనంతవరకూ సాధన అవసరమే. ప్రతిబంధకాలను తొలగించడానికి అవి ఉద్దేశించబడ్డాయి – అయితే, సాధనలు చేస్తున్నప్పటికీ తుదకు ఒక విధమైన నిస్సహాయస్థితి సాధకునకు ఏర్పడుతుంది. అప్పుడు ఆ సాధనలు కూడా కొనసాగించలేకపోతాడు. ఈశ్వరానుగ్రహం ఆ సమయంలో అభివ్యక్తమవుతుంది. సాధకుడు ఆత్మసాక్షాత్కారం పొందగలుగుతాడు.

249. సాధన లక్ష్యం

వస్తుతః సాధనకు లక్ష్యం అజ్ఞాన నివృత్తిగాని, జ్ఞానసముపార్జనకాదు. ఎందుకంటే, జ్ఞానం ఎప్పుడూ ఉన్నదే కాని క్రొత్తగా సంపాదించవలసినది గాదు. ఒకప్పుడుండి, ఒకప్పుడు లేక క్రొత్తగా సంపాదించవలసిన దానికి శాశ్వతత్వం లేదు. అట్టి దానిని సంపాదించి ప్రయోజనం లేదు.

250.సాక్షి చైతన్యం

సామాన్యంగా సాక్షి అనే పదం చూడబడే విషయమున్నప్పుడే వాడబడుతుంది. అనగా అక్కడ ద్వైతమున్నది. కాని, సత్యం ఈ రెండింటికీ అతీతం. ఆత్మను 'సాక్షి చేతా కేవలో నిర్గుణశ్చ' అని వర్ణించినప్పుడు, అక్కడ సాక్షి శబ్దానికి సన్నిధి అని అర్థం. సూర్యుని విషయం చూడండి. మన దైనందిన వ్యవహారాలకు సూర్యుడు అవసరం. ఈ జగద్వ్యాపారాల్లో ఆయనకు భాగం లేదు. కాని, ఆయన లేనిదే ఇవేవీ జరగవు. వీటన్నిటికి ఆయన సాక్షి. ఆత్మ విషయంలో కూడా అంతే.

251. సాక్షిత్వభావన

చిత్తవృత్తులకు సాక్షిగా తనను తాను భావించుకోడం సహజ స్థితి కానేరదు. అది చిత్తనిరోధానికి సహాయకమైన ఒక భావన మాత్రమే అవుతుంది. నీవు భావించినా భావించకపోయినా ఆత్మవస్తు వెప్పుడూ సాక్షిగానే వున్నది. ఆత్మ స్వరూపంగా ఉండిపోవడం తెలిస్తే ప్రపంచమూ ఉండదు. సాక్షీ ఉండడు.

252. సుఖస్థానం

ఏకాంతవాసంలోని సుఖం విజనస్థలాలలో దొరుకుతుందని చెప్పలేము. జనసంకుల ప్రదేశాలలో దొరకదనీ చెప్పలేము. విజన స్థలాలలోగాని జనసంకుల ప్రదేశాలలో గాని కాదు దానిని అన్వేషించవలసినది. అది లభ్యమయ్యే స్థానం ఆత్మ.

253. సుషుప్తిలోని ఎరుక

కారుమేఘాలు క్రమ్ముకొని వున్న కటిక చీకటి రాత్రిలో కళ్ళు బాగా తెరచి చూస్తున్నా చీకటి తప్ప వస్తుజాతమేదీ కనిపించదు. అదే రీతిగా సుషుప్త్యవస్థలో ''ఏమీ తెలియకపోవడం'' అనే విషయాన్ని తెలుసుకునేవాడు మిగిలి ఉంటాడు.

254. సుస్పష్ట విషయం

తత్త్వశాస్త్రంలోని వివిధ సిద్ధాంతాలు సత్యాన్ని విశదీకరించడానికని చెపుతారు. కాని, వాస్తవానికవి సుస్పష్టమైన దానిని గజిబిజి చేస్తున్నాయి. ఏది తెలుసుకోడానికైనా తాను ఉండాలి. ఇది సుస్పష్టం. తానే ఆత్మ. తాను తానుగా ఉండిపోవడమే కావాలి గాని, తానుకాని దానిని వివరిస్తూ కూర్చున్నందువల్ల ఏమి ప్రయోజనం?

255. సుస్థిర ధ్యానం

ధ్యానం సుస్థిరమైనప్పుడు, ఇక అది వదలిపోదు. నీవు ఆడుతున్నా, పాడుతున్నా, ఏ పనిలో వున్నా, అప్రయత్నంగా అది సాగిపోతూ ఉంటుంది. నిద్రలో సైతం అది కొనసాగుతూనే ఉంటుంది. సాధకునికి స్వాభావికమై పోయేటంతగా ధ్యానం స్థిరమైపోవాలి.

256. సూర్య చంద్ర న్యాయం

సూర్యుని వెలుగు ప్రతిఫలించడంచేత చంద్రుడు ప్రకాశిస్తున్నాడు. సూర్యుడస్తమించినప్పుడు, చంద్రుని వెలుగు

వస్తువులను ప్రకాశింపజేయడానికి పనికివస్తుంది. సూర్యుడు ఉదయించిన పిమ్మట, చంద్రబింబం వెలవెలపోతూ ఆకాశంలో కనిపిస్తుందే తప్ప, దాని అవసరం ఎవరికీ ఉండదు. అటువంటిదే హృదయానికీ మనస్సుకూ ఉన్న సంబంధం. ప్రతిఫలించిన వెలుగుమూలంగా మనస్సు విషయజ్ఞానానికుపయోగిస్తుంది. అది అంతర్ముఖమై హృదయజ్యోతి స్వయంగా ప్రకాశించినప్పుడు మనస్సు పగటి చంద్రునివలె నిష్ప్రయోజన మౌతుంది.

257. సృష్టి ప్రయోజనం

సృష్టి ప్రయోజనం ఏమిటి? సృష్టి ప్రయోజనం ఈ ప్రశ్న ఉదయింపజేయడానికే. ప్రశ్నకు జవాబుకై అన్వేషణ తుట్టతుదకు ఆత్మాన్వేషణగా పర్యవసిస్తుంది. అనాత్మను త్రోసిపుచ్చి ఆత్మను విశుద్ధరూపంలో అనుభూతం చేసుకొన్నప్పుడు ఈ ప్రశ్న అంతరిస్తుంది.

* * *

దేహంతో తాదాత్మ్యబుద్ధి నీవు వదలుకుంటే సృష్టి, జన్మ, కర్మ మొదలైనవానిని గురించి ప్రశ్నలు పుట్టనే పుట్టవు. గాఢనిద్రలో నీకా ప్రశ్నలు ఉదయించడం లేదు. అదే రీతిగా ఆత్మసాక్షాత్కారం పొందిన స్థితిలో కూడా అవి ఉదయించవు. దేహాత్మబుద్ధిని వదలుకొని నీ స్వస్వరూప సాక్షాత్కారం పొందాలనేదే సృష్టి ప్రయోజనం.

258. సృష్టి రహస్యం

విషయి లేనిదే విషయం లేదు. ద్రష్ట లేనిదే దృశ్యం లేదు. విషయాలు తమ ఉనికిని తమంత తాము తెలియజేయలేవు. అవి ఉన్నవని తెలియజేస్తున్నది నీవు. నీవు లేకుండ వాటికి స్వతంత్ర సత్తా లేదు. కనుక, నీవెవరవో నీవు ముందు తెలుసుకుంటే, ఈ సృష్టిని అప్పుడు అర్థం చేసుకోగలుగుతావు.

259. స్వతంత్రేచ్ఛ

వ్యక్తిత్వం ఉన్నంతవరకూ జీవునికి స్వతంత్రేచ్ఛ ఉన్నది. ఇది గుర్తించడంవల్లనే శాస్త్రాలు ఆ స్వతంత్రేచ్ఛను సక్రమ మార్గంలో వినియోగించుకోవలసిందని ఉపదేశిస్తూ ఉంటాయి. స్వతంత్రేచ్ఛ ఉన్నదా, లేక సర్వమూ విధి నిర్ణీతమా అనే ప్రశ్నలు ఎవనికి ఉదయిస్తున్నాయో తెలిసికొని అందు స్థిరపడడం నేర్చుకో. అప్పుడే రెంటినీ అతిక్రమించ గలుగుతావు. నీకు శాంతి లభిస్తుంది. ఈ ప్రశ్నలను గురించిన చర్చకు ముఖ్య ప్రయోజనం అదే.

260. స్వప్న దృష్టాంతం

తనకెవ్వరూ నిద్రాభంగం చెయ్యకుండా ఉండాలని ఒకడు గది తలుపులు బిడాయించుకుని పడుకుంటాడు. నిద్రలో కళ్ళు మూసుకుంటాడు గనుక బయటి వస్తువులేవీ కనిపించవు. కాని, కలలో ఒక విశాల ప్రపంచాన్ని, అందులో జనాన్ని, తనను గూడ చూస్తాడు. అదంతా ఎక్కడిది? తన మెదడులో విస్తరిల్లినదే కద. చిన్న మెదడులో అంత విశాల ప్రపంచం ఎలా పట్టింది? జగత్తు

కేవలం మనోభావమనీ, మనోభావ పరంపరయనీ తరచుగా చెప్పబడే దానిని ఈ దృష్టాంతం విశదీకరిస్తుంది.

261. స్వస్వరూపజ్ఞానం

మన నిజస్వరూపాన్ని మనం ఎలా గుర్తించగలుగుతాము? ఆలోచనలనుండి పూర్తిగా విముక్తి పొందిన స్థితి అట్టి గుర్తింపునకు మిక్కిలి అనుకూలం.

262. స్వస్వరూప స్థితి

'అసలు నేను' తానొక్కటై ప్రకాశించేటప్పుడు 'నేను బ్రహ్మమును' అని చెప్పుకోదు. 'నేను మానవుణ్ణి' అని ఏ మానవుడైనా చాటుకుంటూ ఉంటాడా? ఎవరైనా కాదంటే తప్ప అలా చాటుకోవలసిన పని అతనికేముంది? 'నేను పశువును కాదు మానవుణ్ణి' అని చెప్పుకోడానికి మానవుడు తాను పశువునని భ్రమించడం జరగదు గదా. అట్లే 'అసలు నేను' తానొక్కటై ప్రకాశిస్తూ, కాదనేవారితరులెవ్వరూ లేనప్పుడు, 'నేను బ్రహ్మము' నని చాటుకోవలసిన అవసరం దానికి లేదు.

263. స్వరూపానందం

మారే అవస్థల వెనుక మారకుండా ఉన్న నీ స్వరూపమేమిటో తెలుసుకో. ఆ నీ స్వరూపం ఆనందమయం. మారే శరీరం నీవనీ, మనస్సు నీవనీ ఇప్పుడనుకుంటున్నావు. కాని, నీవసలు మారనివాడవు, శాశ్వతుడవు. ఆ సత్స్వరూపమే చిత్స్వరూపం. అదే ఆనందస్వరూపం కూడ.

264. హృదయం – ఆత్మ

నీవున్నావని నీకు తెలుసు. ఎక్కడ ఉన్నావు? శరీరంలోనే ఉన్నావు. అయినా, శరీరమంతటిలో కాదు. శరీరమంతా నీవు వ్యాపించి ఉన్నా నీ ఆలోచనలన్నీ ప్రభవించి లయించే కేంద్రమొకటి ఉన్నదని ఒప్పుకుంటున్నావు. అంగవిచ్ఛేదం కలిగినా ఆ కేంద్రంలోనే ఉంటావు. అదే హృదయం. అది కేవల మొక కేంద్రమే కాదు. సాక్షాత్తూ ఆత్మయే. ఆత్మకు మరొక పేరే హృదయం.

265. హృదయమే ఆత్మ

హృదయమే ఆత్మ. అది స్వయం ప్రకాశమానం. వెలుగు హృదయంనుండి బయలుదేరి మనస్సుకు స్థానమైన మెదడుకు చేరుతుంది. మెదడులో అలా ప్రతిఫలించిన వెలుగుతోనే మనస్సు ప్రపంచాన్ని చూస్తుంది. దానికా వెలుగు అందనప్పుడది ప్రపంచాన్ని చూడలేదు. మనస్సును ఆ వెలుగుకు మూలస్థానం వైపు త్రిప్పినప్పుడు విషయజ్ఞానం అంతర్ధానమై ఆత్మ హృదయాకాశంగా ప్రకాశిస్తుంది.

266. హృదయము – కుండలిని

కుండలిని హృదయం కంటె వేరుకాదు. వాస్తవానికి హృదయంలోనే షడాధారం (షట్చక్ర కేంద్రం) ఉన్నది. సుషుమ్నానాడి, దానికి మూలమైన కుండలిని – అంతా హృదయంలోనివే.

267. హృదయకేంద్రం

హృదయమనేది శరీరంలో ప్రక్కన స్పందించే మాంసకోశం కాదు. దాని స్థానం కుడివైపున ఉన్నది. మనం శరీరంలో ఉన్నామనుకునే అలవాటును బట్టి అది శరీరానికి కేంద్రమని చెప్పబడింది గాని, వాస్తవానికి ఈ శరీరం, ఇతర ప్రపంచం – అన్నీ ఆ కేంద్రంలోనే ఉన్నాయి.

* * *

శరీరమంతటికీ హృదయమే ముఖ్యకేంద్రం. మెదడుకు వెలుగు, బలము దానినుండే ప్రసరిస్తాయి. వాసనలు అతి సూక్ష్మరూపంలో మెదడులోనే ఉంటాయి. హృదయం నుంచి శక్తి మెదడులోకి ప్రవహించడం జరుగుతుంది. మెదడు వాటిని సినిమా ప్రదర్శనలాగ విపులీకరించి ప్రదర్శిస్తుంది.

268. హృదయకోశం

నానాత్వ విశిష్టమైన ప్రపంచంగా మనస్సిప్పుడు భాసిస్తూ ఉన్నది. నానాత్వం అభివ్యక్తం కానప్పుడు అది తన సహజ స్థానమైన హృదయంలో ఉండిపోతుంది. విశేషాలేవీ లేక ఆత్మస్థుడై ఉండడమే హృదయకోశంలో ప్రవేశించడం.

269. హృదయజ్యోతి

గదిలో చీకటి ఉన్నప్పుడు, కనులు వస్తువులను గుర్తించడానికి దీపం కావాలి. సూర్యోదయమైతే దీపం అక్కరలేకుండానే వస్తువులు కనిపిస్తాయి. సూర్యుని చూడడానికి దీపమక్కరలేదు. స్వయంప్రకాశమానుడైన సూర్యునివైపు నీ దృష్టి మళ్ళిస్తే చాలు. అట్లే 'విషయాలు గుర్తించడానికి మనస్సులో ప్రతిఫలించిన వెలుగు అవసరమవుతుంది. హృదయాన్ని గుర్తించడానికి మనస్సును దాని వైపు త్రిప్పితే చాలు. అప్పుడు మనస్సు లయించిపోయి హృదయజ్యోతియే ప్రకాశిస్తుంది.

270. హృదయస్థానం

హృదయం కుడివైపున ఉన్నదా, ఎడమవైపున ఉన్నదా, అనే విచారణ వదిలేసెయ్యి. ఆ కుడి యెడమలు శరీరానికి సంబంధించినవి. ముఖ్యమైన విషయం – ఆత్మయే హృదయం. ఆత్మను తెలుసుకుంటే ఆ పైన అంతా నీయంతట నీకే అవగతమవుతుంది.

సర్వం శ్రీరమణార్పణమస్తు

అనుబంధము

అద్వైత సూత్రములు

కృష్ణభిక్షు శ్రీ ఓరుగంటి వేంకటకృష్ణయ్యగారి తెలుగు మూలము అలభ్యమగుట వలన శ్రీ ఓరుగంటి రామచంద్రయ్యగారి ఆంగ్లానువాదమునుండి కావింపఁబడిన ఆంధ్రానుభవము.

–పోలూరి హనుమజ్జానకీరామశర్మ

1) వేద్యం వాస్తవం వస్తు

‘‘విద్’’ అను ధాతువునకు ‘‘తెలిసికొనుట’’ అని యర్థము. విద్య అను పదము 1) తెలిసిన దానిని, 2) తెలిసికోవలసిన విధానమును రెండింటిని వ్యక్తమొనర్చును.

ఏది తెలిసికొనఁదగినదియో, దేనిని తెలిసికొనుట మనకు విహితమో అది వేద్యము.

జాగ్రదవస్థయందు అంతఃకరణము, చక్షుస్సు మొదలగు నింద్రియముల ద్వారమున సకల విషయములను గ్రహించుచున్నది. కావున ఈ విషయ సముదాయము వేద్యము కాదని నిరూపింపనక్కరలేదనుట స్పష్టము.

స్వప్నమునందు సూక్ష్మమైన మనస్సు సూక్ష్మములైన యింద్రియముల ద్వారమున సూక్ష్మ ప్రపంచములోని

ఆధ్యాత్మిక భక్తి తత్వ జ్ఞానప్రచారం ఈ WEB SIGHTS ద్వారా చేస్తున్నాము

OUR VIDEOS,AUDIOS,e-BOOKS WEB SIGHTS ల లోని LINKS ద్వారా FREE గా DOWNLOAD చేసికొనండి

WWW.telugudevotionalswaranjali.blogspot.in

స్వామి విద్యాప్రకాశానంద స్వాములవారి వారి ప్రవచనముల WEB SIGHT LINK: WWW.gitamakarandam.blogspot.in

స్వామి సుందర చైతన్యానందుల వారి ప్రవచనములWEB SIGHT LINK:

WWW.sundaravignanagrandalayam.blogspot.in

FOR HINDI BHAJANS, SANSKRIT SLOKAS & ASHTAKAMS & CHANTS WEB SIGHT LINK:

WWW.hindudevotionalswaranjali.blogspot.in

OUR YOUTUBE VIDEO CHANNELS :

www.youtube.com/user/ hindudevotional0

www.youtube.com/user/shruthimandiramu

OUR e-BOOKS CHANNEL :

www.scribd.com/ysreddy94hyd

OUR E-mail ID: ysreddy94hyd@gmail.com మీరు కూడా మీ వంతు ఆధ్యాత్మిక భక్తి తత్వ జ్ఞానప్రచారాన్ని మన WEB SIGHTS ను మీ friends కు మరియు బంధువులకు పంపండం ద్వారా చేయండి.

విషయములను తెలిసికొనుచున్నది. కావున ఆ సూక్ష్మవిషయ సముదాయము కూడ 'వేద్యము' కానేరదు.

మూర్ఛ, గాఢనిద్ర మొదలగు దశలయందు ఎవనికిని ఏదియును వేద్యముగా గోచరింపదు.

కావున విషయములలో నే యొక్కటియును వేద్యముగా పరిగణింపఁబడఁజాలదు.

ఎవఁడు ఈ సకల దశలలో విషయములను తెలిసికొనుచున్నాఁడో వాఁడే 'వేద్యము'. అదియే వస్తువు.

'వస్' ధాతువునకు 'ఉండుట', 'ప్రకాశించుట' అను నర్థములు కలవు. మనస్సుచేత గుర్తింపఁబడిన విషయములు కూడ ఉండుచున్నవి, మఱియు ప్రకాశించుచున్నవి. 'వేద్యము' అను పదముచేఁగాని యివి ఉద్దేశింపఁబడుట లేదు. తెలిసికొనుచున్న 'వస్తువు' తెలిసికొనఁబడుచున్న విషయముకన్న తప్పక భిన్నమై యుండవలయును. కావున ఇక్కడ 'వస్తువు' అనగా 'ఎల్లప్పుడు ఉండునది' 'ఎల్లప్పుడు ప్రకాశించునది' అని గ్రహింపవలయును.

ఎల్లప్పుడు అనఁగా భూతభవిష్యద్వర్తమానకాలములు, జాగ్రత్స్వప్న సుషుప్తులు, మనస్సు స్తబ్ధమై పనిచేయలేని స్థితి అని కూడ గ్రహింపవలసి యున్నది. ఎందువల్ల ననఁగా ఈ మూఁడు దశలును మనస్సు యొక్క విశేషణములే.

'ప్రకాశించుట' అనగా గుర్తించుట, గుర్తింపఁబడుటయు అగును. ఏవి గుర్తింపబడుచున్నవో అవి యన్నియు విషయములు. కాఁబట్టి ఆ విషయ సముదాయము 'వేద్యము' కాదు. ఏది గుర్తించుచున్నదో అది మాత్రమే వేద్యమైన వస్తువు.

వాస్తవమ్ – ఆ యా సమయములో తాత్కాలికముగా సకల విషయములు గుర్తింపబడుచుండును. అవి పుట్టుచు గిట్టుచు నుండును. కావున అట్టి విషయము 'వేద్యవస్తువు' కాదు. వేద్యవస్తువు అన్ని కాలములయందును ప్రకాశించుచునుండును.

2) తదజమవినాశి చ

వేద్యమునకు అనఁగా తెలిసికొనుచున్న వస్తువునకు జనన మరణములు లేవు. ఎందువల్లననగా అది ఎల్లప్పుడును ప్రకాశించుచుండును. పరిణమించుట, వృద్ధినొందుట, నశించుట అనునవి భిన్నములైన విశేషణములు. విషయమునకు సంబంధించి ఇవి పూర్వవస్తునాశముగా నుండునని చెప్పవచ్చును. కాని మనకు కావలసినవేద్యము, నిర్వచనము ననుసరించి, శాశ్వతమైనది. దానికి పూర్వము కాని పరము కాని యుండుటకు వీలులేదు. అందువలన అది అవినాశి యనుట స్పష్టము.

3) ఏకం సత్

అది ఎల్లప్పుడు ఉండునది. కావున అది 'సత్' అని చెప్పబడుచున్నది. 'సత్' అనగా ఉండుట.

అది ఏకము. అది ఒక్కటిగా నుండఁగా దృశ్యములైన విషయములు అనేకములుగా ఉన్నవి. వానిలో ఏదియును 'సద్వస్తువు' కాదు. 'ఇందు నానారూపమైనది ఏదియును లేదు' (నేహ నానాస్తి కించన) అని శ్రుతి ప్రకటించుచున్నది.

4) ఏకమేవ

అది ఒక్కటియే. ఈ సిద్ధాంతమును అంగీకరించుచు కొందఱు 'సద్వస్తువు' అంగి, అనఁగా అంగములు కలది అనియు, తక్కిన విషయములన్నియు దానికి అంగములనియు చెప్పుదురు. కాని అంగి సద్వస్తువైనచో, అంగములు కూడ సద్వస్తువులే కావలసియుండును. దీనిని నిరాకరించుటకే 'అది యొక్కటే' (ఏకమేవ) అని స్థిరీకరింపఁబడుచున్నది.

అంగాంగిభావముతో గ్రహించువారు దీనిని మూర్తము, అమూర్తమనియు వర్ణించుచుందురు. అమూర్తమునకు ఎవడును అంగములను నిరూపింపఁజాలఁడు. కావున ఈ యభిప్రాయమును నిరాకరింపవలసియున్నది. 'సద్వస్తువు ఒక్కటియే' (ఏకమేవ సత్) అను సూక్తి ఈ పనినే చేయుచున్నది.

5) అద్వితీయమ్

'ఏకమేవ' అనునదియే రెండవ పదార్థము ఉండునేమో అను నూహల నన్నింటిని త్రోసివేయుచున్నది. అట్లయినచో అది 'అద్వితీయము' అని పునరుక్తిగా చెప్పుట యెందులకు? కొందఱు అద్వితీయమనఁగా సాటిలేనిది అనునర్థమున గ్రహింతురు. 'సద్వస్తువు ఏకము' (ఏకం సత్) అను సూక్తి దీనిని నిరాకరించును. అనేక పదార్థము లున్నప్పుడే పోలికలు చెప్పుటకు వీలగును.

బౌద్ధులు మొదలగువారు 'అద్వితీయము' అనుదానికన్న 'అద్వయము' అను పదమును ఆదరింతురు. ఈ పదము వారిదృష్టిలో ఒక విశేషమును స్ఫురింపఁజేయును. 'ఒక్కటి' ఉన్నది

అని యనుకొన్నప్పుడే రెండవది, మూఁడవది అను ప్రసక్తి ఏర్పడును. ఆ 'ఒక్కటి' లేకున్నచో రెండవది ఉండదు. మూఁడవది ఉండదు. ''కావున అంతయును శూన్యమే'' అని వారిట్లు వాదింతురు. కాని అద్వైతమునందు 'ఒక్కటియేయైన వస్తువు' ఉండును.

6) వేద్యం న లక్షణతయా

వస్తువును తెలిసికొన వలయును. కాని దానిని తెలిసికొనుటకు దానికి ఏ విశేషములును లేవు. ఏ పదార్థమునకైనను దానిని గుర్తించుటకుఁదగిన విశేషములే దాని లక్షణములు. ఇవి వర్ణము, జాతి, కులము, కుటుంబము, రూపము, మూర్తి ఉత్సేధము (ఎత్తు), గుణాదికమైన స్వభావము, శీలము, క్రియ, విక్రియ అను మొదలగువానిపై ఆధారపడియుండును. ఏ రెండు పదార్థములు ఈ లక్షణములతో కేవలము సమానముగా నుండవు.

ఒక పదార్థమునుండి మఱియొక పదార్థమును విడిగా గుర్తించుటకు ఈ లక్షణములు తోడ్పడును. 'సద్వస్తువు' ఒక్కటియే అగుటవలన, దానియందు ఈ లక్షణము లేవియు సంభవింపవు.

లక్షణములను గుర్తించుటకు మనస్సు ఆవశ్యకము. మనస్సు లేని స్థితియందు 'వస్తువు' ఎట్లు తెలిసికొనఁబడును?

7) బ్రహ్మతయా

'బృహ' అనఁగా పెద్దది. అది దేని దృష్టిలో పెద్దది? మనస్సు సకల విషయములను గ్రహింపఁగలదు. ఏనుఁగు యొక్క

అడుగుజాడలయందు ఇతర జంతువుల యొక్క అడుగుజాడలన్నియు ఇమిడి పోవునట్లు, మనస్సు సకల విషయములను తనయందు ఇముడ్చుకొనఁగలదు. కావున విషయములన్నింటి కన్నను మనస్సు పెద్దది. కాని మనస్సు సద్వస్తువును గ్రహింపఁజాలదు. అందువలన అది మనస్సుకన్నను పెద్దది.

లక్షణములను బట్టి వివిధ విషయములను మనస్సు గ్రహించుచున్నది. కాని లక్షణములు పరిమితత్వమును వ్యక్తమొనరించును. బ్రహ్మముకన్న రెండవదియైన పదార్థము లేదు. కావున బ్రహ్మమునకు పరిమితులు లేవు. మఱి మనస్సు అనంతమైన దానిని గ్రహింపఁజాలదు.

మనస్సు ఎట్లు పుట్టుచున్నది; అది విషయమునకు సంబంధించియే పుట్టుచుండవలె. కావున మనసు సాధారణముగా విషయ ప్రపంచమును గుర్తించుచున్నట్లు సద్వస్తువును గుర్తింపఁజాలదు.

8) నిరంజనమ్

బ్రహ్మమునకు అన్వయముఖముగా విశేషణములు కుదరవు. కాని వ్యతిరేకముఖముగా కొన్ని విశేషణములను గమనింపవచ్చును. అట్టివానిలో నిరంజనము. అనఁగా 'దేనికిని సంబంధింపనిది' అనునది యొకటి. సంయోగము కాని, వియోగము కాని అనేక పదార్థము లున్నప్పుడే సంభవించును; ఒక్క పదార్థమే యున్నప్పుడు సంభవింపదు. బ్రహ్మమునకన్యముగా నేదియును లేదు. కావున

దాని విషయమున సంయోగమని గాని, వియోగమని గాని ఎట్లు చెప్పఁగలము?

9) నిర్వికారమ్

వికారమనఁగా మార్పు. రెండు పదార్థములు ఉన్నవని, అవి దగ్గరకు చేరియున్నవని అనుకున్నప్పుడు, వానిలో ఒకదానినుండి ఏవో కొన్ని శక్తులు ప్రసరించి రెండవదానియందు కొన్ని మార్పులు తెచ్చునని తలంపవచ్చును. లేదా, ఒక దానియందు గర్భితములై యున్న శక్తులు, రెండవ పదార్థము యొక్క సన్నికర్షచేత, ఉద్రిక్తములై వెలుపలికి ప్రసరించి తన చుట్టును మార్పులు కలుగుటకు త్రోవతీయవచ్చును. 'రెండవ దానివలన భయము' (ద్వితీయాద్వై భయమ్) అని శ్రుతి చెప్పుచున్నది. భయము అను పదముచేత వెఱపు మాత్రమే కాక అనురాగద్వేషములు కూడ సూచింపఁబడుచున్నవి. కాని బ్రహ్మమునకు వెలుపల అనుటయే లేదు. కావున దానికి బహిరంగమైన పదార్థమే లేదు. కాఁబట్టి బ్రహ్మమునకు మార్పు కలుగుటకే వీలులేదు.

అట్లయినచో బ్రహ్మమునకు తనయందే మార్పులుండుటకు వీలులేదా? బ్రహ్మమునందు బీజరూపమున నిగూఢములై యున్న శక్తులు కొన్ని స్వయముగా అభివ్యక్తములు కాఁగూడదా? ఈ సృష్టియంతయు అట్టి యొక యభివ్యక్తి విశేషము కాదా? లేక, పరిణామవాదులు ప్రతిపాదించునట్లు బ్రహ్మము నందలి యొక యంశము పరిణతమై ఆ మార్పువలన ఈ ప్రపంచము రూపొంది యుండఁగూడదా?

పై రెండు ఊహలను శ్రుతి నిషేధించుచున్నది. బ్రహ్మమును గూర్చి కేవలజ్ఞానమని శ్రుతి నిర్దేశించుచున్నది. అది బ్రహ్మమునందు వేఱొక పదార్థము నిలుచుటకు గాని, దానియందు లీనమగుటకు గాని, మఱియే విధమైన మార్పు సంభవించుటకుఁ గాని అవకాశమొసంగుట లేదు. కావున దానియందేదో యొకటి నిగూఢముగ దాగియుండి ఒకానొకప్పుడు అభివ్యక్తమగుట యెట్లు సంభవించును? ఇట్లు సృష్టి సిద్ధాంతము తిరస్కృతమైనది.

ఇంక పరిణామ వాదమును గూర్చి విచారింతుము. ఏ రెండు పదార్థములైనను స్వభావలక్షణముల చేత ప్రవృత్తులచేత భిన్నములుగనే యుండును. ఒక పదార్థము పరిణమించెననఁగా అది తన పూర్వలక్షణములను కోల్పోయి పునర్జన్మమునో లేక నూతనరూప నిర్మాణమునో పొంది నూతనలక్షణ సముదాయముతో మఱియొక పదార్థముగు ననియే చెప్పవలసియున్నది. ఈ పద్ధతి యందు జనకమైన పూర్వరూపము మిగులదు; పరిణితమై క్రొత్తగ రూపొందిన పదార్థమే యుండును. పాలు పెరుగుగా పరిణమించినపుడు పెరుగే ఉండును కాని పాలు మిగలవు. మఱియు పెరుగు తిరిగి పాలుగా మారుటయు సంభవము కాదు. బ్రహ్మము ప్రపంచముగా పరిణమించెనన్నచో, అప్పుడు ప్రపంచమే తప్ప బ్రహ్మము ఉండదు. ప్రళయమునందు ఈ ప్రపంచము మరల బ్రహ్మముగా అగుట ఎట్లు సంభవించును? బ్రహ్మము ఒకప్పుడైనను లేకుండునని యూహించుట సాధ్యమగునా? 'సత్' అనునది బ్రహ్మమునకు పర్యాయమైన పదముగా చెప్పినప్పుడు, సద్వస్తువైన బ్రహ్మము ఎల్లప్పుడును

ఉండునది యని, దానికి అభావమనునది, ఎప్పుడు లేదని వివరింపబడినది. కావున ఈ ప్రపంచ పరిణామవాదమును మనము త్రోసివేయవలసి యున్నది.

10) నిశ్చలమ్

మార్పు గాని, చలనము గాని దేనియందుండదో అది నిశ్చలము. ఒక పదార్థము అంతకుముందు అది ఆక్రమించి యున్న స్థానమునుండి లేక బిందువునుండి మఱియొక బిందువునకు చేరుట చలనమగును. బ్రహ్మమొక్కటే అంతటను ఉన్నప్పుడు ఒక స్థానము గాని కదలుట గాని ఎట్లు కుదురును? బ్రహ్మమునందు సాంతమైన (finite) పదార్థమేదియును లేదు. సాపేక్ష సిద్ధాంతము ననుసరించి, రెండు వాహనములు ఒక వైపుననే ఒక వేగముతోనే పోవుచున్నప్పుడు వానియందు ఉన్నవానికి ఒకరినొకరు చూచుకొనునప్పుడు చలనమే కన్పింపదు. మనము కదలుచున్నామని అనుకొన్నచో బ్రహ్మము నిశ్చలముగా నుండవలె. వేగముతో పోవుచున్న రైలుబండిలో నుండి చూచినచో సమీపమున నున్న భూమి కదులుచున్నట్లే కన్పించును. భూమియొక్క ఆ చలనము దృశ్యమాత్రమే (Apparent) కాని యదార్థము (Real) కాదు. తాము చలించుచున్నవారే నిశ్చలమైన బ్రహ్మమునందు చలనమును ఆరోపించుచున్నారు. అప్పుడు వారు తాము, బ్రహ్మము భిన్నము అని విశ్వసింపవలసియున్నది.

11) నిష్క్రియమ్

బ్రహ్మము నిశ్చలము. నిశ్చలమనగా క్రియారహితమనియు గ్రహింపఁదగును. ఇచ్ఛాశక్తి లేకుండ క్రియయుండదు. 'అది

చూచెను' 'అది కోరెను' ('స ఐక్షత; సోఽకామయత') అని వేదము చెప్పుట వలన కొందఱు బ్రహ్మము సగుణమైనదని చెప్పుచున్నారు.

కాని మనము బ్రహ్మమును సన్మాత్రముగనే నిర్వచించియున్నాము. అది ఏ క్రియను చేయదనియు చెప్పియున్నాము. కాఁబట్టి మనము 'ఐక్షత, అకామయత' అను పదములను ఔపచారికములనియే గ్రహింపవలసియున్నది.

12) నిర్గుణమ్

క్రియ లేనప్పుడు, గుణ సంబంధము కూడ ఉండదు. క్రియను బట్టియే నీవు ఏ పదార్థము యొక్క గుణము నైనను గ్రహింతువు. ఒకఁడు చేసిన పని, మంచిదో, చెడ్డదో అగును. అప్పుడు దానిని బట్టియే ఆ కర్తయొక్క మంచినో, చెడునో నీవు నిర్ణయింపవలె. క్రియ లేనిచో కర్త ఉండఁడు; కర్త లేకున్నచో వాని గుణ నిర్ణయము కూడ ఉండదు.

ప్రపంచము సత్యమని భావించునట్టి పరిణామవాదుల యొక్క ఆలోచనా విధానమిది. ఆ వాదమింతకు ముందే తిరస్కరింపబడినది. జరిగిన క్రియల ననుసరించి ఏర్పడునట్టి మనస్సుయొక్క ధర్మమే గుణము.

13) న ప్రకాశ్యమ్

ఇంద్రియముల ద్వారముననఁగాని స్మృతివలనఁగాని మనస్సు విషయములను గ్రహించుచున్నది. స్మృతి కూడ ఒక మనోధర్మమే. మనస్సు ఒకప్పుడు పైకి వచ్చుచు మఱియొకప్పుడు

అణఁగిపోవుచుండునని యింతకు ముందే చెప్పియున్నాము. అది గాఢనిద్రయందు ఉండదు. శాశ్వతమైన బ్రహ్మమే కదా మనస్సును ప్రకాశింపఁజేయునది; కాని మనస్సు బ్రహ్మమును చూడఁజాలదు. బ్రహ్మము యొక్క చైతన్యము, మనస్సు యొక్క ప్రకాశము రెండును ఒకటి కాదు. బ్రహ్మము యొక్క చైతన్యము బాహిరమైన మఱియొక పదార్థము చేత కలుగునది కాదు. రెండవ పదార్థమే లేనప్పుడు దానికి చైతన్యమును మఱియొకటి ఏది కలిగించును? బ్రహ్మము యొక్క చైతన్యము స్వయంసిద్ధము. అది ఇతర ప్రేరితము కాదు.

ఈ చైతన్యమే 'చిత్' అని చెప్పఁబడుచున్నది. ఈ 'చిత్తు' యొక్క కాంతి మనస్సుపై ప్రసరించినప్పుడు అది చిద్వృత్తి అని చెప్పబడుచున్నది. మనస్సు ఇతర విషయములను ప్రకాశింపఁజేసినప్పుడు దానిని 'చిత్తవృత్తి' లేక 'వృత్తి' అని యందురు.

14) బ్రహ్మ సత్యం జగన్మిథ్యా

బ్రహ్మముయొక్క విశేషములు దృశ్యజగత్తునకు సంబంధించినవి కావు. కావున జగత్తు ఎప్పుడు వాస్తవము కాదు.

బ్రహ్మము	జగత్తు
జన్మము లేనిది	జన్మము కలది
వినాశము నొందనిది	వినాశమును పొందునది
నిరపేక్షము (Unrelated)	సాపేక్షము (Relative)
మార్పును పొందనిది	మాఱుచుండునది

అచలము	వివిధమార్గములలో ఎప్పుడును చలించుచుండునది
నిష్క్రియము	పనిచేయుచుండునది
భేదరహితమైనది	భేదసహితమైనది
ప్రకాశకము	ప్రకాశ్యము

కావున బ్రహ్మము సత్యము, జగత్తు మిథ్య.

15) మిథ్యా నామ న సర్వథా భాస్యమ్

కొందఱు మిథ్య అనఁగా కుందేటి కొమ్మువలె, ఆకాశ పుష్పమువలె అత్యంతము అభావమైన పదార్థమని తలంతురు. ఇది సరి కాదు. అది ఎల్లప్పుడును ఉండునది కాదని మనము చెప్పవచ్చును. కాని అది యిప్పుడు లేదని ఎట్లు నొక్కి వక్కాణింపఁగలము? ఒక పదార్థము ఉన్నదని చెప్పుటకు, అది ద్రష్టకు గోచరించుచు, ఏదేని ఒక విధమున అతని యుపాధియందు కొంతమార్పును కలిగింపవలె. ఆ మార్పునకు కారణమైన దాని యొక్క ఉనికిని (Existence) నిరాకరించుటకు వీలులేదు. జాగ్రదవస్థయందు భూతప్రపంచమున్నది. స్వప్నమునందు మనఃకల్పితమైన ప్రపంచమున్నది. జాగ్రద్దశయందు ఈ ప్రపంచమును ఎట్లు చూచుచున్నాడో, స్వప్నమునందు కూడ ఆ ప్రపంచమును అట్లే ప్రతివాఁడును చూచుచున్నాఁడు. జాగ్రద్దశయందు ఈ ప్రపంచము వలన ఎట్టి అనుభవములు కలుగుచున్నవో అట్టి యనుభవములే స్వప్నమునందు కూడ అప్పుడు కన్పించునట్టి ఆ ప్రపంచము వలన కలుగుచున్నవి. ఒకఁడు

కలయందు పులిని చూచుచున్నాడు. ఆ సమయములో వానికి కలుగు భయము, కంపము మొదలగునవి మేల్కొనిన తరువాత కూడ వానియందు ఇంకను కన్పించుచునే యుండును. కలలో పులియే లేదన్నచో వానికి కలుగుచున్న కంపమునకు చెమట పట్టుటకు కారణమును ఎట్లా నిరూపింపఁగలము? మేల్కొన్న తరువాత మనకు ఆ స్వప్న ప్రపంచము లేదు అని మాత్రమే మనము దృఢముగా చెప్పఁగలము. జాగ్రత్స్వప్న ప్రపంచములు రెండును సమకాలికములు కావు. కాని ద్రష్ట మాత్రము రెండింటియందును ఒక్కఁడే యున్నాడు. కలఁగనుచున్నవానికి తేలుకుట్టినచో వాఁడు ఆ బాధచేత స్వప్న ప్రపంచమును వదలి జాగ్రత్ప్రపంచము లోనికి వచ్చుటలేదా?

గాఢసుషుప్తియందు ద్రష్టకు ఏ ప్రపంచము ఉండదు. కాని 'నేను' అను ఎఱుక (Awareness) మాత్రము ఉండును. అట్లు లేని యెడల నిద్రనుండి మేల్కొన్నవాడు తాను సుఖముగా నిద్రించినట్లు చెప్పఁజాలడు. దీనినిబట్టి గాఢనిద్రయందు కూడ ద్రష్టయొక్క మనస్సు ఉండునని నిరూపితమగుచున్నది. కాని ఆ యనుభవము జాగ్రత్తునకుఁగాని స్వప్నమునకుఁగాని సంబంధించినది కాదు. ద్రష్టకు దర్శనకాలమున ఆ ప్రపంచములు యథార్థములే.

16) జగత్ ప్రావాహికసత్యమ్

సూర్యకుటుంబము ప్రళయము నొందిన తరువాత కూడ ఇంకను అనేకములైన నక్షత్ర సంతతులుండవచ్చును. ఆ విధముగా

విశ్వము కొనసాగుచునే యుండును. కావున నదిలో నీరు ఎప్పుడును ప్రవహించుచుండునో అట్లే విశ్వసృష్టియును ప్రావాహికమైన సత్యమని కొందఱు వాదింతురు. ఆ వాదమునందలి హేతువులచేతనే అది నిరాకృతమగుచున్నది. సూర్యకుటుంబము నశించినదన్నచో, అది పరమార్థసత్యము కాదు, కాఁబట్టి నశించుట న్యాయమే. ప్రతి సూర్యకుటుంబము దేశకాల పరిమితులకు లోఁబడియున్నది. అది ఏదియును బ్రహ్మమువలె పరమార్థ సత్యము కాదు. అద్వైత సిద్ధాంతము అందులకు భిన్నముగా చెప్పుటలేదు. వ్యావహారిక సత్యము నిరాకరింపబడుట లేదు. జగత్తు వ్యావహారికముగా సత్యమే. జరిగినంతసేపు కల కూడ సత్యమే. కాని బ్రహ్మ మొక్కటియే పరమార్థ సత్యము.

ప్రావాహిక సత్యమును గూర్చి సిద్ధాంతము చేయువారు ప్రపంచము అట్టి సత్యము అని దృఢీకరించుటకు, తాము స్వయముగా శాశ్వతులై ఉండవలెను. కాని తమలో ఎవరు ఆ విధముగా శాశ్వతులై యున్నారు? వారిలో ఎవఁడైనను నేను శాశ్వతుఁడనని భావించినచో వాఁడు బ్రహ్మమే యగును. అప్పుడతఁడు బ్రహ్మముగా ఒక్కఁడే యగును. అతనికి భిన్నముగా చూడఁదగినది యేదియు నుండదు. బ్రహ్మము అద్వితీయమని శ్రుతి చెప్పుచున్నది. కావున ప్రపంచము ప్రావాహికముగా సత్యమనుటయు పొసంగదు.

17) ద్రష్టా జీవో బ్రహ్మైవ

సర్వత్ర సర్వకాలములందును ఉన్నది, తెలిసికోఁదగినదియైన తత్త్వము ఒక్కటియే అని నిశ్చయింపఁబడినది. మనస్సు కన్న విశాలతర మగుటచే ఆ తత్త్వము బ్రహ్మము అని చెప్పఁబడినది. అదియే దృశ్యమైన ప్రపంచమును అనుభవించునప్పుడు జీవుఁడని, దేహము నధిష్ఠించుటచే ఆత్మ యని చెప్పఁబడుచున్నది. కావున జీవుఁడు బ్రహ్మమే; ఇతరము కాదు (జీవో బ్రహ్మైవ నాపరః).

18) వాచారంభణం వికారో నామధేయమ్

వాక్కుయొక్క ఆరంభణ రూపమైన వికారము నామధేయము. ఏకము, అనిర్వచనీయము అయిన బ్రహ్మమునందు వివిధములైన బహుప్రపంచములు గోచరించుచున్నవి. ఇవి అసత్యములే అయినచో ఎట్లు పుట్టినవి?

ఈ ప్రశ్నను వేయుచున్నవాఁడెవడు? వాఁడు ఈ ప్రపంచములోనివాఁడు కాదా? కలను చూచుచున్నవాఁడు, తాను కలలోనివాఁడుగానే యుండి, ఈ కల ఎట్లు పుట్టినది, ఎవనినుండి పుట్టినది అని ఎవనిని ప్రశ్నించును? అతఁడు కూడ కలలోని ఒక దృశ్యమే కదా? ఆ కల పుట్టక ముందు ఆ కలలో తాను కూడ పుట్టలేదు. కలతోపాటు కలలో భాగముగా పుట్టినవాఁడు, కలకు పూర్వము జాగ్రదవస్థలో ఉన్నవానిని ఈ ప్రశ్న అడుగలేఁడు. కావున ఈ ప్రశ్నకు సమాధానమును పొంద యత్నించుట వ్యర్థము. ఉన్నది బ్రహ్మమొక్కటే అని తెలిసికొన్న తరువాత, 'ఇవిగో యివి యిప్పటికి ఉన్నవి; ఇవి క్రొత్తగా వచ్చినవి' అని చెప్పుట వ్యర్థమైన

వాచారంభణము లేక వాగ్వ్యవహారము. వికృతికి (Mutation) బీజము బ్రహ్మమునందుండి కొంతకాలమైన తరువాత మొలకెత్తినది అని చెప్పుటకు ఇది భిన్నము కాదు. అద్వైత సిద్ధాంతము ననుసరించి ప్రపంచ మసలు పుట్టనే లేదు. ఈ దృష్టిని అజాతవాద మందురు.

ఏదేని పదార్థము పుట్టిన దన్నచో, 'ఎప్పుడు?' అను ప్రశ్న వెంటనే సిద్ధమగును. బ్రహ్మము దేశకాలముల పరిమితులకు అతీతమైనది. ఇవి జగత్తునకు లక్షణములు.

జగత్తునకు సంబంధించినవియై, బ్రహ్మమునకు ఏ విధముగను సంబంధింపని లక్షణములను బ్రహ్మమునందు ఆరోపించుట ఈ ప్రశ్నకు మూలకారణము. ఇట్లు జగత్తుయొక్క లక్షణములను బ్రహ్మమునందు ఆరోపించుటను అధ్యాసమందురు.

19) మాయయా

'బ్రహ్మముకన్న వేఱుగానున్నాను' అను భావము మనకు ఎట్లు కలిగినది? ఆ భావము లేకుండ ఈ అధ్యాస ఎప్పుడును సంభవింపదు. 'మాయచేత' (మాయయా) అని చెప్పుటయే పై ప్రశ్నకు సమాధానము. ఉన్నదానిని గ్రహింపకుండునట్లు లేనిదానిని ఉన్నట్లుగా గ్రహించునట్లుగా చేయుశక్తియే మాయ.

ఈ మాయ ఎవరియందున్నది? బ్రహ్మమునందు యుండుటకు వీలు లేదు. సూర్యుని యందు చీకటి యుండదు కదా? అది జీవునియందు వానిని ఆవరించియున్నదన్నచో, దానినుండి అతడు ముక్తుఁడగుట ఎట్లు సంభవించును? ఏది

యథార్థముగా నున్నదో అది పోదు. త్రాటిని చూచి సర్పమని భ్రాంతిపడుచున్నచో 'అది సర్పము కాదు, త్రాడే' అని ఎవఁడైన బోధించినచో భ్రాంతిచేత తోచుచున్న సర్పము పోవును. అట్లు గాక యథార్థముగ సర్పమే యైనచో అది పోనే పోదు. కాఁబట్టి జీవుడు తన్ను మాయ ఆవరించియున్నదని భ్రాంతి చేతనే అనుకొనుచున్నాడన్నమాట. నీయందు మాయగాని, జీవత్వము కాని లేదని శాస్త్రము బోధించుచున్నది. కావున, మాయ యథార్థము కాదు. అది ఉన్నదని ఎవఁడు అనుకొనుచున్నాఁడో వానికి ఉన్నది. ఎవఁడు లేదని నిశ్చయించుకొనుచున్నాఁడో వానికి అది లేదు. అందువలన అది ఉన్నది అని కాని, లేదని కాని నిశ్చయించి చెప్పుటకు వీలులేదు. కావుననే అది అనిర్వాచ్యము (Indefinable).

ఆవరణము, విక్షేపము అని మాయావ్యాపారము రెండు విధములుగా ఉన్నది. ఉన్న బ్రహ్మముయొక్క స్వరూపము గోచరింపకుండునట్లు కప్పియుంచుట ఆవరణము. లేని ప్రాపంచికములైన వివిధ పదార్థములు నిజముగా ఉన్నట్లు నమ్మించుట విక్షేపము.

మాయకు ఆది లేదు, కాని అంతమున్నది. దానియొక్క ఆది లేక మొదలు ఎవనికిని తెలియదు. కావున దానిని 'అనాది' అని పేర్కొనవచ్చును. మాయవలన ప్రపంచము గోచరించునప్పుడు మాయాశబలితమైన బ్రహ్మము, ఈశ్వరుఁడు, సగుణ బ్రహ్మము, శక్తి మొదలుగా అనేక విధములైన పదార్థములు వర్ణింపఁబడుచున్నవి. ఈ మాయాశక్తి ప్రవాహమునుండి బయల్పడుటయే మోక్షము.

20) బ్రహ్మవిద్ బ్రహ్మైవ

‘‘జీవుఁడను వ్యక్తి లేఁడు, ఉన్నది బ్రహ్మమే’’ అని తనకు తాను అనుభవముతో తెలిసికొనుటయే మోక్షము. బ్రహ్మమును తెలిసికొన్నవాఁడు బ్రహ్మమే యగును.

21) ఫలమ్

మోక్షము నొంది బ్రహ్మమగుటవలన కలుగు ఫలము శాంతి. దానియందు రాగమువలన కలుగు సుఖము కాని, ద్వేషము వలన కలుగు దుఃఖము కాని, చలనము కాని యుండవు. అదియే ఆనందము. ఆనందము అనఁగా సంతోషము. ఆనందమనఁగా పరిపూర్ణమైన సంతోషము.

అది ఎల్లరకును కలుగును గాక!

ఓం సర్వేషాం తద్భవతు

సర్వం శ్రీరమణార్పణమస్తు

శ్రీ రమణ మహర్షి సూక్తులు

దక్షిణ భారత దేశంలో, పురాణ ప్రసిద్ధమైన అరుణాచల క్షేత్రమున, ఇరువదవ శతాబ్ది పూర్వార్ధ భాగమందు, అధ్యాత్మిక ప్రభలు దశదిశల విరజిమ్ముతూ నొక దివ్యజ్యోతి మానవరూపంలో తిరుగాడింది. దాని పేరే భగవాన్ శ్రీ రమణ మహర్షి. రమణ భగవంతుని అధ్యాత్మ బోధ రూపవాక్కులు సరళములు, నిర్వివాదములు, ఋజురూపములు, ఆచరణీయములు. సమాధి అనగా జాగ్రత్తులో సుషుప్తి – మెలకువలో నిద్ర – అందులో అపారమైన ఆనందమున్నది. సుస్పష్టమైన అనుభవమది. మామూలు నిద్రలో ఆనందమున్నా, అది సుస్పష్టమైన అనుభవం కాదు.

జీవుడనబడేది వాస్తవానికి జ్ఞానస్వరూపమే. కాని, అజ్ఞానావృతుడై స్థూల దేహంతో తాదాత్మ్యం చెంది తాను దేహమే ననుకుంటున్నాడు. ఇనుపగుండు, నిప్పు–రెండూ కలిసి కాలిన ఇనుపగుండు అయినట్లు ప్రపంచము, శుద్ధజ్ఞానము, రెండూ కలిసి జీవుడవుతున్నాడు.

విశుద్ధమూ, పరిపూర్ణమూ అయిన పరబ్రహ్మము మనలను ఎందుకు ఇలా సృష్టించింది, తనను తెలుసుకోడానికి ఇన్ని శ్రమలు మనం పడేటట్లు చేస్తున్నదనే ప్రశ్న వేయబడుతున్నది. ఈ ప్రశ్న వేసే వ్యక్తి సృష్టిలోనివాడు – సృష్టికి తాను బద్ధుడై ఉండగా ఈ ప్రశ్న ఎలా వేస్తాడు? సృష్టికి తాను అతీతుడు కానేర్చి అటుపిమ్మట ఈ ప్రశ్న పుట్టుతుందో లేదో చూసుకోవాలి.

మన నిజస్వరూపాన్ని మనం ఎలా గుర్తించగలుగుతాము? ఆలోచనలనుండి పూర్తిగా విముక్తి పొందిన స్థితి అట్టి గుర్తింపునకు మిక్కిలి అనుకూలం.

CC No.3057 ISBN: 81-88225-78-9

భగవాన్ శ్రీ రమణ మహర్షులవారి

ఆత్మ విచారణ



పబ్లిషర్స్

దిపాయినీర్ పబ్లికేషన్స్, తెనాలి.

భగవాన్ శ్రీ రమణమహర్షులవారి

ఆత్మ విచారణ

(విచార సంగ్రహము)

తమిళమూలమునకు ఆంగ్లానువాదము

డా॥ టి. యం. పి. మహాదేవన్, ఎం. ఏ., పిహెచ్. డి

ఆంగ్లమునకు ఆంధ్రానువాదము

ఆర్. సి. నాంచారయ్య, ఎం. ఏ., బి. ఇడి.

పబ్లిషర్స్

దిపాయినీర్ పబ్లికేషన్స్, తెనాలి.

అనుమతి

శ్రీ టి. ఎస్. వెంకట్రామన్ గారు

ప్రెసిడెంట్, శ్రీ రమణాశ్రమం,

తిరువణ్ణామలై - 606 603

దక్షిణ ఇండియా

శ్రీ రమణాశ్రమము

(ఆంగ్ల ప్రచురణ -
ఏడవ ముద్రణము, 1965)

ఆంగ్లమునకు ఆంధ్రానువాదము
మొదటి ముద్రణము 1991

వెల : రూ. 10-00

కాపీ రైట్ :
శ్రీ రమణాశ్రమం
తిరువణ్ణామలై

ముద్రణ :
స్వాతి ఆర్ట్ ప్రింటర్స్,
తెనాలి - 522 201

పరిచయము

మోక్షప్రాప్తికి దోహదముచేయు సమస్త ఆధ్యాత్మిక సాధనలకు సంబంధించిన నలుబది ప్రశ్నోత్తరములు ఈ ప్రస్తుత వచన రచనయందున్నవి. భగవాన్ శ్రీ రమణమహర్షులవారి ప్రప్రథమ భక్తులలో నొకరగు శ్రీ గంభీరం శేషయ్యగారు పృచ్ఛకులు. వారు క్రీ. శ. 1900 ప్రాంతములో తిరువన్నామలైలో ఒక మునిసిపల్ ఓవర్సీర్. వారు పరమరామభక్తులే గాక యోగపఠనము, యోగాభ్యాసములందు మక్కువ కలవారు. స్వామి వివేకానందులవారి వివిధయోగములపై ఉపన్యాసములు, రామగీతయొక్క ఆంగ్లానువాదము కూడ చదువుచుండెడివారు. ఈ గ్రంథములను చదువుచున్నపుడును, ఆధ్యాత్మిక అభ్యాసములు ఆచరించునపుడును తాను ఎదుర్కొనిన క్లిష్టతలను (difficulties) నివారించుకొనుటకు వారు భగవాన్ శ్రీరమణుని అప్పుడప్పుడు ఆశ్రయించెడివాడు. ఇరువది ఒక్క సంవత్సరముల పిన్నవయస్కుడగు శ్రీ భగవానులు అప్పుడు అరుణాచలకొండపై విరూపాక్ష గుహయందు నివసించు చుండెడివారు. 1900—1902 మధ్యకాలమునందలి ఈ వ్రాతలు తదుపరి శ్రీ శేషయ్య గారిచే నోట్ బుక్ నందు ఒక ప్రతిగా (copied) కూర్చబడెను. ఆవిధముగ సేకరింపబడిన వస్తుచయమును యథాతథంగా (literally) 'ఆత్మవిచారణ సంగ్రహము' అను పేరిట శ్రీ రమణాశ్రమము వారు ప్రచురించిరి (published). విచారసంగ్రహమనగ సంక్షిప్త ఆత్మవిచారణ (A Compendium of Self - Enquiry). పిమ్మట ఈపుస్తకమునందలి ప్రబోధసారాంశము సంగ్రహముగ 'ఆత్మవిచారణ' అను నామముతో గ్రంథరూపమున ఆంగ్లములో ముద్రింపబడినది. ఆయాంగ్లానువాదములో ప్రశ్నలు వదలివేయబడినవి; శ్రీ భగవానుల బోధయొక్క సారాంశము

మాత్రమే ఇయ్యబడెను. అది అంతయు యోగ్యమగు పేర్లతో పండ్రెండు
చిన్న అధ్యాయములుగ విభజింపబడినది. ఈ ప్రస్తుత గ్రంథము 'ఆత్మ
విచారణ', లేక 'విచార సంగ్రహము' యొక్క మొట్టమొదటి సంగ్రహిత
తమిళప్రతికి యథాతథఆంగ్లానువాదము. ఈ 'విచార సంగ్రహము'నకు ఒక
ప్రత్యేక విశిష్టతఉన్నది. అదేమనగ, శ్రీభగవానులచే తన స్వదస్తూరితో
వ్రాసి ఇయ్యబడిన ప్రప్రథమ ఉపదేశముల సంపుటి (set) ఇది.

శ్రీ భగవానుల ఉపదేశములను జాగ్రత్తగ పరిశీలించినచో
అవన్నియు తన తొలి అనుభవముల పై ఆధారపడినవనియు, మరియు
ప్రారంభదశలో తనవద్దకు మొదటవచ్చిన భక్తులచే తన దృష్టికి తెచ్చిన
పవిత్రగ్రంథ రచనలచే ధృవీకరింపబడినవనియు, అట్లు చేయుటకు కార
ణము ఆ భక్తుల మనస్సులయందుద్భవించిన సంశయములను నివృత్తిచేయు
టకు తనచే ఆ గ్రంథములు పరిశీలించబడినవనియు తేటతెల్లమగును. తన
బోధనల విషయములో "పవిత్రగ్రంథములు ఎలుగెత్తి చాటుచున్నవి",
"ఆ విధముగ ఋషులు చెప్పుచున్నారు" మొదలగునవి శ్రీ భగవానులు
వాడెడి పదజాలము; మరియు భగవద్గీత, వివేకచూడామణి, ఒక్కొక్కసారి
మాత్రమే పేర్కొనబడిన ఋభుగీత గ్రంథముల యందలి ప్రవచనములను
పలుకుచుండెడివారు. ఈ విధముగ చెప్పుట శ్రీ భగవానులు స్వానుభవ
ముతో తాను కనుగొన్న సత్యమును ధృవీకరించుట మాత్రమేనని సువిశద
మగుచున్నది.

ఇందు ఉపదేశములు అద్వైత వేదాంతమునకు చెందినవే.
గమ్యము ఏకాత్మయొక్క పరిపూర్ణానుభవము; ఆత్మ స్వభావమును విచా
రించుట యనెడిది వారి విధానము (means). ఆత్మ (Self) ను అనాత్మగ
(దేహము మొదలగు వానితో) మనస్సు గుర్తించినచో, బంధమేర్పడును

(bondage). ఈ పొరపాటుగ గుర్తించుటను (wrong identification)
"నేనెవరను ?" అను ఆత్మ విచారణచే తొలగించినపుడు 'విముక్తి'
(మోక్షము) ఏర్పడును. ఆవిధముగ ఆత్మవిచారణ శ్రీ భగవానులు బోధిం
చిన ప్రత్యక్షపథము (సూటిమార్గము). 'నేను' అనుభవము అందరికి
సర్వసాధారణమైనది (ఒకటే). ఆలోచనలన్నింటిలోను, 'నేను' భావన
మొట్టమొదటగ ఉద్భవించును. మానవుడు చేయవలసినదేమనగా 'నేను'
భావనకు మూలము (source) ఏదియని విచారించవలెను. ఇది సామాన్య
మనుజుని జీవితములో సాధారణముగ జరుగు దానికి వ్యతిరేక విధానము.
మనుజుడు ప్రతిదానియొక్క మూలమును గూర్చి, ప్రతిది ఎట్లేర్పడునది
తెలిసికొనుటకు విచారణ జరుపును. దానిని పరిశీలిస్తే ఇదంతయు మనస్సు
యొక్క యోచన (projection); అది తనను గురించి ఆలోచించదు.
తన మూలమును గురించి అన్వేషించదు: మనస్సుకు అంతర్ముఖత్వము
కలుగచేసినపుడు ఆత్మావలోకనము సాధింపబడును. దీనిని మన సత్త్వవేత్తలు
చెప్పు "ఆత్మ పరిశీలన" (introspection) యని పొరపాటు పడరాదు.
"ఆత్మవిచారణ" మనస్సు తాను ఏమేమి కలిగియున్నదో తనిఖీచేయుట
కాదు; మనస్సుయొక్క మొట్టమొదటి విధానము (mode) అగు 'నేను'
భావన ఆత్మనుండి తాను ఉద్భవించినట్లు పరిశోధించి కనుగొనుటయే.
యుక్తమైన, దృఢమైన విచారణ ఉన్నప్పుడు, 'నేను' భావనకూడ అగి
పోవును; అప్పుడు పరిశుద్ధ జ్ఞానమగు నిశ్శబ్దతేజస్సు (wordless
illumination) 'నేను — నేను' అను రూపమున ప్రత్యక్షమగును.
ఇది ముక్తి: బంధమునుండి స్వేచ్ఛ. దీనిని సాధించుటకుపయోగపడు
విధానము (method), పైన తెల్పినట్లు, 'విచారణ'; వేదాంత పరి
భాషలో అది "జ్ఞానము" అనబడుచున్నది. నిజమైన భక్తి, ధ్యానము,
యోగము అప్పుట (ఆ ఉనికియందు) ఒకదానికొకటి తాదాత్మ్యము

(identical) చెందును. శ్రీభగవానులు సుస్పష్టముగ చెప్పినట్లు, పరిపూర్ణ ఆత్మానుభవమునుమఱచిపోకుండుటయే నిజమైనభక్తి, మనస్సును నిలుపుట, అదుపులో నుంచుట (control), జ్ఞానము, మరి తదితర పవిత్ర సత్కర్మములు (austerities) అగుచున్నవి. భక్తి పరిభాషలో, చిట్టచివరి లక్ష్యము (final goal) మనస్సును తానుద్భవించిన మూలమగు భగవంతునియందు (ఆత్మలో) లీనముచేయుట యని వర్ణింపవచ్చును. యోగపరిభాషలో హృదయ పద్మమందు మనస్సును సంలీనముచేయుటగ వర్ణింపవచ్చును. ఇవన్నియు ఒకే సత్యమును వివరించు వివిధ మార్గములు.

అవసరమగు సమర్థత సంపాదించుకొనని వారికి ఆత్మవిచారణ పథము కష్టముగతోచును. మొట్టమొదట మనస్సును తప్పక పరిశుద్ధముగ నుండునట్లును, ఏకాగ్రతతో నుండునట్లును చేయవలెను. ఇది ధ్యానము మొదలగువాని ద్వారా సాధ్యము. అందువలన, మరొక విధముగ చెప్పవలెనంటే (in their secondary sense), ఆత్మవిచారణయను సూటిమార్గము (direct path) నకు వివిధమార్గములు సహాయకారులు. ఈ సందర్భములో శ్రీ భగవానులు అభిలాషపరులను మూడు స్థాయిలకు చెందినవారుగ పేర్కొనిరి. ఉత్తములు, మధ్యములు, అత్యంతదిగువ స్థితిలోనున్నవారు. ఉత్తములకు నిర్దేశింపబడిన మార్గము వేదాంత విచారణ. ఈ మార్గము ద్వారా మనస్సు ఆత్మయందు నిశ్చలత్వమును పొంది, చివరకు తన ఉనికిని చాలించును (మనోనాశము); అప్పుడు ఆత్మానుభవము నిర్ద్వంద్వమై, పరిశుద్ధమై, దేదీప్యమానముగనుండును. మధ్యములకు మార్గము ఆత్మపై ధ్యానించుట; ఈధ్యానమునందు మనస్సును ఒకేలక్ష్య వస్తువుపై ప నిరంతరము ప్రవహింపచేయుట. ధ్యానము వివిధరకములు. అందు 'నేను ఆత్మ' అనునది అత్యుత్తమ పద్ధతి. ఈ విధానము ఆత్మసాక్షాత్కారముతో అంతమగును. అత్యంత దిగువస్థాయిలోనున్న అభిలాషపరులకు

శ్వాసనియంత్రణ (breath control) ఉపయోగపడును. తద్వారా మనోనిగ్రహము సాధ్యపడును.

జ్ఞానమార్గమగు జ్ఞానయోగమునకు ధ్యానమార్గమగు ధ్యానయోగమునకు తారతమ్యమును శ్రీ భగవానులు ఈ విధముగ వివరించిరి. జ్ఞానము మదించిన ఆబోతును ఒకగుప్పెడు పచ్చిగడ్డితో అదుపుచేయునట్టిదనియు, ధ్యానము బలప్రయోగముతో దానిని అదుపుచేయునట్టిదనియు. ధ్యానయోగమునకు అష్టాంగములున్నట్లే జ్ఞానయోగమునకుకూడ అష్టాంగములు కలవు. జ్ఞానయోగముయొక్క అంగములు తుదిస్థితికి (final stage) ధ్యానయోగాంగములకంటె సన్నిహితముగనున్నవి. ఉదాహరణకు శాస్త్రబద్ధమైన యోగమునందలి ప్రాణాయామము శ్వాసను క్రమబద్ధముచేయుట, మరియు దానిని నిరోధించుటయై యుండగా జ్ఞానయోగాంగమగు ప్రాణాయామమునందు సత్యరహితమైనట్టి నామరూప ప్రపంచమును తిరస్కరించి, సత్-చిత్-ఆనందమగు పరమసత్యము యొక్క ఆత్మానుభూతి పొందుట.

ఈ జన్మయందే ఆత్మసాక్షాత్కారమును పొందవచ్చును. నిజానికి ఆత్మ సాక్షాత్కారము క్రొత్తగపొందు ఏదో ఒక వస్తువుకాదు. మనము ఆత్మ అయ్యే ఉన్నారము; ఉన్నది ఆత్మ ఒక్కటే. మనము ఆత్మసాక్షాత్కారము పొందలేదని ఊహించునట్లు చేయునది అజ్ఞానము. ఆత్మ జ్ఞానము వలన ఈ అజ్ఞానము తొలగింపబడినపుడు శాశ్వతమగు ఆత్మతత్త్వమును మనము తెలిసికొందుము. ఈ సాక్షాత్కారము పొందిన వారిని జీవన్ముక్తులు (జీవించియుండగనే ముక్తులు) అందురు. తక్కిన వారికి అతడు తన దేహమును కౌలుకు తీసుకొన్న వానివలె అగుపడును. తదితరుల ప్రయోజనముకొరకు ప్రారబ్ధకర్మ లవలేశముగ (residue) నైన ఉన్నంతవరకు ఈ దేహము కొనసాగునని చెప్పబడినది. (ప్రారబ్ధకర్మ) ప్రస్తుత

దేహము పూర్వకర్మ ఫలితముగ రూపము దాల్చినట్టిది. దాని వేగవ
గతించిన పిదప ఈ దేహము పతనమగును; జీవన్ముక్తుడు విదేహ
ముక్తుడగును; కాని పరిపూర్ణ సత్యమును ఆధారముజేసికొనినట్లైనచో ము
యందు భేదమేమియులేదు. ఇచ్చట గ్రహించవలసినదేమనగ ము
లేక బంధవిమోచనము, అనునది ఆత్మ స్వభావముతో తాదాత్మ్యవ
చెందియున్నట్టిది.

ఇది 'విచార సంగ్రహ'మందలి భగవాన్ శ్రీ రమణుల బోధనవ
యొక్క సారాంశము'

మద్రాసు
విశ్వవిద్యాలయము
నవంబరు 15, 1965

డా॥ టి. ఎం. పి. మహాదేవన్,
M. A., Ph. D.

Bhagavan Sri Ramana Maharshi
at the age of 21.

భగవాన్ శ్రీ రమణ మహర్షుల ప్రభావము

"యద్యదాచరతి శ్రేష్ఠస్తత్త దేవేతరో జనః ।
స యత్ ప్రమాణం కురుతే లోకస్తదనువర్తతే॥ *

ఉత్తముడేది ఆచరించునో దానినే సామాన్యుడు ఆచరించును. అతడు దేనిని ప్రమాణంగ స్వీకరించునో లోకమంత దానినే అనుసరించును."

భారతదేశము వేల సంవత్సరములనుండి జ్ఞాన సంపన్నులగు మహర్షులకు నిలయం. వారు జీవించిన విధానములు తరతరాలవారిని ప్రభావితులనుచేసి తీర్చిదిద్దుతవి. చరిత్రకు సమగ్రముగ అందినవారిలో భగవాన్ శ్రీరమణమహర్షులవారు అత్యంత సన్నిహితులు. వారు క్రీ. శ. 1950, ఏప్రిల్ 14 వరకు మన ఎదుట ఉన్నారు.

వారు కౌపీన ధారులు; ఆజన్మ బ్రహ్మచారులు; మహర్షులు; మౌనవ్రతులు; బ్రహ్మవేత్తలు. వారు నివసించి చూపిన పరమ విలువలు: సత్యము, అహింస, శాంతి, ప్రేమ, కరుణ, సర్వప్రాణులయెడ అత్యంత సమాన పూజ్యభావము.

చలంగారి కుమార్తె సౌరిస్, 16 ఏండ్ల వయస్సప్పుడు తండ్రితో పాటు శ్రీరమణాశ్రమునకు 1937 లో వెళ్ళి భగవాన్ శ్రీరమణులను తొలిసారిగ దర్శించినపుడు వారికి కలిగిన భావపరంపరలను ఈ విధంగ వ్రాసారు * *

(*) భగవద్గీత — 3 వ అధ్యాయం — 21 వ శ్లోకం
(**) తెలుగు వెలుగు-చలం భగవాన్‌తో భేటీనుండి- పేజీలు 283-286.

"రాత్రి 8 గంటలయింది అరుణాచలం చేరేటప్పటికి. దూరం నుంచే గంభీరంగా నల్లగా ఆకాశాన్ని కప్పుతున్న ఆ పర్వతాన్ని బస్సులోంచి చూస్తూ చేరుకున్నాము ... ఆశ్రమం రెండుమైళ్లు ... చేరేటప్పటికి ఆశ్రమం మాటుమణిగివుంది. భగవాన్ నిద్రకి పడుకున్నారు ... హాల్లోకివెళ్లాం. Dim గా ఎలక్ట్రిక్ దీపం వెలుగుతోంది.... నేను నమస్కరించాను... లేచానో లేదో షాక్ (shock) తగిలినట్లు వొళ్లంతా thrill ఐపోయినట్టూ వణుకు వచ్చింది... అట్లాంటి అనుభవం అదివరకు కలుగలేదు... ...కాని మనజీవితమూ, మనం సీరియస్‌గా వాస్తవమని అనుకునే యీ విచారమూ, సంతోషమూ, ప్రేమ, క్రోధమూ మనం imagine చేసుకుంటున్నవే అంటారు భగవాన్.

మర్నాడు ప్రొద్దున్నే T. B. నుంచి ఆశ్రమం దగ్గర కెళ్లి...హాల్లోకి వెళ్లాం. అప్పటికే చాలమంది కూర్చుని ఉన్నారు ... ఆయన్ని చూడగనే ... మనం పార్కు-ఫెయిర్‌లో మైనం బొమ్మలు చూడలేదు ! సరిగ్గా అట్లాంటి wax figure లాగు కనపడ్డారు. ఆయన మనిషి అని నమ్మలేక పోయినాయి నాకళ్లు-ఆయన నోట్లోంచి మాటరాగానే (సాధారణంగా మాట్లాడనే మాట్లాడరు) జీవంలేని విగ్రహంనుంచి మాటవస్తే ఎంత ఆశ్చర్యపోతామో, అట్లా ఉంది. అన్నిటికన్న తళతళలాడే ఆయనకళ్లు...చీకట్లోకూడ ఆ మెరుపు కనబడుతూనే ఉంటుంది. మనవైపుచూశారంటేనా,

బాణంలాగ దూసుకుపోతుంది ఆయన దృష్టి హృదయ కుహరాల్లోకి. వచ్చిన రాత్రి నా హృదయానికి తన eternal electricity కి ఒక wire connect చేసారు. ఆయన హాల్లో ఉన్నంతసేపు magnet లాగ ఆకరెంటు ఆయన వేపేలాగింది. ఆఖరికి ఎక్కడఉన్నా, ఏం చేస్తున్నా నా హృదయం ఆయన వేపేతిరిగింది .... ఎంత ఆనందంగా ఉండంటావు నాకు !"

ప్రార్థన : భగవాన్ రమణ మహర్షులవారికి చిన్నతనమునందే ప్రార్థన బాగా అలవాటైంది. అది హృదయాంతరాళమునుండి ప్రవహించేది; మాటలులేవు.

సూటిమార్గము (Direct Path) : భగవాన్ రమణ మహర్షులవారు అనుసరించినది ఆత్మాన్వేషణ * - జ్ఞాన మార్గము. దీనియందు పరాకాష్ట చెందిన భక్తి, ఏకాగ్రత, దృఢదీక్ష, సర్వసంగపరిత్యాగము, నిరహంకారము సమ్మిళితమై నిండు నిశ్చలత, భావాతీతము ఇమిడియున్నవి.

భగవానుల తపస్సు : తమ 17 వ సంవత్సరము వయస్సప్పుడే ఇల్లు వదలి అరుణాచలంచేరి కఠోర తపమాచరించి ఆత్మసాక్షాత్కారము పొందిరి. ముఖ్యముగ ఏకాంతముగనుండుటకు పాతళలింగము వెనుక ఉపవిష్టులైరి. ఎంతకాలమో తెలియదు. వారిని గమనించునప్పటికి వారు కూర్చున్నచోట విస్తారముగ రక్తసిక్తమై యుండెను. అది నిర్జన ప్రాంతము; అపరిశుభ్రస్థలం; క్రిమికీటకాదుల బారికిగురియైనది వారి శరీరము; తూట్లుపడ్డది. కాని వారికి దేహభ్రాంతిలేదు.

అక్కడనుండి వారు తరలింపబడిరి. తర్వాత చాలామంది సాధువులు వారి సందర్శనార్థము రాసాగిరి.

భగవానుల శిష్యులు : వారికి భక్తులేగాక, పశుపక్ష్యాదులుకూడా శిష్యులుగ నుండిరి. శ్రీయుతులు గంభీరం శేషయ్య, కావ్యకంఠం గణపతిముని, బి. వి. నరసింహఅయ్యర్, చింతా దీక్షితులు, చలం, సౌరిస్, కె. సభా, పాశ్చాత్యులు: ఎఫ్. హెచ్. హంఫ్రీస్, పాల్ బ్రంటన్, చాడ్విక్, సోమర్‌సెట్ మాం, ఆర్థర్ ఓస్‌బోర్న్. ఆశ్రమంలో ఆవులు, కుక్కలు, చిలుకలు, కోతులు మొదలగునవి కూడ ఉండేవి. వారికి ప్రతినిత్యము అన్నపానాదులు సమకూర్చిన యామె 'ఎచ్చమ్మాళ్'.

భగవానులకు తెలుగు బాగావచ్చు : తెలుగులో కవిత్వంకూడ వ్రాయగలవారు. వారిరచనలు : ఉపదేశసారం-ద్విపద; ఉన్నది నలువది-వచనం; ఏకాత్మ పంచకం, అరుణాచలాష్టకం, విచారమణిమాల, వాశిష్ఠ శ్లోకాలలో కొన్నింటికె అనువాదం. వారి అక్షరాలు ముత్యాలు. వారి ముఖ్యమైన తమిళ రచనలు 'ఉల్లదు నర్పదు; ఉపదేశఉన్దియార్.'

అహంకారము : సర్వచరాచరములయందు పరమాత్మ హృదయ కుహరస్థుడు (* 1). పరమశాంతికి, అద్భుతానందానికి ఆత్మసాక్షాత్కారము ఒక్కటే శరణ్యము. కాని అట్టి

(* 1) ఈశ్వరః సర్వభూతానాం హృద్దేశే, అర్జున, తిష్ఠతి.
భగవద్గీత - 18 వ అధ్యాయము - 61 వ శ్లోకము

దానికి అవరోధము 'నేను' అను అహంకారము. అది మనస్సును దేహమును (*2) ఆవరించి ఉండును. ఎవని అహంకారము వానియందున్నంతవరకు అది ప్రకోపింపదు; కాని ఇతరములపై గట్టి ప్రభావముచూపును. దానిని నిర్మూలించ గలుగునది ఆత్మవిచారణ మాత్రమే. అహంకారము లేనపుడు 'నేను' ఉండదు. ఉండునది అమృతమగు సత్యమొక్కటే. అదే ఆత్మ (* 3). ఈ ఆత్మసాక్షాత్కారమునకు ప్రతి మానవుడు తమ తమ నిర్దిష్టకార్యములను పరమ పురుషునికి పూజగ ఆచరించ వలెను (*4); కర్మఫలమంటదు. ఇదియే నిజమైన ప్రార్థన; దైవకృపకు పాత్రత.

మనస్సు-శ్వాస :(*5)మనస్సు అరికట్టాలంటే శ్వాసను బంధించాలి. దీనికి అత్యంత కోమలమైన, శ్వాసనిరోధించు సాధన అవసరం(*6). పరమ సుఖదముగ నుండవలెను. శ్వాసకు మనస్సుకు అవినాభావ సంబంధమున్నది. మనస్సు లేకుండ పోవటానికి, ఆత్మసాక్షాత్కారానికి ఇది దోహదం చేస్తుంది.

(* 2) 'దేహాది భావం పరిమార్జయన్తః' — ఆది శంకరులు.

(* 3) 'పార్లమెంటు ఉభయసభలను నుద్దేశించి డా॥ యస్. రాధాకృష్ణన్ నుడివిన ఉపనిషద్వాక్యము: "తత్ సత్యం, స ఆత్మా, తత్త్వమసి"

(* 4) 'యోగస్థః కురుకర్మాణి — భగవద్గీత.

(* 5) యోగశ్చిత్త వృత్తి నిరోధః — పతంజలి యోగసూత్రాలు.

(* 6) 'అభ్యాసయోగయుక్తేన' — భగవద్గీత.

భగవాన్ శ్రీరమణ మహర్షులు -శాంతి : Dr. Paul Brunton, M.A., Ph. D., లండన్ వారు చాలాకాలం శ్రీరమణాశ్రమంలో ఉన్నారు. వారు భగవానుల మౌనవ్యాఖ్యతో ప్రభావితులైనారు; భగవానులనుగురించి మొదటగ వారిని చూచి నప్పుడు ఇట్లు వర్ణించారు.

"...... I became aware of silent, resistless change which is taking place within my mind. One by one, the questions which I prepared in the train, with such meticulous accuracy, dropped away —— I know only that a steady river of quietness seems to be flowing near me, that a great peace is penetrating the inner reaches of my being, and that thought-tortured brain is beginning to arrive at some rest".

ప్రతి మానవుడు శాంతినికోరును. శాంతికి మౌనము, ఏకాంతత్వం, కొండగుహలు, అరణ్యగర్భాలు ఆవాసాలు. ప్రకృతి గంభీరసౌందర్యములో లీనమైనపుడు కూడ ఈ నిండు శాంతి లభిస్తుంది. దేహాత్మక మానవుడు మనోవాక్కాయ కర్మలయందు అచేతనుడై స్తంభించిపోయి ప్రతిమారూపం చెందుతాడు. భగవాన్ అరవిందులు పేర్కొను silence, tranquillity, serenity,quietude లు ఇవే. ఈ అసాధారణ ఘనీభవించిన శాంతిని మహర్షులుపొంది ప్రక్కవారికి, విశ్వానికి ప్రసాదిస్తారు. అందువలననే వారు గురువులు. మానవ మనుగడను తీర్చిదిద్దుతారు; ఆదర్శజీవులు; జీవన్ముక్తులు; భగవాన్ శ్రీరమణ మహర్షులు శాంతి స్వరూపులు.

From 'My Search in Secret India' by Dr. Paul Brunton.

ఒకసారి శ్రీ మొరార్జీదేశాయిగారు భగవాన్ రమణ మహర్షులవారిని దర్శించి వారికి కలిగిన అనుభూతిని ఈ విధంగ చెప్పుకొన్నారు :

" ... during this period he only ate if some one left him some food, but normally did not bother about it..."

"... There was a board in the compound which warned people to be careful about monkeys, birds and other creatures and also warned visitors not to harm them ... "

"I could see an aura on his face which was glowing with peace and joy — I sat over an hour and just looked at his face. Till today I have not seen that aura, that joy or peace on anybody's face. While I sat there no questions arose in my mind ... It was this experience which convinced me that Ramana Maharshi had realised God or Truth..."

"... I approached Ramana Maharshi for permission to leave when he told me that I should go after I had eaten ... Ramana Maharshi sat for lunch with us ... But Ramana Maharshi did not believe in untouchability ...

" ... I learnt by sitting in his presence that a person who wanted to realise God had to strive and pursue Yoga by himself ...

"In his last days Ramana Maharshi had cancer and was operated on near the shoulder ...

A surgeon who was present at the operation told me that Sri Ramana Maharshi sat smiling while the operation went on without anaesthesia"

*From "The Story of My Life" by Shri Morarji Desai, Ex - P. M. of India, - Vol I, - Pages 129 & 130.

గురువు అవశ్యకత : తాను చిన్న - 'లఘు' - అనుకున్నంతకాలం తనకంటే పెద్ద -'గురువు' - అవసరం. "నేర్చుకొనవలసిన దేమైన ఉంటే గురువుకావాలి. కాని నేర్చుకున్న దానిని పోగొట్టుకోవాలంటే గురువెందుకు ?" అంటారు భగవాన్ శ్రీ రమణమహర్షులు.

గృహస్థు : గృహస్థునకు మోక్షప్రాప్తి ఎట్లా కలుగుతుంది ? స్వేచ్ఛప్రాప్తికి అతడు సన్యసించనిదే అది ఎట్లా సాధ్యం? అన్న ప్రశ్నకు భగవాన్ శ్రీ రమణులు అంటారు: "నేను గృహస్థుడను, నేను సన్యాసిని అను ఆలోచనలే అడ్డంకులు. నీవున్న పరిసరములు మార్చనవసరంలేదు. నీకున్న ఒక్క అడ్డంకు మనస్సు. ఇంట్లో ఉన్నా, అడవిలో ఉన్నా మనస్సును అతిక్రమించాలి. పర్యావరణ మేదైనప్పటికి ఇపుడే నీ ప్రయత్నం సాగించవచ్చు."

దైవకృప :

శిష్యుడు : సత్యము తెలిసికొనుటకు దైవకృప అవసరమా?

భగవాన్ : ఔను.

శి : దైవకృప పొందుటెట్లు ?

భ : ఆత్మార్పణ (self - surrender)*

శి : అయినప్పటికి దైవకృపనాకు కలుగుటలేదు.

శి : అయినప్పటికి దైవకృపనాకు కలుగుటలేదు.

భ : ఋజువర్తనం (sincerety) ఇంకాకావాలి. ఆత్మార్పణ నోటిమాటలుగాని, షరతులతో గూడినది గాని కాదు. హృదయాంతరాళముల నుండి వచ్చునది. హృదయంలో లీనమగుటే ప్రార్థన. అది దైవకృపకూడ. దైవకృప పొందిన వ్యక్తి ఎక్కువగ మాట్లాడడు.

కనుక భగవాన్ శ్రీ రమణమహర్షుల వారి సందేశం:

'ఆత్మగ ఉండు'

(BE THE SELF) * *

ఓం నమో భగవతే శ్రీ రమణాయ !

తెనాలి

16-10-'91

అనువాదకుడు

ఇదే దైవవిధి (Fate), మానవుని అభీష్టము (Free-will) అను రెంటికి సమన్వయం.

* * నవభారత నిర్మాత పండిట్ నెహ్రూ : "Know Thy Self- నిన్ను నివు తెలిసికో" అనీ, భౌతిక ఆధ్యాత్మిక విలువల సమ్మేళనమువల్లనే జాతికి త్వరితప్రగతి వీలౌతుందనీ ప్రబోధించేవారు.

భగవాన్ శ్రీ రమణమహర్షులవారి

ఆత్మ విచారణ

(విచారసంగ్రహము)

ప్రార్థన

అది తానై పృథముగ యుండుటకన్న సర్వముతానై యున్న పరిపూర్ణుని పూజించుటకు వేఱుమార్గమున్నదా !

1

శిష్యుడు : గురువుగారూ ! నిరంతరము దుఃఖరహితమైన శాశ్వత ఆనందస్థితి పొందుటకు మార్గమేమి ?

(విధానము)

గురువుగారు : వేదప్రవచనమునకు విడిగ దేహమెచ్చట యున్నదో అచ్చట దుఃఖము కలదు. ఇది అందరి ప్రజల సాక్షాత్ స్వానుభవము. కనుక ప్రతివారు నిత్యము దేహరహితమగు తన నిజ సహజత్వమును గురించి విచారణ చేయవలయును. మఱియు అది తానై యుండవలయును. ఆ స్థితిని పొందుటకు ఇది మార్గము.

2

శిష్యుడు : ప్రతి మనుజుడు తన నిజస్వభావమును గూర్చి విచారణ చేయుట, దానిని అర్థము చేసికొనుట అనగానేమి ?

గురువుగారు : "నేను" వెళ్ళితిని, "నేను" వచ్చితిని, "నేను" ఉంటిని, "నేను" చేసితిని అనెడి అనుభవములు సహజముగ ప్రతివానికి కల్గును. ఈ స్వానుభవములనుండి "నేను" అనెడి జ్ఞానము పై వివిధ ప్రక్రియల కర్తగ అగుపడుట లేదా? ఆ జ్ఞానము యొక్క నిజస్వరూపమును విచారించుచు తన ఆత్మగ నుండుటయే విచారణద్వారా తన నిజస్వరూపమును అర్థము చేసుకొను మార్గము.

3

శిష్యుడు : "నే నెవరిని" అని విచారించుట (పరిశోధన జేయుట) ఎట్లు ?

గురువు : వెళ్లుట, వచ్చుట వంటి క్రియలు శరీరమునకు మాత్రమే చెందినవి. అందువలన 'నేను వెళ్లితిని, నేను వచ్చితిని,' అని ఒకడు చెప్పినపుడు అది శరీరము (నేను) అని చెప్పుచున్నట్లగును. అయితే జ్ఞానమగు (ఎఱుక) "నేను" అనునది శరీరము అని చెప్పబడవచ్చునా? ఏలనన శరీరము అది జన్మించకముందు లేదు. శరీరము పంచభూతములవలన ఏర్పడినది. శరీరము గాఢ నిద్రావస్థయందు ఉండదు. మరియు శరీరము చనిపోయినపుడు శవమగును. ఈ శరీరము కొయ్యదుంగవలె నిర్జీవమైనపుడు "నేను"గా ప్రకాశించునని చెప్పబడవచ్చునా? అందుచేత "నేను" అను జ్ఞానము మొట్టమొదట శరీరమునకు ఆపాదింపబడి వివిధ సమయములలో

వివిధములుగా అజ్ఞానమని, అహంకారమని, అవిద్యయని, మాయయని, మలమని, జీవాత్మయని పేర్కొనబడుచున్నది. దీనిని గురించి విచారించకుండ ఉండగలమా? మత గ్రంథములన్నియు అజ్ఞానమును వినాశము జేయుటయే ముక్తి యని విచారణ ద్వారా మన బంధ విముక్తికొఱకు ఎలుగెత్తి చాటుట లేదా? కనుక "నేను" అనుమాట కూడ ఉచ్ఛరించకుండ శవమగు దేహమును శవముగా జేయుచు తీక్షణముగ ప్రతివ్యక్తి ఈ విధముగ విచారించవలెను - "ఇప్పుడు నేనుగా ఉద్భవించునది ఏమి?" అప్పుడు హృదయములో శబ్దరహితమగు "నేను-నేను" అను దేదీప్యమానమగు వెలుగు ప్రకాశించును. అనగా అప్పుడు తనంతట తానే అనంతమయినట్టిదియు, ఒక్కటే అయినట్టిదియు పరిశుద్ధ జ్ఞానము తన ఇష్టానుసారము ప్రకాశించును. అల్పమగునట్టి అనేక ఆలోచనలు అదృశ్యమగును. ఆ అనుభవమును వదలక ధ్యానముగ నున్నచో అహంకారము, వ్యక్తి భావన, నేనే ఈ దేహమనెడి అభిప్రాయములు సంపూర్ణముగ వినాశము జెందును. చిట్టచివరకు హారతి కర్పూరము అగ్ని చేత దహింపబడునట్లు "నేను" అను ఆకారము గూడ దహించుకొనిపోతుంది. గొప్ప ఋషులు మఱియు పవిత్ర గ్రంథములు గూడ దీనినే బంధ విమోచనమన్నారు.

4

శిష్యుడు : "నేను" అను "అహంభావము" (అజ్ఞానము) యొక్క మూలంలోకి విచారిస్తున్నపుడు అసంఖ్యాక

మైన భిన్న ఆలోచనలు ఉత్పన్నమౌతాయి. కాని ప్రత్యేకమైన "నేను" అనే ఆలోచన ఎప్పుడు ఉంటుంది ?

గురువు : కర్త యొక్క ప్రమేయము కనుపించినను లేకపోయినను తత్సంబంధమైన ఇతర అంశములు అగుపడుటకు ప్రథమావిభక్తియే ఆధారం. అదేవిధంగ హృదయంలో కన్పించు ఆలోచనలన్నింటికి మానసిక విధానమగు "నేను" "నేనే దేహము" అను గుర్తింపు ఆకారము యొక్క మొదటిదైన అజ్ఞానాన్ని ఆధారం చేసుకొని ఉత్పన్నమౌతున్నాయి. అహంకార రూపమగు అజ్ఞానము నాశనము చేయబడినపుడు వేళ్లతో పెకలించబడ్డ వృక్షంవలె మాయ, అజ్ఞానం తదితర ఆలోచనలన్నీ నశిస్తాయి. సాధనకు అంతరాయమైన ఏ ఇతర ఆలోచనయైనను రానివ్వకుండ అహం మూలస్థితి యందే సాక్షిగా ఉంటూ ఏ విచిత్ర విషయము సంభవించినను "జరుగనిమ్ము; చూచెదము" అను పోకడను అనుసరించుటయే సాధన. మరొక విధంగ చెప్పాలంటే ఆకారాలతోటి తాదాత్మ్యము చెందకుండ తన స్వస్థితిని వదలకుండా ఉండాలి. దీని వలన దేహాత్మ భావన తదితర ఆటంకములకు మూలమైన మనస్సు నశిస్తాయి.

అహంకారాన్ని అతిసులువుగా పోగొట్టే ఈ మార్గమే భక్తి, ధ్యాన, యోగ, జ్ఞానములుగ పిలువబడుతోంది. భగవంతుడు ఆత్మస్వరూపముగా యుండును. హృదయంలో

"నేను"గా ప్రకాశించే భగవంతుడే ఆత్మ. ఆలోచనయే భవబంధ కారణముగ వేదాంత గ్రంథాలు పేర్కొంటున్నాయి. నిశ్శబ్దరూపమగు మౌనమే ఆయనను పొందతగిన ఉత్తమ మార్గము. మనస్సుకు ఆకారము "నేను" యనెడి భావన. అదియేవిధముగ నున్నను దానిని భగవంతుని యందు లిప్తము చేయవలెను. ఇదియే పవిత్రగ్రంథముల బోధనా సారాంశము.

5

శిష్యుడు : ఈ విచారణా విధానం స్థూలదేహమే ఆత్మయనెడు భావనను తొలగించుటకే పరిమితమా? లేక సూక్ష్మ, కారణ శరీరముల భ్రాంతిని గూడ తొలగించుటకు ఉపకరిస్తుందా ?

గురువు : స్థూలదేహముపై ఇతర దేహములు (సూక్ష్మ+కారణ) ఆధారపడియున్నవి. దేహము "నేను" అను అసత్య నమ్మకములో మూడు దేహములు, వానికి సంబంధించిన పంచ కోశములు ఇమిడియున్నవి. అందుచే మూడు దేహముల భ్రాంతి తొలగుటకు ఆత్మవిచారణే సరియైన సాధన.

6

శిష్యుడు : అంతరింద్రియమగు మనస్సనకు - మనస్సు, బుద్ధి, చిత్తము, అహంకారములనెడి భిన్నమైన మార్పులుండగ మనోనాశమే బంధవిముక్తి ఎట్లగును ?

గురువు : మనస్సుయొక్క స్వభావమును వివరించు గ్రంథములలో ఈ విధముగ చెప్పబడినది. "మనము భుజించు

ఆహారపు సూక్ష్మసారాంశము యొక్క నిర్దిష్టమగు దానిచేత మనస్సు ఏర్పడుచున్నది. రాగద్వేషములు, కామక్రోధముల వంటి ఉద్రేకములతో అది పెరుగును. మనస్సు, బుద్ధి, చిత్తము అహంకారముల మొత్తమే అది గనుక దానికి ఏకైక నామము మనస్సు అని అందురు. ఆలోచన, నిర్ణయం ఆ మనస్సు లక్షణాలు. అది జడమైనను కాలిన ఇనుపగుండువలె (ఆత్మసంబంధమువలన) చేతనముగ గోచరించును. ఆ మనస్సే పరిమితమై, అశాశ్వతమై, శకలమై, మైనము, బంగారము, కొవ్వొత్తి మొదలగువానివలె మారుతుంది. పంచభూతాత్మకమైన అది హృదయకమలమున కండ్లయొక్క దృష్టివలె తిరుగాడును. అది వ్యక్తియొక్క ఆత్మతో సంలీనమైయున్నది (adjunct). ఆలోచించే విషయంగా మారే లక్షణం మనస్సుకున్నది. పంచేంద్రియములద్వారా ప్రవహిస్తూ విషయానుభవంచేత సంతృప్తి చెందుతుంది. అదే మనస్సు. వ్యవహారములచేత ఒకే మనిషి విభిన్న విధములుగ (ఉదా :- తండ్రి, కొడుకు, ఉద్యోగి మొ॥) పిలువబడునట్లు వ్యవహార భేదంచేత మనస్సు బుద్ధియని, చిత్తమని, అహంకారమని పిలువబడుతుంది. మనస్సే ఆత్మ, భగవంతుడు, ప్రపంచము-అన్నింటి రూపమగుచున్నది. అంతరాత్మ జ్ఞానము వలన అగుచో అప్పుడు బంధవిముక్తి కలిగి బ్రహ్మ స్వభావము కలదై యుండును. ఇదియే బోధ.

7

శిష్యుడు : ఈ నాలుగు అనగ "మనస్సు, బుద్ధి, చిత్తము, అహంకారము" ఒకటే అయినచో ఎందువలన వానికి వివిధ స్థానము లియ్యబడినవి ?

గురువు : నిజమే. మనస్సునకు స్థానము గొంతుఅని, బుద్ధికి హృదయమని, చిత్తమునకు బొడ్డుఅని, అహంకారమునకు సర్వాంగమని లేక హృదయమని చెప్పబడింది. పైవిధంగ చెప్పబడినప్పటికి మనస్సు లేక అంతరింద్రియము ఈ అన్నింటి మొత్తమై హృదయస్థానమందున్నదని శాస్త్రగ్రంథములందు ప్రస్ఫుటముగ నిర్ధారణ చేయబడియున్నది.

8

శిష్యుడు : ఎందువలన మనస్సు (అంతరింద్రియము) మాత్రమే ఆత్మ. భగవంతుడు. ప్రపంచముగ చెప్పబడుచున్నది ?

గురువు : వస్తువులను తెలిసికొనుటకు పనిముట్లవలె అవయవములు (జ్ఞానేంద్రియములు - SENSE ORGANS) వెలుపల ఉన్నవి. అందువలన అవి బాహ్యేంద్రియములని పిలువబడుచున్నవి. మనస్సు లోపల ఉండుటవలన అంతరింద్రియమని పిలువబడుచున్నది. అంతరమునకు బాహ్యమునకు మధ్య భేదము దేహమును దృష్టియందుంచుకొనియే; నిజానికి లోపల అనునదిగాని, బయట అనునదిగాని లేదు.

హిమద్రవము (ether) వలె స్వచ్ఛముగ యుండుటయే మనస్సుయొక్క స్వభావము. అంతరముగను, బాహ్యముగను అగుపడు ప్రాపంచిక మూలకముల సామూహిక భావనయే హృదయముగాని లేక మనస్సుగానియగును. కనుక దృక్ప్రపంచమందలి నామములు, రూపములు మనస్సుయొక్క స్వభావము మాత్రమే యనునది నిస్సందేహము. బాహ్యముగ అగుపడినవన్నియు నిజముగ అంతర్గతమే; బాహ్యగతము కాదు. వేదములలో కూడ అన్నియు హృదయ స్వభావమని చెప్పబడియుండుట దీనిని బోధించుటకే. హృదయమని పిలువబడునది బ్రహ్మ తప్ప వేరేమియు లేదు.

9

శిష్యుడు : హృదయమనునది వేఱేకాదని ఎట్లు చెప్పబడగలదు ?

గురువు : ఆత్మ జాగ్రుత్ స్వప్నసుషుప్తి స్థితులలో తన అనుభవములను అనుభవించుచున్నను, కండ్లలోను, గొంతులోను, హృదయములోను అవి నిజముగ (నివసించుచు) ముఖ్యస్థానమగు హృదయమును ఎప్పుడును వదలదు. అన్నింటియొక్క స్వభావమగు హృదయ కమలములో, మరోమాటలో చెప్పాలంటే సర్వవ్యాప్తియగు మనస్సు 'నేను'గా ప్రకాశించు వెలుగైయున్నది. ఆ విధముగ అందరిలో ప్రకాశిస్తూ ఈ ఆత్మయే సాక్షియని, తురీయమని (నాల్గవదియని) చెప్పబడుచున్నది. 'నేను' లేని అత్యుత్తమ బ్రహ్మ అన్ని దేహములలో

ప్రకాశించుచూ లోపల వెలుగై "జ్ఞానఅంతర్వాహిని"గా, లేక, 'నేను' అను అంతరాత్మ యగుచున్నది. అది మాత్రమే పరిపూర్ణసత్యము ఇదే తురీయావస్థ యందలి పరమ సత్యము. అందువలన హృదయ మనునది బ్రహ్మము తప్ప వేఱేమి కాదు. అన్ని జీవులయొక్క హృదయములలో ప్రకాశించునది బ్రహ్మము కనుక హృదయము 'బ్రహ్మ'మని పిలువబడినది. హృదయమను మాటను పదవిభాగం చేసినపుడు 'హృత్-అయం' అగును. అంటే బ్రహ్మము అది అన్ని హృదయములలో 'ఆత్మ'గ ప్రకాశించు చున్నది. బ్రహ్మముయనెడి సత్యమునకు తగిన నిరూపణ ప్రతి మనుజుడును తనను గూర్చి చూపవలసి వచ్చినపుడు రొమ్ము నైపుచూపుచు "నేను" అని చెప్పుటయే.

10

శిష్యుడు :- ఈ సర్వవిశ్వము మనస్సుయొక్క రూపమైనట్లైతే అప్పుడు విశ్వము భ్రాంతి అయినట్లు కాదా ? అదే నిజమైతే విశ్వసృష్టి వేదములో ఎందుకు పేర్కొనబడినది ?

గురువు :- విశ్వము కంటికి భ్రాంతి అనుటలో ఎట్టి సందేహము లేదు. అగుపడు విశ్వమంతా అసత్యమని నిరూపించిన తర్వాత వేదముయొక్క ముఖ్య ఉద్దేశ్యము సత్యమగు బ్రహ్మమును తెలుపుటయే. ఈ ఆవశ్యకత కొఱకే ప్రపంచ సృష్టిని వేదములు అనుమతించుచున్నవి; మరే ఇతర కారణం

వలనను కాదు. ఇంకను మందాధికారులకు సృష్టి బోధింపబడినది. అది ఆదినుండి (ప్రకృతినుండి) పరిణామదశయని, మహాత్తత్త్వమని (the great intellect), తన్మాత్రలని (the subtle essences), పంచభూతములని (the gross elements), ప్రపంచమని, దేహమని, బ్రహ్మనుండి ఉద్భవించినవిగ చెప్పబడుచున్నది. ఉత్తమాధికారులకు ప్రపంచము స్వప్నమని, ఆ స్వప్నం విశ్వాత్మగా తన ఆత్మను తెలిసికొనలేని అజ్ఞానం నుండి పుట్టిన ఆలోచనవలన ఏర్పడినదని బోధింపబడినది. విశ్వము భ్రాంతి రూపమని ఏదో విధముగ చెప్పుటయే వేదముయొక్క ముఖ్యోద్దేశము. వివిధ రీతుల వర్ణింపబడిన పిదప బ్రహ్మముయొక్క సత్యస్వభావము పైనే ప్రపంచ సృష్టి అంతయు ఆధారపడియున్నది. ప్రపంచము భ్రాంతియని తన ఆనంద స్వభావమని అనెడి అనుభవముల నుండి ముఖాముఖి ప్రతి మనుజుడు అనుభవపూర్వకస్థితి యందు గ్రహించగలడు.

11

శిష్యుడు :- నిరంతర చంచల స్వభావము గల మనస్సునకు ఆత్మానుభూతి సాధ్యమా ?

గురువు :- సత్వగుణము ప్రకృతిలో భాగము. అది స్వచ్ఛము, జ్ఞానరూపమువైనది. సత్వగుణమే మనస్సుయొక్క ప్రకృతి అగుటచే స్వచ్ఛము, నిర్మలము అని పిలువబడుచు వాస్తవముగ జ్ఞాన మాత్రముగ ఉండును. ఆ స్థితియందు మనస్సునకు పేరుకూడ లేదు. ఒక దానిని వేరొక దానినిగా

గ్రహించు విపరీత జ్ఞానమే మనస్సుగా వ్యవహరింపబడుచున్నది. ప్రారంభమునందు పరిశుద్ధ సత్త్వమైనట్టిదియు స్వచ్ఛజ్ఞానస్వభావము కలిగినట్టిదియునగు మనస్సు అజ్ఞానమువలన తన జ్ఞానస్వభావమును మఱచిపోవును; తమోగుణ ప్రభావమువలన ప్రపంచముగ పరిణామము చెందును (తమోగుణము - మందబుద్ధి, జడత్వము మొదలగువానికి నిలయమైనదియు, ప్రకృతియందొక అంశమైనట్టిదియు), రజోగుణ ప్రాభవము వలన (రజోగుణము—చైతన్యము, ఉద్రేకములు మొదలగు వానికి నిలయమై ప్రకృతియందొక అంశమైనట్టిదియు) "నేను దేహమును మొదలగునవి అనియు, ప్రపంచము సత్యము" అనియు ఊహించును; తత్ఫలితముగ రాగద్వేషములు మొదలగువానిచే, మఱియు పూర్వమునుండి మిగిలియున్న వాసనల (residual impressions) చే జనన మరణములు పొందుచున్నది. కాని ఏ మనస్సు తన మలినములు (పాపము) ను క్రిందటి అనేక జన్మలలో చేసిన బంధరహిత కర్మవలన పోగొట్టుకొనునో, అది సద్గురువుద్వారా పవిత్ర గ్రంథ బోధలన శ్రవణము వలనను, వాని అర్థమును మనన చేయుట వలనను, ఆత్మరూపము యొక్క సహజ మానసికస్థితిని పొందుటకు ధ్యానముచేయుట వలనను, అనగ బ్రహ్మమును గురించి నిరంతరము ధ్యాన ఫలితముగను "నేనే బ్రహ్మమును" నను సహజస్థితిని పొందును. పరిణామము చెందిన మనస్సు యొక్క మార్పు తొలగింపబడును. మఱియు రజోగుణ

లక్షణముగూడ అట్లే తొలగింపబడును. ఈ తొలగింపు జరిగినపుడు మనస్సు సూక్ష్మమై అచంచలమగును (subtle and unmoving). అప్పుడు మ్లానమై, రాజస తామస గుణప్రభావములకులోనై యున్నట్టిమనస్సు అత్యంత సూక్ష్మము అచంచలము అయినట్టి ఆ సత్యానుభవము (అంటే, ఆత్మ) ను బరువైన పలుగుతో బహు సున్నితమగు సిల్కుగుడ్డను ఏవిధముగ కుట్టుటకు వీలులేదో, లేక గాలిలో రెపరెపలాడు దీపపు కాంతిలో సూక్ష్మవస్తువుల వివరములు ఏవిధముగ విచక్షణచేయలేమో అట్లే పొందనేరదు. కాని పై వివరించిన విధముగ ధ్యానముచేత సూక్ష్మము, అచంచలముగ చేయబడిన పరిశుద్ధమనస్సులో ఆత్మానందము (అనగ, బ్రహ్మము) ద్యోతకమగును. మనస్సు లేనిదే అనుభవమెట్లు లేదో, అట్లే నిర్మల బ్రహ్మస్థితిలో అత్యంత సూక్ష్మవృత్తి సంభరితమైన పరిశుద్ధమనస్సుకు ఆత్మానందానుభవము {ఆరూపములో ఉండుట వలన (అనగా) బ్రహ్మముయొక్క ఆకారములో} సాధ్యము. అప్పుడు, తన అంతరాత్మయే బ్రహ్మము యొక్క స్వభావమని సుస్పష్టముగ అనుభవమగును.

12

శిష్యుడు : మనస్సు ప్రారబ్ధానుసారముగ (ప్రారబ్ధము అంటే ఫలించుట ప్రారంభమైన పూర్వకర్మ) కార్య

క్రమములను నిర్వహించవలసియుండగ, ఈ అస్పష్ట జీవన స్థితిలో ఇంతకుముందు చెప్పబడిన ఆత్మానుభవము సాధ్యమా ?

గురువు : ఒక బ్రాహ్మణుడు ఒక నాటకములో అనేక పాత్రధారణలు చేయవచ్చును; కాని తాను బ్రాహ్మణుడనను భావనమాత్రము మనస్సును వదలదు. అట్లే, "నేను దేహమును, మొదలగు" అసత్యభావనను ఉద్భవించనీయకుండా, "నేనే ఆత్మను" అను దృఢవిశ్వాసము (conviction) తో జీవిత కార్యక్రమముల నన్నింటిని చేయుచుండవలెను. మనస్సు తన నిజస్థితినుండి మళ్ళి ఇతరత్రా సంచరించునో, తక్షణమే ఇట్లు విచారణచేయవలెను. "ఓ ! ఓ ! మనమంతా దేహముకాదు, మొదలగునవి ! మన మెవరము ?" మరియు ఆవిధముగ మనస్సును ఆ పరిశుద్ధస్థితిలో పునఃప్రతిష్ఠాపన చేయవలెను. "నేనెవరను" అను విచారణయే సమస్త దుఃఖములను పోగొట్టుటకు మరియు పరమానందమును పొందుటకు మార్గము. ఈ విధముగ మనస్సు తన నిజస్థితియందు ప్రశాంతత చెందినపుడు, ఆత్మానుభవము నిరాటంకముగ తనంతటతానే ఉద్భవిస్తుంది. అటుపిదప ఇంద్రియముల సంబంధమైన సుఖదుఃఖములు మనస్సును కలతచెందించవు. అప్పుడు, దృగ్గోచరమగునదంతయు (phenomena) బంధరహితమై, స్వప్నమువలె కాన్పించును. మనుజుని ప్రప్రథమ

ఆత్మానుభవమును మరచిపోకుండుటయే యథార్థభక్తి, యోగము (మనోనిగ్రహము), జ్ఞానము తదితర పవిత్ర కార్యములు. ఆవిధముగ ఋషులు వచించుచున్నారు.

13

శిష్యుడు : పనులకు సంబంధించి కృషి జరుగుచున్నప్పుడు, మనము ఆ పనులయొక్క నిర్వాహణకు నియమింపబడినవారము గాని, లేక, వానిని అనుభవించువారము గాని కాము. ఆ కృషి మూడు సాధనములది (అనగ, మనస్సు, వాక్కు, దేహము). ఆ విధంగా (బంధరహితముగ) ఆలోచిస్తూ ఉండగలమా ?

గురువు : మనస్సును తన దైవతమగు ఆత్మయందు లగ్నమై యుండునట్లు చేసిన పిదప, మఱియు ప్రాపంచిక విషయములందు విముఖత కల్గియుండునట్లు చేసిన తర్వాత - అప్పుడది ఆత్మనుండి బాహ్యముగ సంచరించదు కనుక — పైన తెలిపిన విధముగ మనస్సెట్లు ఆలోచించగలదు ? అట్టి ఆలోచనల పర్యవసానము బానిసత్వముకాదా ? అటువంటి ఆలోచనలు శేషవాసనల ప్రభావంచేత ఉత్పన్నమైనపుడు, మనుజుడు తన మనస్సును ఆ మార్గమున ప్రవహించకుండ తప్పక నిరోధించవలెను; ఆత్మస్థితియందు దానిని ఉంచుటకు ప్రయత్నించవలెను; మరియు ప్రాపంచిక విషయములయెడ విముఖత కల్గియుండునట్లు దానిని మరల్చవలెను. "ఇది మంచిదా ?

లేక, అది మంచిదా ? ఇదిచేయగవచ్చా ? లేక, అది చేయవచ్చా?" వంటి ఆలోచనలకు మనస్సునందు తావీయరాదు. అటువంటి ఆలోచనలుఉత్పన్నము కాకముందే తను జాగ్రత్తగ నుండవలెను; మరియు మనస్సును తన సహజస్థితి యందుండునట్లు చేయవలెను. ఏ కొంచెము స్థానమైను ఇయ్యబడినచో, ఆ విధముగ చికాకు చెందిన మనస్సు మనమిత్రుడు మనకు విషప్రయోగము చేసినట్లు హానిచేయును; మన శత్రువు మిత్రునివలె నటించునట్లు అదిమనలను తలక్రిందులు చేయును. మనుజుడు తన ఆత్మను తాను మఱచిపోవుటవలననే అట్టి ఆలోచనలు కలిగి, ఎంతెంతో చెరుపుకు కారణమగుట లేదా ? "నేనేమియు చేయను, సమస్త కార్యములు సాధనములవలననే (పనిముట్ల వలననే — (by instruments) జరుగుచున్నవి" అని విచక్షణ ద్వారా ఆలోచించుటవలనమనస్సును.ఆలోచనలవాసనా ప్రవాహమునుండి నిరోధించుటకు ఒక ప్రక్రియ (means) యగుట నిజమే అయిననూ, మనస్సు ఆలోచనల వాసనలప్రవాహము ననుసరించి ప్రసరించినచో ఇంతకు పూర్వము పేర్కొన్న విధముగ విచక్షణద్వారా తప్పక అరికట్టవచ్చునని అదేరీతిగ అన్వయించకూడదా ? ఆత్మస్థితియందున్న మనస్సు "నేను" మరియు "నేను ప్రాపంచికముగ అవిధముగ, ఆ విధముగ" అని ఆలోచించగలదా ? వీలగు సమస్త విధముల మనుజుడు భగవంతుడగు తన అంతరాత్మ (true self) ను మరువకుండు

నట్లు క్రమముగ తప్పక ప్రయత్నింపవలెను. అది సాధింపబడినచో, సర్వము సిద్ధించును. ఏ ఇతర విషయమువైపు మనస్సును త్రిప్పరాదు. ప్రారబ్ధకర్మానుసారముగ మనుజుడు పిచ్చివానివలె తన కార్యములను (actions) చేయుచున్నను, "నేను చేయుచున్నాను" అను భావన రాకుండచూచుచూ ఆత్మస్థితియందు మనస్సును తప్పక ఉంచవలెను. లెక్కకు మించినంత మంది భక్తులు అనేక లౌకిక కార్యములను (empirical functions) నిర్లిప్త ప్రవర్తనతో నిర్వహించలేదా?

14

శిష్యుడు : సన్యాసము యొక్క వాస్తవ ఆవశ్యకత (real purpose of renunciation) ఏమి ?

గురువు : సన్యాసము "నేను" భావనత్యజించుటయే కాని బాహ్యవస్తువులను తిరస్కరించుటకాదు. "నేను" భావనను వదలివేసిన (త్యజించిన) మనుజుడు ఒంటరిగఉన్నను, లేక విశాల సంసారమధ్యముననున్నను ఒకే విధముగ నుండును. ఒక వస్తువుపై మనస్సును కేంద్రీకరించినపుడు, సమీపమున ఉన్నప్పటికి తక్కిన వస్తువులనే విధముగ అది గమనించదో అదే విధముగ సన్యాసి ఎన్నో లౌకిక కార్యములను చేయుచున్నప్పటికి, వాస్తవముగ అతడేమియు చేయనట్లే. ఎందువలననగ, అతడు "నేను" భావన రానీయకుండ తన మనస్సును ఆత్మయందుంచుచున్నాడు. కలలో ఒకడు తాను

తలక్రిందులుగ పడుచున్నట్లగు పడినను, యదార్థముగ అతడు నిశ్చలుడు; అట్లే అజ్ఞాని, అనగ, "నేను" భావన తొలగిపోవని మనుజుడు ఒంటరిగ నిరంతర ధ్యాననిమగ్నుడైయున్నను యదార్థముగ అతడు సమస్త ప్రాపంచిక కార్యములను * నిర్వహించువాడే యగును. ఆ విధముగ జ్ఞానులు ప్రవచించిరి.

15

శిష్యుడు : మనస్సు, జ్ఞానేంద్రియములు మొదలగునవి గ్రహించుటకు శక్తి (ability to perceive) కలిగియున్నవి. ఐనప్పటికి గోచరమైన వస్తువులు (perceived objects) గ ఎందువలన తలంపబడుచున్నవి ?

గురువు :

దృక్ (తెలిసికొనినవాడు)	దృశ్యము (తెలిసికొనబడిన వస్తువు)
(1) జ్ఞాని	కుండ (అంటే, చూడబడిన వస్తువు)

* ఒక కథను వినుచూ తమ శ్రద్ధంతా వేరొకచోట కేంద్రీకరించిన వారివలె, ఎవరి వాసనలు (ప్రారబ్ధ కర్మఫలములు) అంతమగునో అట్టి వారి మనస్సు పనిచేయుచున్నట్లగు పడుచున్ననూ, నిజముగ పని చేయదు. వాసనలు నశించనివాని మనస్సు నిశ్చలముగ ఉన్నట్లగు పడుచున్నను ఆ విధముగనుండదు; అది పనిచేయుచూనే యుండును. ఇది నిశ్చలముగనున్నవారు కలలలో తాము కొండఎక్కి, అచ్చటనుండి పడుచున్నట్లూహించుటవలె ఉండును.

ఇంకను

(2) నేత్రేంద్రియము	దేహము, కుండ, మొ॥
(3) వీక్షణ జ్ఞానము	నేత్రేంద్రియము
(4) మనస్సు	వీక్షణ జ్ఞానము
(5) జీవాత్మ	మనస్సు
(6) జ్ఞానము - పరమాత్మ	జీవాత్మ

పై విధానమున తెల్పినట్లుగ, జ్ఞానమగు మనము వస్తువులన్నింటిని తెలిసికొని యుండుటవలన, మనలను (దృక్) తెలిసికొనిన వారందరు. కుండతో అంతమగు పైన పేర్కొనబడిన అవస్తువుల రకములు మనకు తెలిసినట్టివి గాన అవి చూడబడిన వస్తువులు.

'జ్ఞానము : అజ్ఞానము (అంటే, తెలిసికొనునట్టిది తెలియబడునట్టిది)' అని ఇయ్యబడిన పై పట్టికలో తెలిసికొనినవారిలో మరియు తెలిసికొనబడు వస్తువులలో ఒకరు మరొకరికి తెలిసికొను వారగుచున్నారు; ఐనప్పటికి ఒకటి రెండవ దానికి వస్తువగుచున్నది; కనుక యదార్థముగ ఈ వర్గములో ఏ ఒక్కటి తెలిసికొనినట్టిది (జ్ఞానముకలది — knower) కాదు. మనము తెలిసికొనిన వారమని పేర్కొనబడినను—మనకన్నీ తెలియునుగాన—మరి ఏ ఇతర దాని చేతనైనను తెలియబడినట్టి వారముకాదు. అందుచే మనము

తెలిసిన వస్తువులకు సంబంధించి మాత్రమే 'తెలిసిన వారలమగు'చున్నాము. యదార్థముగ, ఎట్లైనను, 'తెలియబడినది' అనునది మననుండి వేరైనది కాదు. అందువలన తెలిసినవాడు, తెలియబడునది అను రెంటికి అతీతమై మనము సత్యమై యున్నారము. తక్కినవన్నియు తెలిసినది — తెలియబడునది అను వర్గములకు చెందుచున్నవి.

16

శిష్యుడు : ఏ విధముగ అహంకారము, జీవాత్మ, సాక్షి, సర్వం సాక్షి, బ్రహ్మములు గుర్తింపబడగలవు?

గురువు :

ఉదాహరణము	ఉదాహరణముగ పేర్కొనబడినది
1) ఇనుప గోళము	అహంకారము
2) కాల్చిన ఇనుప గోళము	పరమాత్మ భ్రాంతి వలన జీవాత్మగ గోచరించునట్టిది.
3) కాల్చిన ఇనుపగోళమునందున్న అగ్ని	జ్ఞానమనే వెలుగు, అనగా, పరిణామరహితమగు బ్రహ్మము; అదే, ప్రతివాని ఆత్మలో భాసించునట్టిది.
4) ఒకే ఒకటిగ ఉండు అగ్నిజ్వాల	ఒకే ఒకటిగ స్థిరముగనుండు సర్వవ్యాప్తియగు బ్రహ్మము

పై తెల్పిన ఉదాహరణలనుండి అహంకారము, జీవాత్మ సాక్షి, సర్వం సాక్షి గుర్తింపబడుటకు వీలగును.

కంసాలిదగ్గర ఉన్న మైనపుముద్ద యందలి పదార్థము నందు అనేకము, వివిధములగు లోహశకలములు ఎట్లు ఇమిడి యున్నవో మరియు అవి అన్నియుకలసి ఒకేఒక మైనపుముద్దగ ఎట్లు భాసించునో అట్లే గాఢనిద్రయందు సమస్త ఆత్మలయొక్క స్థూల, సూక్ష్మ దేహములు కటికచీకటి స్వభావము గల విశ్వ మాయ (మూలప్రకృతి) యందిమిడియున్నవి. మరియు వ్యక్తి ఆత్మలు విశ్వాత్మలో ఇమిడి యుండి దానిలో ఏకమైయున్నవి గనుక సర్వత్ర అవి చీకటిని మాత్రమే చూస్తాయి. నిద్ర యనెడి చీకటినుండి సూక్ష్మదేహము—అనగ అహంకారము, అచ్చటనుండి స్థూల దేహము క్రమముగ ఉద్భవిస్తున్నవి. అహంకారము జనించినపుడుకూడ విశ్వాత్మ స్వభావము పై అహంకారమాపాదింపబడినట్లు అగపడును. అది వేడి చేయబడిన ఇనుపబంతివలె, ఆవిధముగ జీవుడు లేకుండ అంటే (మనస్సు గాని, తత్ప్రేరితమగు అహంకారముగాని జ్ఞానమనెడి వెలుగుతో ముడిపడిఉన్నట్టిది) జీవాత్మకు సాక్షీ భూతమగు విశ్వాత్మ మరియు సర్వసాక్షియగు బ్రహ్మము లేకుండ విశ్వాత్మలేదు. కమ్మరి చేత వివిధ ఆకారములలోనికి ఏవిధముగ ఇనుపబంతి కొట్టబడుచున్నదో మరియు దాని యందుండు అగ్ని ఎట్టి మార్పును చెందకుండ ఉంటుందో అదేవిధంగ జీవుడు అనేక విధములగు అనుభవములను సతతము పొందుచూ సుఖదుఃఖములు అనుభవించుచు విశ్వాత్మ వెలుగు దానియందున్నది కాన స్వల్పముగానైనను ఏమార్పు చెందదు. మఱియు ఆకాశము (ఈథర్) వలె అది సర్వత్రవ్యాపించి (ఏకాత్మగా) ఒకటిగా ఉన్న స్వచ్ఛమైన జ్ఞానము.అది హృదయంలో బ్రహ్మముగా ప్రకాశిస్తున్నది.

17

శిష్యుడు : ఆత్మయే ప్రతివాని హృదయములో ప్రకాశించుచున్నదని తెలిసికొనుట యెట్లు ?

గురువు : ఆకాశతత్త్వమగు ఈథరు ఏవిధముగ దీపపు వెలుగులోయుండి భేదరహితమును, హద్దులులేకుండగను జ్వాల యొక్క అంతర్బాహ్యములను నింపుచున్నదో అట్లే జ్ఞానమను ఈథరు హృదయమందలి ఆత్మ వెలుగునుండి భేదరహితముగను హద్దులు లేకుండగను ఆత్మ లోపల వెలుపల నిండియున్నది. దీనినే 'బ్రహ్మ' మందురు.

18

శిష్యుడు : ఆత్మవెలుగు ఏకమై, ద్వంద్వరహితమై, స్వయం ప్రకాశమానమైనట్టిది.అట్టిదానియందు ఏ విధముగ మూడు దేహములు మొదలగునవి - మూడు అనుభవపూర్వకమగు స్థితులుగ నున్నవని ఊహింపబడునవి - ఆత్మ వెలుగులో ఏ విధముగ కనబడుతవి ? ఎట్లైనా అవి అగుపడుచో విశ్వాత్మ ఒక్కటియే ఎల్లపుడు అచంచలముగ వున్నదని తెలిసకొనుటెట్లు ?

గురువు :



ఉదాహరణ	ఉదహరింపబడినది
1) దీపము	ఆత్మ
2) ద్వారము	నిద్ర
3) ద్వారపుగడప (door-step)	మహత్తత్వం
4) లోపలిగోడ	కారణ దేహము
5) అద్దము	అహంకారము

6) కిటికీలు	పంచేంద్రియములు
7) అంతర్ గృహం (లోపలిగోడ)	కారణ దేహమగుపదు సుషుప్తి
8) మధ్యగది	సూక్ష్మ దేహమగుపదు స్వప్నము
9) బాహ్యప్రాంగణం	స్థూల దేహమగుపదు జాగ్రదవస్థ

అంతర్ గృహమనబడు కారణ దేహములో (7) స్వయం ప్రకాశమానమగు దీపము (1) ఆత్మ. ఈ కారణ దేహమన బడు అంతర్ గృహమునకు అవిద్య అనునది లోపలిగోడ (4); నిద్రఅనునది ద్వారము (2); కాలము, కర్మ, మొదలగు వానిచే బద్ధమైనచైతన్యము (vital principle)చే నిద్రకవాటము తెరువబడినపుడు మహత్తత్వ ద్వారమునకు అత్యంత సమీప మునగల అహంకారమను అద్దములో ఆత్మయొక్క ప్రతిబింబ మేర్పడును; ఆ విధముగ అహంకారమను దర్పణము మధ్య గదిని, అనగ, స్వప్నావస్థను, మరియు జ్ఞానమునందించు పంచేంద్రియముల (6) ను గవాక్షములద్వారా బాహ్యప్రాం గణమును, అనగ, జాగ్రదవస్థ (waking state) ను ప్రకాశింప జేయును. మరల కాలము కర్మ మొదలగువానిచే బద్ధమైన చైతన్యముచేస్వప్న ద్వారము ఎప్పుడు మూయబడునో అప్పుడు జాగ్రత్ స్వప్నములతో అహంకారము ఆగిపోవును; మరియు ఆత్మ మాత్రమే నిరంతరము ప్రకాశించును. పై పేర్కొన్న ఉదాహరణ, ఆత్మ ఏవిధముగ అచంచలమై యుండునదియు, ఆత్మకు అహంకారమునకు ఏవిధమగు భేదమున్నదియు, మరియు

అనుభవమునకు వచ్చు మూడు స్థితులు అగు మూడు దేహములు మొదలగునవి అగుపడునదియు, వివరించును.

19

శిష్యుడు : నేను విచారణ యొక్క లక్షణముల వివరణను అంతసాకల్యముగ వినినప్పటికి నా మనస్సునకు కొంచెము శాంతి కూడ చేకూరలేదు. దీనికి కారణమేమి ?

గురువు : మనస్సు దుర్బలముగనుండుట, లేక, దానికి ఏకాగ్రత లేకపోవుటయే కారణము.

20

శిష్యుడు : మానసిక దృఢత్వము లేకపోవుటకు కారణమేమి ?

గురువు : విచారణకు మనుజుని యోగ్యునిగ చేయునవి ధ్యానము, యోగము మొదలగునవి. క్రమమైన అభ్యాసము (graded practice)చే వీనియందు ప్రావీణ్యత సంపాదింపవలెను. ఆ విధముగ సహజము, సహాయకారియునగు మానసిక విధానముల ప్రవాహమును చేకూర్చుకొనవలెను. ఈ విధముగ పరిపక్వత చెందిన మనస్సు ప్రస్తుత విచారణను ఎప్పుడు శ్రద్ధగ ఆకర్ణించునో, తక్షణమే తన నిజస్వభావమగు ఆత్మను సాక్షాత్కారము చేసికొని (realize), పరిపూర్ణ శాంతియందు, ఆ స్థితినుండి మారకుండ, సుస్థిరముగ ఉండిపోవును. విచారణను వినుటవలన అపరిపక్వ మనస్సునకు తక్షణ సాక్షాత్కారము

(realization), శాంతిపొందుట దుర్లభము. అయినప్పటికి, కొంతకాలము మనోనిగ్రహ విధానములను అభ్యాసము చేసినట్లైనచో, మనశ్శాంతిని చివరకు పొందవచ్చును.

21

శిష్యుడు : మనోనిగ్రహమునకు అత్యంత ముఖ్యమగు సాధనమేమి ?

గురువు : మనో నిగ్రహమునకు శ్వాస (ఉచ్ఛ్వాస నిశ్వాసల)ను నియమబద్ధము చేయుట (breath-control) విధానము.

22

శిష్యుడు : శ్వాసను నియమబద్ధము చేయుటెట్లు ?

గురువు : కేవల కుంభకము వలనగాని లేక ప్రాణాయామము వలనగాని శ్వాసను నియమబద్ధము చేయవచ్చును.

23

శిష్యుడు : కేవలకుంభక మననేమి ?

గురువు : అది ఉచ్ఛ్వాసనిశ్వాస రహితముగ ప్రాణశక్తియుతవాయువును హృదయమందు దృఢముగ నిలుపుట. చైతన్యము (vital principle) మొదలగు వానిపై ధ్యానము ద్వారా ఇది లభ్యమగును.

24

శిష్యుడు : శ్వాసను క్రమబద్ధము చేయుట యననేమి?

గురువు : అది యోగ గ్రంథములలో పేర్కొనబడిన బోధనల ననుసరించి రేచక (నిశ్వాస), పూరక (ఉచ్ఛ్వాస), కుంభక (నింపుట) ముల ద్వారా హృదయమందు ప్రాణ శక్తియుత వాయువును దృఢముగ నిలుపుట.

25

శిష్యుడు : శ్వాసను నిగ్రహించుట (breath-control) మనస్సును నిగ్రహించుట (mind-control) కు మార్గమెట్లగుచున్నది ?

గురువు : శ్వాసను నిగ్రహించుట నిస్సందేహముగ మనోనిగ్రహమునకు విధానము; ఏలనన - మనస్సు, శ్వాసవలె, వాయువునందొక భాగము; చంచలత్వము రెంటికిని ఒక ఉభయ సామాన్య లక్షణము; రెంటికిని ఉత్పత్తి స్థానము ఒకటే; మరియు వానిలో ఒకటి క్రమబద్ధము చేయబడినపుడు రెండవది తనంతట తానే క్రమబద్ధమౌతుంది.

26

శిష్యుడు : శ్వాసనియంత్రణ (breath-control) మనశ్శాంతి (quiescence) కి మాత్రమే దారితీయును, మనోనాశమునకు కాదు గాన మనోనాశమును లక్ష్యముగ పెట్టుకున్న విచారణ చేయుటకు శ్వాసనియంత్రణ సాధన మని ఏవిధముగ చెప్పబడుతుంది ?

గురువు : ఆత్మ సాక్షాత్కారము పొందుటకు శాస్త్ర గ్రంథములు రెండు విధానములను బోధించుచున్నవి —

అష్టాంగ యోగమనే యోగమార్గము; అష్టాంగ జ్ఞానమనెడి జ్ఞానమార్గము ప్రాణాయామము ద్వారా, లేక, యోగాంగములయందొకటి యగు కేవలకుంభకము ద్వారా మనస్సు నియంత్రణను పొందుతుంది (mind gets controlled). అక్కడ విడవకుండ, బాహ్యవస్తువులనుండి మనస్సును ఉపసంహరించుట (ప్రత్యాహారము) వంటి మరింత క్రమశిక్షణవలన విచారణ యొక్క ఫలమగు ఆత్మసాక్షాత్కారము చివరకు తప్పక సిద్ధిస్తుంది.

27

శిష్యుడు : యోగాంగము లేవి ?

గురువు : యమ, నియమ ఆసన, ప్రాణాయామ, ప్రత్యాహార, ధారణ, ధ్యాన, సమాధులు. వానిలో—

1) యమము : అహింస, సత్యము, అస్తేయము, బ్రహ్మచర్యము, అపరిగ్రహము వంటి సత్ప్రవర్తన నియమములను అలవరచుకొనుటకు కృషిచేయుట — ఇవి యమము.

2) నియమము : శుచిత్వము (పవిత్రత), సంతోషము, తపస్సు (austerity), పవిత్ర గ్రంథ పఠనము (స్వాధ్యాయము), ఈశ్వర ప్రణిధానము. * (భగవంతునియెడ భక్తి) — ఇవి నియమము.

---

* ఈశ్వర ప్రణిధానము : యమనియమముల లక్ష్యమేమనగ మోక్షగాములు ఎదుట ఉన్న అన్ని సన్మార్గములను చేకూర్చుకొనుట. మరిన్ని వివరములకు "యోగసూత్రములు", "హఠయోగ దీపిక" గ్రంథములను చూడుడు.

3) ఆసనము : వివిధభంగిమలలో ఎనుబది నాలుగు ముఖ్యమైనవి. వీనిలో, మరల, నాలుగు - సింహ, భద్ర, పద్మ, సిద్ధ అనునవి శ్రేష్ఠమైనవి (excellent) గ చెప్పబడు చున్నవి. వానిలో కూడ "సిద్ధ" * యను నది అత్యంత శ్రేష్ఠమైనదని యోగశాస్త్రములు ఎలుగెత్తి చాటుచున్నవి.

4) ప్రాణాయామము : పవిత్ర గ్రంథములలో నిర్ణయించిన నియమముల ప్రకారము ప్రాణశక్తియుతమగు వాయువును విడచుటను రేచక మందురు; లోపలికి పీల్చుటను పూరకమందురు; హృదయమునందు నిలుపుటను కుంభక మందురు. కాలప్రమాణమును గురించి కొన్ని గ్రంథములు రేచకపూర్వకములు తప్పక సమాన ప్రమాణములుగ నుండవలెననియు, కుంభకము ఆ ప్రమాణమునకు రెట్టింపు ప్రమాణముకలిగి యుండవలెననియు చెప్పుచున్నవి. కాని మరికొన్ని గ్రంథములు రేచకము ఒక్క ప్రమాణమైనచో, పూరకము రెండు ప్రమాణములుగను, కుంభకము నాలుగు ప్రమాణములుగను ఉండవలెనని తెలుపుచున్నవి (1 : 2 : 4). గాయత్రి మంత్రము నొక్కతూరి ఉచ్ఛరించుట కవసరమగు కాలవ్యవధిని "ప్రమాణము" అందురు. ప్రతివ్యక్తి తన

* సిద్ధాసనము : ఎడమ మడమ జననేంద్రియము పై పెట్టవలెను. దానిపై కుడిమడమను పెట్టవలెను. భ్రూమధ్యమున దృష్టినినిలిపి, దేహమును అచంచలముగ నిటారుగ దండమువలె నుంచవలెను.

శక్త్యానుసారముగ నెమ్మదిగ క్రమముగ రేచక, పూరక, కుంభకములతో నున్న ప్రాణాయామమును తప్పక సాధన చేయవలెను. అప్పుడు మనస్సుకు కదలకుండ, సుఖముగ విశ్రాంతి (rest) తీసికొనవలెననెడి వాంఛ ఉద్భవించును. దీని తర్వాత, ప్రత్యాహారమును సాధన చేయవలెను.

5) ప్రత్యాహారము : మనస్సును బాహ్యనామ రూపములవైపు ప్రవహించుటనుండి అరికట్టి క్రమబద్ధము చేయుట యది. అప్పటివరకు వ్యాకులత చెందిన మనస్సు ఇప్పుడు నియమబద్ధమగును (controlled). ఈ సందర్భములో సహాయపడునవి- (1) ప్రణవముపై ధ్యానము, (2) భ్రూమధ్యమమున దృష్టిని నిలుపుట, (3) నాసికాగ్రమును చూచుట, మరియు (4) నాదముపై ఆలోచననుంచుట (reflection on nada). ఆవిధముగ ఏకాగ్రతచెందిన మనస్సు ఒకేస్థానమందు స్థిరముగ నుండుటకు యోగ్యతకలిగి యుండును. దీని తర్వాత, ధారణను అభ్యసించవలెను.

6) ధారణ : మనస్సును ధ్యానమునకు యోగ్యమగు స్థానమున కేంద్రీకరించుట ఇది. ధ్యానమునకు అత్యంత యోగ్యమైన స్థానములు హృదయము, బ్రహ్మరంధ్రము (తలపై మధ్యభాగముననున్న రంధ్రము)లు, ఈ స్థానమందున్న

* అష్టదళ పద్మమందు మధ్యలో జ్వాలవలె (like a flame), పూజింపబడు దేవతయగు ఆత్మ,- అదే బ్రహ్మము -పై మననముచేయుచు మనస్సు నక్కడ నిశ్చలముగ నుంచవలెను (fix). దీని తరువాత ధ్యానము చేయవలయును.

7) ధ్యానము : "నేనే—అతడు" అనుభావనతో ధ్యానముచేయుట ఇది; అతడు పై చెప్పబడిన జ్వాలయొక్క స్వభావమునుండి భిన్నమైనవాడు కాడు. ఆ విధముగనైనను మనుజుడు "నేనెవరను" అని విచారణ చేసినను, అప్పుడు శాస్త్ర గ్రంథములుద్ఘోషించుచున్నట్లు, "అంతట గల బ్రహ్మము హృదయములో బుద్ధికి సాక్షిగ ఆత్మగ ప్రకాశించుచున్నది" యనియు, హృదయములో "నేను—నేను" యని ప్రకాశించే పరమాత్మగా అనుభవముతో తెలిసికొన గలడు. ఈవిధమైన విచారణ (reflection) అత్యుత్తమమైన ధ్యానము.

8) సమాధి : పూర్వోక్తమగు ధ్యానము ఫలించిన కారణమున మనస్సు, "నేను ఫలానా, ఫలానా; నేను దీనిని దీనినిచేయుచున్నానని" ఆలోచనలు రానీయకుండ ధ్యానవస్తువు యందు లగ్నమైపోతుంది. దీనిని ప్రతినిత్యము సాధనచేసి

* అష్టదళపద్మము : శిరస్సు యొక్క పైభాగపు మధ్యయందున్న పద్మమునకు సహస్రదళములున్నవని చెప్పబడుచున్నను, అది అష్టదళములు కలదిగ వర్ణింపవచ్చును. ఏలనన ఒక్కొక్క దళమునకు నూట ఇరు ఐదు ఉపదళములు కలవు.

నట్లైతే-నిద్ర అంతరాయము గాకుండునట్లు గమనించుచూ-. అట్టివానికి భగవంతుడు అనతికాలములో అత్యంతోత్తమ స్థితిగ మనోనిశ్చలత (quiescence) ను ప్రసాదించును.

28

శిష్యుడు : ప్రణవము పై ధ్యానము చేయవలెనని ప్రత్యాహారమునందు బోధించుట యొక్క ఉద్దేశ్యమేమి ?

గురువు : ప్రణవముపై ధ్యానము చేయుమని నిర్దేశించుటయొక్క ఉద్దేశ్యము ఇది: ప్రణవము ఓంకారము; అది అ-ఉ-మ అను మూడుస్వర మాత్రలు మరియు ఒక అర్ధ మాత్ర కలిగియున్నది. వీనిలో 'అ' అనునది విశ్వజీవయగు జాగ్రదవస్థ, మరియు స్థూలదేహమునకు ప్రతీక; 'ఉ' అనునది తేజసజీవయగు స్వప్నావస్థ, మరియు సూక్ష్మశరీరమునకు ప్రతీక; 'మ' యనునది ప్రజ్ఞాజీవయగు సుషుప్త్యవస్థ, మరియు కారణదేహమునకు ప్రతీక; అర్ధమాత్ర ఆత్మ, లేక, 'నేను'-స్వభావమును తెలియజేయు తురీయము. తురీయమున కావలయుండునది తురీయాతీతస్థితి, లేక పరిశుద్ధానందము (pure bliss). ధ్యానభాగమునందు నాల్గవ స్థితియగు "నేను"-స్వభావమును గురించి పేర్కొనబడినది. ఇది వివిధముగ వర్ణింపబడినది- అ, ఉ, మ- అను మూడు మంత్రములు కల్గియుండు అమాత్ర స్వభావము కలది యనియు; మౌనాక్షరము (నిశ్శబ్దాక్షరము) అనియు; అజపము (ఉచ్చారణ రహితమగు ఉచ్చారణ) యనియు; సర్వమంత్ర సారమగు పంచా

షీ మంత్రమువలె అద్వైత మంత్రమనియు. దీని యదార్థ ప్రాముఖ్యతను అర్థముచేసికొనుటకు ప్రణవముపై తప్పక ధ్యానము చేయవలెను, ఇది ఆత్మయొక్క సత్యముపై బుద్ధిని నిలిపిచేయు భక్తి స్వభావముగల ధ్యానము. ఈ విధాన ఫలితము సమాధి. సమాధివలన బంధవిముక్తి కలుగును. సమాధి అసమానమగు ఆనందస్థితి. పరమ పూజ్యులగు గురువులు కూడ భక్తితో మాత్రమే ఆత్మస్వభావము యొక్క సత్యముపై మననము చేయుటవలన బంధవిముక్తి కలుగునని చెప్పుచున్నారు.

29

శిష్యుడు : "నేనే - అతడు" అను భావనతో తప్పక ధ్యానించవలెను; జ్వాలవలె ప్రకాశించుచు స్వయం ప్రకాశమానమగు సత్యము తనకంటె భిన్నము కాదనెడి సత్యముపై ధ్యానము చేయవలెనని బోధించుటలో ఉద్దేశ్యమేమి ?

గురువు : (A) స్వయం ప్రకాశమానమగు సత్యముకంటె తాను భిన్నముకాదని కృషిచేయవలెననెడి ఉద్దేశ్యము ఇది. ధ్యానమును పవిత్రగ్రంథము ఈ విధముగ నిర్వచించుచున్నది: "అష్టాంగదళ హృదయకమలము యొక్క మధ్యలో - ఇది అందరికి ఉండును - కైలాసమని, వైకుంఠము, పరమపదము, సత్యము అని పిలువబడుచూ బొటనవ్రేలు ప్రమాణము కల్గియునది; విద్యుల్లతవలె ప్రభాభాసితమై

యున్నది. జ్వాలవలె ప్రకాశించుచున్నది. దీనినిగూర్చి ధ్యానము చేసినచో మానవుడు అమరత్వమును పొందును." దీనినుండి మనము గ్రహించవలసిన దేమంటే అటువంటి ధ్యానమువలన (1) 'నేను వేఱు - అది వేఱు' అను భేద భావన, (2) పరిమితమైన దానిపై ధ్యానముచేయుట, (3) సత్యము పరిమితమను భావన, (4) ఆ సత్యము ఒక ప్రదేశమునకు మాత్రమే సంబంధించినదనుకొనుట అనెడు లోపములను తొలగించవచ్చునని మనము తప్పక తెలిసికొనవలయును.

(B) 'నేనే - అతడు' అను భావనతో ధ్యానము చేయుట యొక్క బోధనోద్దేశ్యము ఇది : సః అహం = సోహం; ('సః' = పరమాత్మ, 'అహం' = నేనుగా భాసించు పరమాత్మ). బ్రహ్మనగరమగు దేహమందు తన స్థానమగు హృదయ కమలములో శివలింగమగు జీవుడు నివసించును; అహంకార స్వభావము కలిగిన మనస్సు, దేహము మొదలగు వానిలో తాదాత్మ్యము చెందుతూ ముందుకు వెళ్ళుచుండును. ఇప్పుడు హృదయమందు మనస్సును లగ్నము చేయవలెను; అంటే, దేహము మొదలగు వానియందుంచబడినట్టి నేను - అనెడు బుద్ధి వదలవలెను; ఆ విధముగ 'నేనెవరను?' అని నిశ్చల స్థితిలో విచారణ చేసినపుడు, ఆ స్థితిలో ఆత్మ - స్వభావము, అత్యంత సూక్ష్మరీతిగ పరమాత్మ, తేటతెల్ల

మగును; ఆ ఆత్మ - స్వభావమే సర్వమున్నా; మఱియు ఏదియు కాదు; సర్వత్ర అంతర్బాహ్యభేదరహితముగ పరమాత్మగ విశదమగును; 'నేను బ్రహ్మము' అను సత్యమును సూచిస్తూ పైన తెల్పిన విధముగ జ్వాలవలె ప్రకాశించును. దానిపై తన ఆత్మయే అదియని తాదాత్మ్యము చెందకుండ ధ్యానము చేసినచో, మనుజుడు దానిని భిన్నమైన దానినిగ ఊహించును; అజ్ఞానము వీడదు. అందుచేత తాదాత్మ్య - ధ్యానము నిర్దేశించబడినది.

'నేనే అతడు' అను భావనతో తైలధారవలె నిరతము సుదీర్ఘకాలము ధ్యానము చేసినచో - అదే ఆత్మపై ధ్యానము చేయు సాంకేతిక పద్ధతి - హృదయమందున్న అజ్ఞానమనెడి అంధకారము, మరియు అజ్ఞానముయొక్క పర్యవసానములగు సమస్త అవరోధములు తొలగును: అత్యుత్తమ జ్ఞానము లభించును. (* 7).

ఆ విధముగ, బ్రహ్మనగరమగు దేహము యొక్క హృదయ కుహరమందున్న పరమసత్యము (reality) ను

గమనిక (*7) : బాహ్య విషయములపై పుపోవు భావన (thought) నరికట్టు "నేను - శివుడను" (శివోహం భావన) విధముగ నిరంతరము ధ్యానముచేసినచో సమాధి సిద్ధించును.

—వళ్లలార్

సాక్షాత్కారము చేసికొనుటయే పరిపూర్ణుడగు భగవంతుని సాక్షాత్కారము చేసికొనుట.

దేహమను నవద్వారపురియందు పరమ పురుషుడు (భగవంతుడు) అత్యంతానందముగవసించుచున్నాడు *(8).

దేహము ఒక దేవాలయము; జీవుడు (శివుడు) భగవంతుడు. 'నేనే అతడు' అనుభావనతో ఆ పరమపురుషుని పూజించినచో, మానవుడు ముక్తిని పొందును.

పంచకోశములతోనున్న ఈ దేహము ఒక గుహ. దానియందు నివసించు పరమపురుషుడు ఆ గుహయొక్క ప్రభువు అని పవిత్రగ్రంథములు చాటుచున్నవి.

దేవతలందరియొక్క యదార్థత్వము (reality of all gods) ఆత్మ. కనుక, తానేయగు ఆత్మపై ధ్యానముచేయుట సర్వ ధ్యానములకంటె ఉత్కృష్టమైనది. తదితర ధ్యానము లన్నియు దీనియందిమిడియున్నవి. కాన, దీనిని పొందినచో ఇతరములు అనవసరము. తన ఆత్మను తాను తెలిసికొనుటయే భగవంతుని తెలిసికొనుట. ధ్యానముచేయు తన ఆత్మను తెలిసికొనకుండ భిన్నమగు మరొక దేవత ఉన్నదని ఊహించి దానిపై ధ్యానము చేయుటను తనపాదముతో తనఛాయను కొలచుటవంటిదనియు, అంతకుముందే తనవద్దనున్న అమూల్య

గమనిక (*8) : తొమ్మిది అసత్య ద్వారములుగల నగరములో అతడు పరమానందరూపమున నివసించు చున్నాడు.

—భగవద్గీత

రత్నమును (* 9) పారవేసి అల్పమగు గవ్వ నన్వేషించుట వంటిదనియు పెద్దలు ఉపమానముతో చెప్పుచున్నారు.

30

శిష్యుడు : హృదయము, బ్రహ్మరంధ్రములు మాత్రమే ధ్యానమునకు యోగ్యమైన స్థానములైనప్పటికి, అవసరమగుచో, షట్చక్రములపై (ఆధారచక్రములపై) ధ్యానము చేయవచ్చునా ?

గురువు : ధ్యానస్థానములని చెప్పబడు షట్చక్రములు మొదలైనవి ఊహావలననే ఉద్భవించినట్టివి (products of imagination). ఇవన్నియు యోగాభ్యాసకులకు ఉద్దేశించబడినవి. శివయోగులు షట్చక్రములపై ధ్యానమును గురించి ఇట్లు చెప్పుచున్నారు; "భగవంతుడు నిర్ద్వంద్వమై, మూలవిరాట్టై, జ్ఞానమగుఆత్మయై సృష్టిస్థితిలయములకు కారణమై మనందరిని ఇముడ్చుకొని యున్నది. 'గణపతి, బ్రహ్మ, విష్ణు, రుద్ర, మహేశ్వర, సదాశివ' మొదలగు తదితర లోపములను

గమనిక (*9) : ఆత్మతత్త్వమగు దానిపై మనము ధ్యానము చేయవలెను; అదే మన ఆత్మరూపము. అది దేదీప్యమానము; సర్వజీవరాశులలో ఎల్లప్పుడు 'నేను-నేను' అని యనుచున్నది. హృదయకుహరమునందు వసించుచున్న భగవంతుని వదలి, వెలుపల భగవంతుని వెదకుట అమూల్యమగు రత్నమును పారవేసి అల్పమగు గాజుపూసను వెదకుట వంటిది.

ఆపాదించుచు ఆ పరమ సత్యమును చెడగొట్టుట ఘోరమగు పాపము; మరియు వేదాంతులు 'అవన్నియు మనస్సుయొక్క ఊహలు మాత్రమే' యని నొక్కి చెప్పుచున్నారు (declare). అందువలన, సర్వజ్ఞాన స్వభావమగు తన ఆత్మను తాను తెలిసికొనినచో అతనికి సర్వము తెలియును. పెద్దలు ఇంకను ఇట్లు చెప్పిరి: "పరమ పురుషుడొక్కడు తనలో తానై ఉన్నాడని తెలిసినచో తెలియబడనిదంతయు తెలియును." వివిధ ఆలోచనలు కలిగిన మనము ఆత్మయగు భగవంతునిపై ధ్యానము చేసినచో, ఆ ఒక్క భావనతో భావపరంపరలు విడనాడుదుము; అటుపిమ్మట ఆ ఒక్క ఆలోచన కూడ అదృశ్యమగును. తన ఆత్మను తాను తెలిసికొనినచో భగవంతుని తెలిసికొనినట్లే యని చెప్పుట యందలి అర్థము ఇది. ఈ జ్ఞానమే బంధవిముక్తి.

31

శిష్యుడు : ఆత్మను గురించి భావించుటెట్లు ?

గురువు : చీకటి వెలుగులు లేకుండ స్వయంప్రకాశము గలది ఆత్మ; మరియు అది తనకు తాను ప్రత్యక్షమగునట్టి (self-manifest) పరమ సత్యము. అందుచే దానిని 'ఇదియని' లేక 'అదియని' అనుకొనరాదు. భావన యనెడి ఆలోచనయే బంధమునకు (బానిసత్వమునకు - bondage) దారితీయును ఆత్మను గూర్చి ధ్యానము చేయుటయొక్క అగత్యమేమనగ

మనస్సు ఆత్మరూపమును పొందుటయే. హృదయకుహర మధ్యమున పరిశుద్ధమగు బ్రహ్మము 'నేను-నేను' రూపమున నుండు ఆత్మగ ఎట్టఎదుట గోచరించును (directly manifest). దానిని పూర్వోక్తవిధముగ నుండునట్టిదిగ తెలిసికొనకుండ నానావిధములుగ భావించుట అధికతర అజ్ఞానమౌతుంది.

32

శిష్యుడు : హృదయమందు బ్రహ్మము 'నేను-నేను' రూపమున ఆత్మగ భాసించుచున్నదని తెలుపబడినది. ఈ ప్రవచనమును అర్థము చేసికొనుటకు వీలుగ దానిని ఇంకను విశదీకరించవీలగునా ?

గురువు : గాఢనిద్ర, మూర్ఛ మొదలగు సమయములలో ఏవ్విధమైన జ్ఞానము—అంటే, ఆత్మజ్ఞానముగాని, ఇతర జ్ఞానముగాని—లేకుండుట అందరికి అనభవైక వేద్యము కాదా? తర్వాత, 'నేను నిద్రనుండి మేల్కొంటిని, లేక, నేను మూర్ఛనుండి తేరుకున్నాను', వంటి అనుభవము కలిగినపుడు, అది పూర్వము పేర్కొనబడిన భేదరహితస్థితినుండి ఉద్భవించిన ఒకవిధమగు సుస్పష్టజ్ఞానము కాదా? ఈస్పష్టమగుజ్ఞానము విజ్ఞానమనబడుతుంది. ఈవిజ్ఞానము ఆత్మకుసంబంధించినదిగాను, లేదా, అనాత్మకు సంబంధించినదిగాను మాత్రమే గోచరించును; అంతే గాని తనంతటతాను కాదు. అది ఆత్మకు సంబంధించినదైనచో

యదార్థజ్ఞానమని పేర్కొనబడుతుంది. అట్టి మానసికస్థితి యొక్క పోకడ (mode) యందు ఆత్మయే లక్ష్యవస్తువగుచున్నది; లేక, జ్ఞాన (స్వరూపము) ముతో నిండియున్న నిర్ద్వంద్వ ఆత్మయై యున్నది; అట్టి స్థితియందు, అనాత్మ (not-self) కు సంబంధించినదైనచో అది అజ్ఞానమని పిలువబడుతుంది. ఆత్మకు సంబంధించియుండి, ఆత్మరూపములో దర్శనమిచ్చినచో (manifest), అది 'నేను' స్వరూపమగుచున్నది. సత్యము (అంటే, ఆత్మ) నుండి భిన్నముగ ఈ ప్రత్యక్షమగుట (manifestation) సంభవించదు. ఈ అవతరణయే సత్యము యొక్క ప్రత్యక్షానుభూతికి చిహ్నముగ ఉపకరించుచున్నది. అయితే, తనంతటతాను సత్యస్థితి కాజాలదు. ఈ అవతరణ దేనిని ఆధారము చేసికొని సంభవించుచున్నదో అది ఆధారభూతమగు సత్యము; ఈ ప్రాథమిక సత్యము (basic reality) నే ప్రజ్ఞానమనియు అందురు. "ప్రజ్ఞానంబ్రహ్మ" అను వేదవాక్యము ఆ సత్యమునే బోధించుచున్నది. దీనిని పవిత్రగ్రంథముఖ్యోద్దేశ్యమని కూడ తెలిసికొనుము. ప్రకాశమానమగునట్టియు, సర్వసాక్షియునగు ఆత్మ విజ్ఞానకోశమునందున్నట్లు స్వయముగ ప్రత్యక్షమగును (manifests itself). నిర్ద్వంద్వబుద్ధితో ఈ ఆత్మను నీ ఏకైక లక్ష్యముగ పట్టుకొని దానిని ఆత్మగ ఆనందింపుము.

33

శిష్యుడు : మానసికపూజ (inner worship), లేక, నిరాకార పూజ (నిర్గుణోపాసన) (worship of the attribute-less) అననేమి ?

గురువు : ఋభుగీతవంటి గ్రంథములలో నిరాకారుని ఆరాధించుటను గురించి సుదీర్ఘముగ వివరింపబడినది (ఒక ప్రత్యేకవిధానముగ). త్యాగము, దానము, పవిత్రత, వ్రతము, జపము, యోగమువంటి ఆచరణాలు "నేను బ్రహ్మము" నను విధానమున ధ్యానముచేయు పద్ధతులు. అందువలన, ఈ ఆచరణ విధానములన్నింటిలో తాను "నేనే బ్రహ్మము"నను భావననుండి చలించకుండునట్లు చూడవలెను. ఇది నిర్గుణోపాసన యొక్క సారాంశము.

34

శిష్యుడు : జ్ఞానముయొక్క అష్టాంగము లేవి ?

గురువు : ఇంతకు పూర్వము పేర్కొనబడిన "యమము, నియమము, మొదలగు ఎనిమిదియు" అష్టాంగములే. అవి వివిధముగ నిర్వచింపబడినవి.

1. యమము : దేహము మొదలగు వానితో యున్న ఈ ప్రపంచమందలి లోపములను గుర్తించి, జ్ఞానేంద్రియ సముదాయమును క్రమశిక్షణలో నుంచుట.

2. నియమము : ఆత్మకు సంబంధించిన మానసిక స్థితుల ప్రవాహమును నిర్వహించుట; మరియు, తద్భిన్న విధానములను తిరస్కరించుట. మరొక విధముగ చెప్పవలె నంటే, పరమాత్మయందు నిరంతరము ఉద్భవించు ప్రేమ.

3. ఆసనము : బ్రహ్మమునుగురించి అచంచల ధ్యానమాచరించుటకు ఈ ఆసనముపకరించును.

4. ప్రాణాయామము : ప్రపంచము, దేహము, మొదలగువానితోనున్న రెండు అసత్య నామరూపముల వస్తుచయముతో కూడిన ప్రపంచము, దేహము మొదలగు వానిని తొలగించుట రేచకము (నిశ్శ్వాస – exhalation); మూడు సద్గుణములగు స్థితి, జ్ఞానము, ఆనందము, (సత్, చిత్, ఆనందము – ఆ వస్తుచయమునందు సత్వసాధారణముగ ఉన్నవానిని గ్రహించుట పూరకము (inhalation). ఆ విధముగ గ్రహించిన సద్గుణములను నిలుపుకొనుట కుంభకము.

5. ప్రత్యాహారము : మనస్సునుండి తొలగించిన నామరూపముల రెంటిని మరల మనస్సునందు జొరనీయకుండ నిరోధించుట.

6. ధారణ : మనస్సును ఇతరత్ర చలించనీయకుండ, హృదయమందు నిలిపి, తానే సచ్చిదానందమూర్తియగు పరమాత్మనని గ్రహించుటయే.

7. ధ్యానము : 'నేను స్వచ్ఛమగు జ్ఞానమును' అని ధ్యానముచేయు విధానమిది. పంచకోశసహితమగు ఈ దేహమును ప్రక్కకువదలి, 'నేనెవరనను' ఆత్మవిచారణ సలిపి, తత్ఫలితముగ పరమాత్మగ భాసించు 'నేను' గ ఉండి పోవుటయే.

8. సమాధి : 'నేను' అను రూపముతో ప్రత్యక్షమైనదికూడ అంతమైన పిదప, సూక్ష్మమగు ప్రత్యక్షానుభవము కలదు. ఇదియే సమాధి.

ఇక్కడకూడ వివరింపబడిన ప్రాణాయామము మొదలగు వానికొరకు, 'యోగ' సందర్భముగ పేర్కొనబడిన 'ఆసనము' మొదలగు కార్యాచరణలు (disciplines) అవసరములేదు. అన్ని ప్రదేశములలోను, సర్వకాలములయందును జ్ఞానాంగములు అభ్యాసము చేయవచ్చును. పరిస్థితుల కనుగుణముగ 'యోగజ్ఞానము'లలో ఒకటిగాని రెండుగాని అనుసరించవచ్చును. చెడుఅంతటికి మూలము మరపు యనియు, మృత్యువు బంధవిముక్తి అనియు ఉత్తమ గురువులు చెప్పుచున్నారు(* 10). అందువలన, మనస్సును ఆత్మయందు లగ్నముచేయవలెను; పరమాత్మను ఏ ఒక్కక్షణమందైనను

గమనిక (* 10): ఈ భూమిపై పరమాత్మనుగూర్చి ధ్యానము చాలించుట అంటే మృత్యువు, లేక, కాలుడు అగును. కనుక, ధ్యానము నెన్నడును, అత్యంత స్వల్పముగనైనను విడువరాదు.

మరువరాదు; ఇది లక్ష్యము. మనస్సును అదుపులో పెట్టినచో, తక్కినవన్నియు అదుపులో నుంచవచ్చును. అష్టాంగయోగమునకు, అష్టాంగ జ్ఞానమునకు భేదము శాస్త్రగ్రంథములందు సవివరముగ పేర్కొనబడినది; అందుచే ఈ బోధయొక్క సారాంశము మాత్రము ఇచ్చట పేర్కొనబడినది.

35

శిష్యుడు : యోగమునకు సంబంధించిన ప్రాణాయామమును, జ్ఞానమునకు సంబంధించిన ప్రాణాయామమును ఒకేకాలమందు అభ్యాసము చేయుట సాధ్యమా ?

గురువు : కేవలకుంభకము ద్వారాగాని, లేక, విచారణద్వారాగాని హృదయమందు మనస్సును లగ్నము చేయనంత వరకు రేచకము, పూరకము మొదలగునవి అవసరము. అందుచే, యోగమునకు సంబంధించిన ప్రాణాయామమును శిక్షణ సమయమున అభ్యసించవలెను. రెండవ ప్రాణాయామమును ఎల్లప్పుడు అభ్యాసము చేయవచ్చును. ఆ విధముగ రెంటిని అభ్యసించవచ్చును. కేవల కుంభకము నందు ప్రావీణ్యతలభించునంతవరకు 'యోగప్రాణాయామము' అభ్యాసము చేసిన చాలును.

36

శిష్యుడు : ముక్తికి మార్గమును వేరేవిధముగ ఎందుకు బోధింపవలెను ? అభిలాషపరుల (aspirants) మనస్సులో అది చికాకు కల్గించదా ?

గురువు : అర్హతకల్గిన వివిధస్థాయిల అభిలాషపరుల కనుగుణముగ అనేక మార్గములు వేదములలో బోధింపబడినవి. కాని మనోనాశమువలన బంధవిముక్తియగును. కాని, సర్వకృషులు మనోనిగ్రహము (control of mind) ను లక్ష్యముగా గైకొనుచున్నవి. ధ్యానవిధానములు ఒకదానికొకటి భిన్నముగ ద్యోతకమగుచున్నప్పటికి, చివరకు అన్నియు ఒకటే అగును. దానిని శంకించ నవసరములేదు. తన మనస్సు యొక్క పరిపక్వస్థితి కనుగుణముగ ఏమార్గము అనుకూలమో దానిని అనుసరించవచ్చును.

ప్రాణమును అదుపు (నియంత్రణ) చేయునట్టిది యోగము; మరియు మనస్సును అదుపుచేయునది 'జ్ఞానము' (*11). ఇవి రెండును మనోనాశమునకు ముఖ్యసాధనములు. కొందరికి మొదటిది తేలికగ అగుపడవచ్చును. మరికొందరికి రెండవది కావచ్చును. అయితే పచ్చిగడ్డిచూపి బుసకొట్టు ఆబోతును అదుపులో పెట్టుటవంటిది 'జ్ఞానము'; బలప్రయోగముతో అదుపులో పెట్టుట వంటిది 'యోగము'. ఈవిధముగ పండితులు చెప్పుచున్నారు. అర్హతకల్గిన మూడు రకముల వాంఛితులలో వేదాంత విచారణతో నిత్యసత్యమగు దాని

గమనిక (* 11) : పవిత్ర గ్రంథము ప్రకారము అంతయూ సత్యమని గమనించుచూ, 'నేనే - బ్రహ్మము'ను, రెండవదేదియుకాక ఒకటి మాత్రమే.

స్వభావమును నిర్ణయించుచు తన ఆత్మను, సర్వవస్తువులను నిత్యసత్యము యొక్క స్వభావమునకు చెందినవని గ్రహించుచు మనస్సును పరమాత్మయందు దృఢముగ లగ్నముచేసి అత్యుత్తమస్థాయికిచెందినవారు గమ్యస్థానమును చేరుచున్నారు; కేవల కుంభకముద్వారా మనస్సును హృదయమందు నిలిపి నిత్యసత్యమగు దానిపై సుదీర్ఘకాలము ధ్యానము చేయుచూ మధ్యస్థులు లక్ష్యసిద్ధి పొందుదురు. సామాన్యులు (అధమస్థితివారు) ఉచ్ఛ్వాస నిశ్వాసలను క్రమబద్ధముచేయుట (breath control) మొదలగు వానిద్వారా తమలక్ష్యసిద్ధి పొందుదురు. అజ్ఞానరూపమున హృదయములో "నేను" భావనను నాశనము చేయువరకు మనస్సును హృదయమందుండునట్లు చేయవలెను. ఇదియే జ్ఞానము. ఇది మాత్రమే ధ్యానముకూడా; తక్కినవన్నియు మాటలతో ప్రక్కదారి పట్టించునవి మాత్రమేనని శాస్త్రగ్రంథములు చెప్పుచున్నవి.కనుక పరమాత్మయందు మనస్సును లగ్నముచేయుటకు ఏదోనొక విధానమున నేర్పరితనమును సంపాదించినచో, ఇతర విషయముల గురించి చింతించవలసిన అవసరములేదు (* 12). యోగులకంటె భక్తుడు మిన్నయని,

గమనిక (* 12) : యోగులయందరిలో ఎవడు తన అచంచలమగుమనస్సును ప్రేమను నాయందు నిలుపుదురో, అతడు నాకు మిక్కిలి ప్రియమైనవాడు — భగవద్గీత.

ముక్తికి మార్గము భక్తియని, భక్తి తన ఆత్మ (*13)ను గూర్చి చింతనచేయుట యని ప్రముఖగురువులుకూడ బోధించి యున్నారు.

ఆ విధముగ, అది బ్రహ్మసాక్షాత్కార మార్గము. దానిని 'దహరవిద్యయని, బ్రహ్మవిద్యయని, ఆత్మవిద్యయని' అనేక పేర్లతో పిలుతురు. ఇంతకంటె మించి ఏమిచెప్పాలి? తక్కినదంతయు ప్రతివ్యక్తియు గ్రహించవలెను (infer). పవిత్ర గ్రంథములు వివిధరీతులలో బోధించుచున్నవి. ఆ విధానము లన్నింటిని పరిశీలించిన పిదప దీనిని అత్యంత సన్నిహిత త్రోవ యని, అత్యంతోత్కృష్టమైనదని మహనీయులనుచున్నారు (the great ones).

37

శిష్యుడు : పై నియమములను పాటించుచూ, మనస్సునందున్న అవరోధములను తొలగించు కొనవచ్చును — ఉదాహరణకు: అజ్ఞానము, సందేహము (శంక), దోషము (తప్పు)మొదలగునవి;మరియు తత్ఫలితముగమనోనిశ్చలత పొందవచ్చును - అయినప్పటికి, చిట్టచివరి అనుమానము ఒకటియున్నది. మనస్సును హృదయమందు లగ్నము

గమనిక * (13) : ముక్తిమార్గములన్నింటిలో భక్తి మాత్రమే అత్యంత శ్రేష్ఠమైనదని చెప్పదగును. ఏలనన, తన ఆత్మను గూర్చిన సంతత చింతనయే భక్తి. — వివేక చూడామణి.

చేసిన పిదప, ఆద్యంతరహిత సత్యముగ ప్రకాశించుచూ, జ్ఞానము మాత్రమే ఉన్నది. ఆ విధముగ మనస్సు ఆత్మ స్వరూపమును పొందిన పిదప, విచారణచేయునది ఎవరు? అట్టి విచారణ తనను తాను పూజించుటయగును. అది, గొఱ్ఱెపిల్లను చంకలో పెట్టుకొని దానికొఱకు అంతట వెదకి నట్లగును!

గురువు : జీవుడే శివుడు; శివుడే జీవుడు. జీవుడే శివుడు తప్ప తద్భిన్నము కాదనుట యదార్థము. పొట్టుతో విత్తనమున్నప్పుడు దానిని గింజయందురు. పొట్టుతొలగించిన తర్వాత, అది బియ్యపుగింజ యగును. అదేవిధముగ, కర్మ బద్ధుడై ఉన్నంతకాలము మానవుడు జీవుడుగ నుండును. అజ్ఞానబంధము తెగినపుడు అతడు పరమాత్మయగు శివుడుగా భాసించును. ఆ విధముగ, శాస్త్రగ్రంథము పేర్కొను చున్నది. తదను సారముగ, మనస్సుగాఉన్న జీవుడు నిజముగ పరిశుద్ధాత్మ; కాని, ఈ సత్యమును మరచి, అది తనకు తాను వ్యక్తి ఆత్మనని ఊహించును; మరియు మనోరూప మున బంధింపబడుచున్నది. అందువలన, ఆత్మకొరకు వెత కుట తనకుతానే చేయుచూ, గొఱ్ఱెలకాపరి చంకలో గొఱ్ఱెపిల్లను పెట్టుకొని ఊరంత వెతకినట్లగుచున్నది. అయితే, తన ఆత్మను తాను మఱచిన జీవుడు తలచినంత మాత్రమున ఆత్మకాజాలడు. పూర్వజన్మలలో సముపార్జించిన ప్రారబ్ధము

(శేషవాసనల - residual impressions) వలన అవరోధము కలిగి, పరమాత్మతో తన తాదాత్మ్యతను మాటిమాటికి మరచిపోయి, దేహము మొదలగు వాటితో తాదాత్మ్యమును పొందుచు మోసపోవుచున్నాడు. ఒకడొక ఉన్నతోద్యోగిని గాంచినంత మాత్రముచేత తాను ఆ ఉన్నతోద్యోగి కాగలడా ? ఆదిశలో నిరంతర కృషిచేసి కదా ఉన్నతోద్యోగి కాగలడు ! అట్లే జీవుడు, దేహము మొదలగు వాటితో మానసిక తాదాత్మ్యత చెంది, బంధీకృతుడైయున్న జీవుడు ఆత్మపై మనస్సును లగ్నముచేసి క్రమక్రమముగ దృఢమైన రీతిలో ప్రయత్నించవలెను; ఆ విధముగ మనోనాశము జరిగిన పిదప జీవుడు ఆత్మయగుచున్నాడు (* 14).

ఆ విధముగ నిరంతర అభ్యాసముతో ఆత్మపై చేసిన మననము (reflection) మనోనాశముచేయును; తదుపరి, శవమును దహించుటకు కట్టెలను మండించిన అగ్గిపుల్లవలె తనకుతాను నాశనమగును. ఈస్థితినే బంధవిముక్తి యందురు.

38

శిష్యుడు : జీవుడే స్వభావతః ఆత్మయైనచో, తన సహజ స్వభావమును (true nature) ను పొందుటకు జీవునికి అవరోధము కలుగ చేయునదేది ?

గమనిక (* 14): జన్మబంధమునకు కారణమగు అవరోధములు అనేకములైనప్పటికి, అట్టి మార్పులన్నిటికి మూలకారణము అహంకారము. ఈ మూలకారణము శాశ్వతముగ నాశనముచేయబడవలెను—వివేకచూడామణి.

గురువు : జీవుడు తన సహజ స్వభావమును మరచిపోవుట; ఇదియే మాయా ప్రభావమనబడుచున్నది (power of veiling).

39

శిష్యుడు : జీవుడు తనను తాను మరచిపోవుటే నిజమైనచో, 'నేను' అనుభవము ఏవిధముగ అందరికి కలుగుతుంది ?

గురువు: మాయ జీవుని పూర్తిగ కప్పియుంచదు (*15); 'నేను' యొక్క ఆత్మస్వభావమును మాత్రమే అది కప్పిపుచ్చును; మరియు, 'నేను — దేహము' భావనను వ్యక్తముచేయును (projects); కాని 'నేను' అను ఆత్మ ఉనికిని మరుగుపరచలేదు; ఎందువలననగ ఆత్మ సత్యము, నిత్యము (real and eternal).

40

శిష్యుడు : జీవన్ముక్తుని (* 16) లక్షణము లేవి ? విదేహ ముక్తుని (* 17) లక్షణము లేవి ?

గమనిక (* 15) : 'నేను' అను ఆధారమును అజ్ఞానము మరుగుపరచలేదు: కాని జీవుడే పరమాత్మయనెడి సుస్పష్ట సత్యమును దాచగలదు.

గమనిక (* 16) : జీవించియుండియే బంధరహితుడైనవాడు జీవన్ముక్తుడు.

గమనిక (* 17) : చనిపోయి బంధరహితుడైనవాడు విదేహ ముక్తుడు.

గురువు : 'నేను' దేహమును కాదు; ఆత్మగ ప్రత్యక్షమగు బ్రహ్మను 'నేను'. అత్యంత సనాతన నిత్యసత్యమగు నాయందు దేహాదివస్తుచయముతో కూడిన ప్రపంచము ఆకాశముయొక్క నీలిరంగువలె ఉత్తభ్రమ (mere appearance) అని యదార్థమును ఎవడు గ్రహించునో అతడు జీవన్ముక్తుడు. అయినప్పటికీ, మనస్సు కృతనిశ్చయముతో నుండనంత కాలము ప్రారబ్ధము (కర్మపరిపక్వము చెందుట ప్రారంభమై ఈ శరీరమేర్పడినది) వలన వస్తువులతో సంబంధముండి మానవునికి కొంత దుఃఖముద్భవించవచ్చును. మనస్సు యొక్క చలనము ఆగనంతవరకు, బ్రహ్మానందానుభూతి (experience of bliss) ఉండదు. సుదీర్ఘ కాలధ్యానఫలితముగ అత్యంత సూక్ష్మమై అచంచలమైనట్టి మనస్సునకు మాత్రమే అది(ఆత్మానుభవము) సాధ్యము. ఆ విధముగ ఎవని మనస్సు అత్యంత సూక్ష్మమై (subtle), ఆత్మ సాక్షాత్కారమును పొందినదో అట్టివానిని 'జీవన్ముక్తుడందురు'. 'నిర్గుణబ్రహ్మమని, తురీయమని' జీవన్ముక్తి యొక్క స్థితి చెప్పబడుచున్నది. ఈ అత్యంత సూక్ష్మమనస్సు స్థిరత్వమునుపొంది, ఆత్మానుభవము అంతరించి, బ్రహ్మానంద మహాసాగరములో మునిగియుండి, దానితో తాదాత్మ్యముచెంది భేదరహితమై వేరే ఉనికి లేకుండ ఉన్నప్పుడు, అతడు 'విదేహముక్తుడనబడును'. అట్టి విదేహముక్తి యొక్క స్థితి 'భావాతీత నిర్గుణబ్రహ్మమని (transcendent attributeless Brahman), భావాతీత తురీయ

మని చెప్పబడుచున్నది. ఇది చిట్టచివరి గమ్యము. సుఖదుఃఖముల స్థాయిలవలన, ముక్తులగు జీవన్ముక్తులు, విదేహముక్తులు నాలుగు తరగతులుగ విభజింపబడవచ్చును — బ్రహ్మవిదుడు, శ్రేష్ఠుడు, శ్రేష్ఠతరుడు, అత్యంత శ్రేష్ఠుడు. కాని ఈ భేదములు వారిని గమనించు ఇతరుల దృక్పథానుసారము మాత్రమే కాగా యదార్థముగ, జ్ఞానముతో లభించిన బంధవిముక్తియందు భేదములులేవు.

వందన సమర్పణము

మానవాకృతి దాల్చిన సాక్షాత్పరమ శివుడగు గురువర్యులు శ్రీరమణుల పాదపద్మములు ఎల్లకాలము వర్ధిల్లుగాక (flourish forever) !

ఓం శాంతిః, ఓం శాంతిః, ఓం శాంతిః

భగవాన్ శ్రీ రమణ మహర్షి
(1879 - 1950)

ద్రావిడ దేశమున 'తిరుచ్చుళి' అను గ్రామమున అలఘమ్మ, సుందరరామయ్యర్ అను పుణ్యదంపతులకు రమణుడు క్రీ. శ. 1879 డిసెంబరు, 29న జన్మించినాడు. అతడు పదునేడేండ్ల ప్రాయమందే గృహమువీడి సత్యాన్వేషియై 1896 సెప్టెంబరులో దక్షిణాపథమున సుప్రసిద్ధ శివక్షేత్రమైన అరుణాచలమునుచేరి, అందు సునిశ్చల తపశ్చర్యచేసి, ఆత్మసాక్షాత్కృతి పొందినాడు. అతని బ్రహ్మానుభవతేజముచేత జిజ్ఞాసు ప్రపంచము ఆకర్షింపబడినది. కొందరు పాశ్చాత్యులు సైతము ఆయన నాశ్రయించిరి. 1950లో మహర్షి మహాసమాధి పొందినను, ఆయన అమరబోధలు జనోద్ధరణ శక్తిమంతములై భాసిల్లుచున్నవి.

"దేనిని సకల వృత్తులయొక్క చేరికయని చెప్పుచున్నారో అట్టి ఈ 'నేను' అను వృత్తియొక్క పుట్టినతావును విమర్శింపుము. ఇటుల విచారించుటయే ఆత్మవిచారము. శాస్త్రపరిశీలనము మాత్రమే ఆత్మవిచారము కాదు. వృత్తియొక్క జన్మస్థానమును వెదకి కనుగొనిన అహంకార మడుగును; ఆత్మాభాసమగు అహంకారము ఎప్పుడు ఆత్మయందడుగునో, అప్పుడు సత్యస్వరూపమగు ఆత్మ ఒక్కటే సర్వవ్యాపకమై మిగులును. ఆత్మవిచారఫలము సర్వకష్టములు తన కంటకుండుటయే। ఇంతకన్న అతిశయ ఫలములేదు. ఇతరోపాయములచే సాధ్యములగు సర్వసిద్ధులను బొందియు ఆత్మవిచారము చేతనే మానవుడు తుదిని ముక్తుడగుచున్నాడు" అని శ్రీ రమణ మహర్షుల ఆత్మవిచార సందేశము. — కేశవ తీర్థ

(విజ్ఞాన సర్వస్వము-దర్శనములు - మతములు-ఏడవ సంపుటి)

తెలుంగు భాషా సమితి

ఆధ్యాత్మిక భక్తి తత్వ జ్ఞానప్రచారం ఈ WEB SIGHTS ద్వారా చేస్తున్నాము
OUR VIDEOS,AUDIOS,e-BOOKS WEB SIGHTS ల లోని LINKS ద్వారా FREE గా DOWNLOAD చేసికొనండి
WWW.telugudevotionalswaranjali.blogspot.in
స్వామి విద్యాప్రకాశానంద స్వాములవారి వారి ప్రవచనముల WEB SIGHT LINK: WWW.gitamakarandam.blogspot.in
స్వామి సుందర చైతన్యానందుల వారి ప్రవచనములWEB SIGHT LINK: WWW.sundaravignanagrandalayam.blogspot.in
FOR HINDI BHAJANS, SANSKRIT SLOKAS & ASHTAKAMS & CHANTS WEB SIGHT LINK: WWW.hindudevotionalswaranjali.blogspot.in
OUR YOUTUBE VIDEO CHANNELS :
www.youtube.com/user/ hindudevotional0
www.youtube.com/user/shruthimandiramu
OUR e-BOOKS CHANNEL :
www.scribd.com/ysreddy94hyd
OUR E-mail ID: ysreddy94hyd@gmail.com మీరు కూడా మీ వంతు ఆధ్యాత్మిక భక్తి తత్వ జ్ఞానప్రచారాన్ని మన WEB SIGHTS ను మీ friends కు మరియు బంధువులకు పంపండం ద్వారా చేయండి.



వినీలాకాశంలో వింత కాంతి

అత్యం సూర్యం

శ్రీ రమణ క్షేత్రం
జిన్నూరు, ఆం.ప్ర.

వినీలాకాశంలో వింత కాంతి

రచన :
అత్యం సూర్యం

మొదటి ముద్రణ : 1981
రెండవ ముద్రణ : 1988
మూడవ ముద్రణ : 1993

ప్రచురణ :
శ్రీ రమణ క్షేత్రం
జిన్నూరు - 534 265
ఆంధ్ర ప్రదేశ్

సలహా సంప్రదింపులకు :
శ్రీ సాగిరాజు రామచంద్రరాజు
వడ్లవానిపాలెం - 534 265
పశ్చిమ గోదావరి జిల్లా
ఫోన్ : 2638 (పాలకొల్లు)

ముద్రణ :
రత్న ప్రింటింగ్ వర్క్స్
పాలకొల్లు - 534 261
ఫోన్ : 08814 - 2946

వెల : రు. 20-00

BHAGAVAN'S GRIP

By
ATYAM SURYAM

I First heard the name of **RAMANA MAHARSHI** during the summer of 1942 when I was on a vacation trip with a friend. Much against my wishes, I agreed to accompany my friend to Tiruvannamalai before we proceeded to our original destination.

When we arrived at tne Ashram, we went straight to the old hall, where we found Bhagavan sitting on a sofa and looking through a window. We could see only his profile. Some of his devotees - both men and women - were there seated on the floor. There was pin-drop-silence. For more than ten or fifteen minutes I waited for Bhagavan to turn his face towards us, but he didn't oblige me. I began to grow impatient. I pressed my friend to get up, but he ignored me. As I could endure it no longer, I silently walked out of the hall. A few minutes later my friend joined me and scolded me for my hurry. Grudgingly he walked along with me out of the Ashram. I never gave the meeting another thought until my friend named his new-born son Ramana and I saw what an impression Bhagavan had made on him.

During January, 1950, my wife and I started on a pilgrimage to the South from our home in Andhra Pradesh. My wife was

అంకితం

దివంగతులైన పూజ్యులు
నా తల్లిదండ్రులకీ,
సాధ్వీమణి
నా ధర్మపత్నికీ.

అత్యం సూర్యం

quite orthodox, while I was not sure of my own beliefs, but I was certainly not interested in idol worship or visiting temples. Once again, on her compulsion, I visited Sri Ramanasramam along with her. I somehow sat in front of Bhagavan until the lunch bell rang.

What a relief I felt! After we took our meal, I told my wife it was time to move on to our next halt. Before doing so my wife requested me to donate Rs.116 to the Ashram. She had already crossed the limits of my patience by what she had made me spend in other places of pilgrimage. On this request, I nearly burst upon her and gave only ten rupees at the Ashram office. As we were leaving the Ashram, my wife was walking ahead of me while I carried our bed and baggage. Bhagavan came out from some room with a tumbler of water to wash his hands. He looked at both of us. My wife did not see him since she was already nearing the main gate. But I saw him and his gaze fell on me. It did not occur to me that I should put my luggage down and join my palms taking leave of him.

Years rolled by. On the 3rd of January, 1959 my wife passed away. I was completely upset at this most unexpected sad event. Since I had no children, all my love and affection were centered on her. I could not recover from the shock for months together. Even thereafter I could not become my old self. I retired from active life once for all. The mystery of life and death began to haunt me. Relatives and friends became worried over my constant grief and deteriorating health and some suggested to me philosophical books. My elder brother presented me the Bhagavad Gita. I was not too deeply impressed the first time I read it, but as I read it again and again it began to leave a bit of its imprint upon my heart. Eventually I read hundreds of Philosophical books. Those that appealed to me most were

books by and about Sri Ramana Maharshi.

During the early 60's I visited many places of pilgrimage looking for peace of mind, primarily through contact with Mahatmas. I returned to my home safe and sound. I was not so much weighed down with grief as I had been before. It was TIME that had somewhat healed my wound rather than my study of philosophical books, visits to sacred places, or darshan of holy men.

During 1967 and 1968 I went around the world and stayed in the United States for one year. During that period I had some narrow escapes from instant death, injury, insult and even imprisonment. (Adventure has been my second nature, if I may say so). Each time I escaped I felt Sri Bhagavan's hand of protection, to my utter astonishment, since I never even thought of him, much less prayed to him. I wondered at the phenomenon. I remembered my having had his darshan twice. I also remembered that my wife had requested me to donate Rs.116 to the Ashram. Then and there I decided to send that amount to the Ashram as soon as I Went back home. I did so, soon after my return along with a letter in which I wrote how Bhagavan had protected me during my stay in America and that I was now only fulfilling the wish of my departed wife. I implored them to pray to Bhagavan to grant her eternal peace. In reply I received a letter from the Ashram assuring that my wife was enjoying peace at the holy feet of Bhagavan. I felt happy for a while as I read the letter and then forgot about it. Strangely enough I forgot him even after I pretty well knew that he had saved me many times during my stay abroad.

A little later I returned to my native place and settled down there. At long last the DAY arrived. It was the 11th April, 1974.

I was going in a taxi a distance of 14 miles to see a picture. Something happened in the taxi, and frustration started to creep upon me by leaps and bounds. When I felt I was on the verge of an emotional breakdown I reached my destination. The picture was "Kahani Kismet ki"; only that much I remember. What I saw on the screen was nothing but the reflection of my own sad state of mind. The picture came to an end, but not my frustration. I could no longer bear the agony. I even thought of committing sucide. It was then I remembered Bhagavan and prayed to him to grant me relief.

I returned to my home, I was repeating Bhagavan's name constantly within myself, but I wished I had a photograph of him to help me in my prayers. I remembered having seen one in a journal I had read recently, I started searching for it. Lo! the very last book had the coloured picture of Bhagavan. It was purely Bhagavan's Grace - I had no doubt about it. My heart instantly became full of joy, devotion and gratitude. Since that moment I haven't left Bhagavan rather I should say he hasn't left me. In the same year I visited the Ashram twice and started to celebrate Bhagavan's jayanti. I have been trying my best to completely surrender myself to his will. My experiences are many. He is full of compassion. I am now almost at peace with myself. I have no doubt he would take me to his holy feet when I leave this prison of a body. He is now my father, mother, friend, everything to me. His gracious look at me while I was leaving the Ashram in 1950 with my wife started working wonders after a quarter of a century. This is nothing but BHAGAVAN'S GRIP.

(Reproduced from the April 1979 issue of THE MOUNTAIN PATH- a Quarterly - Published by Sri Ramanasramam, Tiruvannamalai).

వెంకటరామన్

లక్ష్మిఅమ్మాళ్‌ని అంతా ఎచ్చెమ్మాళ్ అని పిలుస్తుంటారు. ఈమె భర్త ఒక ఉద్యోగస్తుడు. వీరికొక కుమారుడు, యిద్దరు కుమార్తెలూ.

ఉద్యోగరీత్యా వీరు నెల్లూరు జిల్లా కరేడు గ్రామంలో వుండగా ఒకనాటిరాత్రి ఎచ్చెమ్మాళ్‌కొక కలవచ్చింది. ఆ కలలో తెల్లటి గోచి పెట్టుకున్న ఒక బాలసన్యాసి కనపడి ఆమె చేతిలో ఏదో పెట్టి అదృశ్యుడయ్యాడు.

తెల్లారింతరువాత తన స్వప్నవృత్తాంతం భర్తకి, మరి కొందరికి చెప్పింది. కాస్త శకునఫలం చెప్పగలగినవాళ్ళు "మీ యిలవేల్పు సుబ్రహ్మణ్యస్వామి నీకు దర్శనమిచ్చారమ్మా"అన్నారు.

కొన్నాళ్ళు గడిచింది. భర్తకి కందుకూరు బదిలీ అయింది. సంసారమంతా అక్కడకు తరలివెళ్ళింది.

ఒకనాటి కలలో మళ్ళీ అదే బాలసన్యాసి ప్రత్యక్షమయ్యాడు ఎచ్చెమ్మాళ్‌కి. అంతేకాదు, సంస్కృతంలో రాసిన ఒక ఉత్తరాన్నిచ్చి చదవమన్నాడు. ఆమె తనకు సంస్కృతం రాదంది. అయితే పరదేశి శాస్త్రులను అడగమన్నాడు. ఆమె అలాగే అడిగింది. ఇది సుబ్రహ్మణ్యస్వామి ప్రసాదమంటూ ఆమెకు సుబ్రహ్మణ్య మంత్రోపదేశం చేశాడు ఆ శాస్త్రులు.

కల కరిగిపోయింది.

ఈ కలల ప్రభావమో, ఆమె జన్మజన్మాంతర దుష్కర్మల ఫలితమో, మరేమో గాని ఆమె కుమారుడు, ఆమె భర్త, ఆమె కుమార్తె కూడబలుక్కున్నట్టు ఒకళ్ళ తరువాత ఒకళ్ళు చెల్లిపోయారు.

ఎచ్చెమ్మాళ్ దుఃఖసముద్రంలో మునిగిపోయింది. ఒడ్డూదరీగానక కొట్టుకుంటోంది. నిలువునా దహించుకుపోతోంది. ఇకనామెకు ఆ కందుకూరులో ఏమి పనుంది? "నా" అనే వారెవరున్నారనీ? మిగిలిన తన

ఒక్కకూతురునీ తీసుకుని స్వగ్రామం మండకొలుత్తూరు చేరుకొంది.

ఎచ్చెమ్మాళ్ బిడ్డకి పదేళ్ళొచ్చాయి. "అష్టవర్షాత్‌భవేత్‌కన్యా" అని కదా అన్నారు! కూతురు పెళ్ళినిక జాప్యంచేస్తే లాభంలేదనుకుంది. ఒక సంబంధం కుదిర్చింది. పెళ్ళికొన్నాళ్ళుందనగా కూతురుకి జ్వరం వచ్చింది.

ఒకనాటి రాత్రి ఎచ్చెమ్మాళ్‌కి మళ్ళీకల. ఆ కలలో మళ్ళీ అదే బాలసన్యాసి కనపడి "విశ్వనాధుడు రమ్మంటున్నాడు నిన్ను. కొండకిరా" అని మాయమైపోయాడు.

తెల్లారింది. తనకొచ్చిన కలను గుర్తుచేసుకునేసరికి ఎచ్చెమ్మాళ్‌కి ముచ్చెమటలు పోశాయి. గడగడ వణికిపోయింది. తన భయాందోళనలకి తగ్గట్టే కూతురు - కాబోయే పెళ్ళికూతురు - జ్వర తీవ్రత ఎక్కువై శాశ్వతంగా కన్నుమూసింది.

అయ్యో ఎచ్చెమ్మాళ్! కట్టుకున్న భర్తా, కని పెంచిన బిడ్డలూ కరువైపోయారా! నీకింత ద్రోహం చేశారా! ఆమె గుండె మంటలని ఎవరార్పగలరు! మతిచెడింది."ఓర్చుకో తల్లీ" అన్న వాళ్ళ మీద మండిపడింది. "ఇంతమందినీ మింగేసి నన్నేకాకిని చేసిన ఓ దేవుడా! నన్ను కూడా మింగేయి" అంటూ కుళ్ళి కుళ్ళి ఏడ్చింది. ఆమె రోదనకి రాళ్ళు కూడా కరిగాయి. కాని, ఎవరేమి చెయ్యగలరూ! చేత్తో తీసెయ్యగల బాధా ఆమెది?

ఆనాటికామె తండ్రి జీవించేవున్నాడు. కూతురి కష్టపరంపరకి లోలోన కుమిలిపోతూనే "కాస్త ఏవేనా తీర్థయాత్రలు చేసిరా అమ్మా, ఏ మహాత్ముడి దర్శనంచేతనయినా నీ బాధ తీరొచ్చు" అన్నాడు.

తండ్రి చెప్పినట్టుగానే బయలు దేరింది ఎచ్చెమ్మాళ్ ఉత్తరదేశ యాత్రలకి. జొత్తురాహండనే గురువు దగ్గర అష్టాంగయోగం అభ్యసించింది. గోకర్ణక్షేత్రంలో కొన్నాళ్ళుంది. ఎక్కడున్నా, ఎక్కడికి వెళ్ళినా, ఎంతమంది దేవుళ్ళని సేవించినా, ఏమేమి అభ్యసించినా, ఆమె బాధ తీరలేదు. గుండెల్లో చితి రావణాకాష్ఠంలా మండుతూనే వుంది. తిరిగి తిరిగి స్వగృహం చేరుకొంది.

ఒక రోజున ఆమె బంధువు ఒకరు వచ్చారు. ఎచ్చెమ్మాళ్‌ని ఓదారుస్తూ "అరుణాచలంలో కొండ మీద ఒక బ్రాహ్మణస్వామి వున్నారు. వారి దర్శనం చేసుకో. నీ మనస్సు కుదుటపడుతుంది. అరుణాచలం యిక్కడికి దగ్గరేగా" అన్నారాయన.

ఎచ్చెమ్మాళ్‌కి ఎందుకోగాని ఎవరో ఒక సాధు దర్శనం వల్లనే తనకూరట కలుగుతుందనే ఆశ మొట్టమొదటి నుంచీ వుంది. ఒకరోజున తన బంధువు చెప్పినట్టే బయలుదేరింది అరుణాచలానికి.

అరుణాచలంలో ఆమెకు చుట్టాలున్నారు. అయినా ఆమె వారెవరింట్లోను దిగలేదు. తిన్నగా ఒక స్నేహితురాలింటికి వెళ్ళింది రైలు దిగగానే. ఎచ్చెమ్మాళ్ రాక కామె చాలా సంతోషించింది. ఆమె కొచ్చిన కష్టాలకు సానుభూతి చూపింది. ఎచ్చెమ్మాళ్ వచ్చిన పని తెలుసుకొని "ఎచ్చెమ్మా, ఆ బ్రాహ్మణస్వామి మౌని. ఎవరితోనూ మాట్లాడరు. అయినా, వారి దర్శనం నీకు ఉపశమనం కలిగిస్తుందని నా నమ్మకం. వారి తేజస్సు అమోఘం" అంది.

ఎచ్చెమ్మాళ్, ఆమె స్నేహితురాలూ అరుణాచలం కొండమీద విరూపాక్షిగుహలో వుంటూన్న బ్రహ్మణస్వామిని చూడ్డానికి వెళ్ళారు.

ఆ స్వామిని చూసీ చూడ్డంతోటే నిశ్చేష్టురాలయిపోయింది ఎచ్చెమ్మాళ్. నోరెండిపోయింది. ఆమెకు మూడు కలల్లోనూ మూడుమాట్లు దర్శనమిచ్చిన బాలసన్యాసి ఆయనే. అదే ముఖారవిందం, అదే వర్చస్సు, అదే గాంభీర్యం, అదే తెల్లటి గోచీ. ఆ బ్రాహ్మణస్వామిని చూస్తూ అలాగే నుంచుండిపోయింది. ఎంతసేపటికీ కదలదు. తనూ పలకదు. ఆ స్వామి పలకరు.

స్నేహితురాలు కుదపగా తేరుకుంది ఎచ్చెమ్మాళ్. తేరుకొని "నేటితో నా గుండె బరువు తీరిపోయింది. నా మంటలు చల్లారాయి. నా కన్నీటి ధార కట్టుడిపోయింది." అన్నది తన స్నేహితురాలితో. ఆనాడే ఆ క్షణంలోనే ఎచ్చెమ్మాళ్ తనను తాను అర్పించుకుంది ఆ స్వామికి. ఆనాటినుంచే స్వామికి భిక్షాకైంకర్యం మొదలు పెట్టింది. ఏరోజూ తప్పదు. పిడుగులు పడుతున్నా

కొండెక్కి భిక్ష పెట్ట వలసిందే ఆ బ్రాహ్మణస్వామికి.

ఎవరీ బ్రాహ్మణస్వామి?

2

బొబ్బిలి దగ్గర కలువరాయి అనే గ్రామం. ఆ గ్రామంలో ఒక సద్బ్రాహ్మణుడు. ఒకనాడాయన తన యిష్టదైవం గణపతిని పూజిస్తూండగా ఆ వినాయక ప్రతిమ నుంచి ఒక బాలుడు పరిగెత్తుకుంటూ తన దగ్గరకొచ్చి అదృశ్యుడయ్యాడు.

ఆ తరువాత కొన్నాళ్ళకా బ్రాహ్మణుడు ఒక కుమారుడిని కన్నాడు. గణపతి వరప్రసాదంగా భావించి ఆ బాలుడికి గణపతి అని పేరు పెట్టాడు.

గణపతికి అయిదారేళ్ళు వచ్చేవరకూ మాటలు రాలేదు. పైగా మూర్ఛలు కూడాను. తండ్రి సాహసించి ఒకనాడు ఒక ఇనుపముక్కను కాల్చి కొడుకు నొసటమీద నొక్కాడు. ఆనాటితో సరి. గణపతిమూర్ఛలు పోయాయి. మాటలు వచ్చాయి. మాటలు రావటమేకాదు. బాల్యం తీరకుండానే చదువుల సరస్వతి అయికూర్చున్నాడు. ఏకసంథాగ్రాహి. చదివింది ఏనాటికీ మర్చిపోడు. శాస్త్రాలని వల్లెవేశాడు. జ్యోతిష్యం చెప్పాడు. సంస్కృతంలో అనర్గళంగా కవిత్వం చెప్పాడు. పన్నెండవ ఏటనే "పాండవ ధార్త రాష్ట్ర సంభవం", "భృంగసందేశం" మొదలైన కావ్యాలెన్నో రచించాడు. పద్నాలుగేళ్ళు నిండకుండానే ఛందో వ్యాకరణ కావ్యాలంకారేతిహాస పారంగతుడయ్యాడు. మహావక్త అనిపించుకున్నాడు. అష్టావధానం చేశాడు. ఆశుకవి సామ్రాట్‌గా విజృంభించాడు. తండ్రి దగ్గరే అనేక మంత్రాలు ఉపదేశం పొందాడు. అనేక పుణ్యక్షేత్రాల్లో, గంగా మొదలైన పవిత్ర నదీతీరాల్లో, తరుల్లో, గిరుల్లో కఠినమైన నియమాలను పాటిస్తూ మంత్రజపం చేశాడు. ఏ దేవిని ప్రార్థిస్తే ఆ దేవి ప్రత్యక్షమయింది. దివ్యానుభవాలు కలిగాయి.

అష్టసిద్ధులూ పొందాడు. వరమివ్వగలిగాడు. శపించ గలిగాడు

తన యిరువదిరెండో యేట. నూనూగు మీసాల నూత్న యౌవ్వనంలోనే గణపతి నవద్వీపానికి వెళ్ళి. అక్కడ జరుగుతున్న విద్వత్సభలో పాల్గొని. మహామహోపాధ్యాయులందరినీ విస్మయపరచి. ముగ్ధులను గావించి "కావ్యకంఠ" బిరుదాన్ని స్వీకరించాడు. తగిన బిరుదు. కావ్యాలని కంఠంలో దాచుకున్న పుంభావసరస్వతి. ఆనాటి నుంచే గణపతి "కావ్యకంఠ గణపతి మునీంద్రులు"గా వ్యవహరింప బడ్డారు.

గణపతి మునీంద్రులు సంస్కృతోపాధ్యాయుడుగా వేలూరు కళాశాలలో పనిచేశారు. కాని. ఆ వుద్యోగ మెన్నాళ్ళో చెయ్యలేక పోయారు. రాజీనామా చేసి దేశాటనకు బయలుదేరారు.

దేశాటన ముగిసిన తరువాత అరుణాచలం వచ్చి తపస్సు ప్రారంభించారు.

ఒకనాటి రాత్రి అరుణాచలేశ్వరుని రథోత్సవం జరుగుతోంది. రథం కొంతదూరం వచ్చి హఠాత్తుగా ఆగిపోయి కదలకుండా భీష్మించుక్కూర్చుంది. ఎంతమంది లాగినా కదలదు. మెదలదు. ఎన్ని వుపాయాలూ వ్యర్థమైపోయాయి. అంగుళం జరగలేదు. తమ నివాసంలో నిద్రపోతున్న గణపతి మునీంద్రులుకి కలలో దేవాలయ పూజారి కనపడి మీరు వస్తేగాని అరుణాచలేశ్వరుడు కదలనంటున్నాడు" అని చెప్పి మాయమయ్యాడు. మునీంద్రులుకి మెలుకువవచ్చింది. లేచి. జపం మొదలుపెట్టారు. అంతలోనే "దేవుడు నిన్ను పిలుస్తున్నాడు" అని ఆకాశవాణి పలికిన పలుకులు స్పష్టంగా వినిపించాయి. వెంటనే బయలుదేరి రథం ఆగిపోయిన చోటుకి వెళ్ళారు. రథంలో వున్న ఉత్సవవిగ్రహం ముందు సాష్టాంగ నమస్కారం చేశారు. అంతే. రథం కదిలింది. ఆ తరువాత వూరేగింపు నిర్విఘ్నంగా సాగిపోయింది.

గణపతి మునీంద్రులుకి దేవీప్రసన్న మహద్భాగ్యం కలిగింది. వారికి నిగమాగమ శాస్త్రపురాణాలు కంఠస్థమయి వున్నాయి. వినయశీలు రైన శిష్యులు శతాధికంగా వున్నారు. అయినా. ఏదో కొరత. అశాంతి. వారాశించిన తపోఫలం

లభించినట్టు లేదు. కొండమీద బ్రాహ్మణస్వామిని గురించి వినే వున్నారు. వారి దర్శనం చేసుకోవాలని బుద్ధి పుట్టింది. వెళ్ళారక్కడికి- విరూపాక్షి గుహకి. స్వామిని దర్శించి తన వ్యాకులతను వెలిబుచ్చారు.

ఆ స్వామి ఏమిచెప్పారో!కావ్యకంఠ గణపతి మునీంద్రులు ''దాసోహ''మంటూ ఆ స్వామి పాదపద్మములకు ప్రణమిల్లారు. ఆ తరువాత తమ శిష్యగణసమేతంగా ఆ బ్రాహ్మణస్వామి భక్తులయ్యారు.

ఎవరీ బ్రాహ్మణస్వామి?

* * *

ఆధివ్యాధి భుజంగదష్టులైన అశేష జనానీకం వారి దర్శనభాగ్యం చేతనే పునీతులయ్యారు. శాంతిని బడయగలిగారు.

ఎవరీ బ్రాహ్మణస్వామి?

3

యుగాలనాడెపుడో ప్రళయం వచ్చింది. ఆ ప్రళయంలో ఈప్రపంచం మునిగిపోకుండా ఈశ్వరుడు తన త్రిశూలంతో యీ భూమిని పైకెత్తి పట్టుకున్నాడు. త్రిశూలాన్ని గుచ్చిన భూభాగంలో కాలక్రమాన ఒక గ్రామం వెలిసింది. దాన్నే త్రిశూలపురమన్నారు. అది దక్షిణాదిని తమిళనాడులో వుంది. అరవవారు దాన్ని తిరుచ్చుళి అన్నారు. ఆ పేరే ఖాయమైపోయింది దానికి.

ప్రళయం. ప్రపంచం. ఈశ్వరుడు. త్రిశూలం. పైకెత్తడం - ఇదంతా నిజం కావచ్చు. కాకపోవచ్చు. కాని. యీనాడు కూడా తమిళనాడులో తిరుచ్చుళి అనే గ్రామం వున్నమాట మాత్రం ముమ్మాటికి నిజం. అదొక పుణ్యక్షేత్రం కూడాను. భూమినాథేశ్వర సహాయాంబల ఆలయం వుందక్కడ.

ఆ తిరుచ్చుళిలో ఒక బ్రాహ్మణ కుటుంబం. వారింటి పేరు కూడా తిరుచ్చుళే.

తిరుచ్చుళి నాగసామయ్యర్‌కు యిద్దరు కొడుకులు - వెంకటేశ్వరయ్యర్. సుందరమయ్యర్.

వెంకటేశ్వరయ్యర్ మహాభక్తుడు. తన ఆదాయంలో సగం దేవి సహాయాంబకర్పించేవాడు. పద్ధెనిమిదేళ్ళ పసి వయస్సులోనే వైరాగ్యం తారాపథాన్నంటుకుంది. ఒకనాడు చెప్పాచెయ్యకుండా ఎక్కడికో వెళ్ళిపోయాడు. తరువాత ఎన్నాళ్ళకో సన్యాసి వేషంలో చిదంబరంలో కనపడ్డాడట తెలిసినవాళ్ళొకరికి. చిదంబర నటరాజస్వామి ఆలయ ప్రదక్షిణం చేసే భక్తుల కాళ్ళకి రాయీ రప్పా గుచ్చుకోకుండా ఏరుతున్నాడట.

ఈ బాలుడికి పూర్వమే యితని పెదనాన్న ఒకాయన కూడా సన్యసించి శివానందయోగి అని పేరు పెట్టుకున్నారట.

అసలు విషయమేమిటంటే - ఎప్పుడో ఒక సన్యాసి యీ తిరుచ్చుళి వారింటికి భిక్షకని వస్తే లేదు పొమ్మన్నారట. అప్పుడా సన్యాసి ''మీ యింటిలో కూడ తరానికొకడు నాలాగే సన్యాసి అవుతా''డని శపించాడట.

మహాత్ముల శాపం కూడా వరప్రసాదంగానే పరిణమిస్తుంది. తాపత్రయాభీలదావాగ్ని నుంచి బయటపడి. తన్ను తానుద్ధరించుకుని. అనేక మందిని యీ భవార్ణవము నుండి చేరవలసిన తీరానికి చేర్చడం వరంగాక శాపమెట్లాగవుతుంది!

వెంకటేశ్వరయ్యర్ ఇల్లువిడిచిపోయేనాటికి తమ్ముడు సుందరమయ్యర్‌కి పదహారేళ్ళే. అయినా కుటుంబభారం మొయ్యక తప్పలేదు. ఎక్కడో గుమాస్తాగా కుదురుకున్నాడు. నెలకు రెండు రూపాయల జీతం మీద. జీతమెంత చిన్నదో తను పోషించవలసి వచ్చిన సంసారమంత పెద్దది. తల్లి. తనూ యిద్దరు తమ్ముళ్ళు (సుబ్బయ్యర్. నెల్లియప్పయ్యర్) ఒక చెల్లెలు(లక్ష్మి) - అయినా జంకలేదు సుందరమయ్యర్. స్వతహాగా తెలివి. పట్టుదల కలవాడు కాబట్టి దస్తావేజులు వ్రాయటం మొదలు పెట్టాడు. ఎంత వ్యవహార్తో అంత మంచివాడు కూడా

ననిపించుకున్నాడు. తన మంచి. ప్రజ్ఞాప్రాభవాలు చేతనే ప్లీడరు పట్టాసంపాదించుకోగలిగాడు. ఆ రోజుల్లో అటువంటి పట్టా సంపాదించుకోవడానికి పరీక్షలు రాయనక్కరలేదు. న్యాయవాద వృత్తిలో పలుకుబడి. పలుకుబడితో పాటు పైకం బాగా సంపాదించాడు. సంసారానికేలోటూరాకుండా చూసాడు. తను పెళ్ళి చేసుకొన్నాడు. తమ్ముళ్ళకి. చెల్లెలికి పెళ్ళిళ్ళు చేశాడు.

సుందరమయ్యర్ భార్య పేరు అళగమ్మ. అళగమ్మ అంటే సుందరమ్మ అని అర్థం. ఇకనేం! ఆయన సుందరయ్య. ఈవిడ సుందరమ్మ. పేర్లకి తగ్గట్టుగానే వారిదెంతో అనుకూల దాంపత్యం. ఇద్దరికీ దైవభక్తి వుంది. ఇంట్లో పూజా పునస్కారం. పురాణపఠనం. నిరతాన్న ప్రదానం జరుగుతుంది.

4

అది శీతాకాలం. 1879వ సంవత్సరం. డిశంబర్ నెల. 29వ తారీఖు.

సుందరమయ్యర్ యింట ఒక గదిలో అళగమ్మ ప్రసవ వేదన ననుభవిస్తూంది. అత్తగారు లక్ష్మిఅమ్మాళ్. పొరుగింటి అంధురాలు ఒక ముసిలామె అళగమ్మ కుపచరిస్తున్నారు.

అర్థరాత్రి 12 గంటలు దాటి ఒంటిగంటఅయింది. అనగా. 30వ తారీఖు వచ్చింది. పరమశివుడు పతంజలి. వ్యాఘ్రపాదాది మహామునుల ప్రార్థనల నాలించి వారికి చిదంబరంలో నటరాజస్వామిగా దర్శనమిచ్చిన దినమది. అర్ద్రా నక్షత్ర దర్శన దినం కూడాను. అనగా. పరమేశ్వరుడు బ్రహ్మదేవుడికీ. విష్ణుమూర్తికీ జ్యోతిరూపంగా ప్రత్యక్షమయిన పర్వదినం. తిరుచ్చుళిలో ఆనాడు భూమినాథేశ్వరుని గ్రామోత్సవం జరుగుతోంది. ఊరేగింపు గోపురం దగ్గరకు వచ్చి క్షణకాలమాగింది. ఇక్కడ అళగమ్మ ప్రసవించింది. మగబిడ్డ. లక్ష్మిఅమ్మాళ్

దిగాలు పడిపోయి "ఈమారైనా కూతురు పుడుతుందేమో. రామస్వామి కిచ్చి (కూతురు కొడుకు) పెళ్ళి చేద్దామనుకున్నాను" అంది. వెంటనే అంధురాలు "అదేవిటమ్మా అలా గంటావు! బిడ్డ అవతారం చూడు. జ్యోతిలా ఎలా వెలిగిపోతున్నాడో" అంది.

ఆ అంధురాల కెట్లా తెలిసిందో! కళ్ళుండి చూడలేనివాళ్ళూ. కళ్ళులేకుండా చూడ కలిగిన వాళ్ళూ. రెండు రకాలవాళ్ళూ వున్నారేమో!

పరమేశ్వరుని లీలలు చిత్రాతి చిత్రాలు.

5

బిడ్డకు వెంకటరామన్ అని పేరు పెట్టారు. వెంకటరామన్‌కు అప్పటికొక అన్న వున్నాడు. పేరు నాగసామి. ఆ తరువాత ఒక తమ్ముడూ. ఒక చెల్లెలు పుట్టారు. తమ్ముడి పేరు నాగసుందరం. చెల్లెలు పేరు అలమేలుమంగ.

వెంకటరామన్‌కి తన చిన్న తాతయ్య దగ్గర బాగా చనువు. ఆయినకి తెలుగు వచ్చు. వెంకటరామన్‌ని ప్రేమగా పక్కలో పడుకోపెట్టుకొని తెలుగు అక్షరాలు. గుణింతాలు నేర్పేవాడు. పొరుగింటి వారు తెలుగువారు. ఆ తెలుగు పిల్లలతో ఆడుకుంటూ తెలుగున మాట్లాడ్డం నేర్చాడు. తెలుగు బాగా రావడానికి మరొక అవకాశం కూడా చిక్కింది. వెంకటరామన్ బంధువర్గంలోని లక్ష్మణయ్యర్ కాపురం వీరింటికి దగ్గరలోనే. ఆయన ఉద్యోగరీత్యా తెలుగుదేశంలో చాలా సంవత్సరాలున్నారు. అందుచేత ఆయన తెలుగు స్వచ్ఛంగా మాట్లాడగలరు. ఆయనికి వెంకటరామన్ అంటే ఎంత ప్రేమో! 'రమణా' 'రమణీ' అంటూ ఎన్నో ముద్దు పేర్లతో పిలిచేవారు. ఆయనతో ఎప్పుడూ తెలుగునే మాట్లాడుతూ తెలుగు బాగా నేర్చాడు వెంకటరామన్.

వెంకటరామన్‌ని చదవేశారు. - అన్న నాగసామి చదువుతున్న బళ్ళోనే.

అక్కడఅయిదోతరగతిదాకానే వుంది. చదువులో శ్రద్ధ తక్కువే అయినా. ఒకస్సారి చదివితే చాలు. ఎంత పెద్ద పాఠాన్నయినావప్పగించేసేవాడు.

వెంకటరామన్ ఆటల్లోనూ. అల్లరిలోనూ ఘనుడే. ముఠానాయకుడు. శూలతీర్థంలో నీళ్ళు పొంగే సమయాని కక్కడికి వెళ్ళి చూడవలసిందే. నది దాటి వెళ్ళి కాళయార్ కోవెల లింగంమీద చెంబెడు నీళ్ళు పోసి రావలసిందే. కోతి కొమ్మచ్చి ఆట ఆడవలసిందే. ఆ ఆటలో పెద్ద మొనగాడు కూడాను. ''కోతి'' బిరుదాంకితుడు. మంచి బలమైనవాడు. ఆటల్లో అన్యాయం చేశారా. వాళ్ళను చితకదన్ని వదిలిపెట్టేవాడు. అందుచేత వెంకటరామన్‌కి కోపం రాకుండా జాగ్రత్త పడేవాళ్ళు కుర్రాళ్ళందరూ.

చదువు సంధ్యలూ. ఆట పాటలూ యిలా వుండగా, సహజంగా మితభాషి వెంకటరామన్. సహనశీలి. ఎంత బాధనైనా ఓర్చుకుంటాడు సమబుద్ధి. ఎవరు ఎవరికిగాని. ఎందులోగాని పక్షపాతం చూపించినా సహించలేడు.

ఇక నిద్రలో అపర కుంభకర్ణుడే. దిండిగల్లులో పినతండ్రి సుబ్బయ్యర్ కొడుక్కి పుట్టినరోజు వేడుక చేస్తూన్నపుడు అక్కడే వున్నాడు. రాత్రి వంటచేసి పెట్టుకొని అందరూ గుళ్ళోకి వెళ్ళారు. వెంకటరామన్‌ని యిల్లు చూస్తూండమన్నారు. సరేనన్నాడు. కాసేపటికి నిదరొచ్చి నిద్రపోయాడు. అంతవరకు నయం. లోపల గెడపెట్టే పడుకున్నాడు. గంటా గంటన్నర తరువాత గుళ్ళోనించి వచ్చారంతా. తలుపు తట్టారు. లేవలేదు వెంకటరామన్. తలుపులు బద్దలయ్యేటట్టుబాదారు. లేవలేదు. కేకలేశారు. అరిచారు. వీధిలో వాళ్ళంతా మేలుకున్నారు గాని వెంకటరామన్‌కి మాత్రం మెలుకూరాలేదు. అక్కడికి చాలా మంది చేరారు. ఎవళ్ళకు తోచిన ఉపాయం వాళ్లు చెప్పారు. చివరికెలాగో తలుపు తెరిచారు. గుంపంతా లోపలికి ప్రవేశించారు. వెంకటరామన్‌కి ఏమయిందోననీ భయపడుతూ. అతని కేమీలేదు. ఘోరంగా నిద్రపోతున్నాడు. నిద్రాదేవి గాఢాలింగనంలో ఎనలేని సుఖమనుభవిస్తూ. తట్టారు. కొట్టారు. గిల్లారు. గిచ్చారు. బాదారు. చివరకితన్నారు కూడాను. లేవడే! కాసేపటి కెలాగో తనకే

మెలుకూవచ్చి చూసేసరికి తన చుట్టూ గుంపు. "ఏమిటిదంతా? ఏమయిం"దని అడిగాడు.

వెంకటరామన్ నిద్ర బాలురకి మంచి అవకాశమిచ్చింది. ఆటల్లో అతనితో ఓడిపోయినవాళ్ళూ. కొట్లాటల్లో చావు దెబ్బలు తిన్నవాళ్ళూ. మెలుకూగా వుండగా అతన్నేమీ చెయ్యలేకపోయిన వాళ్ళూ అతను నిద్రపోతూండగా ఎక్కడికో నడిపించుకుపోయి. అక్కడ బాగా మర్దించి. మళ్ళీతీసుకొచ్చి యధాప్రకారం పడుకోబెట్టేసేవారు. ఇంత చేసినా, పాపం. వెంకటరామన్‌కేమీ తెలిసేది కాదు.

* * *

వెంకటరామన్‌కి సకాలంలో ఉపనయనం చేశారు. సంధ్యవార్చడం నేర్చుకున్నాడు.

6

1890 నాటికి తిరుచ్చుళిలో చదువు పూర్తయింది వెంకటరామన్‌కి. పై చదువులు - ముఖ్యంగా ఇంగ్లీషు చదువు - చదివించాలని దిండిగల్ పంపారు. అప్పటికే అన్న నాగసామి అక్కడి హిందూ హైస్కూల్లో చదువుతున్నాడు. వెంకటరామన్ కూడా ఆ స్కూల్లోనే చేరాడు. ఇద్దరూ పిన తండ్రి సుబ్బయ్యర్ దగ్గరే వుంటున్నారు. సుబ్బయ్యర్ కక్కడ ఉద్యోగం.

1891లో సుబ్బయ్యర్‌కి మధురకు బదిలీ అయింది. పినతండ్రి సంసారంతోపాటు అన్నదమ్ములిద్దరూ కూడా వెళ్ళారక్కడికి. అక్కడ స్కాట్ మిడిల్ స్కూల్లో చేరారు.

1892లో సుందరమయ్యర్‌కి జబ్బు చేసింది. వార్త తెలియగానే సుబ్బయ్యర్

అన్నకొడుకులు యిద్దరినీ తీసుకుని తిరుచ్చుళి వెళ్ళాడు. వెళ్ళిన నాలుగు రోజులకే సుందరమయ్యర్ తనువు చాలించారు. పాపం. ఆనాటి కాయనకు 50 ఏళ్ళు కూడా లేవు. బిడ్డలంతా పసివాళ్ళు. నాగసామికి 14, వెంకటరామన్‌కి 12, నాగసుందరానికి 6 సంవత్సరాలు మాత్రమే. అలమేలుమంగ చంటిది.

సుందరమయ్యర్ మరణానికి భార్యాబిడ్డలేకాదు. ఊరివారంతా దుఃఖించారు. కంటతడిపెట్టనివారు లేరు. ఆయనంత యోగ్యుడు. ఉపకారి. దాత.

కర్మాదికాలు పూర్తయి కాస్తబాధ తగ్గిన తరువాత నాగసామి. వెంకటరామన్ తిరిగి మధుర వెళ్ళిపోయారు సుబ్బయ్యర్‌తో. అళగమ్మా. నాగసుందరం, అలమేలుమంగా తిరుచ్చుళిలో వుండిపోయారు. సంసారభారం నెల్లియప్పయ్యర్ మీదపడింది.

7

తండ్రి గతించిన తరువాత అన్న నాగసామి ఆటలు తగ్గించి చదువుమీద ఎక్కువ శ్రద్ధ వహించడం మొదలుపెట్టాడు.

వెంకటరామన్ చదువు తగ్గించి ఆటలు ఎక్కువ చేశాడు. తలగడలు పొడుగ్గా పెట్టి, వాటి మీద దుప్పటి కప్పి. గోడ దూకి ఉడాయించేవాడు రాత్రిళ్ళు. మిగతా గడుగ్గాయిలనుకూడా సంకేత స్థలంలో కలుసుకునేవాడు. అందరూ కలిసి కోతి కొమ్మచ్చీ ఆడుకున్నంతసేపు ఆడుకుని పిళ్ళయ్యార్ పాలెం చెరువులోపడిఈతకొట్టేవారు. ఒక్కొక్కప్పుడు వైఘానదిలో దిగి యీ దరినుంచి ఆ దరికీ. ఆ దరినుంచి యీ దరికీ ఈదేసేవారు. అర్థరాత్రిదాటి రెండుమూడు గంటలయితేగాని ఎవరింటికి వారు దయచేసేవారు కాదు.

*　　　*　　　*

ఒకనాడొక కోవెలలో ఉత్సవం జరుగుతోంది. ఉత్సవానంతరం విందు కూడ ఏర్పాటుచేశారు. వెంకటరామన్ తన మిత్రబృందంతో సహా వంటింటి చాయల కాపలా కాశాడు. వంటాయన వంటింటికి తాళం పెట్టి ఎటో వెళ్ళాడు. ఇకనేం! "మంచి తరుణం మించిన దొరకదు" అనుకున్నారు. ప్రబుద్ధుల బుర్రలు చురుగ్గా పనిచేశాయి. మారుతాళంతో కప్పను తెరిచారు. గృహప్రవేశం చేశారు. పిండివంటలనీ, సంభారాలనీ అంచిఅంచీలమీద దాటించేశారు. కోనేటి దగ్గరచేరి. తిన్నంతతిని. మిగతాది పారేసి చేతులూ మూతులూ కడుక్కుని చక్కాపోయారు. ఒక రకం అల్లరా!

*　　　*　　　*

వెంకటరామన్ మరొక విద్యలో కూడా నిపుణుడయ్యాడు. ఒక చెంబునిండా నీళ్ళు పోసి ఆ చెంబుని కొంత దూరం విసురుతాడు. ఒక చుక్కైనా వొలగదు.

*　　　*　　　*

సుబ్బయ్యర్ యిల్లు మార్చాడు. ఈ కొత్త యింట్లో నీటి వసతి తక్కువ. పైగా యిల్లు వైఘానదికి దూరంగా వుంది. అందుచేత అక్కడినుంచి నీళ్ళు తెచ్చుకోవడం అసాధ్యం. వెంకటరామన్ బలిష్టుడు. పెద్దపెద్ద బిందెలతో చుట్టుపక్కల వాళ్ళ యిళ్ళ నూతుల్లోంచి తోడి తెచ్చేవాడు. ఏం చేసేది-పిన్నమ్మ తెచ్చుకోలేదయ్యె.

8

వెంకటరామన్ స్కాట్ మిడిల్ స్కూల్‌లో చదువు పూర్తి చేసి అమెరికన్ మిషన్

హైస్కూల్లో చేరి అక్కడ నాలుగోఫారం పానయి అయిదోఫారం చదువుతున్న రోజులవి.

ఒకనాడు స్కూల్‌కు వెళుతున్నాడు. తిరుచ్చుళి కాపురస్తుడు ఒకాయన- వెంకటరామన్‌కు బంధువు కూడాను - ఎదురయ్యాడు. "ఎక్కడి నుంచి రాక" అంటూ పలకరించాడాయన్ని. "అరుణాచలంనుంచి" అన్నాడాయన.

"అరుణాచలం"- యీ మాట వినగానే బాలుడు వెంకటరామన్ ఆశ్చర్యం! పులకాంకితుడయ్యాడు. అతని హృదయ గుహలో నిద్రాణమై యున్న ఏ తలంపు మేల్కొందో. వర్ణనాతీతమైన ఒక దివ్యానుభూతి ననుభవించాడు. యింకా ఆశ్చర్యం నుంచి తేరుకోకుండానే. "అరుణాచలం నుంచా?" అని అడిగాడు. "అవునురా. తిరువణ్ణామలై పేరెప్పుడూ వినలేదా? అదే అరుణాచలం" అన్నాడాయన. ఇది వినగానే ఎందుచేతనో మళ్ళీ నీరుకారిపోయాడు. "అరుణాచలంనుంచి" అంటే "దేవుడి దగ్గరనుంచి" అనుకున్నాడా వెంకటరామన్? అయివుంటుంది.

* * *

ఒకనాడు పెరియపురాణం వెంకటరామన్ కంటపడింది. ఇది నాయనారుల కథల పుస్తకం. నాయనారులందరూ శివభక్తులు. ఆ భక్తుల జీవితచరిత్రలు చదువుతూ మైమరిచిపోయి. వారి కష్టాలకు దుఃఖిస్తూ. వారి ఆనందాన్ని పంచుకుంటూ. వారికి ఈశ్వర దర్శనమయినపుడు తనకయినట్టే తలపోసి సచ్చిదానంద సాగరంలో తేలిపోతూండేవాడు. ఈ పెరియ పురాణాన్ని ఎన్ని మాట్లు చదివాడో ఆ బాలుడు వెంకటరామన్!

9

1896 లో నాగసామికి పెళ్ళి అయింది. వెంకటరామన్ తోడి పెళ్ళికొడుకు. ఈ తోడిపెళ్ళి కొడుక్కి కూడా పెళ్ళిచేసేస్తే బాగుంటుందని ఉబలాటపడింది తల్లి అళగమ్మ. బాగా తెలిసినవాళ్ళుంటే వాళ్ళమ్మాయినిమ్మని అడిగింది కూడానూ. అయితే "నీళ్ళుమోస్తూ. పప్పులు రుబ్బుతూ వాళ్ళ పిన్నమ్మకి వంటింట్లో పని చేసి పెట్టే మీ గోచి పాతరాయుడికా మా పిల్లనివ్వడం!" అని హేళన చేశారు వాళ్ళు.

కొన్నాళ్ళ తరువాత ఆ అమ్మాయికి మరొక చిన్నవాడితో పెళ్ళయింది. విధినెవరు తప్పించగలరు! గర్భాదానం కాకుండానే ఆ చిన్నవాడు గతించాడు.

ఆ చిన్నది పెళ్ళి చేసుకున్న కొన్నాళ్ళకే విధవరాలై కూర్చుంది ఆమె ముఖాన వైధవ్యం రాసిపెట్టివుండగా వెంకటరామన్ కెందుకిస్తారూ! మరి వెంకటరామన్‌కి ఎవరమ్మాయినిచ్చారు? పెళ్ళెప్పుడు చేశారు? లేక అసలు పెళ్ళే కాలేదా? లేదా. వెంకటరామన్ ఒక అమ్మాయిగా మారి ఒక అబ్బాయిగారిని పెళ్ళాడాడా?

10

వెంకటరామన్‌కి పదహారేళ్లు నిండి పదిహేడో ఏడు నడుస్తోంది. మెట్రిక్ పరీక్షకి చదువుతున్న రోజులవి.

ఒకనాడు మేడ మీద గదిలో పడుకుని వున్నాడు. మామూలుగానే, మంచి ఆరోగ్యంగానే వున్నాడు. అప్పుడా గదిలో మరెవ్వరూ లేరు. చిత్రం! అతి విచిత్రం! ఉన్నట్టుండి పెదవులారుకుపోవడం మొదలు పెట్టాయి. కాళ్ళు

క్రమక్రమంగా బిగుసుకుపోతున్నాయి. కళ్ళు మూతపడి పోయాయి....చివరకి శ్వాస కూడా నిలిచిపోయింది.

"చచ్చిపోయా"ననుకున్నాడు వెంకటరామన్. "చచ్చిపోయాను సరే. యీ కట్టెమీదపడి కాసేపు ఏడుస్తారు మా వాళ్ళు. ఆ తరువాత నలుగురు పట్టి మోసుకుపోయి స్మశానంలో తగలేస్తారు. దానితో అంతా ఆఖరు".

ఇలా అనుకుంటూ "ఇదేమిటీ! చాలా చిత్రంగా వుందే! నేను చచ్చిపోయి కూడా యీ కట్టెని ఎలా చూడగలుగుతున్నాను! దీనిని మోసుకుపోయి స్మశానంలో తగలేస్తారని ఎలా అనుకోగలుగు తున్నాను! నేను చచ్చిపోలేదా? చచ్చింది శరీరమేనా! అయితే నేనెవరిని? నేనీ శరీరాన్ని కాదా? మరెవరిని?"

ఈ ప్రశ్నకు సమాధానాన్ని తదేకదీక్షతో ఆలోచించడం మొదలుపెట్టాడు. తన మృతకళేబరాన్ని చూడ్డం మానేశాడు. వ్యక్తిత్వస్ఫురణ తగ్గిపోయింది. కేవలం బ్రహ్మానుభూతి - ఆత్మానుభూతి కలిగింది. ద్వైతం నశించింది. ఇతరులు లేరు. ఇతరములేదు. "సర్వం ఖల్విదం బ్రహ్మ"

కొంత సేపటికి ఆ యనుభూతి ముగిసింది. స్థూలదేహం కదిలింది. కొత్త వెంకటరామన్ అవతరించాడు. చచ్చి బ్రతికాడా?

తెలియదు.

11

వెంకటరామన్ జీవితం మరొక మలుపు తిరిగింది. అనుకోని మలుపు. అపురూపమైన మలుపు. అనుపమానమైన మలుపు.

అప్రయత్నంగా సమాధిలోకి వెళ్ళిపోతాడు. నిర్వికల్ప సమాధా? సవికల్ప సమాధా? సహజ సమాధా? అతనికే తెలియాలి.

స్ఫురణ వచ్చినపుడు కూడా తను ఆ మూడున్నర మూరల శరీరాన్ని కాదనీ. తాను వేరనీ తలపోస్తాడు. తరచు మీనాక్షి సుందరేశ్వరుల ఆలయానికి వెళ్ళి. వెయ్యికాళ్ల మండపంలో తిరుగుతూ అక్కడి శిలా ప్రతిమలను తిలకిస్తూ కన్నీరు కారుస్తాడు. అవి ఆనంద భాష్పాలో! ఏదో చెప్పరాని ఆవేదనో!

వెంకటరామన్‌కి తను ఎన్నోమాట్లు చదివిన పెరియపురాణం మాటిమాటికి జ్ఞప్తికొస్తోంది. తనకు కూడా నాయనారులవంటి భక్తి కుదరకూడదా! తనకూ ఈశ్వర సాక్షాత్కారం కాకూడదా!నిరంతరమిదే ధ్యాస. గుళ్ళోకి వెళతాడు. నాయనారుల విగ్రహాలని మహోద్వేగంతో చూస్తూ అలాగే నిలబడిపోతాడు.

ఇలా వుండగా సుమారు ఒక సంవత్సరంక్రితం తనబంధువొకరు తటస్థపడ్డం. అరుణాచలమనే పదాన్ని ప్రప్రథమంగా ఆయన ముఖతావినడం. తనకప్పుడొక వర్ణనాతీతమైన అనుభూతి కలగడం - ఇదంతా గుర్తుకొచ్చింది. గుర్తుకు రావడమే కాదు. ఆనాటి దివ్యానుభూతిని తిరగతోడింది. క్రమక్రమంగా "నాతండ్రి ఈశ్వరుడు - అరుణాచలుడనే పేరుతో అరుణాచలంలో వున్నాడు - నన్నక్కడికి రమ్మని పిలుస్తున్నాడు- నేను అరుణాచలం వెళ్ళాలి. నా తండ్రి దర్శనం చేసుకోవాలి" అనే ధోరణి బలపడిపోయింది. ఆలయానికి పలుమార్లు వెళ్ళి. తల్లి మీనాక్షినీ. తండ్రి సుందరేశ్వరుడినీ ప్రార్థిస్తాడు. కన్నీరు మున్నీరుగా ఏడుస్తాడు.

12

వెంకటరామన్‌లో వచ్చిన మార్పుకి యింట్లో వాళ్ళూ స్నేహితులూ కూడా ఆశ్చర్యపోయారు. అటువంటి మార్పు అమాంతంగా ఎందుకొచ్చిపడిందో ఎవరికీ అంతుచిక్కలేదు. తనకొచ్చిన మృత్యానుభవం సంగతి ఎవరికీ తెలియదు.

తను ఎప్పుడైనా ఎవరికేనే చెపితేగా! ఏమడిగినా వులకడు. పలకడు. నీళ్ళు తెమ్మంటే తెస్తాడు. కూరలు తరగమంటే తరుగుతాడు. పప్పు రుబ్బమంటే రుబ్బుతాడు. ఏది చెపితే అదిచేస్తాడు. అన్నీ యాంత్రికంగానే.

పుస్తకం తెరుస్తాడు. ఏమి చదువుతున్నాడో తనకే తెలియదు. చదువుతూ చదువుతూ సమాధిలోకి వెళ్ళిపోతాడు. అది ధ్యానమో, శూన్యమైన నిరామయస్థితో, మరేదో!

అంతటితో సరిపోలేదు. వొళ్ళంతా మంటలతో బాధ పడ్డం మొదలు పెట్టాడు.

ఆటలంటే చెవికోసుకునేవాడు ఏదీ ఎవరితోనూ చెప్పడు. ఓర్చుకుంటాడు. ఇదివరకు మాట పడేవాడు కాదు. ఎంత ఆటల జోలికి పోవడం మాని వేశాడు. స్నేహితుడైనాసరే. ఏదైనా అన్నాడో వాడిని పచ్చడిచేసి మరీ వదలిపెట్టేవాడు. ఇప్పుడో! ఎవరేమన్నా ఉదాసీనుడే. అభిమానం, దర్పం మచ్చుక్కూడా కనపడ్డం లేదు.

"పెద్ద పెద్ద యింగ్లీషు చదువులు చదివి వూళ్ళేలుతాడు మా వెంకటరామన్" అనుకున్న స్వజనం బాధపడ్డారు. తమ ఆశలన్నీ అడియాశలు చేశాడుకదా అని. ఎవరేమన్నా పడతాడుగాని చదవడు. అడిగినదానికి సమాధానం చెప్పడు. ఆలయానికి వెళ్ళడం మానడు.

"తెలివైనవాడేగాని, చదువు మీద శ్రద్ధలేదు - ముందు ముందు శ్రద్ధ కలగకపోతుందా - బాగా చదివి పెద్ద పెద్ద ఉద్యోగాలు చెయ్యకపోతాడా" అనుకున్నారుగాని. చదువుమీద అశ్రద్ధతోడు యీ నిర్లిప్తతా, ఎందుకూ కొరగాని వైరాగ్యం, కూడూ గుడ్డా పెట్టని వేదాంతం అలవడుతాయనుకోలేదు వాళ్ళు. పలువిధాల చెప్పి చూసారు. రకరకాలుగా దెప్పిపొడిచారు. ఏంచేసినా ఏమీలాభం లేకపోయింది

స్కూల్లో మాస్టర్లు కూడా ఎంతేనా ప్రయత్నించారు. కొట్టారు. తిట్టారు గోడకుర్చీ వేయించారు. తోటివిద్యార్థులు నవ్వారు. హేళన చేసారు. ఎవరేమిచేసినా ఫలితం మాత్రం శూన్యం.

13

29-8-1896. శనివారం. ఉదయం 10 గంటల సమయం. వ్యాకరణమో మరేదో స్కూల్లో వప్పచెప్పకపోవడం మూలాన మూడుమాట్లు ఆ పాఠాన్ని చూచి వ్రాత రాసుకురమ్మన్నారు మాష్టారు. మేడ మీద గదిలో కూర్చుని రాసుకుంటున్నాడు వెంకటరామన్. అన్న నాగసామి కూడా ఆ గదిలోనే వున్నాడు ఏదో చదువుకుంటూ. ఎలాగో రెండు మాట్లు రాశాడు. మూడోమాటు రాయబోతున్నాడు. అప్రయత్నంగా కన్నులు మూతబడ్డాయి. ధ్యానంలో మునిగిపోయాడు.

అన్నచూశాడు తమ్ముడి వాలకం. "స్వామి, యోగేశ్వరా, తమ తపస్సున కనువగు ప్రదేశములు అడవులుకాని గృహములుకావు" అన్నాడు హేళనగా. అన్నవెక్కిరింపు తమ్ముడికి నగ్నసత్యంగా స్ఫురించింది. అంతేకాదు. అది తన తండ్రి అరుణాచలుని పిలుపేనని నిర్ధారణ చేసుకున్నాడు. ఇక క్షణమాత్రం ఆలస్యం చెయ్యలేదు. లేచి నుంచున్నాడు. "ఎక్కడికి ప్రయాణం" అని అడిగాడు అన్న. "స్కూల్లో స్పెషల్ క్లాస్ వుంది. వెళుతున్నా" నన్నాడు తమ్ముడు."అయితే సరే. వెళుతూ వెళుతూ కాలేజీలో నా జీతం కట్టేయి పెట్లో అయిదు రూపాయలున్నాయి. తీసుకో పిన్నమ్మ నడుగు. పెట్టె తాళం యిస్తుంది" అన్నాడు నాగసామి. "సరే" నని మేడ దిగాడు వెంకటరామన్.

దిగుతూ దిగుతూ "తండ్రీ, నీకు నామీదెంతదయ! నీ దగ్గరకు రావడానికి ప్రయాణపు ఖర్చులు సమకూర్చావా!" అనుకున్నాడు. దిగి, పిన్నమ్మతో అన్నాడు - తను స్కూల్‌కి వెళ్ళాలనీ, కాలేజీలో అన్నజీతం కట్టాలనీ. ఫోంచేసి వెళ్ళమంది పిన్నమ్మ. కాదనలేకపోయాడు. భోజనమయిన తరువాత పెట్టె తాళం తీసి, మూడురూపాయలు మాత్రమే తీసుకుని, ఒక వుత్తరం రాసి ఆ పెట్లో పెట్టి బయటకు నడిచాడు. ఆ వుత్తరంలో వున్నదిది:

"నా తండ్రి పిలుపు నందుకుని నా తండ్రి దగ్గరకు వెళుతున్నాను. ఇది మంచి పనికే బయలుదేరింది కాబట్టి దీన్ని వెతకడానికి మీరెవ్వరూ శ్రమ పడవద్దు. డబ్బు ఖర్చు పెట్టవద్దు నీ జీతం కట్టబడలేదు. ఇందులో యింకా రెండు రూపాయిలున్నాయి. ఇట్లు...."

చిత్రమైన వుత్తరమేగాని. ఎంత అర్థముందీ అందులో!

"నా తండ్రి అరుణాచలుని పిలుపు నందుకుని" అని రాస్తే అరుణాచలం వచ్చి తనను పట్టుకుంటారని అలా రాయకుండా "నా తండ్రి పిలుపునందుకుని" అని మాత్రమే రాశాడు.

ఇక నా "తండ్రి దగ్గరకు వెళుతున్నా" ననడం "జీవాత్మనైన నేను పరమాత్మ అయిన నా తండ్రి దగ్గరకు వెళుతున్నాననడమే.

"నేను మంచి పనికే బయలుదేరుతున్నాను కాబట్టి నన్ను వెతకడానికి శ్రమపడవద్దు." అని ఎలా వ్రాయగలడు ? శరీరము తనదికాని. శరీరము తానుకాదు. మృత్యానుభవం పొందిననాడే యీ సత్యాన్ని గ్రహించాడు. అందుచేతనే "దీన్ని వెతకడానికి" అన్నాడు.

చిట్టచివరకు "ఇట్లు" అని రాసి వూరుకున్నాడేగాని సంతకం చేయలేదు. "వెంకటరామన్" అనే పేరు తన శరీరానికే చెల్లుతుందికాని. నామరూపరహితుడూ. సర్వసాక్షి అయిన తన కెలా చెందుతుందీ? ఈ యదార్థాన్ని తాను వేరుగా వుండి తన మృతకళేబరాన్ని సాక్షీమాత్రుడుగా చూసిననాడే గ్రహించాడు.

14

వెంకటరామన్ తిన్నగా రైలు స్టేషన్‌కు నడిచి వెళ్ళాడు. ఆవేళ 12 గంటలకు రావలసిన బండి ఒంటిగంట కొచ్చింది. సకాలానికే వచ్చుంటే అందేదేకాదు.

తన తండ్రి తన కన్ని విధాల సహాయపడుతున్నాడు. ఇంకేమి కావాలి!

అరుణాచలాన్నే తిరువన్నామలై అంటారని తెలిసిందిగా వెంకటరామన్‌కి! కాని. తిరువన్నామలైకి రైల్వేస్టేషన్ వుందని తెలియదు. తిండివనంలో దిగి అక్కడికి వెళ్ళాలని అతని ఊహ. ఎవరినీ అడగలేదు. అడిగితే తన ఆచూకీ యింట్లోవాళ్ళకి దొరికిపోతుందేమోనని భయం. అందుచేత రెండు రూపాయల పదమూడణాలు యిచ్చి తిండివనానికే టిక్కట్టు కొన్నాడు. తిరువన్నామలై కయితే మూడు రూపాయిలే. విల్లుపురం-కాట్పాడి రైలుమార్గం మీద దగ్గరదారిని ప్రయాణం చేస్తే. అయితే. వెంకటరామన్‌కి టైమ్‌టేబుల్ చూడాలనిగాని. అడిగి తెలుసు కోవాలనిగాని ఎక్కడ-చిత్తమరుణాచలాయత్తమై వుందికదా!

రైలు వచ్చింది. ఎక్కికూర్చున్నాడు. రైలు కదిలింది. వేగం పుంజుకుంటోంది. మీనాక్షి సుందరేశ్వరుల ఆలయం. వైఘానదీ. కొబ్బరి తోటలు. తను ఆడుకున్న స్థలాలు. ఎన్నో వెనకబడిపోతున్నాయి. మధురనగరం కూడా దూరమయింది. కాని. వెంకటరామన్‌కిదేమి తెలియదు. రైలెక్కి కూర్చున్నాడో లేదో. కళ్ళు మూసుకుని ధ్యానంలో పడిపోయాడు. ఆ స్థితిలో ఏ నిరుపమానందాన్ని అనుభవిస్తున్నాడో!

సాయంత్రమయింది. రైల్లో పొడుగాటి గడ్డం వున్న ఒక మౌల్వీ సాధుసంతులను గురించి ఉపన్యసిస్తున్నాడు. ప్రయాణీకులంతా సాధుభక్తులతో వింటున్నారు. వెంకటరామన్‌కు మాత్రం అక్కడేమి జరుగుతోందో తెలియదు. ఇంకా కళ్ళు మూసుకుని ధ్యాన నిమగ్నుడయ్యే వున్నాడు. మౌల్వీ చూశాడు. ఆ బాలుడి నిశ్చలతకీ. అతని ముఖారవిందం మీద ప్రస్ఫుటమవుతున్న తేజస్సుకీ. నిర్విణ్ణుడయ్యాడు. తట్టి లేపాడు. "ఎక్కడికి వెళుతున్నావు బాబూ" అని అడిగాడు. "తిరువన్నామలై" అన్నాడు వెంకటరామన్. "నేనూ ఆ పక్కస్టేషన్ తిరుక్కోయిలూరుకు వెళుతన్నానన్నాడు మౌల్వీ. "అయితే తిరువన్నామలైకు రైలుస్టేషన్ వుందా?" అని అడిగాడు వెంకటరామన్. కాస్త ఆశ్చర్యపోతూ. "ఉంది బాబూ. నేను వెళ్ళే

తిరుక్కోయిలూరుకి. నువ్వు వెళ్ళే తిరువణ్ణామలైకి విల్లుపురంలో దిగి మరో బండెక్కాలి అని చెప్పి "అయితే మరి నువ్వు టిక్కట్టు తిరువణ్ణామలైకి కొనలేదా?" అని అడి..డు. "లేదు. తిండివనానికే కొన్నా" నన్నాడు వెంకటరామన్. "పోనీలే. విల్లుపురంలో దిగి మరొక టిక్కట్టు తిరువణ్ణామలైకు కొందువుగాని" అన్నాడు మౌల్వీ. సంభాషణ ముగిసింది. అరుణాచలుడే తన చెయ్యి పట్టుకు తీసుకువెళుతున్నాడు. తనకెందుకు చింత! మళ్ళీ నెమ్మదిగా కళ్ళుమూసుకుని ధ్యానంలో మునిగిపోయాడు వెంకటరామన్. అంతా అప్రయత్నంగానే. చూచేవాళ్ళకి మాత్రం నిద్ర పోతున్నాడనిపించవచ్చు.

చీకటి పడుతోంది. వెంకటరామన్ కళ్ళు తెరిచి చూసేసరికి రైలు తిరుచునాపల్లి స్టేషన్‌లో నిలిచివుంది. తిరుక్కోయిలూరుకు వెళుతూన్న మౌల్వీలేదు. తను తిండివనానికి పోకుండా విల్లుపురంలోనే దిగమని చెప్పడానికి తన తండ్రి అరుణాచలుడు పంపినదూతకాదు కదా!

వెంకటరామన్ కిప్పుడు ఆకలివేసింది. మధురలో టిక్కెట్టుకొనగా యింకా మూడణాలున్నాయి తన దగ్గర. అందులోంచి అర్ధణాపెట్టి రెండు భేరీకాయలు కొన్నాడు. కాని, ఒక కాయలో నాలుగోవంతైనా తిన్నాడో లేదో ఆకలి తీరిపోయింది. నిన్నటి దాకా మూడు పూట్లా అన్నం తిన్నాడు. దొరికినంత చిరుతిండి తిన్నాడు. అప్పుడు గాని అతని ఆకలి తీరేది కాదు. ఈ వేళ యిదేమిటీ. కాస్త భేరీకాయముక్క తినగానే కడుపు నిండిపోయింది.తనకే చిత్రంగా తోచింది. కాసేపటికి మళ్ళీ సమాధిలోకి వెళ్ళిపోయాడు.

ఇంకా తెల్లారకుండానే రైలు విల్లుపురం చేరింది. వెంకటరామన్ దిగాడక్కడ. బాగా తెల్లారిందాకా స్టేషన్‌లో వుండి, అప్పుడు వూళ్ళోకి వెళ్ళాడు. నాలుగు వీధుల మొగల్లోనూ బోర్డులు చూశాడు. ఏ బోర్డు మీదా "తిరువణ్ణామలైకు బోవు మార్గం" అని లేదు. "మాంబలం పట్టుకుపోవు మార్గం" అని వున్నదొక వీధిమొగట. ఆ మార్గాన్ని, పోయి, మాంబలం పట్టు దాటి కొంతదూరం వెళ్ళగా తిరువణ్ణామలై వస్తుందని తెలియదు పాపం. ఎవరనీ అడగడు.

ఎందుచేతనో! ఇంకా భయమేనా తన జాడ తన వాళ్ళకి తెలుస్తుందనీ!

బాగా పొద్దెక్కింది. తిరిగి తిరిగి అలసిపోయాడు. ఆకలి వేసింది. ఒకపూటకూటింటికి వెళ్ళి భోజనం పెట్టమన్నాడు. "వంటకాలేదు. మధ్యాహ్నం దాకా ఆగా" లన్నారు. "సరే" నని అక్కడే అరుగుమీద కూర్చున్నాడు. నెమ్మదిగా సమాధిలోకి జారుకున్నాడు. ఎంతకీ కళ్ళు తెరవడు. పూటకూటింటి అయ్యర్ యిదంతా కనిపెడుతూనే వున్నాడు. చిదిమిన పాల్గారు చిన్నారి వయసువాడు! బంగారుమేని చాయవాడు! గొప్ప వర్చస్సుతో విరాజిల్లుతున్నవాడు! ఎంత భక్తి! ఎంత నిష్ఠా! అయ్యర్‌గారు ఆశ్చర్యంతో తలమునకలయ్యారు.

వంటయింది. మధ్యాహ్నమూ అయింది. తట్టి లేపితేగాని వెంకటరామన్‌కి బాహ్యస్మృతి రాలేదు. స్మృతి వచ్చింతరువాత ఆప్యాయంగా భోజనం పెట్టారు. వెంకటరామన్ డబ్బులివ్వబోగా పుచ్చుకోలేదు అయ్యర్‌గారు. తిరువణ్ణామలై వెళ్ళడానికి ఏరైలు ఎక్కాలో ఆయనే చెప్పారు.

వెంకటరామన్ స్టేషన్‌కు వెళ్ళి తిరువణ్ణామలైకు టిక్కట్టుకొనబోగా డబ్బులు చాల్లేదు. మాంబళంపట్టు దాకా కొనవచ్చు తన దగ్గరున్న డబ్బులు పెట్టి. అలాగే, అక్కడి వరకే కొని రైలెక్కి కూర్చున్నాడు.

మాంబళంపట్టు స్టేషన్‌వచ్చింది. దిగాడు. అక్కడనుండి నడక ప్రారంభించాడు తిరుమణ్ణామలై చేరడానికి. విల్లుపురంలో ప్రొద్దుట ఎంతోసేపు నడిచాడు. ఇప్పుడు మిట్ట మధ్యాహ్నం మళ్ళీ నడక. సుకుమారుడు. అయినా అలాగే పదిమైళ్ళు నడిచి చీకటి పడేసరికి అరయనినల్లూరు చేరుకున్నాడు.

అరయనినల్లూరు ఒక పుణ్యక్షేత్రం. ఆ ఊళ్ళో కొండమీద అతుల్యనాధేశ్వరుని ఆలయం వుంది. అలసిపోయి సొలిపోతూ ఆ కొండెక్కాడు వెంకటరామన్. తీరా అంత శ్రమపడి ఎక్కిచూసేసరికి గుడి తలుపులు మూసి వున్నాయి. చేసేదింకేమీ లేక అక్కడే కూర్చుండిపోయాడు. కాసేపటికి పూజారి వచ్చి గుడి తలుపులు తెరిచాడు. గర్భగుడిలోకి వెళ్ళి అతుల్యనాధేశ్వరుని పూజ

మొదలుపెట్టాడు. వెంకటరామన్ కూడా అక్కడే దగ్గరలోవున్న ఒక మండపంలో కూర్చుని తన హృదయ కుహరంలో వున్న ఈశ్వరుడి పూజ మొదలుపెట్టాడు. హఠాత్తుగా ఒక దివ్యతేజస్సు. తనని తన పరిసరాలని, సమస్తాన్నీ ఆవరించినట్లు తోచింది. కళ్ళు తెరచిచూశాడు. ఇంకా ఆ తేజస్సు అలాగేవుంది. అతుల్యనాథేశ్వరుని కిరణప్రసారమేమోనని గర్భగుడివైపు నడవసాగాడు. నడుస్తుండగానే ఆ వెలుగు అంతర్హితమైంది. గర్భగుడి చీకటిగుయ్యారం. ఎక్కడనుంచి వచ్చినట్లూ వెలుగు-తన హృదయంలోంచే వచ్చిందా? ఏమో! వెంకటరామన్. వెంటనే

మళ్ళీ యథాస్థానానికి వచ్చి కూర్చున్నాడు ధ్యానంలో మునిగిపోయాడు.

పూజారి కక్కడ పూజ పూర్తయింది. బయటకి వెళుతూ ఆ మసక చీకటిలో వెంకటరామన్‌ని చూశాడు. "ఎవరయ్యా అక్కడ " అని కేకపెట్టాడు. వెంకట రామన్ లేచి పూజారి దగ్గరకువచ్చి కాస్త ప్రసాదం పెట్టమన్నాడు. "తమకిక్కడ విందు చెయ్యడానికి రాలేదు. మేము" అన్నాడా కఠినాత్ముడు వెటకారంగా. పోనీ ఆ రాత్రి కక్కడ వుండడానికయినా అనుమతించమన్నాడు వెంకటరామన్. "లాభంలే" దన్నాడు కఠినాత్ముడు. ఇదంతా చూచిన దేవాలయ పరిచారకులు "ఇక్కడికొక మైలు దూరంలో వీరాటేశ్వరాలయం వుంది. అక్కడ ప్రసాదం దొరకవచ్చు, మాతోరా" అన్నారు. వెంకటరామన్ వాళ్ళతో బయలు దేరి వెళ్ళాడక్కడికి. అప్పుడు అక్కడ కూడా పూజ జరుగుతోంది. ఈ లోపుగా వెంకటరామన్ ధ్యానంలో పడ్డాడు. పూజ అయింతర్వాత పూజారి వచ్చి లేవగొట్టాడు గాని ప్రసాదం పెట్టినపాపాన మాత్రం పోలేదు. అక్కడి వాద్యగాండ్రలో ఒకడు, వెంకటరామన్ చర్య గమనించినవాడు, జాలిపడి తన భాగం ఆ కుర్రవాడికి పెట్టమని ప్రాధేయ పడ్డాడు. అందుకు ఒప్పుకుని అలాగే పెట్టాడు పూజారి. వెంకటరామన్ ఆ ప్రసాదాన్ని తీసుకుని "మంచినీళ్ళు ఎక్కడ దొరుకుతాయి? " అని అడిగాడు. అప్పుడా పరిచారకులు వెంకటరామన్‌ని బ్రాహ్మణవీధిలో ఒక శాస్త్రిగారింటికి తీసుకువెళ్ళారు. ఆ యింటివారు మంచినీళ్ళు

తెచ్చిచ్చే లోపుగానే వెంకటరామన్ శోషవచ్చి కళ్ళుతిరిగి పడిపోయాడు. స్మృతి వచ్చి చూసేసరికి ఆకులోని ప్రసాదం కొంత చెల్లాచెదురైంది. జనం తనచుట్టూ మూగివున్నారు. ఆకులో మిగిలివున్న ప్రసాదాన్ని ఆరగించి ఆ రాత్రి కా వీధిలోనే వున్న ఒక యిసుక తిన్నెమీద పడుకుని నిద్రపోయాడు. ఇల్లు విడిచిపెట్టిన తరువాత అది రెండో రాత్రి.

తెల్లారింది. ఆనాడు గోకులాష్టమి. ఆ బ్రాహ్మణవీధిలోనే పోతూ ఒక యింటి ముందాగి అన్నం పెట్టమన్నాడు వెంకటరామన్. ఆ గృహాయజమాని పేరు ముత్తుకృష్ణభాగవతార్. ఆయన తన చెల్లెలు నదికి స్నానానికి వెళ్ళిందనీ, ఆమె వచ్చేదాక ఆగమనీ చెప్పాడు. అంతలో ఆమె రానే వచ్చింది. వెంకటరామన్‌ని చూసింది. ముఖం వాడిపోయి వుంది. అయినా, యీ గోకులాష్టమినాడు ఆ గోపాలబాలుడే యీ రూపాన్ని వచ్చినట్లు తోచిందామెకు. వెంటనే వంట మొదలు పెట్టింది గాని, వంటయ్యేవరకూ తాళుకోగల స్థితిలో లేనట్టు కనపడ్డాడు బాలుడు. చద్దన్నం వున్నట్లు గుర్తొచ్చింది పర్వదినమైనా, మైలపడిపోతుందని తెలిసినా ఆ చద్దన్నాన్ని తెచ్చి వెంకటరామన్‌కు పెట్టింది. వెంకటరామన్‌కు రెండు ముద్దలు తినేసరికి కడుపు నిండిపోయినట్టయ్యింది. అయినాసరే పెట్టినదంతా బుజ్జగిస్తూ తినిపించింది ఆ తల్లి:

తిరువన్నామలై అక్కడి కింకా యిరవైమైళ్ళుంది. నడవగలడా-రైలుమీద పోదామంటే చిల్లిగవ్వలేదు. అంతలోనేగుర్తొచ్చింది వెంకటరామన్‌కి - తన చెవులకు కెంపుల దిద్దులున్నాయని. వాటిని అమ్మకూడదా, లేదా, తాకట్టుపెట్టి కొంత పైకం పుచ్చుకోకూడదా? ఎవరిని అడగాలి కొంత సేపు తనలోనే తర్జనభర్జనపడి, చివరికి ఆ గృహా యజమాని ముత్తుకృష్ణభాగవతార్‌నే అడిగి నాలుగు రూపాయలు పుచ్చుకున్నాడు తన దిద్దులు తాకట్టు పెట్టి. 'ప్రయాణంలో పెట్టె పోయింది. అరుణాచలయాత్ర పూర్తి చేసుకొని యింటికి వెళ్ళిన తరువాత డబ్బు పంపించేస్తాను" అన్నాడు భాగవతార్ అడిగినదానికి సమాధానంగా.

తనదేవూరని చెప్పాడో! మధుర అనిగాని. తిరుచ్చుళి అనిగాని చెప్పివుండడు. అలాగే చెప్పివుంటే "నాలుగు రూపాయలు ఎట్లాసరిపోతాయి అని అడగడా భాగవతార్?" ఆటపాటల్లోగాని. వేళాకోళానికి గాని అబద్ధ మాడని వెంకటరామన్‌కి అబద్ధమాడక తప్పలేదు. నిజం చెప్పి తన తండ్రి దగ్గరకు వెళుతూన్న ప్రయాణానికి అడ్డంకులు కల్పించుకునే దానికంటే అబద్ధం చెప్పినా తన తండ్రిని చేరుకోవడం ముఖ్యం. తన కర్తవ్యం. తన గమ్యం అనుకున్నాడు కామోలు.

కొంతసేపయిన తరవాత భాగవతార్ చెల్లెలు పిలిచి యిద్దరికీ పిండి వంటలతో సహా భోజనం పెట్టింది. అంతేకాక రాత్రికూడా తినమని కొంత ఫలహారాన్ని పొట్లంకట్టిచ్చింది వెంకటరామన్‌కి. వాళ్ళ దగ్గర సెలవు తీసుకుని బయలుదేరి స్టేషన్‌కు వెళ్ళాడు వెంకటరామన్. తెల్లవారుజామునగాని బండి లేదన్నారు. ఆ రాత్రికా స్టేషన్‌లోనే పడుకుని నిద్ర పోయాడు.

15

ఆరోజు 1896వ సంవత్సరం సెప్టెంబర్ నెల ఒకటో తారీకు.

ఇంకా బాగా తెల్లారలేదు. వెంకటరామన్ టిక్కెట్టుకొనుక్కుని బండి రాగానే ఎక్కి కూర్చున్నాడు. రైలు కదిలింది. వడివడిగా పోతోంది. తిరువన్నామలై అంతకంతకూదగ్గరవుతోంది. తండ్రి అరుణాచలుని దర్శనం చేసుకునే క్షణాలు సమీపిస్తున్నాయి.

వెంకటరామన్ ఆనందభాష్పాలు రాలుస్తున్నాడు. తన తండ్రిని ఏనాడు చూచాడో గుర్తులేదు. ఇప్పుడాయన అరుణాచలంలో వున్నాడని తెలిసింది. పైగా. తననక్కడికి రమ్మని పిలిచాడు. వెళుతున్నాడు. తండ్రిని చూస్తాడు. వెంకటరామన్ పొందుతున్న అనుభూతి వర్ణనాతీతమే.

అదుగో అరుణాచల శిఖరం.... అదుగో అరుణాచల పర్వతం.... అవిగో అరుణాచలేశ్వర గోపుర శిఖరాలు .... అదుగో ఆలయం .... నా తండ్రి యిల్లు ....

వెంకటరామన్ ఉద్వేగం పరాకాష్ఠ నందుకుంది.

బండి స్టేషన్‌లో ఆగిందో లేదో ఒక్క వురుకు వురికి పరుగుతీశాడు దేవాలయానికి. గర్భగుడి తలుపుతో సహా తలపులన్నీ బార్లా తీసి వున్నాయి. ఒక్క మానవమాత్రుడు లేడు ఆలయంలో. ఉదయం8 గంటలకుగాని తెరవని గుడి తలుపులు ఆవేళ తెల్లారేసరికి ఎందుకు తెరిచివున్నాయి? భక్తులతో సతతం కిటకిటలాడే దేవాలయం అప్పుడు నిర్జనంగా వుండడానికి కారణమేమిటి?

కుమారుడెంత ఆత్రంగా వస్తున్నాడో తండ్రి కూడా అంతకంటె ఆత్రంగా పుత్రదృఢపరిష్వంగానుసక్తుడై నిరీక్షిస్తున్నాడన్నమాటేగా!

వెంకటరామన్ స్టేషన్‌లో దిగీదిగగానే మొదలు పెట్టిన పరుగునాపకుండా తిన్నగావచ్చి గర్భగుడిలో ప్రవేశించాడు. తండ్రిని చూశాడు. కౌగలించుకున్నాడు. కన్నీటితో అభిషేకం చేశాడు. " తండ్రీ ! నీ ఆజ్ఞమేరకు వచ్చేశా" నన్నాడు గద్గద స్వరంతో. త్రికరణశుద్ధిగా తన్ను తానర్పించుకున్నాడు తండ్రికి. అంతకుమించి తాను చెయ్యగలిగిందిగాని చెయ్యవలసిందిగాని లేదు.

తన తండ్రి అంటే ఆలయంలో లింగమా? అరుణాచల పర్వతమా?

వాటి యందు ప్రస్ఫుటంగా ఆవిర్భవించియున్నాడేగాని. నిజానికి తన తండ్రి సర్వవ్యాపి. సర్వాంతర్యామి. సచ్చిదానంద స్వరూపి. సర్వేశ్వరుడు. సకలలోకేశ్వరుడు. సర్వనియామకుడు. ఆదిమాధ్యాంతరహితుడు. అవాంగ్మానసగోచరుడు. అనంతుడు. "లోకంబులు. లోకస్థులు. లోకేశులు తెగినతుది ఆలోకంబగు పెంజీకటి కవ్వల ఎవ్వడేకాకృతి వెలుగు" అతడే తన తండ్రి.

వెంకటరామన్‌కిది ద్యోతకమయింది.

కొంతసేపయింది. వెంకటరామన్ ఉద్వేగం శమించింది. తాపం చల్లారింది.

కన్నీరు కట్టడింది. సుఖదుఃఖాల కతీతమైన ఆనందాన్ని అనుభవిస్తున్నాడు. దానినే బ్రహ్మానుభూతి అంటారా?

అది అనుభవైకవేద్యమేగాని మాటలలో చెప్పగలిగేదా!

తండ్రికి శరణాగతి చెందడంతో తన పని ముగిసింది వెంకటరామన్‌కి. తానిప్పుడు సంకల్పరహితుడు. తండ్రి ఏది చేయిస్తే అది చేస్తాడు. ఏది పెడితే అది తింటాడు. ఎక్కడకు పంపితే అక్కడకు వెళతాడు. అతనికి తన స్వంతమనుకునే వ్యక్తిత్వం లేదింక.

వెంకటరామన్ లేచాడు. గర్భగుడిలోంచి బయటకు వచ్చాడు. ఫలానా చోటికి వెళ్ళాలనేదేమీ లేదు. తన కాళ్ళెక్కడికి తీసువెళితే అక్కడికి వెళుతున్నాడు.

ఒకచోట ఎవరో ఎదురయి "క్షవరం చేయించుకుంటావా?" అని అడిగాడు. వెంకటరామన్‌ది మెత్తని వొత్తయిన జుట్టు. నిగనిగలాడే వినీలకుంతలాలు అతనికి పెట్టని అలంకారం. అయినా, యీ కట్టెకు యీ అలంకార మెందుకని "చేయించుకుంటా" నన్నాడు. ఆ వ్యక్తి తన నొక చెరువు దగ్గరకు తీసుకువెళ్ళాడు. అక్కడొక మంగలి మొదలంటూ గొరిగేసి నాలుగణాలు పుచ్చుకున్నాడు. ఆ మంగలి దగ్గరకు తీసుకువెళ్ళిన వ్యక్తి ఎవరు? మళ్ళీ కనపడలేదే! ఏమయ్యాడు? వెంకటరామన్‌ని మంగలి కప్పగించడంతో తన పని పూర్తయ్యిందా?

సమాధానం దొరకదు.

గుండు చేయించుకున్న తరువాత స్నానం చెయ్యలేదు. "ఈ కట్టెకు స్నాన మొకటి లోటయిందా" అని వూరుకున్నాడు. ఏమి తోచిందో ఏమో, మొలతాడు తెంపేశాడు. కట్టుకున్న పంచెని పీలికలుగా చింపేశాడు. ఒక పీలికని నడుముకి కట్టుకున్నాడు - మొలతాడు లాగా. ఒక పీలికని గోచిపెట్టుకున్నాడు. మిగతా పీలికలని పారేశాడు.

అరయనినల్లూరులో భాగవతార్ దగ్గర కెంపుల దిద్దులు తాకట్టు పెట్టి పుచ్చుకున్న నాలుగు రూపాయిల్లో టిక్కట్టుకీ, క్షవరానికీ అయిన ఖర్చుపోగా

ఇంకా మూడు రూపాయిలదాకా ఉన్నాయి. తనకా డబ్బుతో పనేముందీ? తనకేది అవసరమో దాన్ని తన తండ్రి సమకూర్చడా?

ఆ డబ్బునా చెరువులోకి విసిరేశాడు.

వొంటిమీద వొడుగు జంధ్యమొకటి మిగిలింది. శరీరాలన్నీ ఒకలాగే పుట్టాయి. అటువంటప్పుడు ఇది బ్రాహ్మణ శరీరమునుమా అని చాటించే జంధ్యమెందుకు?

తీసి అవతల పారేశాడు.

సన్యాసికి జుట్టుండకూడదు. జంధ్యముండకూడదు. మొలతాడుండకూడదు. డబ్బువుండకూడదు. వెంకటరామన్ కిప్పుడివేమి లేవు. సన్యాసికి గురోపదేశం కావాలి. వెంకటరామన్‌కి తన తండ్రే ఉపదేశమిచ్చాడు మౌనంగా. సన్యాసి స్నానం చెయ్యాలి. వెంకటరామన్ చెయ్యలేదు. ఆ ఒకటీ కూడా మిగిలిపోకుండా వర్షం కురిసి తడి ముద్ద చేసింది వెంకటరామన్‌ని. చెరువులో స్నానం మానుకుంటే ఆకాశగంగే స్నానం చేయించింది.

వర్షాకాలం వచ్చి మూడు మాసాలయినా ఒక్క చినుకు కూడా పడకపోవడంచేత కటకటలాడిపోతున్నారు అక్కడి ప్రజలు. వెంకటరామన్ వచ్చిన ఆ రోజునే కుండపోతగా కురవడమేమిటీ?

శివకుమారుడు పాదం మోపిన తరువాత కూడా వర్షాభావమా!

ఇక సన్యాస దీక్షకి విరజాహోమం ఒకటి కావలసివుంది. వెంకటరామన్ కదీ పూర్తయింది. మృత్యానుభవం పొందిన క్షణం మొదలు తండ్రి నాలింగనం చేసుకునే నిమిషంవరకూ అనుభవించిన శరీరతాపం అగ్నిరూపమే కదా! అందుచేత విరజాహోమం కూడా పూర్తయినట్టే. వెంకటరామన్ ఇప్పుడు నూటికి నూరుపాళ్ళు సన్యాసి - బాలసన్యాసి.

16

సన్యాసి కొండల్లో, గుహల్లో, అడవుల్లో, తోటల్లో, నదీతీరాల్లో లేదా దేవాలయాల్లో నివసించాలి గాని, ఇళ్ళల్లో, మేడల్లో, అంతఃపురాల్లో వుండకూడదు. అందుచేత ఈ బాలసన్యాసి తన తండ్రి ఆలయంలోనే మకాం పెట్టాడు.

తిరువన్నామలైలోని అరుణాచలేశ్వరాలయం దక్షిణ దేశంలోని ఒక చాలా పెద్ద దేవాలయం. మూడు ప్రాకారాలు, పదకొండు అంతస్తుల గోపురం.

బాలసన్యాసి ఆనాడంతా ధ్యానంలోనే గడిపాడు. ఈ బాలుడిని గమనిస్తూనే వున్నాడు ఒక మౌనస్వామి. మరునాడా స్వామి ఎవరితోనో "ఈ బాలుడెవరోగాని, పాపం, నిన్నటినుంచీ ఏమీ తిన్నట్టు లేదు. కొంచెం ఏదైనా తెచ్చిపెట్టం"డన్నాడు. "అన్నాడు" అంటే సౌంజ్ఞతోనే చెప్పాడన్నమాట. మౌనస్వామి కదా! అలాగే ఆ స్వామి చెప్పినట్టుగానే వారు ఆహారం తెచ్చిచ్చారు. ఉప్పుడు బియ్యపుటన్నం, కాసిన్ని పుల్లనీళ్ళు, ఒక ఊరగాయబద్దా - ఇదీ, తండ్రి తనయుడికి పెట్టిన మొట్టమొదటి విందుభోజనం.

ఆలయంలోని వెయ్యికాళ్ళ మండపంలో కూర్చుని తపస్సు చేసుకుంటున్నాడు బాలసన్యాసి. "తపస్సు" అని అనకూడదేమో! మధురలో మృత్యానుభవాన్ని పొందిననాడే బ్రహ్మానుభూతి కలిగింది కదా! ఇంకెందుకు తపస్సు! కళ్ళు మూసుకోగానే తనకీ ప్రపంచానికీ గల సంబంధం వీడిపోయినట్టే. నిజానికప్పుడిక ప్రపంచమూ లేదు, తనూ లేదు, ఈశ్వరుడూ లేడు!

కళ్ళు మూసుకోకపోయినా అంతేనేమో! అహంకారం వున్నంత వరకే జగజ్జీవేశ్వరులు. అహంకారంలోని కారం నశించిన తరువాత మిగిలేదొకటే - అహం - అదే ఆత్మ. అది అద్వితీయం. నామరూపరహితం. సచ్చిదానంద

స్వరూపం. ఆ స్థితికోసమే యోగులు యోగాన్ని అనుష్ఠిస్తారు. మునులు మౌనాన్ని పాటిస్తారు. ఋషులు తపస్సు చేస్తారు.

17

దక్షిణాదిని కంచి ఒక గొప్ప పుణ్యక్షేత్రం. ఆ కంచిలో కామకోటిశాస్త్రులుండేవారు. ఆయన గొప్ప భక్తుడు. ఆయనికి సంతానం కలగలేదు. ఆయన సోదరుడు చిదంబరానికి నలుగురు పిల్లలు - ఇద్దరు కొడుకులూ, ఇద్దరు కూతుళ్ళూ. ఆ కూతుళ్ళిద్దరిలో ఒకామె పేరు మరకతం. ఆ పిల్లంటే శాస్త్రిగారికి పంచప్రాణాలూనూ. మరకతానికి పెళ్ళీడు రాగానే బాగా చదువుకున్నవాడూ, సౌమ్యుడూ అయిన వరదరాజులనే అబ్బాయికిచ్చి పెళ్ళిచేశారు. మరకతానికి ఎన్నేళ్ళకీ సంతానం కలగకపోయేసరికి శాస్త్రిగారికి కొంచెం బెంగ పట్టుకొంది. వారి యిష్టాదేవత కామాక్షీదేవిని ప్రార్థించారు. ఆ దేవి ప్రసన్నురాలై శాస్త్రిగారికి స్వప్నంలో దర్శనమిచ్చి "ఆ దంపతులుకి జ్ఞానకళ ఉదయిస్తుంది. కొంచెం వెన్నపెట్టు" అని చెప్పింది.

తెల్లవారింది. రాత్రి తనకొచ్చిన కలని మర్చిపోలేదు శాస్త్రిగారు. దేవి చెప్పినట్టు జరిగి తీరుతుందని త్రికరణశుద్ధిగా నమ్మారాయన. వారి ఆనందానికి మేరలేదు.

దేవి పీఠంముందు వెన్ననుంచి, దేవికి నైవేద్యం పెట్టి, అప్పుడా వెన్నను మరకతానికీ, ఆమె భర్తకీ యిచ్చారు. ఆ దేవి ప్రసాదాన్ని కళ్ళకద్దుకుని భక్తి విశ్వాసాలతో పుచ్చుకున్నారు దంపతులు.

దేవీకటాక్షం వల్ల మరకతం గర్భం దాల్చింది. నవమాసాలూ మోసి ఒక సుముహూర్తాన మగ బిడ్డను కన్నది. ఇంట్లో ఆనందం తాండవించింది. శాస్త్రిగారి మాట చెప్పనే అక్కరలేదు.

బిడ్డకు శేషాద్రి అని నామకరణం చేశారు. లేకలేక కలిగినబిడ్డ మూలాన చాలా గారాబంగా పెరిగాడు. అందమైన ముఖం. ఉంగరాల జుట్టు. జనముద్దుబిడ్డగా తయారయ్యాడు. దానికితోడు శ్రావ్యమైన కంఠం. తల్లి నేర్పిన భక్తిగీతాలని వీనులవిందుగా పాడేవాడు. చదువులో కూడా దిట్టనిపించుకున్నాడు.

శేషాద్రికి పదిహేడేళ్ళు వచ్చేసరికి తల్లి. తండ్రీ. ఇద్దరు తాతలూ దివంగతులయ్యారు. అసలే భక్తుడు. ఇప్పుడు వైరాగ్యం కూడా తోడయిందతని భక్తికి. తీవ్రంగా సాధన మొదలుపెట్టాడు. చిత్రమైన సాధన. ఒకప్పుడు స్మశానంలో కూర్చుంటాడు కళ్ళు మూసుకొని. మరొకప్పుడు నడివీధిలో కూర్చుని జపం చేస్తాడు. రోజులకు రోజులు ఏమీ తినడు. మళ్ళీ తినడం మొదలుపెడితే అదే తినడం తింటాడు.

ఎలా వచ్చాడో. ఎప్పుడు వచ్చాడో. తిరువన్నామలై వచ్చాడు శేషాద్రి. ఆ వూళ్ళో అతని మకాం ఎక్కడో ఎవరికీ తెలియదు. ఎక్కడో ఆకాశంమీంచి వూడిపడినట్టు వూడిపడతాడు. మళ్ళీ అలాగే అంతర్ధానమైపోతాడు. తనంతట తాను దర్శనమివ్వాలిగాని. మరొకలా దొరకడు ఎవ్వరికీ. పిట్టను పట్టవచ్చుగాని శేషాద్రిని పట్టలేరెవ్వరూ. కాళ్ళ కింద వరకూ పంచె కడతాడు. కండువాతో వొళ్ళంతా కప్పుకుంటాడు. కాని. అవెప్పుడూ మురికిగానే ఉంటాయి. ఎప్పుడేనా. ఎవరేనా ఒక భక్తుడు కొత్త బట్టలు కొనిస్తే వాటిని అప్పటికప్పుడే. అక్కడికక్కడే మురికి చేసి కట్టుకుంటాడు. లేదా. వాటినొక ముష్టివాడికిచ్చి వాడి చింకి గుడ్డలు పుచ్చుకుంటాడు. అకారణంగా అరగంటసేపు నవ్వుతాడు. నడివీధిలో నాట్యం చేస్తాడు. ఆకాశం కేసి గంటలు గంటలుచూస్తాడు. వీధుల్లో కప్పలాగ గెంతుతూ పోతాడు.

ఎన్ని పిచ్చిచేష్టలు చేసినా శేషాద్రిని భక్తుడిగా. సిద్ధుడిగా. జ్ఞానిగా గుర్తించారు. పిల్లలు మాత్రం "పిచ్చి శేషాద్రి" అని పిలిచేవారు. అతని మీద రాళ్ళు రువ్వేవారు.

వజ్రాన్ని వజ్రమే కొయ్యగలదు. జ్ఞానిని జ్ఞానే గుర్తించగలడు. శేషాద్రిస్వామి బాలసన్యాసిని జ్ఞానిగా గుర్తించాడు.

18

బాలసన్యాసి ధ్యానం అరుణాచలేశ్వరాలయంలోనే సాగుతోంది. సువిశాలమైన ఆ దేవాలయంలో జనసంచారం లేనిచోట కూర్చుంటాడు. ఎవరితోనూ మాట్లాడడు. కళ్ళు తెరవడు. బాహ్య స్మృతి కలిగినప్పుడు కూడా ఎవరినీ ఏదీ పెట్టమని అడగడు. ఎవరేనా పెడితే తింటాడు.

మనుషులకెంత దూరాన ఉందామనుకున్నా మనుషులు విడిచి పెట్టారు కాదు. కొందరికతను బాలసన్యాసి. కొందరికి దొంగ సన్యాసి. పిల్లలకుమాత్రం చిన్నశేషాద్రి. అనగా. పిచ్చివాడు. అందుచేతనే రాళ్ళు రువ్వడం మొదలుపెట్టారు. తగిలినా ఓర్చుకునేవాడు. శేషాద్రిస్వామి చూస్తే మాత్రం ఆ ఆకతాయిలని తరిమి కొట్టేవాడు.

అల్లరిపిల్లల ఆగడాలనుంచి తప్పించుకోవడానికి ఆ గుళ్ళో పాతాళలింగమున్న ఒక బిలంలోకి ప్రవేశించాడు బాలసన్యాసి. ఆ లింగాని పూజాపునస్కారాలు లేవుకాబట్టి అక్కడికెవరూ పోరు. చెమ్మనేల. చీకటి మ తేళ్ళూ. జెర్రెలూ. క్రిమికీటకాలూ లెక్కలేనన్ని. బాలసన్యాసిని తేళ్లు కుట్టా జెర్రెలు కరిచాయి. అతని తొడలను పురుగులు దొలిచాయి. ఏమీ తెలియదతని శరీర ధ్యాస వుంటేగా!

బాలసన్యాసిని మౌనస్వామి కనిపెట్టుకునే వున్నాడు. అతని బాహ్యస్మృతి కలిగినప్పుడు ఆహారమిచ్చేవాడు.

ఎవరెంత గుర్తించినా పిల్లలకిమాత్రం చిన్న శేషాద్రే. యథాప్రకారం ఎవ లేకుండా చూచి ఆ బిలంలోకి రాళ్ల వేసేవారు. ఒకనాడలా వేస్తూండగా

పెద్దమనిషి చూసి, వాళ్ళని తరిమేసి, ఆ ఆలయ ప్రాంగణంలోనే ఒక తోటలో వుంటూన్న కొంతమంది దగ్గరకుపోయి యిదంతా చెప్పాడు. వెంటనే వాళ్ళు బిలంలోవున్న బాలసన్యాసిని వెలికితీసుకొచ్చి చూసేసరికి అతని వొళ్ళంతా పుళ్ళు, చీమూ, నెత్తురూ కారుతోంది. అయినా బాహ్యస్మృతి లేదు. ఇదంతా చూసినవాళ్ళు ఆ బాలసన్యాసికి ధ్యానభంగం కలగకుండా ఆయన కాళ్ళకి మొక్కి వెళ్ళి పోయారు. ఆనాటి నుంచి ఆయన్ని "బ్రాహ్మణస్వామి" అని పిలవడం మొదలు పెట్టారు.

* * *

విరుపాక్షిగుహలో ఎచ్చెమ్మాళ్‌కు దర్శనమిచ్చి ఆ క్షణాన్నే ఆమె భవతాపాన్ని బాపిన బ్రాహ్మణస్వామి యీ బ్రాహ్మణస్వామే.

విరూపాక్షిగుహలోనే కావ్యకంఠ గణపతి మునీంద్రులుకి తపో రహస్యాన్నెరిగించి, వారి తపస్సునకు సార్థకతను చేకూర్చిన బ్రాహ్మణ స్వామి యీ బ్రాహ్మణస్వామే.

వీరేగాక, ఆదివ్యాధిభుజంగదష్టులయిన అశేష జనానీకానికి దర్శనమిచ్చి, శాంతిని ప్రసాదించి, వారిని పునీతులను చేసిన బ్రాహ్మణస్వామి యీ బ్రాహ్మణస్వామే.

బ్రాహ్మణస్వామి

తిరువన్నామలైలో ఒకానొక వేశ్య. ఆమెకు వయసొచ్చిన ఒక కూతురు బాల్యంలోనేవున్న ఒక కొడుకూ వున్నారు. తల్లికి అవసానదశ వచ్చింది కూతురిని పిలిచి "తమ్ముడినెలా చూస్తావో, వాడినేవిధంగానూ కష్టపెట్టక అడిగిందిస్తూండు. వాడి మీదే పంచ ప్రాణాలు పెట్టుకున్నాను" అని చెప్పింది

కూతురు తల్లిచేతిలో చెయ్యి వేసింది. "తమ్ముడిని గురించి ఏమీ బెంగపెట్టుకోకు. వాడిని కంటికిరెప్పలా చూసుకుంటా" నంది. తృప్తయింది తల్లికి. శాంతంగా వెళ్ళిపోయింది.

బాలుడు యువకుడయ్యాడు. కాని, అనేక దుర్వ్యసనాలకి లోనయ్యాడు. ముఖ్యంగా స్త్రీలోలుడు. తల్లి గడించిందంతా ఖర్చు పెట్టేశాడు. తమ్ముడిని దిద్దడానికి అక్క ఎంతేనా ప్రయత్నించిందిగాని లాభం లేక పోయింది.

ఒకనాడు తమ్ముడు వచ్చి డబ్బు కావాలన్నాడు. ఎందుకని అడిగింది అక్క. ఒక పిల్లకివ్వాలన్నాడు. అక్కకి మతిపోయింది. తను తల్లికిచ్చినమాట ప్రకారం తమ్ముడి నేవిధంగానూ కష్టపెట్ట కూడదు. ఇప్పుడు తమ్ముడు డబ్బడిగాడు. ఇద్దామంటే రాగికాని కూడా లేదు. ఏం చెయ్యాలి? కొంతసేపు సతమతమయింది. చివరకి "తమ్ముడూ, ఇంట్లో పైసలుకూడా లేవిప్పుడు. ఉన్నప్పుడు లేదనక యిచ్చాను. నీకు కావలసింది స్త్రీ సంపర్కమే కదా-నేను స్త్రీనే. మనకు తల్లి ఒకతే అయినా, తండ్రులు వేరు. అందుచేత ఫరవాలేదు. రా, సందేహించకు" అంటూ తమ్ముడి చెయ్యి పట్టుకొని మంచం దగ్గరకు తీసుకువెళ్ళబోయింది.

ఆ క్షణంలోనే తమ్ముడి కళ్ళు తెరవబడ్డాయి. జ్ఞానోదయమైంది. చెయ్యి విదిలించుకుని బయటకు పరుగెత్తాడు. ఆ చిమ్మచీకట్లో తిన్నగా వెళ్ళి బల్లాలగోపరాన్నెక్కి ఆత్మహత్య చేసుకోవాలని దుమికాడు. కాని, క్రిందపడలేదు. పడకముందే సుబ్రహ్మణ్యేశ్వరస్వామి పట్టుకుని రక్షించి షడక్షర మహామంత్రోపదేశం చేసి, ఒక జపమాలనిచ్చి పంపారు.

ఆ యువకుడే మహాభక్తుడై, తనపై నిర్హేతుకజాయమాన కటాక్ష వీక్షణముల బరిపి, పరమపాతకుడైన తనను పరమపావనునిగా చేసిన శ్రీ సుబ్రహ్మణ్యస్వామిని స్తుతిస్తూ తిరుప్పుగళ్ రచించి, అరుణగిరి నాథుడుగా ప్రఖ్యాతి గాంచాడు.

ఈ కారణం చేతనే ఆ గోపురానికి "బల్లాలగోపుర" మనే పేరు పోయి

"గోపుర సుబ్రహ్మణ్యేశ్వరాలయ" మనే పేరు వచ్చిందంటున్నారు.

* * *

మౌనస్వామి గోపుర సుబ్రహ్మణ్యేశ్వరాలయంలోనే వుంటున్నాడు. బ్రాహ్మణస్వామి నక్కడకుతెచ్చి మౌనస్వామి కప్పగించారు. మౌనస్వామి మందులూ మాకులూ రాయగా కొన్నాళ్ళకు తూట్లుపడిన బ్రాహ్మణస్వామి శరీరం బాగుపడింది.

20

మౌనస్వామి దొరికిన పండ్లు తిని, నీళ్ళల్లో పసుపూ, పంచదారా కలుపుకొని తాగుతాడు. బ్రాహ్మణస్వామికి కూడా అదే. ఆ నీళ్ళే యిస్తున్నాడు. ఈయన బాహ్యస్మృతిలో వున్నపుడు గుక్కెడు తాగుతాడు. లేకపోతేలేదు ధ్యాననిమగ్నుడై రోజులకి రోజులుండి పోయినప్పుడు మాత్రం బలవంతంగా లేపి తాగిస్తాడు. అర్చకుడొకాయన గమనించాడిదంతా. ఆయనకు జాలేసింది. గుళ్ళో దేవుడికి నైవేద్యం పెట్టడంతోటే మంచి పాలు తెచ్చివ్వడం మొదలుపెట్టాడు బ్రాహ్మణస్వామికి.

బ్రాహ్మణస్వామి నొక మహాతపస్విగా చెప్పుకోసాగారు. ఒకనాడొక ధనవంతుడూ, ఆయన స్నేహితుడూ వచ్చి చాలా సేపు కూర్చున్నారు ఆయనముందు. ఆ తరువాత లేవమన్నారాయన్ని. "ఎక్కడి" కని సౌంజ్ఞచేసి అడిగారు. ఎక్కడికో యెందుకో చెప్పారు వాళ్ళు. రానన్నారు బ్రాహ్మణస్వామి సౌంజ్ఞతోనే. వూరుకోలేదు వాళ్ళు బలవంతంగా ఎత్తుకోబోయారు. ఇద్దరూ ఆజానుబాహులే. ఇక తప్పలేదు. వాళ్ళతో నడిచివెళ్ళారు. ఆ భాగ్యవంతుడు పెట్టిన విందు భోజనాన్ని ఆరగించారు.

21

రెండు మాసాలు గడిచాయి.

బ్రాహ్మణస్వామి యిప్పుడు మౌనస్వామినీ, గోపుర సుబ్రహ్మణ్యేశ్వర ఆలయాన్నీ విడిచిపెట్టి ఒక తోటలో ప్రవేశించారు. అక్కడొకచోట ఎత్తుగా, దుబ్బుగా పెరిగిన పొదలమాటున కూర్చుని తపస్సు మొదలు పెట్టారు. ఒక పొదమాటున కూర్చున్నవారు ధ్యానంనుంచి లేచి చూసేసరికి మరొక పొదమాటున వుండేవారు. గోచీ చిరిగిపోతే నగ్నంగానే వుండిపోయేవారు. ఎవరైనామళ్ళీ ఒక గోచీ తెచ్చిస్తే పెట్టుకునేవారు.

కొన్నాళ్ళ తరవాత వాహనాల మండపంలో తపస్సు చేశారు. ధ్యానం ముగిసి చూసేసరికి ప్రారంభంలో కూర్చున్న వాహనం దగ్గర కాకుండా మరొక వాహనం క్రింద పడివుండేది వారి శరీరం.

తరువాత శివగంగతీర్థం దగ్గరా, ఆ తరువాత పిళ్ళేముంగయార్ కోవెలలోనూ తపస్సు చేశారు. ఇలా ఒక చోటినుండి మరొక చోటికి మారడం, మూగే జనసమూహంనుంచి తప్పించుకోవాలనే.

22

ఉద్ధండినాయనార్‌ది తిరుమణి అనే గ్రామం. ఆయన గొప్ప శివభక్తుడు. సంసారంమీద రోతపుట్టి, బయటకిపోయి, ఒక మఠం కట్టుకుని అందులో వుంటున్నాడు. ఎన్నో మత గ్రంథాలు చదివాడు. "వేదాంతి" అన్నారాయన్ని. కాని, ఆయనకి శాంతి చేకూరలేదు. అపరోక్షానుభూతి కలగలేదు.

ఉద్ధండినాయనార్ అరుణాచలం యాత్ర కొచ్చాడు. అరుణాచలేశ్వరుని

సేవించి. అరుణాచల పర్వత ప్రదక్షిణం చేస్తూండగా మౌనముద్రాలంకృతుడై ఒక విప్పచెట్టు క్రింద కూర్చుని ఉగ్రతపంలో నిమగ్నుడై వున్న బ్రాహ్మణస్వామిని చూశాడు. చూసీచూడగానే తనమీద పన్నీటిజల్లు కురిసినట్లయింది నాయనార్‌కి. పెన్నిధికన్న పేద చందాన పొంగిపోయాడు. బాలుడైనా యీ స్వామిని సేవిస్తే తనకొకతోవ దొరుకుతుందనుకున్నాడు. ఆ క్షణమే బ్రాహ్మణస్వామి సేవకుడయ్యాడు. జనంవల్ల స్వామికి తపోభంగం కాకుండా చూడ్డం మొదలుపెట్టాడు.

స్వామికి బాహ్యస్మృతి లేదు. అందుచేత ఆయన్ని ఎండా వానా చలీ ఏమీ చెయ్యలేకపోయాయి. పాపం. నాయనార్ కలా కాదు. కదా! అన్నిటినీ సహిస్తూ స్వామికి కాపలా కాస్తున్నాడు.

బ్రాహ్మణస్వామిని ప్రజలు ఒక మహామహిమాన్వితునిగా గ్రహించి పూజిస్తున్నారు. అయినా, ఆయనకి కొంటెపిల్లల బాధ తప్పిందికాదు. ఒకనాడొక దౌర్భాగ్యుడు స్వామి తపోనిష్ఠాగరిష్ఠుడై వుండగా ఆయన వీపు మీద మూత్ర విసర్జనచేసి తనుచేసిన ఘనకార్యానికి ఉబ్బితబ్బిబ్బవుతూ వెళ్ళిపోయాడు. నాయనార్ అప్పుడక్కడ లేడు. అక్కడెక్కడో వంట చేసుకుంటున్నాడు. వచ్చి చూసిన తరవాత ఎంతగానో నొచ్చుకుని స్వామి శరీరాన్ని శుభ్రంగా కడిగాడు.

ఆ రోజుల్లో ఒక పుణ్యాత్మురాలు స్వామికి భోజనం తెచ్చిస్తూండేది. ఒకనాడామె అలా తేకుండా వచ్చి "ఈనాడు సాధువులకు విందు చేస్తున్నాను. నువ్వు కూడా రా" అంది. స్వామి రాననీ, వూళ్ళోకి భిక్షకు వెళతాననీ సౌంజ్ఞ చేశారు. ఇక చేసేదేమీలేక ఆమె వెళ్ళిపోయింది. కాని, స్వామి భిక్షకు బయలుదేరుతారో లేదో చూడమని ఒకడిని కాపలా పెట్టిందక్కడ. స్వామికిక తప్పలేదు. ఊళ్ళోకివెళ్ళి ఒక యింటి తలుపు తట్టారు. తలుపు తెరిచి చూచిందొకామె. చూడగానే ఆమె మాతృహృదయం ద్రవించింది. ప్రేమగా లోపలకు తీసుకువెళ్ళి సుష్టుగా భోజనం పెట్టి పంపింది. పాపం, ఆమెకు స్వామి

యీడువాడే ఒక కొడుకుపోయాడట.

స్వామి తనకుగా భిక్షకు వెళ్ళడం అదే మొదటిసారి.

*　　　　*　　　　*

స్వామి తిరువన్నామలైకు వచ్చి నాలుగు నెలలయింది. వచ్చిననాడు గుండు చేయించుకున్నారు, ఎవరో పట్టి మంగలి దగ్గరకు తీసుకు వెళ్ళగా. ఇప్పుడు మళ్ళీ బాగా పెరిగింది జుట్టు. స్నానంలేదు. తైలసంస్కారంలేదు. స్వామికి భక్తురాలొకామె యిక లాభం లేదని బలవంతంగా తనింటికి తీసువెళ్ళి, తలంటి నీళ్ళుపోసి, చిక్కు దీసి తలదువ్వి పంపింది.

*　　　　*　　　　*

రత్తమ్మ దేవదాసి. కోవెలలో నృత్యం చెయ్యడానికి వెళుతూండగా స్వామిని చూసిందొకనాడు. అంతే. తన పడుపువృత్తి మీద రోత పుట్టింది. వెనక్కి తిరిగి యింటికి వెళ్ళిపోయింది. స్వామికి అన్నం పెట్టనిదే తను తిననంది. తల్లి "సరే, అలాగే పెడదాం" అంది. భోజనం పట్టుకువెళ్ళారు. స్వామి ధ్యానంలో వున్నారు. ఎంతకీ కళ్ళు తెరవరు. బలవంతంగా కళ్ళు తెరిపించి అన్నం తినిపించారు.

రత్తమ్మ ఆనాటితో వూరుకోలేదు. రోజూ అలాగే పట్టుకు వెళ్ళి తినపించసాగింది. కడుపుకోసం పడుపువృత్తి తప్పలేదామెకు. అదికూడా ఒక్కడినే నమ్ముకొని అతడితోనే వుండిపోయింది. తనకు కూతురు పుట్టి ఆమెకు యుక్తవయసురాగానే కులవృత్తిలోకి దింపకుండా పెళ్ళిచేసింది.

ఎవరైతేనేం! ఏ వృత్తి అయితేనేం! మనసు ప్రధానం. భక్తి ప్రధానం. భగవంతుడు చూసేది హృదయాంతరాళంలోకే. వేరే చూసేదేమిటి! జీవకోటి హృదయాల్లో సాక్షిమాత్రుడుగా వుంటే!

23

దేశికర్ శివభక్తుడు. అతని సమాధిమీద ఒక గుడికట్టారు. దాని పేరు గురుమూర్తము. ఆ గుళ్ళో పూజాపునస్కారాలు అన్నామలై తంబిరాన్ నిర్వహిస్తాడు. ఇది తన భుక్తికోసం చేస్తూన్న వుద్యోగంకాదు. ముక్తికోసం శ్రద్ధాభక్తులతో చేస్తూన్న పని.

తంబిరాన్ బ్రాహ్మణస్వామి తపోనిష్ఠకు సంభ్రమాశ్చర్యాలు పొంది, స్వామి నెట్లాగయినా గురుమూర్తానికి తీసుకువెళ్ళాలని నిశ్చయించుకున్నాడు. స్వామిని కనిపెట్టుకుని వుంటూన్న ఉద్దండి నాయనార్‌ను అడిగాడు.

"ఇక్కడ జనం గుంపులు గుంపులుగాచేరి స్వామికి ధ్యానభంగం కలిగిస్తూన్నమాట నిజమే. వారికి గురుమూర్త మింతకంటె ఎక్కువ అనుకూలంగా వుంటుందన్నమాటా నిజమే. గురుమూర్త మిక్కడికి ఎక్కువదూరం కాదన్న మాటకూడా నిజమే. అయితే, నేను స్వామి సేవకుడినేగాని, వారితో ఎప్పుడూ ఒక్కమాటకూడా మాట్లాడి యెరుగనే' అన్నాడు నాయనార్.

చివరికి సమయం కనిపెట్టి తంబిరానే అడిగాడు స్వామిని. అడగడంకాదు, తనకోరికను మన్నించమని ప్రార్థించాడు. స్వామి తలవూపి తమ అంగీకారాన్ని తెలిపారు.

1897 ఫిబ్రవరిలో స్వామి గురుమూర్తము చేరారు. చాలా బాగుందక్కడ. నిర్విఘ్నమైన నిష్ఠ. శరీరానికేమవుతోందో స్వామికి తెలియదు. దేహధ్యాస వుంటేగా! వొళ్ళంతా దుమ్మూ ధూళీ. జుట్టు జడలు కట్టుకుంది. గోళ్ళు పెరిగి పెరిగి వంకర్లు తిరిగాయి. గండు చీమలు కుట్టగా కుట్టగా శరీరమంతా దద్దుర్లెక్కింది. ఒక పుణ్యాత్ముడు యిదంతా చూసి స్వామికి చీమలబాధ తప్పించాలని ఒక బల్ల తెచ్చి, చీమలు పైకి ఎగబ్రాకకుండా వుండేందుకు దాని కాళ్ళు నీళ్ళల్లో వుంచి దాని మీద కూర్చోపెట్టాడు స్వామిని. చూచేవాళ్ళకి

బాధకాని, స్వామి అప్పుడూ, యిప్పుడూ, ఎప్పుడూ ఒకటే. వారంటూ ఒకరున్నారనీ, వారికొక శరీరమనేది వున్నదని తెలియని స్థితి.

స్వామి కఠోరదీక్షను గురించి జనం చెప్పుకోసాగారు. వారి వయస్సుకొన్ని వందల సంవత్సరాలనీ, ఆవిషయం వంకర్లు తిరిగిన గోళ్ళను బట్టే తెలుస్తుందనీ, సిద్ధులు కాబట్టి బాలుడుగా కనపడుతున్నారనీ ఒకరు, సంతానం లేనివాళ్ళకి మంత్రజలం యిస్తారనీ, చాలామందికిచ్చారనీ వాళ్ళందరకీ బిడ్డలు పుట్టారనీ మరొకరు, ఎటువంటి దీర్ఘరోగాలనైనా విభూతినచ్చి నయం చేస్తూన్నారని వేరొకరు.

ప్రజలు ఊహాగానాలూ, కట్టుకథలూ మిన్నుముట్టాయి. దానితో గొప్ప చిక్కొచ్చిపడింది. తీర్థప్రజలా రావడం మొదలుపెట్టారక్కడికి. సంతానప్రాప్తికి స్తోత్రాలు. ఆయురారోగ్యయిశ్వర్యాలకి ప్రార్థనలు, మ్రొక్కులు, సేవలు, నైవేద్యాలు - ఒకటేమిటి! నానా హడావిడీ, హంగామా.

జనం తోసుకుని స్వామిమీద పడకుండా చుట్టూ దడికట్టారు. తంబిరానూ, నాయనారు. అయినా, స్వామి తాము పెట్టిన నైవేద్యాన్నే ఆరగించాలని పట్టు ఎవరికి వారికే. అదెలా సంభవం? అందుచేత వారాలు ఏర్పాటు చేశారు. అలా లాభం లేకపోయింది. వారానికి ఏడురోజులే. భక్తులో? వేనవేలు. గత్యంతరంలేక భక్తులు పెట్టిన నైవేద్యాలన్నింటిని కలిపెయ్యడం మొదలుపెట్టారు. అందులో పాలు ఎక్కువ కాబట్టి పల్చగా తయారయ్యేది. స్వామి యెప్పుడో కళ్ళు తెరిచినపుడు వారికొక గిన్నెడు యిచ్చేవారు. అప్పుడు మిగతాది ప్రసాదమయ్యేది. దానిని భక్తులు, ఆర్తులూ, జిజ్ఞాసులూ, అందరూ తలొకకాస్త కళ్ళకద్దుకుపుచ్చుకునేవారు.

ఒకనాడొక భక్తురాలు నూనే, సీకాయీ తీసుకొచ్చి, ఒక పెద్ద కడవనిండా నీళ్ళుకాచి, స్వామిని రమ్మంది. ఆయన కదల్లేదు. ఆమె వూరుకుందా? స్వామినీ రెక్కపట్టుకు తీసుకువచ్చి కూర్చోపెట్టి, జడలు విడదీసి, తలంటుపోసి మరీ వెళ్ళింది. స్వామి భక్తపరాధీనుడుకదా! భక్తులేమిచేసినా వూరుకోవలసిందే.

ంబిరాన్ స్వామికి గుళ్ళో దేవుడికి చేసినట్లు ధూప. దీప ఆవాహన ర్చనాదులు ప్రారంభించాడు. ఇలా చేస్తూన్న సమయంలోనే స్వామి కళ్ళు తెరిచి చూశారొకనాడు. చూసి. అక్కడి గోడ మీద ఒక బొగ్గుతో 'ఈ కట్టెకు యిందంతా యెందుకు? దీనికి కావలిసిందల్లా దీనికుక్షి నింపడమే'' అని రాసి చూపారు. అయినా తంబిరాన్ మానలేదు. స్వామికి అవసరం లేకపోవుగాక! తనకో? తనకు తృప్తి మరోలా ఎలా కలుగుతుంది! తంబిరాన్ తన పని తను మానకపోయేసరికి అక్కడనుంచి లేచిపోయారొకసారి. అక్కడితోతంబిరాన్ విరమించుకోక తప్పలేదు.

*   *   *

వెంకటరామయ్యర్ తాలూకా శిరస్తాదార్. స్వామి భక్తాగ్రగణ్యులలో ఒకడు. అతనికి నానాటికీ స్వామి వూరూ పేరూ తెలుసుకోవాలనే కుతూహల మెక్కువయింది. ఇక వుండబట్టలేక ఒకనాడు అడిగాడు. స్వామి పలకలేదు. అప్పుడొక పేపరూ. పెన్సిలూ తెచ్చి ''మీరుమౌనులు కాబట్టి. మీ మౌనానికి భంగం వాటిల్లకుండా వుండేందుకు యీ పేపరూ పెన్సిలూ యిస్తున్నాను. మీ పేరూ. వూరూ రాసి చూపండి. అలా చూపేవరకూ నిద్రాహారాలూ. సమస్తమూమాని యిక్కడే కూర్చుంటానని సత్యాగ్రహం మొదలుపెట్టాడు.

ఇక స్వామికి తప్పలేదు. ''వెంకటరామన్-తిరుచ్చుళి'' అని రాసి చూపారు. అక్కడితో వెంకటరామయ్యర్ కుతూహలం తీరింది.

*   *   *

తంబిరాన్ ఒక తప్పనిసరి పనిమీద పొరుగూరు వెళ్ళాడు. తంబిరాన్ వెళ్ళిన కొద్దిరోజులకే నాయనార్‌కు కూడా అత్యవసర పరిస్థితి ఏర్పడింది. స్వామిని విడిచిపెట్టలేక విడిచిపెట్టలేక అతనూ వెళ్ళిపోయాడు. అదేదో వూరు.

స్వామి కిప్పుడు పరిచారిక లోప మేర్పడింది.

24

పలనిస్వామి మళయాళీ. విఘ్నేశ్వర భక్తుడు. తను తినే ఉప్పూ ప్కారంలేని సాత్వికాహారాన్నే విఘ్నేశ్వరుడుకి నైవేద్యం పెట్టి ఆ ప్రసాదాన్ని ఆరగిస్తాడు. అక్షరజ్ఞానం మాత్రమే వుందతనికి. అయినా ఓపిగ్గా కూర్చుని వేదాంత గ్రంధాలు చదువుతాడు. పలని స్వామిని బాగా ఎరుగున్న ఒక అయ్యర్‌గారు ''పలనీ. రాతి విగ్రహాలని పూజించి ఏంలాభం? గురుమూర్తములో ప్రత్యక్ష దైవమున్నాడు. అక్కడికి పోరాదూ'' అన్నాడు. వెంటనే అక్కడున్న వాళ్లకూడా ''అవును పలనీ. ఆయన ధృవుడువంటి బాలుడు. మహాతపశ్శాలి. వారిని సేవించుకునే మహద్భాగ్యం పూర్వజన్మ సుకృతం వుంటేగాని లభించదు'' అన్నారు.

పలనికి పూర్వజన్మ సుకృతం వుంది. అందుచేతనే కాలయాపన చెయ్యకుండా గురుమూర్తము వెళ్లాడు. స్వామి పరిచర్యకుపక్రమించాడు.

పలనికి స్వామిపై భక్తి విశ్వాసాలు దినాదినాభివృద్ధినొందాయి. సంపూర్ణ శరణాగతి చెందాడు. వినాయకపూజని మానుకున్నాడు. తల్లిగా. తండ్రిగా. గురువుగా. దైవముగా స్వామినే భావించాడు.

పలనికి స్వామి దర్శనార్థం వచ్చే ప్రజాసమూహాన్ని అదుపుచెయ్యడం ఒక పెద్ద పనయి కూర్చుంది. దీనికితోడు. స్వామి ధ్యానంలో నిమగ్నులై రోజులకి రోజులుండి పోవడం మూలానా. తగినంత ఆహారం తీసుకోకపోవటం మూలానా చిక్కి శల్యమైపోయారు. అడుగు వెయ్యలేక తూలిపోవటం మొదలుపెట్టారు. పలని తను చెయ్యగలిగినంతా చేశాడు. అయినా. జనసందోహం వల్ల స్వామికి చికాకు ఎక్కువయింది. ఓర్చుకోలేని స్థితికి వచ్చారు.

గురుమూర్తానికి చేరువలోనే ఒక మామిడితోట వుంది. దానికి గుమ్మం. తలుపులూ వున్నాయి. ఆ తోట యజమాని వెంకటరామనాయకర్ స్వామికి కలుగుతూన్న యిబ్బందిని చూసి. స్వామి దగ్గరకు వెళ్ళి. వారిని తన తోటలోకి

రమ్మని ప్రాధేయపడ్డాడు. అక్కడ జనం చేరకుండా గట్టి బందోబస్తు చేస్తానన్నాడు. స్వామి అంగీకరించారు.

స్వామి, పలనీ ఆ మామిడితోటలోకి మకాం మార్చారు. అక్కడొక మంచెకట్టి దానిమీద గూడు వేశారు. అందులోనే స్వామి కాపురం. స్వామి మంచె కెదురుగా మరొక చిన్నమంచె. అందులో పలని నివాసం. ఇద్దరూ ఆ తోట కాపర్లులాగా తయారయ్యారు.

జనం, గందరగోళం, గలాభా తగ్గిపోయాయి. దానితోపాటు నైవేద్యాలూ తగ్గిపోయాయి. పలని వూళ్ళోకి వెళ్ళి భిక్షాన్నం తెస్తాడు. స్వామీ, తనూ ఆరగిస్తారు.

స్వామి ధ్యానం నిర్విఘ్నంగా సాగుతోంది.

25

మధురలో వెంకటరామన్ యిల్లు విడిచి వెళ్ళిపోయిననాటి సాయంకాలం సుబ్బయ్యర్ యింట్లో...

"స్పెషల్ క్లాసు వుందని వెళ్ళిన వెంకటరామన్ యింకా రాలేదేమీ? కారణమేమైవుంటుందీ? ఎక్కడికి వెళ్ళివుంటాడు? ఏ స్నేహితుడింటికేనా వెళ్ళివుంటాడా అంటే, స్నేహాలు మానుకుని చాన్నాళ్ళయిందే!"

నిమిష నిమిషానికి వాళ్ళ కంగారెక్కువవుతోంది. అన్న నాగసామీ, పినతండ్రి సుబ్బయ్యర్, మరికొంతమందీ వెతకడానికి బయలుదేరారు. ఇంట్లో పిన్నమ్మ దేవుడికి వెయ్యి దణ్ణాలు పెడుతూ కూర్చుంది.

బాగా రాత్రయింది. నాగసామీ, సుబ్బయ్యర్, యింకా వెతకడానికి వెళ్ళినవాళ్ళూ చేతులూపుకుంటూ తిరిగొచ్చారు.

నాగసామికేదో గుర్తొచ్చి తన పెట్టెతీసి చూశాడు. తమ్ముడు రాసిపెట్టిన ఉత్తరం దొరికింది. ఆత్రంగా చదువుకున్నారందరూ.

"మూడు రూపాయలతో ఎన్నాళ్ళు బ్రతకగలడూ? అవికాస్తా అయిపోగానే తనే వచ్చేస్తాడు ఆవురావురుమంటూ" అన్నారు కొందరు.

తమ్ముడిలో వచ్చిన మార్పుని గ్రహించిన అన్న నాగసామి మాత్రం అలా అనుకోలేదు. పినతండ్రితోటి, పినతల్లితోటి సంప్రదించి తల్లికి టెలిగ్రాం యిచ్చాడు.

మానామదురలో ప్లీడర్‌గా పనిచేస్తున్న మరిది నెల్లియప్పయ్యర్ దగ్గర వుంటోంది అళగమ్మ. నాగసామి యిచ్చిన తంతివార్త వినగానే కుప్పకూలి పోయింది. మీద పిడుగుపడ్డట్టు అయింది. భర్తపోయిన దుఃఖాన్నింకా దిగమింగకుండానే యిప్పుడిదొకటా? గోరుచుట్టుమీద రోకలిపోటు పడ్డట్టే అయిందామెకు.

"అన్న ఏమి తిట్టాడో, సుబ్బయ్యర్ ఏమన్నాడో, పిన్నమ్మ ఏ బరువు బిందెలు మోయించిందో ఏమయిందో"- యిలా అనుకోవడం మొదలు పెట్టారు అళగమ్మా, ఆమె మరిదిగారూ, ఆమె తోటికోడలూ.

వెంటనే మధురకు ప్రయాణంకట్టి వెళ్ళారంతా.

అందరూ ఒక చోట కూడారు. బాగానే వుంది. అళగమ్మకు ధైర్యం చెపుతున్నారు. మంచిదే. ఎక్కడెక్కడికో వెళ్ళి చూసివస్తారు. ఫలితం మాత్రం శూన్యం.

ఒకనాడొక గాలివార్త - త్రివేండ్రంలో ఒక నాటక సమాజంలో వున్నాడని. వెంటనే బయలుదేరి వెళ్ళారు అళగమ్మా, నెల్లియప్పయ్యర్ కొండంత ఆశతో. వెంటనే తిరిగివచ్చారు కొండంత నిరాశతో. వెంకటరామన్‌అక్కడుంటేగా

వెంకటరామన్ కోసం వెతకడం మానలేదు. కాని, ఫలితం లేకపోతోంది. విచారిస్తున్నారు. ఆశాజ్యోతి క్షీణించిపోతోంది. కాని పూర్తిగా ఆరిపోలేదు.

నాగసామికి చదువు పూర్తయింది. రిజిస్ట్రార్ ఆఫీస్‌లో గుమాస్తాపని దొరికింది. అతని భార్యకూడా కాపురానికొచ్చింది. అళగమ్మకు కాస్త ఊరట.

*　　　　*　　　　*

పాపం. అంతలోనే ఒక దుర్ఘటన. సుబ్బయ్యర్ చనిపోయాడు. సుబ్బయ్యర్ వ్యవహారాలు కూడా నెల్లియప్పయ్యరే చక్కబెట్ట వలసివచ్చింది.

ఒకనాడంతా కూర్చునుండగా ఒక యువకుడు పరుగెత్తుకుంటూ వచ్చాడక్కడికి. చేటంత ముఖం చేసుకుని "మన వెంకటరామన్ ఆచూకీ దొరికిం"దన్నాడు. అందరూ విన్నారుగాని ఎవరూ ఎగిరి గంతెయ్యలేదు. ఇటువంటి గాలివార్తలు చాలా విన్నారు వాళ్ళు. అయినా "ఎక్కడున్నాడు ఏం చేస్తున్నాడు? ఎవరు చూశారు? నీకెవరు చెప్పారు? అని అడిగారు.

"నేను కొంచెం పనిమీద తిరుజ్ఞాన సంబంధ మఠానికి వెళ్ళాను. వెళ్ళేసరికి, అక్కడొకాయన ఒక బ్రాహ్మణస్వామి కఠోరతపస్సునీ, మహిమలని భక్తి వుట్టిపడుతూ వర్ణిస్తున్నాడు. నాకు కొంచెం అనుమానం కలిగింది. ఆ బ్రాహ్మణస్వామి మన వెంకటరామన్ ఏమోనని. అతను వెంకటరామనే. తిరువన్నామలైలో వున్నాడట. మౌనం పట్టి మాట్లాడ్డం లేదట. ఎవరో బలవంతం పెట్టి అడగ్గా తన పేరూ, వూరూ వెంకటరామన్ - తిరుచ్చుళి - అని రాసి చూపించాడటకూడాను. ఇదంతా చెప్పినాయన పేరు అన్నామలై తంబిరాన్. ఈయనది ఆ వూరేనట. మన వెంకటరామన్‌కి కొన్నాళ్ళు సేవచేసినట్టుకూడా చెప్పాడు."

ఇక నమ్మక తప్పిందికాదు. అళగమ్మ ఆశాలత మళ్ళీ చిగురించింది. నెల్లియప్పయ్యర్, వారి బంధువొకాయనా బయలుదేరారు తిరువన్నామలైకి.

26

నెల్లియప్పయ్యర్, వారి బంధువూ తిరువన్నామలై చేరారో లేదో, తమ వెంకటరామన్ ప్రతిభా విశేషాలు వినడం మొదలుపెట్టారు. తిన్నగా ఆ మామిడితోటకు వెళ్ళారు. కాని, అక్కడ గురుమూర్తంలో మాదిరి కాదుగా ఆ తోట యజమాని ఎవరినీ లోపలికి అడుగు పెట్టనియ్యడు. స్వామికి తపోభంగం కానియ్యడు. అందుచేతనే నెల్లియప్పయ్యర్‌నీ, వారి బంధువుని గుమ్మం దగ్గరే నిలబెట్టేశాడు.

"వాడు మావాడేనయ్యా, ఒకసారి చూసి వస్తా"మన్నారు. లాభంలేదని సైంధవుడిలా అడ్డుకున్నాడు నాయకర్. "పోనీ ఒక చీటీయిస్తాం, తీసుకువెళ్ళి చూపించు, అనుమతిస్తేనే పోనిద్దువుగాని" అన్నారు వాళ్ళు. అతి కష్టం మీద ఒప్పుకుని ఆ చీటీని తీసుకువెళ్ళి స్వామికిచ్చాడు నాయకర్.

ఆ చీటీలో "మానామదుర ప్లీడరు నెల్లియప్పయ్యర్ తమ దర్శనం కోరుతున్నాడు" అని వుంది.

అవును మరి. మరొకలాగెలా రాయగలరూ? "నాయనా వెంకటరామన్" అని రాస్తే, తీరా ఆ స్వామి వెంకటరామన్ కాకపోతే! అందుకనే అలా రాసి పంపారు.

ఆ చీటీని చదువుకున్నారు స్వామి. వాళ్ళని రానిమ్మని సౌంజ్ఞ చేసి చెప్పారు. నాయకర్ స్వామి సమక్షానికి తీసుకొచ్చాడు వారిని.

స్వామిని చూడ్డంతోనే వాళ్ళకున్న రవ్వంత సందేహమూ తీరిపోయింది. తమ వాడే. వెంకటరామనే. నెల్లియప్పయ్యర్‌కి సంతోషం, సంతాపం ఒక్కసారిగా పెల్లుబికాయి. అంతటివాడయి నందుకు సంతోషం. చిక్కి శల్యమై దుమ్ము కొట్టుకుని వున్నందుకు సంతాపం. దాదాపొక రెండేళ్ళ తరువాత చూసినందుకు సంతోషం. అటువంటి దుస్థితిలో వున్నందుకు సంతాపం.

శరీరాలనిదాటి చూడగలవాళ్ళెంతమందీ!

"నాయనా. వెంకటరామన్. రా బాబూ వెళ్ళిపోదాం. నీ తపస్సుకు మేమెవ్వరం అడ్డురాం. నువ్వు సంసారివి కానక్కరలేదు. ఇంట్లోకూడా వుండనక్కరలేదు. మన మానామదురలోవున్న మహాత్ముని సమాధిపై కూర్చుని, నీ ధ్యానం నువ్వు చేసుకుందువు గాని. మీ అమ్మ నీకోసం బెంగపెట్టుకుని కృశించిపోయింది బాబూ. నిన్ను చూసిందాకా ఆమె కన్నీరు కట్టడదు. నాగసామీ. నీ పిన్నమ్మలూ. మేమంతా చాలా బాధపడుతున్నాం నాయనా."

ఇలా చెప్పుకుపోయాడు నెల్లియప్పయ్యర్. పలనీ. నాయకర్ అక్కడే వున్నారు. నెల్లియప్పయ్యర్ మొర స్వామికి వినిపించినట్టు లేదు. శిలాప్రతిమలా అలాగే వుండిపోయాడు. పలనితో. నాయకర్‌తో చెప్పుకుని గోలపెట్టాడు నెల్లియప్పయ్యర్. వాళ్ళు బాధపడ్డారుగాని అంత కంటే ఏం చెయ్యగలరూ!

నెల్లియప్పయ్యరూ. వారి బంధువూ అయిదారు రోజులుండి పోయారక్కడ. శతవిధాల చెప్పిచూశారు. స్వామిలో చలనం కనపడలేదు. కట్టకడపటి ఉపాయంగా. ఆ బంధువు బలవంతంగా తీసుకు వెళ్ళాలని చూశాడు. స్వామిని సమీపించాడు. ఇంకా తాకలేదు. వొళ్ళంతా మంటలు పుట్టుకొచ్చాయి. అంతటితో తగ్గి తన దుస్సాహసానికి చెంపలు వేసుకున్నాడు.

తపోనిధులతో చెలగాటమా?

వెళ్ళినవారిద్దరూ తిరిగి వచ్చారు మానామదురకి. జరిగినదంతా పూస గుచ్చినట్టు చెప్పారు. అళగమ్మ కడుపు ఒక్కసారిగా సముద్రమయి పోయింది. కన్నకడుపు కదా!

"బాబూ. నువ్వూ నేనూ వెళదాం. రా. తల్లిని - నా ముఖం చూసేనా. నా దుఃఖం చూసేనా రాకమానడు నా తండ్రి. నవమాసాలు మోసి. కని. పెంచి. ప్రాణాలన్నీ వాడిమీదే పెట్టుకున్నానని తెలియదా నా బాబుకి" అంది అళగమ్మ పెద్దకొడుకు నాగసామితో.

"అలాగే వెళదాం. నాకు సెలవు దొరకనీ" అన్నాడు నాగసామి.

27

శంకరభగవత్పాదులవారెప్పుడో తిరువన్నామలైలో ఒక లింగ ప్రతిష్ఠ చేశారు. అక్కడే అరుణగిరినాథర్ దేవాలయం వెలిసింది.

స్వామికి మామిడితోటలో నివాసం చాలా నచ్చింది. అయినా. ఏ కారణం చేతనో అక్కడ నుంచి అరుణగిరినాథర్ దేవాలయానికి మకాం మార్చారు. అంతేకాదు."నీ తోవ నువ్వు చూసుకో" అన్నారు పలనితో. పలని వెళ్ళిపోయాడు. కాని. మళ్ళీ సాయంత్రానికే తిరిగి వచ్చాడు. అదేమని అడిగారు స్వామి "మిమ్మలిని విడిచి మీ నీడ వుండగలదా?" ఎదురు ప్రశ్న వేశాడు పలని.

స్వామి స్వయంగా భిక్షకు వెళ్ళడం మొదలుపెట్టారు. సాధారణంగా రాత్రులే వెళతారు. లాంతర్లు వెలిగించుకుని స్వామి రాకకు ఎదురు చూస్తుంటారు చాలామంది గృహస్థులు. స్వామి ఎవరో ఒకరింటికే వెళ్ళి. గుమ్మం ముందు నుంచుని చప్పట్లు కొడతారు. వెంటనే ఆ యింటివారు వచ్చి భక్తి పురస్సరంగా స్వామి దోసిట్లో భిక్ష పెడతారు. స్వామి తిరిగి వెళ్లిపోతూ తోవలోనే తినేస్తారు తమ దోసిట్లోది.

* * *

గంభీరంవారు తెలుగు బ్రాహ్మణులు. అక్కన్న మాదన్న వంశం వారట. ఒకనాడు స్వామి ఆ గంభీరంవారి యింటిముందాగి చప్పట్లు కొట్టారు. ఆ సమయంలో యింటి యజమాని కృష్ణయ్యర్ స్నేహితులతో కూర్చుని పేకాడుతున్నాడు. స్వామి రాకకు తన గృహం పావనమయిందని సంతోషించినా. ఆ సమయంలో తను పేకాడుతున్నందుకు సిగ్గుపడ్డాడు. అన్నం కలిపితెచ్చి స్వామికి భిక్ష పెట్టాడు. స్వామి ఆయన కేసి చూసి వెళ్ళిపోయారు. ఆ తరువాత కృష్ణయ్యర్ జీవితాంతం పేక ముట్టుకోలేదు.

తపోధనుల కటాక్ష వీక్షణాలు జీవితాలనే మార్చేస్తాయి.

* * *

స్వామి అరుణగిరి నాథర్ దేవాలయంలో ఎన్నో రోజులుండ లేదు. జనం మూగుతున్నారని అక్కడినుంచి అరుణాచలేశ్వర దేవాలయ గోపుర అంతస్తులోకి మకాం మార్చారు. అక్కడా ఎన్నో రోజులుండలేదు. అక్కడను దేవాలయం ప్రాంగణంలోనే వున్న కస్తూరి పొదలమాటుకు చేరారు. కాని అక్కడ కూడా ఒక వారం రోజులు కంటే ఎక్కువ వుండలేదు. అక్కడి న ప్రవాళపర్వతం(పవళకున్రు) మీదికి వెళ్లారు.

స్వామిని విడిచిపెట్టలేదు పళని. నీడలాగే అంటిపెట్టుకుని వున్నాడు.

* * *

గౌతముడు అహల్యని రాయి కమ్మని శపించాడు. నిర్దోషి అయిన అహల్యకు కోపమొచ్చింది. "ఓ బుద్ధిలేని మునీ...." అని ఏదేదో అంది. ఆ మహా పతివ్రత వాక్కు శాపమై గౌతముడి బుద్ధి నశించింది. తన శాప విముక్తికై గౌతము యీ ప్రవాళపర్వతం మీదనే తపస్సు చేశాడట.

28

ప్రవాళపర్వతంమీద ఒక శివాలయం, ఒక గుహ, ఒక చిన్న తటాకం వున్నాయి. భిక్షకి పలని వెళుతున్నాడు. తెచ్చినదాన్ని స్వామీ తనూ ఆరగిస్తారు. ఒక్కొక్కప్పుడు స్వామి కూడా వెళతారు భిక్షకి.

స్వామి యీ ప్రవాళపర్వతంమీద వుండగానే తల్లి అళగమ్మా, అన్న నాగసామీ వచ్చారక్కడికి. తల్లి కొడుకును చూసి రెండేళ్ళు దాటింది. ఇప్పో

చూడగానే తల్లి కడుపు భగ్గుమంది.

తుప్పలా పెరిగి జడలు కట్టుకుపోయిన జుట్టు, పొడుగ్గా పెరిగి వంకర్లు తిరిగిపోయిన గోళ్ళు, దుమ్ముకొట్టుకుపోయిన వొళ్ళు, చిక్కి శల్యమైపోయిన శరీరం, పుట్టగోచీ.

ఇంగ్లీషు చదువులు చదివి వూళ్ళేలుతాడనుకొన్న తన కొడుకేనా యీ అవతారం!

ఎవరేమన్నారని, యీ దుస్థితి కొని తెచ్చుకోవడం! హాయిగా యింటిపట్టున పడివుండక, ఎండకి ఎండుతూ, వానకి తడుస్తూ, ఎందుకీ చెట్టుని పుట్టనీ పట్టుకు వేళ్ళాడ్డం! హాయిగా మూడుపూట్లా తింటూ కూర్చోక ఏం ఖర్మ వచ్చిందనీ యీ అడుక్కు తినడం?

అళగమ్మ బావురుమని ఏడ్చింది. కొడుకు కడుపూ గడ్డం పట్టుకొని "ఇకనైనా రారా బాబూ, యింటికి పోదా" మంది. స్వామి నల్లరాయి, శిల. తల్లి నిన్నాళ్ళకు చూశానన్న సంతోషం లేదు. రాళ్ళు కరిగేటట్టు ఏడుస్తోందికదా అన్న జాలి లేదు. నిశ్చలంగా కూర్చుని వున్నారు.

తల్లి కన్నీరు కట్టడడం లేదు. "ఎంత పాపం చేశానో. మీ నాన్నగారితో వెళ్ళిపోయాను కాదు. ఇన్ని కష్టాలు పడమని నా మొహాన రాశాడు ఆ బ్రహ్మదేవుడు. నిన్నీవేళ యిలా చూస్తానని ఎప్పుడేనా కలగన్నానా? ఇంకా ఎంతనుభవించవలసి వుందో యీ జన్మకి."

తల్లి గోలెక్కువయింది. స్వామి అక్కడి నుంచి లేచి వెళ్ళి పోయారు. ఇంకేం చెయ్యాలి! ఎవరితో చెప్పుకోవాలి తన గోడు! అళగమ్మా, నాగసామీ కొండదిగి వూళ్ళోకి వెళ్ళిపోయారు.

మరునాడు తల్లీ, అన్నగారు వచ్చేసరికి స్వామి చుట్టూ భక్తులున్నారు. మళ్ళీ మొదలు. అళగమ్మ ఏడుపూ, గోలా. అక్కడి వాళ్ళందరితో మొరబెట్టుకుంది. వాళ్ళ గుండెలు కరిగాయిగాని, స్వామిలో చలనం రాలేదు. అప్పుడు భక్తులే "స్వామీ, యీమె తమను కని పెంచిన తల్లి. తల్లికంటె వేరు దైవం లేదని మేము మీకు

చెప్పాలా! అటువంటి తల్లి రాళ్ళుకూడా కరిగేటట్లు ఏడుస్తుంటే మీరేమీ పలక్కుండా వుండడం ధర్మం కాదు. మీరు మౌనులు కాబట్టి మాట్లాడక పోతే పోనీలెండి. ఆమె కేదయినా రాసి చూపండి" అంటూ ఒక కాగితం, పెన్సిలూ యిచ్చారు.

స్వామి యిలా రాసిచ్చారు.

"కర్త అయిన పరమేశ్వరుడు జీవులుని తమ తమ ప్రారబ్ధకర్మల ననుసరించి ఆడిస్తున్నాడు. ఏది జరగవలసివుందో అది ఎవరెంత అడ్డుపడినా జరిగే తీరుతుంది. ఏది జరగకూడదని వుందో అది ఎవరెంత ప్రయత్నించినా జరగదు. అందుచేత మౌనమే శరణ్యం."

స్వామి ప్రథమోపదేశమిది.

కొడుకును తనతో యింటికి తీసుకువెళ్ళగలననే ధీమాతో వచ్చిన అళగమ్మ ఆశ అడియాసయింది. అక్కడ- తిరువన్నామలైలో కొన్నాళ్ళుండి, రోజూ చిన్నకొడుకు దగ్గరే కాసేపు కూర్చుంటూ, చివరికొకనాడు విడిచిపెట్టలేక విడిచిపెట్టలేక విడిచిపెట్టి, పెద్దకొడుకుతో తిరిగి మానామదుర వెళ్ళిపోయింది. తమ వంశంవారికి ఎప్పుడో శాపమిచ్చిన సన్యాసిని తిట్టుకుంటూ.

29

చిన్నకొడుకుని అరుణాచలంలో అరుణాచలేశ్వరుడికే వప్పచెప్పి అళగమ్మ మానామదురకు వచ్చింతరవాత, ఏడాది తిరిగే సరికే పెద్దకొడుకు నాగసామి- సుమారు పాతికేళ్ళ వాడు - మంచి వుద్యోగం చేస్తున్నవాడు నిండు యౌవ్వనంలో వున్నవాడు హరీ అన్నాడు.

అళగమ్మ తల్లి వ్యధ నెవ్వరు వర్ణించగలరూ! ఏడ్చింది. వెక్కి వెక్కి ఏడ్చి గుండెలు బాదుకుంది. మొత్తుకుంది. చివరకు జీవచ్ఛవమై కూర్చుంది.

"జీవుల ప్రారబ్ధకర్మానుసారమే పరమేశ్వరుడు ఫలితాలని ముట్ట చెపుతూంటా"డని చిన్నకొడుకు చెప్పాడు! తన జన్మజన్మాంతరాల దుష్కర్మల ఫలితం తనుగాక మరెవరనుభవిస్తారూ!

వైరాగ్యం వృద్ధవుతూన్న కొద్దీ దుఃఖాన్ని దిగమింగసాగింది అళగమ్మ.

పాపం, నాగసామి భార్య అంత చిన్నతనంలోనే వైధవ్యం! సంతానమైనా కలగలేదు, బిడ్డలను చూచుకుంటూ దుఃఖాన్ని దిగమింగుదామంటే.

"నుదుట వ్రాసిన వ్రాలుకన్న కలదే నూరేళ్ళు చింతించినన్."

30

ఒకప్పుడు బ్రహ్మదేవుడికీ, విష్ణుమూర్తికీ మధ్య గొప్ప వివాద మొచ్చింది. నేను గొప్పంటే నేను గొప్పని వాదించుకోవడం మొదలు పెట్టారు. వీరి తగువెవరు తీర్చగలరూ! వాదన తెగడంలేదు.

ఇంతలో వాళ్ళిద్దరికీ మధ్య ఆకస్మికంగా ఆకాశన్నంటుకుంటూ ఒక జ్యోతి స్తంభం లేచింది. ఈ అద్భుతాన్ని చూడగానే బ్రహ్మ, విష్ణువు లిద్దరూ దిగ్భ్రాంతి చెందారు. ఇలా ఎందుకు సంభవించిందో వారికి అర్థం కాలేదు. అంతలో వారికొక ఆలోచన తట్టింది. ఆ జ్యోతి స్తంభం యొక్క ఆద్యంతాలు కనుక్కోవాలనీ ఎవరు కనుక్కుంటే వారు గొప్పవారనీ, సరేనంటే సరేననుకున్నారు.

విష్ణుమూర్తి వరాహరూపం దాల్చి ఆదిని కనుక్కోడానికి భూమిని దొల్చుకుంటూ వెళ్ళాడు. బ్రహ్మదేవుడు హంసరూపంలో అంతు కనుక్కోడానికి ఆకాశాని కెగిరాడు.

సంవత్సరాలు, యుగాలు, మన్వంతరాలు గడిచిపోయాయి. ఆ జ్యోతి స్తంభం ఆద్యంతాలు దొరకలేదు ఇద్దరికీ కూడా.

ఒకనాడు బ్రహ్మదేవుడు ఒక మొగలిరేకు పడుతూండడం చూశాడు. దాన్ని ఆపి అడిగాడు "ఎక్కడినుంచి వస్తున్నా"వని "ఎక్కడి నుంచో తెలియదు. కొన్ని యుగాలయింది. ఇలా పడుతూనే వున్న"నంది ఆ మొగలి రేకు. బ్రహ్మదేవుడు ఆశ్చర్యపోయాడు. ఇంతలో, తనింకా తన ఆశ్చర్యాన్నుంచి తేరుకోకుండానే ఒక కపిలగోవు వస్తూండడం చూశాడు. దాన్ని కూడా ఆపి మొగలిరేకు నడిగినట్టుగానే అడిగాడు. ఆ గోవు కూడా మొగలి రేకు చెప్పినట్టుగానే చెప్పింది.

దానితో ఆ జ్యోతి స్తంభం అంతు చూడగలననే ఆశ బ్రహ్మదేవుడి కడుగంటిపోయింది. వెంటనే బుర్రలో ఒక ఆలోచన తళుక్కున మెరిసింది. ఆ మొగలిరేకుతోటీ, ఆ కపిలగోవుతోటీ "మీరు నాకొక సహాయం చెయ్యాలి. నేనూ, విష్ణుమూర్తి పందెం వేసుకున్నాం. నేనీ జ్యోతి స్తంభం అంతం చూశానంటాను. అవునని మీరు సాక్ష్యం పలకాలి"

కొంచెం సందేహించినా, బ్రహ్మదేవుడంతటివాడు అడిగేసరికి కాదనలేక పోయాయి ఆ మొగలిరేకూ, ఆ కపిలగోవూ. తిరుగు ప్రయాణమై మళ్ళీ ఎన్నో యుగాలు ప్రయాణం చేసి భూమ్మీదికి దిగాడు బ్రహ్మదేవుడు. బ్రహ్మదేవుడితోపాటు మొగలిరేకూ, కపిలగోవూ కూడా దిగాయి. అప్పుడే విష్ణుమూర్తి కూడా అక్కడికి చేరాడు.

విష్ణుమూర్తి తన ఓటమిని అంగీకరించాడు. "అయితే, నీకంటె నేనే గొప్పవాడిని. ఈ జ్యోతి స్తంభం అంతుచూసి మరీ వచ్చాను. కావలిస్తే ఈ మొగలిరేకు, ఈ కపిలగోవునీ అడుగు" అన్నాడు బ్రహ్మదేవుడు.

"అవును, చూశాడు. నేనప్పుడక్కడేవున్నా"నని కూట సాక్ష్యం పలికింది మొగలిరేకు. "అవును, చూశా"డంటూ నోటితో చెప్పి "లేదులే"దంటూ తోకాడించింది కపిలగోవు.

వెంటనే ఆ జ్యోతి స్తంభం నుంచి ప్రత్యక్షమయ్యాడు మహేశ్వరుడు రౌద్రాకారంతో. "కూటసాక్ష్య మిచ్చినందుకు నువ్వు పూజకు పనికి రాకుందువుగాక" అని మొగలిరేకుని శపించాడు. "నోటితో అసత్యం పలికినందుకు నీ ముఖం చూడ్డం మంచిదికాదు. తోక నాడిస్తూ నిజం చెప్పినందుకు నీ వెనుకభాగమే పూజనీయం" అన్నాడు గోవుతో. సత్యం చెప్పినందుకు విష్ణుమూర్తిని మెచ్చుకుని "సర్వాధికుడవుకమ్మ"ని సుదర్శనచక్రాన్ని బహూకరించాడు. "అసత్యమాడినందుకు నీకు పూజా పునస్కారాలుండ వని శపించి, తన త్రిశూలంతో బ్రహ్మదేవుని శిరస్సునొకదానిని ఖండించాడు. తాను చేసిన అపరాధానికి పశ్చాత్తాప పడుతూ ఆ సదాశివుని పాదపద్మాలపై పడి క్షమార్పణ వేడుకున్నాడు. ఆ సకలలోకేశ్వరుడిని అనేకవిధాల స్తుతించాడు. భోలాశంకరుడు ప్రసన్నుడై బ్రహ్మదేవుడి తెగిన తలని తన భిక్షాపాత్రగా చేసుకున్నాడు.

(మొగలి పువ్వును మనం పూజకుపయోగించం. గోవు ముఖాన్ని కాక, దాని తోకనే మనం కళ్ళకద్దుకుంటాం. విష్ణుమూర్తి చేతిలో చక్రాన్ని చూస్తాం. బ్రహ్మదేవుడిని పూజించం. శివుని చేతిలో పుర్రె చూస్తాం. ఇదంతా యీ కారణంచేతనే).

ఆ తరువాత తన జ్యోతిస్వరూపాన్నీ ఉపసంహరించుకుని, పరమేశ్వరుడు అరుణాచలాకృతిని దాల్చి, అరుణగిరియోగి అనే సిద్ధుడిగా ఆ పర్వతమందే నివశిస్తున్నాడు.

ఇది పురాణగాథ. ఈ గాథలోని నిజానిజాలు ఆ బ్రహ్మ విష్ణు మహేశ్వరులకే తెలియాలి.

ఏది ఏమైనా అరుణాచల పర్వతాన్నే పరమేశ్వరుడిగా భావించి ఆ గిరి ప్రదక్షిణాలు చేస్తున్నారు నేటికి కూడా. ఆ పర్వతం మీద కామరూపులై అనేకమంది తపస్సు చేస్తున్నారని ప్రతీతి. కొన్ని వందల సంవత్సరాల క్రితం విరూపాక్షిదేవర అనే ఆయన ఆ కొండమీది గుహలో తపస్సు చేశారట. ఆనాటి నుంచి ఆ గుహకి విరూపాక్షిగుహ అనే పేరు వచ్చింది.

స్వామి యిప్పుడీ గుహకే చేరారు.

31

ఇన్నేళ్ళూ స్వామి ప్రపంచం విషయంలో ఉదాసీనంగా వుంటూ వచ్చారు. తపస్సు చేసేవారు. నిర్వికల్ప సమాధిలోకి పోయేవారు. ఇదంతా తమ ఉపాధి సకల శక్తుల నావిష్కరించడానికి సమర్థవంతం కావడానికేమో!

ఇప్పుడు స్వామికి సహజ సమాధి స్థిరపడిపోయింది. కన్నుమూసినా తెరిచినా ఒకటే. అంతా బ్రహ్మమయమే. అంతా తానే. అందరూ తానే.

స్వామి పర్వతం మీదికి వచ్చినా జనం విడిచి పెట్టలేదు వారిని. వస్తూనే ఉన్నారు. స్వామి కూడా యిదివరకటిలా కాక, తాము మాట్లడకపోయినా ఎవరేనా ఏదైనా అడిగినపుడు రాసి చూపుతున్నారు.

ఉపదేశాన్ని పొందడానికి కొందరు, వారి సన్నిధిని శాంతిననుభవించడానికి కొందరు, వారితో విహారానికి వెళ్ళడానికి కొందరూ యిలా రావడం మొదలుపెట్టారు. చివరికి బాలబాలికలు కూడా వారితో ఆడుకోవడానికి వస్తున్నారు.

స్వామి అంత సులభులైపోయారు.

32

గంభీరం శేషయ్యర్ ఓవర్సీర్. కృష్ణయ్యర్ తమ్ముడు. గొప్ప రామభక్తుడు. తరచు స్వామి దర్శనానికి వచ్చి తమ సందేహాలని అడుగుతాడు. స్వామి రాసి చూపుతారు. ఆయనకి సంశయ నివృత్తి అవుతుంది.

ఇలా, స్వామి రాసిచ్చిన కాగితాలన్నిటినీ ఆయనెంతో జాగ్రత్తగా భద్రపరచి వుంచారు. కాలక్రమాన "విచారసంగ్రహం" అనే పుస్తక రూపంలో అవి వెలువడ్డం జరిగింది.

* * *

గురుమూర్తములో స్వామిని విడిచిపెట్టి వెళ్ళిన ఉద్దండి నాయనార్ మళ్ళీ ఏడేళ్ళ తరువాత స్వామి నిక్కడ విరూపాక్షి గుహలో దర్శించుకుని, తన కున్నదంతా అర్పించుకుని గురుదక్షిణగా నూరు రూపాయలిచ్చాడు. అదంతా స్వామి కెందుకూ! వారా పైకాన్ని ముట్టలేదు. నాయనార్ తిరిగి తీసుకోడయ్యె. దాన్ని శేషయ్యర్ కిచ్చి స్వామి కార్యానికుపయోగించమన్నాడు.

కొన్నేళ్ళ తర్వాత ఎవరో స్వామిని స్తుతిస్తూ రాసిన రచన ఆ గుహలో దొరికింది. అది చాలా బాగుందని నాయనార్ ఇచ్చిన డబ్బుతో దాన్ని ముద్రించారు.

* * *

మణి అయ్యర్, స్వామి మధురలో ఒకే స్కూల్లో ఒకే క్లాసులో చదువుకున్నారు.

మణి అయ్యర్ పేరు చెపితే చాలు, తోటి విద్యార్థులందరికీ హడల్. ఆ మహనీయుడిని, అతని పరోక్షంలో "పోకిరీమణి" అని చెప్పుకుంటారు. ఎంతవరకూ చదివాడో, ఏమి పాసయ్యాడో తెలియదు. మొత్తం మీద ఆ పోకిరీకి విద్యార్థిదశ పూర్తయింది.

ఒకనాడు మణి అతని తల్లితో తిరుపతియాత్రకు బయలుదేరాడు.

"తోవలో తిరువన్నామలైలో దిగి వెంకటరామన్‌ని చూసి పోదా" మన్నది తల్లి.

"ఎవడేనా నవ్విపోతాడు. ఆ దొంగ సన్యాసిని చూసేదేవిటి నడు నడు" అన్నాడు తనయుడు.

తిన్నగా తిరుపతికే వెళ్ళిపోయారిద్దరూ. అక్కడ వెంకటరమణుని

సేవించుకుని తిరుగు ప్రయాణమయినపుడు తల్లి పట్టుపట్టింది "తిరువన్నామలైలో ఆగి వెంకటరామన్‌ని చూసి వెళ్ళవలసిందే"నని.

"సరే, అలాగేగానీ. పాపం, వాళ్ళ అమ్మా వాళ్ళూ ఎంత బ్రతిమాలినా యింటికి రానంటే రానని భీష్మించుక్కూర్చున్నాడట. ఇప్పుడెలా రాడోచూస్తాను. మర్యాదగా మనతో బయలుదేరుతాడా సరేసరి. లేకపోతే చెవిపట్టుకు ఈడ్చుకొస్తాను" అన్నాడు పోకిరీమణి.

తిరువన్నామలైలో దిగారు తల్లికొడుకులు. కొండెక్కి విరూపాక్షి గుహకు వెళ్ళారు. స్వామి దర్శనం చేసుకున్నారు. స్వామికి నమస్కరించి నిశ్శబ్దంగా కూర్చుంది తల్లి. కొడుకు కూడా నిశ్శబ్దంగానే కూర్చున్నాడు - నమస్కరించకపోయినా.

"నేనెరుగున్న వెంకటరామనేనా ఈ స్వామి? నాతో ఆడుకున్న వెంకటరామనేనా ఈ స్వామి? నాతో చదువుకున్న వెంకటరామనేనా ఈ స్వామి? ఈ మార్పేమిటి? ఎలా వచ్చిందీ మార్పు? నేనిప్పుడేమి చెయ్యాలి?" ఇలా ప్రశ్నల పరంపర బయలుదేరింది మణిజీ మస్తిష్కంలో. కొంతసేపటికి ప్రశ్నలు ఆగిపోయి ఒక విధమైన శాంతి ఆవరించుకుందతన్ని.

మౌనముద్రాలంకృతుడై తేజోవిరాజమానంగా ప్రకాశిస్తున్న స్వామిని అలా చూస్తుండగానే - అతనిలో ఏమి జాగృతి కలిగిందో, కన్నీరు ధారగా ప్రవహించింది. మాట పెగల్లేదు. సాష్టాంగపడి నమస్కరించాడు.

స్నేహితుడు మీద అభిమానం పోలేదు స్వామికి. చెవి పట్టుకు తీసుకువెళ్ళడానికి వచ్చిన అతగాడి చెవి పట్టుకుని తమ పాదాల దగ్గో కూర్చోపెట్టేసుకున్నారు.

జీవితాంతం స్వామిని 'విడిచి పెట్టలేదు మణిఅయ్యర్. జీవితానంతరం స్వామిలోనే ఐక్యమైపోయాడు.

* * *

శివప్రకాశం పిళ్ళే విఘ్నేశ్వర భక్తుడు. పట్టభద్రుడు. రెవెన్యూ శాఖలో వుద్యోగం. జమాబందీ పనిమీద తిరువన్నామలై వచ్చాడు. స్వామిని గురించి విన్నాడు. వారి దర్శనం చేసుకున్నాడు. తత్వానికి సంబంధించిన తన సందేహాలను వెలిబుచ్చాడు. స్వామి రాసి చూపారు. పిళ్ళే సందేహాలు పటాపంచలయిపోయాయి. తన కుపదేశమిమ్మని ప్రార్థించాడు. కాని, స్వామి మౌనంగానే వుండిపోయారు.

పిళ్ళేకి వైరాగ్యం అంతకంతకూ ఎక్కువయింది. ఉద్యోగానికి రాజీనామా నిచ్చేశాడు. భక్తి ప్రవత్తులతో కాలం గడుపుతున్నాడు. తన స్వగ్రామంలో.

ఒక రోజున, పాపం, అతని భార్య పోయింది. కొన్నాళ్ళు బాధ పడ్డాడు. ఆ తరువాత తను మళ్ళీ పెళ్ళి చేసుకోవడమా మానడమా అనే సంధిగ్ధావస్థలో పడ్డాడు. తనింకా యువకుడే - ఎటూ నిర్ధారణ చేసుకోలేని స్థితిలో "చేసుకొమ్మంటావా, వద్దంటావా? నువ్వు చేసుకొమ్మంటే చేసుకుంటాను. వద్దంటే మానేస్తాను. నీ సమాధానం యీ కాగితం మీద రాసిస్తే సరేసరి. లేదా, నాకూ తిరువన్నామలై వెళ్ళడం తప్పనిసరి అవుతుంది" అని రాసి కాగితాన్ని తన యిష్ట దైవం వినాయకుడి ముందు పెట్టాడు. పెట్టి, ఆ రాత్రి నిశ్చింతంగా నిద్రపోయాడు. తన పూచీ తీరిపోయినట్టు.

తెల్లారింది. బొజ్జగణపయ్యగారేమి రాశారో చూద్దామని ఆ కాగితాన్ని విప్పి చూశాడు. పెట్టింది పెట్టినట్టుగానే వుంది. పిళ్ళేకిక తిరువన్నామలై వెళ్ళక తప్పలేదు.

పిళ్ళే వచ్చి విరూపాక్షిగుహలో స్వామిని దర్శించాడు. తను వచ్చిన పని మరిచిపోయాడు. అడగాలనుకున్నది అడగలేదు. అడగకుండా సమాధానం దొరికిందాయనకి.

స్వామి ఉపదేశం పెళ్ళి, పెటాకులూ, విడాకులూ - యిదేమీకాదు. విచారణా, ఆత్మా, అనుభూతీ - యీ మూడింటినే వారు నొక్కివక్కాణిస్తున్నారు. కాదు, రాసి చూపుతున్నారు.

అదీగాక, వారి జీవితమే చాటి చెపుతోంది - జీవితాదర్శం పెళ్ళి, పిల్లలూ, సంసారం కాదనీ, తన్ను తాను తెలుసుకోవడమేననీ.

"కాతే కాంతా కస్తే పుత్రా సంసారోయ మతీవ విచిత్రః
కస్యత్వం వాకుత ఆయాతః తత్త్వం చింతయ తదిహ భ్రాతః"
(ఈ భార్యాబిడ్డలెవరు? చిత్రాతిచిత్రమైన యీ సంసారమేమిటి?
నువ్వెవరవు? ఎక్కడి నుంచి వచ్చావు? ఈ విషయాలని యోచించు
సోదరా) - అని ఏనాడో చెప్పారు శంకరభగవత్పాదులవారు.

శివప్రకాశం పిళ్ళే తిరువన్నామలైలో కొన్నాళ్ళుండి, యిక స్వగ్రామం పోదామని స్వామి సెలవు తీసుకోవడానికి విరూపాక్షి గుహకు వచ్చాడు. స్వామి తమ అపురూపమైన దివ్యదర్శన మిచ్చారు పిళ్ళేకి. పిళ్ళే తన్మయత్వం చెందాడు. ఆయన ఆనందానికి అవధులు లేవు. ఇతరు లెవరికీ లభించని అదృష్టం తనకు లభించింది. స్వామికి కృతజ్ఞతాపూర్వక సాష్టాంగదండ ప్రణామాలాచరించాడు. తన యిష్ట దైవం విఘ్నేశ్వరుడు తనకేమీ రాసి చూపకుండా యిక్కడికి పంపడం యీ మహద్భాగ్యం కోసమేనని రూఢి చేసుకుని, అంతటి మేలు చేసిన గణపతికి కూడా జోహారులర్పించాడు.

పిళ్ళే ఆనాడు స్వామి దగ్గర సెలవు తీసుకోలేదు.

మరునాడు వచ్చాడు సెలవు తీసుకుందామనే. ఆనాడు కూడా అదే అనుభూతి. ఆ మరునాడు కూడా అదే. ఏమి, స్వామి అవ్యాజ కరుణ! ఏమీ పిళ్ళే పూర్వపుణ్యం!

స్వామి తన కనుగ్రహించిన దివ్యదర్శనాన్నీ, వారికి తనపై కలిగిన నిర్హేతుకజాయమాన కరుణాకటాక్షాన్నీ వర్ణిస్తూ "అనుగ్రహ అహవల్" అనే కావ్యాన్ని రచించి ప్రచురించాడు శివప్రకాశం పిళ్ళే. దానికనుబంధంగా తాను స్వామి దగ్గర తెలుసుకున్న విషయాలని - అనగా, స్వామి రాసి చూపిన వాటిని "నేనెవడను" అనే పుస్తకాన్ని రాసి చేర్చాడు.

కావ్యకంఠగణపతి మునీంద్రులు స్వామిని దర్శనం చేసుకున్నది యీ విరూపాక్షిగుహలోనే.

అశేషశేముషీ ప్రజ్ఞాధురీణులూ, గణపత్యాంశ సంభూతులూ అయిన గణపతి మునీంద్రులు స్వామికి ప్రణమిల్లి యిలా అన్నారు.

"స్వామీ, నేను వేద వేదాంగ శాస్త్ర పురాణేతిహాసాల నన్నిటినీ మథించాను. నాకిక చదువవలసింది లేదు. కోట్లకొలదీ మంత్రజపం చేశాను. ఆశించిన ఫలితం కనబడలేదు. శాంతి చేకూరలేదు. తపస్సు యొక్క స్వరూపం ఏమిటో సెలవిచ్చి నన్ను ధన్యుడిని చెయ్యాలి. మిమ్మల్ని శరణు జొచ్చాను. మీ పాదపద్మాలనే నమ్ముకున్నాను."

స్వామి గణపతి మునీంద్రులకేసి తదేకదృష్టితో చూశారు. మునీంద్రులు స్వామి అనుగ్రహానికి ఆత్రంగా చూస్తున్నారు. అప్పుడక్కడ వున్నవారంతా నిశ్శబ్దంగా కూర్చున్నారు - స్వామి వంకా మునీంద్రులవంకా చూస్తూ. మునీంద్రులు వేసిన ప్రశ్న అసామాన్యమైనది. అటువంటి ప్రశ్నకు సమాధానంగా స్వామి ఏమి రాసి చూపుతారోనని ఎదురుచూడ్డం సహజమే.

కాని, స్వామి రాసి చూపలేదు. ఇన్ని సంవత్సరాల తరువాత మౌనాన్ని విడిచిపెట్టి, కంఠనాళాలని సవరించుకుంటూ, ఒకో మాటనీ పెకలించి బయటికి తెచ్చుకుంటూ యిలా చెప్పారు.

"మీరు 'నేను' అంటున్నారు కదా, ఆ 'నేను' అనే భావన ఎక్కడ పుడుతోంది? దాని పుట్టుక స్థానాన్ని పరిశీలించండి. మనస్సు అక్కడే లీనమౌతుంది. అదే తపస్సు.

"మీరు మంత్రజపం చేస్తున్నారు కదా, ఆ మంత్రనాదం ఎక్కడినుంచి ఉద్భవిస్తోందో పరిశీలించండి. మనస్సు అక్కడే లయిస్తుంది. అదే

తపస్సు."

ఈ మహోపదేశానికి గణపతి మునీంద్రుల హృదయం చల్లబడింది. వారిపై పన్నీటిజల్లు పడినట్లయింది. వారికి అమృతం సేవించినట్లయింది.

"వేదకాలం తరువాత ముక్తికి కొత్తమార్గం చూపింది వీరే. మూలాన్ని అన్వేషించింది వీరే. మోక్షమార్గద్రష్టలు మహర్షులు. అసలు రహస్యం తెలిపిన వీరు మహర్షులలో మహర్షి. కేవలం భగవంతుడు" - ఇలా తలపోస్తూ, స్వామి చరణారవిందాలను కళ్ళ కద్దుకుని "భగవాన్ శ్రీరమణమహర్షి, ధన్యోస్మి ధన్యోస్మి" అన్నారు కావ్యకంఠ గణపతిమునీంద్రులు.

అప్పుడే ఆశువుగా రమణపంచకమును చెప్పి కీర్తించారు.

ఆనాడే వారి శిష్యగణంతోసహా వారి భక్తులయ్యారు.

తాను కొల్చిన పార్వతీదేవి అనుగ్రహమే తమను రమణ సన్నిధికి చేర్చిందని విశ్వసించారు.

ఆనాటితో ఆ "బ్రాహ్మణస్వామి" పేరు పోయి "భగవాన్ శ్రీ రమణమహర్షి" అనే కల్యాణనామం స్థిరపడింది. అదే జగద్విదితమయింది.

అంతేకాదు. గణపతి మునీంద్రులు తమ దివ్యదృష్టిచే రమణుడు శివకుమారుడైన కుమారస్వామి అవతారమని గ్రహించి, లోకానికి వెల్లడించారు.

రమణుడు కాదనలేదు. వారొకప్పుడు ఒక శ్లోకం రచించారు వినాయకుడి మీద. దాని తాత్పర్యం యిది.

"కన్న తండ్రిని బిచ్చగాడిని చేశావు. బాగా బొజ్జ పెంచుకున్నావు. నేనూ ఆ తండ్రి కన్న బిడ్డనే. కాదంటే, నువ్వు ముందు పుట్టావు. నేను తరువాత పుట్టాను. అందుచేత నన్ను కూడా ఒక కంట కనిపెట్టు".

దీన్ని బట్టి వారు స్వయంగా చెప్పుకున్నట్టేకదా, తాను కుమారస్వామి అవతారాన్నని.

అయితే ఎవరు భగవంతుడు? శివుడా, శివకుమారుడా?

వీరిలో భేదమేముంది? "నేనూ - స్వర్గంలో వున్న నా తండ్రి ఒక్కటే అని ఏసుప్రభువు అనలేదా?

* * *

కుమారస్వామి తన తండ్రి అయిన ఈశ్వరుడికే తత్వాన్ని ఉపదేశించాడట. ఇప్పుడు రమణుడై, తన అన్న గణపతి అంశతో జన్మించిన గణపతి మునీంద్రుల కుపదేశించడంలో ఆశ్చర్యమేముందీ!

శ్రీరమణభగవాన్

కావ్యకంఠ గణపతిమునీంద్రులు "బ్రాహ్మణస్వామి"గా మారిన వెంకటరామన్‌ను "భగవాన్ శ్రీరమణ మహర్షి"గా మార్చారు.

"భగవాన్ శ్రీరమణ మహర్షి" అని ఎందుకన్నారో! బ్రహ్మానుభూతిలో స్థిరత్వం చెందిన వ్యక్తి భగవంతుడే అవుతాడు కదా! అటువంటప్పుడు ఆ "బ్రాహ్మణస్వామి"ని "శ్రీరమణభగవాన్" అనుంటే మాత్రం సరిపోకపోనా? కృష్ణుడిని "శ్రీకృష్ణభగవాన్" అన్నారు గాని "భగవాన్ శ్రీకృష్ణమహర్షి" అని అనలేదు కదా! బుద్ధుడిని "శ్రీబుద్ధ భగవాన్" అన్నారు గాని "భగవాన్ శ్రీబుద్ధమహర్షి" అని అనలేదుకదా!

మరొకలాగ చూసినా.... ....

వ్యాస, వాల్మీకి, శుక్ర, వశిష్ఠాది మహర్షులు కూడా క్రాంతదర్శులే బ్రహ్మానుభూతిలో స్థిరత్వం చెందినవారే. వారిని "వ్యాస మహర్షి" "వాల్మీకిమహర్షి" "శుకమహర్షి" "వశిష్ఠమహర్షి" అన్నారే గాని "భగవాన్ శ్రీవ్యాసమహర్షి" "భగవాన్ శ్రీవాల్మీకిమహర్షి" "భగవాన్ శ్రీశుక్రమహర్షి" "భగవాన్ శ్రీవశిష్ఠమహర్షి" అని అనలేదు కదా! అందుచేత ఆ

బ్రాహ్మణస్వామికి "రమణమహర్షి" అనిగాని "శ్రీరమణభగవాన్" అనిగా నామకరణం చేసివుంటే బాగుండేదేమో! "భగవాన్ శ్రీరమణ మహర్షి" అనడ తప్పు అనికాదు. కావ్యకంఠ గణపతి మునీంద్రులంతటివారు తప్పు చేశారనడ దుస్సాహసం. అయినా "శ్రీరమణ భగవాన్" అని మాత్రమే అంటే దోషముంటుందా!

* * *

ఒకనాడు తెల్లవారగట్ల గణపతిమునీంద్రులు శిష్యగణ సమేతులై శ్రీరమణ భగవాన్ సన్నిధిని కూర్చుని ప్రార్థన మొదలు పెట్టబోతున్నారు. అంతలో ఒక అద్భుతదృశ్యం - భగవాన్ చుట్టూ కాంతి పుంజం - ఆ కాంతిలో భగవాన్ నవకోటిమన్మధాకారం - ఆరు నక్షత్రాలు ప్రత్యక్షమై ఆరుసార్లు ముద్దెట్టుకోవడం - తరువాత అవి భగవాన్‌లోనే లీనమయిపోవడం.

ఈ అపూర్వ సంఘటనను తిలకించిన అక్కడివారంతా తన్మయత్వం చెందారు.

శ్రీరమణ దివ్యదర్శనం లభించగానే మునీంద్రులు భగవాన్‌ని శ్లోకాష్టకంతో స్తుతించారు.

వారు తమ దివ్యదృష్టితో చూసి "రమణుడు శివకుమారుడైన కుమారస్వామి" అని చెప్పినదిప్పుడు రుజవయిందందరికీ.

మనం పురాణాల్లో చదివిన కుమారస్వామి జన్మవృత్తాంతాన్ని "అదో పుక్కిటి పురాణకథలే అని నెట్టిపారేయాలా. ఇప్పుడీ ఉదంతాన్ని కూడా కట్టుకథలే" అని కొట్టిపారెయ్యాలా? అలా ఎలా చెయ్యగలం? ఇది యుగయుగాలనాటి మాటకాదు. ఎప్పుడో కైలాసంలో జరిగింది కాదు. నిన్న మొన్నటి చరిత్ర. తిరువన్నామలైలో అరుణాచల పర్వతం మీద వున్న విరూపాక్షిగుహలో జరిగింది. గణపతిమునీంద్రులూ వారి శిష్యులూ ప్రత్యక్షంగా చూశారు. వారందరూ కూడా అబద్ధమే చెప్పారనగలమా? నమ్మశక్యం కాని దాన్ని నమ్మక తప్పడం లేదు.

* * *

ఒకనాడు భగవాన్ నిమీలితనేత్రులై కూర్చున్నారు. బాహ్య దృష్టిలోకి అప్పుడే వచ్చారు. ఆంతర్యానుభవం యింకా విడిచిపెట్టలేదో ఏమో "నేనెవరిని? నేనెవరిని? ఆకాశానికంటూ పెరిగిపోయిన నేనెవరిని? ఈ భూనభోంతరాళాలన్నీ నా కటిప్రదేశం చుట్టూ పరిభ్రమిస్తున్నాయి ఎందు చేత?" అన్నారు.

అక్కడేవున్న గణపతిమునీంద్రులు చేతులుజోడించి "భగవాన్, నీవు శివకుమారుడివైన కుమారస్వామిగాక మరెవరివి?" అని అధర్వణ వేదంలోని స్కందసూక్తంచే స్తుతించారు.

స్కందుడు, కార్తికేయుడు, షణ్ముఖుడు, సుబ్రహ్మణ్యుడు మొదలైన పేర్లెన్నో వున్నాయికదా కుమారస్వామికి!

(శ్రీ రమణ భగవాన్‌కీ, గణపతి మునీంద్రులుకీ సంబంధించిన యీ వృత్తాంతాన్ని కూడా నమ్మకుండా ఎలా వుండగలం? రమణ కథలోకింకా ప్రక్షిప్తాలు ప్రవేశించలేదుకదా?)

* * *

తిరువత్తియూరు వినాయకుడి ఆలయంలో గణపతి మునీంద్రులు పద్దెనిమిది రోజులు దీక్ష నారంభించారు. దీక్ష పూర్తి కాకుండానే వారి కేదో చిక్కు తటస్థించింది. "భగవాన్ యిప్పుడిక్కడ వుండుంటే బాగుండును కదా" అనుకున్నారు. వెంటనే భగవాన్ ప్రత్యక్షమయ్యారు. మునీంద్రులు వారికి పాదాభివందనం చేసారు. భగవాన్ వారి శిరస్సుపై తమ హస్తముంచారు. మునీంద్రుల శరీరంలో విద్యుచ్ఛక్తి ప్రవహించినట్టయింది. భగవాన్ తమకు హస్తదీక్ష నిచ్చినట్టుగా భావించారు మునీంద్రులు.

ఇక్కడ విరూపాక్షిగుహలో...

పలని భగవాన్‌ని చూస్తూ "ఏమిటి ఆలోచిస్తున్నారు" అని అడిగా

"ఏమీలేదు. పడుకునే వున్నాను కదా. నిద్రపోవడమూ లేదు. సమాధిలో

మునిగిపోనూలేదు. హఠాత్తుగా యీ శరీరం పైకి వెళ్ళడం మొదలుపెట్టిం

వెళ్ళగా వెళ్ళగా యీ మేడలూ. మిద్దెలూ. యీ చెట్లూ. చేమలు. యీ కొండలు

గుట్టలూ కనపడ్డం మానేసాయి. ఎటుచూసినా తెల్లటికాంతి. ఇలా వెళ్ళి వెళ్ళి

శరీరం ఒక చోట దిగడం ప్రారంభించింది. దిగింది. చూద్దునుకదా. అ

తిరువత్తయూరు. తిన్నగా నడిచి వినాయకుడి గుళ్ళోకి వెళ్ళాను. అక్కడ గణ

మునీంద్రులున్నారు. వారి శిరస్సుమీద చెయ్యివేసినట్టు గుర్తు" అన్నా

భగవాన్.

* * *

జగదీశ్‌శాస్త్రి అనే భక్తుడు భగవాన్ సన్నిధిని కూర్చున్నాడు ఒకనాడు

అతనికి "హృదయకుహరమధ్యే" అనే పదం స్ఫురించి "హృదయ

కుహరమధ్యే. హృదయకుహరమధ్యే" అంటున్నాడు. ఆ తరువాత దేహ

తట్టడంలేదు.

భగవాన్ గమనించారు అతని అవస్థ. గమనించి-

"హృదయకుహరమధ్యే కేవలం బ్రహ్మమాత్రం
హ్యహ మహమితి సాక్షాదాత్మరూ పేణభాతి
హృదివిశమనసా స్వమ్ చిన్వతా మజ్జతా వా
పవనచలనరోధా ధాత్మనిష్ఠో భవ త్వమ్"

అని పూర్తి చేశారు.

"హృదయకుహరమధ్యాన్ని అద్వితీయుడైన పరమేశ్వరుడు "నేన

నే"నంటూ ఆత్మరూపంగా ప్రకాశిస్తున్నాడు. మనస్సులో

అహంమూలాన్వేషణ చేస్తూ ఆత్మలో మునుగు. లేదా. ప్రాణవృత్తి

నిరోధిస్తూ ఆత్మయందు నిలకడచెందు"

ఇది ఆ శ్లోకార్థం.

తత్వరహస్యాన్ని యింత తేలికగా. పండితులకేగాక. పామరులకు కూడా అర్థమయ్యేటట్టు చెప్పిన భగవాన్ ప్రజ్ఞాప్రాభవాల కట్బుర పడిపోయారు గణపతిమునీంద్రులు. అంతేకాదు. "ఇంత చక్కటి కవిత్వం మనమెప్పుడేనా కనివిని యెరుగుదుమా" అన్నారు శిష్యులతో.

(పెద్దచదువులేమీ చదువుకోని భగవాన్‌కి కావ్యకంఠ గణపతి మునీంద్రులంతటివారి ప్రశంసలందుకునే కవిత్వమెలా అబ్బిందో! అబ్బకేం చేస్తుంది! వారి కసాధ్యమైనదేముందీ! వారు సాక్షాత్ భగవాన్ కాదా!)

* * *

గణపతిమునీంద్రులు "ఉమాసహస్రి" రచన కుపక్రమించారు. దాదాపు ఎనిమిది వందల శ్లోకాలు పూర్తయ్యాయి. ఇంకా రెండువందలకు పైగా రాస్తేనేగాని గ్రంథం పూర్తికాదు. కాని. ఎందుచేతనో. కావ్యకంఠుల కలం ముందుకు సాగడం లేదు. దేవిసమక్షాన ఆ గ్రంథాన్ని చదువవలసినది ఆ మరునాడే. మునీంద్రుల కేమిచెయ్యాలో ఏమీ తోచలేదు. తమ సంకటస్థితిని భగవాన్‌కు నివేదించుకున్నారు.

"పరవాలేదు. పూర్తవుతుంది. వ్రాయండి" అన్నారు భగవాన్. అక్కడే కూర్చుని అప్పుడే మళ్ళీ రాయడం మొదలు పెట్టారు మునీంద్రులు. కలం చకచక నడిచింది. ఆ రెండువందల పై చిలుకు శ్లోకాలూ పూర్తయ్యాయి.

అంతవరకూ మౌనంగా కూర్చున్న భగవాన్ "చెప్పినదంతా వ్రాసుకున్నారా" అన్నారు.

"చిత్తం. వ్రాసుకున్నాను" అన్నారు మునీంద్రులు.

(మునీంద్రులు ముఖతా భగవాన్ ధార ప్రవహించిందా!)

ఆ మరునాడు గ్రంథపఠన కార్యక్రమం పండిత ప్రకాండులు అచ్చెరువొంది

చూస్తూండగా దేవి సమక్షాన దిగ్విజయంగా ముగిసింది.

* * *

శ్రీ రమణ భగవాన్ - కావ్యకంఠ గణపతి మునీంద్రుల పరస్పరానుబంధమెంత చిత్రమైనదో!

మునీంద్రులు భగవాన్‌కంటే ఒక ఏడాది పెద్దవారు. భగవాన్ వారిని "నాయనా" అని గౌరవపురస్సరంగా పిలిచేవారు. ఆ పేరే స్థిరపడి పోయింది వారికి.

36

భగవాన్ (అప్పుడు బ్రాహ్మణస్వామి) విరూపాక్షి గుహలో ఉంటూన్నప్పుడే ఎచ్చెమ్మాళ్ వచ్చింది. భర్తనీ, ఏకైక పుత్రుడినీ, తనకున్న ఇద్దరు కుమార్తెలని కోల్పోయిన దుఃఖం భగవాన్‌ని దర్శించగానే పటాపంచెలయింది. ఆనాటి నుండీ ఆమె భగవాన్‌కి భిక్షపెట్టని రోజు లేదు. వూళ్ళో ఎక్కడో కాపురముంటూ ప్రతిరోజు కొండెక్కేది.

ఎచ్చెమ్మాళ్‌కింత అనుభవమయినా మమకారాలు పోలేదు. మేన కోడలు శెల్లమ్మాళ్‌ని పెంచుకుని పెళ్ళి చేసింది. ఆమెకు మగబిడ్డ పుట్టగా "రమణుడు" అని పేరు పెట్టింది.

మనవడు పుట్టాడని సంతోషిస్తూండగానే పిడుగులాటి వార్త. శెల్లమ్మాళ్ చనిపోయిందని టెలిగ్రాం.

ఘోరున ఏడుస్తూ భగవాన్ దగ్గరకు పరుగు తీసింది ఎచ్చెమ్మాళ్. విషయం తెలుసుకుని భగవాన్ కూడా దుఃఖించారు.

చిత్రం! ఎచ్చెమ్మాళ్ బాధ ఆ క్షణంలోనే తీరిపోయింది. భగవాన్ ఆమె బాధను పంచుకోగానే.

ఆమె ప్రారబ్ధకర్మ నివృత్తికా యిదంతా!

* * *

ఎచ్చెమ్మాళ్ ఒకనాడు ధ్యానంలో మునిగి కదలకుండా మెదలకుండా రెండు రోజులుండిపోయిందలాగ. ఆ ఇంట్లోవాళ్ళు కంగారుపడి భగవాన్ దగ్గరకు వెళ్ళి చెప్పారు. "ఏమీ పరవాలేదు. వెళ్ళండి" అన్నారు భగవాన్.

మూడోనాడు భిక్ష పట్టుకుని భగవాన్ దగ్గరకు వచ్చింది ఎచ్చెమ్మాళ్.

"ఏమిటి ఎచ్చెమ్మా, మీ ఇంట్లోవాళ్ళకేవో విద్య చూపావటనే! ఎచ్చెమ్మా, నువ్వు చూసిన తేజస్సు కూడా దృశ్యమే. ఆత్మ కాదు. ఆత్మోపలబ్ధికే ప్రయత్నించాలిగాని, దృశ్యాలతో తృప్తి చెందకూడదు" అన్నారు భగవాన్.

ఎచ్చెమ్మాళ్ నిర్ఘాంతపోయింది. తను చూసిన తేజస్సు సంగతి భగవాన్ కెలా తెలిసిందా అని.

వారికి తెలియనిదేముంటుందీ! సర్వాంతర్యామి, సర్వవ్యాపీ కదా!

ఆనాటి నుంచీ ఎచ్చెమ్మాళ్ దృశ్యాలని తోసిపుచ్చి, ఆ దృశ్యాలని చూసే ద్రష్టకోసమే ప్రయత్నించడం మొదలుపెట్టింది.

* * *

ఒకనాడు భిక్ష పట్టుకుని కొండెక్కుతోంది ఎచ్చెమ్మాళ్. విపరీతంగా వానకురవడం మొదలుపెట్టింది. ఒక చెట్టునీడని ఆగింది. ఆగి, పైకి చూసేసరికి భగవాన్ కూడా అక్కడొక బండమీద కూర్చుని వుండడం గమనించింది.

తను తడిసి ముద్దయి పైకెక్కింది. ఆశ్చర్యంభగవాన్ మీద ఒక చుక్క పడలేదు. వారి చుట్టూమాత్రం ఒక చెరువులాగుంది.

* * *

మరొకనాడు-

ఎచ్చెమ్మాళ్ భిక్ష తీసుకుని గుహకు వచ్చేసరికి భగవాన్ ఒక శాస్త్రిగారితో మాట్లాడుతున్నారు.

వాళ్ళిద్దరినీ చూడగానే ఎచ్చెమ్మాళ్ బిగిసిపోయి వణకడం మొదలుపెట్టింది.

"అదేమిటి ఎచ్చెమ్మా?" అన్నారు భగవాన్.

"నేను వస్తూండగా సద్గుణస్వామి గుహ దగ్గర మీ యిద్దరినీ చూశాను. మీరిద్దరూ ఇక్కడే వచ్చేస్తారుకదా. పోయి అక్కడే కూర్చుందామని వచ్చేశాను. ఇక్కడే వున్నారు" అన్నది ఎచ్చెమ్మాళ్.

భగవాన్ చిరునవ్వు నవ్వి వూరుకున్నారు.

ఇదంతా విన్న శాస్త్రిగారు "భగవాన్, మీరిక్కడ నాతో మాట్లాడుతూనే వున్నారు. ఈయమ్మ కక్కడ దర్శనమిచ్చారు. నామీదెప్పుడూ మీ అనుగ్రహం?" అన్నారు.

భగవాన్ ఎచ్చెమ్మాళ్‌కు చూపిన అనుగ్రహాద్భుతాలు ఎన్నెన్నో!

37

రామస్వామి అయ్యర్ ఒక పెద్ద ఉద్యోగి. రమణభక్తుడు. కీర్తనలు రచించగలడు. శ్రావ్యంగా పాడగలడు.

"రమణా, కరుణాభరణా, నిన్ను శరణుజొచ్చాను. నాకు సమస్తమూ నీవే. మధువుతో నిండిన పుష్పానివి నీవు. ఆ తేనె నాస్వాదించుట కుత్సాహపడే మధుహన్ని నేను...."

ఈ అర్థమిచ్చే పాటని అయ్యర్ పాడుతూన్నపుడు శ్రోతలు భక్తితత్పరులై మైమరచిపోయేవారు.

అయ్యర్ పెద్దవుద్యోగే. భక్తుడే. అయినా, కర్మ నెవరు తప్పించగలరు! ఆయనకి అపరిమితమైన అజీర్ణవ్యాధి. గుక్కెడు గంజి మాత్రమే తాగినా అదీ అరగదు. తన రోగ విముక్తికి ఎన్నివేల రూపాయలు ఖర్చుపెట్టాడో! ఏమీ లాభం లేకపోయింది.

ఒక భక్తురాలు పిండివంటలతో సహాభోజనం తయారు చేయించి తెచ్చింది కొండమీదికి ఒకనాడు. అయ్యర్ అప్పుడక్కడే వున్నాడు. ఆయన్ని కూడా భోజనానికి కూర్చోమన్నారు భగవాన్. తన అజీర్ణవ్యాధిని గురించి చెప్పుకున్నాడాయన. "పరవాలేదులే, భోంచేయి" అన్నారు భగవాన్.

భగవాన్ మీద భారంవేసి కడుపునిండా తిన్నాడు అయ్యర్. గుక్కెడు గంజి కూడా అరగని అయ్యర్‌కి ఆ విందు భోజనం "వాతాపి జీర్ణం" అయిపోయింది. ఆయన వ్యాధి ఏమయిందో ఆనాటినుంచి ఆయన జీవితాంతం అజీర్ణంతో బాధపడలేదు. రమణ స్మరణ మానలేదు.

38

విరూపాక్షిగుహ విరూపాక్షిమఠంవారిది. విరూపాక్షిదేవర సమాధి దర్శనార్థం భక్తులు వస్తూంటారు. ఆ భక్తుల దగ్గర రుసుము వసూలు చేసుకోవడానికొక ఏజెంటు నేర్పాటు చేసారు. కాని, అడపా తడపా వచ్చే భక్తులకోసం కాచుకు కూర్చుని ఆ ఏజెంటు ఏమి వసూలు చేసుకోగలడూ! అందుచేత నదేమీ పట్టించుకోలేదు.

భగవాన్ ఈ విరూపాక్షిగుహకు చేరిననాటినుంచీ భక్తులు వేనవేలుగా రావడం మొదలుపెట్టారు. ఏజంటుకిది మంచి తరుణం. పన్ను వసూలు చెయ్యడం మొదలుపెట్టాడు.

భగవాన్‌కిది నచ్చలేదు. "భక్తిమీద కూడా పన్ను విధించడమా" అనుకుని.

బయటవున్న చింతచెట్టుకింద కుర్చున్నారు. గుహను వదిలిపెట్టి.

బాగా డబ్బుమరిగిన ఏజంటు వూరుకోలేదు. తోవలోనే కాసి వసూలు చెయ్యడం మొదలుపెట్టాడు.

భగవాన్‌కిది తెలిసి కొంచెం దూరంలో వున్న సద్గురుస్వామి గుహకు వెళ్ళిపోయారు. ఇక భక్తులక్కడకు రాసాగారు. విరూపాక్షి గుహ ప్రాముఖ్యం తగ్గిపోయింది.

ఏజంటు వెళ్ళి భగవాన్ కాళ్ళమీద పడ్డాడు. పన్ను వసూలు చెయ్యనని వాగ్దానం చేశాడు.

మళ్ళీ విరూపాక్షిగుహకు వచ్చారు భగవాన్.

39

జటాస్వామి సత్యాన్వేషణకే అరుణాచలపర్వతం మీద తపస్సు ప్రారంభించి వుండవచ్చు. కాని, పాపం, వచ్చిన పని మర్చిపోయాడు. భగవాన్ చుట్టూ చేరే భక్తులనీ, వాళ్ళు తెచ్చే నైవేద్యాలనీ చూసి ఓర్వలేక పోయాడు. ఈర్ష్య ప్రకోపించింది. పర్వతం మీద ఒక చెట్టువెనక దాగి, భగవాన్ దర్శనానికి వచ్చే భక్తులమీదికి రాళ్లు దొర్లించడం మొదలు పెట్టాడు. భూకంప మనుకుని వాళ్ళు పారిపోయేవారు.

ఒకనాడు ఒక రాయి వచ్చి భగవాన్ కాలివేలుకి తగిలి వేలు తెగిపోయింది. పలని చూచి ఘొల్లుమన్నాడు.

"ఏమయిందనీ, అలా ఏడుస్తావు?" అంటూ ఆ వేలుని తెగిన చోట నొక్కుకున్నారు భగవాన్. వెంటనే అతుక్కుపోయింది. తెగిన ఆనవాలు కూడా కనపడలేదు.

ఒకనాడు రాళ్ళు దొర్లిస్తున్న సమయంలో జటాస్వామిని పట్టుకున్నారు భగవాన్. నవ్వడం మొదలుపెట్టాడు ఆ ఝటాస్వామి. సిగ్గులేని మొహానికా నవ్వొకటే తక్కువయిందికాబోలు!

* * *

ఇంకో స్వామి. ఈయన పేరు బాలానందస్వామి. యువకుడు. బంగారం లాంటి చాయ. అత్యంతాకర్షణీయమైన ముఖవర్చస్సు. ప్రస్థానత్రయాన్ని - అనగా, ఉపనిషత్తులు, బ్రహ్మసూత్రాలు, భగవద్గీతచదివాడు. ఇంకా కొన్ని ఆధ్యాత్మిక గ్రంథాలని చదివాడు. అనేక భాషల్లో అనర్గళంగా మాట్లాడగలడు. మాటనేర్పరి. వశీకరణశక్తి కలవాడు.

ఎంతవాడయితేనేం! ఈయనకీ పట్టుకుంది జటాస్వామికి పట్టుకున్న జాడ్యం.

భగవాన్ భక్తులతో భగవాన్ గురించి "పాపం, కుర్రాడు, కల్లాకపటం తెలియనివాడు. యోగ్యుడని కనిపెట్టే ఉపదేశమిచ్చాను" - అలా చెప్పి, భగవాన్ గురువుగ్గా చలామణీ అవుతూ, భగవాన్‌ని చూడవచ్చేవారి దగ్గరనుంచి డబ్బులు వసూలు చెయ్యసాగించాడు.

ఎన్నాళ్ళు సాగుతుందీ ఆట? భక్తులే కనిపెట్టి, వాడి మాటను నమ్మక పోవడమేకాకుండా, దగ్గరకొస్తే అవతలకు పొమ్మన్నారు కూడాను.

ఈ బాలానందస్వామి కొట్టేవన్నీ పట్టుబట్టలే. వాటిని భగవాన్ వుంటూన్న గుహలోనే పెట్టుకునేవాడు. ఒకనాడు భగవాన్ స్నానానికి అవతలకు వెళ్ళగా చూసి ఆ బట్టలను బయటకు పారేశాడు పలని. బాలానందుడది చూసి, పలనిని కొట్టి, భగవాన్ రాగానే "ఈ పలనిగాడిని యిక్కడినుంచి పంపేస్తావా లేదా?" అని గర్జించాడు. భగవాన్ ఏమీ మాట్లాడలేదు. బాలానందుడు కోపాన్నాపుకోలేక భగవాన్ మీద ఉమ్మేశాడు. భగవాన్ చలించలేదు. కాని, అక్కడున్న భక్తుడొకడు కర్ర పుచ్చుకున్నాడు. బాలానందుడు పలాయనం

చిత్తగించాడు. తిన్నగా రైల్వేస్టేషన్‌కు వెళ్ళి మొదటి తరగతి పెట్టెలో ఎక్కి కూర్చున్నాడు దర్జాగా. అక్కడే ఆగి వున్న రైలులో. టిక్కెట్టు కొనలేదు. అంతటి గొప్పస్వామి టిక్కెట్టు కొనడమంత అపరాధం చేస్తాడా!

ఎక్కడికి వెళ్ళినా. ఎంత తప్పించుకుందామని చూసినా. వాడికి ఆనాడు రాసి పెట్టివున్న దేహశుద్ధి తప్పలేదు.

బాలానందుడెక్కిన పెట్టెలో వయసులోవున్న భార్యా భర్తలు మాత్రమే వున్నారు. ఆ యువకుడి కేదో ఆజ్ఞాపించాడు బాలానందుడు. అతను నిర్లక్ష్యం చేశాడు.

బాలానందుడు కోపోద్రిక్తుడై లేచి నుంచున్నాడు. శపించే వాడిలా పోజుపెట్టి "ఈ కులుకులాడి మత్తుతో నేను చెప్పింది వినిపించలేదా నీకు? చూడు. నిన్నేంచేస్తానో" అన్నాడు.

ఏంచేశేవాడోగాని. యీలోపుగానే ఆ యువకుడు కాలిచెప్పు తీసుకుని ఎడాపెడా వాయించేశాడు శ్రీశ్రీశ్రీ బాలానందస్వామీజీ మహరాజ్ వారిని!

* * *

భగవాన్‌కి యీ స్వాములపీడ యింకా వదల్లేదు.

ఒక మహాస్వామి వచ్చి "ఆ దేవుడు నాకు కలలో కనపడి. నీకు దత్తాత్రేయ మహామంత్రోపదేశం యివ్వమన్నా"డన్నాడు.

"నాకు కూడా కలలో కనపడి ఉపదేశం పొందవలసిందంటే తప్పకుండా పొందుతా"నన్నారు భగవాన్.

మహాస్వామి ఉగ్రుడైపోయాడు. కాని, ఏమి చెయ్యగలడూ! ఏమీ చెయ్యలేక భగవాన్ మీద విషప్రచారం మొదలు పెట్టాడు. అయినా ఆ మహాస్వామికి బాగుపడే రోజులున్నాయి కాబోలు. ఒకనాడు తను ఒంటరిగా వున్నప్పుడు భగవాన్ ప్రత్యక్షమై "మోసపోకు" అని చెప్పివెంటనే అంతర్ధానమయ్యారు.

మహాస్వామి జ్ఞాననేత్రం తెరుచుకుంది. పరుగు పరుగున విరూపాక్షి గుహకు వచ్చి భగవాన్ పాదాలపై పడి క్షమాభిక్ష వేడుకున్నాడు.

* * *

బుర్ర గొరిగించుకున్నా. జడలు పెంచుకున్నా. కాషాయం కట్టుకున్నా. గోచీ మాత్రమే పెట్టుకున్నా. ఎన్నిరకాల వేషాలు వేసినా స్వామి కాలేడు. అవన్నీ "కోటి విద్యలు కూటికొరకే"

మరెవరు నిజమైన స్వామి?

స్వస్వరూపస్థితిలో నిలకడ చెందినవాడే నిజమైన స్వామి - జ్ఞాని - ఏకమేవాద్వితీయుడైన పరమాత్మ.

"జ్ఞానికీ. నాకూ అభేదము" అని కృష్ణపరమాత్మే భగవద్గీతలో నుడివి యున్నారు కదా!

40

ఆకుకూరలవ్వా. మొదలియార్‌పాటి మొదలైన నిరుపేదలు తెచ్చే గంజినీ. భాగ్యవంతులు తెచ్చే పంచభక్ష్యపరమాన్నాలనీ ఒకలాగే చూస్తారు భగవాన్. వారికందరూ సమానులే. అందరూ తన వారే. "వసుధైవ కుటుంబం"...

* * *

భగవాన్‌కున్నది ఒకే ఒక కౌపీనం. అది చిరిగినపుడు దాంట్లోంచే ఒక పోగుతీసి. ఒక ముల్లుకు దాన్ని కట్టి ఆ చిరుగును కుట్టుకుంటారు.

"కౌపీనవంతఃఖలు భాగ్యవంతః..."

* * *

ఎవరో. ఎపుడో ఒక తుండుగుడ్డనిస్తే, వాడగా వాడగా అది చిరుగులపోగై కూర్చుంది. దాన్నొక కుర్రాడు చూసి "స్వామీ, గవర్నర్‌గారు మీ తుండును కొంటారట. అమ్ముతారా?" అన్నాడు నవ్వుతూ. "అమ్మో, దీన్ని అమ్మడమే, ఎంత వెల యిచ్చినా యిచ్చేదిలేదు" అన్నారు భగవాన్!

కుర్రాళ్ళతో గోళీకాయలూ, దాగుడుమూతలూ, బువ్వాలాటలు - ఎన్ని ఆడుకుంటారో భగవాన్!

భగవాన్ చిరుగుల తుండుకి "సహస్రాక్షు"డని నామకరణం చేశారెవరో. దాన్ని భక్తులెవరైనా చూస్తే కొత్త తుండుని తెచ్చిస్తారేమోనని భగవాన్ భయం. ఒకనాడొక భక్తుడు చూడనే చూశాడు. ఎంతో నొచ్చుకుని కొత్త తుండును తెచ్చి ఇచ్చాడు.

భగవాన్ కూడా నొచ్చుకున్నారు. ఆ "సహస్రాక్షుడు" ఆ భక్తుడి కళ్ళబడ్డందుకు!

41

హంఫ్రీస్ పాశ్చాత్యుడు. వెల్లూరులో అసిస్టెంట్ పోలీస్ సూపరింటెండెంట్‌గా వుద్యోగంలో చేరడానికి భారతదేశం వచ్చాడు. బొంబాయి చేరగానే జబ్బుపడి హాస్పటల్‌లో వున్నాడు కొన్నాళ్ళు.

వెల్లూరు వచ్చింతరవాత తెలుగు నేర్చుకోవాలని ఒక మాష్టారుని పెట్టుకున్నాడు. ప్రప్రథమంగా ఆ మాష్టారుని చూసీచూడగానే "మిమ్మల్ని బొంబాయిలో చూశాను కదూ?" అన్నాడు. ఆ మాష్టారు తనెప్పుడూ బొంబాయి వెళ్ళలేదన్నాడు. సంభాషణ నంతటితో ముగించాడు హంఫ్రీస్.

మరునాడు మళ్ళీ "ఇక్కడెవరేనా మహాత్ములున్నారా" అని అడిగాడు హంఫ్రీస్. "నాకు తెలియద" న్నారు మాస్టారు. "అదేమిటండీ అలాగంటారూ? ప్రొద్దుట లేవగానే మీ గురువుగారిని చూశానే! వారు మహాత్ములనే నాకు తోచింది. నాదగ్గర కూర్చుని ఏదో చెప్పారు గాని నాకర్థం కాలేదు" అన్నాడు హంఫ్రీస్.

హంఫ్రీస్‌కు అతీంద్రియ శక్తులున్నట్టు అనుమానపడ్డారు మాస్టారు. కొన్ని ఫొటోలను తెచ్చి హంఫ్రీస్‌ను చూడమన్నారు. హంఫ్రీస్ చూస్తూ ఒక ఫోటోను గుర్తించి "ఇదుగో, వీరే మీ గురువుగారు. నేనీ ప్రొద్దుట చూసింది వీరినే" అన్నాడు.

మాస్టారుకి ఒప్పుకోక తప్పలేదు. ఆ ఫోటోలోని కావ్యకంఠ గణపతి మునీంద్రులే వారి గురువుగారు.

హంఫ్రీస్ కొకనాటి రాత్రి కల వచ్చింది. తెల్లవారిన తరవాత తనకు కలలో కనపడిన దృశ్యాన్ని ఒక బొమ్మ గీసి చూపాడు మాస్టారుకి. ఆ బొమ్మలో వున్నది విరూపాక్షిగుహ, శ్రీరమణభగవాన్, గణపతి మునీంద్రులు. అప్పుడు హంఫ్రీస్‌కు భగవాన్‌ను గురించీ, మునీంద్రులను గురించీ విశదంగా చెప్పారు మాస్టారు.

ఒకనాడు భగవాన్‌ని దర్శించాడు హంఫ్రీస్. వారిని చూడగానే భక్తజనోద్ధారణార్థం దేహధారియై దివినుండి భువికి దిగివచ్చిన పరమాత్మగా భావించాడు వారిని. హంఫ్రీస్‌కు అతీంద్ర శక్తులున్నాయి కదా !

భగవాన్‌ని పరమాత్మగా గుర్తించడానికి అతీంద్రియశక్తుల అవసరం లేదు. చూడగల కళ్ళుంటే చాలు.

42

రాఘవాచారి ఒక పెద్ద ప్రభుత్వోద్యోగి. దివ్యజ్ఞానసమాజ సభ్యుడు. నిర్మలాంతఃకరణుడు. భగవాన్ దగ్గరకు వస్తూ పోతూ వుంటాడు. ఎప్పుడూ

ఏమీ అడగరు. వారి సన్నిధిని శాంతి ననుభవించడమే చాలు ఆయనకి.

ఆచారి కొకనాడొక బుద్ధి పుట్టింది. భగవాన్‌ని మూడుప్రశ్నలు అడగాలని.

ఒకటవ ప్రశ్న: ఎవరూ లేనపుడు మీ దర్శనం కావాలి నాకు. ఎప్పుడనుగ్రహిస్తారు?

రెండవ ప్రశ్న : దివ్యజ్ఞానసమాజాన్ని గురించి తమ అభిప్రాయమేమిటి?

మూడవ ప్రశ్న : అర్హుడనని తోస్తే నాకు తమ నిజరూపం చూపండి.

ఎప్పటిలాగే భగవాన్ దర్శనానికి వెళ్ళాడు. అప్పుడు భక్తబృంద పరివేష్టితులై వున్నారు భగవాన్. రాఘవాచారి వచ్చిన కాసేపట్లోనే భక్తులొకరొకరూ బయటకు వెళ్ళి పోయారు.

అడగక్కర్లేకుండానే ఆయన మొదటి ప్రశ్నకు సమాధానం దొరికింది. ఎప్పుడో కాదు. అప్పుడే అనుగ్రహించారు భగవాన్. ఆచారికి ఏకాంతదర్శనం.

రెండో ప్రశ్నకూడా అడగలేదాయన. అడుగుదామనుకుంటూండగానే "మీరు దివ్యజ్ఞాన సమాజ సభ్యులు కామోలు. ఆ సమాజం మంచి పనే చేస్తోంది" అన్నారు భగవాన్.

అడుగుదామనుకున్న రెండు ప్రశ్నలకి అడక్కుండానే జవాబులు లభించినందుకు ఆశ్చర్యపోయాడు ఆచారి. మూడో కోరికను కూడా తమంతటతామే తీరుస్తారేమోనని నిశ్శబ్దంగా కూర్చున్నాడు. కాని భగవాన్ అటువంటి పనేమీ చెయ్యలేదు. అప్పుడిక అడగక తప్పలేదాయనకి.

"అర్జునుడికి కృష్ణపరమాత్మ విశ్వరూపసందర్శనం లభించింది. నాకు తమ నిజరూపం చూడాలనుంది. అర్హుడనని తోస్తే అనుగ్రహించండి" అని భగవాన్‌ని ప్రార్థించాడు.

భగవాన్ సూటిగా ఆచారి కళ్ళల్లోకి చూశారు. ఆయన కూడా భగవాన్‌ని చూస్తూండగానే భగవాన్ భౌతిక శరీరం అదృశ్యమయింది. ఆకాశం, అక్కడొక తెల్లని మబ్బు, అందులోనుండి దుర్నిరీక్ష్యమైన కాంతిపుంజం - చూడలేక కళ్ళు

మూసుకున్నాడు ఆచారి. కొంతసేపటికి కళ్ళు తెరిచేసరికి భగవాన్ యథాస్థానంలో, యథాప్రకారమే కనపడ్డారు.

తను చూసినది భగవాన్‌కు విన్నవించుకోగా "మీరు చూసినది ఒక దృశ్యం మాత్రమే. నాకు రూపం లేదు. ఆత్మకు నామరూపాలు లేవు" అన్నారు భగవాన్.

* * *

ఒక సందర్భంలో భగవాన్ తమను గురించి యిలా చెప్పుకున్నారు.

" హరి మొదలయిన యితర జీవుల హృదయ
వారిజ గుహయందు వ్యాపకముగ
నెరుకయై రమియించు పరమాత్ముడెవ్వడో
అరుణాచలరమణుడగు నతండే"
(పిపీలికాది బ్రహ్మపర్యంతం జీవకోట్ల హృదయాంతరాళాలలో
ఎరుకయై క్రీడించు పరమాత్మే అరుణాచలరమణుడు)....

43

భగవాన్‌కు కొండమీద కోతులూ, పక్షులూ, ఉడతలూ, అన్నిటి తోటి స్నేహమే. అక్కడి తేళ్ళనీ, పాములనీ కూడా చంపనియ్యరు."ఈ కొండ వాటి రాజ్యం. మనం వాటి అతిథులం" అంటారు. అంతే కాదు. " అవి కూడా మనవలెనే కర్మ శేషాన్ని తీర్చుకోవడానికి వచ్చాయి" అంటారు.

పక్షులు వారి చేతులమీదుగా ఆహారాన్ని తీసుకుంటాయి. వారి దోసిట్లో నీళ్ళు తాగుతాయి. ఉడతలూ అంతే.

ఒక కాకి తన పిల్లను భగవాన్ రక్షణలో పెట్టి పోయేది. వారు ఆ పిల్లకు

స్వహస్తాలతో ఆహారం పెట్టేవారు.

*   *   *

పులులూ, చిరుతలూ కూడా ఆ రోజుల్లో కనపడేవి. భక్తులు భయప గుహలోకి పారిపోయేవారు. భగవాన్ కేమి భయం! వారక్కడే వుండేవారు. వా చూస్తూనే వాటి దారిన అవి పోయేవి.

" మదాత్మా సర్వభూతాత్మా"

"పులి" అనగానే ఒక మిత్రుడు చెప్పిన విషయం గుర్తుకొచ్చింది. ఒక పరమాత్ముడు శిష్య బృందంతో సహా అడవిమార్గాన వెళుతున్నాడట. అల వెళుతుండగా గాండ్రిస్తూ ఒక పులి ఎదురయిందట. శిష్యులు గడగ వణికిపోయారట. "మీ కొచ్చిన భయమేమీ లేదు. నేనున్నానుగా! నా చుట్టూ నుంచోండి" అన్నాడట ఆ మహాత్ముడు.

ఇటువంటి మహాత్ములు లక్షోపలక్షలు.

భగవాన్ వంటివారో ?

"....సంభవామి యుగేయుగే"

*   *   *

పెద్దపులి గాండ్రిపునీ, కోతి కిచకిచలనీ అర్థం చేసుకోగలరు భగవాన్ వాటితో మాట్లాడగలరుకూడా.

ఒకప్పుడొక పెద్ద పులి గాండ్రించినపుడు భక్తులు గజగజ వణికి పోయా "భయమెందుకూ? వారొక సిద్ధులు, నన్ను చూడాలని వచ్చారు" అన్నా భగవాన్.

నమ్మ శక్యం కాదంటాం మనం. అయితే భగవాన్ అబద్ధాలు చెప్పడా అవతరించారని అనగలమా ?

*   *   *

కోతుల్లో రాజులూ, రాజ్యాలూ, రాయభారాలూ, యుద్ధాలూ వున్నాయి. వాటి వివాదాలు విని, తీర్పు చెప్పి రాజీ చేస్తారు భగవాన్.

మనిషి పెంపకంలో వుండి, మనిషితో స్నేహంగా వుండిన కోతులని వెలివేస్తాయి మిగతా కోతులు. కాని, భగవాన్ విషయంలో మాత్రం వాటికి పట్టింపు లేదు.

ఎప్పుడో ఒక కోతిపిల్లని ఒక పెద్దకోతి బాగా కరిచింది. ఆ కోతిపిల్ల ఎలాగో విరూపాక్షగుహకు చేరింది కుంటుకుంటూ. చేరి, స్మృతి తప్పి పడిపోయింది. చచ్చిపోయిందనుకున్నారు. కాని, భగవాన్ దానికెంతో పరిచర్యచేసి బ్రతికించారు. బ్రతికిందికాని, కుంటిదిగానే వుండిపోయింది. అందుచేత దాన్ని "నొండి" అని పిలిచేవారు. నొండి అనగా కుంటి. నొండికి భగవాన్ దగ్గర బాగా చనువు. వొళ్ళో కూర్చునేది. శుచీ శుభ్రంగానే వుండేదిగాని, దానికి కోపం జాస్తి.

నొండి ఒక రోజున సరిగా అన్నం తినకుండా చెల్లాచెదురుగా చిమ్మేసింది. భగవాన్ మందలించారు. దానికి కోపమొచ్చి భగవాన్‌ను కొట్టింది. తమను కొట్టినందుకు శిక్షగా దాన్ని దగ్గరకు రానివ్వలేదు భగవాన్. అప్పుడు నొండి ఎంత బ్రతిమాలుకుందో ! ఎంతగా కాళ్ళా వేళ్లా పడిందో !మళ్ళీ భగవాన్ తనని తమ వడిలోకి తీసుకునేవరకూ అది పడిన తహతహ యింతింత కాదు.

ఒకనాడు భగవాన్ "నొండీ, నువ్వు రాజువయినపుడు నన్ను మరిచిపోకుసుమా"అన్నారు.

కొన్నాళ్ళ తరవాత నిజంగానే రాజయింది నొండి. భగవాన్ సమక్షంలోనే పట్టాభిషేకం చేసుకోవాలని కొంతమంది అనుచరులతో సహా విరూపాక్షిగుహకు వచ్చింది. అప్పుడక్కడ భగవాన్‌లేరు. నొండికి ఆశాభంగమయింది. అదీ, దాని అనుచరులూ అక్కడిచెట్టు చేమలని ధ్వంసం చేసి వదిలిపెట్టాయి. భగవాన్ వచ్చిన తరవాత చెప్పారు భక్తులు, నొండి చేసిన ఘనకార్యం.

మరునాడు మళ్ళీ వచ్చింది నొండి. వచ్చి, భగవాన్ దగ్గర కూర్చుంది. మిగతా కోతులు నొండికి సలాం చేసాయి. భగవాన్ గ్రహించారు. నొండి రాజయిందని. చాలా సంతోషించి. తమప్రక్కనే ఆకు వేయించి వడ్డింపించారు. కాని. నొండి అక్కడ నుంచి లేచిపోయింది. తిన్నగా వెళ్ళి తన రాణులపక్క కూర్చుంది. చుట్టూ అనుచరులున్నారు. భగవాన్‌కు అర్థమయింది. అప్పుడా కోతిమూక కంతటికీ విందుభోజనం పెట్టించారు. బుద్ధిగా తిని వెళ్ళిపోయాయి. భగవాన్ స్వయంగా తన పట్టాభిషేక మహోత్సవం జరిపించినందుకు పొంగిపోయింది నొండి. భగవాన్‌కు తన కృతజ్ఞతను తెలుపుకుంది.

నొండి రాజుగారు అప్పుడప్పుడు వచ్చి భగవాన్‌ను దర్శించుకోవడం మానలేదు.

ఒకనాడు భగవాన్. భక్తులూ గిరి ప్రదక్షిణం చేస్తున్నారు. మిట్ట మధ్యాహ్నమయింది. దాహం వేసిందందరికీ. ఒకచోట కూర్చున్నారు. దగ్గరలోనే ఒక నేరేడు చెట్టుంది. ఆ చెట్టునిండా పళ్లున్నాయి. కాని. వాటిని కోసుకోవడానికి ఒప్పుకోరు భగవాన్. అదెవరి సొత్తోనని. ఎక్కడినుంచి వచ్చిపడ్డాయో కోతులు. ఒక దండు దండంతా వచ్చింది. ఆ నేరేడు చెట్టుమీదికెక్కాయి. దాని కొమ్మలని వూపి వదిలిపెట్టాయి. నేలమీదికి బోలెడు పళ్లు రాలాయి. రాలినపండు నొకదాన్నీ ముట్టుకోలేదవి. ఎలాగ వచ్చాయో అలాగే వెళ్లిపోయాయి.

"చూసారా వాటి కృతజ్ఞత! మనదగ్గరెప్పుడో ఏవో తిన్న కోతులే అవి" అన్నారు భగవాన్.

కోతులు రాల్చిన పండ్లని తిని తమ దాహం తీర్చుకున్నారు భక్తులూ. భగవాన్.

* * *

భగవాన్ ఒకనాడు కొండమీద తిరుగుతూండగా వారి తొడ ఒక పొదకు

రాసుకుంది. అక్కడున్న కందిరీగలతుట్ట రేగి భగవాన్ తొడని బాగా కుట్టాయి. భగవాన్ అక్కడినుంచి కదల్లేదు. మెదల్లేదు. వాటి ఏకాంతాన్ని భంగం చేసిన తమ తొడకి అది తగిన శిక్షేననుకున్నారు. బాగా కుట్టివదిగిపెట్టిన తరువాత గుహకు చేరుకున్నారు.

పలని చూసి భోరున ఏడ్చాడు. వారి తొడ బాగా వాచిపోయివుంది. ఆ కందిరీగల ముక్కులు తొడలో విరిగి సూదుల్లాగా తగులుతున్నాయి. పలని మూడు రోజులపాటు వరసగా తీశాడా ముళ్ళని.

భగవాన్ కాలు మళ్ళీ మామూలు కాలు కావడానికి కొన్ని రోజులు పట్టింది.

* * *

భగవాన్ దర్శనానికి రోజూ వస్తూండేది ఒక కుక్క. దానిని భగవాన్ ప్రేమగా 'కరుప్పన్' అని పిలిచేవారు. దానికి కూడా రోజూ ఆహారం పెట్టేవారు. ఒకనాడెవరో దాని విషయంలో మోటుగా ప్రవర్తించడంవల్ల రావడం మానేసింది గుహకి. వానకురుస్తున్నా. అలాగే తడుస్తూపడుకుంది. ఎక్కడో భక్తులు. చూసి బ్రతిమాలి తీసుకొచ్చారు.

"వీరెవరో మీకు తెలియదు. మొరటుగా ప్రవర్తించకండి" అన్నారు భగవాన్. ఆ కుక్కను నిమురుతూ.

* * *

భగవాన్ దగ్గరకు వచ్చే మరొక కుక్కపిల్లను తిట్టాడు పలని ఒకనాడు. అది తిన్నగా వెళ్ళి శంకుతీర్థంలోకి దూకి ఆత్మహత్య చేసుకుంది.

"కర్మావశేషం తీర్చుకోవడానికి వచ్చారాయన. చాలా అభిమానవంతుడు. మాట పడలేక ఆత్మహత్మ చేసుకున్నాడు" అన్నారు భగవాన్.

పలని చాలా బాధపడ్డాడు తను చేసిన పనికి. మించిపోయిన తరవాత ఎంతబాధపడి ఏమి ప్రయోజనం!

కుక్కా, నక్కా, పిల్లీ, పులీ వీటిపై తొడుగులనే చూడగలం గాని, లో
తొడుగుల్లోవున్న వారి నెలా చూడగలం! అది భగవాన్‌కే చెల్లింది.

44

భగవాన్ కొబ్బరి పెంకులతో కమండలం, భిక్షాపాత్ర, గరిటెలు, చెంచాలు, ఎన్నోరకాలు ఎంతో చక్కగా చేసేవారు. వాటినే వుపయోగించేవారు. ఒకనాడొక చేతికర్రనెంతో చక్కగా తయారు చేశారు చాలా కష్టపడి. చెయ్యడం పూర్తయిందో లేదో, ఒక ముసలివాడు తూలుతూ అలా వెళుతుండడం చూశారు. వెళ్ళి ఆ కర్రని ఆ తాత కిచ్చేశారు. ఇచ్చేసి " ఆ కర్ర ఎవరికోసం తయారు కాబడ్డదో వారికే ముట్టింది. దాన్నిచ్చినందుకు మనకేమి ప్రతిఫలమక్కరలే దన్నా రు.

నిష్కామకర్మనే కదా భగవద్గీత స్తుతిస్తూన్నదీ

" కర్మజం బుద్ధి యుక్తాహి
ఫలం త్యక్త్వా మనీషిణః
జన్మ బంధ వినిర్ముక్తాః
పదం గత్యం తనామయం"

45

భగవాన్ దర్శనానికి ఎంతోమంది భక్తులు వస్తారు. వారిలో కొందరికి భగవాన్ సేవకంకితమై పోవాలనే కాంక్ష. వారి పరిచర్య భాగ్యం ప్రప్రథమంగా లభించినది పలనిస్వామికే. ఆ తరువాత అయ్యా స్వామి, కందస్వామి, పెరుమాళ్‌స్వామి భగవాన్‌కు సేవచేశారు. వీరంతా భగవాన్ విరూపాక్షిగుహాలో వుండగా చేరినవారు. ఆ తరువాత యింకా ఎంతో మందికి వారి సేవాభాగ్యం లభించింది. అందరికందరూ త్రికరణశుద్ధిగా భగవాన్ సేవ కంకితమయినవారే.

* * *

వాసుదేవశాస్త్రి సద్బ్రాహ్మణుడు. మధురస్వభావుడు.

భగవాన్‌కు 32 సంవత్సరాలు నిండిన సందర్భంలో వారి జయంతిని (జన్మదిన మహోత్సవాన్ని) జరపాలని తలపెట్టాడు.

"పుట్టినరోజునాడైనా పుట్టినందుకు ఏడవక 'పుట్టినరోజు పుట్టినరోజు' అంటూ ఏదో వేడుక చెయ్యాలని ఉబలాటపడతారెందుకు? ఆ వేళయినానేనెవరిని -ఎక్కడనుంచి వచ్చాను అనే విచారణ చెయ్యకూడదా ? జనన మరణాలులేని ఆత్మలో ఆత్మగా మిగిలిపోయినరోజే నిజమైన పుట్టినరోజు" అన్నారు భగవాన్.

వారంటేమాత్రం భక్తులు వింటారా! చెయ్యాలంటే చెయ్యాలన్నారు. చేశారు.

ఆనాటి నుంచీ శ్రీరమణజయంతి మహోత్సవాలు జరుగుతూనే వున్నాయి.

46

భగవాన్‌కు ఒకరోజు తప్పక భిక్షతెచ్చేది ఎచ్చెమ్మాళ్ . మిగతావాళ్ళు తెచ్చినపుడు తెచ్చేవారు - లేనప్పుడు లేదు. పదిమంది తెచ్చిన రోజులూ వున్నాయి. ఒక్కరుకూడా తేని రోజులూ వున్నాయి ఎచ్చెమ్మాళ్ తప్ప. భగవాన్, పరిచారకులూ, అప్పుడక్కడున్న భక్తులూ, తెచ్చిన భిక్షను సమంగా తినేవారు. తమకొక మెతుకు ఎక్కువపెట్టినా ఒప్పుకునేవారుకాదు భగవాన్. అలాపెట్టారా, ఆ పూట భోంచేసేవారేకాదు. అందుచేత భక్తులకీ, పరిచారకులుకీ భగవాన్

యెతల ఎంత ప్రత్యేకత చూపించాలనివున్నా. మొదటికే మోసమొస్తుందేమోనని జడిసి వూరుకునేవారు.

ఒక రోజున భిక్ష ఎక్కువగా వస్తుంది. ఒకరోజున అసలే రాదు. అందుచేత భగవాన్ పరిచారకులు రోజూ వూళ్ళోకి భిక్షకు వెళ్ళడం మొదలు పెట్టారు. భగవాన్ పరిచారకులని తెలిస్తే అందరి కందరూ భిక్ష పెట్టేవాళ్ళే. ఇది కనిపెట్టి ప్రతీ బైరాగీ, ప్రతీ సన్యాసీ భగవాన్ పరిచారకుడననే చెప్పుకునేవాడు.

పెరుమాళ్‌స్వామి యీ దొంగసన్యాసుల నాటకం కనిపెట్టేశాడు. వీళ్ళ ఆటకట్టించాలని భగవాన్ దగ్గరకు వెళ్ళి, తమకొక గీతం రాసివ్వమనీ, ఆ గీతాన్ని పాడుకుంటూ భిక్షకు వెళతామనీ అర్ధించారు. భగవాన్ అలాగే రాసిచ్చారు. ఆనాటి నుంచి ఆ గీతాన్ని పాడుకుంటూ వచ్చిన బృందాన్నే భగవాన్ పరిచారకులుగా గుర్తించి భిక్ష వేసేవారు. ఈ పరిచారకులు కూడా అవసరమైనంతవరకే భిక్షను సేకరించి గుహకు వెళ్ళిపోయేవారు.

భగవాన్ రాసిచ్చినది ఒక అపూర్వమైన గీతం. దాని పేరు అక్షరమణమాల. అనగా, వివాహసమయంలో వధువు వరుని మెడలో వేసే పూలమాల. అందులో నాయకుడు అరుణాచలేశ్వరుడు. నాయిక శ్రీరమణ భగవాన్. పూలహారం పట్టుకుని నాయకుడిని ప్రార్థిస్తుంది నాయిక, తనను స్వీకరించమని. ఒకప్పుడు ముగ్ధ, ఒకప్పుడు ప్రౌఢ, మరొకప్పుడు విరహిణి - ఈవిధమైన రూపాలు దాలుస్తుంది నాయిక.

నాయకుడికి నాయిక ప్రార్ధనను మన్నించక తప్పలేదు. నాయిక నాయకుడి మెడలో ఆ పూలహారాన్ని వేస్తుంది.

(ఆనాటి వెంకటరామన్ యీనాడు అమ్మాయిగా మారి, అరుణాచలుడనే అబ్బాయిగారిని పెళ్ళాడాడు)

అక్షరమణమాలకు పల్లవి:

"అరుణాచలశివ అరుణాచలశివ అరుణాచలశివ అరుణాచలా
అరుణాచలశివ అరుణాచలశివ అరుణాచలశివ అరుణాచలా"

ఈ గీతంలో 108 చరణాలున్నాయి. అందులో కొన్ని :

"అరుణాచల మనుచు స్మరియించువారల యహము నిర్మూలింతు వరుణాచలా"

"నిన్ను ధ్యానించేవారి అహంకారాన్ని రూపుమాపుదువు" అని అర్థం

"అళగు సుందరములవలె చేరినేను నీ వుంద మభిన్నమై అరుణాచలా"

(భగవాన్ తల్లి పేరు అళగమ్మ. తండ్రి పేరు సుందరమయ్యర్. "నా తల్లిదండ్రులున్నంత అన్యోన్యంగా వుందా" మని ఒక అర్థం. అళగు అంటే సౌందర్యం. సుందరమన్నా సౌందర్యమే. సౌందర్యంలో సౌందర్యం కలిసిపోతే ఏర్పడేది కూడా సౌందర్యమే. అటువంటి సౌందర్యంగా ఏకమయిపోదా" మని యింకొక అర్థం).

"వలనుంచి భక్తుల పరిమార్చు నిను కట్టుకుని ఎట్లు
జీవింతునరుణాచలా"

("వలవేసి చేపలను పట్టుకున్నట్లు భక్తులను పట్టుకుని, వాళ్ళను హతమార్చే నిన్ను పెళ్ళి చేసుకొని నీతో వేగగలనా ?" అని ఒక అర్థం. "భక్త వత్సలుడవై భక్తుల నాకర్షించి, వాళ్ళని నీలో ఐక్యం చేసుకుంటూ కాలం గడిపే నీకు, నా మొహం చూడ్డానికైనా తీరుబడి వుంటుందా? అని యింకొక అర్థం).

"నను జెరచి యిపుడు నను కలువక విడుటిది మగతన మొక్కొ అరుణాచలా

(ఒక అర్థం తెలుస్తూనే వుంది. "నన్నాకర్షించి నన్ను నీలో లీనం చేసుకోకుండా యీ దుఃఖాలకి, యీక్షణిక సుఖాలకీ విడిచి పెట్టడమేనా నీ గొప్పతనం?" ఇది యింకొక అర్థం.)

"సత్యాహమున మనోమృదు పుష్పశయ్యపై మేన్గలయ
కరుణింపరుణాచలా"

"రేయింబవలులేని బట్టబయటి యింట రమియింపగా రమ్మరుణాచలా"

(వీటిలో ఎంత వేదాంతం నిగూఢమై వుందో ప్రత్యక్షమే)

"కాంత మినుమువలె గవసి నను విడువక కలసి నాతోనుండు"

మంటుందొకచోట బ్రతిమాలుతూ.

(కాంతమనగా అయస్కాంతం)

"వంచకా వేడియున్ కొరంవెమున్ కరుగవే'

అంటుందింకొక చోట నిందిస్తూ.

"అడుగకిచ్చెడు నీదు నకళంకమగు కీర్తి హాని సేయక ప్రోవు"

మంటుందింకొకచోట గడుసుతనాన్ని ప్రదర్శిస్తూ.

"వేరకున్నను మేను నీరుగ కరగి కన్నీ కేరయి నశింతు"

నంటుందింకొకచోట విలపిస్తూ.

"దైవమనుచు నిన్ను దరిజేరగా నన్ను పూర్ణనాశమొనర్చితి"

వంటుందొకచోట దెప్పుతూ.

"నిర్భీతి నిన్‌జేరు నిర్భీతు నన్‌జేర భీతి నీకేలొకో"

అంటుందింకొకచోట హేళన చేస్తూ.

ఇలారంగుల హరివిల్లులా ప్రకాశిస్తుంది "అక్షరమణమాల"

47

భగవంతుడుని కన్నతల్లికి కూడా కష్టాలేనా?

ఆమెకే తప్పవు కామోలు. శ్రీరామచంద్రుడిని కన్న కౌశల్యాదేవి. శ్రీకృష్ణపరమాత్మను కన్న దేవకీదేవి. వీరందరూ పడిన కష్టాలు జగద్విదితమే. ముఖ్యంగా. వారు బిడ్డలకు దూరమై దుఃఖించారు.

అళగమ్మ చిన్న కుమారుడిని విడిచిపెట్టి వెళ్ళిన తరవాత పెద్ద కుమారుడు నాగసామి చనిపోయాడని తెలుసుకదా! ఇప్పుడు మరిది నెల్లి యప్పయ్యర్ కాలం చేశాడు. మూడవ కుమారుడు నాగసుందరం భార్యకూడా వెళ్ళిపోయింది

. పసివాడి నొకడిని విడిచిపెట్టి. వృద్ధాప్యంలో తనను కనిపెట్టుకుని వుండేందుకు ఎవరూ లేకపోయారు. తోడికోడలు జానకమ్మ (నెల్లియప్పయ్యర్ భార్య) కూడా వృద్ధురాలే. గత్యంతరంలేక. మనవడు (నాగసుందరం కొడుకు. వెంకటరామన్) ని కూతురు అలిమేలుమంగకు వప్పజెప్పి తను భగవాన్ దగ్గరకు వచ్చేసింది.

అళగమ్మ వచ్చిన తరవాత విరూపాక్షగుహలో వంట ప్రారంభమయింది. ఎవరినీ ఎవరూ ఏమీ అడగకుండానే కావలసిన ఉప్పూ. పప్పూ. గిన్నే. దొన్నే- అన్నింటినీ సమకూర్చారు భక్తులు.

ఒక రోజున అప్పడాలు చెయ్యడం మొదలుపెట్టింది అళగమ్మ. భగవాన్ తల్లికి సాయం వెళ్ళారు. పాటపాడుతూ అప్పడాలు వొత్తసాగారు.

ఆ పాటలో ఎంత బోధ! ఆ పాటయిది:

పల్లవి: అప్పడ మొత్తి చూడు-
అది తినునప్పుడే నీ యాశదీరు ||అ||

అనుపల్లవి: ఇప్పుడమి యందున నేమరి తిరుగక
సద్బోధానందుడౌ - సద్గురునాధుడు
చెప్పక చెప్పెడు - తత్వమగు నమము
గొప్పది లేనట్టి - యొక మాట చొప్పున ||అ||

చరణములు: తానుగాని పంచకోశక్షేత్రమునందు
దానుగా పెరు గభిమాన మినుములను
నేనెవ్వడనెడు విచార తిరుగలిలో
'నేను' గానని పగులగొట్టి పిండియు జేసి ||అ||

సత్సంగమనియెడి నల్లేరు రసముతో
శమదమములను జీలకర్ర మిరియములు

యుపరతి యనునట్టి ఉప్పును గలిపి
సద్వాసన యనియెడి యింగువను జేర్చి ||అ||

రాతి చిత్తము నేను నేనని భ్రమయక
లోదృష్టి రోకటితోను మానక దంచి
శాంతమౌ కొడుపుతో సమమగు పీటపై
సంతత మలయక సంతసంబుతోడ ||అ||

మౌనముద్రయనెడి ముగియని పాత్రమున
జ్ఞానాగ్ని చే గ్రాగు సద్బ్రహ్మామృతమున
'నే' 'నది' యగునని నిత్యమును బేల్చి
తను దాను భుజియింప దన్మయమగునట్టి ||అ||

అళగమ్మ భగవాన్ దగ్గర వుంటూన్నా అమెకు తన మూడో కొడుకు (ఆఖరివాడు) నాగసుందరం మీద ధ్యానం పోతూనే వుంది.

"భార్యపోయింది. ఒంటరివాడయిపోయాడు. పాపం. ఎలా వుంటున్నాడో!" అంటూ వుంటుంది.

భగవాన్ భక్తుడొకాయన మానామదురలో నాగసుందరాన్ని కలుసుకోవడం తటస్థించినపుడు మీయమ్మగారు "నిన్నెప్పుడూ తలబెడుతూంటారు. వృద్ధురాలయిందికదా. అందుచేత తన అవసాన సమయంలో కుమారులిద్దరూ దగ్గరుండాలని కోరుకుంటున్నారు. పోనీ. నువ్వు కూడా అక్కడికే వెళ్ళరాదాఒంటరివాడివి. ఇక్కడేమి చేస్తావు "అన్నాడు.

నాగసుందరానికి జీవితం దుర్భరంగానే వుంది. ముఖ్యంగా. భార్యగతించినతరవాత. కొడుకు పసికందు. తన చెల్లెలు దగ్గరున్నాడు. బొత్తిగా ఏకాకైపోయాడు. ఇప్పుడు తల్లికి కూడా తనమీద బెంగగా వున్నట్టు తెలుసుకున్నాడు. ఇక కాలయాపన చెయ్యకుండా తిరువన్నామలై చేరాడు.

తల్లిని చూశాడు. తనకొక విధమైన తృప్తి కలిగింది. ఆమె హృదయం చల్లబడింది. భగవాన్‌కు పాదాభివందనం చేశాడు.

అయితే. నాగసుందరం గుహలో కాపురం పెట్టలేదు. భక్తుల్లో ఒక భక్తుడిలాగే వచ్చిపోతున్నాడు. ఊళ్ళో ఒక సత్రవులో మకాం. తిండికూడా అక్కడే కొన్నాళ్ళపాటు. భగవాన్ బోధామృతాన్నిగ్రోలి. వైరాగ్యం పెరిగి. కాషాయవస్త్రాలు ధరించి భిక్షాటన మొదలుపెట్టాడు. భక్తులకిది నచ్చలేదు. "భగవాన్ సోదరుడు. వారి తల్లి అందరికీ వండి పెడుతోంది. ఇంతమంది తింటూండగా లేనిది. కన్నకుమారుడింకొకడు తింటే తరిగి పోతుందా! భక్తులు తెచ్చిచ్చే సామగ్రి సమృద్ధిగానే వుంటోందిగదా!" ఇలా తమలో తాము అనుకుని. నాగసుందరాన్ని నిర్భంధించారు భక్తులు గుహలోనే ఉంటూండమనీ. అక్కడే తింటూండమనీ. నాగసుందరం ఒప్పుకోక తప్పలేదు.

48

విరూపాక్షిగుహ చాలడంలేదు. వచ్చేపోయే భక్తులెక్కువవడంతోటి. అక్కడే కొంతమంది స్థిరనివాసం ఏర్పరచుకోవడంతోటి. ఈసమస్యకు పరిష్కారాన్ని ఆలోచిస్తూండగా. భగవాన్ పరిచారకులలో ఒకడయిన కందస్వామి. విరూపాక్షి గుహకు బాగా ఎగువున ఒక సమస్థలం. దానికి దాపునే ఒక చిన్న జలపాతం వుండడం చూశాడు. చూసి వూరుకోలేదు. అక్కడొక ఇల్లు కట్టాడు. అందులో రెండు గదులూ. ఒక వంట ఇల్లూ వున్నాయి. ముంగిట నీడనిచ్చే ఒక మహావృక్షముంది. గొప్పగా తయారయింది మొత్తం మీద. దీనికి "స్కందాశ్రమం" అని పేరు పెట్టారు. ఈ పేరు పెట్టడానికి రెండు కారణాలున్నాయి. ఒకటి. భగవాన్ స్కందుని(కుమారస్వామియొక్క)అవతారం కాబట్టి రెండు. ఇతరులు కొంత సహాయం చేసినా కందస్వామి (సంస్కృతంలో

స్కందస్వామియనలేని శ్రమకోర్చి నిర్మించాడు కాబట్టి.

* * *

భగవాన్ మకాం స్కందాశ్రమానికి మారింది. భగవాన్‌తోపాటు బృందమంతా కూడా చేరిందక్కడికి. విరూపాక్షిగుహ ఖాళీ అయిపో అయినా, ఆ గుహనీ, భగవాన్ తపస్సు చేసిన ఇతర స్థలాలనీ, యీనాటికీ భక్తు దర్శిస్తున్నారు. వీటినేకాదు, భగవాన్ జన్మించిన తిరుచ్చుళి "సుందరమందిరం" - ఇవికూడా యాత్రాస్థలాలయ్యాయి.

* * *

అమృతనాథుడూ, శంకరానందుడూ హరిద్వారంలోని ఒక ఆశ్రమంలో ఉంటూ తపస్సు చేసుకుంటున్నారు.

"విద్యారణ్యులవారి నిర్యాణంతోటే మన భారతదేశంలో యిక "మహ అన్నవాడు లేకుండా పోయాడు" అన్నాడు శంకరానందుడు, మాట సందర్భంలో.

అమృతనాథుడందుకు ఒప్పుకోలేదు. "తిరువణ్ణామలైలో భగవా శ్రీరమణ మహర్షులవారున్నారు. వారు కేవలం శివకుమారుడైన కుమారస్వామి అవతారం" అని చెప్పాడు.

శంకరానందుడు వెటకారంగా నవ్వి వూరుకున్నాడు అమృతనాథు మూఢనమ్మకానికి.

కొన్నాళ్ళయింది.

శంకరానందుడు సుబ్రహ్మణ్యోపాసన చేస్తున్నాడు. పుట్టగోచిని మాత్రమే ధరించిన తేజస్వి ఒకాయన అక్కడికొచ్చి" నీ జపం తీరు సరిగాలేదు" అన్నా "మరింకెలా వుండాలి?" అని అడిగాడు శంకరా నందుడు. "సింహాళంలో కదురు అనే గ్రామం వుంది. అక్కడకు వెళ్లు, తెలుస్తుంది అన్నాడు తేజస్వి.

ఇంతలో ఒక బల్లి పై నుంచి పడింది శంకరానందుడిమీద. దాన్ని దులుపుకుని వెనక్కు తిరిగి చూసేసరికి ఆ తేజస్వి లేడక్కడ. వెళ్ళి పోతున్నాడేమోనని ఆశ్రమం బయటకు వచ్చి చూశాడు. ఎక్కడా కనిపించలేదు. అక్కడే చెట్లకి నీళ్ళు పోస్తూన్న పనివాళ్ళనడిగితే "ఆశ్రమం లోనికి ఎవరూ పోనూలేదు. లోపలినుంచి ఎవరూ రానూలేదు" అన్నారు వాళ్లు.

ఆశ్చర్యం ముంచుకొచ్చింది శంకరానందుడికి. వెళ్ళి, జరిగిన దంతా అమృతనాథుడితో చెప్పాడు. తను చూసిన తేజస్వి రూపాన్ని వర్ణించాడు.

"ఇంకా సందేహమెందుకూ? నీకు దర్శనమిచ్చినది శ్రీరమణులే" అన్నాడు అమృతనాథుడు.

శంకరానందుడిక క్షణం తాళలేకపోయాడు. ఆవేశం, ఉద్వేగం. తక్షణమే కాలినడకన బయలుదేరాడు. ఉత్తరాన హిమాలయాలలో ఉన్న ఎక్కడి హరిద్వారం! దక్షిణాన హిందూమహాసముద్రానికి చేరువలోనున్న ఎక్కడి తిరువన్నామలై! కొన్ని నెలలపాటు నడిచి చేరుకున్నాడు తిరువన్నామలై. కొండెక్కి స్కందాశ్రమానికి వెళ్ళాడు. శ్రీ రమణ భగవాన్‌ను దర్శించాడు. తనకానాడు దర్శనమిచ్చిన తేజస్విగా వారిని గుర్తించాడు. తానింకా తన్మయత్వం నుంచి తేరుకోనేలేదు. అంతలోనే భగవాన్ అడిగారు-

"హరిద్వారం నుంచి వస్తున్నారా? అని.

భగవాన్‌కు సాగిలపడి ప్రణామములాచరించి జరిగినదంతా చెప్పాడు శంకరానందుడు

"అలాగా! పాపం, చాలా శ్రమపడ్డారే!" అన్నారు భగవాన్.

శంకరానందుడు ఆ తరువాత "రమణాష్టకం" "శ్రీ రమణాష్టోత్తర నామావళి" రచించాడు.

* * *

స్కందాశ్రమం ముందున్న మహావృక్షం నీడనే. ఆ చెట్టు చుట్టూ కట్టిన

గట్టుమీద కూర్చుంటూంటారు భగవాన్. దనదినమూ అక్కడి కొక్క పెద్ద త్రాసుపాము వచ్చి, పడగవిప్పి భగవాన్ పాదాల ముందు కాసేపుండి వెళ్లిపోతుంది. ఆశ్రమ నెమళ్ళు రెండున్నాయి అక్కడ. అవి పురివిప్పి నృత్యం చేస్తూన్నపుడు పాముకూడా పడగ విప్పి ఆడుతుంది. నెమలీ, పామూ సహజశత్రువులు. భగవాన్ సమక్షంలో తమ శతృత్వాన్ని విస్మరిస్తాయి.

*　　　　*　　　　*

స్కందాశ్రమానికొక కుక్కపిల్ల వచ్చింది. ఎంత తరిమినా పోలేదు. భగవాన్ చూశారు. దాన్నేమీ చెయ్యొద్దని దగ్గరకు తీసుకున్నారు. 'కమల' అని పేరు పెట్టారు. అది ఆశ్రమంలోనే పెరిగింది. దాని మొదటి కాన్పు ఎంతో ముచ్చటగా జరిగింది. పురుటిస్నానం చేయించారు. పుణ్యావాచనం చేయించారు. పసుపు కుంకుమలు పెట్టించారు. ఇదంతా భగవాన్ ఆధ్వర్యంలోనే.

కమల ఏటేటా కన్నది. దాని సంసారం చాలా పెద్దదయింది. కమల ఎవరో భగవాన్ కొక్కరికే తెలియాలి.

*　　　　*　　　　*

భగవాన్ స్కందాశ్రమంలో వుండగానే వారి పరిచారక వర్గంలో మరొక ఇద్దరు చేరారు - ◌ంజస్వామీ, రామస్వామీ. వీరిద్దరూ కూడా యితర పరిచారకుల కెంతమాత్రం తీసిపోని భక్తి తత్పరులు, సేవాపరాయణులు.

49

బాలకృష్ణుడు యశోద కెన్నో నిదర్శనాలు చూపాడు తాను భగవంతుడనని. నోరుతెరచి సమస్తచరాచర ప్రాణికోటితో నిండిన భువనభాండాలని సహితం

చూపించాడు. తన బాలుడు భగవంతుడేనని తాత్కాలికంగా నమ్మినా, మళ్ళీ వెంటనే మాయకు లోబడి తన బిడ్డగానే భావించింది యశోద.

ఇక్కడ కూడా అదే చిక్కొచ్చిపడింది. భగవాన్ ఒకసారి జ్యోతి రూపంగ దర్శనమిచ్చారు తల్లి అళగమ్మకి మరొకసారి మెడనిండా పాములతో నాగభూషణుడిగా దర్శనమిచ్చారు. అప్పటికి మాత్రం తన కుమారుడు భగవంతుడే అనుకుంది. కాని, ఆ తరువాత మామూలే "వాడు నా కొడుకు - నేను వాడి తల్లిని"

భగవాన్‌ని నవమాసాలూ మోసి కన్నది అళగమ్మ. కాని భగవాన్‌కి అందరిలాగే ఆమె కూడా ఒక బిడ్డ. అందరిమీద చూపే అనురాగమేగాని అధిక్యతనేమీ చూపరు. ఆమె బాధ పడుతుంది. "పడితే పడనీ" అంటారు భగవాన్. ఆమె ఏడుస్తుంది. "ఎంత ఏడిస్తే అంత మంచి" దంటారు భగవాన్. అందరినీ అంత ప్రేమగా చూసే నా కొడుక్కి నా మీదెందుకో అంత కక్ష అనుకుంటుంది అళగమ్మ.

ఏన్నాళ్ళకో అర్థమయింది అళగమ్మకి, భగవాన్‌కి రక్తసంబంధ ప్రసక్తిలేదని, వారి కందరూ సమానులేయనీ, వారు సకల చరాచర సమహితవర్తియనీ. భగవాన్‌ని సముచితంగా అర్థంచేసుకున్న తరువాత ఆమె "నేను భగవాన్ తల్లి" ననే అహంకారం నశించింది. అందుకే కదా భగవాన్ ఆమెను నిర్దాక్షిణ్యంగా చూడవలసివచ్చింది! సామదానభేద దండోపాయాలని వుపయోగిస్తాడు భగవంతుడు తన బిడ్డలని తన దగ్గరకు తీసుకోవడానికి.

భగవాన్ జాతి మత కుల భేదాలు పాటించరు. అళగమ్మ పూర్వాచార పరాయణురాలు. తల్లి మూఢనమ్మకాలూ, అర్థంలేని ఆచారాలూ మాన్పించడానికి ఎంతో పాటుపడ్డారు. "నీ మడిబట్టనెవరో తాకా" రంటారు భగవాన్. అళగమ్మ మళ్ళీ బట్ట తడపి ఆరేసుకుని స్నానం చేస్తుంది. "ఆ గిన్నెను ముట్టుకున్నా" వెలాగ? మాలవాడు తెచ్చి అక్కడ పెట్టాడిప్పుడే"అంటారు భగవాన్. అళగమ్మ మళ్లీ స్నానం చేస్తుంది. పాపం, వయసు మళ్ళిన తల్లి.

రోజుకెన్నిమాట్లని స్నానం చెయ్యగలదూ! ఎవరో చెప్పారు "భగవ
నిత్యశుచి. వారిని తాకితేచాలు. వేరే స్నానం చెయ్యక్కర్లే దని. అప్పటినుం
అలా చెయ్యడం ప్రారంభించింది. అళగమ్మకు ఉల్లిపాయలూ. మున
కాయలూ. వగైరా నిషిద్ధం. ఈ పిచ్చి ఊహలని పోగొట్టాలని భగవాన్ ప్రయత్నం
"అమ్మా. యీ వేళ ఆశ్రమంలో ఉల్లిపాయలూ. మునగ కాయలూ త
మరింకేవీ లేవు. తిన్నావో. నువ్వు స్వర్గానికి వెళ్ళేటపుడు ఉల్లిపాయ
పర్వతాలూ. మునగ మహారణ్యాలు అడ్డొస్తాయి. ఎలా గమ్మా?" అంటా
ఎన్ని విధాలో ప్రయత్నించారు భగవాన్. తల్లి మూఢనమ్మకాలు పోగొట్టడానికి
చివరికి పోయాయికూడానూ.

అళగమ్మ పూర్తిగా మారిపోయింది. భగవాన్ ఆమెను దిద్దవలసినరీతి
తీర్చిదిద్దారు. భగవాన్ తల్లిననే తన ప్రత్యేకతను విస్మరించింది. ఇప్పుడామె
భగవాన్ భక్తులలో భక్తాగ్రగణ్య. భగవాన్‌కి సంపూర్ణ శరణాగతి చెందింది.
కర్తవ్యనిర్వహణ నాచరిస్తూ ఉదాసీనురాలుగా వుంటోంది.

50

అళగమ్మకు జబ్బు చేసింది. భగవాన్ తల్లి కెంతగానో పరిచర్యచేశారు
భక్తులందరూ చేస్తున్నప్పటికీ వూరుకోక.

అళగమ్మకు అవసాన సమయం సమీపించింది. ఎడమ చేతిని ఆమె
శిరస్సుమీదా. కుడిచేతిని ఆమె హృదయం మీదా వేసి. రెప్పవాల్చకుండా
చూస్తూ కూర్చున్నారు భగవాన్. గణపతి మునీంద్రులు వేద పారాయణ ప్రారం
భించారు. కొందరు రామనామస్మరణ మొదలు పెట్టారు.

కొన్ని గంటలయిన తరువాత (రాత్రి 8 గంటలకు) తమ హస్తాలని తల్లి
దేహంమీద నుంచి తీసి "అమ్మ పరమాత్మలో లీనమయింది. మనకు మైల

లేదు. పాపం. ప్రొద్దుటినుంచీ ఏమీ తినకుండా అలా కూర్చున్నారు. లేవండి.
భోంచేద్దాం" అన్నారు భగవాన్.

అళగమ్మకు చివరి ఘడియల్లో జన్మజన్మాంతరవాసనలూ. అంతర్గత
ప్రవృత్తులూ ప్రకోపించాయి. ఇవే మళ్ళీ మళ్ళీ జన్మలెత్తడానికి కారణాలు. ఆమె
ప్రాణాలు ఏదో ఒక ఇంద్రియంద్వారా పోకుండా జాగ్రత్తపడ్డారు భగవాన్. తల్లి
ముందుజన్మల్లో అనుభవించవలసిన. దంతటినీ సూక్ష్మశరీరంతో. సూక్ష్మ
లోకంలో అనుభవింపచేశారు. తమ ఆత్మశక్తిని తల్లి దేహంలో ప్రవహింపచేసి.
ఆమె ప్రాణాలు అమృత నాడీమార్గాన్ని హృదయంలో అణగిపోయేటట్లు
చేశారు.

ఇది అపూర్వ సంఘటన. కని విని యెరుగని విచిత్రం. ఇది భగవాన్‌కే
సాధ్యమయింది.

అళగమ్మ భగవాన్‌కు జన్మనిచ్చింది. భగవాన్ అళగమ్మకు
జన్మరాహిత్యాన్నే ప్రసాదించారు.

(ఒక మహాత్ముడు పుట్టినపుడు ఇటు ఏడుతరాలవారూ. అటు
ఏడుతరాలవారూ తరిస్తారంటూరు. ఇది నిరాధారమైనదని రుజువయిందిప్పుడు.
ఎవరు చేసుకున్నది వారు అనుభవించక తప్పదు. చేసుకున్నవారికి
చేసుకున్నంత మహాదేవ" అన్నారు. పాపం చేసినా. పుణ్యం చేసినా. ఆ పాప
పుణ్యఫలాలని అనుభవించడానికి మళ్ళీ పుట్టవలసిందే. పాపం లేశమాత్రం
చెయ్యకుండా అంతా పుణ్యాన్నే మూటకట్టుకున్నా ఆ పుణ్యఫలాన్ని
అనుభవించడానికి కూడా జన్మనెత్తవలసిందే. ఇక జన్మ రాహిత్యానికి ఒకటే
మందు. నిష్కామకర్మ. ఫలితాన్ని ఆశించకుండా నీ విధిని నీవు నిర్వర్తించడం

"ముందుముందు ముసలితనం వచ్చాక తీరుబడిగా చేసుకోవచ్చులే జపమో
తపమో, ఇప్పుడెలా వీలవుతుంది?" అనుకోవడం అవివేకం. నిజానికి మనిషికి
పుట్టింది మొదలు చచ్చేవరకూ తీరిక దొరకదు.

బాలస్తావత్ క్రీడాసక్తః

"తరుణస్తావత్ తరుణీసక్తః
వృద్ధస్తావత్ చింతాసక్తః
పరమే బ్రహ్మణి కోపినసక్తః"

అని ఏనాడో చెప్పారు ఆదిశంకరులు.

* * *

భగవాన్ మాతృదేవి నిర్వాణవార్త వూరంతా వ్యాపించి పోయింది. వేలమంది తమ శ్రద్ధాంజలి ఘటించడానికి వచ్చారు.

అళగమ్మ మృతదేహాన్ని కొండ దిగువన పాలితీర్థానికి తీసుకొచ్చా అక్కడొక రావిచెట్టు నీడలో గొయ్యితవ్వి, అమ్మదేహాన్ని అందుంచి, కర్పూరం, యింకా అనేక పరిమళ ద్రవ్యాలని ఆ దేహం మీద పోసి, దానిమీద యిటుకలతో సమాధి కట్టారు. అదే సమయానికి కాశీనుంచి వచ్చిన వారెవరో ఒక లింగాన్ని యిచ్చారు. దానిని అమ్మ సమాధి ప్రతిష్ఠచేశారు. గణపతి మునీంద్రులు దానికి "మాతృభూతేశ్వరుడు" నామకరణం చేశారు.

శ్రీరమణాశ్రమం

మాతృభూతేశ్వరలింగానికి నిత్యం, పూజ చెయ్యడం, నైవేద్యం పెట్టడం జరగాలి. కాని, అది నిర్జనప్రదేశం. చిట్టడవి. రాత్రులు చిరుత పులులు తిరుగుతుంటాయి. ఏదేమైనా తప్పదు.

నిరంజనానందస్వామి స్కందాశ్రమంనుంచి రోజూ వచ్చి కార్యక్రమాన్ని నిర్వహిస్తారు. (నిరంజనానందస్వామి ఎవరో కాదు - అళగమ్మ మూడవ కుమారుడు. భగవాన్ తమ్ముడు నాగ సుందరం. కాషాయం ధరించి నిరంజనానంద' అని పేరుపెట్టుకున్నారు). వారికి దినదినమూ కొండదిగి రావడం, మళ్ళీ కొండెక్కడం కష్టమనిపించి, తల్లి సమాధి దగ్గర ఒక కుటీరాన్ని నిర్మించుకుని అందులో నివాసం ఏర్పరచుకున్నారు. భగవాన్ కూడా దాదాపు రోజూ వస్తారక్కడికి. అలాగే ఒక రోజున వచ్చి, మళ్ళీ కొండమీదికి వెళ్ళి పోకుండా అక్కడే వుండిపోయారు. వుండిపోవాలని వుండిపోలేదనీ, ఏదో శక్తి తమ నక్కడి నుంచి కదలనియ్యలేదనీ భగవాన్ చెప్పారు ఆ తరువాత.

సుమారొక పాతికేళ్ళ క్రితం తిరుచ్చుళినుంచి అరుణాచలుడు లాక్కొస్తే, యీనాడు మాతృభూతేశ్వరుడిలోని అమ్మవారు అక్కడి నుంచి కదలనీయలేదు.

భగవానే లేనిది యిక స్కందాశ్రమమేమిటి! భక్తులందరూ భగవాన్ వుండిపోయిన చోటికే వచ్చేశారు.

అప్పుడే శ్రీరమణాశ్రమ నిర్మాణ కార్యక్రమం ప్రారంభమయింది.

మండువేసవికాలం మూలాన పాలితీర్థంలో ఒక చుక్కనీరు లేకుండాపోయింది. మాతృభూతేశ్వరుడికి అభిషేకం చెయ్యడమెలాగనే సమస్య ఏర్పడింది. భగవాన్ ఆ దరిదాపులోనే కాస్తమట్టి తీశారు. ఆశ్చర్యంగా నీరూరిందక్కడ. అదే కాలక్రమాన ఒక తటాకమయింది. దానికి రమణతీర్థ" మని పేరుపెట్టారు.

* * *

భగవాన్ కొండదిగి రావడంతో భక్తులకి వారి దర్శనం సులభసాధ్యమయింది. వేనవేలుగా రాసాగారు. ఆశ్రమ నిర్మాణానికి భారీగా విరాళాలిచ్చారు.

భగవాన్ పరిచారకులలోని పెరుమాళ్ళస్వామి ఆశ్రమ నిర్వహణాధిపత్యం వహించాడు. ఇతని పెత్తనం నచ్చక యితన్ని తప్పించి దండ పాణిస్వామి అనే ఆయన తన పెత్తనం సాగించాడు. ఈ స్వామి పెత్తనంకూడా నచ్చలేదు

ఆశ్రమవాసులకి. అందుచేత ఆయన్ని కూడా తప్పించి నిరంజనానందస్వామి ఆశ్రమసర్వాధికారిగా చేసుకున్నారు.

తనని తప్పించినందుకు ఉడికిపోతున్నారు పెరుమాళ్‌స్వామి. ఏదో అవకాశం దొరికింది. ఆశ్రమంమీద దావా వేశారు.

వాళ్ళల్లో వాళ్ళు ఎన్ని గొడవలు పడుతున్నా, ఎంత గుంజాటన పడుతున్నా భగవాన్ ఉదాసీనులుగానే వుండిపోయారు. ఒక రోజున తప్పనిసరై భగవాన్ పెరుమాళ్‌స్వామిని పిలిచి "ఏరా పెరుమాళ్లూ, కుప్పి చేస్తున్నావు, ఆగిపోలేదురా. పరవానికి పోవాలు కదూ" అన్నారు. "పరవానికి పోయినా పరవాలేదు. నేను సేవించుకోడానికి మీ పాద పద్మాలు లేని పోతుంది" అన్నారు పెరుమాళ్‌స్వామి తడుముకోకుండా. భగవాన్ ఒకింతసేపు నిర్విణ్ణులయ్యారు. తరువాత "అప్పుడురా, మనిద్దరికీ ఉన్నా, నిన్ను కాపాడ్డం తప్పదులే నాకు" అన్నారు.

భగవాన్ కరుణాసముద్రుడు. ఏ బిడ్డకైతే పెరుమాళ్‌స్వామికి కుదిరిన గతి కుదురుతుందో - ఆ బిడ్డ ఎంత దుష్టుడయినా వాడిని రక్షించడం తప్పదు భగవాన్‌కి.

52

ఆశ్రమంలో దొంగలు పడ్డారొకసారి. వాళ్ళకు చెంబూ కుండా, కల్లా కమండలం తప్ప మరేమీ దొరక్కపోయేసరికి కోళ్ళు మండి పోయింది. "డబ్బు ఎక్కడ దాచారు" అడిగారు. "మేం డబ్బు దాచుకోం, భక్తులిచ్చినంతలో మిగా మిగిలిందేమన్నా వుంటే ఆశ్రమ నిర్మాణానికి ఖర్చు పెడతాం" అన్నారు పరిచారకులు. "దొంగవెధవల్లారా" అంటూ బాదారు దొంగలు. భగవాన్‌ని కూడా వదిలి పెట్టలేదు. వారినీ కొట్టారు. పరిచారకులిక తాళలేక పోయారు.

తిరగబడ్డానికి సిద్ధమయ్యేసరికి భగవాన్ "తప్పు. మనం సాధువులం. మన ధర్మం మనం నిర్వర్తించుకుందాం. వారి వృత్తిధర్మం వారు నిర్వర్తించుకుంటారు" అని పరిచారకుల నాపుచేశారు. దొంగలు తిట్టుకుంటూ వెళ్ళిపోయారు.

తెల్లవారింతరవాత భగవాన్ తొడమీద తగిలిన దెబ్బచూసి లబోదిబో మన్నారు భక్తులు. "దీంట్లో గొడవ పడవలసిన పనేముంది! మీకు తోచినట్లు మీరు పూజిస్తే వారికి తోచినట్లు వారు పూజించారు" అన్నారు భగవాన్.

అకారణగురువు కదా భగవాన్!

* * *

ఒకనాడొక సాధువు భగవాన్ దర్శనం చేసుకుని, అక్కడెవరూ లేని సమయం చూసి, వారు కూర్చునే పులిచర్మాన్ని యిమ్మని అడిగాడు. "తీసుకోండి. కాని, ఎవరైనా చూసి, అడ్డగించి దాన్ని లాక్కుంటే మాత్రం నేనేమీ చెయ్యలేను" అన్నారు భగవాన్. సరేనని తీసుకుని బయలుదేరాడు. గేటు దాటనే లేదు. ఒక పరిచారకుడెదురై "భగవాన్ కూర్చునే వ్యాఘ్రాజినాన్ని అడగొచ్చునా?" అని దాన్ని లాక్కున్నాడు. సాధుపుంగవుడు దిక్కు మొహం పెట్టి వెళ్ళిపోయాడు.

భగవాన్‌కి మొదటే తెలుసు ఏం జరుగుతుందో. వారికి తెలియనిదేముంటుంది! భూత భవిష్యత్ వర్తమాన - త్రికాలాలకీ అవలివారు కదా!

ఒక భక్తుడు "మీకు కలలొస్తాయా?" అని అడిగాడు. "నిద్రపోతేకదా కలలొస్తాయి" అన్నారు భగవాన్. "అయితే ఎప్పుడూ మేల్కొనే వుంటారా" అని అడిగాడు. "నిద్రపోయేవాళ్ళు కదా మేల్కొనేది" అని జవాబిచ్చారు.

జాగ్రత్ స్వప్న సుషుప్త్యవస్థల కావలిది బ్రాహ్మీస్థితి. అదే జాగ్రత్‌సుషుప్తి. భగవాన్ ఎప్పుడూ వుండేది ఆ స్థితిలోనే.

"మీరెప్పుడూ నిద్రపోరనికదా అన్నారు? మీరు గుర్రు పెడుతూంటే విన్నారు" అన్నాడు అప్పుడక్కడున్న ఒకాయన. "నిజమే నేనూ విన్నా"

నన్నారు భగవాన్.

వారు సాక్షీమాత్రులుగా సమస్త భువనాలలోని సకలాన్నీ గమనిస్తు వుంటారు.

*   *   *

ఒక భక్తుడు భగవాన్ ని ప్రార్థించాడు. "మీరీ తిరువన్నామలై లో వుండిపోతే యెలాగా? అందరూ యిక్కడికి రాగలరా? ఆసే హిమాచలపర్యంతం పర్యటించి మీ బోధ వినిపించాలి" అని. "నా చోటేది? అన్నారు భగవాన్. పాపం, అమాయకుడు! భగవాన్ చెప్పి అర్థంకాక ప్రత్యేక ట్రెయిన్‌ని ఏర్పాటుచేస్తాం" అన్నాడు. భగవాన్ న వూరుకున్నారు.

భగవాన్ శరీరాన్ని మించి చూడగలిగిన వారెందరూ? వారే అనంత అనంతమంతా వ్యాపించి వుండగా యిక కదలడానికి చోటెక్కడ?

*   *   *

ఒక రోజున భగవాన్ శరీరం వూగడం మొదలుపెట్టింది. ఒక భక్తు చూసి "అదేమి భగవాన్!" అని అడిగాడు ఆర్తితో. "ఒక పూరిగుడిసె మదపుటేనుగును కట్టిపారేస్తే మరెలా గుంటుంది! అన్నారు భగవాన్.

తెలివైన ఆ భక్తుడు అర్థం చేసుకున్నాడు భగవాన్ పరిమిత దేహంలో అపరిమితమైన ఆత్మనిండి వెలుగుతోందని. వారికి పాదాభివందనం చే కృతార్థుడయ్యాడు.

*   *   *

భగవాన్ కీళ్ళనొప్పులతో బాధ పడుతున్న రోజులవి. పరిచారకులు ఏవో పసరులతో తయారు చేసిన నూనెను మర్దన చేస్తున్నారు. అది చూసిన మన్నె

'వెంకట రామయ్య గారనే రిటైర్డ్ డిస్ట్రిక్ట్ జడ్జి. తను కూడా వారికి సేవ చేస్తానన్నాడు.

"ఎందుకు?" అని అడిగారు భగవాన్.

"మీ సేవ చేస్తే పుణ్యం వస్తుందని" అని అన్నారాయన.

"అలాగా! అయితే మీరంతా తప్పుకోండి. నేనే మర్దనా చేసుకుని, ఆ పుణ్యమేదో నేనే సంపాదించుకుంటాను" అన్నారు భగవాన్ తమ పరిచారకులతో.

చిత్రమైన భగవాన్!

*   *   *

ఉబ్బసంతో బాధ పడుతూన్న ఒక భక్తుడు భగవాన్ దగ్గరకు వచ్చి "కరుణించాలి. నేనీ బాధ పడలేకుండా వున్నాను" అని ప్రార్థించాడు.

"మీ బాధ చెప్పుకోడానికి ఒక స్వామి వున్నాడిక్కడ. నా బాధలు చెప్పుకోవడానికి ఎవరూ కనబడ్డంలేదు. ఏం చేస్తాం! ప్రారబ్ధాన్ని అనుభవించవలసిందే" అన్నారు భగవాన్.

"నేననాధుడను గాను. నీవనాధుడవు" అని ఎప్పుడో చెప్పారు త్యాగరాజస్వామి. శ్రీరామచంద్రుడి నుద్దేశిస్తూ.

*   *   *

ఒక కుటుంబంవారంతా భగవాన్ భక్తులే. ఒక నాస్తికుడు తప్ప. వారంతా ఆశ్రమానికి వచ్చారు. నాస్తికుడుకూడా భగవాన్ దర్శనం చేసుకునే వాడు కాని నమస్కారం మాత్రం చేసేవాడు కాదు. నాలుగు రోజులున్నతరువాత తనవాళ్ళతో "ఇక మన వూరు పోదాం. రండి" అన్నాడు. వాళ్ళింకా కొన్నాళ్ళుంటామన్నారు. "మీకు వుండాల నుంటేవుండండి. నేను మాత్రం వెళ్ళిపోతా" నన్నాడు. "సరే. వెళ్ళక తప్పదంటే భగవాన్ దగ్గర సెలవు తీసుకుని మరీవెళ్ళు" అన్నారు

వాళ్ళు."భగవాన్ సెలవు మంజూరు చేస్తేనేగాని నేను వెళ్ళకూడదా?" అనుకున్నా. వారితో "వెళుతున్నానని చెప్పినంతమాత్రాన నష్టమేముంటుంది?" అని సరి పుచ్చుకుని. భగవాన్ దగ్గరకు వెళ్ళి "నేను వు వురు వెళుతున్నాను" అన్నాడు. భగవాన్ అతనికేసి క్షణంచూసి "మం వెళ్ళిరా!" అన్నారు భగవాన్. అన్నట్టే వెళ్ళి వచ్చాడు. ఎక్కడికి వెళ్ళి వచ్చా రైలు దాటిపోయిందయ్యో! మరునాడు. ఆ మరునాడు. ఆ మరువాడు ఇ పదిరోజులపాటు ప్రయత్నం చేశాడు పోవాలని. కాని. పోలేకపోయా ఏరోజుకారోజే ఏదో ఒక అడ్డంకి. ప్రాణం విసిగిపోయింది నాస్తికుడికి. "ఇదం భగవాన్ పనే" అని యింకా ఏదో తిట్టుకుంటూ భగవాన్ దగ్గరకొచ్చాడు. అ సమయంలో భగవాన్ ఎవరితోనో చెపుతున్నారు "ఎవరినైనా మీరు తిడితే వా మళ్ళీ మిమ్మల్ని తిట్టొచ్చు. కొట్టొచ్చు కూడా. భగవంతుడిని తిడితే పరవాలే తిరిగి తిట్టడు కొట్టడం మాటటుంచి. దూషణ భూషణ తిరస్కారాల దేనితోనైనాసరే తలచుకుంటేచాలు. భగవంతుడు సంతోషిస్తాడు" అ నాస్తికుడు విన్నాడు. ఆ క్షణంలోనే మారిపోయాడు. భగవాన్‌ని అంతర్యామిగా గుర్తించాడు. వారి పాదాలమీద పడ్డాడు. భగవాన్ భక్తుడయ్యాడు.

ఆస్తికుడిగా మారిన యీ నాస్తికుడు ఒక ప్లీడరు. తన న్యాయవాద వృత్తికి స్వస్తిచెప్పి ఆశ్రమంలోనే వుండిపోయాడు.

భగవంతుడి కరుణ ఆస్తికులమీదా. నాస్తికులమీదా. మంచివాళ్ళ మీదా చెడ్డవాళ్ళమీదా. పుణ్యాత్ములమీదా. పాపాత్ములమీదా. అందరిమీదా సమానంగానే ప్రసరిస్తుంది - సూర్యుడి ప్రకాశం అందరిమీదా సమానంగానే పడునట్లు. అయితే. ముసుగులోంచి బయటకు వచ్చినపుడుకదా. ఆ ప్రకాశం పడేది!

* * *

ఒక పాశ్చాత్య భక్తుడు అరుణాచల పర్వతాన్ని అడ్డదారిని ఎక్కి వెళ్ళాడు.

వెంట ఎవరినీ తీసుకువెళ్ళలేదు. ప్రొద్దుటనగా వెళ్ళిన వాడు చీకటి పడినా రాలేదు. అతనికోసం ఆశ్రమంలోని వారంతా ఆరాటు పడుతున్నారు. భగవాన్ కూడా దూరదర్శిని (బైనేక్యులర్స్) తో కొండ కేసి చూస్తున్నారు. అతగాడి జాడ లేదు.

రాత్రి పొద్దుపోయినతరవాత అలసి సొలసి వచ్చారు దొరగారు. వచ్చి ఒకచోట చతికిలబడ్డాడు. అక్కడికి కొంతమంది భక్తులు చేరారు. భగవాన్ కూడా వెళ్లారు.

"ఇంత ఆలస్యంగా వచ్చారేమి?" అని అడిగారు భగవాన్.

దొరగారు గుడ్లు మిటకరించి చూస్తూ "భగవాన్. అదేమిటీ. మీరేకదా నేను తోవ తప్పి తబ్బిబ్బవుతుండగా కనపడి ఆ అగాధాలను దాటించి తీసుకువచ్చారూ?" అన్నారు.

"అలాగా!" అన్నారు భగవాన్ ఏదో గుర్తుకు వచ్చినట్టు.

భక్తుల విస్మయం వూహించుకోవలసిందే.

* * *

బొంబాయిలో ఒక బడిపంతులు. ఆయనకి కలలో కనబడి "నన్ను చూడ్డానికి రావా?" అన్నారు భగవాన్. "మీరెవరో తెలియదు. ఎక్కడుంటారో తెలియదు. తెలిసినా నాదగ్గర డబ్బెక్కడిదీ అక్కడికి రావడానికిఅన్నాడా పంతులు."మద్రాసు వచ్చి అడుగు. చెపుతారు నేనెక్కడున్నానో. డబ్బు ఫలానా సేఠ్‌ని అడుగు. యిస్తాడు" అని చెప్పి వెళ్ళిపోయారు భగవాన్.

తెల్లారింది. తనకొచ్చిన కల గుర్తుంది పంతులుకి. ఆశ్చర్యపోయాడు. తను స్కూల్‌కు వెళ్లేదారిలోనే ఆ ఫలానా సేఠ్ అంగడి. నౌకర్లతోటి. గుమాస్తాలతోటి. వ్యాపారస్తులతోటి ఎప్పుడూ కిటకిట లాడుతూండే ఆ కొట్లో ఆ సేఠ్ ఒక్కడే కనపడ్డాడు. ధైర్యంచేసి వెళ్లి తన కొచ్చిన కల సంగతి చెప్పాడు. సేఠ్ సంతోషంగా వందరూపాయిలిచ్చి "ఆ మహాత్ముడెవరో. నా మీద దయ కలిగింది. కాబట్టే

మిమ్మల్నిని నాదగ్గరకు పంపారు. వారికి నా కృతజ్ఞతా పూర్వక ప్రణామములు చెప్పండి'' అన్నాడు. పంతులు సేఠ్జీ దగ్గర సెలవు తీసుకుని బయలుదేరి వచ్చాడు. ''జరుగుతున్నది కూడా కలకాదు కదా'' అనుకుంటూ రైలెక్కి మద్రాసు చేరాడు. చేరగానే ఒక పెద్దమనిషిని చూసి అడిగాడు. ''ఒక తెల్లటి గోచీ మాత్రమే ధరించివుండే మహాత్ముడెక్కడ వున్నారని. ''తిరువన్నామలైలో శ్రీరమణభగవాన్ వున్నారు. వారే మీరు చెప్పినట్టుగా వుంటారు'' అన్నాడా పెద్దమనిషి. పంతుల కంతకంతకు ఆశ్చర్య మెక్కువవుతోంది. తిరువన్నామలై చేరాడు. భగవాన్ దర్శనం చేసుకున్నాడు.

ఆ పంతులుగారిని తనదగ్గరకు రప్పించుకున్న భగవాన్‌కే తెలియాలి తమకూ ఆయనకూగల జన్మజన్మాంతర అనుబంధ మెటువంటిదో!

* * *

నెల్లూరులో రామారావుగారనే ఒక ప్లీడర్‌గారున్నారు. ఆయన సుబ్రహ్మణ్యేశ్వరుని భక్తుడు. నిత్యం భక్తి ప్రవత్తులతో పూజిస్తాడు. తన పూజామందిరంలోని సుబ్రహ్మణ్యేశ్వరుని విగ్రహాన్ని.

ఆ ప్లీడరు గారి స్నేహితుడు ఒకసారది చూసి ''విగ్రహాన్ని ఎందుకూ? సాక్షాత్ సుబ్రహ్మణ్యేశ్వరుడినే సేవించుకోవచ్చు. తిరువన్నామలై రాకూడదూ?'' అన్నాడు.

''నువ్వు రమణభక్తుడివి కాబట్టి, రమణాశ్రమంలో వుంటున్నావు కాబట్టి అలా అంటున్నావు. నాకీ విగ్రహం, యీ పూజా చాల్లే'' అన్నారు ప్లీడరుగారు.

అలా అన్నారో లేదో, ఆరోజునే వారి పూజాగృహంలో శ్రీరమణభగవాన్ ప్రత్యక్షమై ''నేనేకదా సుబ్రహ్మణ్యేశ్వరుడిని, ఇదిగో చూడు నా దండాయుధం'' అని చెప్పి అదృశ్యమయ్యాడు.

రామారావు ప్లీడరుగారు స్తంభించిపోయారు. వెంటనే బయలుదేరి రైలెక్కారు తిరువన్నామలైకి. భగవాన్ దర్శనం చేసుకున్నారు. వారి నెంతగానో

స్తుతించారు.

వారెన్నాళ్ళో చేసిన సుబ్రహ్మణ్యేశ్వరోపాసన వూరికే పోలేదు.

* * *

ఒక భక్తుడు బ్రతుకు భారాన్ని మొయ్యలేక భగవాన్ పాదాలపై పడి ''నా గతేమిటి? నేను తరించే దెలాగ? మీరే ఉపేక్షిస్తే యింకెవరు దిక్కు'' అని మొత్తుకున్నాడు.

''సరే. నీ పని అయింది. నా పని నేను చూసుకుంటాను. వెళ్ళు'' అన్నారు భగవాన్. ఆ భక్తుడికిది అర్థంకాక గుడ్లప్పగించి చూస్తున్నాడు.

''తెలియలేదూ? మొదటి తరగతి ప్రయాణికుడు ఒకానొక వూరికి టిక్కెట్టు కొనుక్కుంటాడు. రైలు ఆ వూరుకి తెల్లారగట్ల మూడింటికో నాలుగింటికో చేరుతుంది. ఆ కారణంగా రాత్రంతా మేలుకుని కూర్చుంటాడా? అలా ఎప్పుడూ చెయ్యడు. ఫలానా స్టేషన్ వచ్చేముందు తనను లేపమని గార్డుకి చెప్పి హాయిగా నిద్రపోతాడు. ఇప్పుడు తెలిసిందా? అని అడిగారు భగవాన్.

''తెలిసింది. ఇక నిర్విచారంగా వుండగలను'' అని చెప్పి భగవాన్ పాదపద్మాలని కళ్ళకద్దుకున్నాడా భక్తుడు. అతగాడికి పెద్ద బరువు దించుకున్నట్టయింది.

''నాకు చెప్పకున్నారుగా! ఇక మీ బరువుని నేను మోస్తాను'' అని భగవాన్ చెప్పిన తరవాత కూడా నిశ్చింతగా వుండలేనివాడు దురదృష్టవంతుడే!

భగవాన్ సన్నిధికే వెళ్ళక్కరలేదు. మీ హృదయంలోనే వున్నారు భగవాన్ వారికి నివేదించుకుంటే చాలు.

* * *

ఆశ్రమానికొకనాడొక పెద్దమనిషి వచ్చాడు. భగవాన్ పాదాల ముందు పడి ఏడ్చాడు. ''నేను మహాపాపిని. నాకెటువంటి దుర్గతి పడుతుందో! మీరే

శరణ్యం" అంటూ, ఎంతకీ భగవాన్‌ని వదల్లేదు. ఒకటే ఏడుపు "నేనడిగిందిస్తావా? నీదుర్గతి పోతుంది" అన్నారు. భగవాన్. "తప్పకుండా యిస్తాను" అన్నాడాయన. "అయితే నువ్వు చేసుకున్న పాప పుణ్యాలని నాకు ధారపొయ్యి" అన్నారు భగవాన్. "పుణ్యమేముందీ ధారపొయ్యడానికి పోనీలెండి. నేను చేసుకున్నదానికి నేనే అనుభవిస్తాను" అని వెళ్లిపోబోయారు భగవాన్ ఆయన్ని కదలనివ్వలేదు. "నేనడిగింది యిస్తానని వాగ్దానం చేశావు యిచ్చి తీరవలసిందే"నని పేచీ పెట్టారు. పాపం. ఆయనకిక గత్యంతరం లేకపోయింది. తనకెంత యిష్టంలేకపోయినా, తన పాప పుణ్యాలని భగవాన్‌కి ధారపోశాడు. అప్పుడు భగవాన్ గంభీరంగా "ఇప్పుడు నువ్వు పాపపుణ్యాలులేని పరిశుద్ధాత్మవు. అలాగే వుండిపో" అన్నారు. ఆయన "నేను ఆత్మను. పరిశుద్ధాత్మను" అని నెమ్మదిగా స్మరిస్తూ, సాగిలపడి భగవాన్‌కు నమస్కరించి వెళ్ళిపోయాడు.

ఎన్ని జన్మల పుణ్యం ఫలించి ఆ పెద్దమనిషి భగవాన్ దర్శనం చేసుకున్నాడో? భగవాన్‌కి ఆయనపై అంత కరుణ కలగడానికి ఎంత ప్రబలకారణముందో!

భగవాన్‌కే ఎరుక.

* * *

ఎచ్చెమ్మాళ్ అనారోగ్యంతో బాధ పడుతోంది. ఎడతెరిపిలేకుండా వాంతులవుతున్నాయి.

ఆశ్రమవాసి ఒకడది చూసి "భగవాన్‌తో చెప్పుకోరాదూ. నీకు నెమ్మదిస్తుంది" అన్నాడు.

"నేను చెప్పాలా? తనకు తెలియదా? నిద్రపోతున్నాడా?" అన్నదామె నిష్ఠూరంగా.

అంతే. మళ్ళీ ఆ తరవాత వాంతి చేసుకోలేదు.

భక్తులకు భయపడతాడు భగవంతుడు. అందుకే. ఎచ్చెమ్మాళ్‌కు కోపం వచ్చేసరికి హడలిపోయి ఆమె బాధను నివృత్తి చేశారు భగవాన్.

* * *

ఒక దొరగారు భగవాన్ దర్శనార్థం అమెరికా నుంచి వచ్చాడు. వచ్చి భగవాన్ సన్నిధిలో మూడు గంటలు కూర్చుని వెళ్ళిపోయాడు. భగవాన్‌ని పలకరించనయినా లేదు. అక్కడున్న భక్తులు ఆశ్చర్యపోయారు. ఒక భక్తుడడిగాడు. "ప్రత్యేకం అంత దూరంనుంచి వచ్చి అంతసేపూ కిక్కురుమనకుండా కూర్చుని వెళ్ళిపోయాడేమని. "వారొకపనిమీద వచ్చారు. వచ్చినపని పూర్తయింది. ఇక్కడే వుండిపోవాలనేదే ముంధి" అన్నారు భగవాన్.

ఇటువంటి చిత్రాలు అసంఖ్యాకం. భగవాన్‌కి. వారి భక్తులకీ మధ్య మౌనంగాకూడా ఏ సంభాషణం జరుగుతుందో ఏం చెప్పగలం! అది వారికే తెలియాలి. ఎవరి స్థితిని బట్టి వారికి భగవాన్ అనుగ్రహం లభిస్తుంది.

* * *

అనుగ్రహం ప్రసాదించవలసిందిగా ప్రార్థించిన ఒక భక్తుడికి పీక లోతున గంగానదిలో వుండి దాహం దాహం అని అరిచేవాళ్ళకు నేనేం చెప్పేదీ!" అని చెప్పారు.

వారి అనుగ్రహం అప్రతిహతంగా ప్రవహిస్తూనే వుంటుంది. ఎవరి శ్రద్ధాభక్తులనిబట్టి వారికి అంత లభిస్తుంది. వృత్తులు బహిర్ముఖం కాకుండా సాధకుడిని అంతర్ముఖుడిని చేస్తుంది వారి నుండి ద్యోతకమయ్యే శక్తిపాతం.

> "పులినోటపడ్డ మాంసపుకండ తప్పించుకోగలదేమోగాని, నా అనుగ్రహానికి పాత్రులయిన వ్యక్తులు తప్పించుకుపోలేరు. వారి నుద్ధరించి తీరతా" నని భగవాన్ ప్రతిన.

"నాకు శరణాగతి చెందిన తరవాతకూడా నిశ్చింతగా వుండలేని వాడు,

రైలుబండి నెక్కిన తరవాత సహితం తన సామానుని నెత్తిమీదే అలా వుంచుకుని మోస్తున్నటువంటివాడే" నన్నారు భగవాన్.

నిజమే. రైలెక్కేవరకేగాని. ఎక్కిన తరవాత కూడా మొయ్యడమెందుకు మనలనీ. మన సామానునీ రైలే మోసుకుపోతుంది కదా! అలాగే భగవాన్ని శరణుజొచ్చినతరవాత యిక చింతలెందుకూ! అయితే. త్రికరణశుద్ధిగా వుండాలి ఆ శరణాగతి. అప్పుడు భగవానే వహిస్తారు మన భారమంతా.

"భగవాన్ వున్నంతకాలం పరవాలేదు. వారు దేహాన్ని చాలించినప్పుడో?" అనే ప్రశ్న రావచ్చు. ఇది అర్థంలేని ప్రశ్న. "నేను లేని దెప్పుడు? లేని దెక్కడ?" అని అడిగారు వారు.

అదృశ్యంగా అంతటా వున్నారు. ఎప్పుడూ వుంటారు.

"అనన్యాశ్చింతయంతో మాం
యేజనాః పర్యుపాసతే
తేషాం నిత్యాభియుక్తానాం
యోగక్షేమం వహామ్యహమ్"

అని ఎప్పుడో కృష్ణపరమాత్మ చెప్పాడు. కృష్ణుడిప్పుడు దేహధారిగా లేనంతమాత్రాన వారు చెప్పినదిప్పుడు వర్తించదా? ఏనాటికీ వర్తిస్తూనే వుంటుంది.

* * *

నిరంజనానందస్వామి ఆధ్వర్యాన ఆశ్రమం సక్రమంగానే నడుస్తోంది అయినా. తప్పులు పట్టుకునేవాళ్ళు తప్పులు పట్టుకుంటూనే వున్నారు. ఆ సందర్భంలో భగవాన్ "రావడం నన్ను చూడ్డానికే వస్తారు. నన్ను. చూసిన తరవాత ఆశ్రమాన్ని చూస్తారు. ఆ తరవాత ఆశ్రమ నిర్వహణ విధానాన్ని చూస్తారు. ఆ తరవాత అందులో లోపాలు చూస్తారు. ఆ తరవాత వాటిని సరిచెయ్యాలని చూస్తారు. ఆ తరవాత తామే నిర్వాహకుల మవ్వాలని

చూస్తారు. పాపం. వాళ్ళేం చేస్తారూ! వచ్చిన పని మర్చిపోతారు" అన్నారొకసారి.

నిజమేమరి. ఎవరి దర్శనం చేసుకుని. ఎవరి బోధామృతం గ్రోలితరించాలని వచ్చారో. వారే తాము వచ్చిన పనిని మరిచిపోయి రంధిలోకి దిగిపోతే వారినెంత అభాగ్యులనాలి!

53

శాంతమ్మకు నలభై యేళ్ళు నిండకుండానే భర్త పోయాడు. ముగ్గురు కొడుకులూ పోయారు. ఒక్కగాని ఒక్కకూతురు పోయింది. ఆ కూతురికి పుట్టిన బిడ్డకూడా పోయింది. ఒంటరిగా బ్రతుకుభారాన్ని మోస్తూకూర్చుంది.

ఒకనాడు శాంతమ్మకి ఏ వూళ్ళోనో వుద్యోగం చేస్తూన్న తన అన్న అల్లుడు కబురంపాడు. అతని భార్య పుట్టింటికి వెళ్ళిందట. తను వంటచేసి పెట్టాలట. వెళ్ళింది శాంతమ్మ.

వెళ్ళిననాడే. బియ్యం కడిగి పొయ్యిమీద పెట్టిందో లేదో "నీ కింత జరిగినా యింకా బుద్ధి రాలేదటే? మమకారాలు పెంచుకుంటూ ఎవరికో ఒకరికి సేవ చేస్తూండడానికేనా నువ్వు పుట్టింది? ఏమిటిప్పుడు నువ్వు చేస్తూన్నపని? అని ఎవరో అడిగినట్టయింది.

వెంటనే లేచింది శాంతమ్మ. అన్న అల్లుడి దగ్గరకువెళ్ళి "నేను రామేశ్వరం వెళుతున్నాను. పొయ్యిమీద బియ్యం పెట్టాను. చూసుకో" అంది. నిర్ఘాంతపోయాడాన. "హటాత్తుగా యీ ప్రయాణ మేమిటి? ఏమి జరిగింది? అని అడిగాడు. "ఏమీ జరగలేదు. వెళ్లాలంతే" అంటూ అక్కడి నుంచి వెళ్లిపోయింది శాంతమ్మ.

రామేశ్వరం వెళ్ళింది. ఇంకా యెన్నో యాత్రలు చేసింది. ఎంత మందినో

సేవించింది. ఎంతమంది దగ్గరో ఉపదేశాలు పొందింది. ఏమి చేసినా తానాశించిన శాంతి చేకూరలేదు.

తను బయలుదేరిన తొమ్మిదేళ్ళకి తిరువన్నామలై చేరింది. భగవాన్ దర్శనం చేసుకుంది. ఆ క్షణంలోనే ఆమె భవతాపం చల్లారింది. ఇక వారిని విడిచి ఎక్కడికీ వెళ్ళలేదు.

* * *

లోకమ్మ భక్తురాలు. భగవాన్‌ని గురించి విన్నప్పటినుంచీ వారి దర్శనం చేసుకోవాలని కుతూహలం. తిరువన్నామలై వెళదామంటే యింట్లో ఎవ్వరూ ఒప్పుకోలేదు.

ఒకనాడు పొరుగింటాయన ఒకరువచ్చి "భగవాన్ పరమ పదించారు. పత్రికలో పడింది" అన్నాడు. వెంటనే లోకమ్మ వెక్కివెక్కి ఏడవను మొదలుపెట్టింది. ఆమెలా ఏడుస్తుండగానే భగవాన్ దర్శనమిచ్చారు. కర్ర కమండలం పట్టుకొని. ఆ దర్శనం లిప్త మాత్రమే అయినా లోకమ్మ దూరం చేసుకుంది భగవాన్ జీవించే వున్నారని.

నిజమే. భగవాన్ సజీవులయ్యే వున్నారు. పత్రికలో పడినదాన్ని తప్పుగా అర్థంచేసుకున్నాడా ప్రబుద్ధుడు. పరమపదించినది భగవాన్ కాదు -శేషాద్రిస్వామి.

లోకమ్మ భగవాన్ దర్శనం కోసం పరితపించసాగింది. అన్నపానాదులు మానేసింది. చిక్కి శల్యమైపోయింది. ఇక లాభం లేదని అప్పుడు వదిలారు ఆ కసాయివాళ్లు.

లోకమ్మ తిరువన్నామలై చేరింది. భగవాన్ దర్శనం చేసుకుని తన చిరకాలవాంఛ తీర్చుకుంది. వారి పాదపద్మ సన్నిధినే వుండిపోయింది.

* * *

భర్త గతించిన నాటినుంచీ దుఃఖసముద్రములో మునిగిపోయింది సంపూర్ణమ్మ.

ఎంతమందో చెప్పారు "తిరువన్నామలై వెళ్ళి శ్రీరమణ భగవాన్ దర్శనం చేసుకో. నీ మనస్సు చల్లబడుతుంది" అని. అయినా ఆమె కదల్లేదు.

ఆ వూళ్ళో గుళ్ళోకి వెళ్లిందొకనాడు. అక్కడొక ముసలి బ్రాహ్మడు కనపడి "నాకు వండిపెట్టవా?" అన్నాడు. ఎవరేనా "నాకు అన్నంపెట్ట" మని అడుగుతారు గాని "నాకు వండిపెట్టవా?" అని అడగరు. ఈ ముసలి బ్రాహ్మడు అడిగినది వింతగా వున్నా "ఇంటికి రండి. భోజనం పెడతాను" అన్నది సంపూర్ణమ్మ. అ బ్రాహ్మడు తన వెనకే వస్తూన్నట్టు వస్తూ మాయమైపోయాడు. ఎంత వెదికినా కనబడలేదు.

కొన్నేళ్ళు తరువాత ఎప్పుడో తిరువన్నామలై వెళ్ళింది సంపూర్ణమ్మ. ఆ వూరికేపనిమీదగాని వెళ్ళినవారు భగవాన్ దర్శనం చేసుకోక మానరు. అలాగే సంపూర్ణమ్మ కూడా వెళ్ళింది. భగవాన్ దర్శనం కాగానే అర్థమైపోయిందామెకు "నాకు వండిపెట్టవా?" అని అడిగిన ముసలి బ్రాహ్మడు ఈయనేనని. భగవాన్ ఆనాడు యౌవ్వనంలోనే వున్నారు అయినా. సంపూర్ణమ్మ కెలా తోచిందో ఆయనే ఈయనని!

ఆమె మరి భగవాన్‌ని విడిచిపెట్టలేదు. ఆశ్రమ వంటగదిలో ప్రవేశించి. భగవాన్‌కి. భక్తులకీ కూడా వండిపెట్టడం ప్రారంభించింది.

* * *

సంపూర్ణమ్మ వంటింటి ప్రవేశానికి ముందే శాంతమ్మ. లోకమ్మ అక్కడ వంటపని చూస్తున్నారు.

వీరేగాక. సుబ్బలక్ష్మమ్మ. రాజయ్యర్. రాయర్ చేరారక్కడికి.

* * *

భగవాన్ పరిచారక వర్గం కూడా విస్తరించింది - రామకృష్ణ స్వామి, మాధవస్వామి అనే యిద్దరు భక్తులు చేరడంతో ఆ తరవాత కొన్నాళ్ళకు కృష్ణస్వామి చేరాడు. ఇతని సేవానిరతి కూడా మిగతావారి సేవాతత్పరతకు తీసిపోదు.

54

భగవాన్‌కి తమ పనులు తాము చేసుకోవడమేగాక ఆశ్రమం పనులు కూడా చూడ్డం అలవాటు. అరుగులు అలుకుతారు. నేల ఊడుస్తారు. విస్తళ్ళు కుడతారు. కూరలు తరుగుతారు. పచ్చళ్ళు రుబ్బుతారు. వంట చేస్తారు.

వంట భగవాన్ దగ్గరే నేర్చుకోవాలి నలుడూ, భీముడూ. అంత బాగా చేస్తారు. దేన్నీ వృథా పోనియ్యరు. తొక్కలనీ, తొడిమెలనీ కూడా పారెయ్యనియ్యరు. వాటితో పచ్చడి చేస్తారు. పులుసులో పడేస్తారు. వారి చెయ్యి పడితేచాలు, అది అమృతప్రాయంగా తయారవుతుంది.

ఎంతసేపటికీ పప్పు ఉడకడం లేదని శాంతమ్మ చిరాకుపడి, అక్కడే వున్న భగవాన్‌తో చెప్పిందా విషయం.

"దాని మొహాన చారెడు ఉప్పుకొట్టు" అన్నారు భగవాన్.

ఉప్పువేస్తే పప్పు ఉడకదని తెలుసు శాంతమ్మకి. అయినా, భక్తితో భగవాన్ చెప్పినట్టే చేసింది.

పర్యవసానం? పప్పు చక్కగా వుడికి వూరుకుంది

* * *

మరొకనాడు, భగవాన్ పచ్చడి రుబ్బి అక్కడున్న భక్తులకి రుచి చూడమని తలొకకాస్త పెట్టారు. అందరూ సరిగ్గానే వుందన్నారు. ఒకాయన మాత్రం "కాస్త

ఉప్పు తక్కువయినట్టు అనిపిస్తోంది అన్నాడు, నీళ్ళు నములుతూ. వెంటనే భగవాన్ దోసెడు ఉప్పు వేసి కలిపారందులో. తక్కువయిందని చెప్పిన భక్తుడు నిర్ఘాంతపోయాడు. మిగతావాళ్ళు "ఈ మహానుభావుడి మూలంగా పచ్చడి తగులబడివూరుకుంద" నుకున్నారు.

చిత్రం... పచ్చడి బ్రహ్మాండంగా కుదిరిందావేళ.

* * *

వంటచేస్తూకూడా ఏదో బోధిస్తూంటారు భగవాన్. పులుసు పైత్యాన్ని విరిచేస్తుంది. ఇక్కడికి వచ్చేవాళ్ళకు కూడా కొంచెమో గొప్పో పైత్యముంటుంది. ఇక్కడి పులుసు పుచ్చుకుంటే సరి. ఆ పైత్యం నివారణ అవుతుంది - పులుసు బాగా ఉడకాలి. పొంగు పూర్తిగా పోవాలి. అలా పొంగు పోదా, కడుపులో పొంగుతుంది" ఇలా సామ్యాలతో తత్వబోధ చేస్తారు.

గంట కొట్టగానే భోజనాలకి భోజనశాలకి వెళతారందరూ. భగవాన్ కూడానూ. వడ్డనలో భగవాన్ కేదయినా ప్రత్యేకత చూపించారా, వారు సహించేవారు కాదు. మరునాడు భోజనం మానేసేవారు కూడాను. ఆ ప్రత్యేకతను చూపించకుండా వుండడానికి వడ్డనచేసేవారు ఎంత సతమతమయ్యేవారో!

"వీరందరిలోను భగవాన్ లేడా? వీడేనా భగవాన్?" అని అడుగుతారు. భగవాన్‌కు ఆ రోగ్యం సరిలేనప్పుడు దంపుడుబియ్యం వండి పెట్టాలన్నారు వైద్యులు. భగవాన్ దానికి వొప్పుకోలేదు "మిగతా వారందరికీకూడా దంపుడు బియ్యం అన్నమే పెట్టదలిస్తే నాకూ పెట్టండ"న్నారు.

భక్తులు ఒక పండూ ఫలం తెచ్చినా అందరతోపాటే తమవాటా.

ఒక ధనవంతురాలు భగవాన్‌తో "మీరు రోజూ ఒక గ్లాసుడు బత్తాయిరసం పుచ్చుకుంటే మంచిది" అన్నది. "నా కెక్కడినుంచి వస్తుంది" అన్నారు భగవాన్. ఆమె పంపుతానంది. "అందరికీకూడా! పంపండి అలాగయితే'

అన్నారు. ఇంకేముంది! ఆ ధనవంతురాలి నోటికి తాళం వేసేసారు భగవాన్.

సమత్వాన్ని అంతగా పాటించిన వారెవరున్నారు? ఎందరున్నారు?

ఆశ్రమవాసి ఒకడు వూళ్ళోకి వెళ్లి, ఏదో తప్పుపని చేసి దొరికి పోయాడు. అతన్ని చంపడానికి సిద్ధమయ్యారు వాళ్ళు. ఎలాగో తప్పించు కుని "రమణా రమణా" అంటూ పరుగెత్తుకువచ్చి భగవాన్ పాదాలమీద పడ్డాడు. మిగతా ఆశ్రమవాసులందరికీ అతగాడు చేసిన నేరమేమిటో తెలిసిపోయింది. "వాణ్ణి శిక్షించవలసిందే" అన్నారంతా. "నేరం చేసిన వాళ్ళందరినీ నేను శిక్షించడం మొదలు పెడితే యిక్కడొక నల్లకాకి కూడా మిగలదు. అయితే, నేను శిక్షించడానికి రాలేదు" అన్నారు భగవాన్. అలాని, ఆ నేరం చేసినవాడితో "నీ నేరం బయటుపడింది కాబట్టి పో - వీళ్ళ నేరాలు బయటుపడినపుడు వీళ్ళూ పోతారు" అన్నారు.

దోషిగా నిర్ణయించిన ఆశ్రమవాసులు సిగ్గుపడిపోయారు.

అవునుమరి. దొరికినవాళ్లు దొంగలు. మిగతావాళ్లు? దొరికేదాకా దొరలే!

55

భగవాన్ సన్నిధానానికి వచ్చేవారు అంతకంతకు ఎక్కువయ్యారు.

తమకు ఉపదేశాన్ననుగ్రహించి శిష్యులుగా అంగీకరించవలసిందని చాలామంది ప్రార్థన. కాని, భగవాన్ ప్రత్యేకించి ఎవరికీ ఉపదేశమివ్వనూ లేదు. ఎవరినీ శిష్యులుగా అంగీకరించనూలేదు. అందుచేత వారంతా భక్తులుగానే మిగిలిపోయారు.

ఎవరికీ ఉపదేశ మివ్వకపోయినా, ఎవరేమడిగినా వారివారి సంస్కారాలకు తగిన సమాధానాలిస్తారు. ఆ సమాధానాలనే ఉపదేశాలుగా భావిస్తారు

చాలామంది.

దీక్ష నియ్యవలసినదిగా మొండిపట్టు పట్టిన మూఢభక్తులకి "మీకు తెలియకపోతే నేనేం చేసేది? దీక్షనిస్తూనే వున్నాను - వీక్షణ దీక్ష" అని చెప్పారు.

నిజమే. వారి విశాల నేత్రాలనుంచి నిరంతర ప్రవాహంగా కటాక్ష వీక్షణాలు ప్రసరిస్తూనే వుంటాయి.

భగవాన్ దగ్గరకు హిందువులేకాదు, మహమ్మదీయులు, క్రిస్టియన్లు, పార్సీలు, బౌద్ధులు - అన్ని మతాలవారూ వస్తారు. కాని, భగవాన్ వర్ణవివక్షతనీ, మత వివక్షతనీ పాటించరు. వారు సర్వానికీ అతీతులు. భగవాన్‌ని ఏదేదో అడగాలని వస్తూంటారు చాలామంది. కాని, వారి సమక్షంలోకి రాగానే వారి సందేహాలు నివృత్తి అయిపోతాయి. ఇది వేలాదిమంది అనుభవం.

* * *

సుందరేశయ్యర్ భగవాన్ భక్తుడు. పాపం, అతనికి కష్టాల మీద కష్టాలు వచ్చిపడ్డాయి. భరించలేకపోయాడు. ఆత్మహత్యకు సిద్ధమై కడసారిగా భగవాన్ దర్శనానికి వెళ్లాడు. భగవాన్ అప్పుడు విస్తళ్ళు కుడుతున్నారు. సుందరేశయ్యర్ ఏమీ అడక్కుండానే చూశారా, ఒక విస్తరిని కుట్టాలంటే ఎంత శ్రమో! అడవికి వెళ్ళాలి. ఆకులు ఏరితేవాలి. వాటి నెండబెట్టాలి. పుల్లలు తేవాలి. వాటిని సన్నగా చీల్చాలి. అప్పుడీ ఆకులు ఒకదాని కొకటి అంటుకునేటట్టు గుండ్రంగా కుట్టాలి. ఇంత శ్రమపడి కుట్టిన ఆకుని అవతలపారేస్తామా? అదెంతుచేత కుట్టబడిందో ఆ పని అయిన తరవాతగాని పారేయం. అనగా, దాంట్లో భోంచేసింతరువాతగాని పారేయం" అన్నారు భగవాన్.

సుందరేశయ్యర్‌కు కనువిప్పు అయింది. "ఎంతో పుణ్యం చేసు కుంటేనేగాని మానవజన్మరాదు. తీరా వచ్చిం తర్వాత దాన్ని బలవంతంగా అంతం చేసుకోవడమా! మానవజన్మలోనేకదా, ధర్మార్థ కామ మోక్షాలని సాధించుకోగలగడం! "శరీరమాద్యం ఖలు ధర్మసాధనం" అన్నారు కదా!

"భగవాన్ నా ఆలోచన్ని కనిపెట్టి నాకీబోధ చేశారు. నాకొచ్చిన కష్టపరంపర నన్ను జన్మపరంపరనుండి విముక్తి చెయ్యడానికే అవుతుంది. ఈ కష్టాన్ని సహించగల శక్తిని భగవానే ప్రసాదిస్తారు" - ఇలా తలపోసి భగవాన్‌కు సాష్టాంగపడి వెళ్ళిపోయాడు.

సుందరేశయ్యర్ లాగే ఒక అమెరికన్ మహిళకూడా తన మనోవ్యధను భరించలేక ఆత్మహత్య కుద్యమించింది. భగవాన్ దర్శనానికి వెళ్ళింది. అప్పుడక్కడ ఆత్మహత్యను గురించిన ప్రసంగమే జరుగుతోంది.

"ఈ దేహాన్ని చంపగలిగినా యాతనాదేహం వుండనే వుంటుంది. దాన్నెలా చంపగలవూ? అది వున్నంతవరకు ఏ పిశాచ రూపంలోనో వుండక తప్పదు. చేతనైతే నీ అహంకారాన్ని చంపుకో. అప్పుడే యాతన లుండవు. సచ్చిదానందంగా అవతరిస్తావు" అని చెప్పారు భగవాన్.

ఇదంతా విన్న అమెరికన్ మహిళ "బలవంతంగా చచ్చి పిశాచరూపంలో యాతనలు పడేదానికంటే యీ మానవశరీరంలోనే వుంటూ బాధ లనుభవించడమే మేలు" అనుకుని, ఆత్మహత్యా ప్రయత్నాన్ని విరమించి, భగవాన్ దగ్గిర సెలవు తీసుకుని అమెరికా వెళ్ళిపోయింది.

భగవాన్ దర్శనం చేసుకున్నవారు వూరికేపోలేదు. దుఃఖితులు ఆనందులయ్యారు. నాస్తికులు ఆస్తికులయ్యారు. ఆస్తికులు భక్తులయ్యారు. భక్తులు యోగులయ్యారు. యోగులు జ్ఞానులయ్యారు.

జ్ఞానికంటె పై మెట్టేముంది! "జ్ఞాని నేనూ ఒకటే" (జ్ఞానీత్వాత్మైవమే మతం") అన్నాడు కృష్ణపరమాత్మ తన గీతోపదేశంలో.

"ఇమయప్రాంత సన్నిధి చేరునట్లు చేరారు భగవాన్ దగ్గరకు ముముక్షువులు. చేరి, అమూల్యమైన శాంతి ననుభవించారు. భగవాన్‌ని "He is a Prince of Peace" ("రమణుడు శాంతిసముద్రుడు") అన్నారు మహాయోగి శ్రీ అరవిందులు.

భగవాన్ భక్తుల కనేక విధాల తమ అనుగ్రహం ప్రసాదించినా, అది చిత్రంగా

వుంటుంది. అట్టహాసం వుండదు. సంభ్రమాశ్చర్యాలలో ముంచెత్తదు. నిరాడంబరత్వమే గోచరిస్తుంది. వారు మహిమల నెప్పుడూ ప్రదర్శించలేదు. ఏవేనా అద్భుతాలు జరిగినా "అలాగా" అని వూరుకుంటారు.

ఊర్ధ్వగతికి వెళుతూన్నప్పుడు సిద్ధులు వాటంతటవే ప్రాప్తమవుతాయి మనం ఆశించకుండానే. వాటిని ప్రదర్శించాలని ప్రదర్శించి దుర్వినియోగం చెయ్యడం మళ్ళీ అధోగతికి ప్రయాణం కట్టడమే.

ఒక మహాత్ముడు నీళ్ళమీద నడిచి యీ గట్టునుంచి ఆ గట్టుకు వెళ్ళి తన మహత్తును ప్రదర్శించాడు శ్రీరామకృష్ణపరమహంస వారి ముందు. "ఎన్నాళ్ళు తపస్సు చేసి యీ సిద్ధిని పొందావు?" అని అడిగారు పరమహంస. ఎన్నో సంవత్సరాలని చెప్పాడు ఆ మహాత్ముడు. "పిచ్చివాడా, అన్ని సంవత్సరాలు తపస్సు చేసింది ఇందుకా? ఈ యేరుని నేను బల్లకట్టుమీద దాటగలను ఒక అణా డబ్బులిచ్చి" అన్నారు పరమహంస. సిగ్గు పడిపోయాడు ఆ మహాత్ముడు.

భగవాన్ ఎప్పూడూ మహిమలను ప్రదర్శించకపోయినా, వారే ఒకసారి "నేనిప్పుడు యిరవై లోకాలలో యిరవై వేర్వేరు దేహాలతో పని చేస్తున్నాను" అన్నారు.

చిత్రంగానే అగుపిస్తుంది మనకి. ముల్లోకాలనీ, చతుర్దశ భువనాలనీ విన్నాంగాని యిరవై లోకాలని వినలేదు. ఇరవైలోకాలలో యిరవై వేర్వేరు దేహాలతో పని చెయ్యడమేమిటి? అసలు ఎన్నిలోకాలున్నాయి? మిగతా లోకాల్లో ఎవరెవరు ఏయే దేహాలతో పని చేస్తున్నారు? భగవంతుడు ఒక్కడేనా ఒక్కడే అయితే వీళ్ళంతా ఎవరు?

ఎంత గింజుకున్నా అర్థంకాదు. అర్థం కాకపోయినప్పటికీ, భగవాన్ కుపాధి వారి స్థూలశరీరం ఒకటే కాదనీ, వారికి దివ్య దేహాభ్యుదయంకూడా వుందనీ గ్రహించవచ్చు.

రాసలీల సమయంలో కృష్ణుడు గోపికకొక కృష్ణుడుగా తయారై

వందలమంది గోపికలతో ఆడుకున్న మాట యదార్థమే అయ్యుండాలి.

* * *

ఒక భక్తుడు ఆత్మసాక్షాత్కార భాగ్యాన్ని ప్రసాదించమని భగవాన్‌ని ప్రార్థించాడు.

"నేనెక్కడినుంచి తెచ్చి చూపించాలి ఆత్మను అది మీలోనే ప్రత్యక్షంగా వుంది. అయితే, మీరు దాన్ని దర్శించలేకపోవడానికి కారణం, అది అజ్ఞానం చేత కప్పబడి వుండడంవల్ల. అందుచేత నిర్మూలించుకోవలసింది అజ్ఞానం మాత్రమే.

"చూడండి, అద్దం వుంది, అయినా మీ ముఖం కనిపించడం లేదు. కారణం దానిమీద మకిలి వుండడంచేత. ఆ మకిలిని తుడిచేస్తే మీ ముఖం వున్నది వున్నట్టుగా కనిపిస్తున్నది.

"అదే విధంగా అజ్ఞానాన్ని పోగొట్టుకుంటే ఆత్మదర్శనమవుతుంది. ఆత్మ ఎక్కడో ఆకాశంమీద వుందనీ, దాన్ని దర్శించి తరించాలనీ తాపత్రయ పడనక్కరలేదు అని విశదీకరించారు భగవాన్.

* * *

భగవాన్ బాల్య స్నేహితుడొకనాడు భగవాన్ దగ్గరకు వచ్చాడు. భగవాన్ చిరునవ్వుతో ఆహ్వానించారు.

పిచ్చాపాటి మాట్లాడుకుంటూండగా ఆ స్నేహితుడు - "మనం ఒకే వూరివాళ్ళం. మనం ఒకే యీడువాళ్ళం.

మనం ఒకే స్కూల్లో చదువుకున్నాం.

మనం కలిసిమెలిసి తిరిగేవాళ్ళం" అన్నాడతను.

భగవాన్ "ఔనౌను" అంటూ, చిట్ట చివరగా - "అన్నీ చెప్పావుగాని ఒకటి మాత్రం చెప్పడం మరిచిపోయావు" అన్నారు.

అదేమిటా అన్నట్టు చూశాడు మిత్రుడు.

"మనిద్దరిలోనూ ఒకే ఆత్మవుంది" అన్నారు భగవాన్.

మిత్రుడికీ, సన్నిధిలోని భక్త బృందానికి అర్థమయింది ఆత్మ అఖండంగా అందరిలోనూ ప్రకాశిస్తోం"దని.

భగవాన్‌బోధలు సూటిగా హృదయంలోకి చొచ్చుకుంటాయి.

* * *

"మనుమలు మేము గుడి కట్టించాం, చెరువు తవ్వించాం, అన్న సత్రవుపెట్టించాం, కల్యాణం చేయించాం, నిలువుదోపిడీ యిచ్చాం, ఆ ఆశ్రమాని కంతిచ్చాం, ఈ ఆశ్రమాని కింతిచ్చాం అంటూ గొప్పలు చెప్పుకుంటూ దానకర్ణుడునని తమను తామే పొగుడుకుంటూంటారు.

"ఏమిటి వీరిచ్చిందీ, ఎక్కడి నుంచి వచ్చిందీ వీరికిదంతా వీళ్ళ వరసచూస్తే, బెల్లంతో తయారు చేసిన విఘ్నేశ్వరుడి నుంచి రవంత బెల్లం గిల్లి ఆ విఘ్నేశ్వరుడికే నైవేద్యం పెట్టినట్టుగా వుంటుంది" అన్నారు భగవాన్ ఏదో సందర్భంలో.

ఆలోచిస్తే భగవాన్ సెలవిచ్చింది ఎంతటి యదార్థమో అవగత మవుతుంది.

ఆ పరమాత్మ అనుగ్రహం వల్లేకదా మనకు ధనధాన్యాలూ, మడిమాన్యాలూ, వస్తు వాహనాలూ మొదలైనవన్నీ లభించాయి. ఇక మనదంటూ ఏముందీ! దైవమిచ్చినది దైవకార్యాల కుపయోగించడం మెచ్చుకోతగ్గదే. అయితే కర్తుత్వ భావంతో ఎటువంటి దాన ధర్మాలు చేసినా ఫలితం శూన్యం. నిరర్థకమైన ప్రశంసలూ ఓహోహోలూ లభించవచ్చు. అంతే.

* * *

భగవాన్ సోఫాపై ఆసీనులై కిటికీ గుండా శూన్యంలోకి చూస్తున్నారు. హాలులోని కొందరు భక్తులు ధ్యాన నిమగ్నులైయుండగా మరి కొందరు

అతి నెమ్మదిగా మాట్లాడుకుంటున్నారు.

ఇద్దరు భక్తుల మధ్య ఏదో సందర్భంలో శవవాహకుల ప్రస్తావన వచ్చింది. ఆకాశంవంక తదేక దృష్టితో చూస్తున్న భగవాన్ హఠాత్తుగా వారి వైపు తిరిగి -

"అందరూ శవవాహకులే" అన్నారు.

శవవాహకులను గురించి ప్రస్తావిస్తూన్న ఆ యిద్దరి భక్తులకే గాక మిగతా భక్తులకు కూడా భగవాన్ అన్నది అర్థంకాక తికమక పడుతున్నారు. అప్పుడు భగవాన్ అందరికేసి ఒకసారి చూసి --

"అవునండీ! అందరూ శవవాహకులే. ప్రతివారూ "నేను - నేను" అంటూ ఎవరి శవాన్ని వారు మోసుకు తిరుగుతున్నారు" అని వివరించారు.

నిజమేమరి. ఈ శరీరంలో జీవుడున్నంత వరకు శివం. ఆ జీవుడు నిష్క్రమించగానే శవం!

* * *

"నేనే తపస్సూ చెయ్యలేదు. నా పదహారోఏట మృత్యానుభవానంతరం నన్ను నేను తెలుసుకున్న క్షణాన్నే ముక్తుడినయ్యాను" అన్నారు భగవాన్ ఓ సందర్భంలో.

అయితే, అనేకచోట్ల, చివరికి అరుణాచలేశ్వరాలయంలోని ఒక బిలంలో కూడా కళ్లు మూసుకుని కూర్చుని, తేళ్ళు కుట్టినా, జెర్రెలు కరచినా, పురుగులు దొలిచినా, దేహధ్యాసలేకుండా చేసిన దేమిటోమరి! దాన్ని తపస్సుగాక మరేమనాలో! భగవాన్ వివరించినట్లు నాకు తెలియదు.

సర్వకాల సర్వావస్థల యందూ వారు ఆత్మానుభూతిని, సచ్చిదానందాన్ని అనుభవిస్తూన్న మాట మాత్రం విదితమే.

* * *

శ్రీ ప్రణవానందస్వామి మళయాళీ. బాల్యంలోనే గురుకులంలో చేరి 14 సంవత్సరాలు గురువుగారి సేవచేసి వారి ద్వారా వేదాంత సారాన్ని గ్రహించారు.

శరీరం ఒక వ్యాధి అనీ, ఈ వ్యాధికి మళ్ళీ రకరకాల వ్యాధులు సంభవిస్తాయనీ, అయితే యీ వ్యాధులకులోనయ్యే శరీరంలోనే సచ్చిదానంద స్వరూపమైన ఆత్మ ప్రకాశిస్తోందనీ, అది అజరామరమయిందనీ, లో దృష్టితో ఆ ఆత్మను దర్శించడమే అందులో లీనమయి పోవడమని - అనగా, ద్వైతభావన పోయి తానే అద్వితీయుడుగా మిగిలిపోయి అనంతకాలం దివ్యశాంతిని అనుభవించడమనీ వారి గురువుగారు శాస్త్రపురాణాలద్వారా బోధించారు.

ప్రణవానందులు శుశ్రూష పూర్తి చేసుకుని, సన్యాసాన్ని స్వీకరించి గురుదేవుల దీవెనలందుకుని దేశాటనకు బయలుదేరారు.

అయితే, ఆయన ఎంత ప్రయత్నించినా, ఎంత సాధన చేసినా ఆత్మానుభవం పొందలేకపోయారు. ఈ కారణంగా మనోక్లేశానికి లోనయ్యారు.

ఇలావుండగా విరూపాక్షిగుహలోవున్న శ్రీరమణ దేవుని దర్శనం లభించిందొకనాడు. అంతే. ఆ క్షణాన్నే వారి గురువుగారు 14 సంవత్సరాలపాటు నూరిపోసిన యదార్థం - ఆత్మానుభవం లభ్యమయింది.

లోకుల నుద్ధరించడానికి అనంతమంతా వ్యాపించియున్న దివ్య శక్తే రమణ రూపం ధరించి ఇలాతలానికి దిగివచ్చిందని విశ్వసించారు. భగవాన్‌కు పదేపదే ప్రణమిల్లి తిరిగి దేశసంచారం మొదలుపెట్టి ఎట్టకేలకు కృష్ణాజిల్లాలోని గుడివాడలో ఒక ఆశ్రమాన్ని నిర్మించుకున్నారు. వారి భక్తులు ఆ ఆశ్రమాన్ని ప్రణవాశ్రమంగా పేర్కొన్నారు.

ఎక్కడి మళయాళదేశం ఎక్కడి గుడివాడ ఇందుకే కామోలు "ఎక్కడి నీళ్ల ప్రాప్తమో అక్కడికి చేరతాయి అనేది వ్యాప్తిలోకి వచ్చింది.

ప్రణవాశ్రమంలో భక్తులకు జ్ఞాన బోధ చేస్తున్నా, పరమాత్మానుభూతిని పొందుతూన్నా తరచు రమణ భగవాన్‌ని దర్శించడం మానలేదు. భగవాన్

స్కంధాశ్రమంలో వున్నపుడూ వెళ్ళారు. ఆ తరువాత శ్రీ రమణాశ్రమం నిర్మించబడిన అనంతరం కూడా పలుమార్లు వెళ్ళి శ్రీవారి సన్నిధిని కొంత కొంత కాలం గడిపేవారు. ఈ విధంగా భగవాన్ దగ్గర చనువూ ఏర్పడింది ప్రణవానందులకు.

ఏవో కొన్ని సందేహాలు పుట్టుకొచ్చాయి ప్రణవానందస్వామికి. భగవాన్‌ను అడిగి తీర్చుకోవాలనే అనుకున్నారు. కాని, శ్రీవారి సమక్షానికి చేరగానే అడగలేకపోయేవారు. అప్పుడొక ఉపాయం తోచింది వారికి.

ప్రణవానందులకు హిందూపురంలో కొంతమంది శిష్యులున్నారు. తాము భగవాన్‌ని అడగదలచుకున్న ప్రశ్నలన్నిటినీ వారికి వివరంగా చెప్పి, వారిచే అడిగించాలనుకుని, వారిని శ్రీ రమణాశ్రమానికి తీసుకొచ్చారు.

ప్రణవానందుల శిష్యులు ఆ ప్రశ్నలన్నిటినీ అడిగి తమ సందేహాలను నివృత్తి చెయ్యవలసిందిగా భగవాన్‌కు నివేదించుకున్నారు.

శ్రీవారు ఏమి సెలవిస్తారో విందామని సన్నిధిలోని భక్తులందరూ ఎదురు చూస్తున్నారు.

అయితే, భగవాన్ వారి ఏ ఒక్కప్రశ్నకూ జవాబు చెప్పకుండా "నేనేమయినా శాస్త్రాలు చదివానా, పండితుడినా, చూడండి, యిక్కడ ప్రణవానందస్వామి వున్నారు. వారి నడగండి. చక్కగా మీ సందేహాలను తీరుస్తారు' అని ముసిముసి నవ్వులు నవ్వుతూ ప్రణవానందులవంక చూసి వారిని చెప్పమన్నారు.

తాను పన్నిన వలలో తానే చిక్కుకున్నట్టు గ్రహించారు ప్రణవానందస్వామీజీ. అంతేగాక, తనలో అంతర్యామిగావున్న రమణ పరమాత్మ తన యుక్తిని గ్రహించి తనపైకే బాణం విసిరారని కూడా రూఢీ చేసుకున్నారు. ఇక వేరే దారిలేదు. భగవాన్ ఆజ్ఞను శిరసావహించి చెప్పితీరవలసిందే.

చెప్పడం ప్రారంభించారు. చిత్రం! అతి విచిత్రం! తమ ప్రశ్నలకు తామే సమాధానాలు చెప్పకున్నారు. సమక్షంలోని భక్తులు కూడా విని ఆనందించారు.

అయితే, యదార్థం ఒక్క ప్రణవానందులకే తెలుసు అది తన ప్రజ్ఞ కాదనీ, రమణవాణి తమ నోట పలికిందనీ.

ప్రణవానందులు భగవాన్ సన్నిధిని కొన్నాళ్లున్న తరువాత తమ ఆశ్రమానికి వెళ్ళడానికి ప్రయాణమై శ్రీవారి అనుమతిని కోరారు. అప్పుడు భగవాన్ ఒక చేతికర్రను తయారుచేస్తున్నారు. "కాసేపాగండి. కర్రను నునుపు చేస్తున్నాను. తీసుకువెళుదురుగాని" అన్నారు.

"ఎవరిక్కావాలండీ మీ చేతికర్ర ఒక రూపాయికి రెండు కర్రలు దొరుకుతాయి బజారులో, ఆ కర్రను మీరే వుంచుకోండి. వృద్ధులవుతున్నారు. మూడోకాలుగా పనికొస్తుంది" అన్నారు ప్రణవానందులు.

హాలులోని భక్తులందరూ నివ్వెరపోయారు. "ఏమిటీ స్వామి వాలకం! భగవాన్ చేతిమీదుగా ఏ వస్తువు లభించినా మహాభాగ్యమే కాదా - అటువంటిది ఈయన యిలాగనడం ఎంత దౌర్భాగ్యం" అను కుంటూండగానే ప్రణవానందులు....

"భగవాన్, ఒక చేతికర్రనిచ్చి నన్నేమార్చాలనుకుంటున్నారా? తమ అనుగ్రహ దండాన్ని ప్రసాదించండి. ఆ దండం సహాయంతో యీ అజ్ఞానాంధకారం నుండి జ్ఞానప్రకాశంలోనికి ప్రవేశిస్తాను" అన్నారు.

నివ్వెరపోయిన భక్తుల ముఖాలొక్కసారిగా వికసించాయి.

భగవాన్ కూడా తమ మందహాసంతో సమక్షాన్ని వెలుగుతో నింపేశారు.

*   *   *

ఒకనాడు ఆశ్రమంలో ఒక కాకి పడి చచ్చిపోయింది. గడిచిన జన్మల్లో ఆ కాకి ఎవరో, ఆ కాకికీ తమకూగల అనుబంధమేమిటో భగవాన్‌కే తెలియాలి. భగవాన్ దాన్ని సమాధి చేశారు.

ఇది జరిగిన కొద్దినిమిషాల్లో ప్రణవానందస్వామి వచ్చారక్కడికి. వారిని

చూస్తూ "రండి. రండి ఇంతకుముందే కాకికి సమాధి చేశాను" అన్నారు భగవాన్.

"అందులో చెప్పుకోతగ్గ గొప్పేముంది?" అన్నారు ప్రణవానందులు.

హాలులోని భక్తులు చిరాకు పడ్డారు "ఏమిటీ ఈయన భగవాన్నే ధిక్కరిస్తున్నాడె అనుకుంటూ. అంతలోనే-

"ఆనాడు జటాయువుకు అగ్ని సంస్కారం చేసిన వారే యీనాడు కాకికి సమాధిచేశారు. ఈ రహస్యం తెలియని వారికి గొప్పగాని. తెలిసినవారికి గొప్పేమిటి! అలనాటిది రామావతారం. నేటిది రమణావతారం" అన్నారు ప్రణవానందులు.

స్వామి ఛలోక్తికి. వారికి భగవాన్ యెడలగల భక్తికి సన్నిధిలోని వారంతా ఎంతో ఆనందించారు.

ప్రణవానందులు చమత్కారప్రియులు.

*　　*　　*

"If you don't believe in God, invent One"

("నీకు దేవుడున్నాడనే నమ్మకం లేకపోతే నువ్వే ఒక దేవుణ్ణి సృష్టించుకో") అన్నాడొక ఆంగ్లేయ భక్తుడు.

ఆంగ్లేయ భక్తులు కానీండి. హైందవ భక్తులు కానీండి. మరే దేశ. ఏ ప్రాంతాల భక్తులు కానీండి - ఆస్తికులెంతమందున్నా నాస్తికులు కూడా కొందరుంటూనే వచ్చారు. ఈ నాస్తికులుకీ. యీ మధ్య తయారయిన హేతువాదులకీ భేదముందోలేదో నాకు తెలియదుగాని. ఒకనాడొక హేతువాది నాతో వాదనకు దిగాడు -

"దేవుడు దేవుడంటావు. దేవుడూ. ఆ దేవుడు .పుట్టించడం వట్టిమాట. విజ్ఞానశాస్త్రం ఇంతగా పెరిగిన యీ రోజున దేవుడూ. గుళ్ళూ గోపురాలూ. పూజలూ పునస్కారాలూ. యాత్రలూ. మొక్కులూ వగైరాలన్నీ మూర్ఖత్వం.

మూఢత్వం. అమెరికాలో జీవ పదార్థాన్ని కనుగొన్నాడొక శాస్త్రజ్ఞుడు" అన్నాడు.

"నిజమే. ఆ శాస్త్రజ్ఞుడు మరెవరో కాదు. మన భారతీయుడే. ఆయన పేరు హరగోవింద్ ఖురానా. అమెరికా పౌరసత్వాన్ని పొంది అక్కడ స్థిరపడ్డాడు. అయితే. ఆయన ఉన్న జన్యుపదార్థాన్నే కనిపెట్టాడు గాని-దానిని కొత్తగా సృష్టించలేదు గదా?" అన్నాను.

జవాబు చెప్పలేక తెల్లమొహం వేసుకునికూడా వితండ వాదన సాగించాడు.

"ఒక మనిషినేకాదు. ఏ జీవినైనా - సృష్టించమను ఎంతటి శాస్త్రజ్ఞుడి నైనా - చివరకు ఒక పువ్వునుగాని. ఆకునుగాని సృష్టించమను. పువ్వునుపోలిన ప్లాస్టిక్ పువ్వునూ. ఆకును పోలిన ప్లాస్టిక్ ఆకునూ తయారు చెయ్యగలడుగాని మరింకేమీ చెయ్యలేడు. మహర్షులు జన్మించిన యీ పవిత్ర భారతభూమిలో నాస్తికులూ. హేతువాదులూ బయలుదేరడం సిగ్గుచేటు. అయినా. వారు మానవత్వానికి విలువనిస్తున్న మాట మాత్రం ముమ్మాటికీ నిజం. "మానవసేవే మాధవసేవ" అనే సూక్తిలో వారికి నమ్మకం లేకపోయినా. వారు చేస్తున్నదదే" అన్నాను.

మొత్తం మీద దేవుడి విషయంలో మాత్రం నాతో ఏకీభవించకుండానే నిష్క్రమించాడా హేతువాది.

*　　*　　*

"మేధస్సు ఎక్కడంతమవుతుందో అక్కడ ప్రత్యక్షమవుతాడు పరమేశ్వరుడు" అన్నారు మహామండలేశ్వర శ్రీశ్రీశ్రీ శివానందజీ మహరాజ్.

ఇంతకంటె యదార్థమేముంటుంది!.... మేధస్సుతో అందుకో గలిగితే భగవంతుడిని.... అవాంగ్మానసగోచరుడని ఎందుకు స్తుతిస్తున్నారు మహర్షులూ. మహాత్ములూ. భక్తులూ!

*　　*　　*

25-7-1936. భగవాన్ మౌనం వహించారు. భోజనానికి కూడా లేవలేదు. కారణమేమిటో వూహించుకోలేకపోయినా, భక్తులు కూడా భోజనానికి కూర్చోలేదు.

మధ్యాహ్నం 2-30 అయింది. మౌనాన్ని చాలించారు. లేచి స్నానానికి వెళ్ళారు. ఆ తరువాత భోజనం చేశారు. వారితో పాటు భక్తులూ భోంచేశారు.

సాయంత్రం టెలిగ్రాం వచ్చినది ఆశ్రమానికి,- నాయన (కావ్యకంఠ గణపతి మునీంద్రులు) ఖరగపూర్ లో ఆ మధ్యాహ్నం 2-30కు పరమపదించినట్లు.

భక్తులకి అప్పటివరకు అర్ధంకాలేదు భగవాన్ 2-30 వరకూ ఎందుకు మౌనం వహించారో, భోజనానికి ఎందుకు లేవలేదో.

"అయ్యో, నాయన మనకిక లేరే" అని బాధపడుతూన్న భక్తులతో "నా దగ్గరకే వచ్చారు నాయన. ఇంకెక్కడికి వెళతారు" అన్నారు భగవాన్.

56

భగవాన్ భక్తులు మనుషులే కాదు, జంతువులు కూడానూ.

ఆశ్రమంలో నాలుగు కుక్కలున్నాయి. భగవాన్ భోం చెయ్యకుండా అవేవీ తినవు. ఒక మహాశయుడిది నమ్మలేదు. నమ్మక, పరీక్షించి చూడాలనుకున్నాడు. నోరూరే ఆహారాన్ని ఆ కుక్కలముందు పెట్టాడు. కానీ ముట్టుకోలేదు. అదల్లేదు మెదల్లేదు. భగవాన్ వచ్చి విషయం తెలుసుకొని రవ్వంత తమ నోట్లో వేసుకున్నారు. అంతే. భగవాన్ భుక్తశేషమయిన ఆ ప్రసాదాన్ని కలబడి తినేశాయి. అది చూసి బిగిసిపోయాడా మహాశయుడు.

ఏ పూర్వజన్మ సంబంధమో భగవాన్‌కీ, ఆ కుక్కలకీ

* * *

ఒకనాడొక కుక్క కొండమీదనుంచి ఆశ్రమంలోకి వచ్చి మొరగడం ప్రారంభించింది. అదెంత మొరుగుతూన్నా ఎవరూ పట్టించుకోవడం లేదు. చివరికి భగవాన్ వచ్చి ఆ కుక్కకు అన్నం పెట్టించారు. తిని వెళ్ళిపోయిందది. తరవాత అన్నారు భగవాన్ "వారొక సిద్ధపురుషులు. ఆశ్రమభిక్ష స్వీకరించాలని ఆ రూపంలో వచ్చారు" అని.

అటువంటి విషయాలు భగవాన్‌కు తప్ప మరెవరికి తెలుస్తుంది!

* * *

ఒక భక్తుడు ఒక అరటి పళ్ళ అత్తం తెచ్చాడు. భగవాన్‌కు సమర్పించుకోవాలని. అత్తాన్ని ఒకచోట పెట్టి భగవాన్ కూర్చునే హాల్‌కు ప్రదక్షిణం చెయ్యసాగాడు. ఇంతలో ఒక కోతివచ్చి దాన్ని పట్టుకుపోయి యింటి కప్పునెక్కి కూర్చుంది. ఆ భక్తుడది చూసి "ఒరేయి ఒరేయి, ఆ పళ్ళని భగవాన్‌కివ్వాలని తెచ్చానురా. కావలిస్తే ఒక పండు తీసుకుని వెళ్ళిపోరా" అన్నాడు అలాగే ఒకే పండుని తీసుకుని వెళ్ళిపోయాడా వానరుడు.

హనుమంతుడుకాదు కదా ఆ బుద్ధిమంతుడు? ఏమో, ఆ భగవాన్‌కే తెలియాలి.

* * *

ఒక ఉత్సవ సమయంలో కోతులనేకంగా చేరాయి ఆశ్రమ ఆవరణలో. తినుబండారాల నెత్తుకుపోవాలని మాటువేశాయి. అన్నంముద్దలు తెమ్మన్నారు భగవాన్. ఒక బుట్టలో తెచ్చిచ్చారు పరిచారకులు. కోతి కొక ముద్ద చొప్పున యిచ్చారు భగవాన్ స్వహస్తాలతో. అవి ఒక వరసలో నుంచుని అందుకున్నాయి.

క్రమశిక్షణని ఆ కోతుల దగ్గరనుంచే నేర్చుకోవాలని మనుషులు నమ్మడం కష్టమేగాని నమ్మకతప్పదు. అప్పుడు తీసిన ఫోటోవుందిమరి.

కోతులమీద వాత్సల్యం పోలేదు రాముడికి. ఆనాటి రాముడే కదా ఈనాటి రమణుడు.

*　　*　　*

ఉడతలు వచ్చి భగవాన్ వడిలో ఆడుకుంటాయి. భగవాన్ వాటిని నిమురుతారు. ముద్దు చేస్తారు. పప్పులూ అవీ పెడతారు. ఒక నాడొక ఉడత భగవాన్ వేలు కొరికింది. ఆ ఉడతని వడిలోంచి దింపేశారు భగవాన్. తను చేసిన తప్పుకి ఆ ఉడత పడిన పశ్చాత్తాపం. భగవాన్ పాదాల ముందు ప్రాధేయపడుతూ పొందిన ఆవేదనా యింతింతకాదు. అప్పుడు దాన్ని క్షమించి. భగవాన్ మళ్ళీ ఆ ఉడతని తమ అక్కున చేర్చుకున్నారు.

ఉడతలకీ. కోతులకీ భగవాన్‌తో గల అనుబంధమేమిటో!

ఒక భక్తుడూ. ఆయన కొడుకూ. ఆయన కూతురూ భగవాన్ దర్శనమిచ్చే హాల్ అరుగు మీద పడుకున్నారొక రాత్రి. భగవాన్ ఎవరితోనో "ఇదా సమయం నువ్వు రావడానికి? పిల్లలు జడుసుకోరూ?" అంటున్నారు. ఆ భక్తుడికి మెలకువవచ్చి చూసేసరికి ఒక పెద్ద త్రాచుపాము తన బిడ్డల మయంగా పాకి వెళ్ళిపోయింది.

విషసర్పాలు. కళ్ళారమృగాలుకూడా భగవాన్‌ని సేవించుకున్నవి. వాటికి పూర్వజన్మ స్మృతి వుండివుండాలి.

*　　*　　*

ఎవరో. తను పెంచుకుంటూన్న చిరుతపులిపిల్లలతో సహా భగవాన్ దర్శనానికి వచ్చారు. ఆ పిల్లలని భగవాన్ చేతికిచ్చారు. ఆ చిరుతలు భగవాన్ దగ్గర వుండగానే. యధాప్రకారం ఎప్పుడూ వచ్చే వేళకే ఉడతలు వచ్చి భగవాన్ చేతిమీదుగా పప్పులుతిని వెళ్ళిపోయాయి.

*　　*　　*

చిరుతలూ - ఉడతలూ భగవాన్ సాన్నిధ్యంలో వాటికి పరస్పర వైరభావం లేదు.

*　　*　　*

బరోడా మహారాణి ఒక తెల్ల నెమలిని తెచ్చి బహూకరించింది భగవాన్‌కి. దాన్ని "మాధవా" అని పిలవడం మొదలుపెట్టారు భగవాన్.

భగవాన్ పరిచర్యచేసి గతించిన మాధవస్వామి అలా తెల్ల నెమలిగా పుట్టాడని ఆశ్రమవాసుల విశ్వాసం.

భగవాన్ అందుకే పిలుస్తున్నారేమో దాన్ని "మాధవా" అని!

*　　*　　*

ఒక రోజున రెండు పిచ్చుకలువచ్చి. భగవాన్ భుజాలమీద వాలి కిచకిచలాడి వెళ్ళిపోయాయి. అవి వెళ్ళిపోయిన తరవాత తమ పరిచారకులలో ఒకరిని పిలిచి "ఏమిటి నువ్వు చేస్తున్న పని? ఆ పిచ్చుకలు గూడు కట్టుకుంటూండడం. నువ్వు దాన్ని పీకి పారేస్తూండడమూనా?" అని అడిగారు. "అవును భగవాన్. ఆ గూళ్ళని ఎన్నిమాట్లు పీకిపారేసినా అవి మళ్ళీ మళ్ళీ వచ్చి మీరు కూర్చునే సోఫాపై నున్న దూలంమీదే కడుతున్నాయి. మీమీద గడ్డిపరకలుపడ్డం చూసి అలా చేశాను" అన్నాడా పరిచారకుడు. "అయితే యీ సోఫాని మరొకచోట వెయ్యండి. అంతేగాని, ఆ పిచ్చిముండల గూళ్ళు పీకకండి. అవి ఒక్కొక్కపరకనీ తెచ్చుకుని గూడు కట్టుకోవడానికి ఎంత శ్రమ పడవలసివస్తుందో నీకు తెలియదు కామోలు" అన్నారు భగవాన్.

ఆ పిచ్చుకల మొరనాలించిన భగవాన్ ఆర్తత్రాణపరాయణుడు కదా!

*　　*　　*

ఒక భక్తుడు ఒక ఆవునీ. దూడనీ తీసుకొచ్చి ఆశ్రమానికి బహూకరించాడు.

ఆ దూడ పెరిగి ఆవు అయింది. దాన్ని "లక్ష్మి" అని పిలిచేవారు భగవాన్. లక్ష్మికి భగవాన్ దగ్గర ఎంత చనువో, వారంటే ఎంత భక్తో చెప్పలేం. భగవాన్ కూర్చున్న హాల్‌చుట్టూ ప్రదక్షిణం చేస్తుంది. భగవాన్ వొళ్ళు నాకుతుంది.

అది బలే కొంటెది కూడాను. ఆశ్రమం ఆవరణలో పెట్టిన కూరగాయపాదులని పాడుచేస్తుంది. అయినా భగవాన్ దానినేమీ అననివ్వరు. "పాదులకి చుట్టూ కంచె కట్టుకోకపోవడం మనదే తప్పు" అంటారు.

ఒక పర్వదినాన ఆశ్రమంవారు పాయసం వండి పొయ్యిమీద నుంచి అప్పుడే దించారు. ఎక్కడినుంచి వచ్చిందో లక్ష్మి వచ్చి, మూతి అందులో పెట్టింది. అంతలో ఎవరో చూసి అదిలించేసరికి అది కంగారు పడి ఆ భాండాన్ని వొంపేసింది. పాయసమంతా మట్టిపాలయిపోయింది. వంటవాళ్ళు భగవాన్‌తోచెప్పి గోలపెట్టారు.

"పాయసం వలకపోసిందని గోలేగాని, ఆ చిట్టితల్లికి మూతి కాలిందేమోనని ఒక్కడూ అనడుకదా" అన్నారు భగవాన్. భగవాన్‌ది మాతృహృదయం.

లక్ష్మి తన మూడవ కాన్పు సమయంలో భగవాన్ దగ్గరకు వెళ్ళి దీనంగా నుంచుంది. ఆ దీనదయాళుడు లక్ష్మి వేదనను గ్రహించి "ఏమీ పరవాలేదు నేను అభయమిస్తున్నానుగా" అని దాని శిరస్సుమీద చెయ్యి వేశారు. సంతోషంగా వెళ్ళిపోయింది లక్ష్మి. ఆ రాత్రే అతి తేలికగా ప్రసవించింది.

లక్ష్మి గాథ లెన్నెన్నో!

లక్ష్మి ముసలిదయిపోయింది. దానికి అవసానకాలం వచ్చింది. మరణవేదననుభవిస్తోంది. ఎంతకీ ప్రాణం పోదు.

భగవాన్‌వచ్చి "బాధపడుతున్నావా తల్లీ? ఇక పడవులే" అని నిమిరి వెళ్ళిపోయారు.

అంతే. లక్ష్మి ఇంక బాధపడలేదు. ప్రశాంతంగా ప్రాణం విడిచింది.

లక్ష్మిని ఆశ్రమంలోనే సమాధి చేశారు. సమస్తలాంఛనాలతో.

భగవాన్ విరూపాక్షిగుహలో వుండగా, ఆకూ అలం ఏరి తెచ్చి భగవాన్‌కు వండిపెట్టిన "కీరపాటి అవ్వ" లక్ష్మిగా పుట్టిందని ఆశ్రమవాసుల విశ్వాసం.

నిజం భగవాన్‌కే తెలియాలి.

* * *

"ఒకసారి మానవజన్మ వచ్చిన తరువాత మళ్ళీ నీచజన్మలు రావడానికి తావుందా?" అని ప్రశ్న బయలుదేరింది ఆశ్రమంలో ఒకనాడు. ఇదమిద్ధమని తేలలేదు. భగవాన్‌ని అడిగారు.

"చాలా పుణ్యం చేసుకున్న మానవుడు కూడా ఏదో జంతు జన్మనెత్తవచ్చు. ఎందుకంటే జంతువు యొక్క ఆయువు తక్కువనీ. ప్రారబ్ధశేషాన్ని త్వరగా అనుభవించివెయ్యొచ్చనీ. అటువంటి జన్మని కావాలని కోరుకునే ఉత్తమ మానవులున్నారు" అని సెలవిచ్చారు భగవాన్.

* * *

భగవాన్‌కు మనుషులెంతో పశుపక్ష్యాదులూ అంతే. పశు పక్ష్యాదులెంతో చెట్టు చేమలూ అంతే.

ఒక రాత్రివేళ ఒక ఆశ్రమవాసి వేపపుల్ల కోసుకుంటున్నాడు. భగవాన్ చూశారు. "రాత్రులప్పుడు కూడా ఆ చెట్టునినిద్రపోనియ్యవా? తెల్లవారింతరవాత కోసుకోరాదా" అన్నారు.

* * *

ఆశ్రమంలోని బాదంచెట్టు పండుటాకుల నేరమని చెపితే, పచ్చుటాకులను కూడా పీకేస్తున్నాడొక ప్రబుద్ధుడు. భగవాన్‌చూసి "అదేంపని" అని అడిగితే "ఆకులుకి ప్రాణంలేదు కదాండి" అన్నాడు. "నీ జుట్టుకుకూడా ప్రాణంలేదు. పీకమంటావా? అని అడిగారు భగవాన్.

* * *

మామిడికాయలు చెట్టెక్కి కొయ్యకుండా గెడతోకొట్టి రాలుస్తున్నాడొ ఘనుడు. ఆకులుకూడా రాలిపోతున్నాయి. భగవాన్ కళ్ళ పడ్డది. ''మనకు పళ్ళ యిస్తున్నందుకు కర్రతోకొట్టి ఆకులు కూడా రాలుస్తున్నావా? షా షా'' అన్నారు.

* * *

ఎచ్చెమ్మాళ్ లక్షపత్రి పూజ తలపెట్టి యాభైవేల ఆకులు కోసింది. మిగతా యాభై వేలు కొయ్యవలసివుంది. ఆ విషయం తనే భగవాన్‌తో చెప్పింది. ''యాభైవేలమాట్లు నువ్వు గిల్లుకో'' అన్నారు భగవాన్. ఎచ్చెమ్మాళ్ నిర్ఘాంతపోయి చూస్తుంటే ''అవును మరి. నిన్ను గిల్లితే నీకు నొప్పి. చెట్టును గిల్లితే చెట్టుకు నొప్పి. ఎందుకిటువంటి పూజలు'' అన్నారు.

భగవాన్ సకలచరాచరసమహితవర్తి కాదా!

భగవంతుడు మనలోనే వున్నాడు. ఆ భగవంతుడికి భక్తి ప్రపత్తులనే పత్రపుష్పాలిష్టం.

పరమేశ్వరుడు ''ఇచ్చుమడిగేది భక్తి. బదులు ఇచ్చేది ముక్తి.''

57

''దుర్లభంత్రయమేవైతత్ - మనుష్యత్వం. ముముక్షత్వం. మహా పురుష సంశ్రయః''

మనిషిగా పుట్టడం దుర్లభం. మనిషిగా పుట్టినా మోక్షగామి కావడం అంతకంటె దుర్లభం. మోక్షగామి అయినా ఒక మహాత్ముని చెంత ఆశ్రయం లభించడం యింకా దుర్లభం.

* * *

బెల్లం దగ్గరకు చీమలు చేరతాయి. తేనెలూరే పువ్వు దగ్గరకు తేనెటీగలు చేరతాయి. అమరత్వాన్ని ప్రసాదించే శ్రీరమణభగవాన్ దగ్గరకు ముముక్షువులు చేరారు ప్రపంచమంతటినుంచీ.

* * *

పాల్ బ్రంటన్ యూదుడు. సుప్రసిద్ధ పాత్రికేయుడు. ఆంగ్లంలో బహుచక్కటి శైలి అతనిది.

ఏపూర్వజన్మల పుణ్యం పరిపక్వమైనదో. దేవుడికోసం తహతహలాడాడు. సత్యాన్వేషణకై బయలుదేరాడు. ప్రపంచమంతా తిరిగాడు.

అతను తరచి చూడని మతంలేదు. అతను చూడని మతగురువు లేడు. అతను చెయ్యని సాధనలేదు. అతను అభ్యసించని యోగంలేదు.

మద్యమాంసాలని విసర్జించాడు. రోజు మొత్తానికి ఉడకబెట్టిన ఒక బంగాళాదుంప. ఒక చిన్న రొట్టెముక్క. కొంచెం పెరుగు- ఇంతమాత్రమే తింటాడు. అభ్యాసం బాగా సాగేందుకు.

ఈజిప్టు దేశంలో చాలా కాలం వున్నాడు. ప్రపంచ వింతలలో ఒకటయిన అక్కడి పిరమిడ్స్‌లో ఎన్నో రాత్రులు గడిపాడు. ఎన్నో గుప్తవిద్యలు నేర్చాడు. ఎన్నో ధార్మిక అనుభూతులను పొందాడు. ఎన్నో అదృశ్య దృశ్యాలని తిలకించాడు. ఎన్నో సిద్ధులను సాధించాడు.

అక్కడి తాంత్రికుల వద్ద విషసర్పాలనూ. క్రూరమృగాలనీ వశపరచుకోవడం నేర్చుకొన్నాడు. ఎన్ని నేర్చినా. ఎంత సాధించినా అతని కాంక్ష తీరలేదు సత్యాన్వేషణాఫలితం లభించలేదు.

చివరికి. హైందవమత సిద్ధాంతాల్లో తనకు కావలసినది దొరుకుతుందేమోనని భారతదేశం వచ్చాడు. ఆసేతుహిమాచల పర్యంతం పర్యటించాడు. ఆశ్రమాలు. గురుకులాలు. మఠాలు. పీఠాలు - అన్నిటినీ తిరిగేశాడు. ఋషులుని. గురువులుని. సన్యాసులుని. బైరాగుల్ని -

లెక్కలేనంతమందిని కలుసుకున్నాడు. తనకు సందేహనివృత్తి కాలేదు. దైవ సాక్షాత్కారం మొదలేలేదు.

ఒకరోజున కంచికామకోటి పీఠాధిపతి సన్నిధిని మోకరిల్లాడు. వారు బ్రంటన్ అభిలాషనీ, ఆక్రోశాన్నీ గ్రహించారు. "మీరు తిరువన్నామలైలోని శ్రీరమణభగవాన్‌ని దర్శించండి. మీ వాంఛ నెరవేరుతుంది" అన్నారు వారు.

బ్రంటన్ తిరువన్నామలై వచ్చాడు. భగవాన్ దర్శనం చేసుకున్నాడు. వారిని రోజులతరబడి ప్రశ్నించాడు. సందేహ నివృత్తి చేసుకున్నాడు.

ఒకనాడు భగవాన్ తదేకదీక్షతో బ్రంటన్ కళ్ళలోకి చూశారు. వారిశక్తి ప్రసారానికి అతని కళ్ళు మూసుకుపోయాయి. తనలో ఒక సంచలనం కలిగింది. ఒక మార్పు వచ్చింది. మనో వృత్తుల ఉద్వేగం అణిగింది. శాంతి ప్రవాహంలో కొట్టుకుపోయాడు. చివరకు ఎవరూ, ఏదీ మిగలకుండా అంతా తానుగా ఏకాత్మభావాన్ని చవి చూశాడు. కృతార్థుడయ్యాడు.

బ్రంటన్ "A Search in Secret India" (భారతావనిలో సత్యాన్వేషణ) అనే ఉద్గ్రంథం రచించాడు. అందులో భగవాన్ ప్రశాంత గాంభీర్యాన్ని చాలా గొప్పగా వర్ణించాడు.

* * *

చాడ్విక్ ఆంగ్లేయుడు. ఆజానుబాహుడు. మహాకాయుడు. కంచు కంఠంవాడు. అతని ఆకారమెంత గంభీరమో, హృదయమంత నవనీతం. నిరహంకారి. చాడ్విక్ రెండవప్రపంచ మహాయుద్ధంలో మేజర్‌గా పనిచేస్తూ మారణహోమం, రక్తపాతం చూశాడు. చాలా దుఃఖించాడు.

"చావుపుట్టుకలమధ్య యీ మూన్నాళ్ళ జీవితమేమిటి? ఈ బ్రతుక్కు అర్థమేమిటి?" - యిలా ఆలోచించడం మొదలు పెట్టాడు. మనిషి పూర్తిగా మారిపోయాడు. భోగాసక్తి విరక్తిగా మారింది. వైరాగ్యం కలిగింది. ఆత్మోన్నతికోసం ప్రయత్నించాడు. శాంతిభిక్ష కోసం ప్రపంచమంతా

గాలించాడు. దక్షిణ అమెరికాలో ఒక కొండమీద కూర్చుని ధ్యానంచేశాడు. తిరిగి తిరిగి భారతదేశం చేరి, తిరువన్నామలై వచ్చి భగవాన్ పాదపద్మాల సన్నిధిని కుదుటపడ్డాడు.

చాడ్విక్ భగవాన్ భక్తాగ్రగణ్యుడు. త్రికరణశుద్ధిగా భగవాన్‌కు శరణాగతి చెందాడు. "సాధూ అరుణాచల" అని పేరు మార్చుకుని ఆశ్రమంలోనే వుండిపోయాడు.

"చాడ్విక్ మనవాడే. కారణాంతరంచేత పశ్చిమ దేశంలో పుట్టాడు." అన్నారు భగవాన్.

* * *

ఆస్‌బోరన్ కూడా ఆంగ్లేయుడే. ఇతనుకూడా ద్వితీయ ప్రపంచ సంగ్రామంలో పత్రికా విలేఖరిగా పనిచేశాడు. జపాన్ వాళ్ళకు పట్టుబడి, ఆ తరవాత ఎప్పుడో విడుదలయ్యాడు.

ఆస్‌బోరన్‌కి జీవితగమ్యమేమిటో తెలుసుకోవాలని మొదటి నుంచీ ఆసక్తి. క్రైస్తవ, మహమ్మదీయ, సూఫీ, జైన, బౌద్ధ, హిందూమతాలని మధించి చూశాడు. చివరకు శ్రీరమణభగవాన్ చరణ కమలసన్నిధికి చేరాడు. వారి బోధామృతాన్ని గ్రోలాడు. వారినిక విడిచి పెట్టలేదు.

* * *

భగవాన్‌ను దర్శించి శాంతి ననుభవించిన పాశ్చాత్యులు యీ ముగ్గురేకాదు. వేనవేలు.

ఇక భగవాన్ మార్గాన్ని స్నేహితులద్వారా, పత్రికలద్వారా, రమణ సాహిత్యం ద్వారా తెలుసుకుని సంతుష్టులై భగవాన్ భక్తులైన వారు అసంఖ్యాకులు.

పాశ్చాత్యులమాట యిలా వుండగా, భారతీయులమాట వేరే చెప్పనక్కరలేదు.

పుణ్యం పండిన ప్రతివ్యక్తినీ ఆకర్షించారు భగవాన్. అనేక మంది వా సన్నిధానంలోనే వుండిపోయారు.

కొంతమంది భగవాన్ మీదా. వారి అహంమూలాన్వేషణ పద్ధతి మీదా పుస్తకాలు వ్రాశారు.

అలా రాసిన తెలుగువారిలో పూజ్యులు కావ్యకంఠ గణపతి మునీంద్రులూ మునగాల వెంకట్రామయ్యగారూ. కృష్ణభిక్షుగారూ. సూరి నాగమ్మగారూ చలంగారూ. గిద్దలూరి లక్ష్మీనరసింహంగారూ. జీ.వి. సుబ్బరామయ్యగారూ ముఖ్యులు.

ఇక. భగవాన్ దర్శనానికి నోచుకోక పోయినా. ఏ పూర్వజన్మల పుణ్యఫలంవల్లనో భగవాన్ భక్తులై ఆంధ్రదేశమంతటా రమణగోష్ఠుల జరుపుతున్న మహానుభావులు నేనెరుగున్నంతవరకు ముగ్గురున్నారు.

మొదటివారు:

కృష్ణాజిల్లా గుడివాడ వాస్తవ్యులు శ్రీ యం.ఆర్. నాగేశ్వరరావుగారు. భగవాన్ సశరీరులై యుండగా వారి దర్శనం చేసుకోకపోయినా మరి ఆభగవాన్ ఎలావీరిని తమ పాదపద్మములుకేసి తిప్పుకున్నారో నాకు తెలియదు. ఈ అదృష్టవంతుడు భగవాన్ సేవకు అంకితమయ్యారు.

"రమణవాణి" పక్ష పత్రికకు ప్రచురణకర్తగా. సంపాదకునిగా సుమారు 30 సంవత్సరాలు నుంచి అవిచ్ఛిన్నంగా రాస్తున్నారు.

భగవాన్ భక్తుడెక్కడున్నా వారిని కలుసుకొని భగవాన్ స్మృతులు సేకరించి ప్రచురిస్తున్నారు. అదెంతగానో ఆకట్టుకొంటున్నాయి. అనేక మంది రమణ భక్తులయ్యారు. అవుతున్నారు. అంతటితో వీరికి తృప్తికలగలేదు. వీరు మంచివక్త. భగవాన్ యొక్క బోధామృతాన్ని జనావళిచే గ్రోల చేస్తున్నారు.

మచిలీపట్నానికి చేరువలోనున్న తాళపాలెంలో సముద్రతీరాన శ్రీరమణసాగర ఆశ్రమాన్ని నెలకొల్పారు. ఇటువంటి ఆశ్రమాలను. కేంద్రాలనూ. మరెన్నో చోట్లనిర్మింపచేయాలని వీరి తపన. ముఖ్యంగా

రమణవాణి" లోని వ్యాసాలు చదువుతూఉంటే వొళ్ళుపులకరిస్తోంది. "రమణవాణి" నిజంగా రవ్వలరాణి.

రెండవవారు:

భూపతిరాజు వెంకటలక్ష్మీనరసింహరాజుగారు-ఇది వారి నిజనామధేయమే అయినా వెంకట్రామరాజుగారు అనే అంటారు. ఇదెలా సంభవించిందో వారికే తెలియదన్నారు.

సుక్షత్రియ కుటుంబంలో జన్మించిన వీరు భూస్వాములు. చూపులకు మనందరివలెనే ఒకరుగా ఉంటారుగాని ప్రత్యేకత ఏమీ కనపడదు. అయితే పరీక్షించి చూస్తేమాత్రం వీరి ముఖమండలంలో కాంతి తాండవిస్తోన్నట్టు గోచరమవుతుంది.

ఎన్ని జన్మల పుణ్యఫలమోగాని చిన్ననాటి నుండి దైవభక్తులు. నిర్మల చరిత్రులు. పెద్దచదువులు చదువుకోలేదుగాని మేధావి. ఎవరినిగాని చూడగానేవారి మనోగత భావాలను పసిగట్టగల ప్రవీణులు. స్నేహితులతోగాని మరెవరితోగాని టాకాఖానీ వెయ్యరు. దైవ సంబంధమైన విషయాలనే మాట్లాడతారు.

వీరికొకనాటిరాత్రి ఒక కల వచ్చింది. ఒక తేజస్వి వీరిని గట్టిగా కౌగలించుకొన్నారట. వీరు ఆ గాఢాలింగనంలో నుండి తప్పించుకోవడానికి నానా తంటాలు పడ్డారట.

తెల్లవారింది. లేచారుగాని స్వప్నములో దర్శనమిచ్చిన వారి ముఖపద్మాన్ని మరచిపోలేదు. రోజులుగడచినా మర్చిపోలేకపోయారు.

రావలసిన ఆ రోజు రానేవచ్చింది. ఒక పత్రికలో ఒకరి చిత్రపటాన్ని చూశారు. వెంటనే గుర్తించారు. ఆ చిత్రం తమకు స్వప్నంలో దర్శనమిచ్చిన వారిదేనని. ఎవరు వారు?

శ్రీరమణభగవాన్!

అంతే. ఒక పెద్ద మార్పు వచ్చింది. వారి భక్తులయ్యారు. వారికి శరణాగతి చెందారు. వారి సేవకు అంకితమయ్యారు. శ్రీభగవాన్‌కు సంబంధించిన అనేక గ్రంథాలు చదివారు. ఒక ప్రత్యేకత కనిపించింది. అదే శ్రీవారు బోధించిన అహం మూలాన్వేషణ.

తిరువన్నామలై వెళ్లారు - శ్రీరమణాశ్రమానికి. భగవాన్‌ను దర్శించే మహాభాగ్యము లేకపోయింది. అప్పటికే శ్రీవారు శరీరాన్ని విసర్జించారు. అయితే, సర్వవ్యాపి అయిన వారి కరుణా కిరణాలు వీరిమీద మహోజ్వలంగా ప్రసరించాయి. "ధన్యోస్మి" అనుకుంటూ గృహోన్ముఖులయ్యారు.

ఇంటివద్దనే సత్సంగం ప్రారంభమయింది. శ్రీరాజుగారు చెప్పేది మనసుకు పట్టింది. ఏదో పదిమందితో ప్రారంభమయిన సత్సంగం వందమందయ్యారు. అనతికాలంలోనే వందలమంది అయ్యారు. వారంతా ఒక నిర్ణయానికి వచ్చారు - రాజుగారి స్వగ్రామమైన జిన్నూరులోనే శ్రీరమణ కేంద్రాన్ని నిర్మించాలని భక్తులు మహోత్సాహముతో విరాళాలిచ్చారు. చూస్తూండగానే లక్షలు వెచ్చించబడిన కేంద్రం ప్రశాంత వాతావరణంలో ప్రకృతి సౌందర్యం నడుమ మనోహరంగా తయారయ్యింది. వెంకట్రామరాజుగారి ప్రసంగాలు జిన్నూరులోనేగాక చుట్టుప్రక్కల పల్లెల్లోనూ పట్టణాల్లోను కూడా జరిగాయి. జరుగుతున్నాయి.

వీరు మహావక్త! నిస్తరంగ వారాశివలె వేదికమీదకూర్చొని శాంతిగా ప్రసంగాన్ని ప్రారంభించి కొంతసేపటికి రత్నాకరుని ఉత్తుంగ తరంగములవలె మాట్లాడి శ్రోతలను పరవశులను చేస్తారు. ఇప్పుడు భక్తులు వారికి నీరాజనమిస్తున్నారు. బాణాసంచాతో, బ్యాండు మేళాలతో ఊరేగింపులు, పుష్పాభిషేకాలు, ఒకటేమిటి - బ్రహ్మరథం పడుతున్నారు. అయినా వీరిలో అహంకారము మచ్చుకు కూడా కానరాదు. అనేక పట్నాలనుంచి, సుదూరప్రాంతాల నుంచి ఆహ్వానాలందుతున్నాయి. ఆంధ్రదేశమంతటా పర్యటించి శ్రీభగవాన్ బోధను ప్రచారం చేస్తున్నారు.

వీరప్పుడు వెంకట్రామరాజుగారు కాదు. వెంకటలక్ష్మీ నరసింహరాజుగారు అంతకంటెకాదు. మరెవ్వరు?

శ్రీనాన్నగారు.

మూడవవారు:

అనంతపురం జిల్లా తాడిపత్రి వాస్తవ్యులు వి.వి.బ్రహ్మంగారు. బీదకుటుంబానికి చెందినవారు. చిన్నుద్యోగం. పెద్దకుటుంబం. అయినా భగవాన్ సేవకు అంకితమయిన భాగ్యశాలి.

వీరి ప్రసంగాలు నేను వినలేదుగాని చక్కగా మాట్లాడుతారని చెప్పారు. వీరు తాడిపత్రిలో "భగవాన్ శ్రీరమణమహర్షి ఆశ్రమం" స్థాపించారు. భగవాన్ బోధని ముఖ్యంగా రాయలసీమలో ప్రచారం చేస్తున్నారు. వీరు కూడా భగవాన్ శరీరధారులై ఉండగా వారిని దర్శించలేదు.

58

"భగవంతుడు సంకల్పమాత్రం చేతనే మానవాళికి జ్ఞానం ప్రసాదించవచ్చును కదా? తను పుట్టడమెందుకు? నానాబాధలూ పడడమెందుకు?" ఈ ప్రశ్నలు చాలామంది వేస్తారు.

బుద్ధ భగవాన్ శిష్యుడొకనాడు తన గురుదేవుని యిలా అడిగాడు:

ప్రభూ, చక్రవర్తికి జన్మించిన మీరు, రాజప్రాసాదాలలో భోగ భాగ్యలననుభవిస్తూండవలసిన మీరు, అంతఃపుర కాంతలతో కేళీవిలాసాల దేలుతూండవలసిన మీరు, బంగారు పల్లకిలో పయనిస్తూండ వలసిన మీరు, యిలా ఎండనక, కొండనక, వాననక, వరదనక, కాలినడకన రాళ్ళమీద, రప్పలమీద నడుస్తూ ఎందుకు కష్టపడతారు?"

బుద్ధభగవాన్ యిలా బదులు చెప్పారు.

"సోదరమానవులకు నేను చూసిన వెలుగును చూపించాలనీ, నేను సంపాదించిన జ్ఞానాన్ని పంచాలని"

అప్పుడు శిష్యుడిలా అన్నాడు:

"ప్రభూ, మీరు సాక్షాత్ పరమేశ్వరులని నాకు తెలుసును. కేవలం మాపైన కరుణచేతనే దేహధారియై విచ్చేశారని కూడా తెలుసు. అయితే, మీరిలా కష్టపడుతూండడం నేను చూడలేక పోతున్నాను. మీరు సంకల్పించి మానవులకందరకూ జ్ఞానం ప్రసాదించవచ్చును కదా?"

బుద్ధ భగవాన్ జవాబు చెప్పలేదు. మౌనం వహించి వూరుకున్నారు.

మరొకనాడు-

బుద్ధ భగవాన్ తన శిష్యునితో యిలా అన్నారు.

"నేనీ చెట్టునీడని విశ్రమిస్తాను. నువ్వు వూళ్ళోకి వెళ్ళి వాళ్ళేమి కోరుకుంటున్నారో తెలుసుకునిరా."

శిష్యుడలాగే వెళ్ళి, వచ్చి యిలా చెప్పాడు:

"ప్రభూ, కొంతమంది ఐశ్వర్యాన్నీ, కొంతమంది అధికారాన్నీ, కొంతమంది సంతానాన్ని, కొంతమంది కీర్తినీ, మరి కొంతమంది వీటన్నిటినీ కోరుకుంటున్నారు."

బుద్ధ భగవాన్ యిలా ప్రశ్నించారు:

"జ్ఞానాన్ని ఎంతమంది కోరుకుంటున్నారు?"

శిష్యుడు చెప్పాడు:

"జ్ఞానాన్ని కోరుకుంటున్నవారు నాకు కనపడలేదు ప్రభూ"

అప్పుడు బుద్ధ భగవాన్ యిలా అన్నారు:

నేను సంకల్పించి మానవాళికి జ్ఞానాన్ని ప్రసాదించాలని కదా నువ్వన్నది? ఎవరికీ అక్కరలేని జ్ఞానాన్ని నేనిస్తేమాత్రం పుచ్చుకునే వారెవరు"?

శిష్యుడికి సమాధానం దొరకలేదు.

"కోరికల నుండి విముక్తి కలిగిననాడే జ్ఞానం లభిస్తుంది. జ్ఞానానికి నిర్వచనం దివ్యశాంతి" అని కదా బుద్ధ భగవాన్ సందేశం!

* * *

శ్రీరమణ భగవాన్ సన్నిధి కొకనాడు ఒకామెవచ్చి "భగవాన్... నాకేకోరికలూ లేవు. మోక్షం కావాలనే ఒక్క కోరిక తప్ప. మీరు అనుగ్రహించి నా కోరిక తీర్చాలి" అన్నది.

భగవాన్ చిరునవ్వు నవ్వి "ఏ కోరికా లేకపోతే మిగిలేది మోక్షమే. నేను వేరే తీర్చడానికేముందీ?" అన్నారు.

నిజమే. ఏది బంధం? ఏది మోక్షం?

"మనయేవ మనుష్యాణాం కారణం బంధమోక్షయోః
బంధాయ విషయాసంగీ ముక్త్యై నిర్విషయం మనః"

(కోరికలతో నిండిన మనస్సే బంధం. ఏ కోరికా లేకపోవడమే మోక్షం.)

* * *

ఇనుప గొలుసులని తెంచుకుని బయటపడగలం. కాని, కోరికలనే బంధాలను తెంచుకుని బయటపడలేం. సద్గురు కరుణా కటాక్ష వీక్షణాలు మాత్రమే ఆ బంధాలని తెంచగలవు.

బంధవిముక్తిడిని కావాలనే ఆర్తి అతి ముఖ్యం. అటువంటి ఆర్తికలిగిననాడు గురువే మనలను వెతుక్కుంటూ వస్తాడు. మనమిచ్చే ధన కనక వస్తువాహనాలూ, చీనిచీనాంబరాలూ కాదు గురువుకు కావలసినవి. నిజమైన గురువు మనలో చూచేది నిరహంకారం, నిరాడంబరం.

గురూగోవింద్‌సింగ్ యమునా నదీతీరాన్ని ఒక రాతిబండమీద కూర్చునుండగా ఐశ్వర్యమదోన్మత్తుడై రఘునాధుడనే శిష్యుడు వచ్చి "మీకు

కానుకగా యీ వజ్రాల కంకణాలు తెచ్చాను" అని గురువుగారి కళ్ళముందు వాటిని తళుక్కున మెరిపించాడు. తన ఔదార్యానికి తనే పొంగిపోతూ గురువుగారు ఆ కంకణాలని తీసుకుని, ఒక కంకణాన్ని తన వేలు చుట్టూ తిప్పుతూ దాని తళతళలని చూసి మురిసిపోతున్నారు. (అలా మురిసిపోవాలనేకదా శిష్యుడు కోరుకున్నదీ!) ఇంతలో అది జారి క్రిందపడి ప్రక్క యమునలో పడ్డది.

ఒక్క అరుపు అరిచి శిష్యుడు యమునలో దూకాడు. వడిగా ప్రవహిస్తోంది యమున.

వెతికి వేసారి, వుత్తచేతులతోనే గట్టెక్కి, బిక్క మొహం పెట్టి గురువుగారితో "తెగవెతికాను. కనపడలేదు. ఎక్కడపడిందోగానీ"అన్నాడు శిష్యుడు.

"అదిగో, అక్కడ పడ్డది"అంటూ, అక్కడికి ఆ రెండో కంకణాన్ని గిరాటేశారు గురూ గోవిందసింగ్.

అవునుమరి సద్గురువుకు కావలసింది శరణాగతి. వజ్రాల కంకణాలు కావు.

* * *

ఒక సద్గురువు తన శిష్యులలో ఒకడిని ప్రబోధానికి పంపదలచి అతగాడినిలా ప్రశ్నించారు.

ప్రజలకు తత్వాన్ని బోధించడానికి గాను నిన్ను పంపదలచాను. ఒకవేళ మాటలు వాళ్ళ తలకెక్కక నిన్నుదూషిస్తే ఏంచేస్తావు"?

"కొట్టకుండా వదిలినందుకు సంతోషిస్తాను"

"ఖర్మంచాలక కొడితేనో?"

"ప్రాణాలతో విడిచిపెట్టినందుకు సంతోషిస్తాను"

"ప్రాణాలే తీసేస్తే?"

"ఈ పంజరం నుండి విడుదల చేసినందుకు సంతోషిస్తాను."

గురువుగారి ఆనందానికి మేరలేదు. ఆ శిష్యుడిని ప్రబోధానికి పంపారు. ఇటువంటి శిష్యులే గురువులై మానవులను తరింపచెయ్యగలరు.

* * *

నిజంగా అటువంటి మహాత్ములు బోధించనక్కరలేదు. వారి దర్శనభాగ్యమే చాలు. తరించడానికి.

ఒకప్పుడు నారదుడు విష్ణుమూర్తి నడిగాడు... "మహాత్ములను దర్శించడం వల్ల నిజంగా ఏదైనా ప్రయోజనముందా?" అని.

"భూమిమీద దండకారణ్యంలో యిప్పుడే ఒక పురుగుకి పిల్ల పుట్టింది. వెళ్ళి, దాని నడుగు. చెపుతుంది" అన్నాడు విష్ణుమూర్తి.

తనంతటి దేవఋషి ఒక పురుగు నడిగి సందేహ నివృత్తి చేసుకోవడమా అనుకున్నాడు నారదుడు. చిరాకుపడ్డాడు. అయినా, సకల లోకేశ్వరుడయిన విష్ణుమూర్తి చెప్పినపుడు అందులో అర్థం వుండక పోదని సమాధానపడి, భూలోకం చేరి ఆ పురుగుని చూసి తన ప్రశ్న నడిగాడు.

కాని, ఆ పురుగు నారదుడి ప్రశ్న వినగానే చచ్చివూరుకుంది.

నారదుడు కలవరపడి, వైకుంఠానికి వెళ్ళి జరిగిన సంగతి చెప్పాడు విష్ణుమూర్తికి.

"అయోధ్య వెళ్ళి యిప్పుడే పుట్టిన ఆవుదూడ నడుగు. చెపుతుంది" అన్నాడు విష్ణుమూర్తి.

నారదుడికిదంతా చిత్రంగా తోచింది. తాతగారు తననొక ఆట ఆడిస్తున్నారేమో ననుకున్నాడు. అయినా, అయోధ్య వెళ్ళి ఆ దూడని ప్రశ్నించాడు.

పాపం, ఆ దూడకూడ పురుగుమల్లేనే నారదుడి ప్రశ్న వినగానే ప్రాణాలు కోల్పోయింది.

నారదుడి కలవరం యీసారి రెట్టింపయింది. తాతగారి దగ్గరకు వెళ్ళి విషయం చెప్పాడు.

"అయితే, చోళదేశం వెళ్ళు. ఆ దేశపు రాజుకి యిప్పుడే ఒక కొడుకు పుట్టాడు. వాడి నడుగు" అన్నారు తాతగారు.

"తిప్పేవాడికి తిరిగేవాడు లోకువ అన్నట్టు, మీరిలా తిప్పుతూండడమేనా?" అని కొంచెం కసురుకున్నాడు నారదమునీంద్రుడు.

"ఇక నువ్వు తిరగనక్కరలేదు. ఈ ఒక్కసారి వెళ్ళు చాలు" అన్నాడా జగన్నాటక సూత్రధారి.

నారదుడు చోళదేశం వెళ్ళాడు. అందాలు చిందుతూన్న ఆ రాజ కుమారుడిని చూశాడు. తన ప్రశ్న వేసి యీ బాలుడిని కూడా చంపవలసి వస్తుందేమోనని కాసేపు తటపటాయించాడు. చివరికి అడిగేశాడు.

"ఓ రాజకుమారా, మహాత్ములను దర్శించడంవల్ల నిజంగా ఏమైనా ప్రయోజనముందా?"

ఆశ్చర్యం! ఈ ప్రశ్న విని ఆ రాజకుమారుడు చచ్చిపోలేదు. చిత్రంగా లేచా పసికందు. నారద మహర్షికి సాష్టాంగపడి యిలా అన్నాడు.

"మహాత్మా, నేను పురుగుగా పుట్టినపుడు వచ్చి యిదే ప్రశ్న వేశారు. వెంటనే క్షుద్రమైన ఆ జన్మను చాలించి అవుదూడగా పుట్టాను. అప్పుడు కూడా మీరు వచ్చి ప్రశ్నించడంతో ఆ పశుజన్మను కూడా చాలించి యిప్పుడీ రాజకుమారుడిగా జన్మించాను. ఈ సుకృతానికి కారణం మహాత్ములైన మీ దర్శనభాగ్యంకాక మరేమిటి? మీకు నా కృతజ్ఞత నెలా తెలుపుకోగలను!"

నారదుడి విస్మయానికి హద్దులు లేకపోయాయి.

ఇది కట్టుకథే కావచ్చు కాని, కథాంశంమాత్రం నిస్సారమైనది కాదు.

మహాత్ముల దర్శనంలోనే యింత మహత్తు వున్నపుడు, ఇక వారి సన్నిధి చేరినవారి, వారి దివ్యభాషణలు విన్నవారి, వారి సేవ చేసినవారి అదృష్టం వే

చెప్పాలా!

* * * *

స్వవిషయం.

ఎప్పుడో ఒక మనిషి "Philosophy is the last resort of a fool" (వెర్రివెంగళప్పు వేదాంతాన్ని పట్టుకు వేళ్ళాడుతాడు) అన్నాడు. అప్పుడు నాకు చిన్నతనం. ఆ మహానీయుడు పలికిన సూక్తి హృదయంలో బాగా నాటుకుంది. అందుచేత ఎవరేనా దేవుడి మాటెత్తితే చాలు. వాడినొక చవటకింద జమకట్టేవాడిని.

జీవితంలో కొన్ని ఢక్కా మొక్కీలు తిన్న తరవాత సందిగ్ధావస్థలో పడ్డాను కలడు కలడనువాడు కలడో లేడో" అని.

ఒక సుదినం వచ్చింది. మహాత్ముడు, కాదు, కేవలం పరమాత్మునే అయిన శ్రీరమణ భగవాన్ దర్శనం లభించింది. వారి నిర్హేతుక జాయమాన కటాక్షవీక్షణాలు నామీద మెరిశాయి. వారు నన్నిన్నో ఆపదలనుండి కాపాడారు. అదృశ్యంగా వారి అభయహస్తం నా శిరస్సు మీద వుండడం నా ప్రత్యక్షానుభవం. ఇప్పుడు "కలడు కలడనువాడు. కలడు. కలడు. కలడు. ముమ్మాటికీకలడం" టున్నాను.

59

భగవద్గీతలో ఏడువందల శ్లోకాలున్నాయి. ఏ శ్లోకానికాశ్లోకమే ఒక మణిపూస.

అయినా, వాటిలో అతిముఖ్యమైన శ్లోకాలేవో సెలవియ్యమని కొందరు భక్తులు భగవాన్‌ని ప్రార్థించారు.

భగవాన్ గీతాసారాన్ని వెల్లడించే 42 శ్లోకాలని ఎంచుకుని, వాటిన్నీ క్రమమేర్పరచి భక్తుల కందచేశారు.

ఆ శ్లోకాల తాత్పర్యమిది:

1. సంజయుడిట్లనెను: ధృతరాష్ట్రమహారాజా, వినుము. ఆ ప్రకారముగ కన్నుల నీరు నింపుకుని జాలితో దుఃఖించుచున్న అర్జునుని చూచి శ్రీకృష్ణుడీ విధమున చెప్పదొడగెను. అధ్యాయం 2, శ్లోకం 1

2. భగవంతుడిట్లనెను: కుంతీకుమారా, ఈ శరీరమునకు క్షేత్రమని పేరు. ఈ క్షేత్రమును ఎవడు తెలుసుకొనుచున్నాడో వాడే క్షేత్రజ్ఞుడని అనుభవజ్ఞులు చెప్పుదురు. 13,1

3. క్షేత్రములనబడు యీ శరీరములన్నిటియందును క్షేత్రజ్ఞుడుగ నుండువాడను నేనే సుమా! అర్జునా, క్షేత్రక్షేత్రజ్ఞులను తెలుసుకొనెడి జ్ఞానమే నిజమైన జ్ఞానమని నా అభిప్రాయము. 13,2

4. గుడాకేశా, సమస్తప్రాణులయందుండెడి ఆత్మను నేను. సర్వభూతముల యొక్క ఆది మధ్యాంతములు నేనే. 10,20

5. పుట్టినవాడు చచ్చుట నిజము. చచ్చినవానికి జన్మము సిద్ధము. తప్పింపరాని విషయములందు తపించి లాభమేమి? 2,27

6. ఆత్మ ఒకప్పుడు పుట్టదు. ఒకప్పుడు చావదు. ఒకప్పుడుండి మరొకప్పుడు లేకపోవుటలేదు. ఒకప్పుడు లేక మరొకప్పుడు కలుగుటయూలేదు. అది జన్మరహితము. ఎప్పుడునూ ఉండునది. అనాదియైనది. చచ్చెడి శరీరములలో నుండియూ అది చావదు. 2,20

7. ఈ ఆత్మ ఖండింపబడదు. కాలదు, నానదు, ఎండదు. అదినిత్యము సర్వవ్యాపకము, స్థిరము, సనాతనము అయివున్నది. 2,24

8. ఈ సమస్తవిశ్వమునూ నిండి నిబిడీకృతముగ వ్యాపించియున్న ఆత్మ నశించిపోవునది కాదు. ఆ ఆత్మను నశింపచేయుట ఎవరికినీ సాధ్యముకాదు. 2,17

9. లేని అసత్పదార్థమునకు ఉనికిలేదు. ఉన్న సద్వస్తువునకు లేమి లేదు. ఈ రెండింటి యొక్క చివరి నిష్కర్షను తత్త్వవేత్తలు దర్శించారు. 2,16

10. భారతా, ఒకే సూర్యుడు ఈ సమస్తలోకమునూ ఎట్లు వెలిగించుచున్నాడో, అట్లే క్షేత్రజ్ఞుడగు ఆత్మదేవుడు మొత్తము శరీరమును ప్రకాశింపచేయుచున్నాడు. 13,33

11. దేనిని పొంది తిరిగిరావలసిన పనిలేదో, అదియే నా పరంధామము. స్వయం ప్రకాశమగు దానిని సూర్యచంద్రాగ్నుల ప్రకాశములు ప్రకాశింపచేయజాలవు. 15,6

12. దానినే అవ్యక్తమనియు, అక్షరమనియు, పరమగతి అనియు చెప్పుదురు. అది నా నిలయము. దానిని పొందినవారు తిరిగి లోకమునకు రారు. 8,21

13. అభిమాన మోహములు లేనివారు, ఆసక్తిదోషమును జయించినవారు, ఆధ్యాత్మికజ్ఞానమున మునిగినవారు, కోరికలను వదలినవారు, సుఖదుఃఖరూపమగు ద్వంద్వములను దాటినవారు యీ అవ్యయపదమును పొందుచున్నారు. 15,5

14. శాస్త్రపద్ధతిని అతిక్రమించి మనస్సువచ్చినట్లు ప్రవర్తించువానికి సిద్ధియూలేదు, సుఖమూలేదు, పరమగతియూలేదు. 16,23

15. నశించిపోయెడి సమస్త భూతములలో తాను నశింపక సమముగ నుండెడి పరమేశ్వరుని చూచినవాడెవడో వాడే నిజముగ చూపులు గలవాడు. 13,27

16. అర్జునా, కేవలమొక అనన్యభక్తితో మాత్రమే వాస్తవముగ నన్ను తెలుసుకొనుటకును, నన్ను చూచుటకును, నాయందు ప్రవేశించుటకును వీలగును. 11,54

17. భారతా, వానివాని ప్రకృతికి తగినట్లు ప్రతివానికిని శ్రద్ధ పుట్టును. శ్రద్ధ లేనివాడు లేడు. అయిననూ వాని శ్రద్ధ యెట్టిదో వాడునూ అట్టివాడే అయివుండును. 17,3

18. శ్రద్ధావంతుడును, తత్పరుడును, జితేంద్రియుడును నగువానికి జ్ఞానము లభించును. జ్ఞానమునుపొంది వెనువెంటనే వాడుముక్తిని బడయుచున్నాడు. 4, 39.

19. ఎడతెరిపిలేక ప్రేమపూర్వకముగ నన్ను సేవించెడువారికి తత్వజ్ఞానమును ప్రసాదింతును. దాని సహాయమున వారు నన్ను చేరగలరు. 10, 10

20. వారిని కనికరించి వారి హృదయములలోనిలిచి ప్రకాశవంతమైన జ్ఞానదీపముతో వారియొక్క అజ్ఞానాంధాకారమును పోద్రోలు చున్నాను. 10, 11

21. ఆత్మజ్ఞానము వల్ల అజ్ఞానమును నిర్మూలించుకొనినవాడు బట్టబయలుగ పరమాత్మను దర్శించుచున్నాడు. 5, 16.

22. విషయములకంటె ఇంద్రియములు హెచ్చు. ఇంద్రియముల కంటె మనస్సు గొప్ప. మనస్సుకంటె బుద్ధిమిన్న. బుద్ధికంటె ఆత్మ శ్రేష్ఠమనుచని చెప్పుదురు. 3, 42

23. అర్జునా, ఈ విధమైన బుద్ధికంటె శ్రేష్టమయియుండు ఆత్మను తెలుసుకొని తన్ను తాను సుస్థిర మొనర్చుకుని దుర్జయశత్రువగు కామమును గెలువుము. 3, 43

24. మంటలుమండెడు అగ్ని కట్టెలను బూడిద చేయునట్లు, అర్జునా జ్ఞానాగ్ని కర్మములన్నిటినీ భస్మీపటలము చేయగలదు. 4, 37.

25. ఎవని కార్యారంభములందు కామసంకల్పములుండవో, ఎవడు తన జ్ఞానాగ్నితో సకల కర్మములనూ దహించినాడో, అట్టి వానిని పండితుడని పెద్దలు చెప్పుదురు. 4, 19

26. కామక్రోధములను వదిలి చిత్తమును జయించిన ఆత్మజ్ఞానులగు పెద్దలకు బ్రహ్మనిర్వాణము ఎల్లెడల వెల్లివిరిసియున్నది. 5, 28

27. ధైర్యయుక్తమగు బుద్ధిచేత విషయములను మెల్లమెల్లన అటకాయించి మనస్సును ఆత్మయందు నెలకొల్పి యోగి నిశ్చింతుడు కావలెను. 6, 25.

28. మనసు ఎప్పుడెప్పుడు చలించిపోవుచుండునో అప్పుడప్పుడే

దానిని నిగ్రహించుచూ ఆత్మాయత్తము చేయుటకై యోగి యత్నించవలెను. 6, 26.

29. ఇంద్రియ మనోబుద్ధులను నిగ్రహించి, ఇచ్ఛా భయ క్రోధములను విడనాడి మోక్షదీక్ష మౌనిపుంగవునికి ముక్తి నిత్యసన్నిహితమై యున్నది. 5, 28

30. యోగయుక్త చిత్తముకలవాడై ఎల్లెడల సమదృష్టికల యోగి తన్ను అన్ని భూతములయందును, తనయందన్ని భూతములనూ వీక్షించుచున్నాడు. 6, 29.

31. విధివిరామములేక అనన్యచింతనతో నన్ను సేవించెడి జనుల యొక్క యోగక్షేమమును నేనే పూని నిర్వహించుచుందును. 9, 22.

32. వారిలో జ్ఞాని సర్వశ్రేష్టుడు. అతడు నన్నెడబాయడు. అతని భక్తికి ఎడతెరిపిలేదు. అతడు నాకు పరమప్రియుడు. అతనికి నేను ప్రాణప్రియుడను. 7, 17.

33. అనంతకోటి జన్మలలో పరిపక్వుడైన జ్ఞాని "ఈ సమస్తమునూ వాసుదేవుడే" అను అఖండానుభవముతో నన్ను చెందుచున్నాడు. అట్టి మహనీయుడు నిండా అరుదు. 7, 19.

34. అర్జునా, మనస్సునందలి కోరికలన్నిటినీ తీరావదిలి, తనలోతాను తన్మయమై యుండువానిని స్థితప్రజ్ఞుడందురు. 2, 55.

35. అన్ని కోరికలనూ వదలి ఆశయూ, మమకారమూ, అహంకారమూ లేనివాడై విలసిల్లు పురుషుడు ముక్తిని బడయగలుగు చున్నాడు. 2, 71.

36. ఎవనివలన లోకమునకు జడుపులేదో, ఎవడు లోకమునకు జడియడో, హర్ష, కోప, భయ, సంభ్రమము లెవ్వనిచెంత చేరవో, అట్టివాడే నాకు ప్రియభక్తుడు. 12, 15.

37. మానావమానములయందు, శత్రుమిత్రులయందు ఎవడు సమానుడో ఎవడు సర్వసంగపరిత్యాగియో, అట్టివాడే గుణాతీతుడు. 14, 25.

38. ఆత్మారాముడు, ఆత్మతృప్తుడు, ఆత్మసంతోషియగు మానవునికి కర్తవ్యకర్మ మెద్దియూలేదు. 3, 17.

39. కర్మమును చేయుటలో, మానుటలో అతనికెట్టి స్వార్థలాభమునూ లేదు.అతడు దేనిపైననూ ఆధారపడియుండడు. 3, 18.

40. లభించినదానితో తృప్తివహించువాడునూ, సుఖదుఃఖాది ద్వంద్వములను దాటినవాడునూ, మాత్సర్యము లేనివాడునూ, జయాపజయములందు సమానుడునూ అగువాడు కర్మ చేసిననూ బంధమునకు చిక్కడు. 4, 22.

41. అర్జునా, సంసారచక్రమున తగుల్కొనియున్న యీ చరాచర భూతములను తన మాయా శక్తిచే ఆడించుచూ పరమేశ్వరుడు అందరి హృదయములందూ నెలకొనియున్నాడు. 18, 61.

42. భారతా, అన్నివిధముల ఆ యీశ్వరుడినె శరణు పొందుము. వారి అనుగ్రహమున దివ్యశాంతిని, శాశ్వత స్థానమును బడయగలవు. 18, 62.

(శ్రీరామకృష్ణానందస్వామి గీతా భాష్యమునుండి యధాతథంగా...)

* * *

60

దుర్భరమైన దరిద్రాన్ని అనుభవిస్తూన్నవాడినీ, కాటికి కాళ్ళుచాచుకు కూర్చున్న అగర్భ శ్రీమంతుడినీ కూడా వదిలిపెట్టనిది ఒకటుంది - ఆశ.

"అంగంగళితం పలితంముండం
దశనవిహీనం జాతంతుండం
వృద్ధోయాతి గృహీత్వాదండం
తదపి నముంచత్యాశాపిండం" -శంకర భగవత్పాదులవారు

(శరీరం ముడుతలు పడిపోతుంది. జుట్టు ముగ్గు బుట్టయి పోతుంది. పళ్ళూడిపోతాయి. ముసలి తొక్కయి కర్ర చేతపుచ్చుకు నడుస్తాడు. అయినా వాడిని ఆశాపిశాచం వదిలిపెట్టడం లేదు.)

ఒక సర్కస్ కంపెనీ. అందులో వొంపుల సొంపుల వయ్యారి భామ ఒకామె నేలకు యిరవై అడుగుల యెత్తున కట్టిన తీగమీద నడుస్తుంది. అదే సమయంలో సర్కస్ బఫూన్ వస్తాడు. వచ్చి"ఏయ్ పిల్లా, సరిగ్గా నడిచావా సరేసరి. కిందికి పడ్డావా, చూసుకో - నిన్నీ గాడిదకిచ్చి పెళ్ళి చేస్తాను" అంటాడు. అక్కడే వున్న ఒక గాడిదను చూపిస్తూ.

ఒకనాడు సర్కస్ వాళ్ళు మకాం మారుస్తూ ఒక వూరునుంచి మరొకవూరు పోతున్నారు సామగ్రినంతటినీ స్వంతలారీలలోనేగాక, తమ ప్రదర్శనలలో పనిచేసే ఏనుగుల మీదా, ఒంటెల మీద, గుర్రాల మీదా, గాడిదలమీదా వేసి.

కొంతదూరం పోయేసరిగి గాలివాన మొదలుపెట్టింది. అది బాగా విజృంభించగా జంతువులు చెల్లాచెదరయిపోయాయి. వాటిలో రెండు గాడిదలొక పచ్చికబయలు మీదకు చేరుకున్నాయి.

కాసేపటికి గాలివాన ఉధృతం తగ్గింది. అప్పుడొక గాడిద "మనం యిక ఆ సర్కస్‌వాళ్ళకు కనపడకుండా యిక్కడే వుండిపోదాం. హాయిగా యీ పచ్చికన మేస్తూ, నడుములు విరగేటట్టు ఆ బరువుని ఎన్నాళ్ళు మొయ్యగలం?" అంది.

"కావలిస్తే నువ్వుండిపో. నేను మాత్రం పోకమానను. నువ్వు వినలేదు. తీగమీద నడిచే అమ్మాయి కిందకి పడిపోతే నాకిచ్చి పెళ్ళి చేస్తారట. ఒకనాడు కాకపోతే ఒకనాడయినా పడకపోతుందా. నేనప్పుడు ఆ సుందరిని పెళ్ళాడకపోతానా!" అంది ఆ రెండో గాడిద.

అలా ఏడిపిస్తుంది ఆశ.

* * *

ఆశలూ, అడియాశలూ మాటటుంచి బాధలు మాటేమిటి?

ఈ భూమిమీద పుట్టిన తరవాత నిరుపేదకే కాదు. రాజాధిరాజుకు కూడా బాధలు తప్పవు.

"జన్మమృత్యుజరాదుఃఖదోషానుదర్శనం" అన్నది గీత - ప్రపంచాన్ని పట్టుకుని.

"జన్మదుఃఖం జరాదుఃఖం జాయాదుఃఖం పునః పునః

సంసారసాగరం దుఃఖం తస్మాత్ జాగ్రత జాగ్రత" అన్నాడు - ప్రపంచాన్ని కాచి వడబోసిన ఒక ధీరుడు.

ప్రపంచం యిటువంటి దుఃఖాలయం అయినపుడు యిక్కడ పుట్టవలసిన అగత్యం ఏమొచ్చింది?

"కర్మ" అన్నారు వేదాంతి.

"పుట్టిన తరవాతకదా కర్మ చెయ్యడం?"

నిజమే. దీనికి సమాధానం లేదు.

చెట్టుముందా, విత్తుముందా?

ఎవరు చెప్పగలరు?

త్రేతాయుగంలో జనకమహారాజు ఒకరోజున వేదాంతుల సభనేర్పాటు చేశాడు.

బంగారం మువ్వలూ, పట్టీలు వగైరాలతో అలంకరించి వెయ్యి గోవుల నక్కడొకచోట వుంచాడు.

"మీలో గొప్పవారెవరో తేల్చుకోండి. ఆ గోవులను వారికి బహుకరిస్తాను" - అన్నాడు.

సభ వేదాంతులతో, విద్వజ్జులతో, పండిత ప్రకాండులతో, మహర్షులతో శోభిల్లుతోంది.

యాజ్ఞవల్క్యమహర్షి జనకునితో "మహారాజా, యీ సభ నలంకరించిన అందరిలో నేనే గొప్పవాడిని. నాకా గోవులను బహుకరించండి" అన్నారు.

"మమ్మలిని గెలిచి మరీ అడుగు" అన్నారు కొంతమంది ను. "సరే" నన్నారు యాజ్ఞవల్క్య మహర్షి.

వేదాంతచర్చ ప్రారంభమయింది. ఎందరో. ఎన్నో ప్రశ్నలు వేశారు. అన్నిటికీ సరియైన సమాధానాలు చెప్పారు మహర్షి. అందరూ వారి ఆధిక్యాన్ని ఒప్పుకుని కూర్చున్నారు. అప్పుడు గార్గి అనే తపస్విని లేచి కొన్ని జటిల ప్రశ్నలడిగింది. వాటికి కూడా సమాధానాలు చెప్పారు.

"జన్మముందా. కర్మముందా?" ఇదీ గార్గి చివరి ప్రశ్న.

"అది నువ్వడక్కూడదు. నేను చెప్పకూడదు" అన్నారు మహర్షి.

"అడుగుతున్నాను. నువ్వు చెప్పితీరాలి" అన్నది తపస్విని.

"మరొకమారు అడిగావంటే నీ తల వెయ్యి చెక్కలవుతుంది. జాగ్రత్త" అని గర్జించారు మహర్షి.

గార్గికి మరి అడగడానికేమీ లేవు. కూర్చుంది.

యాజ్ఞవల్క్యమహర్షి ఆ వెయ్యి గోవులనూ తోలుకు పోయారు.

ఇది బృహదారణ్యకోపనిషత్‌లోని గాథ.

"జన్మముందా? కర్మముందా?" అనే ప్రశ్న నెందుకు వెయ్యకూడదూ?

దానికి సమాధానం లేకనా? ఆ రహస్యాన్ని పరమాత్మ తన దగ్గరే వుంచేసుకున్నందుకా?

తెలియదు. ఎవరికీ తెలియదు.

అమెరికాలో వివిధ మతసమ్మేళనం జరిగినపుడు స్వామీ వివేకానంద-

"ఈ జనన మరణ చక్రంలో ఎప్పుడు చిక్కుకున్నామో. ఎందుకు చిక్కుకున్నామో. ఎలా చిక్కుకున్నామో మా హిందూమతం చెప్పలేదుగాని. యీ చక్రంనుంచి తప్పుకోవడమెలాగో చెప్పింది."

అని తేటతెల్లంగా తెలియచేశాడు.

వివేకానందుడు చెప్పినదే బాగుంది. సమాధానంలేని ప్రశ్నను పట్టుకుని

వేళ్లాడ్డం అవివేకం. ఈ చావుపుట్టుకలనుంచి తప్పుకోవచ్చని చెప్పాడుగా ఆయన! అది చాలదూ?

అయితే, ఎలా తప్పుకోవడం?

తప్పుకోవడానికి చాలా మార్గాలున్నాయి.

వివిధ మార్గాలను చెపుతూ వివిధ మతాలు ఉత్పన్నమయ్యాయి.

మార్గాలు వేరైనా గమ్యం ఒకటే.

రేవులు వేరైనా తటాకమొకటే. ఏ రేవులోంచి తీసుకున్నా ఆ నీళ్ళే.

''అహం బ్రహ్మాస్మి'' అంటోంది వేదమాత.

''I am that I am'' అంటోంది బైబిల్.

''అనల్‌హక్'' (I am the Truth) అంటోంది ఖురాన్.

తేడా ఏముంది? వివాదానికి తావేముందీ?

''మతములన్నియు మాసిపోవును.

జ్ఞాన మొక్కటె నిలిచి వెలుగును -గురజాడ.

మతాలు పేరిట కొట్టుకుచస్తాంగాని. మతాలు చెప్పినట్టు జీవించం - అనగా నడుచుకోం. ఎటువంటి దుర్గతి!

అందుకే, మతసమన్వయం నిరూపించడానికే. గీత. బైబిల్. ఖురాన్ - మూడింటినీ పారాయణ చేసేవారు మహాత్మాగాంధీ. తమ ప్రార్థన సమావేశాలలో.

''ఏకమేవాద్వితీయం ఏకంసత్. విప్రాః బహుధావదంతి - ఏకంసంతం. బహుధాకల్పయంతి''

(ఉన్నది ఒకటే. రెండోది లహూ. సత్పదార్థం ఒకటే. దానినే విబుధులు వివిధ విధాల చెప్పారు. గమ్యం ఒకటే. మార్గాలు అనేకం)

''ఉన్నది ఒకటే. రెండోది లేదు''

ఏమిటది?

ఆత్మ

''సత్పదార్థం ఒకటే. దానినే విబుధలు వివిధ విధాల చెప్పారు''

ఏమిటది?

ఆత్మ

''గమ్యం ఒకటే. మార్గాలు అనేకం''

ఏమిటది? ఏయే మార్గాలు?

ఆత్మ, నిష్కామకర్మ, భక్తి, విచారణ మొదలైన మార్గాలు.

ఆత్మ నెందుకు చేరాలి?

చావు పుట్టుకల యాతన నుంచీ, పుట్టిన తరువాత చచ్చేవరకూ పడే కష్టాల నుంచీ, తాపత్రయాలనుంచీ తప్పుకుని సచ్చిదానందాన్నీ, దివ్యశాంతినీ అనంతకాలం అనుభవించేందుకు.

''ఆత్మజ్ఞానవిమూఢాః తేపచ్యంతే నరకనిగూఢాః''-

అన్నారు శంకారాచార్యులవారు.

ఆచార్యులూ, గురువులూ, ప్రవక్తలూ వచ్చి ఏం ఒరిగించారు?

కృష్ణుడు ''పరిత్రాణాయ సాధూనాం వినాశాయచ దుష్కృతాం'' అంటూ వచ్చి, దుష్టులూ శిష్టులూ - అందరూ కొట్టుకు చచ్చేటట్టు చేశాడు. ఇంకేం చేశాడు?

గీతను ప్రసాదించాడు. దాని సారం గ్రహించి తరతరాలుగా మానవులు తరించేందుకు.

అయితే కృష్ణుడు తరవాత బుద్ధుడూ, ఆ తరవాత శంకరాచార్యుడూ, రామానుజాచార్యుడూ, మధ్వాచార్యుడూ - ఇప్పుడు సాయిబాబా, సత్యసాయిబాబా, మోహర్‌బాబా, శ్రీరామకృష్ణ పరమహంసా, శ్రీఅరబిందో, శ్రీరమణభగవాన్ వగైరాలు అవతరించవలసిన అవసరమేమొచ్చింది?

హల్వా, కాజా, బర్ఫీ, బాదుషా, జాంగ్రీ, గులాబ్‌జామ్, రసగుల్లా వగైరాలన్నీ

తియ్యగానే వుంటాయి. అయితేనేం? ఒక్కొక్కరికి ఒక్కొక్కటి ఎక్కువ నమ్మకం మిగతావాటికంటె.

అలాగే. చెప్పినదొకటే అయినా వేర్వేరు ఆచార్యులు వేర్వేరు విధాలుగా చెప్పారు. ఎవరికి నచ్చిన పద్ధతి వారు అవలంభిస్తారు.

ఆంజనేయస్వామి శ్రీరామచంద్రునితో యిలా అన్నాడు:

"దేహాబుధ్యాతు దాసోస్మి
జీవబుధ్యా త్వదంశకః
ఆత్మ బుధ్యా త్వమేవాహం"

మూడూ యాదార్థమే కాదనలేం.

"దేహాబుధ్యాతు దాసోస్మి"

ఇది ద్వైతం. మధ్వాచార్యులవారి బోధ.

"జీవబుధ్యా త్వదంశకః"

ఇది విశిష్టాద్వైతం. రామానుజాచార్యులవారి బోధ.

"ఆత్మ బుధ్యా త్వమేవాహం"

ఇది అద్వైతం. శంకరాచార్యులవారి బోధ.

ఏ పద్ధతి నవలంభించినా తరించవచ్చు.

"తరించనక్కరలేదు. ఇక్కడంతా బాగానే వుంది. చాలా సుఖంగానే వుంది" అంటారా?

ఎన్నాళ్ళీ సుఖం? వృద్ధాప్యం తప్పుతుందా? రోగం తప్పుతుందా? చావు తప్పుతుందా? ఎవరికి తప్పింది? జాతస్య మరణం ధృవం"....

"అమర జ్ఞానాన్ని వేణువులోంచి జగన్మోహన గానంగా వినిపించిన శ్రీకృష్ణుడు...

శాంతమయ దరహాసంతో దుఃఖాన్ని ఆర్పిన బుద్ధుడు...

తన స్వంతరక్తంతో ప్రజల పాపాన్ని పరిహారం చేస్తానని బతిమాలి దిగివచ్చిన జీసస్...

తల సరికి హృదయం లోనికి తొంగిచూచిన మహమద్...

వాళ్ళందరినాడు...

మతాలలో, కలహాలలో, కవిత్వాలలో, గొప్పతనాలలో వుత్తపేర్లు"

"అహింసాస్త్రమిత సుహృత్తులో ద్వేషాన్నార్పచూచిన గాంధి (మహాత్మాగాంధి)...

అమృతగానంతో దుర్భేద్య హృదయకవాటాన్ని తట్టిన రవి (టాగూర్)...

మౌనంతో జ్ఞానాన్ని పంచిన సాక్షాత్ దక్షిణామూర్తి రమణ (శ్రీరమణ భగవాన్)...

వొచ్చిపోయిన
జాడన్నా కనుపించదీనాడు లోకంలో' -చలం.

"పగలు రాత్రియు తలుపులై, వచ్చి పోవు
బాటసారుల బసలకు వసతియునయి
చిత్రమగులోక మొక పెద్దసత్రమునుమీ;
గడియకాలము యిచటను గద్దె యెక్కి
డాబునరి ఏలినట్టి నవాబులెల్ల
రాలిపోయిరి నామరూపాలులేక' -ఉమర్‌ఖయ్యాం.

(తెలుగు: ముద్దుకృష్ణ)

నిజమే. ఈ ప్రపంచంలో అంతా సవ్యంగా నడిచిపోతూన్నా. అది మూ...న్నాళ్ళ ముచ్చటే.

పూర్తిగా నూరేళ్ళు, కాదు. వెయ్యేళ్ళు బ్రతికినా, అది అనంత కాలంలో లిప్తమాత్రంకూడా కాలేదు.

దేవేంద్రభోగాలతో బ్రతికినా, అవి ఆత్మానందానికి సరికావు.

అందుచేత అమరత్వానికి, ఆత్మానందానికి ప్రయత్నించడం అత్యవసరం.

ఇది మానవజన్మలో మాత్రమే సాధ్యం.

అయితే, ఆ అమరత్వాన్ని, ఆ ఆత్మానందాన్ని పొందడానికి ఏదైనా సులభమార్గం చూపారా శ్రీరమణభగవాన్?

చూపారు. విశిష్టమైన మార్గం. సూటియైన మార్గం.

ఇది చూపడానికే రమణావతారం.

61

మురుగనార్ తమిళంలో మహాకవి. గొప్పపండితుడు. అద్వైతాభిమాని. అనుభవజ్ఞాని.

ఆయన శ్రీరమణభగవాన్ భక్తులలో అగ్రశ్రేణికి చెందినవాడు. భగవాన్‌ని స్తుతిస్తూ, వారి ప్రబోధాన్ని ప్రకటిస్తూ అనేక పుస్తకాలు రాశాడు.

దారుకావనంలో మునిపుంగవులు కర్మకాండలో (అనగా యజ్ఞయాగాదులలో) మునిగితేలుతూండడం చూశాడు పరమ శివుడు. ఇది వారికి శ్రేయోదాయకం కాదనీ, దీనివలన వారికి కామ క్రోధాదులు హరించవనీ, ఆత్మజ్ఞానం కలుగదనీ తలచి, వారిని ఆత్మనిష్ఠలో నెల కొనేటట్టు చెయ్యాలని నిశ్చయించుకున్నాడు.

ఒకనాడు తనూ, విష్ణుమూర్తి బయలుదేరారు అక్కడికి ఆదారుకావనానికి - తను శతకోటిమన్మధాకారంతోనూ, విష్ణుమూర్తి రతీ దేవిని తలదన్నే తరుణీ మణీరూపంతోనూ. అక్కడకు చేరగానే వారిని మునులూ, మునిపత్నులూ చూశారు. వారికి వెంటనే కామోద్రేకం కలిగింది. ఉచితానుచితజ్ఞానం నశించింది. మతి చలించింది. కళ్లు మూసుకుపోయాయి.

మునులు విష్ణుమూర్తి వెనకా, మునిపత్నులు శివుని వెనకా పడ్డారు. వీళ్ళెన్ని తంటాలు పడినా ఆ మాయావులు చిక్కలేదు. ఇది చాలా చిత్రంగా తోచింది

మునిశ్రేష్ఠులకి. తమదివ్య దృష్టితో అసలు రహస్యాన్ని కనిపెట్టారు. తమకి, తమ భార్యారత్నాలకి కామం యింకా నశించనందుకు సిగ్గుపడవలసిందిపోయి, తమ పతివ్రతా శిరోమణులనే ఆకర్షించాలని చూస్తాడా అని శివుడిమీద ఆగ్రహించారు. తమ తపోబలంతో కృత్య అనే పెనుభూతాన్ని సృష్టించి శివునిమీదికి ప్రయోగించారు. భూతనాధుడు దాన్ని క్షణమాత్రంలో హతమార్చి, కోపోద్రిక్తుడై ప్రళయతాండవం ప్రారంభించాడు. దానితో లోకాలు దద్దరిల్లి పోయాయి. దేవ దానవ కిన్నర కింపురుష యక్ష గంధర్వులు భయభ్రాంతులై పరమశివుని వేడుకున్నారు. ఉపసంహరించమని. భోలాశంకరుడు ప్రసన్నుడై తన ప్రళయతాండవాన్ని చాలించాడు. అప్పుడు మునులూ, మునిపత్నులూ ఆ పరమశివుని పాదాలపైపడి తమ అపచారాన్ని, అజ్ఞానాన్ని క్షమించి, జ్ఞానభిక్ష పెట్టమని ప్రార్థించారు. వారి వేడికోలు నంగీకరించి పరమేశ్వరుడు వారికి విధంగా జ్ఞానాన్ని ఉపదేశించాడు.

మురుగనారు తన "దారుకావనలీల" గ్రంథాన్ని యింత వరకు రచించి "శివుడు ఏమి ఉపదేశించివుంటాడా" అని యోచించడం మొదలు పెట్టాడు. అతనికి మెరుపులా ఒక ఆలోచన తట్టింది. "భగవాన్ సాక్షాత్ శివకుమారుడు కదా! తండ్రియైన శివునికే తత్వ ముపదేశించిన కుమారస్వామి అవతారంకదా! వారిచేతనే యీ గ్రంథంలోని ఉపదేశభాగం వ్రాయించాలి" అనుకున్నాడు.

వెళ్ళి విషయం విన్నవించుకున్నాడు. భగవాన్ మురుగనారు ప్రార్థనను మన్నించి ఆ ఉపదేశభాగాన్ని చెప్పారు.

దాని తాత్పర్యం గ్రహిస్తేచాలు. భగవాన్ విశిష్టమైన, సూటియైన మార్గం గోచరిస్తుంది.

ఈ శ్లోకాల సారాంశం ఒక్కమాటలో చెప్పాలంటే "మనో నాశనమే మోక్ష"మని చెప్పాలి.

కాని, యీ మాత్రం చెప్పగానే సరిపోయేటట్టయితే, శృతి, స్మృతి పురాణేతిహాసాలూ, వేద వేదాంగాలూ, ప్రస్థానత్రయం వగైరాలూ ఎందుకు

పుట్టినట్లు! ఇందమంది మహాత్ములు ఎందుకు అవతరిస్తూనట్లు!

భగవాన్ మాత్రం ఆ ఒక్క ముక్కా చెప్పి వూరుకున్నారా! రకరకాలుగా యాభై సంవత్సరాలు చెప్పారు.

అందుచేత, యీ "మనోనాశనమే మోక్షం" అనే వ్యవహారాన్ని కూలంకషంగా తర్కించి నిగ్గు తేల్చుకోవాలి. ఈ మనో నాశనమెలా గవుతుందో తెలుసుకోవాలి.

దేహం?

నాహం.

కోహం?

సోహం.

నేను దేహాన్నా?

కాను.

నేనెవరిని?

నేనే.

నేను దేహాన్ని కాదు. నేను నేనే"

దేహం జడం. ఒక కుండలాంటిది. అందుచేత దానికి "[illegible]" అనే తలంపులేదు.

ఇక, అఖండమై, అద్వితీయమై, అనంతమై, ఆది మధ్యాం[illegible]మై అవాఙ్మానసగోచరమై "నేను"గా భాసిస్తున్నది ఆత్మ.

ఆత్మ జన్మమృత్యుజరాదుఃఖరహితమైనది. ఒక ఆకారమంటూలేనిది సచ్చిదానందమయమైనది.

ఇక, చస్తూ పుడుతూ యాతనలు పడుతున్న "నేను" ఎవరు? అది "మిథ్యానేను"- అదే అహంకారం. అదే మనస్సు.

మనస్సుకే కదా ఏ సంక్షోభం కలిగినా?

అవును. మనస్సుకే.

ఈ మనస్సు యొక్క స్వరూపం ఏమిటి?

ఈ తలంపుల యొక్క సమూహమే మనస్సు.

ఈ తలంపులు దేనిమీద ఆధారపడి వున్నాయి?

"నేను" అనే తొలితలంపుమీద.

అవును."నేను" అనే తొలితలంపు వచ్చిన తరవాతనే కదా నాది. నాకు. నన్ను- నీవు. నీది. నీకు. నిన్ను --- వాడు. వాడిది. వాడికి. వాడిని --- అది. దానికి. దానిని. - మొదలైన తలంపులు పుడుతున్నాయి!

అందుచేత "నేను" అనే మొదటి తలంపుపోతే. యీ "మిథ్యానేను" ని ఆధారంగా చేసుకుని అనంతంగా పుడుతున్న తలంపులన్నీ కుప్పకూలిపోతాయి.

అదే అహంకారంపతనం. అదే మనోనాశనం. అదే జన్మరాహిత్యం. అదే మోక్షం.

"మనస్సే లేకపోతే కర్మకలాపం ఎలా కొనసాగుతుంది? ఒక రాతి బండలాగ పడి వుండవలసిందేనా"? అనే ప్రశ్న బయలుదేరుతుందిక్కడ.

"యాదార్థమేమిటంటే. చైతన్యానికి. జడానికి - అనగా. ఆత్మకీ దేహానికీ మధ్య-మూడోదొకటి పుట్టుకొస్తోంది. దీన్నే 'మిథ్యా నేను", "అహంకారం" "మనస్సు" అంటున్నాం. ఇది సర్వజ్ఞతగల ఆత్మా కాదు. జడమైన దేహమూ కాదు. దీనికి జడచైతన్యాలు రెండూ వున్నాయి.

"ఈ మనస్సు ఆత్మ సన్నిధిలో పని చేస్తుంది. ఆత్మ లేనిదే మనస్సులేదు. ఈ మనస్సు నాశనమవ్వగానే కర్మకలాపం ఎటువంటి ప్రయత్నమూ లేకుండా అతి సహజంగా సాగిపోతుంది. మనస్సు చేసే పనులు ఆత్మే చేస్తుంది - అతి సవ్యంగా. అతి సమర్థవంతంగా. మనస్సు చేసినట్లు కోతిపనులూ. అవకతవకలూ లేకుండా.

"ఆత్మ తన అత్యద్భుత శక్తిచేత యీ అనంతమైన విశ్వాన్ని సృష్టించింది. అయినా, ఆత్మ ఏమీ చెయ్యనిదిగానే వుండిపోయింది.

భగవద్గీతలో కృష్ణపరమాత్మ స్పష్టంగా చెప్పాడు - "నేనేమీ చెయ్యడంలేదు. అయినా, యీ కర్మఫలమంతా నానుంచే వెలువడుతోంది" అని. మహాశ్చర్యం. మహాద్భుతమైన పనులెన్నో చేశాడు కృష్ణుడు. అయినా, తనేమీ చెయ్యనివాడేనట!

"అప్పుడు 'నేను' అనే తొలి తలంపు పోతే, ఆ తలంపుని ఆధారంగా చేసుకుని పుడుతూన్న తలంపులన్నీ పడిపోతాయి." అని కదా అన్నాం!

"అలాకాక, వచ్చిన తలంపు నొక్కొక్కదాన్ని అటకాయిస్తూపోతే ఎన్ని జన్మలూ చాలవు. అవి తామరతంపరలా పుట్టుకొస్తూనే వుంటాయి. వివేకంతోనో, వైరాగ్యంతోనో కొన్ని తలంపులుని తోసేస్తే, వెంటనే వాటికి రెట్టింపు పుట్టుకొస్తాయి.

"ఈ తలంపుల వూరేగింపు ఆగిపోవాలంటే - "ఈ తలంపులు ఎవరికి పుడుతున్నాయి?" అని ప్రశ్నించుకోవాలి.

"నాకు" అని సమాధానం వస్తుంది.

"అప్పుడు నేనెవరిని?" అని మళ్ళీ ప్రశ్నించుకోవాలి.

"నేర్పుగా ప్రశ్నించుకుంటూ, యీ "నేను" అనే భావన ఎక్కడినుండి పుడుతోందో గమనిస్తూ లోపలికి మునిగి అన్వేషిస్తే యీ "మిథ్యానేను" ఏకమేవాద్వితీయమైన ఆత్మలో లీనమై ఆత్మగానే ప్రకాశిస్తుంది.... ఉప్పుతో తయారుచేసిన బొమ్మ సముద్రపులోతును కనిపెట్టాలని సముద్రంలో దిగి, కరిగిపోయి, తన నామరూపాలని పోగొట్టుకొని సముద్రమే అయిపోయినట్టు"

భగవాన్ చెప్పిన యీ అహంమూలాన్వేషణకి ఉపకరణం మనస్సే. ఆ మనస్సు తను పుట్టినచోటికి చేరి అక్కడ లీనమైపోతుంది. మనోనాశనం కాని మోక్షం దుర్లభం.

ఒక పాఠశాల తగలబడి పోతోంది. "ఈ దెబ్బతో మనకు యీ చదువుపీడ విరగడయిపోతుందిరా! ఇంక హాయిగా ఆడుకోవచ్చు" నంటూ పిల్లలందరూ పట్టలేని సంతోషంతో గంతులేస్తున్నారు. ఒక పిల్లవాడు మాత్రం ఒక మూల కూర్చుని యేడుస్తున్నాడు. అది గమనించిన ఒక పెద్దమనిషి ఆ కుర్రాడి దగ్గరకు వెళ్ళి "నీ తోటి పిల్లలంతా బడి తగలబడిపోతూంటే అంత ఆనందిస్తున్నారు. బుద్ధిమంతుడివి కాబట్టి నువ్వొక్కడివే బాధపడుతున్నావు. ఏడవకు బాబూ" అన్నాడు అయినా ఆ బాలుడు ఏడుపు మానలేదు సరికదా, యింకా వెక్కి వెక్కి యేడుస్తూ కొంచెం దూరంలో వున్న మాష్టారుని చూపించాడు. ఆ బుద్ధిమంతుడి బాధ అప్పుడర్థమయింది ఆ పెద్ద మనిషికి. వాడి ఏడుపు బడి బుగ్గిపాలవుతూన్నందుకు కాదు. ఆ బడితోపాటు మాస్టారుకూడా తగలబడి పోలేదుకదాని. మాస్టారు వున్నంతవరకు మళ్ళీ ఏ పాకలోనో మొదలు పెడతాడు కదా పాఠాలు అని వాడి భయం.

"మాస్టారు వున్నన్నాళ్ళు బడి యెలా తప్పదో, యీ మిథ్యానేను వున్నన్నాళ్లు జంఝాటాలూ, తాపత్రయాలూ తప్పవు" - అని చెప్పారు భగవాన్.

"మిథ్యానేను" మిథ్యగానే మిగిలిపోవాలంటే అహంమూలాన్వేషణే రాజబాట.

"వేదాంతులు లోకం 'మాయ' అని అంటారు. అలా అనేందుకు తాము వున్నారన్నమాట. తామూ లోకంలో భాగమేనని మర్చిపోతారు. ముందు నువ్వెంత వాస్తవమో తెలుసుకో. అప్పుడు లోకం వాస్తవమో, మాయో తేలిపోతుంది.

"మొట్టమొదట 'నేను' అనే దాని నుండి బయటపడు. నీ నుంచి నీ మనస్సుని కప్పించు. లోకమంతా మాయ అవుతే నువ్వు మాత్రం వాస్తవమెలాగవుతావు? లోకంలోనూ, నీలోనూ ఒకటే వాస్తవముంది" అంటారు భగవాన్.

అందుచేత ముందు యీ "మిథ్యానేను"ను మాయం చెయ్యాలి. దానికి

అహంమూలాన్వేషణ మించిన సాధనం లేదు.

* * *

ఒకనాడొక భక్తుడు సృష్టివిలాసానికి అద్భుతపడుతూ భగవాన్‌తో యిలా అన్నాడు:

"ఆకాశం, సూర్యుడు, చంద్రుడు, అసంఖ్యాకమైన నక్షత్రాలు, యీ భూమి, యీ భూమి మీద సముద్రాలు, పర్వతాలు ఎంత అద్భుతంగా వుంది సృష్టి!"

"ముందు మీలోని అద్భుతాన్ని గమనించరేం? గాఢ నిద్రలో వున్నపుడు 'నేను' లేదు. అప్పుడు మీరాశ్చర్యపడుతూన్న యీ సృష్టీ లేదు. మళ్ళీ 'నేను' రాగానే సృష్టి ప్రత్యక్షమవుతోంది. ఈ 'నేను' ఎక్కడ పుడుతోంది? మళ్ళీ ఎక్కడ అణుగుతోంది? మీలోని యీ అద్భుతానికి విస్మయం చెందరేం? దీనిని గురించి ఆలోచించరేం?" అన్నారు భగవాన్.

* * *

"మీరెప్పుడూ ఎక్కడో దేన్నో చూస్తూన్నట్టుంటారు. అదేమిటి భగవాన్?" అని అడిగాడొక భక్తుడు.

"నాకంటె అన్యమేముందీ చూడటానికి? నన్ను నేనే చూచుకుంటున్నాను" అని చెప్పారు భగవాన్.

ఒక భక్తుడు భగవాన్‌ని ప్రశ్నించాడు "తమరెప్పుడు సమాధిలోకి వెళతారు" అని.

"సమాధి అంటే ఏమిటండీ?" అని ఎదురు ప్రశ్న వేశారు భగవాన్.

"ఇంద్రియచలనాన్ని ఆపి, భ్రూమధ్యంలో దృష్టి నిలిపి, దేహాన్ని విస్మరించి కొన్ని గంటలు నిశ్చలంగా వుండిపోవడం" అన్నాడా భక్తుడు.

"కొన్ని గంటలు మాత్రమే వుండేది సమాధికాదు. ఇక్కడి పరిస్థితి అంతా వేరు. సకలేంద్రియాలూ పని చేస్తూండగానే ఎప్పుడూ సమాధిలో వుండడం ఇది సహజ సమాధి" అని చెప్పారు భగవాన్.

* * *

"ఉన్నదొకటే. ఆత్మ ("ఆత్మమయంసర్వం"). అది చైతన్యమయం. అందులోంచి అహంవృత్తి పుడుతోంది. పుట్టి "జీవు"డని పిలువబడుతోంది. ఆ జీవుడు విషయాలలో చిక్కుకుంటున్నాడు. సంసారంలో బంధింపబడుతున్నాడు. సంస్కారాల ప్రభావంవల్ల చస్తూ పుడుతూ, పుడుతూ చస్తూ వున్నాడు.

(అహంవృత్తి, అహంకారం, మిథ్యానేను, జీవుడు, మనస్సుఇవన్నీ ఒకటే. నీరు, జలం, ఉదకం యివన్నీ ఒకటే అయినట్టు)

"ఈ చావుపుట్టుకలనుంచి తప్పుకోవాలంటే ఒకటే ఉపాయం. అదేమిటి? వచ్చినదారిని వెళ్ళడమే. అనగా, ఏ ఆత్మలో నుంచి యీ అహంవృత్తి పుట్టిందో, ఆ ఆత్మలోనే యీ అహంవృత్తిని లీనం చెయ్యడం.

"ఒక సద్వస్తువే మూడు వస్తువులవుతోంది. అవి జగత్తు, జీవుడు, ఈశ్వరుడు.

"అహంకారం చస్తే - అనగా, యీ "మిథ్యానేను" పోతే - అనగా మనోనాశనమవుతే - యీ మూడూ మూడుగా తోచవు. ఒకటిగానే గోచరిస్తుంది - ఆత్మగా, తానుగా."

ఎవరెవరికి, ఎన్నిమార్లు, ఏయేవిధంగాచెప్పినా, భగవాన్ చెప్పినదొకటే.

" 'నేనెవరిని?' అని ప్రశ్నించుకుని నువ్వెవరివో తెలుసుకో" అని.

"శరీరంతో తాదాత్మ్యం చెందడం అజ్ఞానం.

గాఢనిద్రలో శరీరధ్యాస లేనప్పుడుకూడా నువ్వున్నావు. మెలుకూరాగానే వస్తూన్న మొట్టమొదటి తలంపు 'నేను'. ఈ 'నేను' వచ్చిన తరువాతనే 'నాశరీరం' అని తెలుసుకుంటున్నావు. అందుచేత శరీరం రెండో తలంపవుతోంది. మొదటిదైన 'నేను' ను తీసేస్తే, రెండోదైన 'శరీరం' దానంతటదే పోతుంది.

కాబట్టి, పోగొట్టుకోవలసినది సకలానికి మూలమైన 'నేను'ను 'మిధ్యానేను'ను, అనగా, మనస్సును'' అంటారు భగవాన్.

ఇవి మన శరీరాలు కాని, యీ శరీరాలు మనం కాదు.

శరీరం యొక్క నిజస్వరూపం ఏమిటి?

''అస్థిస్తంభం, స్నాయుబద్ధం, మాంసశోణితలేపితం.
చర్మావనద్ధం, దుర్గంధం, పాత్రం మూత్రపురీషయోః''
''జరాశోకవిపాకార్తరోగమందిరమాతురం.
దుష్పూరం, దుర్ధరం, దుష్టం, సదోషం క్షణభంగురం''

ఇటువంటి శరీరాన్ని 'నేను'గా భావించడం!

నిజమైన 'నేను' ఆత్మ.

అది ఆనందార్ణవం. వర్ణనాతీతమైనది.

కాబట్టి దేహాత్మబుద్ధి పోవాలి. ఆత్మానుభూతి కలగాలి. ఆత్మగా మిగిలిపోవాలి.

ఇది సదసద్వివేక విచారణవల్లనే లభిస్తుంది. అదే అహం మూలాన్వేషణ.

''అహంమూలాన్వేషణ అనగా, అన్నమయ, ప్రాణమయ, మనోమయ, విజ్ఞానమయ, ఆనందమయకోశముల విచారణకాదు. ఈ పంచకోశాలూ, స్థూల, సూక్ష్మ, కారణ శరీరాలూ అహంకారం ధరించిన రూపాలు. ఈ రూపాలని విచారించటం నిజమైన విచారణ కాదు. ఈ రూపాలకు అంతం లేదు. ఇక విధారణకు అంతమెక్కడుంటుంది? అహంకారం ధరించేది అనేక రూపాలయ్యె!

''ఇక అసలూ శిసలూ అయిన విచారణ ఏమిటి?

''ఈ 'మిధ్యానేను' ఎక్కడ పుడుతుందో చూడటం. లోదృష్టితో అలా చూడగా చూడగా అది తన జన్మస్థలమైన ఆత్మలో కరిగి పోతుంది. నిజానికది ఆత్మలోనుంచి లేచిన ఒక రశ్మి మాత్రమేకదా!

''ఇక ఆత్మస్ఫురణ వచ్చేపోయే ఒక దశకాదు. అది నిత్యం. జాగరూకం.

''ఈ ఆత్మను చూచేవాడిగా భావిస్తే ప్రపంచమూ, విషయాలూ గోచరమవుతాయి. అనగా చూచేవాడు తయారవ్వగానే చూడబడేవన్నీ సిద్ధమవుతున్నాయన్నమాట. నిజానికి, చూచేవాడూ, చూడబడేదీ- యీ రెండూ ఆత్మలోనే ఉనికి కలిగి వున్నాయి. ఎలాగంటే- సినీమా తెరవుంది. ఆ తెరమీద బొమ్మలు ఆడిపాడి పోతుంటాయి. మనం బొమ్మలని చూస్తాంగాని. తెరని చూడలేం. కాని, తెరలేకుండా బొమ్మలు కనపడవుకదా!

''అలాగే, ఆత్మ లేకుండా ప్రపంచం లేదు.''

''అందుచేత చెయ్యవలసిన సాధన చూచేవాడిని త్రోసివెయ్యడమే. చూచేవాడు పోతే చూడబడే ప్రపంచ మెక్కడుంటుంది? అప్పుడు స్వచ్ఛమైన, అనిర్వచనీయమైన ఆత్మ ఒకటే మిగులుతుంది'' అన్నారు భగవాన్.

ఇప్పుడు తేలిన పర్యవసానం ఏమిటి?

''నేనెవరిని?'' అని నేర్పుగా, సూటిగా ప్రశ్నించుకుంటూ, లోదృష్టితో యీ'మిధ్యానేను' పుట్టుక స్థానాన్ని చేరుకోవాలి. అలా చేరుకోగానే, యీ'మిధ్యానేను' అందులో అంతర్ధానమైపోతుంది. అప్పుడు నిజమైన 'నేను'గా సర్వవ్యాపి, సచ్చిదానందస్వరూపి అయిన ఆత్మగా మిగిలిపోవడం జరుగుతుంది.

''దేవుడులే''డనే నాస్తికుడున్నాడుగాని ''నేను లేను'' అనే మానవుడు లేడుకదా!

''అందుచేత అహంమూలాన్వేషణతో యీ 'మిధ్యానేను'ను నాశనం చేసుకుని దుఃఖనివృత్తిని పొంది, సాటిలేని ఆత్మానందంలో తేలిపోయే ప్రయత్నం చెయ్యడం అందరికీ అవశ్యకమే.

''ఈ సాధన చెయ్యడానికి పూజా పునస్కారాలతో పనిలేదు. ఉపవాసాలవసరం లేదు. కావలసింది తన్ను తాను తెలుసుకోవాలనే తృష్ణ'' అన్నారు భగవాన్.

ఇలా చెప్పినా, పూజాపునస్కారాలనీ, దానధర్మాలనీ, ఉపవాసాలనీ,

మహాత్ములను దర్శించడాన్నీ, సత్సంగాన్నీ, యాత్రలకు వెళ్ళడాన్నీ, ఆధ్యాత్మిక గ్రంథాలను చదవడాన్ని, జపతపానుష్ఠాధిసాధనలనీ గర్హించలేదు భగవాన్.

"అవన్నీ ఒకనాటికి అహంమూలాన్వేషణకు దారితీస్తాయి" అన్నారు కూడానూ.

అహంమూలాన్వేషణ ముక్తికి సూటిమార్గమనే చెప్పారుగాని, మరొకటేకి లేదని చెప్పివుంటే "ఎప్పుడూ, ఎవరినీ, ఏమీ అడగని స్వామి" అని తమకు తామే పేరు పెట్టుకున్న భగవాన్ "ఈ అరుణాచల పర్వత ప్రదక్షిణ చేశారా?" అని ఎందుకడుగుతారూ! అరుణగిరి ప్రదక్షిణకు అంత ప్రాముఖ్యం ఎందుకిస్తారూ! తామే వేలసార్లు ఎందుకు ప్రదక్షిణం చేస్తారూ! అటువంటి అవసరం వారికేమి మిగిలిందనీ! తమను అనుకరించి భక్తులు ఆధ్యాత్మికాభివృద్ధిని పొందడానికి కాకపోతే!

"స్మరణమాత్రముననే పరముక్తి ఫలద
కరుణామృతజలధి అరుణాచలమిది"

అని అరుణగిరిని స్తుతించారు భగవాన్.

"అరుణాచలా
ఘనీభవానందతరంగా
అంధకారతేజోమూర్తీ
అపాంగవీక్షణాశమితభవార్తీ
సకలకలుషబంధనమండనశిఖరజ్యోతీ
చంచత్మృదుధవళమే ఘోత్తరీయా
శివా
ప్రసీదమమ" -చలం.

పార్వతి ఈశ్వరుడిని ప్రేమించింది. ఇక తప్పిందికాదు హిమవంతుడికి. కూతురిని ఈశ్వరుడికిచ్చి పెళ్ళి చేశాడు.

కూతురు పెళ్ళి చేసి తన బరువు దించుకున్నందుకు సంతోషించాలా? అలా కాకుండా ఒక దీర్ఘాలోచనలో పడిపోయాడు హిమవంతుడు.

ఏమిటీ ఆ ఆలోచనా? తన అల్లుడు ఈశ్వరుడు ఏ జాతివాడు? అని.

"పాములని మెడలో వేసుకున్నాడు. పాములోడా? జంతు చర్మాన్ని కట్టుకున్నాడు. వేటగాడా? ఢమరూ వాయిస్తున్నాడు. బిచ్చగాడా? బూడిద పూసుకున్నాడు. బైరాగోడా? ఎవడు? ఎవడు?"

ఎటూ తెగని ఆలోచనలో సతమతమైపోతున్నాడు.

ఇలా వుండగా, ఒకనాడు తన అల్లుడిని అరుణాచల పర్వతాకృతిలో చూసి నిట్టూర్చాడు హిమవంతుడు-తమ జాతివాడే తమ కొండజాతివాడేనని.

బలేకథ!

అరుణాచలపర్వతం శిలామయం కాదనీ, సాక్షాత్ పరమేశ్వరుడేననీ అంటున్నారు శ్రీరమణ భగవాన్ కూడా.

ఎవరు చెప్పినా, చివరికి భగవాన్ చెప్పినా, కొన్ని కొన్ని మనకు అర్థంకావు. అంతమాత్రంచేత వారి మాటలని కొట్టి పారేయడం మాత్రం సబబా? అర్థం కాకపోవడం, మనం అర్థం చేసుకోగల సమర్థులం కాకపోవడమేగాని, వారు ఏనాటికీ కల్పించి చెప్పరు.

64

దేవుడు ప్రత్యక్షమవ్వడం, ఆత్మసాక్షాత్కారంవంటి వేటినీ గమ్యంగా ఒప్పుకోలేదు భగవాన్.

"ఆత్మ అఖండమై, అంతా తానై వుంటే, చూచేవాడెవడు? చూడబడేవాడెవడు? చూచేసాధనమేమిటి?" అని అడిగారు.

అవును, ఆత్మ అనుభవైకవేద్యమేగాని, మరొకటికాదు. ఆత్మ అనగా 'ఇది'

అని యెవరు చెప్పగలరు?

కృష్ణపరమాత్మ సహితం ఆత్మను యిదమిద్ధమని చెప్పలేక.

"ఈ ఆత్మను ఒకడు ఆశ్చర్యంగా చూస్తున్నాడు. మరొకడు ఆశ్చర్యంగా చెపుతున్నాడు. వేరొకడు ఆశ్చర్యంగా వింటున్నాడు. అయినా, ఈ ఆత్మను ఎవరూ తెలుసుకోలేక పోతున్నారు?" అన్నారు.

ప్రాచీన ఋషులు "అహం బ్రహ్మాస్మి" "శివోహం" వంటి మహావాక్యాలు చెప్పి వాటిని స్మరించమన్నారు.

"నీవు బ్రహ్మవే అయివుండగా, శివుడవే అయివుండగా (అనగా, ఆత్మవే అయివుండగా) "నేను బ్రహ్మను" "నేను శివుడను" అని మననం చేసుకోవడం, వెంకన్న "నేను వెంకన్నను నేను వెంకన్నను. నేను వెంకన్నను"- పుల్లయ్య "నేను పుల్లయ్యను, నేను పుల్లయ్యను" అని అనుక్షణం అనుకోవడంలా వుంటుంది" అన్నారు భగవాన్.

"ఇక, ఆత్మను తెలుసుకోవడానికి 'నేతి. నేతి' (ఇది కాదు, ఇది కాదు) అనుకుంటూ పోతే ఎక్కడ తేలుతాం?అర్ధమేముందీ ఆ సాధనలో?" అని అడిగారు భగవాన్.

ఇప్పుడొక ప్రశ్న బయలుదేరవచ్చు "నేనెవరిని? నేనెవరిని?" అనుకుంటూ కూర్చోవడం మాత్రం అర్ధరహితంకాదా? అని.

కాదు. "నేను ఆత్మను" అనే చరమలక్ష్యానికి వచ్చెయ్యక 'నేనెవరిని?" అనే ప్రశ్నతో హృదయంలోనికి చొచ్చుకుపోతే, ఆ వెతికే 'మిధ్యానేను' ఒకే ఒక నేను' అయిన ఆత్మలో మునిగి హతమై పోతుంది.

ముఖ్యంగా కావలసింది ఏకాగ్రదృష్టి. ఇలా దృష్టిని స్థిరం చెయ్యడం కష్టమే. చాంచల్యమైన మనస్సుని నిరోధించడం కష్టమే. కష్టమేగాని, అసాధ్యం మాత్రం కాదు. సాధన చెయ్యగా చెయ్యగా సాధ్యమవుతుంది.

"ఎప్పుడెప్పుడవుతే యీ మనస్సు చలించిపోతూంటుందో.

అప్పుడప్పుడే దానికి కళ్లెం వేసి, దాని పరుగులు ఆపి ఆత్మాయత్తం చెయ్యాలి" అని గీతాచార్యుడు చెప్పారుకదా!

ఇది దుస్సాధ్యమనుకుంటే ఏది సాధ్యం?

ఏది యింతకంటె సులభం?

నిష్కామకర్మ సులభమా

ప్రతిఫలా పేక్ష లేకుండా, త్రికరణ శుద్ధిగా ఏదైనా చెయ్యగలమా?

"కుడిచేత్తో యిచ్చింది ఎడమచేతికి తెలియకూడదు" అన్నారు.

అయితే మనం (అనగా నూటికి 90 మంది) ముష్టివాడికి సహితం ఒక పది పైసలు వెయ్యాలంటే మన దాతృత్వం చూచే వారక్కడ వుంటేనేగాని వెయ్యం.

తమరు చేస్తూన్న ఘనకార్యాలకు సాక్ష్యం వుండాలని, పూల మాలలనీ, వాటిని వేసేవారినీ, ఫోటోలు తీసేవారినీ, తమరే సిద్ధంచేసుకుని మరీ తయారవుతూన్న "ప్రజా సేవకులూ" "కళాపోషకులూ" ఎంత మంది లేరు!

అందుచేత చెప్పవచ్చేదేమిటంటే - నిష్కామకర్మకూడా సులభం కాదని.

* * *

భక్తిసులభమా?

గొంతు చించుకుని పాటలు పాడుతూ, పిట్టలు ఎగిరిపోయేటట్లు చప్పట్లు కొడుతూ, భూమి దద్దరిల్లేటట్లు గంతులు వేస్తూండడం భక్తికాదు.

భక్తి అంటే 'పరమేశ్వరుని కోసం ఆర్తి, తల్లీతండ్రీ, తోడూనీడా, సఖుడూ గురుడూ అయిన దేవుడికోసం తహతహ.

ఒకడు శ్రీరామకృష్ణపరమహంస వారి దగ్గరకు వచ్చి "నాకు భగవంతుని దర్శనం చేయించాలి తమరు" అన్నాడు.

"సరే, అలాగే చేయిస్తాను" రమ్మని, వానిని గంగాస్నానానికి తీసుకువెళ్ళి, ఆ వాడిని గంగలో ముంచి, పైకి లేవకుండా నొక్కిపెట్టి వుంచారు కొంతసేపు.

తరవాత వదిలిపెట్టగా వాడు లేచి అదేమిటి స్వామీ? అలా నొక్కేశారు. ఉక్కిరిబిక్కిరి అయిపోయాననుకున్నాడు.

"అదే. నీ ప్రాణంకోసం ఎంత తహతహ లాడిపోయావో. భగవంతుడికోసం కూడా అంత తహతహలాడితే వాడే ప్రత్యక్షమవుతాడు. నేను వేరే దర్శనం చేయించనక్కరలేదు"అని చెప్పారు పరమహంస.

కుండలు చెయ్యడానికి మట్టి తొక్కుతూ. ఆ మట్టిలోకి పాకి వచ్చిన పసికందు. తన కన్నకుమారుడిని గమనించకుండా. వాడిని కూడా తొక్కిపారేశాడు గోరాకుంభార్ భక్తి పారవశ్యంలో.

అదీ భక్తి అంటే

ఇప్పుడు తెలిసిందికదా. అటువంటి భక్తికూడా సులభంకాదని?

* * *

శరణాగతి సులభమా?

దుశ్శాసనుడు ద్రౌపతి చీర లాగుతూంటే ఎంతేనా పెనుగు లాడింది తన మానం కాపాడుకునేందుకు ఆ తల్లి. కృష్ణుడి నెంతగానో ప్రార్థించింద. కాని. ఏ కృష్ణుడూ రాలేదు. చివరికి రెండు చేతులూ జోడించి పైకెత్తి"కృష్ణా. అన్యథా శరణం నాస్తి. త్వమేవ శరణం మమ" అంది.

అప్పుడు వినిపించింది కృష్ణుడికి. ద్రౌపదీ మానసంరక్షణం జరిగింది.

భారమంతా భగవంతుడిమీదే వేసి. మార్జాలకిశోర న్యాయంగా. నిశ్చింతగా వుండగలవారెందరూ?

ఇక. శరణాగతి మాత్రం ఏం సులభం?

* * *

అందుచేత "నేనెవరిని" అనే ఒకే ప్రశ్నతో లోనికి ములుగు.

"సమస్తాన్నీ తెలుసుకునే 'నేను'ను తెలుసుకోకుండా. సమస్తాన్నీ తెలుసుకోవడానికి ప్రయత్నించడం అవివేకం" అన్నారు భగవాన్.

అహంమూలాన్వేషణ సూటియైన మార్గమని చెప్పారేగాని. నిష్కామకర్మ. భక్తి. శరణాగతి - యివేమీ కూడదని చెప్పలేదు. అంతేకాదు అవీ. యింకా యమనియమాద్యాచరణా లేనిదే అది సాధ్యం కాదనికూడా చెప్పారు.

"సత్యం వద - ధర్మం చర - యతోధర్మస్తతోజయః" అని ఘోషిస్తున్నాయి మన వేదాలు.

భగవాన్--

"ఆత్మ అనుగ్రహస్వరూపం. అది నీలోనే వుంది. నిన్ను ఆకర్షిస్తోంది. కొంచెం లోచూపు కలిగితే చాలు. నిన్ను తనలోకి లాక్కుంటుంది. అక్కడితో జననమరణ చక్రంనుండి తప్పుకుంటావు. దివ్య కాంతివే నీవై మిగిలిపోతావు"

అనికూడా అన్నారు.

ఆనాటి మహర్షులు చెప్పనిదీ. శ్రీ రమణభగవాన్ యిప్పుడు చెప్పినదీ. విశిష్టమైన. సూటియైన మార్గమిదే. అహంమూలాన్వేషణ.

65

మన భారత దేశానికి ఒక దొరగారు వచ్చి. కృష్ణప్రేమ్ అని పేరు పెట్టుకుని హిమాలయాల్లో తపస్సు చేసుకుంటున్నారు. వారొకనాడు భగవాన్ దర్శనానికి తిరువన్నామలై వచ్చారు. అప్పుడు భగవాన్ ఎవరికో "నేనెవరిని?" అని ప్రశ్నించుకోండి. మీ సందేహాలన్నీ తీరిపోతాయి" అని చెప్పడం విన్నారా దొరగారు. వెంటనే భగవాన్‌ను అడుగుదామనుకున్నారు "ప్రతివారినీ "నేనెవరిని?"అని ప్రశ్నించుకొమ్మంటావు కదా. అసలు నువ్వెవరవు భగవాన్"

అని.

ఆయనింకా అడగనేలేదు. క్షణకాలం అదృశ్యమయ్యారు భగవాన్. స్తంభించిపోయారు దొరగారు.

"నువ్వు నామరూపరహితుడవు. పరమాత్మవు" అంటూ ఎంతో స్తుతించి, భగవాన్ చరణారవిందాలని కళ్ళకద్దుకుని వెళ్ళిపోయా రాయన.

* * *

చిన్ననాటి స్నేహితుడు ఒకడు భగవాన్ చెంతకు వచ్చి చనువుగా మాట్లాడుతూ "నువ్వు చాలా పైకి వచ్చావు అన్నాడు. "లేదు, చాలా లోపలికి పోయాను" అన్నారు భగవాన్.

నిజమే లక్షలు గడించడం, కోటీశ్వరుడు కావడం పైకి రావడంకాదు.

కవీశ్వరుడు అవ్వడం. మహా పండితుడు కావడం పైకి రావడం కాదు.

మంత్రి పుంగవుడవ్వడం. చివరకు దేశాధ్యక్షుడే కావడం పైకి రావటంకాదు.

లోదృష్టితో అంతర్యామిగా ఉన్న పరమాత్మను కనుగొని ఆ పరమాత్మలో లీనమై పరమాత్మగా మిగిలిపోవటమే నిజమైన పైకిరావటం.

ఇంతకు మించిన మెట్టు మరొకటిలేదు.

* * *

ఒక గురుకులంలో శిష్యులు వేదాన్ని వల్లెవేస్తున్నారు. దీన్ని రోజూచూస్తూనే ఉన్నాడు గురువు గారి ఆవులను అడవికి తీసుకొనిపోయి, అక్కడమేపి తీసుకువచ్చే గొల్లపిల్లవాడు. వాడొకనాడు గురువుగారిని అడిగాడు "ఆ పిల్లలు రోజూ చదువుతారు ఎందు" కని.

"అవి మంత్రాలురా. ఆ మంత్రాలవల్ల దేవుడు కనపడతాడురా" అన్నారు

గురువుగారు.

"దేవుడిని చూడాలని నాకూ ఉంది. నాకు కూడా నేర్పండి మంత్రాలు" అన్నాడు గొల్లపిల్లవాడు.

"వాటిని నీకోటి నిరక్షరకుక్షికి నేర్పడం అసాధ్యంరా. వెళ్లు" అన్నారు గురువుగారు.

గొల్లపిల్లవాడు వెళ్ళి పోయాడు కాని, వాడి మనస్సు ఘోషించుట మొదలు పెట్టింది. ఎలాగైనా తనుకూడా మంత్రాలు నేర్చుకొని దేవుడిని చూడాలని.

గురువుగారిని బ్రతిమలాడుతూనే ఉన్నాడు మంత్రాలు నేర్పమని. ఆయన ఏదో చెప్పి పంపించేస్తూనే ఉన్నారు.

ఒకనాడు గురువుగారితో "మీ నౌకరి మానేస్తున్నాను అన్నాడు" ఎందుచేతరా అని అడిగారు గురువుగారు. "మీరు నాకు మంత్రాలు నేర్పటంలేదుగా" అన్నాడు. ఇకవాడి పోరుపడలేక గురువుగారు "సరేలేరా, రేపు ప్రొద్దుటే స్నానంచేసిరా. ఒక చిన్నమంత్రం చెప్పుతాను" అన్నారు గురువుగారు.

గొల్లపిల్లవాడు ఆనందంతో గంతులు వేసుకొంటూ వెళ్లిపోయాడు. వాడి సంతోషానికి మేరలేదు.

మరునాడు ప్రొద్దుటే స్నానం చేసి గురువుగారి దగ్గరికి వచ్చి నమస్కరించి మంత్రం నేర్పమన్నాడు. గురువుగారు వీడి కోసం ఒక మంత్రాన్ని సిద్ధంగానే ఉంచారు. ఒక గదిలోనికి తీసుకొనివెళ్ళి రహస్యంగా చెప్పారు ఆ మంత్రాన్ని.

ఏమిటామంత్రం?

"బొల్లిగెద్దనెక్కిన నల్లనయ్యా భోంచేసి పోదువురావయ్యో"

సరిగ్గాపలికేవరకు వాడిచేత చెప్పించారు.

మహదానందంతో వెళ్ళి పోయాడు ఆ చిన్నారి గొల్లవాడు.

దినదినం ఉదయస్నానం చేసి ఒక ఆకులో పచ్చడితో అన్నం కలిపిపెట్టి

మంత్రం చెప్పడం మొదలు పెట్టాడు. ఏ దేవుడూరాలేదు. వచ్చిభోంచెయ్యలేదు. 'పాపం. దేవుడికి పెద్ద మంత్రాలు చదివే వాళ్ళ ఇళ్ళల్లో భోంచెయ్యడంవల్ల కడుపునిండిపోయి రావడంలేదు కాబోలు'' అని సరిపెట్టుకున్నాడు.

ఇంకొకరోజున "దేవుడా మొట్టమొదటిలో ఇక్కడికే వచ్చి నేను పెట్టినది తిని. ఆ తరువాత మరెవరింటికైనా వెళ్ళు. నువ్విప్పుడు వచ్చి నేను పెట్టినది తినివెళ్ళేవరకు నేను మంచి నీళ్ళు కూడా తాగను." అని మంత్రం చదవడం మొదలు పెట్టాడు. "బొల్లిగెద్ద నెక్కిన నల్లనయ్యా భోంచేసి పోదువు రావయ్యా' ఆ మంత్రాన్ని అదేపనిగా జపించటం మొదలు పెట్టాడు.

తటాలున శ్రీమన్నారాయణుడు గురడవాహనుడై అక్కడ ప్రత్యక్షమయ్యాడు తన్మయత్వంతో తలమునకలయ్యాడు పిల్లవాడు.

బొల్లిగెద్ద నెక్కివచ్చిన నల్లనయ్య అక్కడ ఆకులో పెట్టినది ఎంతో యిష్టం తిన్నాడు.

"నల్లనయ్యా. ప్రతిరోజు ఇక్కడికేవచ్చి నేను పెట్టినవి తిని ఆ తర్వాత ఎవరింటికైనావెళ్ళు" అన్నాడు ఆనంద భాష్పాలు వర్షిస్తూ ఉండగా.

"సరే. అలాగే" నని అంతర్ధానమయ్యాడు నల్లనయ్య.

నల్లనయ్య తనమాటను నిలబెట్టుకొన్నాడు. రోజూ వచ్చి పిల్లవాడు పెట్టినది తినివెళ్లిపోతున్నాడు.

ఒకరోజున "ఏరా, నల్లనయ్య వచ్చి భోంచేస్తున్నాడా?" అని అడిగారు గురువుగారు వెటకారంగా.

"రోజూ వస్తూనే ఉన్నాడు. పెట్టినది తినిపోతున్నాడు" అని అన్నాడు పిల్లవాడు.

"ఓరి వెధవా. అబద్ధాలు చెప్పటం ఎప్పుడు నేర్చుకొన్నావురా"?

"లేదండి. నిజమేనండి. అబద్ధం చెప్పడంలేదండి"

"అయితే నాకు చూపించరా. అప్పుడుగాని నీ మాటనమ్మను. నువ్వి

చెప్పింది అబద్ధమే అయితే ఒళ్లు చీరేస్తాను మరి. సరేనా"?

"సరేనండి. అలాగే చేద్దురు. రేపు ప్రొద్దుటే మా ఇంటికిరండి"

గురువుగారు "పిచ్చిముండాకొడుకు. కలగంటున్నాడు కాబోలు" నను కొన్నారు.

మరసటి ఉదయం గొల్లవాడి ఇంటికివెళ్లారు. నమస్కారం చేశాడు పిల్లవాడు. ఆకులో అన్నం కలపి సిద్ధంగా ఉంది.

మంత్రం చదివాడు పిల్లవాడు. నల్లనయ్య రాలేదు. మళ్లీ చదివాడు అయినా ఆయనరాలేదు. అప్పుడు "నల్లనయ్యా: నువ్వెందు చేత రావడంలేదు? నేనేమైనా తప్పుచేశానా? రావయ్యా నల్లనయ్యా. నువ్వురాక పోతే గురువుగారు నేను అబద్ధం చెప్పాను అనుకొంటారు. నా వొళ్లు చీరేస్తానన్నారు కూడా" అని విలపించసాగాడు.

ఆశ్చర్యం! ఒక ధ్వని వినవచ్చింది "బిడ్డా. నీది నిర్మలమైన మనస్సు - అందుచేతనే నేను రోజూవచ్చి నువ్వు పెట్టినది ఆరగించివెళ్లుతున్నాను. ఈ రోజు నీ గురువుగారు వచ్చారు. ఆయనకు తానొక మహాపండితుడననే అహంకారం ఉంది. అందుచేత నేను రాలేను. బాధపడకు."

గురువుగారు విన్నారు - ఆ చిన్నారి బాలుని పాదలమీద టటాలున సాష్టాంగపడ్డారు.

చూశారా. వేదాలు వల్లించడం. పరమాత్మను స్తుతించడం చాలదు.

అహంకారం ఉండకూడదు. అది మనస్సును మలినం చేస్తుంది. అహంకారమే సర్వానర్థాలకీ మూల కారణం.

* * *

సంకేతస్థలానికి చేరుకోవాలని వొంటరిగా బయలుదేరాను. నిశ్శబ్దమైన చీకట్లో. నా వెంబడివచ్చేది ఎవరు?

అతని సామీప్యాన్నుంచి తప్పుకోవాలని దూరంగా జరుగుతాను. కాని, అతన్నుంచి తప్పించుకోలేను.

తన డంబాచారంతో భూమి నుంచి దుమ్మురేపుతాడు. నేను పలికే ప్రతిమాటకీ తన అరుపులుని జతచేస్తాడు.

ప్రభూ! అతనే అతను నా అహం. వాడికి సిగ్గులేదు. వాడితో కలిసి నీ ద్వారాన్ని సమీపించాలంటే నాకు సిగ్గు. -టాగూర్ గీతాంజలి" నుండి

-తెలుగు : చలం.

* * *

మొదలియార్‌పాటి కడు బీదది. బాగా ముసిలిదయి పోయింది. కళ్లు కూడా కనపడ్డం లేదు. అయినా భగవాన్‌కు భిక్షాకైంకర్యం మానదు. ఏనాటినుంచి, ఎన్ని సంవత్సరాల నుంచి అలా చేస్తోందో!

ఒకనాడు భగవాన్ "ఇంత పెడితే ఎలా తినగలను పాటీ?" అన్నారు.

"మహాచక్కగా తినగలవు. ఎక్కువ పెట్టాననుకోవడం కూడా ఒ తలంపేగదా?"అన్నది పాటి. ఆమెకు భగవాన్ దగ్గర అంతచనువు.

"నా వేదాంతం నాకే నేర్పుతున్నావే!" అని నవ్వారు భగవాన్.

* * *

ఒక చిన్నపిల్ల (ఒకానొక భక్తుడి కూతురు) పరుగెత్తుకుంటూవచ్చి "నన్ను ముట్టుకో భగవాన్" అంది. భగవాన్ అలాగే ముట్టుకున్నారు. "నా చేతిని ముట్టుకున్నావు గాని, నన్ను ముట్టుకున్నావా?" అని అడిగింది ఆ గడుగ్గాయి.

భగవాన్ నివ్వెరపోయారు.

"నీవు నేర్పిన విద్యయే నీరజాక్ష" అనాలా? వారు పన్నిన వలలో వారే చిక్కుకున్నారని అనాలా?

అదేమీకాదు.

"ఆత్మ అఖండమైయుండగా ముట్టుకునే దెవరిని? ముట్టుకునే వారెవరు? ముట్టుకునే సాధనమేది?" అని చెపితే ఆ పసిదానికేమి తెలుస్తుంది? ఎన్ని విధాల చెప్పినా, వేదాంతంలో మునిగి తేలుతూన్న వాళ్ళ మనస్సులకే పట్టడంలేదుకాదా!

66

ఈ రమణ దేవుని కథకంటే కాశీమజలీ కథలూ, భేతా కథలూ, కాకమ్మకథలూ కాలక్షేపానికి చాలా బాగుంటాయి. అయితే, యిది కాలక్షేపానికి అల్లిన కథ కాదు.

ఆత్మ విద్యాధ్యాపకుడై వతరించి మనల నుద్ధ ంప కంకణము కట్టుకున్న కళ్యాణమూర్తి రమణుడు.

అజ్ఞానాంధకారమున దారిగానకయున్న మనకు జ్ఞానజ్యోతిని చూపిన కరుణాంతరంగుడు రమణుడు.

ఘోరసంసారాంబుధి మునిగిన మనలను దరిజేర్ప నేతెంచిన పరమదయానిధి రమణుడు.

దుర్భర జనన మరణ చక్రమునుండి మనలను తప్పింప తరలి వచ్చిన తండ్రి రమణుడు.

తన్నుదా తెలుసుకొను మార్గమును జూపి మనలనీ దుఃఖాలయము నుండి అవ్యయానంద పదవికిచేర్ప విచ్చేసిన గురువరేణ్యుడు రమణుడు.

ఆ రమణుడి కథ యిది.

భగవంతుడుడెప్పుడూ తన బిడ్డలకోసం మానవాకారందాల్చి వస్తూనే వున్నాడు. గుర్తించలేకపోవడం మన దురదృష్టం.

మనం తండ్రియైన భగవంతుడి కోసం ఒక్క అడుగు ముందుకు వేస్తే, భగవంతుడు బిడ్డలమైన మనకోసం పదడుగులు ముందుకువస్తాడు.

రమణావతారం యొక్క ఫలితాన్ని మనం పొందాలంటే, వారి బోధామృతాన్ని మత్తెక్కేలా గ్రోలాలి.

వారి మీద వెయ్యగలిగినంత భారం వేసి అహం మూలాన్వేషణకుపక్రమించాలి.

వారు కరుణాపూర్ణసుధాబ్ధి కాబట్టి, మనం చేసే సాధనకి పదింతల ఫలితాన్ని ముట్టచెపుతారు.

మన దుష్కర్మల ఫలితాన్ని మనం అనుభవించ నక్కరలేకుండా చేస్తారు.

"నీకు కలిగే మంచిచెడ్డలు నీ సత్కర్మ దుష్కర్మల ఫలితంగానే కలుగుతున్నాయి గాని వాటితో పరమేశ్వరుడికేమీ సంబంధంలేదు" అంటున్నారు మీమాంసకులు.

ఇది శుద్ధ అవివేకం.

"కర్మ జడం. చైతన్యస్వరూపుడైన ఈశ్వరాజ్ఞనచేతనే నీకర్మ ఫలితాన్ని అనుభవిస్తున్నావు" అన్నారు భగవాన్.

ఇది ఎంతటి పాపాత్ముడికైనా ఊరట కలిగించకమానదు.

నువ్వుచేసిన పాపాలకి హృదయపూర్వకంగా పశ్చాత్తాపపడి, పరమేశ్వరుడిని ప్రార్థిస్తే ఆ దయామయుడు నిన్ను క్షమించి, నీ దుష్కర్మల ఫలితాలని నువ్వు అనుభవించనక్కరలేకుండా చేస్తాడు. భగవంతుడు ఘటనాఘటన సమర్థుడుగదా!

"పశ్చాత్తాపమే పాపపరిహారం" అని కూడా అనలేదా!

నీ దుష్కర్మఫలితాలని నువ్వెలానూ కోరవు. నీ సత్కర్మ ఫలితాలని కూడా

కోరకు. కోరావంటే వాటి ఫలితాలననుభవించడానికి మళ్ళీ పుట్టవలసివస్తుంది. పుట్టాలంటే గర్భనరకం తప్పదు. ఆ తరువాత ఒకనాడు చావు తప్పదు. ఈ దుస్థితి నుండి తప్పుకోవాలంటే నిష్కామ కర్మ ఒకటే మార్గం.

ఈలోపుగా, భగవాన్ చెప్పినరీతిలో "నేనెవరిని?" సాధనచేసి, నువ్వెవరివో నువ్వు తెలుసుకున్నావా (అనగా, అఖండమైన, అద్వితీయ మైనది, సచ్చిదానందమయమైన ఆత్మగా మిగిలిపోయావంటే) దానికి మించినదేదీ లేదు.

"నేనెవరిని?" అనే ఒక ప్రశ్న నిన్ను పూర్తిగా ఆక్రమించెయ్యాలి. ఇలా అభ్యాసం చెయ్యగా చెయ్యగా, ఆ తరవాత ఆ ఆలోచన అవిచ్ఛిన్నంగా, అప్రయత్నంగా సాగిపోతుంది. నీ పనులు నువ్వు చేసుకుంటూండవచ్చు అవేమీ అడ్డురావు.

"ఆత్మ మన పుట్టిల్లు. మన పుట్టింటినే మనం పరాయికొంపగా భావించడం వల్ల వచ్చిపడింది ఈ గోలంతా.

"మనమెవరిమో మనం మరిచిపోయాం. ఈ తోలుశరీరాలనే మన మనుకుని అనేక జన్మలెత్తుతున్నాం. మన మెవరమో తెలుసుకున్ననాడు కలలో దేశదేశాలూ తిరిగి మేలుకోగానే యెలాగుంటుందో అలాగుంటుంది." అన్నారు భగవాన్.

చెప్పినదే చెప్పినా, ఎన్నిమాట్లుచెప్పినా, ఎన్ని విధాల చెప్పినా ఆత్మ విద్య వంటబట్టడం కష్టం. అప్పటికి అర్థమైనట్లేవుంటుంది. మళ్ళీ మొదలు. ఏవేవో సందేహాలు పుడతాయి.

భగవాన్ చరణసన్నిధిని సంవత్సరాలకు సంవత్సరాలు గడిపిన భక్తులకే సందేహనివృత్తి కానిది, మనకు సందేహాలు పుట్టడంలో ఆశ్చర్యమేముందీ!

అందుచేత మనం ఈ "భక్తుల సందేహాలూ - భగవాన్ సమాధానాలూ" పరిశీలించి అవగాహన చేసుకుంటే అహంమూలాన్వేషణ సులభ

తరమవుతుంది.

భక్తుల సందేహాలు భగవాన్ సమాధానాలు

భక్తుడు : *భగవంతుడిని స్మరించుకోవడం ఒకటే చాలదా?*

భగవాన్ : ద్వంద్వం వున్నంతవరకు చాలు.

భక్తుడు : *దుఃఖంలో వున్నాను. శాంతి లభించేదెట్లా?*

భగవాన్ : నిద్రలోలేని దుఃఖం మెలుకూలో వుంటోంది. కారణం, నిద్రలో ''నేను'' అనే తలంపులేదు. అంతా సుఖమే. మెలుకూరాగానే యీ ''నేను'' అనే తలంపు పుడుతోంది. దీన్ని ఆధారం చేసుకుని దుఃఖం, ప్రపంచం, సర్వం బయలు దేరుతున్నాయి. అందుకే ఈ ''నేను'' యొక్క పుట్టుక స్థానాన్ని లోదృష్టితో వెదకమంటున్నాను. ఈ ''నేను'' (అనగా ''మిధ్యానేను'') పోతే అంతా సుఖమే. అంతా శాంతే.

భక్తుడు : *నేను శరణాగతి చెందినా అనుగ్రహాన్ని పొందలేదెందుచేత?*

భగవాన్ : శరణాగతి చెందినవారికి ప్రశ్నలు బయలుదేరవు.

భక్తుడు : *గురువు అవసరమా?*

భగవాన్ : లఘువుగా వున్నంతవరకు గురువు అవసరమే. అయితే, గురువు బాహ్యంగానే వుండాలన్న మాటలేదు. ఆంతరంగికంగా వుండికూడా ప్రబోధించవచ్చు.

భక్తుడు : *భగవంతుడు వేరూ, ఆత్మ వేరూనా?*

భగవాన్ : వేరు కాదు. ఒకటే.

భక్తుడు : *మా దేశం వెళ్ళిపోక తప్పడం లేదు. ఇకమీదట మీ అనుగ్రహం నా మీదెలా ప్రసరిస్తుంది?*

భగవాన్ : నువ్వేదేశం వెళ్ళినా ఆత్మనుంచి బయటకు పోలేవు. నీ దేహం మాత్రమే యీ అనంతమైన ఆత్మలో యిటూ అటూ వెళుతోంది. నీవొక దేహానివనీ, నేనొక దేహాన్ననీ భావించు కుంటూన్నందువల్లనే నీకా ప్రశ్న బయలు దేరింది. నువ్వెక్కడికైనా వెళ్ళు, ఎక్కడైనా వుండు, నన్ను

విడిచి వుండ లేవు. నా అనుగ్రహాన్నుంచి తప్పించుకోలేవు.

భక్తుడు : *''నేనెవడను?'' అనే విచారణ యితర మార్గాల కంటె సులభమంటున్నారు అదెలా?*

భగవాన్ : ''నేనున్నాను'' అని చెప్పడానికి అద్దంలో చూసుకుని చెప్పక్కరలేదు కదా! ఇలా అనుభవపూర్వకంగా వున్న ''నేను'' ను విచారణ చెయ్యడమే సులభం. మిగతావన్నీ చుట్టుదారులే.

భక్తుడు : *పునర్జన్మ వుందా?*

భగవాన్ : అహంకారం, అనగా ''మిధ్యానేను'' పోతే యిక వుండదు.

భక్తుడు : *ఆత్మోపలబ్ధికి త్యాగం అవసరమా?*

భగవాన్ : అన్నింటికంటె ముందు త్యాగిని త్యాగం చెయ్యాలి అనగా, త్యాగం చేస్తున్నాననే ''మిధ్యానేను'' ను పోగొట్టుకోవాలి.

భక్తుడు : *ధ్యానానికీ, విచారణకీ భేదమేమిటి?*

భగవాన్ : మనస్సుతో చేసేది ధ్యానం. మనస్సు ఎక్కడ పుడుతోందో చూడడం విచారణ. ధ్యానానికి ధ్యానం చేసేవాడూ, విషయమూ వుండాలి. విచారణకదేమీ అక్కరలేదు. అందుచేత యిది సూటిదారి.

భక్తుడు : *నిర్వాణము అంటే ఏమిటి?*

భగవాన్ : మనోనాశనం అనగా, ''మిధ్యానేను'' మిథ్యగానే మిగిలిపోవడం.

భక్తుడు : *జ్ఞాని ఏ కర్మా చెయ్యనక్కరలేదా?*

భగవాన్ : జ్ఞాని సంకల్పరహితంగా అనంతమైన కర్మను చేస్తూంటాడు. అది తైలధారలా సాగిపోతూనే వుంటుంది. అయినా, ఏ కర్మా చెయ్యనివాడుగానే వుంటాడు. అదెలాగుంటుందంటే - బలే జోరుగా తిరుగుతూన్న బొంగరం నిశ్చలంగా నుంచుని వున్నట్లు కనబడుతుంది. దాని వేగాన్ని కన్ను చూడలేదు. అలాగే, నిర్విరామంగా సాగిపోతూండే జ్ఞాని యొక్క కర్మను గుర్తించలేక, జ్ఞాని ఏ కర్మా చెయ్యడం లేదనుకుంటారు.

భక్తుడు : *ఈ ప్రపంచం సత్యమా అసత్యమా?*

భగవాన్ : ఈ ప్రపంచమే కాదు, యీ విశ్వవిశ్వాంతరాళాలన్నీ, ఆత్మపరంగా చూస్తే సత్యం. ఆత్మకు భిన్నంగా చూస్తే అసత్యం.

భక్తుడు : *సంకల్పాలు ఒక్కటి కూడా లేకుండా చేస్తేనేగాని, జ్ఞానం లభించదా?*

భగవాన్ : ఒక్కొక్క సంకల్పాన్నీ పట్టుకుని దీల్చి చెండాడుతూ కూర్చోనక్కరలేదు.

అలా చేస్తూ కూర్చుంటే యుగాలు చాలవు. గాఢ నిద్రలో ఏ సంకల్పమూ లేదు. మెలుకూరాగానే "నేను" అనే ప్రధమ సంకల్పం పుడుతోంది. ఈ "నేను"ని ఆధారంగా చేసుకుని అనంతంగా సంకల్పాలు పుట్టుకొస్తున్నాయి. అందుచేత యీ సంకల్ప మహావృక్షం మళ్ళీ చిగురించకుండా చెయ్యాలంటే, దాని మూలమైన "నేను" (మిధ్యానేను) ను విచారణ ద్వారా సమూలంగా పెకలించి వెయ్యాలి

భక్తుడు : భగవంతుడు నన్నెందుకు పుట్టించినట్టు? ఈ నరక యాతననెందుకు పెడుతూన్నట్టు?

భగవాన్ : భగవంతుడు నిన్ను పుట్టించినట్టు చెప్పాడా ఎప్పుడైనా? నువ్వే కదా ఆ మాట అంటున్నావు? నువ్వనగా - నీ "మిధ్యానేను" - దాన్ని అదృశ్యం చెయ్యి మొదట్లో. అప్పుడు నీకే ప్రశ్నలూ బయలుదేరవు.

భక్తుడు : సహజసమాధిలో వున్న వ్యక్తికి, కత్తితో కోసినా బాధ తెలియదా?

భగవాన్ : శారీరకమైన బాధలూ, యితర బాధలూ అన్నీ మనస్సుకే. సహజసమాధిలో వుండే జ్ఞానికి మనస్సు వుండదు. మనోనాశనం అవుతేనేగాని సహజసమాధి అలవడదు. అందుచేత జ్ఞాని సర్వదా సచ్చిదానందసాగరంలో మునిగి తేలుతుంటాడు. ఆ కారణంగా జ్ఞానికి శారీరక బాధలు స్వప్నతుల్యాలు.

భక్తుడు : ఆధ్యాత్మికాభివృద్ధికి గురువు అనుగ్రహం తప్పనిసరా?

భగవాన్ : తప్పనిసరే. గురువన్నా ఆత్మన్నా ఒకటే

భక్తుడు : జ్ఞానసముపార్జనకు వైరాగ్యం, అభ్యాసం అవసరమా?

భగవాన్ : అవసరమే. వైరాగ్యం మనస్సును అజమాయిషీ చేస్తూ వ్యామోహాల నుండి రక్షిస్తుంది. అభ్యాసం మనస్సును అంతర్ముఖపరుస్తుంది.

భక్తుడు : కర్మజాలంలో చిక్కి ఉక్కిరిబిక్కిరి అయిపోతూన్న నాకు తరుణోపాయమేమిటి?

భగవాన్ : కర్త లేకుండా కర్మ ఎక్కడుంటుంది? ఆ కర్తను అన్వేషించు. అప్పుడు కర్మ దానంతటదే ముగుస్తుంది.

భక్తుడు : మీది అద్వైతంకదా. ప్రత్యేకించి అరుణగిరిని ఎందుకు స్తుతించారు? భగవంతుడు వేరే వున్నట్టా?

భగవాన్ : భగవంతుడూ, భక్తుడూ, అరుణగిరీ, స్తుతీ అంతా ఆత్మే

భక్తుడు : అహంమూలాన్వేషణ కష్టంగా వుంది. విగ్రహపూజ చేసుకుంటాను తప్పు చేస్తూన్నానంటారా?

భగవాన్ : మాంసపుముద్దయిన యీ దేహానికి సర్వోపచారపూజ రోజూ చేస్తూండగా, భగవంతుడనే భావనతో విగ్రహ పూజచేసుకోవడంలో తప్పేముంది!

భక్తుడు : నేను చాలా కాలం నుంచి ఓంకారోపాసన చేస్తున్నాను. గొప్పనాదాన్ని వింటున్నాను. తేజోవంతమయిన దృశ్యాలని చూస్తూన్నాను. తరువాత చెయ్యవలసిందేమిటి?

భగవాన్ : ఆ గొప్పనాదాన్ని వినేవాడెవడో, తేజోవంతమైన ఆ దృశ్యాలని చూసేవాడెవడో, వాడిని పట్టుకోండి. వాడిని పట్టుకోగానే వాడూ అదృశ్యుడవుతాడు. వాడు చూచే దృశ్యాలూ అదృశ్యమౌతాయి. అప్పుడిక చెయ్యవలసిందేమీ వుండదు. అద్వితీయమైన ఆత్మానుభూతిలో కలకాలం వుండిపోతారు.

భక్తుడు : "నేను" మిధ్య అయినపుడు యిక యీ "మిధ్యానేను" ను నాశనం చేసేదెవరు?

భగవాన్ : నిజమైన ఒకే ఒక "నేను" ఆత్మ. ఆ "నేను" యీ "మిధ్యానేను" ను మింగేసి తానుగా మిగిలిపోతుంది.

భక్తుడు : భగవంతుడు సాకారుడా? నిరాకారుడా?

భగవాన్ : నీకు దేహం వుంటే భగవంతుడికీ వుంది. నీకు లేదనుకుంటే భగవంతుడికీ లేదు.

భక్తుడు : నేను ధ్యానం చెయ్యలేకపోతున్నాను. ఇతరులకు మంచి చేస్తూంటే చాలునా?

భగవాన్ : జ్ఞానికి యితరులంటూ లేరు. ఉన్నదొకటే ఆత్మ. అందుచేత యితరులకు మంచి చెయ్యడమంటే నీకు నువ్వు మంచి చేసుకోవడమే.

భక్తుడు : యోగుల మార్గానికీ, మీ మార్గానికీ తేడా ఏమిటి?

భగవాన్ : యోగి తన మనస్సును ఆత్మలోనికి బలవంతంగా నెట్టజూస్తాడు -గొడ్లకాపరి గొడ్డును కర్రతో కొడుతూ తోలుకు వెళుతూన్నట్టు. ఇక్కడ అట్లా కాదు. మనస్సును సౌమ్యంగా తీసుకువెళతాడు - పచ్చగడ్డిని చేపట్టుకుని గొడ్డును తనతో తీసుకువెళుతూన్నట్టు.

భక్తుడు : కర్మకూ, అకర్మకూ వ్యత్యాసమేమిటి?

భగవాన్ : అహంకారం వున్నంతవరకూ చేసేది కర్మ. అదిపోయిన తరవాత చేసేది అకర్మ.

భక్తుడు : ఆధ్యాత్మికాభివృద్ధికి సర్వసంగపరిత్యాగ మవసరమా?

భగవాన్ : అహంకారాన్ని త్యజించడమే అసలైన సిసలైన త్యాగం.

భక్తుడు : *ఆనందం యొక్క స్వభావమేమిటి?*

భగవాన్ : ఆనందం. బాహ్యంగా. అనగా. సిరిసంపదలలో వున్నదనుకుంటే. ఆ సిరిసంపదల వృద్ధితోపాటు ఆనందం పెరగాలి. వాటి వ్యయంతో పాటు తరగాలి. అవి పూర్తిగా క్షీణించిపోతే ఆనందం కూడా పూర్తిగా క్షీణించిపోవాలి. కాని మానవుని యొక్క అనుభవం ఏమిటి! గాఢనిద్రలో వున్నప్పుడు తనకు సిరిసంపదల ధ్యాస. చివరికి దేహధ్యాస కూడా లేదు. అప్పుడతనికి ఆనందం లేదా? వుంది. అందుకనే. ప్రతివాడూ. గాఢంగా నిద్రపోవాలని చూస్తాడు. ఆ గాఢనిద్రలోని హాయిని అనుభవించడానికి. అందుచేత పర్యవసాన మేమిటంటే - ఆనందం బాహ్యంగా లేదు. నీలోనే వుంది. అదే ఆత్మ. సచ్చిదానందసాగరం.

భక్తుడు : *భయాన్ని జయించడ మెలాగ?*

భగవాన్ : భయమనేది ఒక భ్రమ. అంతా ఆత్మేకదా! ఆత్మకన్యంగా ఏదైనా వుంటే దానికి భయపడాలి.

భక్తుడు : *ఆత్మానుభూతిని పొందడానికి ప్రప్రథమంగా చెయ్య వలసినదేమిటి?*

భగవాన్ : ఇంద్రియనిగ్రహం.

భక్తుడు : *స్త్రీ వాంఛ పోయేదెట్లా?*

భగవాన్ : నువ్వొక పురుష దేహానివనుకుంటే ఆమెదొక స్త్రీ దేహంలా కన బడుతుంది. కాని. నువ్వు దేహానివి కాదు. ఆత్మవు. ఆత్మలో స్త్రీ పురుష భేదం లేదు. ఇక స్త్రీ వాంఛ ఎక్కడుంటుంది?

భక్తుడు : *పరమేశ్వరుడికి ప్రియమైనది?*

భగవాన్ : నీ విధిని నీవు సక్రమంగా నిర్వర్తించడం.

భక్తుడు : *జ్ఞాని కర్మకలాపంలో వున్నప్పుడు కూడా ఆత్మానుభూతిని పొందుతూంటాడా?*

భగవాన్ : తప్పకుండాను. ఆడవాళ్ళు నెత్తిమీద నీళ్ళకుండలను పెట్టుకుని కబుర్లు చెప్పుకుంటూ నడుస్తారు. అయినా వాళ్ళ దృష్టి ఎప్పుడూ కుండల మీదే వుంటుంది. అలాగే జ్ఞాని కూడా ఎటువంటి కర్మకలాపంలో వున్నా ఆత్మను విడిచిపెట్టి వుండడు. కాబట్టి ఆత్మాను భూతిని పొందుతూనే వుంటాడు.

భక్తుడు : *అహానికి. అహంకారానికి తేడా ఏమిటి?*

భగవాన్ : ''నేను'' అనేది అహం - (ఆత్మ). ''నేను ఫలానా'' అనేది అహంకారం (మిథ్యానేను).

భక్తుడు : *జ్ఞానికి సరియైన నిర్వచన మేమిటి?*

భగవాన్ : విద్యకూ. అవిద్యకూ ఆవలిది జ్ఞానం. అది అనుభవైక వేద్యం మాత్రమే.

భక్తుడు : *మాయ అంటే ఏమిటి? ఆ మాయను అతిక్రమించేదెలా?*

భగవాన్ : మనస్సే మాయ. మనస్సు వున్నంత వరకు ద్వంద్వం వుంటుంది. ద్వంద్వం వున్నంతవరకు దుఃఖం వుంటుంది. మాయ నతిక్రమించాలంటే మనస్సు చావాలి. అప్పుడు ఆత్మానందం వెల్లవిరుస్తుంది.

భక్తుడు : *మనస్సుకీ. మెదడుకీ తేడా ఏమిటి?*

భగవాన్ : మెదడుకి శక్తినిచ్చేది మనస్సే. మనోనాశనంతో మెదడు యిక పని చెయ్యదని భయపడనక్కరలేదు. అప్పుడు ఆత్మే చెయ్యవలసిన పనులన్నిటినీ సవ్యంగా చేసుకుపోతుంది. మళ్ళీ ఆత్మ ఏమి చేసినా చెయ్యనిదే. అదే గీతలో చెప్పిన కర్మలో అకర్మ.

భక్తుడు : *మంత్రజపం మంచిదేనా?*

భగవాన్ : మంత్రం జపించగా జపించగా యితర ఆలోచనలేవీ బుర్రలోకిరావు. మంత్రం మీదే మనస్సు నిలుస్తుంది. ఆ మంత్రం కూడా మరికొన్నాళ్ళకు స్వరూపానుభవానికి దారితీస్తుంది. అదే ఆత్మ.

భక్తుడు : *''అందరికీ ముక్తిరావడం కోసమే నేను పాటుపడతాను - నాకు ముక్తిరాకపోయినా పరవాలేదు'' అన్నాడొక మహాత్ముడు. ఎంత గొప్ప మనసంటారు ఆయనిది?*

భగవాన్ : ఇదెలాగుందంటే. తియ్యటి కలకంటూన్నవాడు ''అందరినీ మేలుకోనియ్యండి. నేను మేలుకోకపోయినా పరవాలేదు'' అన్నట్టుంది.

భక్తుడు : *ఈ మనస్సు పరుగులుకి అంతం ఎప్పుడు?*

భగవాన్ : నది వెళ్ళి సముద్రంలో కలిసేదాక ప్రవహిస్తూనే వుంటుంది. అలాగే. మనస్సు కూడా ఆత్మలో లీనమయ్యేదాకా పరుగులు పెడుతూనే వుంటుంది.

భక్తుడు : *నేను చాలా గ్రంథాలు చదివాను. అయినా నా మనస్సు ఆత్మాయత్తం కావడంలేదు. ఎందుచేత?*

భగవాన్ : ఆత్మ నీలో వుందిగాని, గ్రంధాల్లో లేక పోవడం చేత. గ్రంధాలు నువ్వు ఏమి చెయ్యాలో చెప్పి వూరుకుంటాయి. అంతటితో వాటి బాధ్యత తీరిపోతుంది.

భక్తుడు : ఆత్మ మనస్సును దాటి వుందంటున్నారు. మళ్ళీ, ఆత్మను మనస్సుతోనే పట్టుకోవాలంటున్నారు. ఈ రెండింటికీ సమన్వయమెలా కుదురుతుంది?

భగవాన్ : అవును. ఆత్మను మనస్సుతోనే పట్టుకోవాలి. అయితే సంకల్పాలతో కూడిన మనస్సుతో కాదు. ఏకాగ్రమై, అంతర్ముఖమైన మనస్సుతో. ఇక్కడ గ్రహించవలసిన దేమిటంటే - ఒక వ్యక్తి తనకు అన్యంగావున్న వస్తువును పట్టుకోవడం వంటిది కాదు ఆత్మను పట్టుకోవడమంటే - లోచూపుతో మనస్సు తన జన్మస్థానమైన ఆత్మను కనుగొని అందులో లీనమైపోవడం.

భక్తుడు : ఆత్మానుభూతి పొందడానికి ఎంతకాలం పడుతుంది?

భగవాన్ : అది సాధకుని పరిపక్వత మీద ఆధారపడి వుంటుంది. తుపాకి మందు నిప్పురవ్వ తగలగానే పేలిపోతుంది - బొగ్గులు మండ డానికి కొంత వ్యవధి పడుతుంది.

భక్తుడు : మనోచలనం ఆపడానికేదైనా సులభోపాయముందా?

భగవాన్ : ఉంది. నీ ఉచ్ఛ్వాస నిశ్వాసలను గమనిస్తూండు.

భక్తుడు : ధ్యానం చేసేటపుడు భ్రూమధ్యాన్ని దృష్టి నిలపాలా?

భగవాన్ : హృదయం మీద నిలపడం మంచిది. హృదయం ఎదురు రొమ్ముకు కుడివైపున వుంది. ఇది ఆధ్యాత్మిక హృదయం. ఎడమవైపున వున్నది భౌతిక హృదయం.

భక్తుడు : ఈ ఆధ్యాత్మిక హృదయం కుడివైపున వున్నట్టు ఏ గ్రంధంలో నైనా వున్నదా?

భగవాన్ : ఉన్నది. అన్నిటికీ మించి స్వానుభవం మీద చెబుతున్నాను. అది కూడా భావన వున్నంతవరకే. భావనాతీతస్థితిని చేరుకున్న తరవాత. సర్వవ్యాపకంగా. నిశ్చలంగా. పూర్ణంగా. తాను తానుగా అనుభవంలోనికి వస్తుంది.

భక్తుడు : బ్రహ్మవిష్ణుమహేశ్వరులు ప్రత్యక్షమై ఏదైనా వరం కోరుకోమ్మంటే మీరేమి కోరుకుంటారు?

భగవాన్ : మొట్టమొదట. వాళ్ళను "ఇన్ని వేషాలెందుకూ?" అని అడుగుతాను. ఆ

తరువాత "నాకు భిన్నంగా మరెప్పుడూ కనపడకండి" అని వారిస్తాను.

భక్తుడు : తెగని ఆలోచనల నరికట్టడమెలాగ?

భగవాన్ : ఆలోచించేవాడిని పట్టుకొని వాడి రూపు మాపేయి. ఇక ఆలోచనలు ఏవీ వుండవు.

* * *

భగవాన్ అనేది ఎంతసేపూ "నేను, నేను" అంటున్నారే, ఆ "నేను" ఎవరో తెలుసుకోండి. ఆ "నేను" ను తెలుసుకోకుండా యితర మన్నిటినీ - చివరికి భగవంతుడిని కూడా - తెలుసుకోవడానికి ప్రయత్నించడం అవివేకం. అదెలాగుంటుందంటే "బండిని ముందుంచి గుర్రాన్ని వెనకాల కట్టినట్టు వుంటుంది" అని.

నిజమే. తానెవరో తాను తెలిసి కోకుండా ఎన్ని తెలుసుకుని ఏం లాభం? తన్ను దా తెలుసుకుంటే యిక తెలుసుకోవలసినదేముంటుంది!

మనస్సు మదపుటేనుగు. దానికి "నేనెవరిని?" అనే ప్రశ్న అంకుశం. ఈ ప్రశ్ననే కావ్యకంఠ గణపతిమునీంద్రులు "బ్రహ్మాస్త్ర" మని పేర్కొన్నారు.

సమస్త దుఃఖాలకూ, అనర్థాలకూ, తాపత్రయాలకూ, అశాంతికీ యీ "నేనే" కారణం. అందుచేత యీ దోషిని బోనెక్కించి వారెవరో విచారించాలి.

"నేను" బయలుదేరగానే సమస్త జంఝాటం తయారవుతోంది. మళ్ళీ యీ "నేను" గాఢనిద్రలో అణిగిపోగానే ఆ జంఝాటమంతా మాయవవుతోంది.

"మిథ్యానేను" అనే ఒంటిస్తంభం మీద "అశాంతినిలయం" అనే మేడ కట్టబడివుంది. ఈ స్తంభాన్ని పడగొడితే ఆ మేడ కుప్పకూలి పోతుంది. అనగా."మిథ్యానేను" ప్రశాంతవారాశి అయిన "నేను" లో అనగా, సచ్చిదానందమయమైన ఆత్మలో మేలుకోవడం జరుగుతుంది.

ఇక్కడ "మేలుకోవడ" మనగా, మనకింకా ప్రత్యేక వ్యక్తిత్వముంటుందని కాదు. ఆత్మలోనే లీనమై ఆత్మగానే మిగిలిపోతాం. సముద్రంలోనికి ప్రవహించిన నది తన నామరూపాలని పోగొట్టుకుని సముద్రమే అయిపోయినట్టు.

"జడమైన దేహం నేను" అని అనదు. చైతన్యమయమైన ఆత్మ "నేనీ దేహాన్ని మాత్రమే" అని అనడంలేదు. ఈ రెండింటికీ మధ్య "నేను" అంటూ తలెత్తుతూ వున్న యీ "నేను" గారెవరో విచారించాలి." అన్నారు శ్రీరమణభగవాన్.

"సూర్యుడు ప్రకాశిస్తున్నాడు. మేఘం అడ్డుగావుంది. ఆ మేఘం తొలగిపోతే సూర్యుడు ప్రత్యక్షమవుతాడు.

"అలాగే ఆత్మ సర్వదా, సర్వత్రా ప్రకాశిస్తూనేవుంది. ఆ ఆత్మను కప్పిన అజ్ఞానాన్ని తొలగించుకోవడమే మనం చెయ్యవలసిన పని.

"అయితే, యీ అజ్ఞానాన్ని తొలగించుకోవడమెలాగ?

"ఈ అజ్ఞానం ఎవరికి?' అని ప్రశ్నించుకోవాలి.

"నాకు.' అని జవాబు వస్తుంది.

"అప్పుడు 'నేనెవరిని? ఈ 'నేను' అనే భావన ఎక్కడనుంచి పుట్టుకొస్తోంది?' అని లోదృష్టితో అన్వేషించాలి. అప్పుడా అన్వేషించే 'నేను' (ఆత్మలో) లో అదృశ్యమయిపోతుంది"

ఇదీ, క్లుప్తంగా, శ్రీరమణభగవాన్ బోధామృతం.

ఈ సూటిమార్గాన్ని వదిలిపెట్టి శాస్త్రారణ్యంలో పడిపోతే, తిరిగి తిరిగి ఎక్కడ తేలతామో, ఎన్ని జన్మలకు తేలతామో!

"చదివి చదివి చదివి చావంగనేటికి?

చావులేని చదువు చదువంగవలయు" అన్నాడు వేమన.

ఇప్పుడు భగవాన్ చెప్పినది చావులేని చదువు.

"నేనెవరిని?" అనేది మహామంత్రం. జన్మసాఫల్యమంత్రం. జననమరణ ఖేదక్లేశవిచ్ఛేదమంత్రం.

68

ఒక రాజాస్థానంలో పండితుడు రాజుగారితో సందర్భవశాన "శుకమహర్షి

పరీక్షిత్ మహారాజుకి భాగవతం చదివి వినిపించి ఏడు రోజుల్లో ఆ మహారాజుని ముక్తుడిని గావించాడు" అని చెప్పారు. వెంటనే రాజుగారు "మీరూ నాకు భాగవతం చదివి వినిపించి ఏడురోజుల్లో నన్నుకూడా ముక్తుడిని గావించాలి" అన్నారు. పండితుడు సరేనన్నాడు.

రోజూ భాగవత కాలక్షేపం జరుగుతోంది. రాజుగారు వింటున్నారు

ఆరవరోజు పఠనంకూడా పూర్తయింది. రాజుగారిలో ఏమీ మార్పు వచ్చినట్లు కనబడలేదు. ఇంకొక్క రోజు మాత్రమే బాకీ వుంది. ఆ ఒక్క రోజులోన పండితుడెలా ముక్తుడిని చెయ్యగలడూ, రాజుగారెలా ముక్తులవ్వగలరూ! పండితుడి గొంతులో పచ్చివెలక్కాయపడ్డది. ఇంటికి వెళ్ళి తలకాయ పట్టుకుని కూర్చున్నాడు.

ఆ పండితుడికొక కూతురు వుంది. తండ్రి దిగులుకి కారణమడిగి తెలుసుకుంది. తెలుసుకుని "మీరేమీ బాధపడకండి నాన్నాగారూ! మీ సమస్యను నేను పరిష్కరిస్తాను. అయితే మీరొక పని చెయ్యాలి. రాజ గారి దగ్గరకు వెళ్ళి చెప్పండి - ఒక షరతు మీద రేపు నేనక్కడికి వచ్చి వారిని ముక్తుడిని గావిస్తానని. ఆ షరతు ఏమిటంటే "రాజుగారూ, మీరు" నేను చెప్పినట్టు వినాలి" అన్నదా అమ్మాయి.

కూతురి కుశాగ్రబుద్ధిలో నమ్మకమున్న పండితుడు రాజుగారి దగ్గరకు వెళ్ళి విషయం చెప్పారు. రాజుగారు ఒప్పుకున్నారు.

మరునాడు, అనగా, ఏడవరోజున, తండ్రిని వెంటబెట్టుకుని రాజా స్థానంలోనికి వచ్చింది ఆ పిల్ల. రాజుగారికి నమస్కరించి"నా షరతుకు అంగీ కరించారుకదా?" అన్నది. "అంగీకరించా" నన్నారు రాజుగారు.

ఆ తరవాత మరి ఆలస్యం చెయ్యలేదు ఆ అమ్మాయి. రాజుగారి నొకస్తంభం దగ్గర నిలబడమంది. అలాగే నిలబడ్డారాయన. గట్టితాళ్ళు తెమ్మని ఆజ్ఞాపించింది సేవకులుని. వాళ్ళు తెచ్చారు. అందులో ఒక తాడుతో రాజుగారిని ఆ స్తంభానికి కట్టెయ్యమంది. సేవకులు నిర్ఘాంతపోయి కదలకుండా వుండిపోయారు. అప్పుడు తనే కట్టేసింది గట్టిగా. తరవాత తండ్రినొక స్తంభం దగ్గర నుంచో

మంది. అలాగే నుంచున్నాడాయన. ఏమి ముప్పు రానున్నదో అని బెదిరి పోతూ. ఆయన్ని కూడా కట్టేయమంది సేవకులతో. ఈసారి వాళ్ళు సందేహించ కుండా బిగించి కట్టేశారా పండితుడిని.

అప్పుడా గడుసుపిల్ల తండ్రి దగ్గరకు వెళ్ళి రాజుగారిని విడిపించమంది. "నేను బంధింపబడివుండగా అదెలా సాధ్యం?" అన్నారాయన. రాజు దగ్గరకు వెళ్ళి తన తండ్రిని విడిపించమంది. రాజుగారుకూడా పండితుల వారన్నట్టే అన్నారు. అప్పుడామె "నేను విడిపించగలనా" అని అడిగింది రాజుని. "విడిపించగలవు. నువ్వు బంధింపబడిలేవుగా" అన్నారు రాజుగారు. అప్పుడా పిల్ల యిద్దరి కట్లని విప్పి "ఒక బద్ధుడు మరొక బద్ధుడిని ముక్తుడిని చెయ్యలేడు. శుకమహర్షి ముక్తుడు కాబట్టి. బద్ధుడైయున్న పరీక్షిత్ మహారాజుని ముక్తుడిని గావించారు. కాబట్టి. బద్ధులైవున్న వారు ముక్తుడుని శరణం పొందాలేగాని. మరొక బద్ధుడుని కాదు" అని చెప్పింది. రాజుగారు ఆ చిన్నారి చూపిన తెలివికీ. చెప్పిన యదార్థానికీ మెచ్చుకుని ఘనంగా బహూకరించి పంపారు.

దీనినిబట్టి పండితులు తోవ చూపించగలరేగాని. ముక్తిని ప్రసాదించలేరు అని తేలుతోంది. అది శ్రీరమణభగవాన్ మహాత్ములకే సాధ్యం.

స్వర్ణోత్సవము

1-9-1946. శ్రీరమణభగవాన్ తిరువన్నామలై వచ్చి యాభై సంవత్సరాలయింది.

వెంకటరామన్‌గా వచ్చారు. బ్రాహ్మణస్వామిగా విరాజిల్లారు భగవాన్ శ్రీరమణమహర్షిగా వినుతికెక్కారు.

వారి కరుణాకిరణ ప్రసారంచే భక్తుల పాపపంకిలం ప్రక్షాళన మయింది. అహంకార దురహంకారాలు నాశనమయ్యాయి. జ్ఞాననేత్రాలు తెరుచుకున్నాయి.

కని పెంచిన తల్లిదండ్రుల రుణమేనా తీర్చుకోవచ్చుగాని. వారి రుణాన్ని

తీర్చుకోవడం ఎవరి శక్యం?

ఇప్పుడు భక్తులకొక చిన్న అవకాశం దొరికింది.

భగవాన్ ఆ పుణ్యభూమిలో అడుగుపెట్టి యాభై సంవత్సరాలు పూర్తయిన తరుణాన్ని పురస్కరించుకుని ఉదాత్తభక్తిగా స్వర్ణోత్సవాన్ని జరపడానికి నిశ్చయించుకున్నారు.

ఆకాశమంత పందిరి వేశారు. దానికి చాందినీ కుట్టారు. చుట్టూ మామిడాకులు తోరణాలు కట్టారు. పూలమాలలతో నలంకరించారు జూబిలీహాల్ అని పేరు పెట్టారు.

తెల్లారగానే కార్యక్రమం ప్రారంభమయింది. భగవాన్‌ని మంగళవాయిద్యాలతో ఆహ్వానించి ప్రత్యేకంగా అలంకరించిన వేదికమీద ఆసీనులను గావించారు.

విశ్వాన్ని పాలించే విశ్వేశ్వరుడు కౌపీనధారియై దివినుండి భువికి రాగా. వారికీ హడావిడి నచ్చుతుందా! అయినా. వారు కిమ్మనడానికి వీల్లేదు. భగవాన్ భక్తవత్సలుడుకదా!

పుణ్యస్త్రీలు పాటలుపాడి. హారతులిచ్చి భగవాన్‌కు క్షీరకలశాన్ని సమర్పించారు. ఆ తరవాత వేదపఠనం. భజనలు. స్తుతులు. కీర్తనలు. పద్యాలు. గీతాలు. వ్యాసాలు. ఉపన్యాసాలు. పాటకచేరీలు. ప్రసాదాలు. సన్మానపత్రసమర్పణ. పూర్ణకుంభసమర్పణ - ఒకటేమిటి. ఆ రోజంతా ఒకటే కోలాహలం. భక్తుల పారవశ్యం. ఉత్సాహం వర్ణనాతీతం.

కార్యక్రమం ముగిసింది. భక్తులకేదో కాస్త తృప్తి కలిగింది.

అవతార విరమణ

ఒకనాటి సాయంత్రం భగవాన్ దేహం దేదీప్యమానంగా వెలిగిపోతోంది. వారి భక్తులు చూశారు. విస్మయం చెందారు. వారిలో వారు

గుసగుసలాడుకున్నారేగాని కారణమేమిటో తెలుసుకోలేకపోయారు.

తెల్లారేసరికి తెలిసిపోయింది. క్రిందటిరాత్రి ఎచ్చెమ్మాళ్ పరమపదించింది.

భగవాన్ దర్శనం చేసుకున్న క్షణాన్నే వారి కర్పణమయిపోయి, సుమారు నలభై సంవత్సరాలు ఏరోజూ తప్పక భిక్ష తెచ్చి, వారి సేవ చేసిన ఎచ్చెమ్మాళ్ భగవాన్‌లో లీనమైపోయింది.

అదే భగవాన్‌లో ప్రస్ఫుటమైన తేజస్సుకు గారణం.

"పాపం, ఎచ్చెమ్మాళ్ పోయిందని భక్తులు అన్నపుడు, భగవాన్ "నాకూ, పోవాలనేవుంది. కాని యింకా సమయంరాలే" దన్నారు.

ఆ మాట వినగానే భక్తులు కంపించిపోయారు. భగవాన్‌కు తమ నిర్యాణాన్ని సంకల్పించుకున్నారేమోనని అనుమానపడ్డారు.

వారి అనుమానం నిజమయ్యేటట్టుంది. భగవాన్‌కు ఎడమ భుజం దిగువున ఒక చిన్న గడ్డ బయలుదేరింది. ఆయుర్వేద వైద్యులు ఏవో కట్లు కట్టినా పోలేదు. ఇంగ్లీషు డాక్టర్లు ఆపరేషన్ చేయాలన్నారు. భగవాన్ "అదెలా వచ్చిందో అలాగే పోతుంది లెండి. దానిజోలికి మన మెందుకు పోవడం?" అన్నారు. అయినా వూరుకోలేదు డాక్టర్లు ఆపరేషన్ చేశారు. తగ్గినట్టుగానే తగ్గి మళ్ళీ సెల వేసుకొచ్చింది. అప్పుడు అది సార్కోమా అనే మొండి కేన్సర్ వ్యాధి అని తేల్చారు ఆంగ్లేయభిషగ్వరులు. దానితో కొంతమంది కొమ్ములు తిరిగిన డాక్టర్లు వచ్చి, మళ్ళీ ఆపరేషన్ చేశారు. ఫలితంలేదు. రేడియం సూదులు గుచ్చారు. లాభం లేకపోయింది. తిరిగి ఆపరేషన్ చేశారు. కట్టు విప్పారు. పుండుకి ఎండ తగలాలన్నారు. రక్తం కారుతూనే వుంది. భక్తులు ఏడవడం మొదలు పెట్టారు.

"ఆత్మానుభూతితో ధృవీకరించియున్న జ్ఞానికి కత్తితో కోసినా, ఆ బాధ స్వప్నతుల్యం మాత్రమే" అని భగవాన్ చెప్పారు ఒకప్పుడు. ఇప్పుడు డాక్టర్లు పెడుతూన్న చిత్రహింసకి వారు బాధ పడుతున్నారో, లేక, అది వారికి స్వప్నతుల్యంగానే వుందో అదంతా వారికే తెలియాలిగాని, చూసే భక్తులు మాత్రం కృంగిపోతున్నారు.

"భగవాన్, డాక్టర్లు యిక యీ వ్యాధిని నయం చేయలేరు. మామీద కరుణతో

మీరే సంకల్పించుకుని నయం చేసుకోవాలి" అని ప్రార్థించారు భక్తులు.

"సంకల్పించుకోవడానికి మనస్సు కావాలికాదా. ఆ మనస్సు ఏనాడో చచ్చింది. ఇప్పుడిక నేనేం చెయ్యగలను!" అన్నారు భగవాన్.

మరొకనాడు మరికొందరు భక్తులు అదే ప్రశ్న వేసేసరికి నేను రమ్మన్నానా పొమ్మనేందుకు! నా కొక శరీరముందనీ, దానికొకచెయ్యి వుందనీ, ఆ చేతిమీద ఒక గడ్డ లేచిందనీ మీరంటూంటే వింటున్నానుగాని, నాకదేమీ తోచడం లేదు" అన్నారు.

మరొక రోజున 'మీరందరూ వచ్చినట్లే అదీ వచ్చింది. ఈ డాక్టర్లందరూ దానికన్ని సేవలు చేసి గౌరవిస్తూంటే దానికి పోవాలని బుద్ధి ఎందుకు పుడుతుంది!" అన్నారు.

భోజనం మానేసి కొన్నాళ్ళయింది. బాగా నీరసించిపోయాడు. శరీరం ఒణకడం మొదలుపెట్టింది. భక్తులది చూసి బాధ పడుతూంటే "తాండవనృత్యమండీ. తాండవనృత్యం" అన్నారు.

ఒకనాడు కాస్త పాయసం తాగగానే వాంతి చేసుకున్నారు. "అయ్యో" యీ మాత్రం కూడా ఇమడలేదే!" అన్నారు భక్తులు.

"నాకు పాయసం యిమడలేదని బాధ పడుతున్నారు. నేను యాభై సంవత్సరాలు నూరిపోసింది మీకు యిమడలేదని నేను బాధపడుతున్నాను. ఏమి చేస్తాం! తలవ్రాత!" అన్నారు భగవాన్.

నిజమే. వారు చెప్పి చెప్పి, మళ్ళీ మళ్ళీ చెప్పిన విషయం ఒకటే. "మనం యీ శరీరాలం కాదు - మన నిజ స్వరూపం అఖండమైన ఆత్మ" అని కదా!

* * *

14-4-1950. ఆ రాక్షసి పుండు భగవాన్ దేహాన్ని దాదాపు కబళించేసింది. కాని, చిత్రమేమిటంటే, దేహమెంత శుష్కించి పోయిందో వారి వదనమండలమంత వికసించింది.

ఒక పార్సీ భక్తుడు భగవాన్ సమక్షంలో, తమ మత గ్రంథం అవేస్తా నుంచి

ఉదయగీతం చదవడం ప్రారంభించాడు. భగవాన్‌కా భాష ఎలా అర్థమయిందో! సూర్యుడు అస్తమిస్తూండగా ఉదయగీతమేమిటి?" అన్నారు.

అది ఉదయమే. అయినా, భగవాన్ అలా అనగానే వారి అస్తమయాన్ని సూచించినట్లు భక్తుల కర్థమైపోయింది. రానున్న ఘడియల నూహించుకుంటూ బాధపడిపోతున్నారు. "వారు అస్తమిస్తే మనం అనాథలమయిపోమా. శ్రీరమణాశ్రమం దేవుడులేని ఆలయం అయిపోదా. తిరువన్నామలై రాముడులేని అయోధ్యగా మారిపోదా - ఎలా, ఏం చెయ్యాలి"- యీ ఆలోచనలతో సతమతమయిపోతున్నారు. కర్తవ్యతావిమూఢులయిపోయి ఆ రమణ దేవుడినే మనస్సులో ప్రార్థించుకుంటున్నారు.

మధ్యాహ్నమయింది. భగవాన్ పరిచారకులను పిలిచి "ఇంగ్లీషులో 'థాంక్స్' అంటారు. మన భాషలో దానికి సరియైన పదం లేదు 'సంతోషం' అని అనవచ్చునేమో!" అంటూ వారిసేవల నభినందించారు. "భగవాన్ సేవచేసే మహద్భాగ్యం నేటితో సరికాబోలు" ననుకుంటూ గుడ్లనీరుకుక్కుకున్నారు పరిచారకులు.

సాయంత్రమయింది. ఆశ్రమవాసులు సరేసరి. భగవాన్ అవసానదశను గురించి విని దేశమంతటినుంచీ, ప్రపంచమంతటి నుంచీ వచ్చి అక్కడ మకాం పెట్టిన భక్తులు సరేసరి. తిరువన్నామలై అంతాకూడా అక్కడే వుంది. పోలీస్ వారికీ, వాలంటీర్లకూ ఆ జన సమూహాన్ని అదుపు చెయ్యటం సాధ్యం కాకపోతోంది. వాళ్ళ కన్నీరు, హాహాకారాలు. చివరికి కొంతమంది మూర్ఛలు అంతా అయోమయంగా తయారయింది. ప్రళయ మాసన్నమవుతూన్నట్టే తోస్తోంది ఎవరికి వారికి.

రాత్రి 8 గంటలయింది. భగవాన్‌కు ఊపిరి పీల్చుకోవడం కష్టమవుతోంది.

పొంగిపొరలి వస్తూన్న దుఃఖాన్ని హాలాహలం మింగినట్లు మింగుతూ, కొంతమంది భక్తులు "అరుణాచలశివ అరుణాచలశివ అరుణాచలశివ అరుణాచలా" పాడడం మొదలు పెట్టారు.

8 గంటల 47 నిమిషాలయింది. ఏ ఘడియ వస్తుందని భక్తులు

అల్లాడిపోతున్నారో ఆ విషమఘడియ రానేవచ్చింది.

శ్రీరమణభగవాన్ అస్తమించారు.

ఆ క్షణంలోనే ఒక తేజోపుంజం వినీలాకాశంలో వింతకాంతులను విరజిమ్ముతూ ఈశాన్యదిశగా వెళ్ళిపోయింది.

* * *

"ఎందరెందరు మహాత్ములో, ఎంతెంతటివారో పరమపదించారు. ఎవరినుండీ ఉద్భవించని తేజస్సు శ్రీరమణభగవాన్ నుండి ఉత్పన్నమై కాంతులు వెదజల్లుతూ ఈశాన్యంగా వెళ్లిపోయిందని భక్తిపారవశ్యంతో రమణభక్తులు వ్రాశారు" అనే సందేహం కొంతమందికి పుట్టుకురావచ్చు కాని. అటువంటి సంశయానికి తావులేదిక్కడ. వారు నిర్యాణమైన క్షణంలోనే ఆ కాంతిపుంజాన్ని అశేషజనం, అనేక వూళ్ళవారు చూశారు. ఆ మరునాటి దినపత్రికలు పతాకశీర్షికలతో యీ అద్భుతాన్ని ప్రకటించాయి.

* * *

రమణజ్యోతి ఈశాన్యదిశగా పయనించడం, రమణుడు శివకుమారుడయిన కుమారస్వామి అనీ, అక్కడి కైలాసమే వారి స్వస్థానమనీ రుజువు చెయ్యడమా?

అద్వితీయుడూ, అనంతుడూ, సర్వవ్యాపీ అయిన పరమాత్మకు వేరే ఒక ప్రత్యేకస్థానమనేది వుంటుందా? భూనభోంతరాళాలు నిండి యున్నాడని చెపుతారే! సర్వాంతర్యామిగా సమస్త జీవులలోనూ వున్నాడంటారే!

అంతులేకుండా యిటువంటి సందేహాలు పుట్టుకొస్తూనే ఉంటాయి.

అందుకే అన్నారు శ్రీరమణభగవాన్ :

"నువ్వెవరివో నీకు తెలియదు. దేవుడినీ, వాడి ఉనికినీ, వాడి సృష్టి రహస్యాలనీ తెలుసుకోవాలని చూస్తావు. ఇది హాస్యాస్పదం గాక మరేమి?

"తనను తాను తెలుసుకోవడమే జీవితపరమావధి.

ఈ వాస్తవాన్ని విస్మరించడమే మాయ" అని

* * *

భగవాన్ జన్మించినప్పుడు ఒక అంధురాలికి మాత్రమే వారి జ్యోతి దర్శనం లభించింది. ఇప్పుడు దేహాన్ని చాలించి వెళ్ళిపోయినపుడు కళ్ళూ, అదృష్టం వున్న వాళ్ళందరికీ తమ జ్యోతి దర్శనాన్ని ప్రసాదించారు.

*   *   *

శోకసముద్రంలో మునిగిపోయి శోకగీతాలు, భక్తిగీతాలు, రమణ గీతాలు పాడారు భక్తులు. శూన్యంలో విహరించారు.

ఎలాగో ఆ కాళరాత్రి గడిచింది. తెల్లారింది.

"మీ కెందుకు దిగులు? మీ రమణుడు దేహాన్ని విడిచినంత మాత్రాన వారు అక్కడ లేనట్టేనా? వారు లేనిదెక్కడ? ఈ తేజస్సు ఎవరిది? మీ రమణభగవాన్‌ది కాక మరెవరిది?" అని ఓదారుస్తూ సూర్య భగవానుడు ఉదయించాడు.

వేద ఘోషతో, పంచామృతాభిషేకంతో చందనకర్పూరాది సుగంధ ద్రవ్యాలతో, పువ్వులతో, విభూతితో శ్రీరమణభగవాన్ దివ్య దేహాన్ని సమాధిచేసి సాష్టాంగపడ్డారు భక్తులు. ఆ సమాధిమీద ఒక లింగాన్ని ప్రతిష్ఠించి శ్రీరమణేశ్వర స్వామి అని నామకరణం చేశారు.

కథ కంచికి వెళ్ళలేదు. ఇది అలా వెళ్లిపోయే కథ కాదు. వారి దేహగతమైన కథ మాత్రమే ముగిసింది. వారి కథ ఆచంద్ర తారార్కం నిలిచిపోతుంది- తరతరాలవారి నుద్ధరించడానికి. వారికి మోక్షన్ననుగ్రహించడానికి.

అదృశ్యంగా శ్రీరమణభగవాన్ అనంతమంతా వ్యాపించి వున్నారు. దేహధారులై రాముడూ, కృష్ణుడూ, యీనాడు లేనంత మాత్రాన వారి నారాధించే భక్తులకు వారి అనుగ్రహం తక్కువయిందా? అలాగే యిప్పుడు రమణదేవుడుకూడా దేహాన్ని విసర్జించినంతమాత్రాన వారి నారాధించే భక్తులకు వారి అనుగ్రహం తక్కువవుతుందా?

శ్రీరమణానుగ్రహం నామీద వుంది. అందుకే యీ కథ రాశాను. మీమీద కూడా వారి అనుగ్రహం ప్రసరించింది. అందుకే చదివారు యీ రమణదేవుని కథ - వినీలాకాశంలో వింతకాంతి గాథ.

*

అభినందన

బహుళప్రచారం, బహుళ జనాదరణా పొందిన వినీలాకాశంలో వింతకాంతి....

ఒక కథ లాగే ఉంటుంది గాని - కథ కాదు, ఒక నవలలాగే ఉంటుంది గాని-నవలకాదు. ఒక చరిత్రలాగే ఉంటుంది గాని - చరిత్రకాదు.

మరి ఇదేమిటి?

రామాయణ, భారత, భాగవతాదులవలె ఒక పారాయణ గ్రంథం : ముక్తికి బంగారు బాటవేసిన గ్రంథరాజం.

పరిశీలించి ఈయదార్థాన్ని

మీరేగమనింతురుగాక!

రచయిత శ్రీఅత్యం సూర్యంగారిని మనసారా అభినందిస్తున్నాను.

నాన్నగారు

(భూపతిరాజు వెంకటలక్ష్మి నరసింహరాజు)

శ్రీరమణ క్షేత్రం, జిన్నూరు.

Printed at RATNA PRINTING WORKS, PALAKOL. Ph: 2946